
# మార్క్స్ ఎంగెల్స్





# సమకాలికుల స్మృతులు

సకల దేశాల కార్మికులారా, ఏకంకండి!

# మార్క్స్ ఎంగెల్స్

## సమకాలికుల స్మృతులు

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో 1980

అనువాదం: రాచమల్లు రామచంద్రారెడ్డి

ప్రథమ ముద్రణ 1972

రెండవ ముద్రణ 1980

ВОСПОМИНАНИЯ
о МАРКСЕ и ЭНГЕЛЬСЕ

***на языке телугу***

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

С6 $\frac{10301—204}{014(01)—80}$ 699—80 0103010000

# విషయసూచిక

ఫ్రెడరిక్ ఎంగెల్సు. కార్ల్ మార్క్సు సమాధివద్ద ఉపన్యాసం . . . . 5
వి. ఐ. లెనిన్. కార్ల్ మార్క్సు . . . . . . . . . . . . . 8
వి. ఐ. లెనిన్. ఫ్రెడరిక్ ఎంగెల్సు . . . . . . . . . . . . 14
పాల్ లాఫార్గ్. మార్క్సు గురించిన స్మృతులు . . . . . . . . 24
పాల్ లాఫార్గ్. ఎంగెల్సు గురించిన స్మృతులు . . . . . . . . 45
విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్. మార్క్సు గురించిన స్మృతులు . . . . . 54
1. మార్క్సుతో మొదటి పరిచయం . . . . . . . . . 55
2. మొదటి సంభాషణ . . . . . . . . . . . . 56
3. విప్లవకారుల గురువూ, విద్యాదాతా అయిన మార్క్సు . . . . 58
4. మార్క్సు శైలి . . . . . . . . . . . . . 64
5. రాజకీయవాదిగా, శాస్త్రజ్ఞుడుగా, మనిషిగా మార్క్సు . . . . 66
6. పనిచేసేటప్పుడు మార్క్సు . . . . . . . . . . 71
7. డీన్ స్ట్రీట్‌లోని యింటిలో . . . . . . . . . . 73
8. ప్రవాసుల పన్నాగాలు . . . . . . . . . . . 74
9. మార్క్సు యింట్లో సమావేశాలు . . . . . . . . 75
10. మార్క్సూ, పిల్లలూ . . . . . . . . . . . 79
11. లెన్‌హెన్ . . . . . . . . . . . . . . 83
12. మార్క్సుతో షికార్లు . . . . . . . . . . . 83
13. సంకటపు పావుగంట . . . . . . . . . . . 88
14. మార్క్సూ, చదరంగమూ . . . . . . . . . . 92
15. బీదరికమూ, కష్టాలూ . . . . . . . . . . 94
16. మార్క్సు వ్యాధీ, మరణమూ . . . . . . . . . 94
17. మార్క్సు సమాధి . . . . . . . . . . . . 100
18. పాత స్థలాల అన్వేషణ . . . . . . . . . . 103
విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్. ఎంగెల్సు గురించిన స్మృతులు . . . . 109
ఫ్రీడ్రిఖ్ లెస్నెర్. 1848కి ముందూ, తరువాతా . . . . . . 122
ఫ్రీడ్రిఖ్ లెస్నెర్. ఫ్రెడరిక్ ఎంగెల్సు గురించి ఒక కార్మికుని స్మృతులు . 140

ఫ్రీడ్రిఖ్ ఆడోల్ఫ్ సోర్గె. మార్క్సును గురించి . . . . . . 150
జి. ఎ. లోపాతిన్. యన్.పి. సినేల్నికొవ్‌కు రాసిన ఉత్తరంలో భాగం . . . 154
జెన్నీ మార్క్సు. ఒక ఘటనామయమైన జీవితం గురించి చిన్న రేఖాచిత్రం . 159
యోసెఫ్ వేడిమేయర్‌కు జెన్నీ మార్క్సు . . . . . . . . . 176
లుయీసా వేడిమేయర్‌కు జెన్నీ మార్క్సు . . . . . . . . . 181
ఎలినోర మార్క్సు-ఎవెలింగ్. కార్ల్ మార్క్సు . . . . . . 188
ఎలినోర మార్క్సు-ఎవెలింగ్. ఫ్రెడెరిక్ ఎంగెల్సు . . . . . 196
ఎడ్గార్ లోంగె. కార్ల్ మార్క్సు కుటుంబ జీవితం . . . . . . 208
లండన్‌లో ప్రవాసుల బీదరికం . . . . . . . . . 211
పనితో, పోరాటంతో నిండిన అద్భుత జీవితం . . . . . . 213
"ఒప్పుదలలు" . . . . . . . . . . . . . . 217
ఫ్రాన్త్సిస్కా కూగెల్మన్. మార్క్సు మహనీయ వ్యక్తిత్వంలోని స్వల్ప లక్షణాలు . . . . . . . . . . . . . 219
యన్. మొరోజొవ్. కార్ల్ మార్క్సును కలుసుకోవడం . . . . . 235
ఎడ్వర్డ్ ఎవెలింగ్. యింటిలో ఎంగెల్సు . . . . . . . . 239
ఆర్. యమ్. క్రవ్చిన్స్కయా. స్మృతులు . . . . . . . . . 249

# ఫ్రెడరిక్ ఎంగెల్సు

## కార్ల్ మార్క్సు సమాధివద్ద ఉపన్యాసం

మార్చి 14వ తేదీనాడు, సాయంత్రం రెండూముప్పావు గంటలకు, యీనాటి అత్యంత గొప్ప ఆలోచనాపరుడు ఆలోచించడం మానివేశాడు. ఆయన్ను ఒంటరిగా వదలిపెట్టి రెండు నిముషాలు కూడా సరిగా కాలేదు, మేము తిరిగివచ్చి చూసేటప్పటికి ఆయన కుర్చీలో ప్రశాంతంగా నిద్రపోతున్నాడు — కానీ శాశ్వత నిద్ర.

యీ వ్యక్తి మరణంతో యూరప్, అమెరికాల సమరశీల కార్మికవర్గమూ, చారిత్రక శాస్త్రమూ అగణితమైన నష్టం పొందినాయి. ఈ మహా పురుషుని అస్తమయంవల్ల యేర్పడిన వెలితి త్వరలోనే మనకు అనుభూత మౌతుంది.

డార్విన్* యెలా సజీవ ప్రకృతియొక్క అభివృద్ధి నియమాన్ని ఆవిష్కరించినాడో, అలాగే మార్క్సు మానవ చరిత్రయొక్క అభివృద్ధి నియమాన్ని ఆవిష్కరించినాడు. దానిమీద సిద్ధాంతాలు పెరిగినందువల్ల యింతవరకు మరుగున పడిన ఆ స్పష్టమైన వాస్తవం యేమిటంటే — మానవజాతి రాజకీయాలూ, శాస్త్రవిజ్ఞానమూ, కళలూ, మతమూ, వగైరాలు అలవరచుకునేముందు, మొట్టమొదట తిండితీర్థాలూ, వసతీ, దుస్తులూ చూసుకోవాలి; కనుక తక్షణ భౌతిక జీవనాధారాల ఉత్పత్తీ, తత్ఫలితంగా నిర్దిష్ట ప్రజలు లేక ఒక నిర్దిష్ట యుగం సాధించిన ఆర్థికాభివృద్ధి స్థాయీ అనేవాటి పునాదిమీద ఆ ప్రజల రాజ్య సంస్థలూ, న్యాయశాస్త్ర భావాలూ, కళలూ, మతానికి సంబంధించిన భావాలు కూడా అభివృద్ధి చేయబడుతున్నాయి; కనుక ఆ పునాది విషయాల దృష్ట్యా వీటిని వివరించాలి గానీ, యింతకు మునుపు జరిగినట్లు వీటి దృష్ట్యా వాటిని వివరించకూడదు.

---

* డార్విన్, చార్లెస్ రోబర్ట్ (1809–1882) — ప్రఖ్యాత ఇంగ్లీషు శాస్త్రజ్ఞుడు. — సం.

కానీ అంతే కాదు. యీనాటి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్నీ, ఆ ఉత్పత్తి విధానం సృష్టించిన బూర్జువా సమాజాన్నీ పాలించే నియమాన్ని కూడా మార్క్స్ ఆవిష్కరించినాడు. దేన్ని పరిష్కరించడానికి బూర్జువా ఆర్థికవేత్తలూ, సోషలిస్టు విమర్శకులూ యింతకుముందు చేసిన పరిశోధన లన్నీ చీకటిలో తడుములాటగా వుండినాయో, ఆ సమస్యమీద అదనపు విలువ ఆవిష్కరణ హఠాత్తుగా కాంతిని ప్రసరించింది.

అలాంటి ఆవిష్కరణలు రెండు ఒక జీవితకాలానికి సరిపడతాయి. అలాంటి ఆవిష్కరణ ఒక్కటైనా చేయగలిగినవాడు అదృష్టవంతుడు, కానీ మార్క్స్ పరిశోధన చేసిన ప్రతి రంగంలోనూ — మరి ఆయన చాలా రంగాలు పరిశోధన చేసినాడు, యేదీ పైపైన చేసినది కాదు — ప్రతి రంగంలోనూ, గణితశాస్త్ర రంగంలో కూడా, ఆయన స్వతంత్ర ఆవిష్కరణలు చేసినాడు.

శాస్త్రజ్ఞుడుగా ఆయన అలాంటివాడు. కానీ యిది ఆయన వ్యక్తిత్వంలో సగం కూడా కాదు. మార్క్స్ అభిప్రాయంలో శాస్త్రవిజ్ఞానం అనేది చారిత్రకంగా క్రియాశీలమైన విప్లవశక్తి. యేదైనా ఒక శాస్త్ర సిద్ధాంత రంగంలో జరిగిన ఒక నూతన ఆవిష్కరణకు — ఆచరణలో దాని ప్రయోగాన్ని ఊహించడం బహుశా యింకా పూర్తిగా అసాధ్యమైనట్టిదానికి — ఆయన యెంతో సంతోషించినప్పటికీ, పరిశ్రమలలోనూ, సాధారణ చారిత్రక అభివృద్ధిలోనూ తక్షణ విప్లవకర మార్పులు ఆ ఆవిష్కరణలో యిమిడివుండినప్పుడు, ఆయన మరొక విధమైన సంతోషం అనుభవించేవాడు. ఉదాహరణకు, విద్యుచ్ఛక్తి రంగంలో జరిగిన ఆవిష్కరణల అభివృద్ధినీ, యిటీవల మార్సెల్ డెప్రే* చేసిన ఆవిష్కరణలనూ ఆయన శ్రద్ధగా గమనించినాడు.

మార్క్స్ అన్నిటికీమించి విప్లవకారుడు. ఆయన నిజమైన జీవిత కర్తవ్యం పెట్టుబడిదారీ సమాజాన్నీ, అది సృష్టించిన రాజ్య సంస్థలనూ కూలదోయడంలో యేదో ఒక విధంగా తోడ్పడడమూ, యే ఆధునిక కార్మికవర్గాన్ని దాని సొంత స్థానాన్ని గురించీ, దాని అవసరాలను గురించీ చైతన్యవంతం చేయడంలో, దాని విమోచన నియమాలను గురించి చైతన్యవంతం చేయడంలో ఆయనే ప్రథముడుగా వుండినాడో ఆ ఆధునిక కార్మికవర్గంయొక్క విమోచనకు తోడ్పడడమూ. పోరాటం ఆయన ఊపిరి. చాలా కొద్దిమందికి సాధ్యమైన ఆవేశంతోనూ, పట్టుదలతోనూ, విజయంతోనూ ఆయన పోరాడినాడు. మొదటి "రైనిషె సైటుంగ్" (1842)లోనూ, పారిస్ "ఫోర్వేర్ట్స్" (1844)లోనూ, "దోయిచె-బ్రుస్సెలెర్ సైటుంగ్" (1847)లోనూ, "నోయె రైనిషె సైటుంగ్"

---

*డెప్రే, మార్సెల్ (1843–1918) — ఫ్రెంచి భౌతికశాస్త్రజ్ఞుడు, విద్యుచ్ఛక్తిని దూరానికి ప్రసారం చేసే విషయంలో అతను మొదటి ప్రయోగాలు చేసినాడు. — సం.

(1848–1849)లోనూ, "న్యూయార్క్ ట్రిబ్యూన్" (1852–1861)లోనూ,* వీటికి తోడు లెక్కలేనన్ని సమరశీల కరపత్రాలతోనూ ఆయన కృషి, పారిస్, బ్రస్సెల్స్, లండన్‌లలోని సంస్థలలో ఆయన కృషి, చివరన, అన్నిటికీ మకుటాయమానంగా, ఆ గొప్ప అంతర్జాతీయ కార్మిక సంఘం** నిర్మాణం – నిజానికి దాని స్థాపకుడు గర్వించదగిన విజయం యిది, ఆయన ఇంకా మరేదీ చేయకపోయినా.

ఈ కారణంగా మార్క్స్ తన కాలంలో అందరికంటె యెక్కువగా ద్వేషింపబడిన, నిందింపబడిన వ్యక్తి. ప్రభుత్వాలు – నియంతృత్వపువీ, రిపబ్లికన్‌వీ రెండూ – తమ భూభాగాలనుండి ఆయన్ను బహిష్కరించినాయి. బూర్జువాలు – మితవాదులైనా, అధిప్రజాతంత్రవాదులైనా – ఆయనమీద నిందలు గుప్పించడంలో ఒకరితో ఒకరు పోటీ పడినారు. యివన్నీ సాలెగూళ్లైనట్లు ఆయన తుడిచివేసి, నిర్లక్ష్యం చేసినాడు, మరీ తప్పనిసరి అయిన పరిస్థితిలో మాత్రమే వాటికి సమాధానం యిచ్చినాడు. మరి ఆయన సైబీరియా గనులనుండి కాలిఫోర్నియా దాకా, యూరప్ అమెరికాలలోని సకల భాగాలలోనూ వున్న లక్షోపలక్షల విప్లవ సహకార్మికులచేత ప్రేమింపబడి, పూజింపబడి, వాళ్లకు దుఃఖం కలిగిస్తూ మరణించినాడు. ఆయనకు చాలా మంది వ్యతిరేకులు వుండినప్పటికీ, వ్యక్తిగత శత్రువు ఒక్కడు కూడా లేడని చెప్పడానికి నేను సాహసిస్తున్నాను.

ఆయన పేరు చిరస్థాయిగా నిలుస్తుంది, ఆయన కృషి కూడా అంతే!

మార్చి 17, 1883

---

* "రైనిషె సైటుంగ్," "నోయె రైనిషె సైటుంగ్" అనే పత్రికలకు మార్క్స్ అప్పుడు సంపాదకుడుగా వుండినాడు. ఇక్కడ పేర్కొన్న ఇతర పత్రికలకు వ్యాసాలు రాసేవాడు లేదా వాటి ఎడిటింగ్‌లో చురుకైన పాత్ర వహించేవాడు. – సం.

** అంతర్జాతీయ కార్మిక సంఘం (మొదటి ఇంటర్నేషనల్) 1864లో మార్క్స్‌చే స్థాపించబడింది. అది 1872వరకూ వుండింది. శ్రామికవర్గ పార్టీకి అది బీజం. – సం.

## వి.ఐ. లెనిన్

# కార్ల్ మార్క్స్*

కార్ల్ మార్క్స్ 1818 మే 5న ట్రీయర్ (రైనిషె ప్రష్యా)లో పుట్టినాడు. ఆయన తండ్రి న్యాయవాది, పుట్టుకతో యూదుడు, 1824లో ప్రొటెస్టంట్ మతం స్వీకరించిన వాడు. డబ్బూ, సంస్కారమూ వున్న కుటుంబం అది, కానీ విప్లవకరమైంది కాదు. ట్రీయర్‌లో స్కూలు చదువు పూర్తిచేసిన తర్వాత మార్క్స్ విశ్వవిద్యాలయంలో ప్రవేశించినాడు, మొదట బోన్‌లోనూ, తరువాత బెర్లిన్‌లోనూ. విశ్వవిద్యాలయంలో ఆయన న్యాయశాస్త్రం అధ్యయనం చేసినాడు, అయితే ప్రధానంగా చరిత్రా, తత్వశాస్త్రమూ. ఆయన ఎపిక్యూరస్** సిద్ధాంతంమీద థీసీసు సమర్పించి, 1841లో విశ్వవిద్యాలయ చదువు పూర్తిచేసినాడు. తన అభిప్రాయాలలో మార్క్స్ ఆనాడు హేగెలియన్ భావవాది. బెర్లిన్‌లో ఆయన "వామపక్ష హేగెలియన్లు" (బ్రూనో బౌవర్ మొదలైనవాళ్లు) అనే బృందానికి చెందినాడు; వాళ్లు హేగెల్*** సిద్ధాంతంనుండి నాస్తికవాద, విప్లవకర నిర్ణయాలు చేయడానికి ప్రయత్నించినారు.

విశ్వవిద్యాలయంనుండి పట్టా పొందిన తర్వాత మార్క్స్ బోన్‌కు పోయినాడు, ప్రొఫెసర్ కావచ్చు ననే ఆశతో. కానీ ప్రభుత్వ ప్రగతి వ్యతిరేక విధానం — 1832లో లుడ్విగ్ ఫాయెర్

---

* ఈ వ్యాసంలో మార్క్స్ జీవిత చరిత్రకు సంబంధించిన భాగం మాత్రమే ప్రచురించబడింది. — సం.

** ఎపిక్యూరస్ (జననం సుమారు క్రీ. పూ. 341 — మరణం క్రీ. పూ. 270) — సుప్రసిద్ధ పురాతన గ్రీక్ తత్వవేత్త, భౌతికవాది, నిరీశ్వరవాది. — సం.

*** హేగెల్, గియోర్గ్ విల్‌హేల్మ్ (1770–1831) — సుప్రసిద్ధ జర్మన్ తత్వవేత్త, వస్తుగత భావవాది, భావవాద పరస్పరవాదాన్ని ఆమూలాగ్రంగా విశ్లేషణ చేసినాడు. — సం,

బాఖ్‌ను* ఛేర్ పదవినుండి తొలగించి, 1836లో ఆయన విశ్వవిద్యాలయానికి తిరిగి రావడానికి అనుమతి నిరాకరించి, 1841లో యువ ప్రొఫెసర్ బ్రూనో బౌవర్ బోన్ విశ్వవిద్యాలయంలో బోధించడాన్ని నిషేధించిన ప్రభుత్వంయొక్క ప్రగతి వ్యతిరేక విధానం — బోధనా వృత్తి సాగించాలనే అభిప్రాయాన్ని మార్క్స్ వదులుకునేటట్లు చేసింది. ఆనాడు జర్మనీలో వామపక్ష హేగెలియన్ల అభిప్రాయాలు చాలా వేగంగా అభివృద్ధి ఔతూ వుండినాయి. లుడ్విగ్ ఫొయెర్‌బాఖ్, ముఖ్యంగా 1836 తర్వాత, మత సిద్ధాంతాన్ని విమర్శిస్తూ భౌతిక వాదం వైపు మళ్లసాగినాడు. 1841లో ఆయన సిద్ధాంతంలో భౌతికవాదానిది పైచేయి అయింది ("క్రైస్తవమత సారం"); 1843లో ఆయన గ్రంథం "భవిష్యత్ తత్వశాస్త్ర సూత్రాలు" వెలువడింది. యీ పుస్తకాల "విమోచన ప్రభావాన్ని యెవరైనా తప్పక అనుభవించి వుంటారు," అని ఫొయెర్‌బాఖ్ రచనల గురించి తరువాతి కాలంలో ఎంగెల్సు రాసినాడు. "మేము" (అనగా వామపక్ష హేగెలియన్లు, మార్క్స్‌తో సహా) "అందరమూ వెంటనే ఫొయెర్‌బాఖియన్లమైనాము." ఆ కాలంలో రైనిష్ తీవ్రవాద బూర్జువాలు, వామపక్ష హేగెలియన్లతో కొన్ని సమానాభిప్రాయాలు కలవాళ్లు, కొలోన్‌లో "రైనిషె సైటుంగ్" అనే ప్రతిపక్ష పత్రిక ఒకటి స్థాపించినారు (మొదటి సంచిక 1842 జనవరి 1వ తేదీన వెలువడింది). మార్క్స్ బ్రూనో బౌవర్‌లు పత్రికకు ప్రధాన వ్యాస రచయితలుగా ఆహ్వానింపబడినారు. 1842 అక్టోబర్‌లో మార్క్స్ దానికి ప్రధాన సంపాదకుడై బోన్‌నుండి కొలోన్‌కు మారినాడు. మార్క్స్ సంపాదకత్వం కింద పత్రికయొక్క విప్లవ ప్రజాతంత్ర ధోరణి అంతకంతకూ తీవ్రమైంది, ప్రభుత్వం మొదట దాన్ని ద్విగుణ సెన్సర్‌షిప్‌కూ, త్రిగుణ సెన్సర్‌షిప్‌కూ లోనుజేసి, తరువాత 1843 జనవరి 1నుండి సాంతం అణచివేయడానికి నిర్ణయించింది. ఆ తేదీకి లోపలనే మార్క్స్ తన సంపాదకత్వానికి రాజీనామా యివ్వవలసి వచ్చింది, కానీ ఆయన రాజీనామా పత్రికను రక్షించలేదు, అది 1843 మార్చిలో మూసివేయబడింది. "రైనిషె సైటుంగ్"కు మార్క్స్ రాసిన మరీ ముఖ్యమైన వ్యాసాలలో, కింద (చూ: "పుస్తకాల పట్టీ"**) యివ్వబడినవాటికి తోడుగా, మొసెల్ లోయ ద్రాక్ష రైతుల స్థితిమీద రాసిన

---

* ఫొయెర్‌బాఖ్, లుడ్విగ్ (1804–1872) — ప్రసిద్ధ జర్మన్ భౌతిక తత్వశాస్త్రజ్ఞుడు, నాస్తికుడు; మార్క్సిజం పూర్వీకులలో ఒకడు. హేగెల్ భావవాదతత్వాన్ని ఖండించి, భావవాదానికీ, మతానికీ మధ్య సంబంధం చూపించినాడు. సాంఘిక విషయాల అవగాహనలో యితను భావవాదిగా వుండినాడు. — సం.

** 1914లో, గ్రనాత్ విజ్ఞానసర్వస్వానికి రాసిన యీ వ్యాసం చివర లెనిన్ మార్క్సిస్టు సాహిత్యంమీదా, మార్క్సిజాన్ని గురించిన సాహిత్యంమీదా ఒక పరిశీలన యిచ్చినాడు. అది యిక్కడ వదలివేయబడింది. — సం.

వ్యాసం ఒకటని ఎంగెల్సు రాసినాడు. తనకు ఆర్థికశాస్త్రంలో తగినంత పరిచయం లేదని, తన పత్రికేయ కార్యకలాపాల ద్వారా మార్క్సుకు నిశ్చయం యేర్పడింది; దాన్ని అధ్యయనం చేయడానికి ఆయన పట్టుదలతో పూనుకున్నాడు.

1843లో, క్రాయిజ్‌నాఖ్‌లో, మార్క్సు తన బాల్య స్నేహితురాలైన జెన్నీ ఫన్ వెస్ట్‌ఫాలెన్‌ను పెండ్లి చేసుకున్నాడు. ఆమెతో ఆయనకు విద్యార్థి దశలోనే ప్రధానం జరిగింది. మార్క్సు భార్య ప్రష్యన్ ప్రభువర్గానికి చెందిన ఒక ప్రగతి వ్యతిరేక కుటుంబంలో పుట్టింది. ఆమె అన్న ఒక అత్యంత ప్రగతి వ్యతిరేక కాలంలో, 1850–1858లలో, ప్రష్యన్ ఆంత రంగిక వ్యవహారాల మంత్రిగా వుండినాడు. 1843 శరదృతువులో మార్క్సు ఆర్నాల్డ్ రూగె (జననం 1802, మరణం 1880; వామపక్ష హెగెలియన్, 1825–1830లో జైల్లో, 1848 తర్వాత రాజకీయ ప్రవాసం; 1866–1870 తర్వాత బిస్మా ర్క్రియన్)*తో కలిసి, విదేశాలలో ఒక అతివాద పత్రికను ప్రచురించడానికి పారిస్‌కు పోయి నాడు. "డోయిచ్-ఫ్రాన్‌జోజిషె యార్‌బ్యూఖర్" ["జర్మన్ ఫ్రెంచి ఇతిహాస వార్షిక సంచి కలు"] అనే యీ పత్రిక ఒక సంచిక మాత్రమే వెలువడింది. జర్మనీలో దాన్ని రహస్యంగా పంపకం చేయడంలో వున్న కష్టం వలనా, రూగెతో అభిప్రాయ భేదాల వలనా అది ఆపి వేయబడింది. యీ పత్రికలోని మార్క్సు వ్యాసాల్లో ఆయన అప్పటికే విప్లవకారుడుగా కన పడతాడు. "వున్న ప్రతి దానిమీదా నిర్దాక్షిణ్యమైన విమర్శ"నూ, ముఖ్యంగా "ఆయుధా లతో విమర్శ"నూ ఆయన ప్రచారం చేసినాడు, జనాలకూ, కార్మికవర్గానికీ ఆయన విజ్ఞప్తి చేసినాడు.

1844 సెప్టెంబర్‌లో ఫ్రెడరిక్ ఎంగెల్సు కొద్ది రోజులపాటు పారిస్‌కు వచ్చినాడు. అప్పటినుండి ఆయన మార్క్సుకు అత్యంత సన్నిహిత మిత్రుడైనాడు. వాళ్లిద్దరూ అప్పటి పారిస్‌లోని విప్లవ బృందాల పొంగులువారే జీవితంలో అతి చురుకుగా పాల్గొన్నారు (అందులో ముఖ్యమైనది ప్రూడన్** సిద్ధాంతం, దాన్ని మార్క్సు తన "తత్వశాస్త్ర దారిద్ర్యం," 1847లో తుత్తునియలు చేసినాడు). వాళ్లు పెటీబూర్జువా సోషలిజంయొక్క వివిధ సిద్ధాంతాలతో చురుకుగా పోరాడుతూ, విప్లవ కార్మికవర్గ సోషలిజం, లేక కమ్యూనిజం (మార్క్సిజం)యొక్క సిద్ధాంతమూ, యెత్తుగడలూ తయారు చేసినారు. "పుస్తకాల పట్టీ"లో యీ 1844–1848 దశకు చెందిన మార్క్సు రచనలు చూడండి. ప్రష్యన్

---

* బిస్మార్క్, ఒట్టో (1815–1898) – ప్రష్యా, జర్మనీ రాజనీతిజ్ఞుడూ, దౌత్య నిపుణుడూ. 1871–1890లలో యితను జర్మన్ సామ్రాజ్యానికి చాన్సెలర్. – సం.

** ప్రూడన్, పీర్ జోసెఫ్ (1809–1865) – ఫ్రెంచి పత్రికా రచయిత, ఆర్థిక వేత్త, సామాజిక శాస్త్రవేత్త, పెటీబూర్జువావర్గపు సిద్ధాంతవేత్త. – సం.

ప్రభుత్వం పట్టుదలగా డిమాండు చేయడం వలన, 1845లో మార్క్సు ప్రమాదకర విప్లవకారుడుగా పరిగణింపబడి, పారిస్‌నుండి బహిష్కరింపబడినాడు. ఆయన బ్రస్సెల్స్‌కు మారినాడు. 1847 వసంతంలో మార్క్సు, ఎంగెల్సులు "కమ్యూనిస్టు లీగు" అనే రహస్య ప్రచార సంఘంలో చేరినారు. వాళ్లు ఆ సంఘంయొక్క రెండవ మహాసభ (లండన్, 1847 నవంబర్)లో ప్రముఖ పాత్ర వహించి, దాని కోరికమీద, ప్రసిద్ధమైన "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" రచించినారు; యిది 1848 ఫిబ్రవరిలో వెలువడింది. మహా మేధావులకు సహజమైన స్పష్టతతోనూ, ప్రజ్ఞతోనూ యీ గ్రంథం నూతన ప్రపంచ దృక్పథాన్ని స్థూలరేఖల్లో చిత్రిస్తుంది. యీ నూతన ప్రపంచ దృక్పథంలో స్థిరమైన భౌతికవాదం, సాంఘిక జీవితానికి కూడా వర్తించేది, వుంది; పరస్పరవాదం అనే అత్యంత సమగ్రమైన, గంభీరమైన అభివృద్ధి సిద్ధాంతం వుంది; వర్గ పోరాటాన్నీ, నూతన కమ్యూనిస్టు సమాజ సృష్టికర్త ఐన కార్మికవర్గంయొక్క ప్రపంచ చరిత్రాత్మక విప్లవ పాత్రనూ ప్రకటించే సిద్ధాంతం వుంది.

1848 ఫిబ్రవరి విప్లవం* ప్రారంభమైనప్పుడు మార్క్సు బెల్జియంనుండి బహిష్కరింపబడినాడు. ఆయన పారిస్‌కు తిరిగి వచ్చినాడు, అక్కడినుండి, మార్చి విప్లవం** తర్వాత, జర్మనీకి, కొలోన్‌కు, పోయినాడు. అక్కడ "నోయె రైనిషె సైటుంగ్" 1848 జూన్ 1నుండి, 1849 మే 19దాకా వెలువడింది; మార్క్సు దాని ప్రధాన సంపాదకుడు. కొత్త సిద్ధాంతాన్ని 1848–1849 విప్లవ ఘటనల క్రమం ఉజ్వలంగా ధ్రువపరిచింది – అప్పటినుండి ప్రపంచంలోని సకల దేశాలలోని కార్మికవర్గ, ప్రజాతంత్ర ఉద్యమాలన్నీ ధ్రువపరిచినట్లే. గెలుపొందిన ప్రతీఘాత విప్లవం మార్క్సుమీద మొదట కోర్టు విచారణ జరిపించింది (1849 ఫిబ్రవరి 9న కేసు కొట్టివేయబడింది) తరువాత ఆయన్ను జర్మనీనుండి బహిష్కరించింది (1849 మే 16). మార్క్సు మొదట పారిస్‌కు పోయినాడు, 1849 జూన్ 13 ప్రదర్శన*** తర్వాత మళ్లీ బహిష్కరింపబడినాడు, ఆ తర్వాత లండన్‌కు పోయినాడు, మరణించే రోజువరకు అక్కడే వుండినాడు.

---

* 1848 ఫిబ్రవరిలో ఫ్రాన్సులో జరిగిన బూర్జువా విప్లవానికి ప్రస్తావన. – సం.

** జర్మనీ ఆస్ట్రియాలలోని 1848 మార్చిలో ప్రారంభించిన విప్లవానికి ప్రస్తావన. – సం.

*** పెటీబూర్జువా పార్టీ జరిపిన ప్రజా ప్రదర్శనకు ప్రస్తావన ఇది. 1848 నాటి విప్లవక్రమంలో ప్రవేశపెట్టబడిన చట్టబద్ధ నిబంధనలను అధ్యక్షుడూ, శాసన సభ మెజారిటీ ఉల్లంఘించినందుకు నిరసనగా ఈ ప్రదర్శన జరిగింది. ప్రభుత్వం ప్రదర్శకులను చెదరగొట్టింది. – సం.

రాజకీయ ప్రవాసిగా ఆయన జీవితం కష్టంగా వుండింది; యీ విషయం మార్క్స్ ఎంగెల్సుల ఉత్తర ప్రత్యుత్తరాలు (1913లో ప్రచురింపబడినవి) స్పష్టంగా వెల్లడిస్తాయి. మార్క్స్, ఆయన కుటుంబమూ ఘోరమైన దారిద్ర్యం అనుభవించినారు. ఎంగెల్సుయొక్క స్వార్థత్యాగ పూరితమైన నిరంతర ఆర్థిక సహాయం లేకపోతే, మార్క్స్ "పెట్టుబడి"ని పూర్తి చేయలేకపోవడమే గాక, దారిద్ర్యంతో తప్పకుండా నశించిపోయి వుండేవాడు. అంతేగాక, అప్పుడు వ్యాప్తిలో వుండిన పెటీబూర్జువా సోషలిస్టు సిద్ధాంతాలూ, ధోరణులూ, మొత్తంమీద కార్మికవర్గేతర సోషలిస్టు సిద్ధాంతాలూ, ధోరణులూ — వీటి ఒత్తిడివలన మార్క్స్ నిరంతర, నిర్దాక్షిణ్య పోరాటం చేయవలసి వచ్చింది, ఒకోసారి అత్యంత కిరాతకమైన, అత్యంత రాక్షసమైన వ్యక్తిగత దాడులను (*Herr Vogt**) తిప్పికొట్టవలసి వచ్చింది. రాజకీయ ప్రవాసితుల బృందాలకు యెడంగా వుండి, మార్క్స్ అనేక చరిత్రాత్మక రచనలలో (చూ: "పుస్తకాల పట్టీ") తన భౌతికవాద సిద్ధాంతం అభివృద్ధి చేసినాడు, తన కృషి ప్రధానంగా ఆర్థిక శాస్త్ర అధ్యయనానికి వినియోగిస్తూ. "అర్థశాస్త్ర విమర్శ" (1859)లోనూ, "పెట్టుబడి" (భాగం 1, 1867)లోనూ మార్క్స్ యీ శాస్త్రాన్ని విప్లవీకరించినాడు.

యాభైల అంతంలోనూ, అరవైలలోనూ జరిగిన ప్రజాతంత్ర ఉద్యమాల పునరుద్ధరణ మార్క్సును కార్యరంగంలోకి మళ్ళీ పిలిచింది. 1864 (సెప్టెంబరు 28)లో అంతర్జాతీయ కార్మిక సంఘం — సుప్రసిద్ధమైన మొదటి ఇంటర్నేషనల్ — లండన్‌లో స్థాపించబడింది. యీ సంస్థకు హృదయమూ, ఆత్మా మార్క్స్. దాని మొదటి ఉపన్యాసమూ, అనేక తీర్మానాలూ, ప్రకటనలూ, ప్రణాళికలూ ఆయన రచించినాడు. వివిధ దేశాల కార్మికోద్యమాన్ని సమైక్యం చేయడం ద్వారానూ, కార్మికవర్గేతర, మార్క్స్ పూర్వ సోషలిజంయొక్క వివిధ రూపాలను (మజ్జీనీ,** ప్రూడన్, బకూనిన్,*** యింగ్లండులోని ఉదారవాద ట్రేడ్ యూనియనిజమూ, జర్మనీలోని లాసాలియన్****ల దక్షిణపక్షపు ఊగిసలాటలూ, వగైరాలను)

---

* "హెర్ ఫోగ్ట్" — జర్మన్ బూర్జువా ప్రజాతంత్రవాది కార్ల్ ఫోగ్ట్‌కు వ్యతిరేకంగా మార్క్స్ రాసిన చిన్న పుస్తకం. — సం.

** మజ్జీనీ, జూసెప్ (1805-1872) — ఇటాలియన్ బూర్జువా విప్లవకారుడు, ఇటలీ ఏకీకరణకై సాగిన పోరాట కాలంలో ఇటాలియన్ బూర్జువావర్గపు రిపబ్లికన్-ప్రజాస్వామ్య పక్షం నాయకులలోనూ భావశాస్త్రవేత్తలలోనూ ఒకడు. — సం.

*** బకూనిన్, ఎం. ఎ. (1814–1876) — రష్యన్ విప్లవకారుడు; నరోదిజం, అరాజకవాదాల భావశాస్త్రవేత్త, మొదటి ఇంటర్నేషనల్‌లో మార్క్సిజంపట్ల బద్ధవైరి, తన చీలదీత క్రియాకలాపాలకుగాను 1872 హేగ్ కాంగ్రెస్‌లో ఇంటర్నేషనల్‌నుండి వెళ్లగొట్టబడినాడు. — సం.

**** లాసాల్, ఫెర్డినాండ్ (1825–1864) — జర్మన్ పెటీబూర్జువా సోషలిస్టు, జనరల్ జర్మన్ వర్కర్స్ అసోసియేషన్ (1863) స్థాపకులలో ఒకడు. ఈ అసోసియేషన్

సంయుక్త కృషి మార్గంలోకి మళ్లించడానికి కృషి చేయడంద్వారానూ, యీ సకల బృందాల సిద్ధాంతాలతోనూ పోరాటం చేయడంద్వారానూ మార్క్స్ వివిధ దేశాలలోని కార్మికవర్గం యొక్క వర్గ పోరాటానికి ఒకే రూపం గల యెత్తుగడను తయారు చేసినాడు. పారిస్ కమ్యూన్ (1871) పతనం తర్వాత — దీన్ని గురించి మార్క్స్ ఎంతో లోతైన, విస్పష్టమైన, ఉజ్వలమైన, ప్రయోజనకరమైన, విప్లవకరమైన పరిశీలన ("ఫ్రాన్సులో అంతర్యుద్ధం," 1871) యిచ్చినాడు — ఇంటర్నేషనల్‌ను బకూనినిస్టులు* చీల్చిన తర్వాత, ఆ సంస్థ యూరప్‌లో వుండడం అసాధ్య మైపోయింది. ఇంటర్నేషనల్‌యొక్క హేగ్ మహాసభ (1872) తర్వాత, మార్క్స్ ఇంటర్నేషనల్‌యొక్క జనరల్ కౌన్సిల్‌ను న్యూయార్క్‌కు మార్పించినాడు. మొదటి ఇంటర్నేషనల్ తన చారిత్రక పాత్రను నిర్వర్తించింది; అది ప్రపంచంలోని సకల దేశాలలోనూ కార్మికోద్యమం అగణ్యమానంగా పెరిగే దశకు దారితీసింది — నిజానికి ఉద్యమం విస్తృతిలో పెరిగి, విడివిడిగా జాతీయ రాజ్యాలలో సామూహిక సోషలిస్టు కార్మిక పార్టీలు సృష్టి అయిన దశ అది.

ఇంటర్నేషనల్‌లో శ్రమభరితమైన పనీ, సిద్ధాంత కృషిలో అంతకంటె శ్రమభరితమైన పనీ మార్క్స్ ఆరోగ్యాన్ని పూర్తిగా పాడుచేసినాయి. అర్థశాస్త్రానికి కొత్త రూపం యిచ్చే పనీ, "పెట్టుబడి"ని పూర్తి చేసే పనీ ఆయన కొనసాగించినాడు. "పెట్టుబడి"కి ఆయన విస్తారమైన కొత్త సమాచారం సేకరించినాడు, అనేక భాషలు (ఉదాహరణకు, రష్యన్ భాష) అధ్యయనం చేసినాడు; కానీ ఆయన "పెట్టుబడి"ని పూర్తిచేయకుండా అనారోగ్యం అడ్డు పడింది.

1881 డిసెంబర్ 2న ఆయన భార్య మరణించింది. 1883 మార్చి 14న మార్క్స్ పడకకుర్చీలో ప్రశాంతంగా కన్నుమూసినాడు. లండన్‌లోని హైగేట్ స్మశానంలో ఆయన భార్య సమాధి పక్కనే సమాధి చేయబడినాడు. మార్క్స్ సంతానంలో కొందరు లండన్‌లో, ఆయన కుటుంబం కటిక దరిద్రంలో వున్నప్పుడు, చిన్నతనంలోనే మరణించినారు. ముగ్గురు కూతుర్లు ఇంగ్లీషు, ఫ్రెంచి సోషలిస్టులను పెండ్లి చేసుకున్నారు: ఎలినోర ఏవెలింగ్, లౌరా లాఫార్గ్, జెన్నీ లోంగె; జెన్నీ కొడుకు ఫ్రెంచి సోషలిస్టు పార్టీ సభ్యుడు.

రచన: జూలై—నవంబర్ 1914

---

స్థాపన కార్మికవర్గ ఉద్యమంలో ఒక ముఖ్యమైన ఘటన; అయినప్పటికీ ఈ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నుకొనబడిన తర్వాత, సంఘాన్ని లాసాల్ అవకాశవాద మార్గంలో నడిపించినాడు. లాసాల్‌యొక్క సైద్ధాంతిక, రాజకీయ అభిప్రాయాలను మార్క్స్, ఎంగెల్స్‌లు నిశితంగా విమర్శించినారు. — సం.

* బకూనినిస్టులు — రష్యన్ విప్లవవాది ఎమ్. ఎ. బకూనిన్ అనుచరులు. — సం.

# వి.ఐ. లెనిన్

## ఫ్రెడరిక్ ఎంగెల్సు

హా, యెలాంటి జ్ఞానదీపం ఆరిపోయింది,
యెలాంటి హృదయం అప్పుడు ఆగిపోయింది.*

1895 ఆగస్టు 5న ఫ్రెడరిక్ ఎంగెల్సు లండన్‌లో మరణించినాడు. ఆయన మిత్రుడు కార్ల్ మార్క్సు (1883లో మరణించిన) తర్వాత, ఎంగెల్సు మొత్తం నాగరిక ప్రపంచంలో ఆధునిక కార్మికవర్గానికి అత్యంత గణనీయమైన పండితుడూ, ఉపాధ్యాయుడూ. విధి కార్ల్ మార్క్సునూ, ఫ్రెడరిక్ ఎంగెల్సునూ కలిపినప్పటినుండి ఆ యిద్దరు మిత్రులలో ప్రతి ఒకరి జీవిత కృషీ ఆ యిద్దరికీ సమష్టి ఆశయం అయింది. కనుక కార్మికవర్గానికి ఫ్రెడరిక్ ఎంగెల్సు చేసిన సేవను అర్థంచేసుకోడానికి, సమకాలిక కార్మిక ఉద్యమానికి మార్క్సు కృషికీ, ఉపదేశానికీ గల ప్రాముఖ్యం గురించి స్పష్టమైన అవగాహన అవసరం. కార్మికవర్గమూ, కార్మికవర్గ డిమాండ్లూ ప్రస్తుత ఆర్థిక వ్యవస్థయొక్క అవశ్య ఫలితమనీ, యీ వ్యవస్థ బూర్జువావర్గంతో కలిసి అనివార్యంగా కార్మికవర్గాన్ని సృష్టించి, సమీకరిస్తుందనీ నిరూపించిన మొదటివాళ్లు మార్క్సు ఎంగెల్సులు. యిప్పుడు మానవజాతిని పీడిస్తున్న దౌష్ట్యాల నుండి దాన్ని విముక్తి చేసేది మహానుభావుల సదుద్దేశపూర్వక ప్రయత్నాలు కాదనీ, సమీకృత కార్మికవర్గంయొక్క వర్గపోరాటమనీ వాళ్లు నిరూపించినారు. సోషలిజం అనేది స్వాప్నికుల సృష్టి కాదనీ, ఆధునిక సమాజపు ఉత్పత్తి శక్తుల అభివృద్ధియొక్క అంతిమ లక్ష్యమూ, అనివార్య ఫలితమూ అనీ తమ శాస్త్రీయ రచనలలో మొదట వివరించినవాళ్లు మార్క్సు ఎంగెల్సులు. యింతవరకు లిఖిత చరిత్ర అంతా వర్గపోరాట చరిత్ర, కొన్ని సామాజిక వర్గాల

---

* "దొబ్రొల్యూబొవ్‌కు స్మృత్యంజలి" అన్న రష్యన్ కవి ఎన్. ఎ. నెక్రాసొవ్ గేయంనుండి. — సం.

మీద మరికొన్ని సామాజిక వర్గాల పరిపాలనా విజయాల క్రమానుగత చరిత్ర. యిది వర్గ పోరాట, వర్గ పరిపాలనల పునాదులైన సొంత ఆస్తి, అరాజక సాంఘిక ఉత్పత్తి అంతరించిందాకా కొనసాగుతుంది. యీ పునాదుల నిర్మూలనను కార్మికవర్గ ప్రయోజనాలు డిమాండు చేస్తాయి, కనుక సమీకృత కార్మికుల చైతన్యపూరిత వర్గపోరాటం వీటిమీద సాగాలి. మరిన్నీ, ప్రతి వర్గపోరాటమూ ఒక రాజకీయ పోరాటమే.

మార్క్స్ ఎంగెల్సుల యీ అభిప్రాయాలను యిప్పుడు విముక్తి కొరకు పోరాడే కార్మికులందరూ అవలంబించినారు. కానీ 1840 దశకంలో యీ మిత్రులిద్దరూ సోషలిస్టు సారస్వతంలోనూ, ఆ కాలంనాటి సాంఘిక ఉద్యమాలలోనూ పాల్గొన్నప్పుడు, యిలాంటి అభిప్రాయాలు పరమ నూతనంగా వుండినాయి. ఆ కాలంలో, రాజకీయ స్వేచ్ఛ కొరకు జరిగే పోరాటంలోనూ, రాజుల నియంతృత్వానికీ, పోలీసులకూ, మతగురువులకూ వ్యతిరేకంగా జరిగే పోరాటంలోనూ నిమగ్నులై కూడా బూర్జువావర్గ ప్రయోజనాలకూ, కార్మికవర్గ ప్రయోజనాలకూ గల వైరుధ్యాన్ని చూడనివాళ్ళు, ప్రజ్ఞావంతులూ, ప్రజ్ఞాహీనులూ, నిజాయితీపరులూ, నిజాయితీలేనివాళ్ళూ, చాలామంది వుండినారు. కార్మికులు స్వతంత్ర సామాజిక శక్తిగా వ్యవహరించడం అనే భావాన్ని వీళ్ళు ఒప్పుకునేవాళ్ళు కూడా కాదు. మరొకవైపున సమకాలిక సాంఘిక వ్యవస్థలోని అన్యాయం గురించి పాలకులనూ, పాలకవర్గాలనూ ఒప్పించడం మాత్రమే అవసరమనీ, ఆ తర్వాత భూమండలంమీద శాంతి సౌభాగ్యాలు నెలకొల్పడం సులభమనీ అనుకునే చాలామంది స్వాప్నికులు — అందులో కొందరు మహా మేధావులు కూడా — వుండినారు; పోరాటం లేని సోషలిజం గురించి వీళ్ళు కలలు గన్నారు. చివరి విషయం, మొత్తం మీద ఆనాటి సోషలిస్టులూ, కార్మికవర్గ మిత్రులూ అందరూ కార్మికవర్గాన్ని ఒక పుండుగా మాత్రమే పరిగణించి, పరిశ్రమాభివృద్ధితో యీ పుండు యెలా పెరిగిందీ వెలపరంతో గమనించినారు. కనుక, వాళ్ళందరూ పరిశ్రమాభివృద్ధినీ, కార్మికవర్గ అభివృద్ధినీ యెలా ఆపడం అనే దానిమీద, "చరిత్ర చక్రాన్ని" యెలా ఆపడం అనే దానిమీద, శ్రద్ధ వహించినారు. మార్క్స్ ఎంగెల్సులు కార్మికవర్గ అభివృద్ధి పట్ల సార్వత్రిక భయంలో పాలు పంచుకోడానికి బదులు, తమ ఆశ లన్నిటినీ కార్మికవర్గ అభివృద్ధి యింకా కొనసాగడంమీద పెట్టుకున్నారు. కార్మికుల సంఖ్య పెరిగేకొద్దీ, విప్లవ వర్గంగా వాళ్ళ శక్తి పెరుగుతుంది, సోషలిజం మరింత సమీపమూ, మరింత సుసంభవమూ అవుతుంది. కార్మికవర్గానికి మార్క్స్ ఎంగెల్సులు చేసిన సేవను కొద్ది మాటల్లో యిలా చెప్పవచ్చు: తన్ను తాను తెలుసుకోవడమూ, స్వీయ చైతన్యం పొందడమూ కార్మికవర్గానికి వాళ్ళు నేర్పినారు, స్వప్నాల స్థానంలో శాస్త్రవిజ్ఞానాన్ని వుంచినారు వాళ్ళు.


అందుకనే ఎంగెల్సు పేరూ, జీవిత చరిత్రా ప్రతి కార్మికునికీ తెలియాలి. అందుకనే, మన ప్రచురణల కన్నిటికీ వున్నట్లే రష్యన్ కార్మికులలో వర్గచైతన్యాన్ని మేలుకొలపడం

లక్ష్యంగా గల యీ వ్యాస సంపుటిలో, ఆధునిక కార్మికవర్గంయొక్క ఇద్దరు మహా ఉప దేశికులలో ఒకరైన ఫ్రెడరిక్ ఎంగెల్సుయొక్క జీవితాన్నీ, కృషినీ నేను వివరించాలి.

ఎంగెల్సు, ప్రష్యా రాజ్యానికి చెందిన రైన్ రాష్ట్రంలోని బార్మెన్‌లో, 1820లో పుట్టినాడు. ఆయన తండ్రి ఒక కార్ఖానా స్వంతదారుడు. 1838లో ఎంగెల్సు, కుటుంబ పరిస్థితుల నిర్బంధం వలన, హైస్కూలు చదువు ముగించకుండానే, బ్రెమెన్‌లోని ఒక వ్యాపార సంస్థలో గుమాస్తాగా చేరవలసి వచ్చింది. ఎంగెల్సు తన శాస్త్రీయ, రాజకీయ విద్యను కొనసాగించడానికి వ్యాపార విషయాలు అడ్డం రాలేదు. హైస్కూలులో వుండగానే ఆయన నియంతృత్వాన్నీ, బ్యురోక్రట్ల క్రూర పాలననూ ద్వేషించసాగినాడు. తత్వశాస్త్ర అధ్యయనం ఆయన్ను యింకా ముందుకు తీసుకపోయింది. ఆ కాలంలో హేగెల్ సిద్ధాంతం జర్మన్ తత్వ శాస్త్రంలో ప్రబలంగా వుండింది. ఎంగెల్సు, హేగెల్ అనుచరుడైనాడు. హేగెల్ ప్రష్యన్ రాజ్య సేవలో, బెర్లిన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా వుంటూ, ప్రష్యన్ రాజ్య నియంతృత్వాన్ని మెచ్చుకునేవాడైనప్పటికీ, ఆయన సిద్ధాంతం విప్లవకరమైంది. మానవ వివేచనలోనూ, దాని హక్కులలోనూ హేగెల్‌కు విశ్వాసం వుండింది. విశ్వం నిత్య పరిణామ, అభివృద్ధి ప్రక్రియకు లోనౌతుందనేది హేగెలియన్ సిద్ధాంతంలోని ప్రధాన అంశము. యివి ఆ బెర్లిన్ తత్వవేత్తయొక్క శిష్యులలో వర్తమాన వ్యవహారాల స్థితితో రాజీపడడానికి నిరాకరించేవాళ్లను యెక్కడికి తీసుకపోతూ వుండినాయంటే యీ వర్తమాన వ్యవహారాల స్థితిమీద పోరాటం, వర్తమాన దోషంమీదా, అమలులో వున్న దౌష్ట్యంమీదా పోరాటం కూడా నిత్య అభివృద్ధి అనే సార్వత్రిక నియమంలో వేర్లు పాతుకొని వుందనే భావానికి తీసుకపోతూ వుండినాయి. అన్నీ అభివృద్ధి చెందుతూ వుంటే, పాత సంస్థలు పోయి వాటి స్థానంలో కొత్త సంస్థలు వస్తూనే వుంటే, ప్రష్యా రాజుయొక్క, లేక రష్యా జారుయొక్క నియంతృత్వమూ, విస్తారమైన అధిక సంఖ్యాకులకు నష్టకరంగా తృణప్రాయమైన అల్ప సంఖ్యాకులు సంపన్నులు కావడమూ, ప్రజలమీద బూర్జువావర్గ పెత్తనమూ శాశ్వతంగా యెందుకు కొనసాగాలి? హేగెల్ సిద్ధాంతం మనస్సుయొక్క, భావాలయొక్క అభివృద్ధిని గురించి చెప్పింది, అది భావవాదం. మనస్సుయొక్క అభివృద్ధినుండి అది ప్రకృతియొక్క అభివృద్ధినీ, మానవుని అభివృద్ధినీ, మానవ, సాంఘిక సంబంధాల అభివృద్ధినీ నిరూపించింది. నిత్య అభివృద్ధి ప్రక్రియ అనే హేగెల్ భావాన్ని నిలుపుకొని,* మార్క్సు ఎంగెల్సులు నిరాధారమైన భావవాద దృక్పథాన్ని తోసిపుచ్చినారు.

---

* తమ బౌద్ధిక అభివృద్ధిలో జర్మన్ మహాతత్వవేత్తలకు, ముఖ్యంగా హేగెల్‌కు, తాము యెంతో రుణపడి వున్నామని మార్క్సు ఎంగెల్సులు తరుచు పేర్కొనేవారు. "జర్మన్ తత్వ శాస్త్రం లేకుంటే, శాస్త్రీయ సోషలిజం అనేదే వుండేది కాదు," అని ఎంగెల్సు అన్నాడు. [లెనిన్ వివరణ.]



కార్ల్ మార్క్స్, 1872



ఫ్రెడరిక్ ఎంగెల్సు, 1872

వాళ్ళు జీవిత వాస్తవాలవైపు మళ్ళి, మనస్సుయొక్క అభివృద్ధి ప్రకృతియొక్క అభివృద్ధిని వివరించేది కాదనీ, తద్వ్యతిరేకంగా, మనస్సును గురించిన వివరణను ప్రకృతినుండి, పదార్థంనుండి, పొందక తప్పదనీ గమనించినారు.... హేగెల్‌కూ, యితర హేగెలియన్లకూ భిన్నంగా, మార్క్సు ఎంగెల్సులు భౌతికవాదులు. వాళ్ళు ప్రపంచాన్నీ, మానవులనూ భౌతిక వాదాత్మకంగా పరిగణించి, ప్రకృతి ఘటనలకన్నిటికీ మూలంలో భౌతిక కారణాలు వున్నట్లే, మానవ సమాజపు అభివృద్ధి భౌతికమైన ఉత్పాదక శక్తుల అభివృద్ధిచేత నిర్ణయింపబడిందని గమనించినారు. మానవ అవసరాలను తీర్చడానికి కావలసిన వస్తువులను ఉత్పత్తి చేయడంలో మానవులు ఒకరితో ఒకరు పెట్టుకునే సంబంధాలు ఉత్పాదక శక్తుల అభివృద్ధిమీద ఆధారపడతాయి. సాంఘిక జీవితానికీ, మానవ ఆశలకూ, భావాలకూ, చట్టాలకూ సంబంధించిన సకల ఘటనలయొక్క వివరణ యీ సంబంధాలలోనే వుంది. ఉత్పాదక శక్తుల అభివృద్ధి సొంత ఆస్తిమీద ఆధారపడిన సామాజిక సంబంధాలను సృష్టిస్తుంది, కానీ యీ ఉత్పాదక శక్తుల అభివృద్ధే అధిక సంఖ్యాకులకు ఆస్తి లేకుండా చేసి, తృణప్రాయమైనంత అల్ప సంఖ్యాకుల చేతుల్లో ఆస్తిని సాంద్రీకరిస్తుందని మనం గమనిస్తాం. అది ఆధునిక సమాజ వ్యవస్థకు ఆధారమైన ఆస్తిని ధ్వంసం చేస్తుంది; అది సోషలిస్టులు పెట్టుకున్న లక్ష్యం వైపు తానే కృషి చేస్తుంది. సోషలిస్టులు చేయవలసిందల్లా యేమిటంటే, సామాజిక శక్తులలో యే శక్తి, ఆధునిక సమాజంలో దాని స్థానం మూలంగా, సోషలిజంను తెచ్చుకోవడం ద్వారా లాభపడుతుందో గుర్తించి, ఆ శక్తికి దాని ప్రయోజనాలను గురించీ, దాని చారిత్రక కర్తవ్యాన్ని గురించీ స్పృహను కలగజెయ్యడం. యీ శక్తి కార్మికవర్గమే. ఎంగెల్సు దీనిని ఇంగ్లండులో తెలుసుకున్నాడు, బ్రిటిష్ పరిశ్రమకు కేంద్రమైన మాంచెస్టర్‌లో — అక్కడ ఆయన 1842లో స్థిరపడినాడు, తన తండ్రి భాగస్వామిగా వుండిన ఒక వ్యాపార సంస్థ కొలువులో చేరి. అక్కడ ఆయన కేవలం ఫాక్టరీ ఆఫీసులో కూర్చోలేదు; పక్షిగూళ్ళలాంటి కార్మిక మురికిపేటలు ఆయన తిరిగినాడు. ఆయన వాళ్ళ దారిద్ర్యమూ, దౌర్భాగ్యమూ తన కండ్లారా చూసినాడు. కానీ ఆయన తన వ్యక్తిగత పరిశీలనకు పరిమితం కాలేదు. బ్రిటిష్ కార్మికవర్గ పరిస్థితిమీద తనకు ముందు వెల్లడింపబడినదంతా ఆయన చదివి, తనకు దొరికిన అధికార పత్రాలనన్నిటినీ శ్రద్ధగా అధ్యయనం చేసినాడు. యీ పరిశీలనల, అధ్యయనాల ఫలితంగా 1845లో "ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి" అనే పుస్తకం వెలువడింది. "ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి" రచయితగా ఎంగెల్సు చేసిన ప్రధాన సేవను ముందే చెప్పినాను. ఎంగెల్సుకంటె ముందు కూడా చాలామంది కార్మికవర్గంయొక్క బాధలను వర్ణించి, దానికి సహాయం చేయవలసిన అవసరాన్ని చూపించినారు. కార్మికవర్గం బాధిత వర్గం మాత్రమే కాదనీ, వాస్తవంలో కార్మిక వర్గంయొక్క లజ్జాకరమైన ఆర్థిక పరిస్థితి దాన్ని దుర్నిరోధంగా ముందుకు తరుముతూ, అంతిమ విమోచన కొరకు పోరాడేటట్లు నిర్బంధిస్తున్నదనీ చెప్పిన మొదటివాడు ఎంగెల్సు.

మరి, పోరాడే కార్మికవర్గం తనకు తాను సహాయం చేసుకుంటుది. సోషలిజంలో తమ ఏకైక విముక్తి యిమిడివుందని గుర్తించేటట్లు అనివార్యంగా చేస్తుంది కార్మికవర్గంయొక్క రాజకీయ ఉద్యమం. మరొక వైపున, సోషలిజం కార్మికవర్గంయొక్క రాజకీయ పోరాటపు లక్ష్యం ఐనప్పుడు మాత్రమే అది ఒక శక్తి ఔతుంది. యింగ్లండులోని కార్మికవర్గ పరిస్థితి మీద ఎంగెల్సు రాసిన పుస్తకంలోని ప్రధాన భావాలు యిలాంటివి; యీ భావాలు యిప్పుడు యోచించే, పోరాడే కార్మికులందరిచేతా అవలంబించబడినాయి, గానీ, ఆ కాలంలో సంపూర్ణంగా కొత్తవి. యీ భావాలు మనసును ఆకట్టుకునే శైలిలో రాయబడినదీ, యింగ్లీషు కార్మికవర్గ దౌర్భాగ్యం గురించి అత్యంత విశ్వసనీయమైన, హృదయవిదారకమైన చిత్రాలతో నిండినట్టిదీ అయిన పుస్తకంలో ప్రవచింపబడినాయి. యీ పుస్తకం పెట్టుబడిదారీ వ్యవస్థమీదా, బూర్జువా వర్గంమీదా భయంకరమైన నేరారోపణ పత్రం. యిది చాలా ప్రగాఢమైన ప్రభావం కలిగించింది. ఆధునిక కార్మికవర్గం గురించి అత్యుత్తమ చిత్రం యిచ్చేదిగా యీ పుస్తకం ప్రతిచోటా ఉల్లేఖింపబడసాగింది. నిజానికి, 1845కు ముందుగానీ, ఆ తర్వాత గానీ, కార్మికవర్గ దౌర్భాగ్యం గురించి యింత కొట్టవచ్చినట్లున్న, వాస్తవమైన చిత్రం వెలువడ లేదు.

ఇంగ్లండుకు వచ్చినంతవరకు ఎంగెల్సు సోషలిస్టు కాలేదు. మాంచెస్టర్‌లో ఆయన ఆనాడు బ్రిటిష్ కార్మిక ఉద్యమంలో చురుకుగా పనిచేసేవాళ్లతో సంబంధాలు యేర్పరచు కొని, బ్రిటిష్ సోషలిస్టు పత్రికలకు రాయసాగినాడు. 1844లో ఆయన జర్మనీకి తిరిగి-పోతూ, పారిస్‌లో మార్క్సుతో పరిచయం చేసుకున్నాడు – ఆయనతో అంతకుముందే ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం ప్రారంభించి వుండినాడు. పారిస్‌లో ఫ్రెంచి సోషలిస్టుల యొక్క, ఫ్రెంచి జీవితంయొక్క ప్రభావం కింద మార్క్సు కూడా సోషలిస్టు ఐవుండినాడు. యిక్కడ మిత్రులిద్దరూ కలిసి "పవిత్ర కుటుంబం, లేక విమర్శనాత్మక విమర్శయొక్క విమర్శ" అనే గ్రంథం రచించినారు. "ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి" కంటె ఒక సంవత్సరం ముందు వెలువడింది యిది. దీనిలో అధిక భాగం మార్క్సు రాసినాడు. పైన వివరించిన ప్రధాన భావాలు గల విప్లవ భౌతికవాదాత్మక సోషలిజంయొక్క పునాదులు యీ గ్రంథంలో వున్నాయి. "పవిత్ర కుటుంబం" అనేది తత్వవేత్తలైన బౌవర్ సోదరులకూ, వాళ్ల అనుయాయులకూ పెట్టిన హాస్యపూరితమైన మారుపేరు. యీ పెద్ద మనుషులు బోధించిన విమర్శ సమస్త వాస్తవానికీ అతీతంగా, పార్టీలకూ, రాజకీయాలకూ అతీతంగా వుండేది, సమస్త కార్యాచరణనూ విసర్జించి, బాహ్య ప్రపంచాన్నీ, అందులో జరుగు తున్న ఘటనలనూ కేవలం "విమర్శనాత్మకంగా" ధ్యానం చేసేది. కార్మికవర్గాన్ని విమర్శనా రహితమైన సమూహంగా యీ బౌవర్ పెద్దమనుషులు స్వాతిశయంతో పరిగణించినారు. యీ అసంబద్ధమైన, హానికరమైన ధోరణిని మార్క్సు ఎంగెల్సులు తీవ్రంగా వ్యతిరేకించినారు.

వాస్తవమైన మానవ వ్యక్తి తరఫున – పాలకవర్గాలచేతా, రాజ్యంచేతా నలగదొక్కబడిన కార్మి కుని తరఫున – వీళ్ళు డిమాండు చేసింది ధ్యానం కాదు, ఉత్తమ సమాజ వ్యవస్థ కొరకు పోరాటం. కార్మికవర్గాన్ని వీళ్లు యీ పోరాటం చేసే సామర్థ్యం గల శక్తిగానూ, యీ పోరా టం వలన ప్రయోజనం పొందే శక్తిగానూ పరిగణించినారు. "పవిత్ర కుటుంబం" వెలువడక ముందే కూడా, మార్క్సు, రూగె* నడిపిన "దోయిచ్-ఫ్రాన్‌జోజిషె యార్‌బ్యూఖర్" పత్రికలో ఎంగెల్సు "అర్థశాస్త్ర విమర్శనాత్మక వ్యాసాలు" రాసినాడు; అందులో ఆయన సమకాలిక ఆర్థిక వ్యవస్థలోని ప్రధాన లక్షణాలను సోషలిస్టు దృక్పథంనుండి పరిశీలించి, అవి సొంత ఆస్తి పరిపాలనయొక్క అవశ్య ఫలితాలని నిర్ణయించినాడు. మార్క్సు యే అర్థ శాస్త్రంలో చేసిన రచనలు ఒక విప్లవమే తెచ్చినాయో, ఆ అర్థశాస్త్రం అధ్యయనం చేయా లనుకున్న ఆయన నిర్ణయానికి నిస్సంశయంగా ఒక కారణం ఎంగెల్సుతో ఆయనకు యేర్పడిన సంబంధం.

1845నుండి 1847వరకు ఎంగెల్సు బ్రస్సెల్స్‌లోనూ, పారిస్‌లోనూ వుండినాడు, శాస్త్రీయ కృషితో పాటు ఆయన ఆ పట్టణాలలోని జర్మన్ కార్మికులలో ఆచరణాత్మక కార్యకలాపాలు సాగించినాడు. అక్కడ మార్క్సూ, ఎంగెల్సూ రహస్య "జర్మన్ కమ్యూనిస్టు లీగు"తో సంబంధం యేర్పరచుకున్నారు. వాళ్లు తయారుచేసిన సోషలిజంయొక్క ప్రధాన సూత్రాలను వివరించవలసిందిగా వాళ్లను ఆ లీగు కోరింది. అలా ఉద్భవించింది 1848లో ప్రచురింపబడిన, మార్క్సు ఎంగెల్సుల సుప్రసిద్ధ "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక." అనేక సంపుటాల విలువ వుంది యీ చిన్న పుస్తకానికి: యీనాటికీ దీని జీవశక్తి సమస్త నాగరిక ప్రపంచంలోని సమీకృత, సమరశీల కార్మికవర్గాన్ని ఉత్తేజపరుస్తూ, లక్ష్యపూరితం చేస్తున్నది.

మొదట ఫ్రాన్సులో ప్రారంభమై, ఆ తర్వాత పశ్చిమ యూరప్‌లోని యితర దేశాలకు వ్యాపించిన 1848 నాటి విప్లవం మార్క్సునూ, ఎంగెల్సునూ తమ స్వదేశానికి తిరిగి రప్పించింది. యిక్కడ రైనిష్ ప్రష్యాలో వాళ్లు కొలోన్‌లో ప్రచురింపబడే "నోయె రైనిషె సైటుంగ్" అనే ప్రజాతంత్ర పత్రిక బాధ్యతను చేతిలోకి తీసుకున్నారు. ఆ మిత్రులిద్దరూ రైనిష్ ప్రష్యాలోని విప్లవ ప్రజాతంత్ర ఆశల కన్నిటికీ ప్రాణాధారంగా వుండినారు. వాళ్లు ప్రజల ప్రయోజనాల కొరకూ, స్వేచ్ఛా ప్రయోజనాల కొరకూ చివరి వరకు ప్రతీపశక్తులతో పోరాడినారు. ప్రతీపశక్తులది పైచేయి అయిందని మనకు తెలుసు. "నోయె రైనిషె సైటుంగ్" అణచివేయబడింది. తన ప్రవాస కాలంలో తన ప్రష్యన్ పౌరసత్వం కోల్పోయిన మార్క్సు

---

* రూగె, ఆర్నాల్డ్ (1802–1880) – జర్మన్ పత్రికావ్యాసకర్త, యువ హేగె లియన్. – సం.

దేశంనుండి బహిష్కరింపబడినాడు; కానీ ఎంగెల్సు సాయుధ ప్రజా తిరుగుబాటులో పాల్గొని, స్వేచ్ఛ కొరకు మూడు యుద్ధాలలో పోరాటం చేసి, తిరుగుబాటుదార్లు ఓడిపోయిన తర్వాత, స్విట్జర్లెండు ద్వారా లండన్‌కు తప్పించుకొని పోయినాడు.

మార్క్సు కూడా అక్కడనే స్థిరపడినాడు. ఎంగెల్సు 1840 దశకంలో తాను పని చేసిన మాంచెస్టర్ వాణిజ్య సంస్థలో మళ్లీ త్వరలోనే గుమాస్తా అయి, తరువాత భాగస్థుడు అయినాడు. 1870 వరకు ఆయన మాంచెస్టర్‌లో నివసించినాడు. మార్క్సు లండన్‌లో వుండినాడు. కానీ వాళ్లిద్దరి మధ్య అత్యంత చురుకైన బౌద్ధిక సంబంధం కొనసాగడానికి అది అడ్డంకి కాలేదు: దాదాపు ప్రతిరోజూ వాళ్లు ఉత్తరాలు రాసుకున్నారు. యీ ఉత్తర ప్రత్యుత్తరాలలో ఆ యిద్దరు మిత్రులూ తమ అభిప్రాయాలనూ, జ్ఞానాన్నీ పరస్పరం యిచ్చి పుచ్చుకుంటూ, శాస్త్రీయ సోషలిజంను రూపొందించే కృషిలో సహకరించుకుంటూ వుండి నారు. 1870లో ఎంగెల్సు లండన్ చేరినాడు. భారమైన శ్రమతో నిండిన వాళ్ల సమష్టి బౌద్ధిక జీవితం 1883లో మార్క్సు మరణించిందాకా సాగింది. ఆ శ్రమ ఫలితమే, యిటు మార్క్సు వైపున, "పెట్టుబడి," అర్థశాస్త్రంమీద మన యుగంలోని అత్యంత మహ త్తరమైన రచన; అటు ఎంగెల్సు వైపున, చిన్నవీ, పెద్దవీ అనేక రచనలు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థయొక్క సంక్లిష్ట ఘటనల పరిశీలనమీద మార్క్సు కృషి చేసినాడు. ఎంగెల్సు సులభ శైలిలో, తరుచు వాదోపవాదాత్మకమైన రచనలలో, యింకా సాధారణమైన శాస్త్రీయ సమస్యలమీదా, చారిత్రక భౌతికవాద దృష్ట్యానూ, మార్క్సుయొక్క ఆర్థిక సిద్ధాంతం దృష్ట్యానూ భూతకాల, వర్తమాన కాలాలకు చెందిన వివిధ ఘటనలమీదా రాసినాడు. ఎంగెల్సు రాసిన యీ రచనలలో చెప్పవలసినవి యివి: డ్యూరింగ్‌కు* వ్యతిరేకంగా రాసిన వాదోపవాదా త్మక రచన (యిందులో తత్వశాస్త్రం, ప్రకృతిశాస్త్రం, సామాజికశాస్త్ర రంగాలలోని యెంతో ముఖ్యమయిన సమస్యలు పరిశీలింపబడినాయి,** "కుటుంబమూ, సొంత ఆస్తీ, రాజ్యాల పుట్టుక" (రష్యన్‌లోకి అనువదింపబడి, సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ప్రచురింపబడినది,

---

* డ్యూరింగ్, ఒయ్‌గెన్ (1833–1921) – జర్మన్ తత్వవేత్త, అర్థశాస్త్రజ్ఞుడు. తత్వశాస్త్రంమీదా, అర్థశాస్త్రంమీదా యితని గంద్రగోళపు అభిప్రాయాలను ఎంగెల్సు తన గ్రంథం "ఆంటీ డ్యూరింగ్. శాస్త్రవిజ్ఞానంలో ఒయ్‌గెన్ డ్యూరింగ్ విప్లవం"లో ఖండించినాడు. – సం.

** యిది అద్భుతంగా విషయ సంపన్నమూ, జ్ఞానదాయకమూ అయిన పుస్తకం. దురదృష్ట వశాత్తు, దీనిలో స్వల్ప భాగం మాత్రమే, సోషలిజం అభివృద్ధియొక్క చారిత్రక స్థూల చిత్రణ గలది, రష్యన్‌లోకి అనువదింపబడింది ("శాస్త్రీయ సోషలిజం అభివృద్ధి," రెండవ కూర్పు, జెనీవా, 1892). [లెనిన్ వివరణ.]

మూడవ కూర్పు, 1895), "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్" (జి. ప్లెహానొవ్‌యొక్క వివరణలతో కూడిన రష్యన్ అనువాదం, జెనీవా, 1892), రష్యన్ ప్రభుత్వ వైదేశిక విధానంమీద ఒక వ్యాసం (జెనీవా పత్రిక "సోత్సియాల్ డెమోక్రట్," సం. 1, 2లలో రష్యన్‌లోకి అనువదింపబడింది),* గృహ సమస్యమీద కొన్ని అద్భుతమైన వ్యాసాలు, చివరిది, రష్యా ఆర్థికాభివృద్ధిమీద చిన్నవైనా, చాలా విలువగల రెండు వ్యాసాలు ("రష్యామీద ఫ్రెడరిక్ ఎంగెల్స్," వేరా జసూలిచ్**చేత రష్యన్‌లోకి అనువదింపబడినది, జెనీవా, 1894). పెట్టుబడిమీద తన బ్రహ్మాండమైన రచనను ముగించకముందే మార్క్స్ మరణించినాడు. కానీ, స్థూలంగా అది అప్పటికే దాదాపు ముగిసింది. మార్క్స్ మరణానంతరం ఆయన మిత్రుడు ఎంగెల్సు "పెట్టుబడి" రెండవ, మూడవ భాగాలు తయారుచేసి ప్రచురించే భారమైన పనిని చేపట్టినాడు. ఆయన 1885లో రెండవ భాగమూ, 1894లో మూడవ భాగమూ ప్రచురించినాడు. (ఆయన మరణం మూలంగా నాల్గవ భాగం తయారు కాలేదు.)*** యీ రెండు భాగాలకూ బ్రహ్మాండమైన శ్రమ చేయవలసి వచ్చింది. ఆస్ట్రియన్ సోషల్ డెమోక్రట్ ఆడ్లర్ సముచితంగా యిలా అన్నాడు: "పెట్టుబడి" రెండవ, మూడవ భాగాలు ప్రచురించడం ద్వారా ఎంగెల్సు తన మిత్రుడైన మహామేధావికి అద్భుతమైన స్మృతి చిహ్నం నిర్మించినాడు. ఆ స్మృతి చిహ్నంమీద, తనకు అలాంటి ఉద్దేశం లేకపోయినా, తన పేరును మాసిపోకుండా చెక్కినాడు. నిజంగానే "పెట్టుబడి"యొక్క యీ రెండు భాగాలూ యిద్దరు వ్యక్తుల కృషి – మార్క్సుదీ, ఎంగెల్సుదీ. ప్రాచీన కథలలో హృదయస్పర్శి అయిన మైత్రికి అనేక ఉదాహరణలు వున్నాయి. ప్రాచీనులలోని అత్యంత హృదయస్పర్శి అయిన మానవ మైత్రీ కథలను మించిన పరస్పర సంబంధాలు గలిగి, పండితులూ, యోధులూ అయిన యిద్దరు వ్యక్తులచేత తన శాస్త్రం నిర్మింపబడిందని యూరపియన్ కార్మికవర్గం చెప్పకోవచ్చు. ఎంగెల్సు ఎల్లప్పుడూ – మొత్తంమీద న్యాయంగానే – మార్క్సు తర్వాతనే తన పేరు చెప్పకున్నాడు. "మార్క్సు జీవితకాలంలో నేను ఆయనకు తాళం వేసేవానిగా వుండి

* "సోత్సియాల్ డెమోక్రట్" – "కార్మిక విమోచన" బృందంచేత 1890నుండి 1892వరకు విదేశాలలో ప్రచురింపబడిన సాహిత్య, రాజకీయ పత్రిక. అన్నీ కలిసి నాలుగు సంపుటాలు వచ్చినాయి. లెనిన్ యిక్కడ "రష్యన్ జారిజంయొక్క వైదేశిక విధానం" అనే ఎంగెల్సు వ్యాసాన్ని ప్రస్తావిస్తున్నాడు. – సం.

** జసూలిచ్, వేరా ఇవానొవ్నా (1851–1919) – 19వ శతాబ్దం 80 దశకంలో మొట్టమొదటి రష్యన్ మార్క్సిస్టు గ్రూపు అయిన "శ్రమ విమోచన" గ్రూపు సభ్యురాలు. – సం.

*** "అదనపు విలువ సిద్ధాంతాలు" – "పెట్టుబడి" 4వ భాగం అని ఉద్దేశం. – సం.

నాను,'' అని ఎంగెల్సు ఒక పాత మిత్రునికి రాసినాడు. బతికి వుండిన మార్క్సుపట్ల ఆయన ప్రేమా, మరణించిన మార్క్సుపట్ల ఆయన భక్తీ అవధి లేనివి. యీ నిశ్చలమైన యోధునిలో, కచ్చితమైన ఆలోచనాపరునిలో ప్రేమార్ద్రమైన హృదయం వుండింది.

1848–1849 ఉద్యమం తర్వాత, ప్రవాసంలోని మార్క్సు, ఎంగెల్సులు శాస్త్ర విజ్ఞానంలో మాత్రమే నిమగ్నులు కాలేదు. 1864లో మార్క్సు "అంతర్జాతీయ కార్మిక సంఘా''న్ని స్థాపించి, ఒక దశాబ్దమంతా దానిని నడిపించినాడు. దాని వ్యవహారాలలో ఎంగెల్సు కూడా చురుకుగా పాల్గొన్నాడు. మార్క్సు దృష్టిలో సకల దేశాల కార్మికులనూ సమైక్యపరిచే "అంతర్జాతీయ కార్మిక సంఘం'' కృషి కార్మికవర్గ ఉద్యమ అభివృద్ధికి బ్రహ్మాండమైన ప్రాముఖ్యం గలిగినది. కానీ, డెబ్బైలలో "అంతర్జాతీయ కార్మిక సంఘం'' అంతమైన తర్వాత కూడా మార్క్సు ఎంగెల్సుల ఏకీకరణ పాత్ర ముగియలేదు. పైగా, కార్మికోద్యమంయొక్క ఆత్మిక నాయకులుగా వాళ్ల ప్రాముఖ్యం క్రమంగా పెరిగిందని చెప్పవచ్చు, యెందుకంటే ఉద్యమమే అవిచ్ఛిన్నంగా పెరిగింది గనుక. మార్క్సు మరణానంతరం ఎంగెల్సు ఒక్కడే యూరపియన్ సోషలిస్టుల సలహాదారుడుగానూ, నాయకుడుగానూ వుంటూ వుండినాడు. ప్రభుత్వ హింసలు వుండినప్పటికీ స్థిరమైన వేగంతో, అవిచ్ఛిన్నంగా బలపడిన జర్మన్ సోషలిస్టులూ, దీర్ఘంగా యోచించి వెనకముందులు చూసుకొని మొదటి అడుగులు వేయవలసి వుండిన స్పెయిన్, రుమేనియా, రష్యాలాంటి వెనకబడిన దేశాల ప్రతినిధులూ అందరూ సమంగా ఆయన సలహాలూ, సూచనలూ కోరినారు. వయోవృద్ధుడైన ఎంగెల్సుయొక్క జ్ఞాన, అనుభవ సంపదలను వాళ్లందరూ వాడుకున్నారు.

మార్క్సు ఎంగెల్సుల కిద్దరికీ రష్యన్ భాష తెలుసు, వాళ్లు రష్యన్ పుస్తకాలు చదివినారు, రష్యాపట్ల ఉత్సాహపూరితమైన ఆసక్తి కనబరచినారు, రష్యన్ విప్లవోద్యమాన్ని సానుభూతితో గమనిస్తూ, రష్యన్ విప్లవకారులతో సంబంధాలు పెట్టుకొని వుండినారు. సోషలిస్టులు కాకముందు వాళ్లిద్దరూ ప్రజాస్వామికవాదులు, రాజకీయ నిరంకుశత్వం పట్ల ప్రజాస్వామికమైన ద్వేషభావం వాళ్లలో అత్యంత బలీయంగా వుండింది. యీ ప్రత్యక్ష రాజకీయ భావం – రాజకీయ నిరంకుశత్వానికీ, ఆర్థిక పీడనకూ గల సంబంధాన్ని గురించిన ప్రగాఢ సిద్ధాంత అవగాహనతోనూ, విస్తారమైన జీవితానుభవంతోనూ కలిసి – మార్క్సు ఎంగెల్సులలో సరిగ్గా రాజకీయ దృక్పథంనుండే అసాధారణ ప్రతిస్పందన శక్తిని కలిగించింది. అందుకనే, కాకలుతీరిన యీ విప్లవకారుల హృదయాలలో, మహాశక్తివంతమైన జారిస్టు ప్రభుత్వంతో కొద్దిపాటి రష్యన్ విప్లవకారులు చేసే వీరోచిత పోరాటం అత్యంత సానుభూతిపూర్వకమైన ప్రతిధ్వనిని సృష్టించింది. మరోవైపున, అవాస్తవమైన ఆర్థిక సౌకర్యాల కోసం, రష్యన్ సోషలిస్టుల అత్యంత తక్షణ, ప్రముఖ కర్తవ్యంనుండి – అనగా రాజకీయ స్వాతంత్ర్యాన్ని గెలుచుకునే కర్తవ్యంనుండి – వైదొలగే ధోరణి సహజంగానే మార్క్సు

ఎంగెల్సుల దృష్టిలో అనుమానానికి గురి అయింది; అంతే గాక, అది సాంఘిక విప్లవానికి ప్రత్యక్ష ద్రోహంగా కూడా వాళ్లు పరిగణించినారు. "కార్మికవర్గ విమోచన కార్మికవర్గమే సాధించవలసిన పని" అని మార్క్సు ఎంగెల్సులు నిత్యం బోధించినారు. కానీ, తన ఆర్థిక విమోచనానికి పోరాడడానికి అది కొన్ని రాజకీయ హక్కులు గెలుచుకోవాలి. అంతేగాక, రష్యాలో రాజకీయ విప్లవం వస్తే, అది పశ్చిమ యూరపియన్ కార్మికోద్యమానికి కూడా ప్రచండమైన ప్రాముఖ్యం కలిగి వుంటుందని వాళ్లు స్పష్టంగా గమనించినారు. నిరంకుశత్వపు రష్యా మొత్తం యూరపియన్ ప్రగతి వ్యతిరేకతకు యెల్లప్పుడూ పెట్టని కోటగా వుండింది. చాల కాలంపాటు జర్మనీకీ ఫ్రాన్సుకూ మధ్య వైరుధ్యం సృష్టించిన 1870 యుద్ధ ఫలితంగా రష్యాకు లభించిన అసాధారణ అనుకూల అంతర్జాతీయ పరిస్థితి ప్రగతి వ్యతిరేక శక్తిగా నిరంకుశత్వపు రష్యాయొక్క ప్రాముఖ్యాన్ని పెంచడం మాత్రమే చేసింది. స్వతంత్ర రష్యా మాత్రమే — పోలులను గానీ, ఫిన్నులను గానీ, జర్మన్లను గానీ, ఆర్మీనియన్లను గానీ, మరి యే యితర చిన్న జాతిని గానీ పీడించవలసిన అవసరం గానీ, ఫ్రాన్సునూ జర్మనీనీ నిత్యం ఒకదానిమీదికి మరొకదానిని వుసికొల్పవలసిన అవసరం గానీ లేని రష్యా మాత్రమే — ఆధునిక యూరప్‌కు యుద్ధ భారంనుండి విముక్తి పొందే వీలు కలిగిస్తుంది, యూరప్‌లో ప్రగతి వ్యతిరేక శక్తుల నన్నిటినీ దుర్బలపరిచి, యూరపియన్ కార్మికవర్గ శక్తిని పెంచుతుంది. కనుక ఎంగెల్సు పశ్చిమ యూరప్ కార్మికోద్యమ అభివృద్ధి కొరకు కూడా రష్యాలో రాజకీయ స్వాతంత్ర్యాన్ని గాఢంగా కాంక్షించినాడు. ఆయన మరణం ద్వారా రష్యన్ విప్లవకారులు అత్యుత్తమ మిత్రుని కోల్పోయినారు.

కార్మికవర్గ మహా యోధుడూ, దేశికుడూ అయిన ఫ్రెడరిక్ ఎంగెల్సు స్మృతి చిర స్థాయిగా వుండుగాక!

రచన: శరదృతువు, 1895

## పాల్ లాఫార్గ్

# మార్క్స్ గురించిన స్మృతులు*

అన్నింటా అతను అసలైన మనిషి
అలాంటి వాణ్ణి మళ్లీ చూడబోను.
("హామ్లెట్," అంకం 1, రంగం 2.)

1

నేను కార్ల్ మార్క్స్‌ను మొదటిసారి 1865 ఫిబ్రవరిలో కలుసుకున్నాను. 1864 సెప్టెంబర్ 28న లండన్‌లోని సెంట్ మార్టిన్స్ హాల్‌లో జరిగిన ఒక సమావేశంలో, మొదటి ఇంటర్నేషనల్ స్థాపించబడింది. పారిస్‌లో వున్న శైశవ సంస్థయొక్క అభివృద్ధిని గురించిన వార్తను మార్క్స్‌కు అందజేయడానికి 1865 ఫిబ్రవరిలో నేను పారిస్‌నుండి లండన్‌కు పోయినాను. బూర్జువా రిపబ్లిక్‌లో యిప్పుడు సెనేటర్‌గా వున్న శ్రీ తొలెన్ నన్ను పరిచయం చేస్తూ జాబు రాసి యిచ్చినాడు.

నాకప్పుడు 24 యేండ్లు. ఆ మొదటి సందర్శనం నాలో కలిగించిన ప్రభావం నాకు జీవితాంతం జ్ఞాపకముంటుంది. మార్క్స్ అప్పుడు అనారోగ్యంగా వుండినాడు. ఆయన అప్పుడు "పెట్టుబడి" మొదటి భాగంమీద కృషి చేస్తూ వుండినాడు. అది తరువాత రెండేండ్లకు గానీ, అనగా 1867లో గానీ, ప్రచురింపబడలేదు. తన కృషిని పూర్తి చేయలేననే భయం వుండింది ఆయనకు, అందువలన యువకులు ఆయన్ను చూడడానికి వస్తే సంతో

---

* లాఫార్గ్, పాల్ (1842–1911) – ఫ్రెంచి, అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమంలో ప్రముఖ వ్యక్తి, మార్క్స్ ఎంగెల్సులకు సన్నిహిత మిత్రుడు, సహయోధుడు. మార్క్స్ కూతురు లౌరా భర్త. మార్క్స్ గురించిన యీ స్మృతులు 1890లో వెలువడినాయి. – సం.

షించేవాడు. "నా తరువాత కమ్యూనిస్టు ప్రచారం కొనసాగించేవాళ్లను నేను తయారు చేయాలి" అనేవాడు ఆయన.

శాస్త్రవిజ్ఞానంలోనూ, పౌర జీవితంలోనూ రెంటిలోనూ ఒకేసారి నాయకులుగా వుండగల అరుదైన వ్యక్తుల్లో ఒకడు కార్ల్ మార్క్స్; యీ రెండు పార్శ్వాలూ ఆయనలో యెంత గాఢంగా యేకమైనాయంటే, ఆయనలో విద్వాంసునీ, సోషలిస్టు యోధుని లెక్కలోకి తీసుకుంటే తప్ప ఆయనను అర్థం చేసుకోలేము.

యే శాస్త్రవిజ్ఞానమైనా శాస్త్రవిజ్ఞానం కొరకే అభివృద్ధి కావాలని మార్క్స్ అభిప్రాయపడినాడు. తన పరిశోధనలవల్ల యెలాంటి ఫలితాలు కలిగినప్పటికీ శాస్త్రజ్ఞుడు గందరగోళ పడకూడదు. కానీ పౌర జీవితంలో క్రియాత్మకంగా పాల్గొనకుండా గానీ, పఠనాగారంలోనో, పరిశోధనాలయంలోనో పండులో పురుగులాగ దాక్కొని, జీవితంనుండీ, సమకాలికుల రాజకీయ పోరాటంనుండీ యెడంగా నిలబడే శాస్త్రజ్ఞుడు కేవలం తన్ను తాను నీచపరుచుకుంటాడని కూడా మార్క్స్ అభిప్రాయపడినాడు.

"శాస్త్రవిజ్ఞానం స్వార్థపూరిత భోగం కారాదు" అనేవాడు ఆయన. "శాస్త్రవిజ్ఞాన కృషికి అంకితం కాగల అదృష్టవంతులు తమ జ్ఞానాన్ని మానవ సేవకు అర్పించడంలో ప్రథములుగా వుండాలి." "మానవుల కొరకు కృషి చేయడం" అనేది ఆయన అభిమాన నుడికారాల్లో ఒకటి.

శ్రామికవర్గాల బాధలపట్ల మార్క్స్‌కు ప్రగాఢమైన సానుభూతి వుండినప్పటికీ, ఆయనకు కమ్యూనిస్టు అభిప్రాయాలు కలిగించింది మమతాపూర్వక కారణాలు కాదు — చరిత్ర, అర్థశాస్త్రాల అధ్యయనమే. నిష్పాక్షికుడైన వ్యక్తి యెవడైనా, సొంత ప్రయోజనాల ప్రభావం లేకుండా వుంటే, వర్గ దురభిప్రాయాలతో కన్నులు మూసుకపోకుండా వుంటే, యిదే అభిప్రాయాలకు విధిగా వచ్చితీరాలని మార్క్స్ నమ్మినాడు.

కానీ, పూర్వచింతిత అభిప్రాయం యేదీ లేకుండా మానవ సమాజ ఆర్థిక రాజకీయ అభివృద్ధిని అధ్యయనం చేస్తూ, మార్క్స్ రచనలు చేసింది యెందుకంటే, తన పరిశోధన ఫలితాలను ప్రచారం చేసే ఉద్దేశమూ, ఆనాటి వరకు ఊహాస్వర్గ మేఘాలలో దారితప్పిన సోషలిస్టు ఉద్యమానికి కృతనిశ్చయంతో శాస్త్రీయ ప్రాతిపదికను చేకూర్చే ఉద్దేశమూ తప్ప మరేమీ కాదు. సమాజంమీద రాజకీయ, ఆర్థిక నాయకత్వం సాధించిన వెంటనే కమ్యూనిజం స్థాపించే చారిత్రక కర్తవ్యం గల కార్మికవర్గంయొక్క దిగ్విజయాన్ని పెంపొందించడానికి మాత్రమే ఆయన తన అభిప్రాయాలను ప్రచారం చేసినాడు....

మార్క్స్ తన కార్యకలాపాలను తన మాతృదేశానికి పరిమితం చేయలేదు. "నేను ప్రపంచ పౌరుణ్ణి; నేను యెక్కడ వుంటే అక్కడ కార్యశీలినిగా వుంటాను" అనేవాడు ఆయన. నిజంగానే, పరిస్థితులూ, రాజకీయ హింసలూ ఆయన్ను యే దేశానికి తరిమినా — ఫ్రాన్సుకు

గానీ, బెల్జియంకు గానీ, ఇంగ్లండుకు గానీ — అక్కడ అభివృద్ధి ఐన విప్లవ ఉద్యమాలలో ఆయన ప్రముఖ పాత్ర వహించినాడు.

అయినా, మేయ్ట్లండు పార్కు రోడ్డులోని ఆయన పఠనాగారంలో నేను మొదట చూసింది నిర్విరామ, నిరుపమాన సోషలిస్టు ఆందోళనకారుని కాదు — శాస్త్రవేత్తను. సోషలిస్టు భావనా నిధి అయిన ఆయన అభిప్రాయాలను తెలుసుకోడానికి నాగరిక ప్రపంచపు నలుమూలలనుండి పార్టీ కామ్రేడ్లు వచ్చే కేంద్రం ఆ పఠనాగారం. మార్క్సు ఆత్మిక జీవితంతో సన్నిహితత్వం కలగాలంటే, ముందు ఆ చరిత్రాత్మక గదిని గురించి తెలుసుకోవాలి.

ఆ గది రెండవ అంతస్తులో వుండింది. పార్కు వైపు వుండిన పెద్ద కిటికీ గుండా వెలుతురు వెల్లువలా వచ్చేది. కిటికీకి యెదురుగా, నిప్పుగూడుకి యిరు వైపులా వున్న గోడలకు ఆనుకొని వున్న బీరువాల నిండా పుస్తకాలూ, పైకప్పు దాకా పేర్చిన వార్తాపత్రికలూ, రాతప్రతులూ వుండినాయి. నిప్పుగూడుకి యెదురుగా, కిటికీకి ఒకవైపున, రెండు మేజాలమీద కాగితాలూ, పుస్తకాలూ వార్తాపత్రికలూ దొంతులు దొంతులుగా వుండినాయి. గది మధ్యలో, మంచి వెలుతురులో, ఒక చిన్న సాదా డెస్కు (మూడు అడుగుల పొడవూ రెండు అడుగుల వెడల్పూ గలది), ఒక కొయ్యి కుర్చీ వుండినాయి. కుర్చీకీ పుస్తకాల బీరువాకూ మధ్య, కిటికీకి యెదురుగా ఒక లెదర్ సోఫా వుండింది; అందులో మార్క్సు అప్పుడప్పుడు పండుకొని విశ్రాంతి తీసుకునేవాడు. నిప్పుగూడుమీద మరికొన్ని పుస్తకాలూ, సిగార్లూ, అగ్గిపుల్లలూ, సిగార్ పెట్టెలూ, పేపర్ వెయ్ట్లూ, మార్క్సు భార్యా బిడ్డలదీ, విల్‌హెల్మ్ వొల్ఫ్‌దీ,* ఫ్రెడరిక్ ఎంగెల్సుదీ ఫోటోలూ వుండినాయి.

మార్క్సు యెక్కువగా ధూమపానం చేసేవాడు. ఆయన ఒకసారి నాతో యిలా అన్నాడు: "యీ 'పెట్టుబడి'ని రాస్తూ తాగిన సిగార్ల ఖర్చు కూడా నాకు యీ గ్రంథం ద్వారా రాదు." ఆయన అగ్గిపుల్లలు మరీ యెక్కువగా ఖర్చు చేసేవాడు. పైపు, లేక సిగార్ పీల్చడం ఆయన తరచుగా మరిచిపోయి, దాన్ని తిరిగి అంటించుకోడానికి అగ్గిపెట్టెలు విపరీతంగా ఖాళీ చేసేవాడు.

ఆయన తన పుస్తకాలనూ, కాగితాలనూ యెవరూ మట్టసంగా — చిందరవందరగా అంటే బాగుంటుంది — పెట్టడానికి అంగీకరించేవాడు కాదు. పైకి మాత్రమే అవి చిందరవందరగా వున్నట్లు కనిపించేవి, నిజానికి ప్రతివొకటీ ఉద్దిష్ట స్థానంలో వుండేది — ఆయనకు అవసరమైన పుస్తకం గానీ, నోటుబుక్కు గానీ సులభంగా అందుకోడానికి వీలుగా. సంభాష

---

* వొల్ఫ్, విల్‌హెల్మ్ (1809–1864) — జర్మన్ శ్రామికవర్గ విప్లవకారుడు, మార్క్సు, ఎంగెల్సులకు మిత్రుడూ, సహయోధుడూ. మార్క్సు తన "పెట్టుబడి" గ్రంథాన్ని అతనికి అంకితం చేసినాడు. — సం.

ణల మధ్యలో కూడా తాను అప్పుడు చెప్పిన విషయాన్ని గానీ, అంకెను గానీ తరచుగా పుస్తకం యెత్తి అందులో చూపించేవాడు. ఆయనా, ఆయన పఠనాగారమూ ఏకఖండం: తన శరీరాంగాలు యెంతగా ఆయన అదుపులో వుండేవో, తన పుస్తకాలూ, కాగితాలూ అంతగా ఆయన అదుపులో వుండేవి.

పుస్తకాలు సర్ది పెట్టడంలోని బాహ్య సౌష్ఠవం ఆయనకు అక్కరలేదు: వేరు వేరు సైజుల సంపుటాలు ఒకదానిపక్కన ఒకటి నిలబెట్టబడి వుండేవి. వాటిని సైజును బట్టికాక, విషయాలను బట్టి ఒక పద్ధతిలో పెట్టుకునేవాడు. పుస్తకాలు ఆయనకు మానసిక పరికరాలు — భోగ వస్తువులు కాదు. "అవి నా బానిసలు, నా అభీష్టం ప్రకారం నాకు సేవచెయ్యాలి" అనేవాడు ఆయన. పుస్తకం సైజునూ, బైండింగునూ, కాగితం రకాన్నీ, టైపునూ ఆయన పట్టించుకునేవాడు కాదు. ఆయన పేజీల మూలలను మడిచేవాడు, మార్జిన్‌లో పెన్సిల్‌తో గుర్తులు పెట్టేవాడు, పంక్తులు పంక్తులే కింద గీతలు గీసేవాడు. పుస్తకాలమీద ఆయన యెప్పుడూ యేమీ రాసేవాడు కాదు; కానీ, ఒకోసారి, రచయిత మరీ అతిగా పోయినచోట, ఆశ్చర్యార్థకమో, ప్రశ్నార్థకమో పెట్టకుండా వుండలేకపోయేవాడు. ఆయన కిందిగీతల పద్ధతి యే పుస్తకంలో నైనా ఆయనకు కావలసిన ఘట్టం సులభంగా దొరికేటట్లు చేసేది. నోటుబుక్కులలో రాసుకున్నవీ, పుస్తకాలలో కింది గీతలు గీసిన ఘట్టాలూ అనేక సంవత్సరాల తర్వాత మళ్లీ చదివే అలవాటు ఆయనకు వుండేది; తద్వారా అవి ఆయన మనస్సులో తాజాగా వుండేవి. ఆయనకు అసాధారణంగా విశ్వసనీయమైన జ్ఞాపకశక్తి వుండింది. హేగెల్ సలహానను సరించి, తనకు తెలియని విదేశ భాషలోని కవిత్వాన్ని కంఠస్థం చేయడం ద్వారా, ఆయన ఆ జ్ఞాపకశక్తిని చిన్నప్పటినుండి పెంపొందించుకున్నాడు.

ఆయనకు హైనె,* గ్యోతే** కవిత్వం నోటికి వచ్చు, తన సంభాషణల్లో తరుచు వాళ్లను ఉటంకించేవాడు. యూరపియన్ భాషలన్నిటిలోనూ వున్న కావ్యాలు ఆయన ఎక్కువగా చదివేవాడు. ప్రతి సంవత్సరమూ ఆయన ఈస్కిలస్*** రచనలు మూల గ్రీకుభాషలో చదివేవాడు. ఈస్కిలస్‌నూ, షేక్‌స్పియర్‌నూ మానవజాతి ప్రసాదించిన అత్యంత ప్రతిభావంతులైన నాటకకర్తలుగా ఆయన పరిగణించినాడు. షేక్‌స్పియర్ పట్ల ఆయనకు గల గౌరవం

---

* హైనె, హైన్‌రిఖ్ (1797–1856) — ప్రఖ్యాత జర్మన్ కవి, పత్రికావ్యాసకర్త. — సం.

** గ్యోతే, యోహన్ వాల్ఫ్‌గాంగ్ (1749–1832) — గొప్ప జర్మన్ కవీ, ఆలోచనాశీలి. — సం.

*** ఈస్కిలస్ (క్రీ. పూ. 525–456) — సుప్రసిద్ధ పురాతన గ్రీక్ నాటకకర్త. — సం.

అపారమైనది. షేక్స్పియర్ రచనలు ఆయన సవివరంగా అధ్యయనం చేసినాడు. ఆయన నాటకాల్లోని అతి చిన్న పాత్ర కూడా ఆయనకు తెలుసు. మార్క్స్ కుటుంబ మంతటికీ ఆ యింగ్లీషు మహా నాటకకర్త ఒక ఆరాధ్య దైవం. మార్క్స్ ముగ్గురు కూతుర్లకూ ఆయన రచనల్లో అనేకం నోటికి వచ్చు. 1848 తర్వాత అప్పటికే తాను చదవగలిగిన యింగ్లీషు భాషలో తన జ్ఞానాన్ని పరిపూర్ణం చేసుకోవాలనుకొని, ఆయన షేక్స్పియర్ సొంత నుడికారాల నన్నిటినీ వెదకి వర్గీకరణ చేసినాడు. తనకు మంచి అభిప్రాయం వుండిన విలియం కాబెట్* వాదోపవాదాత్మక రచనలలో కొన్ని శ్రద్ధగా అధ్యయనం చేసినాడు. డాంటె,** రాబర్ట్ బర్న్స్*** ఆయన అభిమాన కవుల్లో చేరినవాళ్లు. ఆయన కూతుర్లు స్కాటిష్ కవి బర్న్స్ వ్యంగ్య రచనలూ, గేయ కథలూ చదివినా, పాడినా ఆయన యెంతో ఆనందంగా వినేవాడు.

విజ్ఞానశాస్త్రాల్లో పారంగతుడైన క్యువ్యే అలసట యెరగకుండా పనిచేసేవాడు. ఆయన పారిస్ మ్యూజియంకు డైరెక్టరు. ఆయనకు మ్యూజియంలో సొంత ఉపయోగార్థం కొన్ని గదులు వుండేవి. ప్రతి గదీ ఒకొక విషయంలో సాధన చేయడానికి ఉద్దేశింపబడి, అందుకు అవసరమైన పుస్తకాలూ, పరికరాలూ, శారీరక ఉపకరణాలూ కలిగి వుండేది. ఆయనకు ఒక రకమైన పనిలో అలసట కలిగితే, పక్క గదిలోకి వెళ్లి, మరొక రకమైన పనిలో నిమగ్నుడయ్యేవాడు. యిలా మానసిక వ్యాపకం మార్చడమే ఆయనకు విశ్రాంతి.

మార్క్స్ కూడా క్యువ్యే లాగే అలసట లేకుండా పని చేసేవాడు. కానీ ఆయనకు అనేక పఠనాగారాలు యేర్పరచుకునే స్తోమత లేదు. ఆయన గదిలో అటూ యిటూ నడవడం ద్వారా విశ్రాంతి తీసుకునేవాడు. వాకిలినుండి కిటికీ దాకా గది నేల అరిగిపోయింది — గడ్డి మైదానంలో కాలిబాటలాగా స్పష్టంగా కనపడుతూ.

అప్పుడప్పుడు ఆయన సోఫాలో పండుకొని యేదైనా నవల చదువుకునేవాడు; ఒకోసారి రెండు మూడు నవలలు చదువుకునేవాడు, ఒకటి మార్చి ఒకటి. డార్విన్ లాగా నవలలు ఆయనకు యిష్టం, పద్దెనిమిదవ శతాబ్ది నవలలు ఆయనకు యిష్టం, ముఖ్యంగా ఫీల్డింగ్****

---

* కాబెట్, విలియం (1762–1835) — యింగ్లీషు రాజకీయవేత్తా, పత్రికా రచయితా; యింగ్లీషు రాజకీయ వ్యవస్థలో ప్రజాతంత్రం కోసం పోరాడినాడు. — సం.

** డాంటె (1265–1321) — ఇటాలియన్ మహాకవి. ఈయన రచించిన "డివైన్ కామెడీ" అనే తాత్విక రాజకీయ గేయం ప్రపంచ ఖ్యాతి పొందింది. — సం.

*** బర్న్స్, రాబర్ట్ (1759–1796) — ప్రఖ్యాత స్కాటిష్ కవి. — సం.

**** ఫీల్డింగ్, హెన్రీ (1707–1754) — సుప్రసిద్ధ ఇంగ్లీషు నవలాకారుడు, నాటకకర్త. ఈయన రచించిన "టామ్ జోన్స్" అనే నవల ఆయనకు ఖ్యాతి గడించిన రచనలలో ఒకటి. — సం.

రాసిన "టామ్ జోన్స్." అంతకంటె ఆధునిక నవలాకారుల్లో ఆయన ఆసక్తిని యెక్కువగా చూరగొన్నవాళ్లు పాల్ డె కొక్, చార్లెస్ లెవెర్, అలెగ్జాండర్ డ్యూమా సీనియర్, వాల్టర్ స్కాట్;* స్కాట్ నవల "పాత మరణం" ఆయన దృష్టిలో గొప్ప కళాఖండం. సాహస కృత్యాలూ, హాస్యమూ గల కథలు ఆయనకు బాగా యిష్టం.

నవలాకారు లందరిలోనూ సెర్వాంటెస్‌నూ,** బాల్జాక్‌నూ*** మిన్నగా ఆయన యెంచేవాడు. "డాన్ క్విక్సట్"ను ఆయన మాసిపోతున్న మధ్యయుగ వీరత్వపు మహాకావ్యంగా పరిగణించినాడు — తలయెత్తుతున్న బూర్జువా ప్రపంచంలో ఆ వీరత్వపు సద్గుణాలకు వెక్కిరింతలూ, చీదరింపులూ యెదురైనాయి. ఆయన బాల్జాక్‌ను యెంతగా మెచ్చుకున్నాడంటే, తన అర్థ శాస్త్ర గ్రంథం ముగిసిన వెంటనే బాల్జాక్ బృహద్రచన "మానవ ప్రహసనం" మీద ఒక సమీక్ష రాయాలని కోరిక వుండింది. ఆయన దృష్టిలో బాల్జాక్ తన కాలపు చరిత్రకారుడు మాత్రమే కాదు, భవిష్యద్దర్శనంతో పాత్రలను సృష్టించినవాడు — ఆ పాత్రలు లూయీ ఫిలిప్ రాజు కాలంలో పిండ రూపంలో వుండి, అతని మరణం తర్వాత, మూడవ నెపోలియన్ కాలంలో గానీ పూర్తిగా వికసించలేదు.

మార్క్స్‌కు అన్ని యూరపియన్ భాషలూ చదవనువచ్చు; మూడు — జర్మన్, ఫ్రెంచి, ఇంగ్లీషు — భాషల్లో రాయనువచ్చు, భాషా ప్రవీణులు మెచ్చుకునేటట్లు. "జీవిత పోరా

---

* కొక్, పాల్ డె (1794–1871) — ప్రఖ్యాత ఫ్రెంచి నవలాకారుడు, నాటకకర్త, బూర్జువా జీవితాన్ని చిత్రించడంలో అందెవేసిన చెయ్యి.

లెవెర్, చార్లెస్ (1806–1872) — బ్రిటిషు నవలాకారుడు. ఐరిష్ జీవితాన్ని గురించి నవలలు రాశాడు.

డ్యూమా, అలెగ్జాండర్ (సీనియర్) (1802–1870) — సుప్రసిద్ధ ఫ్రెంచి నవలాకారుడు, నాటకకర్త. ఆయన రచించిన ప్రఖ్యాత నవలల్లో ఒకటి "త్రి మస్కెటీర్స్" ("ముగ్గురు యోధులు").

స్కాట్, వాల్టర్ (1771–1832) — స్కాటిష్ కవి, సుప్రసిద్ధ నవలాకారుడు, చరిత్రకారుడు. ఆయన రచించిన నవలలో "ఓల్డ్ మోర్టాలిటీ" ("పాత మరణం") ఒకటి. — సం.

** సెర్వాంటెస్ (1547–1616) — ప్రఖ్యాత స్పానిష్ నవలాకారుడు. ఆయన రచనలలో "డాన్ క్విక్సట్" అత్యంత ఖ్యాతినొందిన నవల. — సం.

*** బాల్జాక్ (1799–1850) — ప్రఖ్యాత ఫ్రెంచి నవలాకారుడు. సమకాలీన ఫ్రెంచి సమాజాన్ని చక్కగా చిత్రిస్తూ రచనలు చేశాడు. సామాజిక జీవితాన్ని వ్యక్తులను వర్ణించడంలో అందెవేసిన చెయ్యి. — సం.

టంలో పరాయి భాష ఒక ఆయుధం," అనే నానుడి పదేపదే చెప్పడం ఆయనకు యిష్టం.

భాషల విషయంలో ఆయన చాలా ప్రజ్ఞావంతుడు. ఆ ప్రజ్ఞ ఆయననుండి ఆయన కూతుర్లకు సంక్రమించింది. ఆయన 50 యేండ్ల వయస్సులో రష్యన్ భాష నేర్చుకోవడం ప్రారంభించినాడు. ఆయనకు తెలిసిన ఆధునిక, ప్రాచీన భాషల్లో దేనితోనూ ఆ భాషకు దగ్గర సంబంధం లేకపోయినా, ఆరు మాసాల్లో ఆయన ఆ భాష యెంత బాగా నేర్చుకున్నాడంటే, రష్యన్ కావ్యాలూ, నవలలూ, కథలూ చదివి ఆనందం పొందగలిగేవాడు; రష్యన్ రచయితల్లో పుష్కిన్, గోగోల్, శ్చెద్రీన్‌లు* ఆయనకు యిష్టం. అధికార దర్యాప్తు పత్రాలను చదవగలగడానికి ఆయన రష్యన్ భాష అధ్యయనం చేసినాడు — ఆ పత్రాలు రాజకీయ విషయాలు వెల్లడించినందున, రష్యన్ ప్రభుత్వం వాటిని మూసిపెట్టి వుంచింది. గాఢానురక్తులైన మిత్రులు ఆయనకు ఆ పత్రాలు సంపాయించినారు. పశ్చిమ యూరప్‌లో వాటిని చదివిన అర్థశాస్త్రవేత్త నిశ్చయంగా ఆయన ఒక్కడే.

కవులూ, నవలాకారులూ కాక, మార్క్సుకు బౌద్ధికంగా విశ్రాంతి తీసుకునే అసాధారణ పద్ధతి మరొకటి వుండింది — గణితశాస్త్రం. దానిమీద ఆయనకు ప్రత్యేకమైన అభిమానం. బీజగణితం ఆయనకు నైతిక ఆశ్వాసం కూడా సమకూర్చేది; ఘటనాపూర్ణమైన ఆయన జీవితంలోని అత్యంత బాధామయమైన తరుణాల్లో ఆయన బీజగణితంలో తల దాచుకునేవాడు. ఆయన భార్య చివరి జబ్బులో ఆయన తన మామూలు శాస్త్రీయ కృషిలో నిమగ్నుడు కాలేకపోయినాడు; భార్య బాధ ద్వారా తనకు కలిగిన హృదయభారాన్ని విదలించుకోడానికి గణితశాస్త్రంలో మునిగిపోవడ మొక్కటే ఆయన కుండిన మార్గం. ఆ నైతిక బాధా కాలంలో ఆయన ఇన్‌ఫినిటెసిమల్ కాల్క్యులస్‌మీద ఒక రచన చేసినాడు. నిపుణుల అభిప్రాయంలో అది గొప్ప శాస్త్రీయ విలువ గలది; ఆయన సమీకృత రచనల్లో అది ప్రచురింపబడుతుంది. ఉన్నత గణితశాస్త్రంలో అత్యంత తర్కబద్ధమూ, అత్యంత సులభమూ అయిన రూపంలో పరస్పరాత్మక గతి కనపడుతుందని ఆయన అభిప్రాయం. యే విజ్ఞానశాస్త్రమైనా గణిత శాస్త్రాన్ని ఉపయోగించుకోవడం నేర్చుకున్నదాకా నిజంగా అభివృద్ధి కానట్లే అని ఆయన అభిప్రాయపడినాడు.

మార్క్స్ గ్రంథాలయంలో వెయ్యికి పైగా గ్రంథాలు వుండినాయి. ఆయన జీవిత పర్యంతం సాగిన పరిశోధనా కాలంలో జాగ్రత్తగా సేకరించినవి అవి. అయినా అవి చాలక ఆయన

---

* పుష్కిన్, అలెక్సాండ్ర్ సెర్గేయెవిచ్ (1799–1837) — రష్యన్ మహా కవి.
గోగోల్, నికొలాయ్ వసీల్యెవిచ్ (1809–1852) — సుప్రసిద్ధ రష్యన్ రచయిత.
శ్చెద్రీన్, మిహాయీల్ ఎవ్‌గ్రాఫొవిచ్ (1826–1889) — ప్రసిద్ధ రష్యన్ రచయిత. — సం.

బ్రిటిష్ మ్యూజియంకు అనేక సంవత్సరాలు క్రమబద్ధంగా పోయేవాడు. ఆ మ్యూజియంలోని గ్రంథ సముదాయాన్ని ఆయన బాగా మెచ్చుకునేవాడు.

మార్క్సు వ్యతిరేకులు కూడా ఆయన విస్తృత, గంభీర పాండిత్యాన్ని ఒప్పుకోక తప్పేది కాదు — ఆయన ప్రత్యేక రంగమైన అర్థశాస్త్రంలోనే కాదు, చరిత్రలోనూ, తత్వశాస్త్రంలోనూ, సకల దేశాల సాహిత్యంలోనూ కూడా.

మార్క్సు రాత్రిపూట చాలా పొద్దు పోయిందాకా మేలుకునేవాడు. అయినప్పటికీ ఆయన ఉదయం యెనిమిది, తొమ్మిది గంటల మధ్య నిద్రలేచి, బ్లాక్ కాఫీ తాగి, వార్తా పత్రికలు చదివి, తరువాత తన పఠనాగారంలోకి పోయేవాడు. అక్కడ ఆయన తెల్లవారు జామున రెండు మూడు గంటలదాకా పనిచేసుకునేవాడు. భోజనానికి మాత్రమే పని ఆపేవాడు. వాతావరణం బాగుంటే, సాయంత్రం పూట హాంప్‌స్టెడ్ హీథ్ షికారు వెళ్లేవాడు. పగటిపూట అప్పుడప్పుడు సోఫాలో పండుకొని గంటో, రెండు గంటలో నిద్రపోయేవాడు. యవ్వనంలో ఆయన తరుచు రాత్రంతా మేలుకుని పనిచేసుకునేవాడు.

మార్క్సుకు పనిమీద అనురక్తి. పనిలో ఆయన యెంతగా లీనమైపోయేవాడంటే, తరుచుగా భోజనం మాట మరిచిపోయేవాడు. తరుచు ఆయన్ను యెన్నోసార్లు పిలిచిన తర్వాతగానీ భోజనశాలకు వచ్చేవాడు కాదు; చివరి ముద్ద తినీ తినకముందే మళ్లీ పఠనాగారంలో వుండేవాడు.

ఆయన చాలా కొద్దిగా తినేవాడు; ఆయనకు ఆకలి మాంద్యం కూడా వుండేది. దాన్ని అధిగమించడానికి ఆయన మసాలా వేసిన ఆహారం — యెండు మాంసమూ, యెండు చేపలూ, చేపగుడ్లూ, ఊరబెట్టిన కూరగాయలు — తినడం ద్వారా ప్రయత్నించేవాడు. ఆయన మెదడు చేసే అపారమైన పనివలన ఆయన కడుపు నష్టపడవలసి వచ్చింది. తన మెదడుకు ఆయన తన శరీర మంతటినీ బలి చేసినాడు. ఆలోచన అన్నిటికంటె గొప్ప ఆనందం ఆయనకు. ఆయన చిన్నప్పటి తత్వశాస్త్ర గురువైన హెగెల్ యొక్క యీ మాటలను ఆయన చెప్పడం నేను చాలా సార్లు విన్నాను: "దుష్టుని దురాలోచనకు కూడా స్వర్గంలోని అద్భుతాలను మించిన ఔన్నత్యమూ, ఉదాత్తతా వుంది."

యీ అసాధారణమైన జీవిత విధానాన్నీ, శక్తిని తోడేసే బౌద్ధిక కృషినీ భరించడానికి ఆయన దేహస్థితి మంచిదై వుండాలి. నిజానికి ఆయన దృఢ గాత్రుడు, మామూలు మనుషులకంటె యెత్తరి, విశాలమైన భుజాలూ, దృఢమైన వక్షమూ గలవాడు. సుసమన్వితమైన అవయవాలు గలవాడు — తరుచుగా యూదులకు వున్నట్లు, ఆయన శరీరంలో కిందిభాగంకంటె పైభాగం కాస్త పొడవుగా వున్నప్పటికీ. చిన్నప్పుడు ఆయన వ్యాయామం చేసివుంటే, చాలా బలిష్ఠమైన మనిషి అయ్యేవాడు. ఆయన క్రమబద్ధంగా అవలంబించిన శరీర పరిశ్రమ నడక ఒక్కటే: ఆయన గంటల తరబడి షికారు పోయేవాడు, లేదా కొండ లెక్కేవాడు, మాట్లా

డుతూ, ధూమపానం చేస్తూ, అయినా బొత్తిగా అలసిపోకుండా. ఆయన తన గదిలో నడుస్తూ పనిచేసుకునేవాడని కూడా అనవచ్చు — నడుస్తూ ఆలోచించినదాన్ని కాగితంమీద రాయడానికి మాత్రమే అప్పుడప్పుడు కాసేపు కూర్చునేవాడు. మాట్లాడేటప్పుడు అటూ యిటూ నడవడం ఆయనకు యిష్టం — యెప్పుడైనా ఒకసారి ఆవేశంగా వివరించేటప్పుడూ, సంభాషణ గంభీర మైనప్పుడూ ఆగేవాడు.

అనేక సంవత్సరాలు నేను ఆయనతో కలిసి హాంప్‌స్టెడ్ హీథ్‌లో సాయంత్రపు షికార్లు పోయినాను. యిలా గడ్డి మైదానాల్లో నడిచేటప్పుడే నేను అర్థశాస్త్రం నేర్చుకున్నాను. ''పెట్టుబడి'' మొదటి భాగంలో ఆయన రాసిందంతా అది రాసేటప్పుడు నాకు వివరించి నాడు, ఆ విషయం తాను గమనించకుండానే.

షికారునుండి యింటికి వస్తూనే, నేను విన్నదంతా సాధ్యమైన మేరకు యెప్పుడూ రాసుకునేవాణ్ణి. గంభీరమైన, జటిలమైన ఆయన వాదాలను అర్థం చేసుకోవడం మొదట్లో నాకు కష్టంగా వుండేది. దురదృష్టవశాత్తు ఆ అమూల్యమైన నోటుబుక్కులు నేను పోగొ ట్టుకున్నాను. పారిస్ కమ్యూన్ తర్వాత పారిస్‌లోనూ, బోర్డోలోనూ, పోలీసులు నా కాగితాలు శోధించి తగలబెట్టినారు.

నాకు అన్నిటికంటె విచారం కలిగేది ఒక సాయంత్రం నేను రాసుకున్న నోట్సు పోయి నందుకు. ఆనాడు మార్క్స్, తనకు విలక్షణమైనట్టి పుష్కలమైన ఉపపత్తులతోనూ, వాదాలతోనూ, మానవ సమాజాభివృద్ధిని గురించిన తన ఉజ్వలమైన సిద్ధాంతాన్ని వివరించి నాడు. నా కన్నులమీద పొరలు విడిపోయినట్లైంది. మొట్టమొదటి సారిగా ప్రపంచ చరిత్ర వెనక వున్న తర్కం నాకు స్పష్టంగా అవగతమైంది. పైకి చూడడానికి యెంతో పరస్పర విరుద్ధంగా కనపడే ఘటనలను — సమాజాభివృద్ధినీ, భావాల అభివృద్ధినీ — వాటి భౌతిక జన్మస్థానాల దాకా అనుసరించగలిగినాను. నాకు కన్నులు మిరుమిట్లుగొలిపినాయి. నా మనస్సుమీద ఆ ముద్ర చాలా యేండ్లు వుండింది.


మార్క్స్ సిద్ధాంతాల్లో అత్యంత గంభీర సుందరమైన ఆ సిద్ధాంతాన్ని నా దుర్బల శక్తి సామర్థ్యాలకు తగినట్లు నేను మాడ్రిడ్ సోషలిస్టులకు* వివరించినప్పుడు వాళ్లకూ అలాంటి ముద్రే కలిగింది. నిస్సందేహంగా ఆ సిద్ధాంతం మానవ మేధ విశదీకరించిన అత్యున్నత సిద్ధాంతాల్లో ఒకటి.

---

* పారిస్ కమ్యూన్ ఓడిపోయిన తర్వాత లాఫార్గ్ స్పెయిన్‌కు వలసపోయినాడు. మార్క్స్, మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలూ ఆయనకు అరాజకవాద బకూనినిస్టులతో పోరాడే పని అప్పగించినారు. — సం.



ట్రియర్ నగరం — మార్క్స్ పుట్టిన స్థానం



బార్మెన్ నగరం — ఎంగెల్సు పుట్టిన స్థానం

చరిత్రలోనివీ, ప్రకృతిశాస్త్రంలోనివీ, తాత్విక సిద్ధాంతాలలోనివీ వాస్తవాలు నమ్మ శక్యం గానంత విస్తారంగా ఆయన మెదడులో వుండినాయి. యేండ్ల తరబడి సాగిన బౌద్ధిక కృషిలో ఆయన సేకరించిన జ్ఞానాన్నీ, గమనించిన విషయాలనూ ఉపయోగించుకోవడంలో ఆయనకు అసాధారణమైన ప్రజ్ఞ వుండింది. యెప్పుడు యే విషయంమీద ఆయన్ను ప్రశ్న అడిగినా, అత్యంత సవివరమైన జవాబు మనకు లభించగలదు, దానివెంట సార్వత్రికంగా వర్తించే తాత్విక అభిప్రాయాలు కూడా యెప్పుడూ వుంటాయి. ఇంజను ఆడుతూ రేవులో నిలిచివుండే యుద్ధనౌకలాంటిది ఆయన మెదడు – యే ఆలోచనా రంగంలోకైనా సరే బయలుదేరడానికి అది యెప్పుడూ సిద్ధంగా వుంటుంది.

అచ్చెరువు కలిగించే శక్తీ, గొప్ప జ్ఞానమూ గల మేధ "పెట్టుబడి"లో కనపడుతుందనడంలో సందేహం లేదు. కానీ, నా దృష్టిలో, మార్క్సుతో సన్నిహిత పరిచయం గల వాళ్లందరి దృష్టిలో లాగే, "పెట్టుబడి"లో గానీ, ఆయన రచనల్లో దేనిలో గానీ, ఆయన మేధా పరిమాణం గానీ, జ్ఞాన విస్తృతి గానీ పూర్తిగా వెల్లడి కాదు. ఆయన రచనలకంటె ఆయన యెంతో గొప్పవాడు.

నేను మార్క్సుతో కలిసి పనిచేసినాను. ఆయన చెప్తూ వుంటే నేను రాసేవాణ్ణి అంతే. కాని దాని ద్వారా నాకు ఆయన ఆలోచనా విధానాన్నీ, రచనా విధానాన్నీ గమనించే అవకాశం లభించింది. పనిచేయడం ఆయనకు సులభం – అదే సమయంలో కష్టం కూడా. సులభం యెందుకంటే, సంబంధం గల వాస్తవాలనూ, వాదాలనూ వాటి పూర్ణత్వంలో గ్రహించడం ఆయన మెదడుకు కష్టం కాదు. కానీ, సరిగ్గా ఆ పూర్ణత్వమే ఆయన భావాల అభివ్యక్తిని దీర్ఘమైన, కష్టమైన పనిగా చేసేది.

ఉపరితలమే కాక, దాని కింద వున్నది కూడా ఆయన చూసేవాడు. వస్తువులోని అంగాలన్నిటినీ వాటి పరస్పర చర్యా ప్రతిచర్యలలో ఆయన పరిశీలించేవాడు, ప్రతి అంగాన్నీ విడదీసి, దాని అభివృద్ధి చరిత్రను గమనించేవాడు. తరువాత ఆయన వస్తువులనుండి పరిసరాలకు వెళ్లి, వస్తువుకూ పరిసరాలకూ మధ్య గల పరస్పర చర్యా ప్రతిచర్యలను గమనించేవాడు. ఆయన వస్తువుయొక్క పుట్టుకనూ, అది అనుభవించిన మార్పులనూ, పరిణామాలనూ, విప్లవాలనూ గమనించి, చివరకు దాని అత్యంత దూర ఫలితాల దాకా వెళ్లేవాడు. ఒక వస్తువును ఏకాకిగా, దానిపాటికి అదిగా, దాని కొరకు అదిగా, పరిసరాలనుండి విడిగా, ఆయన చూసేవాడు కాదు: నిత్య చలనంలో వున్న మహా జటిల ప్రపంచాన్ని ఆయన చూసేవాడు.

ఆ ప్రపంచాన్ని, దాని వివిధ, నిరంతర పరిణామాత్మక చర్యా ప్రతిచర్యలలో వెల్లడించడం ఆయన ఉద్దేశం. చూసినది నికరంగా వ్యక్తం చేయడం యెంతో కష్టమని ఫ్లొబెర్, గొన్‌కూర్‌ల ధోరణికి చెందిన సాహిత్యకారులు అంటుంటారు. కానీ వాళ్లు వ్యక్తం చేయదలచుకునే దంతా ఉపరితలం, వాళ్లకు కలిగే మానసిక ముద్ర. మార్క్సు కృషితో పోలిస్తే వాళ్ల సాహిత్య

కృషి పిల్లల ఆట: వాస్తవాన్ని గ్రహించడానికీ, తాను చూసిందీ, యితరులకు చూపించదల చుకున్నదీ వ్యక్తం చేయడానికీ అసాధారణమైన ఆలోచనా శక్తి అవసరం.

మార్క్సుకు తన రచనతో యెప్పుడూ తృప్తి లేదు — ఆయన యెప్పుడూ యేవో మెరుగులు దిద్దుతుండేవాడు, తాను చెప్పదలచుకున్న భావంకంటె తాను చెప్పింది యెప్పుడూ ఆయనకు తక్కువగానే కనపడేది....

మార్క్సుకు మహామేధావి లక్షణాలు రెండూ వుండినాయి: ఒక వస్తువును దాని పూరక భాగాలుగా విభజించడంలో ఆయనకు అసాధారణమైన ప్రజ్ఞ వుండింది; ఆ భాగాలను కలిపి ఆ వస్తువును, దాని సకల భిన్న అభివృద్ధి రూపాలతో సహా, పునర్నిర్మించడంలోనూ, వాటి పరస్పర ఆంతరంగిక సంబంధాలను ఆవిష్కరించడంలోనూ ఆయనది అందెవేసిన చేయి. ఆయన నిరూపణలు అభౌతిక భావాలు కాదు — ఆలోచించడం చేతకాని అర్థశాస్త్రవేత్తలు ఆయనమీద వేసే నింద అది. రేఖాగణిత శాస్త్రజ్ఞుడు తన నిర్వచనాలు చుట్టూ వున్న ప్రపంచంనుండి తీసుకుంటాడు గానీ, నిర్ణయాలు చేసేటప్పుడు వాస్తవాన్ని నిర్లక్ష్యం చేస్తాడు; మార్క్సుది అలాంటి పద్ధతి కాదు. "పెట్టుబడి" ఏకాకులుగా వున్న నిర్వచనాలు గానీ, సూత్రాలు గానీ యివ్వదు; అత్యంత సులభంగా జారిపోయే అర్థచ్ఛాయలనూ, కనుదప్పిపోయే స్థాయి భేదాలనూ వెల్లడి చేసే అత్యంత తీక్ష్ణ దృష్టి గల పరిశీలనా పరంపరను యిస్తుంది అది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం పెత్తనం చేసే సమాజంయొక్క సంపద అపారమైన సరుకుల సముదాయంగా వుంటుంది అనే సాదా వాస్తవంతో మార్క్సు ప్రారంభిస్తాడు. కనుక, గణిత భావంగా గాక, భౌతికమైన వస్తువుగా వుండే సరుకు పెట్టుబడిదారీ సంపద యొక్క మూలకం, లేక కణం. మార్క్సు యిప్పుడు సరుకును తీసుకుని, దాన్ని అటు తిప్పి, యిటు తిప్పి, లోపలిది పైకీ, పైది లోపలికీ తిప్పి, దాని రహస్యాలు ఒక్కొక్కటే బయటికి లాగుతాడు — ఆ రహస్యాలు అధికారిక అర్థశాస్త్రవేత్తలకు బొత్తిగా తెలియనివి, కాథలిక్ మతంలోని మొత్తం రహస్యాలకంటె అధిక సంఖ్యాకంగానూ, గంభీరంగానూ వున్నప్పటికీ. ఆ సరుకుయొక్క సకల పార్శ్వాలనూ పరిశీలించిన తర్వాత మార్క్సు మారకంలో ఆ సరుకుకు తన తోటి సరుకుతో గల సంబంధాలను పరిశీలిస్తాడు. తరువాత ఆయన దాని ఉత్పత్తినీ, దాని ఉత్పత్తికి కావలసిన చారిత్రక పూర్వావసరాలనూ పరిశీలించడానికి పోతాడు. సరుకులు ధరించే రూపాలను ఆయన పరిశీలించి, అవి ఒక రూపంనుండి మరొక రూపానికి యెలా మారేదీ, ఒక రూపంనుండి మరొక రూపం యెలా విధిగా ఉత్పన్న మయ్యేదీ వెల్లడిస్తాడు. ఘటనల అభివృద్ధిలోని తార్కిక గతిని ఆయన యెంత సర్వసమగ్రమైన నేర్పుతో వివరిస్తాడంటే, అదంతా ఆయన స్వకపోలకల్పన అని యెవరైనా అనుకోవచ్చు. కానీ అది వాస్తవంనుండి పుట్టింది, సరుకుయొక్క వాస్తవమైన పరస్పరాత్మకతకు ప్రతిబింబం.

మార్క్స్ తన పని విషయంలో మహా నిజాయితీ గలవాడు: ఒక వాస్తవం గానీ, ఒక అంకె గానీ, అత్యుత్తమ ప్రామాణికులు అంగీకరించింది తప్ప ఆయన యెప్పుడూ యివ్వ లేదు. ఆయన యెప్పుడూ వినికిడి సమాచారంతో తృప్తి పడలేదు; యెప్పుడూ దాని మూల స్థానానికి పోయేవాడు, పోవడం యెంత కష్టమైనా సరే. ఒక చిన్న వాస్తవాన్ని ధ్రువపరుచు కోడానికి ఆయన బ్రిటిష్ మ్యూజియంకు పోయి, అక్కడ పుస్తకాలు చూసేవాడు. ఆయన నిర్లక్ష్యం గలవాడని గానీ, కఠినమైన పరీక్షకు ఆగని వాస్తవాలమీద తన వాదాలను నిర్మించి నాడని గానీ ఆయన విమర్శకులు యెప్పుడూ రుజువు చేయలేకపోయినారు.

యెప్పుడూ మూలస్థానానికి పోయే అలవాటు వుండడంవలన ఆయన అప్రసిద్ధులైన రచయితలను చదివేవాడు. వాళ్లను ఆయన తప్ప యెవరూ ఉటంకించేవాళ్లు కాదు. "పెట్టు బడి"లో అప్రసిద్ధ రచయితల ఉల్లేఖనలు యెంతగా వున్నాయంటే, మార్క్స్ తన పాండి త్యం ప్రదర్శించుకుంటున్నాడని యెవరైనా అనుకోవచ్చు. ఆయనకు అలాంటి ఉద్దేశ మేమీ లేదు. "నేను చారిత్రక న్యాయం చేకూరుస్తాను, యెవరికి యివ్వవలసింది వాళ్లకు యిస్తాను" అన్నాడు ఆయన. ఒక భావాన్ని మొట్టమొదట వ్యక్తం చేసిన రచయితను, లేక అత్యంత నిర్దుష్టంగా సూత్రీకరించినవాణ్ని, అతను యెంత అనామకుడైనా, యెంత అప్రసిద్ధుడైనా, పేర్కొనడం తన ధర్మమని ఆయన భావించినాడు.

మార్క్స్ శాస్త్ర దృష్ట్యా యెంత చిత్తశుద్ధి గలవాడో, సాహిత్య దృష్ట్యా కూడా అంత చిత్తశుద్ధి గలవాడు. పరమ నిర్ధారణగా తెలిసిన విషయంమీద తప్ప ఆయన ఆధారపడక పోవడమే కాక, సమగ్రంగా అధ్యయనం చేసిందాకా ఆయన యే విషయం గురించీ మాట్లాడే వాడు కాదు. అత్యంత ఉచితమైన రూపం లభించిందాకా పదేపదే దిద్ది గానీ ఆయన తన రచన ఒకటి కూడా ప్రచురించలేదు. సమగ్రమైన సన్నాహాలు లేకుండా పదిమంది యెదుట పడడం ఆయన భరించలేని పని. చివరి మెరుగులు పెట్టకుండా తన రాతప్రతులు చూపిం చడం ఆయనకు మహా బాధ. యిది ఆయనకు యెంత తీవ్రమైన విషయమంటే, తన రాతప్రతు లను కాల్చనైనా కాలుస్తాను గానీ, అసంపూర్తిగా వదలిపెట్టనని ఆయన నాతో ఒకనాడు అన్నాడు.

ఆయన పని పద్ధతి ద్వారా ఆయనమీద పడిన కర్తవ్యాల పరిమాణాన్ని పాఠకుడు ఊహించు కోవడం సాధ్యంకాదు. "పెట్టుబడి"లో ఇంగ్లండులోని ఫాక్టరీ శాసనాలమీద యే యిరవై పేజీలో రాయడానికి, యింగ్లండు, స్కాట్లండుల కమిషన్‌లూ, ఫాక్టరీ ఇన్‌స్పెక్టర్లూ సమ ర్పించిన నివేదికలు గల "నీలం పుస్తకాల" గ్రంథాలయమంతా ఆయన చదివినాడు. ఆ పుస్త కాలు యీ అట్టనుండి ఆ అట్టదాకా చదివినాడనే విషయం వాటిలోని పెన్సిల్ గుర్తులను బట్టి తెలుసుకోవచ్చు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని అధ్యయనం చేయడానికి ఆ నివేదికలు అత్యంత ముఖ్యమైన, విలువైన పత్రాలని ఆయన భావించినాడు. వాటిని

తయారుచేసిన వాళ్లను గురించి ఆయనకు యెంత గొప్ప సదభిప్రాయం వుండిందంటే, "యింగ్లీషు ఫాక్టరీ ఇన్‌స్పెక్టర్లలాగ సామర్థ్యం కలిగి, పక్షపాతం లేకుండా, వ్యక్తులపట్ల గౌరవం కలిగి వున్నవాళ్లు" యూరప్‌లో మరే దేశంలోనైనా వుండడం సాధ్యమని ఆయన నమ్మలేకపోయినాడు. "పెట్టుబడి" ఉపోద్ఘాతంలో ఆయన వాళ్లను అంతఘనంగా ప్రస్తుతించినాడు.

యీ "నీలం పుస్తకాల"నుండి ఆయన యెంతో వాస్తవ సమాచారం తీసుకున్నాడు. పార్లమెంటు సభ్యులకు ఆ పుస్తకాలు యిస్తారు గానీ, వాళ్లలో చాలామంది వాటిని తుపాకి లక్ష్యాలుగా మాత్రమే ఉపయోగించుకుంటారు — యెన్ని పేజీలలో గుండు దూరుతుందో చూసి, దాన్నిబట్టి తుపాకి శక్తిని నిర్ణయించుకోడానికి. తక్కినవాళ్లు వాటిని తూకానికి అమ్ముతారు. అంతకంటె సముచితమైన పని వాళ్లు చేయలేరు; యెందుకంటే, తద్వారా మార్క్సు లాంగ్ ఏకర్‌లోని పాత పుస్తకాల వర్తకులనుండి వాటిని చౌకగా కొనగలిగేవాడు; పాత పుస్తకాల కొరకూ, పత్రాల కొరకూ ఆయన వాళ్ల దగ్గరికి మామూలుగా పోయేవాడు. ఇంగ్లీషు అధికారిక దర్యాప్తులను అందరికంటె యెక్కువగా ఉపయోగించుకొని, ప్రపంచ దృష్టికి తెచ్చినవాడు మార్క్సు అని ప్రొఫెసర్ బీస్లీ అన్నాడు. ఇంగ్లండులోని కార్మికవర్గ స్థితిమీద పుస్తకం రాయడంలో ఎంగెల్సు, 1845 ముందు "నీలం పుస్తకాల"నుండి చాలా పత్రాలు తీసుకున్న విషయం బీస్లీకి తెలియదు.

## 2

విద్వాంసుడైన మార్క్సు రొమ్ములోపల స్పందించే ఆ హృదయాన్ని తెలుసుకోవాలన్నా, ప్రేమించాలన్నా, ఆయన తన పుస్తకాలూ, నోటుబుక్కులూ మూసిన తర్వాత, తన కుటుంబంచేత పరివేష్టింపబడినప్పుడు చూడాలి, లేదా ఆదివారం సాయంత్రాలలో మిత్రుల మధ్య వున్నప్పుడు చూడాలి. అలాంటప్పుడు ఆయన సహచరులలో అందరికంటె ఆహ్లాదకరంగా వుండేవాడు, హాస్యానికీ, చమత్కారానికీ కొదవ లేకుండా, హృదయంనుండి సూటిగా వచ్చే నవ్వులతో. ఒక చమత్కార వాక్యం గానీ, ఒక సముచితమైన పోటు మాట గానీ విన్నప్పుడల్లా ఆయన దట్టమైన కనుబొమల కింది నల్లని కన్నులు ఆహ్లాదంతోనో, ద్వేషంతోనో మిలమిలలాడేవి.

పిల్లలపట్ల ప్రేమగా, మెత్తగా, దయగా వుండే తండ్రి ఆయన. "పిల్లలు వాళ్ల తలిదండ్రులకు శిక్షణ యివ్వాలి" అనేవాడు ఆయన. తన బిడ్డలతో ఆయనకు గల సంబంధాలలో పెత్తనం చలాయించే తండ్రి ధోరణి అణుమాత్రం కూడా వుండేది కాదు. వాళ్లకు ఆయన మీద అసాధారణమైన ప్రేమ వుండేది. వాళ్లకు ఆయన యెప్పుడూ ఉత్తరువులు యిచ్చేవాడు కాదు; తాను కోరినదాన్ని వాళ్లను పరోపకారంగా చేయమనేవాడు; లేదా తాను నిషేధించ

దలుచుకున్నదాన్ని చేయరాని పనిగా వాళ్ళకే అనిపించేటట్లు చేసేవాడు. కానీ ఆయన పిల్లలకంటె అణుకువైన పిల్లలు యే తండ్రికైనా అరుదుగా వుండగలరు. ఆయన బిడ్డలు ఆయన్ను మిత్రునిగా యెంచి, సహచరునిగా చూసేవాళ్ళు. వాళ్ళు ఆయన్ను "నాన్నా" అని పిలిచేవాళ్ళు కాదు, "మూర్" అనేవాళ్ళు – ఆయన కపిలవర్ణంవలనా, కారు నలుపు జుట్టూ, గడ్డమూవలనా వచ్చిన మారుపేరు అది. కమ్యూనిస్టు లీగు సభ్యులు ఆయన్ను "మార్క్స్ తండ్రీ" అని పిలిచేవాళ్ళు – 1848 ముందు, అనగా ఆయనకు ముప్పై యేండ్లు కూడా లేనప్పుడు....

మార్క్స్ తన పిల్లలతో ఆడుకుంటూ గంటలకొద్దీ గడిపేవాడు. పెద్ద నీళ్ళ గిన్నెలోని సముద్ర యుద్ధాలూ, కాగితపు నౌకాదళాలకు అగ్గిపెట్టడమూ వాళ్ళకు యింకా జ్ఞాపకం వుంది. ఆయన కాగితాల పడవలు చేసి, వాటికి అగ్గిపెట్టి, పిల్లలకు ఆనందం కలిగించేవాడు.

ఆదివారంనాడు ఆయన కూతుర్లు ఆయన్ను పనిచేసుకోనిచ్చేవాళ్ళు కాదు, ఆ రోజంతా ఆయన వాళ్ళ మనిషి. వాతావరణం బాగుంటే, కుటుంబమంతా గ్రామీణ ప్రాంతంలో షికారు పోయేవాళ్ళు. దారిలో యెక్కడైనా చిన్న హోటల్‌లో బ్రెడ్డూ, చీజూ, జింజర్ బీరూ తీసుకునేవాళ్ళు. ఆయన కూతుర్లు చిన్న పిల్లలుగా వున్నప్పుడు వాళ్ళకు అద్భుత కథలు అంతులేకుండా చెప్పుతూ, దీర్ఘమైన షికారు చిన్నదిగా కనిపించేటట్లు చేసేవాడు. ఆ కథలు ఆయన పోతూ పోతూ సృష్టించేవాడు, పోవలసిన దూరాన్ని బట్టి వాటిలోని ఘటనలను పెంచుతూ, ఆసక్తిని వృద్ధిచేస్తూ; పిల్లలు అలా ఆ కథలు వింటూ అలసట మరిచిపోయేవాళ్ళు.

ఆయనకు నిరుపమానమైన కల్పనాశక్తి వుండింది. ఆయన మొదటి సాహిత్య రచనలు పద్యాలు. మార్క్స్ సతీమణి తన భర్త యవ్వనంలో రాసిన కవిత్వాన్ని జాగ్రత్తగా దాచిపెట్టింది, కానీ యెప్పుడూ యెవరికీ చూపించలేదు. ఆయన కుటుంబం ఆయన్ను సాహిత్యకారుడో, ప్రొఫెసరో కావాలని కలలు గన్నారు; సోషలిస్టు ప్రచారంలోనూ, జర్మనీలో ఆనాడు నీచమైనదిగా యెంచబడిన అర్థశాస్త్రంలోనూ ఆయన నిమగ్నుడు కావడం ద్వారా తన్ను తాను కొంచెపరుచుకుంటున్నాడని వాళ్ళు అనుకున్నారు.

గ్రాఖీ* మీద ఒక నాటకం రాస్తానని మార్క్స్ తన కూతుర్లకు వాగ్దానం చేసినాడు. దురదృష్టవశాత్తూ ఆయన తన మాట నిలుపుకోలేకపోయినాడు. ప్రాచీన ప్రపంచపు వర్గ పోరాటంలోని ఆ భయంకరమైన మహోజ్వలమైన ఘటనను గురించి "వర్గపోరాట వీరుడు"గా పేరుకెక్కిన మార్క్స్ యెలా రాసేవాడో చూడడానికి ఆసక్తికరంగా వుండేది. ఆయన

---

* గ్రాఖీ, తిబేరియ్ (క్రీ. పూ. 163–133), గాయ్ (క్రీ. పూ. 153–121) – అన్నదమ్ములు; పురాతన రోమ్‌లో ప్రజా నాయకులు; బడా భూస్వామ్యాన్ని పరిమితం చేసేటట్టు వ్యవసాయ సంస్కరణల కోసం పోరాడినారు. – సం.

యెన్నో పథకాలు వేసుకున్నాడు, కానీ అవి నెరవేరలేదు. ఆయన రాయదలుచుకున్న పుస్తకాల్లో తర్కశాస్త్రం ఒకటి, మరొకటి తత్వశాస్త్ర చరిత్ర — విద్యార్థిదశలో ఆయనకు యిది అభిమాన విషయం. ఆయన తన సాహిత్య పథకాలన్నీ నిర్వహించి, తన మెదడులో నిక్షిప్తమైన సంపదలో కొంత భాగం ప్రపంచానికి చూపించాలంటే, నూరేండ్లు బతకవలసి వుండింది.

మార్క్స్ భార్య జీవితాంతం ఆయనకు నిజమైన, పరిపూర్ణమైన సహధర్మచారిణిగా వుండింది. చిన్నప్పుడే వాళ్లకు ఒకరికొకరు పరిచయం, యిద్దరూ కలిసి పెరిగినారు. ఎంగేజ్‌మెంటు నాటికి ఆయనకు పదేడేండ్లు మాత్రమే. 1843లో పెండ్లి అయిందాకా ఆ యువ జంట యేడు దీర్ఘ సంవత్సరాలు ఆగవలసి వచ్చింది. ఆ తరువాత వాళ్లు యెప్పుడూ విడిపోలేదు. మార్క్స్ సతీమణి మగనికంటె కొద్ది ముందుగా చనిపోయింది. ఆమె ఒక జర్మన్ ప్రభువర్గపు కుటుంబంలో పుట్టి పెరిగినా, ఆమెకు వున్న సమానతా భావం యెవరికీ వుండేది కాదు. సాంఘిక భేదాలు గానీ, వర్గీకరణలు గానీ ఆమెకు లేవు. ఆమె తన యింటిలోనూ, తన భోజనాల బల్లవద్దా కార్మిక దుస్తులలో వున్న కార్మికులను, జమీందార్లనూ, రాకుమారులనూ చూసినట్లే వినయంతోనూ, మన్ననతోనూ చూసేది. సకల దేశాలకూ చెందిన అనేక కార్మికులు ఆమె ఆతిథ్యం అనుభవించినారు. నా నమ్మకం యేమంటే, వాళ్లలో ఒక్కరూ కలలో కూడా ఊహించి వుండరు, తమకు ఆత్మ బంధువులాగ, అంత నిజమైన సుహృద్భావంతో ఆతిథ్యమిచ్చిన ఆ స్త్రీ ఆడ పార్శ్వంలో ఆర్గిల్ రాజవంశంనుండి వచ్చిందనీ, ఆమె సోదరుడు ప్రష్యా రాజువద్ద మంత్రి అనీ. ఆ విషయాలు ఆమెను యెప్పుడూ కలతపెట్టలేదు. తన కార్ల్‌ను అనుసరించడానికి ఆమె సర్వమూ త్యజించింది; పరమ బీదరికంలో కూడా అందుకు ఆమె పశ్చాత్తాపం చెందలేదు.

ఆమెకు స్పష్టమైన, సునిశితమైన మెదడు వుండింది. ఆమె తన మిత్రులకు రాసిన ఉత్తరాలు, సులభశైలిలో, పటిష్ఠమైన అసాధారణమైన మేధకు గొప్ప ఉదాహరణలు. మార్క్స్ సతీమణినుండి ఉత్తరం రావడం పండగలాంటిది. ఆమె ఉత్తరాలు కొన్ని యొహాన్ ఫిలిప్ బెకెర్* ప్రచురించినాడు. నిర్దాక్షిణ్యమైన వ్యంగ్య వ్యక్తి అయిన హైనె మార్క్స్ వెటకారానికి భయపడేవాడు; కానీ ఆయన భార్యయొక్క నిశితమైన, సున్నితమైన మెదడును అతను యెంతో మెచ్చుకునేవాడు. మార్క్స్ దంపతులు పారిస్‌లో వుండినప్పుడు వాళ్లను క్రమంగా దర్శించేవాళ్లలో అతను ఒకడు. మార్క్స్‌కు ఆయన భార్య తెలివిమీదా, విమర్శనా శక్తిమీదా యెంత గౌరవం వుండిందంటే, ఆయన తన రాత ప్రతులన్నీ ఆమెకు చూపించేవాడు,

---

* బెకెర్, యొహాన్ ఫిలిప్ (1809–1886) — జర్మన్, అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రసిద్ధ కార్యకర్త, మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు, వృత్తిరీత్యా బ్రష్షులు చేసేవాడు; మార్క్స్, ఎంగెల్సుల మిత్రుడూ, సహచరుడూ. — సం.

ఆమె అభి్రపాయానికి యెంతో విలువ యిచ్చేవాడు, యీ విషయం 1866లో ఆయనే నాకు చెప్పినాడు. అచ్చుకు పంపేముందు మగని రాత(పతులన్నీ ఆమె కాపీ చేసేది.

ఆమెకు చాలామంది పిల్లలు కలిగినారు. అందులో ముగ్గురు పసితనంలో మరణించి నారు, 1848 విప్లవం తర్వాత ఆ కుటుంబం కష్టదినాల్లో వుండినప్పుడు. ఆ కాలంలో వాళ్ళు లండన్‌లో (ప్రవాసులుగా జీవించేవాళ్ళు — సోహో స్క్వేర్‌లోని డీన్ (స్ట్రీట్‌లో రెండు చిన్న గదులలో. నాకు వాళ్ల కూతుర్లు ముగ్గురు మా(త్రం తెలుసు. 1865లో నేను మార్క్స్‌కు పరిచయం చేయబడినప్పుడు, ఆయన చిన్న కూతురు (యిప్పుడు ఎవెలింగ్ సతీమణి) ఉత్సాహపూరితమైన మనస్తత్వంతో ముచ్చటైన పిల్లగా వుండింది. మార్క్స్ అనేవాడు, యీ బిడ్డను కనేటప్పుడు తన భార్య పొరపాటు పడి, మగపిల్లవాణ్ణి కనవలసింది ఆడపిల్లను కనిందని. తక్కిన యిద్దరు కూతుర్లకూ ఆశ్చర్యకరమైనంత భేదం వుంది; కానీ ఆ భేదంలో ఒక సమన్వయం వుంది. పెద్దామెకు (తరువాత లోంగె సతీమణి), తం(డియొక్క పటిష్ఠమైన కపిల శరీరమూ, నల్లని కండ్లూ, కారునలుపు జుట్టూ వచ్చి నాయి. రెండవ ఆమెకు (తరువాత లాఫార్గ్ సతీమణి) గోధుమరంగు జుట్టూ, గులాబి శరీరచ్ఛాయా వచ్చినాయి; ఆమె చిక్కని ఉంగరాల జుట్టులో బంగారు తళుకు వుండేది, అస్తమించే సూర్యుని కిరణాలు మీద పడినట్లు: ఆమె తల్లి పోలిక.

మార్క్స్ కుటుంబంలో మరొక ముఖ్యమైన సభ్యురాలు లెన్‌హెన్ దెముత్. ఆమె రైతు కుటుంబంలో పుట్టింది, మార్క్స్ సతీమణికి పెండ్లి కావడానికి చాలా ముందే, ఆమె యింకా చిన్న పిల్లగా వున్నప్పుడే ఆమె కొలువులో చేరింది. తన యజమానురాలి పెండ్లి అయినప్పుడు, ఆమె ఆమెవెంట పోయి, సంపూర్ణంగా, ఆత్మ విస్మృతితో మార్క్స్ కుటుంబా నికి అంకితమైంది. తన యజమానురాలూ, ఆమె భర్తా యూరప్‌లో చేసిన సంచారాల న్నిటిలోనూ ఆమె వాళ్లవెంట వుండింది, వాళ్ల (ప్రవాస జీవితంలో కూడా పాలుపంచుకొనింది.

ఆ యింటి అధిదేవత ఆమె, అత్యంత కష్టమైన సన్నివేశాల్లో యెప్పుడూ ఆమె యేదో ఒక పరిష్కారం చూపించేది. ఆమె సువ్యవస్థా దృష్టివలనా, పొదుపరితనంవలనా, నేర్పు వలనా మార్క్స్ కుటుంబం కనీసం ముఖ్యమైన అవసరాల్లో యెప్పుడూ లేమిడి పడలేదు. ఆమెకు చేతకానిది లేదు: వంట చేసేది, యిల్లు చక్కబెట్టేది, పిల్లలకు బట్టలు తొడిగేది, వాళ్లకు గుడ్డలు కత్తిరించి, మార్క్స్ సతీమణితో కలిసి కుట్టేది. ఆమె పనిమనిషీ, పెత్తందారూ కూడా: ఆ యిల్లంతా నిర్వహించేది ఆమె.

పిల్లలు ఆమెను తల్లిలాగ (పేమించేవాళ్లు: వాళ్లపట్ల ఆమె కుండిన మాతృ భావన ఆమెకు మాతృ అధికారాన్ని యిచ్చింది. మార్క్స్ సతీమణి ఆమెను (ప్రాణమి(త్రురాలిగా యెం చేది, మార్క్స్ ఆమెను (ప్రత్యేకమైన మి(త్ర భావంతో చూసేవాడు. ఆమెతో ఆయన చద రంగం ఆడేవాడు, తరుచుగానే ఓడిపోయేవాడు.

లెన్‌హెన్, మార్క్స్ కుటుంబాన్ని గుడ్డిగా ప్రేమించేది: వాళ్లు యేమి చేసినా ఆమె దృష్టిలో మంచిదే, మంచిది కాకుండా వుండజాలదు. మార్క్స్‌ను విమర్శించే వాడెవడైనా ఆమె బారినుండి తప్పించుకోలేడు. మార్క్స్ కుటుంబ సభ్యులతో సన్నిహితత్వం పెంచుకున్న ప్రతి వొక్కరికీ ఆమె మాతృ రక్షణ కవచం లభించేది. మార్క్స్ కుటుంబమంతటినీ ఆమె దత్తు తీసుకున్నట్లు వుండేది. మార్క్స్ దంపతులు మరణించిన తర్వాత కూడా ఆమె బతికి, తన సేవలు ఎంగెల్సుకు బదిలీ చేసింది. చిన్నతనంనుండి ఆమెకు ఎంగెల్సు తెలుసు, మార్క్స్ కుటుంబంమీద వున్న అనురక్తిని ఆమె ఆయనకు విస్తరింపజేసింది.

ఎంగెల్సు మార్క్స్ కుటుంబంలో ఒక సభ్యుడనవచ్చు. మార్క్స్ బిడ్డలు ఆయన్ను తమ రెండవ తండ్రి అనేవాళ్లు. ఆయన మార్క్స్‌కు మరొక ఆత్మ. వీళ్ల రెండు పేర్లూ జర్మనీలో చాలాకాలం విడదీయబడకుండా వుండినాయి; అవి చరిత్రలో శాశ్వతంగా కలిసి వుంటాయి.

ప్రాచీన కవులు చిత్రించిన ఆదర్శ మైత్రికి మన కాలపు సజీవ రూపం మార్క్స్ ఎంగెల్సులు. తమ యవ్వనంనుండి వాళ్లు కలిసీ, ఒకరి కొకరు సమాంతరంగానూ అభివృద్ధి అయినారు; భావాలలోనూ, అనుభూతులలోనూ సన్నిహిత సహచరులుగా బతికినారు; ఒకే విప్లవ ఆందోళనలో పాలుపంచుకున్నారు; కలిసి జీవించగలిగినంత కాలం వాళ్లు కలిసి పని చేసినారు.

పరిస్థితులు వాళ్లను సుమారు యిరవై యేండ్ల పాటు విడదీయకుండా వుంటే, బహుశా వాళ్లు తమ జీవిత మంతా కలిసి పనిచేసేవాళ్లు. కానీ, 1848 విప్లవం ఓడిపోయిన తర్వాత, ఎంగెల్సు మాంచెస్టర్‌కు పోవలసి వచ్చింది, మార్క్స్ లండన్‌లో వుండిపోవలసి వచ్చింది. అయినప్పటికీ, దాదాపు రోజూ పరస్పరం ఉత్తరాలు రాసుకుంటూ, రాజకీయ, శాస్త్రీయ ఘటనలమీదా, తమ పనిని గురించీ తమ అభిప్రాయాలు తెలియబరుచుకుంటూ, వాళ్లు తమ సమష్టి బౌద్ధిక జీవితాన్ని కొనసాగించినారు. ఎంగెల్సు తన పనినుండి విముక్తి పొందగలిగిన వెంటనే, ఆలస్యం లేకుండా మాంచెస్టర్‌నుండి లండన్ చేరి, తన ప్రియమైన మార్క్స్‌కు కేవలం పది నిముషాల నడక దూరంలో తన యిల్లు యేర్పాటు చేసుకున్నాడు. 1870నుండి తన మిత్రుడు మరణించిందాకా ఆ యిద్దరూ ఒకరినొకరు చూసుకోని దినం లేదు, ఈయన యింట్లోనో, ఆయన యింట్లోనో.

ఎంగెల్సు మాంచెస్టర్‌నుండి వస్తున్నానని తెలిపిన రోజు మార్క్స్ కుటుంబానికి పర్వదినం. ఆయన రాకను గురించి చాలా రోజులు ముందుగా మాట్లాడుకున్నారు. ఆయన వచ్చే రోజున మార్క్స్ తహతహతో పనిచేసుకోలేకపోయినాడు. మిత్రులిద్దరూ తాగుతూ, పొగ తాగుతూ రాత్రంతా గడిపినారు, తాము పోయినసారి కలుసుకున్నప్పటినుండి జరిగిన సమస్తం గురించి మాట్లాడుకుంటూ.

మార్క్స్ అందరి అభిప్రాయాలకంటె యెక్కువగా ఎంగెల్సు అభిప్రాయాన్ని గౌరవించేవాడు, యెందుకంటే, ఎంగెల్సును ఆయన తన పనిలో సహకరించే సామర్థ్యం

గలవాడుగా యెంచినాడు. ఆయనకు ఎంగెల్సు ఒక మొత్తం శ్రోతల బృందం. ఎంగెల్సును ఒప్పించడానికీ, తన అభిప్రాయాలకు అనుగుణంగా మార్చడానికీ మార్క్సు యెంత ప్రయత్నమైనా చేసేవాడు. ఉదాహరణకు, ఆల్బిజేన్సుల రాజకీయ, మత యుద్ధాలకు* సంబంధించిన ఒక అప్రధానమైన విషయం గురించి (అది యేదో నాకు జ్ఞాపకం లేదు) ఎంగెల్సు అభిప్రాయాన్ని మార్చడానికి అవసరమైన ఒక వాస్తవాన్ని వెదకడానికి ఆయన మొత్తం సంపుటాలకు సంపుటాలే మళ్లీ మళ్లీ చదవడం నేను చూసినాను. ఎంగెల్సును తన అభిప్రాయానికి అనుగుణంగా తిప్పడం మార్క్సుకు ఒక దిగ్విజయం.

ఎంగెల్సును చూసి మార్క్సు గర్వపడేవాడు. ఎంగెల్సు కున్న నైతిక, బౌద్ధిక సద్గుణాలన్నీ యేకరువుపెట్టి నాకు చెప్పడం ఆయనకు సరదా. నన్ను ఎంగెల్సుకు పరిచయం చేయడానికి ఆయన ఒకసారి అదే పనిగా మాంచెస్టర్‌కు ప్రయాణం చేసినాడు.

ఎంగెల్సు బహుముఖ జ్ఞానాన్ని మార్క్సు మెచ్చుకునేవాడు. ఆయనకు యే చిన్న కీడైనా జరుగుతుందేమో అని గాభరా పడేవాడు.

"వేటలో ఆయన కేదైనా ప్రమాదం జరుగుతుందేమో అనే భయంతో నేను వణికి పోతాను. ఆయన యెంతో తొందరపాటు మనిషి; కళ్లెం వదులుచేసి పొలాలమీద దౌడుతీస్తూ పోతాడు, యేది అడ్డం వున్నా పక్కకు మళ్లకుండా" అని మార్క్సు నాతో అన్నాడు.

మార్క్సు అనురాగం గల భర్త, అనురాగం గల తండ్రి, అలాగే అనురాగం గల మిత్రుడు. తన భార్యా బిడ్డలలోనూ, హెలిన్, ఎంగెల్సులలోనూ ఆయన యోగ్యతకు తగిన ప్రేమపాత్రులు ఆయనకు లభించినారు.

## 3

తీవ్రవాద బూర్జువావర్గ నాయకుడుగా ప్రారంభించిన మార్క్సుయొక్క వ్యతిరేకత మరీ దృఢతరమైన వెంటనే బూర్జువావర్గంచేత ఆయన పరిత్యజింపబడినాడు; ఆయన సోషలిస్టు అయిన వెంటనే శత్రువుగా చూడబడినాడు. ఆయన్ను నిందించి, దూషించిన తర్వాత, యెరవేసి పట్టుకొని జర్మనీనుండి బహిష్కరించినారు. ఆ తరువాత ఆయనమీదా, ఆయన కృషిమీదా మౌనం వహించడమనే కుట్ర పన్నినారు. 1851 డిసెంబర్ 2 రాజకీయ

---

* ఆల్బిజేన్సుల యుద్ధాలు 1209నుండి 1229దాకా ఉత్తర ఫ్రాన్సు భూస్వాములు పోపుతో కలిసి దక్షిణ ఫ్రాన్స్ "మతద్రోహుల" మీద చేసిన యుద్ధాలు. ఆల్బి అనే పట్టణం ద్వారా ఆ "మతద్రోహు"లకు ఆల్బిజేన్సు లనే పేరు వచ్చింది. ఆల్బిజేన్సులు ఆడంబరపు కాథలిక్ మత కర్మకాండనూ, చర్చి అధికారులనూ వ్యతిరేకించినారు. యీ మత రూపంలో అది ఫ్యూడలిజంమీద దక్షిణాది పట్టణాల వర్తకుల, చేతిపనివాళ్ల నిరసనయొక్క వ్యక్తీకరణ. — సం.

కుట్ర*యొక్క కారణాల పర్యవసానాల నిజమైన స్వభావాన్ని గ్రహించి, వెల్లడించిన 1848వ సంవత్సరపు చరిత్రకారుడూ, రాజకీయవేత్తా మార్క్సు ఒక్కడే అని రుజువు చేసిన "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ" పూర్తిగా విస్మరింపబడింది. ఆ రచన సమకాలిక రచన అయినప్పటికీ ఒక్క బూర్జువా వార్తాపత్రిక కూడా దానిని ప్రస్తావించను కూడా లేదు.

"దారిద్ర్యపు తత్వశాస్త్రం"**కు జవాబుగా రాసిన "తత్వశాస్త్ర దారిద్ర్యం," అలాగే "అర్థశాస్త్ర విమర్శ" కూడా పై గ్రంథంలాగే విస్మరింపబడినాయి. యీ మౌనపు కుట్ర పదైదు సంవత్సరాలు సాగిన తర్వాత, మొదటి ఇంటర్నేషనలూ, "పెట్టుబడి" మొదటి భాగమూ ఆ కుట్రను భగ్నం చేసినాయి.

మార్క్సును విస్మరించడం యిక యెంత మాత్రమూ సాధ్యంగాకపోయింది: ఇంటర్నేషనల్ అభివృద్ధి చెంది, తన విజయాల యశోదీప్తితో ప్రపంచాన్ని నింపింది. మార్క్సు వెనకపాటున వుండి, యితర్లను పనిచేయనిచ్చినా, తెరవెనక వున్న మనిషి యెవరైందీ త్వరలోనే వెల్లడి అయింది.

జర్మనీలో సోషల్ డెమోక్రటిక్ పార్టీ స్థాపించబడింది; బిస్మార్క్*** దానిమీద దాడి చేసేముందు, దానిని మంచి చేసుకోడానికి ప్రయత్నించేటంత శక్తిగా అది తయారైంది. "పెట్టుబడి"ని కార్మిక ప్రజా దృష్టికి తేవడానికి, లాసాల్**** అనుచరుడైన ష్వైయ్‌త్సెర్ ఒక వ్యాస పరంపర ప్రచురించినాడు. ఆ వ్యాసాలను మార్క్సు బాగా మెచ్చుకున్నాడు. యోహాన్ ఫిలిప్ బెకర్ ప్రతిపాదనమీద, ఇంటర్నేషనల్ మహాసభ ఒక తీర్మానం చేసింది, సకల దేశాల సోషలిస్టుల దృష్టినీ "పెట్టుబడి"మీదికి, "కార్మికవర్గ బైబిల్" లాగ, మళ్లిస్తూ.

1871 మార్చి 18 తిరుగుబాటు తర్వాత — యిందులో ఇంటర్నేషనల్ కృషిని చూడడానికి

---

* 1851 డిసెంబర్ 2 తేదీన ఫ్రెంచి రిపబ్లిక్ ప్రెసిడెంట్ అయిన లూయీ బోనపార్టీ (మొదటి నెపోలియన్ భ్రాతీయుడు) రాజకీయ కుట్ర చేసినాడు; శాసనసభ రద్దు చేసి తాను శాశ్వత ప్రెసిడెంటుగా ప్రకటించుకొన్నాడు. 1852 డిసెంబర్ 2 తేదీన తాను చక్రవర్తిగా ప్రకటించుకొన్నాడు. — సం.

** "దారిద్ర్యపు తత్వశాస్త్రం" — ఫ్రెంచి పెటీబూర్జువా రచయిత అయిన ప్రూడన్ రచన. — సం.

*** 12 పేజిలో ఫుట్‌నోట్‌ను చూడండి.

**** లాసాల్, ఫెర్డినాండ్ (1825–1864) — పెటీబూర్జువా సోషలిస్టు. జర్మన్ కార్మికుల జనరల్ అసోసియేషన్ స్థాపకుడు (1863). లాసాల్ అనుచరుల సిద్ధాంతం, ఎత్తుగడలు, నిర్మాణ సూత్రాలు జర్మనీ కార్మికోద్యమంలో అవకాశవాద ధోరణిగా పరిణమించి మార్క్సు ఎంగెల్సు వాటిని ఖండించినారు. — సం.

ప్రజలు ప్రయత్నించినారు — కమ్యూన్ ఓడిపోయిన తర్వాత — సకల దేశాల బూర్జువా పత్రికలూ దీనిమీద వెళ్ళగక్కిన మంటనుండి దీన్ని సమర్థించే పనిని మొదటి ఇంటర్నేషనల్‌యొక్క జనరల్ కౌన్సిల్ చేపట్టింది — మార్క్స్ పేరు యావత్ప్రపంచానికీ తెలిసింది.

శాస్త్రీయ సోషలిజంయొక్క అత్యున్నత సిద్ధాంతకర్తగానూ, ప్రథమ అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమ నిర్మాతగానూ ఆయన గుర్తింపబడినాడు. "పెట్టుబడి" సకల దేశాల లోనూ సోషలిస్టులకు చేతి పుస్తకం అయింది. సకల సోషలిస్టు, కార్మికవర్గ పత్రికలూ దాని శాస్త్రీయ సిద్ధాంతాలను ప్రచారం చేసినాయి. న్యూయార్కులో జరిగిన ఒక పెద్ద సమ్మెలో కార్మికులలో ఓర్పు కలిగించడానికీ, వాళ్ల కోరికలు యెంత న్యాయమైనవైనవీ వాళ్లకు చూపించడానికీ, "పెట్టుబడి"లోనుండి కొన్ని భాగాలు కరపత్రాల రూపంలో ప్రచురింపబడినాయి.

"పెట్టుబడి" ప్రధాన యూరపియన్ భాషల్లోకి అనువదింపబడింది — రష్యన్, ఫ్రెంచి, యింగ్లీషు భాషల్లోకి. దాని భాగాలు కొన్ని జర్మన్, ఇటాలియన్, ఫ్రెంచి, స్పానిష్, డచ్ భాషల్లో ప్రచురింపబడినాయి. యూరప్, లేక అమెరికాలోని వ్యతిరేకులు దాని సిద్ధాంతాలను పూర్వపక్షం చేయడానికి ప్రయత్నించినప్పుడల్లా, మార్క్సిస్టులు వెంటనే సోషలిస్టు సమాధానం యిచ్చి వాళ్ల నోర్లు మూయించినారు. యీనాడు నిజంగా "పెట్టుబడి," ఇంటర్నేషనల్ మహాసభ చెప్పినట్లు, "కార్మికవర్గ బైబిల్."

అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమంలో మార్క్స్ పాలుపంచుకోవడంవలన ఆయన శాస్త్రీయ కృషికి కాలం తక్కువైంది. ఆయన భార్య మరణమూ, పెద్దకూతురు శ్రీమతి లోంగె మరణమూ కూడా దానిమీద ప్రతికూల ప్రభావం వేసినాయి.

మార్క్స్‌కు ఆయన భార్యమీద గల ప్రేమ ప్రగాఢమైనది, హార్దికమైనది. ఆమె అందం ఆయనకు గర్వ కారణం, సంతోష కారణం. విప్లవ సోషలిస్టుగా ఆయన గడిపిన ఘటనామయ జీవితంలో విధిగా ఉత్పన్నమైన కష్టాలను ఆమె సౌమ్యతా, భర్తృ తత్పరతా తేలిక పరిచినాయి.

జెన్నీ మార్క్స్ మృతికి కారణమైన వ్యాధి భర్త ఆయుస్సును కూడా కత్తిరించింది. ఆమె దీర్ఘ, బాధామయ అనారోగ్యంలో మార్క్స్ నిద్ర లేకా, వ్యాయామయం లేకా, శుభ్రమైన గాలి లేకా సొలసిపోయి, నైతికంగా అలసిపోయి, నిమోనియాకు గురిఅయినాడు; అదే చివరకు ఆయన్ను యెత్తుకపోయింది.

1881 డిసెంబర్ 2న శ్రీమతి మార్క్స్ మరణించింది, యెలా జీవించిందో అలాగే మరణించింది, కమ్యూనిస్టుగా, భౌతికవాదిగా. మరణమంటే ఆమెకు యే భయమూ లేదు. తన అంత్యం సమీపిస్తున్నట్లు ఆమె గ్రహించినప్పుడు యిలా అన్నది: "కార్ల్, నా శక్తి క్షీణిస్తున్నది!" ఆమె అర్థమయ్యేటట్లు మాట్లాడిన చివరి మాటలు యివి.

ఆమె హైగేట్ శ్మశానంలో, మత పవిత్రం కాని నేలలో, డిసెంబర్ 5న సమాధి చేయ బడింది. మార్క్స్ దంపతుల జీవితపు అలవాట్లకు అనుగుణంగా, ఆమె అంత్యక్రియలు పబ్లిక్ వ్యవహారం కాకుండా సకల జాగ్రత్తలూ తీసుకోబడినాయి; ఆమె అంతిమ విశ్రమ స్థానానికి కొద్దిమంది సన్నిహిత మిత్రులు మాత్రమే ఆమె వెంట పోయినారు. మార్క్స్ చిరకాల మిత్రుడు ఎంగెల్సు ఆమె సమాధివద్ద ఉపన్యాసం యిచ్చినాడు.

భార్య మరణం తర్వాత మార్క్స్ జీవితం శారీరక, నైతిక బాధల పరంపర అయింది. ఆ బాధలను ఆయన యెంతో ధైర్యంతో భరించినాడు. ఒక సంవత్సరం తర్వాత ఆయన పెద్ద కూతురు శ్రీమతి లోంగె హఠాత్తుగా మరణించడంతో అవి యింకా తీవ్రమైనాయి. ఆయన క్రుంగిపోయినాడు, మళ్లీ తేరుకోలేదు.

ఆయన అరవైనాలుగేండ్ల వయస్సులో, 1883 మార్చి 14న, తన డెస్కువద్ద మరణించినాడు.

# పాల్ లాఫార్గ్

## ఎంగెల్సు గురించిన స్మృతులు*

నాకు ఎంగెల్సు పరిచయం 1867లో అయింది, ''పెట్టుబడి'' మొదటి భాగం వెలువడిన సంవత్సరం.

''నీ విప్పుడు నాకు కాబోయే అల్లునివి గనుక, నిన్ను ఎంగెల్సుకు పరిచయం చేయాలి'' అన్నాడు మార్క్సు నాతో. అప్పుడు మేము మాంచెస్టర్‌కు బయలుదేరినాం.

ఎంగెల్సు మాంచెస్టర్ శివార్లలో, ఒక చిన్న యింటిలో భార్యతోనూ, ఆమె అక్క కూతురైన ఆరేడు యేండ్ల అమ్మాయితోనూ కలిసి జీవిస్తూ వుండినాడు. కొద్ది అడుగులు వేస్తే చాలు పొలాలలో పడతాం.

యూరప్ భూఖండంలో విప్లవం ఓడిపోయిన తర్వాత, మార్క్సులాగే, ఎంగెల్సు లండన్‌కు వలసపోయినాడు; మార్క్సులాగే ఆయన రాజకీయ ఆందోళనకూ, శాస్త్ర అధ్యయనానికీ అంకితం కావాలనుకున్నాడు.

కానీ, విప్లవ తుఫానులో మార్క్సు తన ఆస్తీ, తన భార్య ఆస్తీ పోగొట్టుకున్నాడు; ఎంగెల్సుకు కూడా బతకడానికి యేమీ లేదు. కనుక ఎంగెల్సు తన తండ్రి ఆహ్వానాన్ని అంగీకరించి, మాంచెస్టర్‌కు పోవలసి వచ్చింది. అక్కడ ఆయన తన తండ్రి వ్యాపారంలో తనకు 1843లో వుండిన గుమాస్తా పనిని మళ్లీ స్వీకరించినాడు. మార్క్సు ''న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్''కు వారం వారం పంపే రచనల ద్వారా తన కుటుంబానికి అత్యంత ముఖ్యమైన అవసరాలను కూడా సమకూర్చుకోలేకుండా వుండినాడు.

అప్పటినుండి 1870దాకా ఎంగెల్సుకు ద్వంద్వ జీవితం లాంటిది వుండింది. సెలవు రోజులు తప్ప వారం పొడుగునా ఉదయం 10నుండి సాయంత్రం 4 గంటల దాకా ఆయన వ్యాపారస్థుడు; ఆయన ప్రధాన వృత్తి వివిధ భాషల్లో తన సంస్థ ఉత్తర ప్రత్యుత్తరాలు

---

* ఈ వ్యాసం 1905లో ప్రచురింపబడింది. – సం.

నిర్వహించడమూ, ఎక్స్చేంజికి పోవడమూ. పట్టణం మధ్యలో ఆయనకు అధికారిక నివాస గృహం ఒకటి వుండింది; అక్కడ ఆయన తన వర్తక మిత్రులను కలుసుకుంటాడు. కానీ తన రాజకీయ, శాస్త్రజ్ఞ మిత్రులను కలుసుకునేది శివార్లలోని చిన్న యింటిలో. అందులో రసాయన శాస్త్రజ్ఞుడు షార్లెమ్మెర్, తదనంతర కాలంలో "పెట్టుబడి" మొదటి భాగాన్ని యింగ్లీషులోకి అనువదించిన శామ్యూల్ మూర్ వుండినారు.

ఆయన భార్య ఐరిష్ జాతీయురాలు, గాఢమైన దేశభక్తి గలది. మాంచెస్టర్‌లోని అనేక ఐరిష్‌వాళ్లతో ఆమెకు నిత్య సంబంధం వుండేది; వాళ్ల కుట్రలు ఆమెకు యెప్పుడూ బాగా తెలుస్తూ వుండేవి. సిన్‌ఫీనర్లు* ఒకరికంటె యెక్కువమందే ఎంగెల్సు యింటిలో ఆతిథ్యం పొందినారు. ఉరిశిక్ష చెప్పబడిన సిన్‌ఫీనర్లు ఉరికొయ్యవద్దకు పోయేటప్పుడు వాళ్లను తప్పించడానికి ప్రయత్నించిన వారి నాయకుడు ఎంగెల్సు భార్య మూలంగానే పోలీసులను తప్పించుకోగలిగినాడు. సిన్‌ఫీన్ ఉద్యమంలో ఆసక్తి కలిగిన ఎంగెల్సు ఐర్లండులో యింగ్లీషు పెత్తనంమీద ఒక చరిత్ర రాయడానికి పత్రాలు సేకరించినాడు; అందులో కొన్ని భాగాలు ఆయన రాసే వుంటాడు, అవి ఆయన కాగితాలలో వుండాలి.**

సాయంత్రం, వ్యాపార బానిసత్వం తర్వాత, ఆయన యింటికి పోయేవాడు, మళ్లీ స్వేచ్ఛా జీవిగా మాంచెస్టర్ ఉత్పత్తిదార్ల వ్యాపార జీవితంలోనే గాక, వాళ్ల విలాసాలలో కూడా ఆయన పాల్గొనేవాడు, వాళ్ల సమావేశాలకూ, వాళ్ల విందులకూ, వాళ్ల క్రీడలకూ హాజరౌతూ. ఆయన మంచి రౌతు; నక్కవేటకు ఆయనకు సొంత గుర్రం వుండింది. ప్రాచీన ఫ్యూడల్ సంప్రదాయం ప్రకారం చుట్టుపక్కల వున్న భూస్వాములూ, ప్రభువంశీకులూ జిల్లాలోని రౌతులకందరికీ ఆహ్వానాలు పంపినప్పుడు, ఆయన యెప్పుడూ వెళ్లకుండా వుండేవాడు కాదు. గుంతలూ, కంచెలూ, యితర ఆటంకాలూ దాటడంలో ఆయన యెప్పుడూ అగ్రగాముల్లో వుండేవాడు. "ఆయనకు ప్రమాదం జరిగిందని యేదో ఒక రోజున వినక తప్పదని నాకు యెప్పుడూ భయమే" అని మార్క్సు ఒకసారి నాతో అన్నాడు....

ఆయన బూర్జువా పరిచయస్థులకు ఆయన మరొక జీవితం గురించి తెలుసునో లేదో నాకు తెలియదు: యింగ్లీషు వాళ్లు మహా ఉచితానుచితజ్ఞులు, తమకు సంబంధం లేనిదానిలో యెంతో తక్కువ ఆసక్తి కనబరుస్తారు. యేమైనా, తాము రోజూ కలిసే ఆ మనిషిలోని ఉన్నత

---

* సిన్‌ఫీనర్లు – 19 శతాబ్ది 50–70 సంవత్సరాలలోని ఐరిష్ పెటీబూర్జువా విప్లవకారులు; వాళ్లు ఐర్లండ్ జాతీయ స్వాతంత్ర్యం కోసం పోరాడినారు. – సం.

** ఎంగెల్సు అసంపూర్ణ రాతప్రతి "ఐర్లండు చరిత్ర," దానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం కొంతా ప్రచురింపబడినాయి: "మార్క్సు ఎంగెల్సు పత్రాగారం," సంపుటం X, 1948, పుటలు 59–263. – సం.

బౌద్ధిక గుణాలను గురించి వాళ్లకు బొత్తిగా తెలియదు; యెందుకంటే ఎంగెల్సు వాళ్లముందర తన జ్ఞానం ప్రదర్శించలేదు. యూరప్‌లో అత్యంత విద్యావంతుడుగా మార్క్సుచేత గౌరవింపబడిన ఆయన, వాళ్ల దృష్టిలో మంచి ద్రాక్ష సారాయిని మెచ్చుకోగల ఖుషీ అయిన సహచరుడు మాత్రమే....

ఎంగెల్సు యువకుల సాహచర్యంమీద తనకు గల ప్రేమను యెన్నడూ కోల్పోలేదు. ఆయన శ్లాఘనీయమైన అతిథి సత్కారశీలి. లండన్ సోషలిస్టులూ, మాంచెస్టర్‌గుండా వెళ్లే కామ్రేడ్లూ అన్ని దేశాలనుండీ వలస వచ్చేవాళ్లూ అనేకమంది ఆదివారాలలో ఆయన యింట్లో ఉదారమైన ఆతిథ్యం స్వీకరించేవాళ్లు. వాళ్లందరూ యిండ్లకు వెళ్లిపోయేటప్పుడు తాము గడిపిన ఆ సాయంత్రాలకు యెంతో సంతోషించేవాళ్లు. ఆ సంతోషానికి మూలం యేదంటే ఎంగెల్సు ఉల్లాసమూ, చమత్కారమూ, యెడతెగని ఉత్సాహమూ.

* * *

ఎంగెల్సును గురించి ఆలోచిస్తే వెంటనే మార్క్సు జ్ఞాపకం వస్తాడు, అలాగే మార్క్సును గురించి ఆలోచిస్తే వెంటనే ఎంగెల్సు జ్ఞాపకం వస్తాడు: వాళ్ల జీవితాలు యెంత గాఢంగా అల్లుకపోయినాయంటే, అవి ఒకే ఒక జీవిత మైనట్లు కనపడతాయి. కాని వాళ్లిద్దరికీ యెంతో భిన్నమైన వ్యక్తిత్వాలు వుండినాయి; వాళ్ల పైకి చూడడానికే గాక, మనస్తత్వంలోనూ, స్వభావంలోనూ, ఆలోచించే పద్ధతిలోనూ, అనుభూతి చెందే పద్ధతిలోనూ పరస్పర భిన్నులు.

1842 నవంబర్ అంతంలో, ఎంగెల్సు "రైనిషె సైటుంగ్" పత్రిక సంపాదక కార్యాలయానికి పోయినప్పుడు, వాళ్లు ఒకరికొకరు పరిచయమైనారు. సెన్సార్‌వలన ఆ పత్రిక మూసివేయబడిన తర్వాత, మార్క్సు పెండ్లి చేసుకొని ఫ్రాన్సుకు పోయినాడు. 1844 సెప్టెంబర్‌లో ఎంగెల్సు కొద్ది రోజులపాటు పారిస్‌కు పోయి ఆయనవద్ద వుండినాడు. "దోయిచ్-ఫ్రాన్‌జోజిషె యార్‌భ్యూఖర్" పత్రికకు యిద్దరూ కలిసి పనిచేసినప్పటినుండి వాళ్లు పరస్పరం ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించినారు, మార్క్సు మరణం దాకా కొనసాగిన సహకార కృషి ఆనాటినుండే ప్రారంభమైంది—యీ విషయం ఎంగెల్సు తాను రాసిన మార్క్సు జీవితచరిత్రలో తెలిపినాడు. 1845 ఆదిలో, ప్రష్యన్ ప్రభుత్వ డిమాండుమీద, గిజో మంత్రిత్వ శాఖచేత మార్క్సు ఫ్రాన్సునుండి బహిష్కరింపబడి, బ్రస్సెల్స్‌కు పోయినాడు. తరువాత త్వరలోనే ఎంగెల్సు కూడా అక్కడికి పోయినాడు. 1848 విప్లవం మూలంగా "రైనిషె సైటుంగ్" పునరుద్ధరింపబడినప్పుడు* ఎంగెల్సు మార్క్సు పక్కన వుండినాడు; మార్క్సు గైరుహాజరు కావలసి వచ్చినప్పుడు ఆయనకు బదులు ఎంగెల్సు పత్రికను నడిపినాడు.

---

* ఇక్కడ ఉద్దేశింపబడింది "నోయె రైనిషె సైటుంగ్."—సం.

బౌద్ధిక ఆధిక్యం వుండినప్పటికీ, సంపాదకవర్గంలోని తన సహచరులమీద మార్క్సు కుండిన అధికారం ఎంగెల్సు యెన్నడూ సంపాయించుకోలేకపోయినాడు. ఆ సహచరులందరూ ప్రజ్ఞకూ, విప్లవ తత్వానికీ, పోరాటంలో సాహసానికీ పేరుపొందిన యువకులు. మార్క్సు ఒకసారి వియన్నాకు పోయి తిరిగివచ్చేటప్పటికి, ఎంగెల్సుకు పరిష్కరించడానికి సాధ్యం కాని వివాదాలచేత సంపాదకవర్గంలో చీలిక యేర్పడి వుండిందని మార్క్సు నాతో చెప్పినాడు; వైరుధ్యాలు యెంత తీవ్రంగా వుండినాయంటే, ద్వంద్వ యుద్ధం ద్వారా తప్ప అవి పరిష్కారం కావన్నట్లు కనిపించింది. శాంతి నెలకొల్పడానికి మార్క్సు తన నేర్పు అంతా వినియోగించ వలసి వచ్చింది.


మార్క్సు జన్మతః నాయకుడు. ఆయనతో సంబంధం వుండిన ప్రతి వొకరిమీదా ఆయన ప్రభావం పడేది. యీ విషయం ఒప్పుకోవడంలో ఎంగెల్సు ప్రథముడు. ఆయన నాతో చాలాసార్లు చెప్పినాడు: మార్క్సు తన యవ్వన దశనుండి తన స్పష్టతచేతా, దృఢ మైన వ్యక్తిత్వంచేతా ప్రతివారినీ ఆకర్షించినాడు, తన రంగానికి వెలుపల వున్న విషయాల్లో కూడా అందరి సంపూర్ణ విశ్వాసమూ చూరగొన్న నిజమైన నాయకుడు.

యీ విషయాన్ని యీ కింది ఘటన నిరూపిస్తుంది. "పెట్టుబడి" మొదటి భాగం అంకితం యివ్వబడిన వొల్ఫ్, మాంచెస్టర్‌లోని తన యింట్లో తీవ్రంగా జబ్బుపడినాడు. డాక్టర్లు ఆశ వదులుకున్నారు. కానీ ఎంగెల్సూ, ఆయన మిత్రులూ యీ దారుణమైన మాటను నమ్మక, మార్క్సును రమ్మని తంతి యివ్వాలనీ, ఆయన అభిప్రాయం తెలుసు కోవాలనీ ఏకగ్రీవంగా నిర్ణయించినారు....

ఎంగెల్సుకూ, మార్క్సుకూ కలిసి పనిచేసే అలవాటు వుండింది. ఎంగెల్సు కచ్చితత్వాన్ని అతిగా ఆరాధించేవాడైనప్పటికీ, మార్క్సుయొక్క నియమనిష్ఠకు ఒకోసారి విసుగుకునే వాడు; మార్క్సు డజన్ భిన్న విధాలుగా రుజువు చేయగలిగిందాకా ఒక వాక్యాన్ని కాగితంమీద పెట్టేవాడు కాదు.

1848 విప్లవం ఓడిన తర్వాత మిత్రులిద్దరూ విడిపోవలసి వచ్చింది. ఒకరు మాంచె స్టర్‌కు పోగా, మరొకరు లండన్‌లో వుండిపోయినారు. కానీ, వాళ్లు ఆలోచనలలో కలిసి జీవిం చడం మానుకోలేదు. వాళ్లు యిరవై సంవత్సరాల పొడవున ప్రతిరోజూ, లేక దాదాపు ప్రతిరోజూ, రాజకీయ ఘటనల గురించి తమ మనో ముద్రలూ, తమ ఆలోచనలూ, అధ్యయ నంలో తమ పురోగతీ ఉత్తరాల ద్వారా పరస్పరం తెలుపుకున్నారు. వాళ్ల ఉత్తరాలు భద్ర పరచబడినాయి.

వ్యాపార జీవిత భారంనుండి విముక్తి పొందగలిగిన మరుక్షణమే ఎంగెల్సు మాంచెస్టర్ వదలిపెట్టినాడు. ఆయన వెంటనే లండన్ చేరి, మార్క్సు నివసించే మేయ్‌ట్లండు పార్కు రోడ్డుకు పది నిముషాల నడక దూరంలో వున్న రీజెంట్స్ పార్క్ రోడ్డులో నివాసం యేర్ప



ఫ్రెడరిక్ ఎంగెల్సు (40ల సంవత్సరాలు)



మార్క్స్ అధ్యయనం చేసిన బ్రిటిష్ మ్యూజియంలో పఠనాగారం

రచుకున్నాడు. ప్రతి దినమూ, సుమారు ఒంటి గంటప్పుడు, ఆయన మార్క్సును చూడడానికి పోయేవాడు; వాతావరణం బాగా వుండి, మార్క్సుకు షికారు పోవాలని అనిపిస్తే, యిద్దరూ హాంప్‌స్టెడ్ హీథ్‌లో షికారు వెళ్ళేవాళ్ళు. లేకపోతే, ఒక గంటో, రెండు గంటలో మాట్లాడుకునేవాళ్ళు, మార్క్సు పఠనాగారంలో అటూ యిటూ నడుస్తూ, ఆ మూలనుండి యీ మూలకు ఒకరు అటూ, ఒకరు యిటూ.

ఆల్బిజేన్సులమీద ఒక చర్చ అనేక దినాలు సాగింది, అది నాకు జ్ఞాపకముంది. ఆ రోజుల్లో మార్క్సు మధ్యయుగంలో యూదు, క్రైస్తవ ఫినాన్షర్ల పాత్రను అధ్యయనం చేస్తూ వుండినాడు. తమ సమావేశాల మధ్యలో వాళ్ళు, ఒక సమైక్య అభిప్రాయానికి వచ్చే ఉద్దేశంతో, ఆ వివాద సమస్యను అధ్యయనం చేస్తూ వుండినారు. తమ ఆలోచనలమీదా, తమ కృషిమీదా వాళ్ళకు యే విమర్శా తమ పరస్పర విమర్శంత విలువైనది కాదు. వాళ్ళకు ఒకరిమీద ఒకరికి అత్యున్నతమైన అభిప్రాయం.

ఎంగెల్సు జ్ఞానంయొక్క సర్వవ్యాపకత్వాన్నీ, ఒక విషయంనుండి మరొక విషయానికి సులభంగా పోగల ఆయన మేధయొక్క అద్భుతమైన బహుముఖత్వాన్నీ మార్క్సు విసుగు లేకుండా మెచ్చుకునేవాడు. మార్క్సుయొక్క విశ్లేషణా సంశ్లేషణల పటుత్వాన్ని ఒప్పుకోవడం ఎంగెల్సుకు ఆనందం.

ఎంగెల్సు ఒకరోజు నాతో యిలా అన్నాడు: "సహజంగానే, పెట్టుబడిదారీ విధానం పనిచేసే పద్ధతిని గ్రహించడమూ, విశదపరచడమూ యెలాగైనా సాధింపబడేది; దాని అభివృద్ధి నియమాలు వెల్లడించబడి, వివరించబడేవి. కాని దానికి చాలాకాలం పట్టేది; అది అతుకుల బొంతగా వుండేది. ఆర్థిక అంశాలనన్నిటినీ వాటి పరస్పరాత్మక గమనంలో గమనించడానికీ, వాటి అభివృద్ధి దశలను ఆ అభివృద్ధిని నిర్ణయించే కారణాలతో ముడిపెట్టడానికీ, ఒకదాని నొకటి నిర్ణయించి, ఒకదాని కొకటి ఆధారంగా వుండే విడివిడి భాగాలు గల శాస్త్ర స్వూపంగా మొత్తం అర్థశాస్త్ర మహా సౌధాన్ని పునర్నిర్మించడానికీ మార్క్సుకొక్కనికే సామర్థ్యం వుండింది."

వాళ్ళ మనస్సులు మాత్రమే కాదు ఒకటిగా పనిచేసింది; వాళ్ళకు అత్యంత హార్దికమైన పరస్పర మైత్రి వుండింది: ఒకరినొకరు సంతోషపెట్టడం యెలాగని వాళ్ళు యెప్పుడూ ఆలోచించేవాళ్ళు. ఒకరిని చూసి ఒకరు గర్వించేవాళ్ళు. ఒకనాడు మార్క్సుకు తన హాంబర్గ్ ప్రచురణకర్తనుండి ఉత్తరం వచ్చింది — ఎంగెల్సు అతన్ని చూడడానికి పోయినాడట, అతను చూసినవాళ్ళలో కెల్ల అత్యంత మనోహరమైన వ్యక్తుల్లో ఎంగెల్సు ఒకడని అతను భావిస్తున్నాడట.

ఉత్తరం చదువుతూ మార్క్సు కేకవేసినాడు "ఫ్రెడ్ యెంత విద్వాంసుడో అంత ప్రసన్నుడని గుర్తించని మనిషి యెవడైనా వుంటే చూడాలని వుంది!"

డబ్బు, జ్ఞానం — ప్రతిదీ వాళ్లకు ఉమ్మడి సొత్తే. మార్క్స్ "న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్"కు విలేకరి అయినప్పుడు యింకా యింగ్లీషు నేర్చుకుంటూ వుండినాడు. ఆయన వ్యాసాలను ఎంగెల్సు అనువదించేవాడు, అవసరమైనప్పుడు రాసేవాడు కూడా. ఎంగెల్సు "ఆంటీ డ్యూరింగ్" తయారుచేసేటప్పుడు మార్క్స్ తాను చేస్తున్న పని నిలిపి, అర్థ శాస్త్రంమీద ఒక వ్యాసం రాసినాడు. అందులో కొంత భాగం వాడుకున్నానని ఎంగెల్సు బహిరంగంగా చెప్పినాడు.*

ఎంగెల్సు మైత్రి మార్క్స్ కుటుంబ మంతటికీ విస్తరించింది: మార్క్స్ బిడ్డలు ఆయనకు తన పిల్లలలాగే వుండినారు. వాళ్లు ఆయనను తమ రెండవ తండ్రి అనేవాళ్లు. యీ మైత్రి మార్క్స్ మరణానంతరం కూడా కొనసాగింది.

మార్క్స్ మరణించిన తర్వాత ఆయన రాత కాగితాలు చూసి, ఆయన వదలిపోయిన రచనలు ప్రచురించగలిగిన వాడు ఎంగెల్సు ఒక్కడే. "పెట్టుబడి" చివరి రెండు భాగాల పనికి తన్ను తాను పూర్తిగా అర్పించుకోడానికి ఆయన తన సార్వత్రిక శాస్త్రవిజ్ఞాన తత్వశాస్త్రాన్ని పక్కన పెట్టినాడు; దీనిమీద ఆయన పదేండ్లకు పైగా కృషి చేస్తూ వుండినాడు, దీని కొరకు ఆయన సకల విజ్ఞానశాస్త్రాలనూ, ఆనాటివరకూ వాటి పురోగతినీ పరిశీలించినాడు.**

అధ్యయనం కొరకే అధ్యయనం చేయడమంటే ఎంగెల్సుకు చాలా యిష్టం: ఆయనకు అన్ని రంగాలలోనూ ఆసక్తి. 1849లో, విప్లవం ఓడిపోయిన తర్వాత, ఆయన జినోవానుండి యింగ్లండుకు సముద్రంమీద పోయినాడు, స్విట్జర్లండునుండి ఫ్రాన్సుదాకా పోవడం ప్రమాద కరమని భావించినాడు. సముద్ర సమస్యలను పరిశీలించడానికి లభించిన యీ అవకాశం ద్వారా ఆయన లాభపడినాడు: ఆ ప్రయాణంలో ఆయన డైరీ పెట్టి, సూర్యుని స్థానమూ, గాలి వీచే దిశా, సముద్ర స్థితీ, వగైరాలలో వచ్చే మార్పులను డైరీలో రాసుకున్నాడు. యీ డైరీ ఆయన కాగితాలలో వుండితీరాలి; యెందుకంటే, విశ్రాంతి యెరక్కుండా, లేడికి లేచిందే పరుగన్నట్లు పనిచేసే ఎంగెల్సు ముసలమ్మలలాగా చాలా పద్ధతిగా వుండేవాడు. ఆయన ప్రతిదాన్నీ అత్యంత నిష్ఠాపూర్వకమైన కచ్చితత్వంతో యేర్పాటు చేసుకునేవాడు.

---

* "ఆంటీ డ్యూరింగ్"లో అర్థశాస్త్రం అనే భాగంలోని ప్రకరణం X మార్క్స్ రాసినాడు. "ఫోర్వర్ట్స్"లో అది మొదట ప్రచురించబడినప్పుడు, దానిలో ఎంగెల్సు కొన్ని కత్తిరింపులు చేసినాడు. కానీ 1894లో వెలువడిన "ఆంటీ డ్యూరింగ్" మూడవ కూర్పులో ఎంగెల్సు, మార్క్స్ రాతప్రతి ప్రకారం పూర్తి పాఠం యిచ్చినాడు. — సం.

** ఎంగెల్సు అసంపూర్ణ రాతప్రతి "ప్రకృతిలోని పరస్పరవాదం" 1925లో జర్మన్‌లోనూ, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీయొక్క మార్క్సిజం లెనినిజం ఇన్‌స్టిట్యూట్‌చేత రష్యన్‌లోనూ ప్రచురింపబడింది. — సం.

భాషాశాస్త్రమూ, మిలిటరీ శాస్త్రమూ ఆయన ప్రథమ అభిమాన విషయాలు. వాటిని ఆయన యెన్నడూ వదలిపెట్టలేదు, వాటి పురోగతికి యెప్పుడూ ఆయన వెనకబడలేదు. అత్యంత స్వల్పమైన విషయాలను కూడా ఆయన ముఖ్యమైనవిగా యెంచేవాడు. నాకు జ్ఞాపకం వుంది, స్పానిష్ భాషయొక్క ఉచ్చారణ నేర్చుకోడానికి, స్పెయిన్‌నుండి వచ్చిన తన మిత్రుడు మెసాతో కలిసి ఆయన స్పానిష్ కవితా సంకలనాన్ని బిగ్గరగా చదివినాడు.

యూరపియన్ భాషలను గురించి, చివరకు ప్రాంతీయ భాషాభేదాలను గురించి కూడా, ఆయన కుండిన జ్ఞానం నమ్మశక్యం కానిది.

పారిస్ కమ్యూన్ పతనం తర్వాత, స్పెయిన్‌లో ఇంటర్నేషనల్‌యొక్క జాతీయ కౌన్సిల్ సభ్యులను నేను కలుసుకున్నప్పుడు, వాళ్ల నాతో చెప్పినారు — స్పెయిన్‌కు వుండే జనరల్ కౌన్సిల్ సెక్రటరీ పదవికి నా స్థానంలో ఏంజెల్ అనే ఆయన వస్తున్నాడనీ, ఆయన కాస్టిలియన్ భాష స్వచ్ఛంగా రాస్తాడనీ. ఏంజెల్ అంటే స్పానిష్ పద్ధతిలో ఉచ్చరింపబడిన ఎంగెల్స్ పేరే. నేను లిస్బన్‌కు పోయినప్పుడు పోర్చుగల్‌కు వుండే నేషనల్ కౌన్సిల్ సెక్రటరీ అయిన ఫ్రాంషియా నాతో చెప్పినాడు, తనకు ఎంగెల్సునుండి నిర్దుష్టమైన పోర్చుగీస్ భాషలో ఉత్తరాలు వచ్చినాయని — యీ రెండు భాషల మధ్యా వున్న పోలికలనూ, స్వల్ప భేదాలనూ, వీటిలాగే ఆయనకు బాగా వచ్చిన ఇటాలియన్ భాషతో వీటికి గల పోలికలనూ, స్వల్ప భేదాలనూ గమనిస్తే, ఆయన సాధించింది మంచి విజయమని తెలుస్తుంది.

తాను యెవరికి జాబులు రాసినా వాళ్ల మాతృభాషలోనే రాయడం ఎంగెల్సుకు ఒక గర్వకారణంగా వుండింది: ఆయన లవ్రోవ్‌కు* రష్యన్‌లోనూ, ఫ్రెంచివాళ్లకు ఫ్రెంచిలోనూ, పోలులకు పోలిష్‌లోనూ, యిలాగే యితరులకూ రాసేవాడు. ప్రాంతీయ భాషా భేదాలలో రచనలు చదవడం ఆయనకు సరదా, మిలాన్ ప్రాంతీయ భాషలో బిన్యామి** రచించిన జనరంజక గ్రంథాలను ఆయన వెంటవెంటనే తెప్పించుకునేవాడు.

రామ్స్‌గేట్ బీచిలో మామూలు లండన్ ప్రజలు సరదాగా చూసే దృశ్యాల్లో ఒకటి యేమిటంటే, బ్రెజీలియన్ సైన్యాధికారి దుస్తుల్లో వుండిన గడ్డపు మరుగుజ్జు. ఎంగెల్సు అతనితో పోర్చుగీసు భాషలోనూ, తరువాత స్పానిష్ భాషలోనూ మాట్లాడినాడు, కానీ జవాబు రాలేదు. చివరకు ఆ "సైన్యాధికారి" ఒకటి రెండు మాటలు మాట్లాడినాడు.

---

* లవ్రోవ్, ప్యోత్ర్ లావ్రొవిచ్ (1823–1900) — రష్యన్ పత్రికా రచయిత, విప్లవకారి, మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు, 1871 పారిస్ కమ్యూన్ ఘటనలలో పాల్గొనినాడు. — సం.

** బిన్యామి, ఎన్రీకొ (1846–1921) — ఇటలీలోని జాతీయ స్వాతంత్ర్య ఉద్యమ సభ్యుడు; వ్యాస రచయిత, ప్రచురణకర్త. — సం.

"అరె! మీరు బ్రెజీలియన్ అనే మనిషి ఐరిష్‌వాడే!" అని ఎంగెల్సు ఆశ్చర్యపడి, అతన్ని అతని మాతృ ప్రాంతీయ భాషలో పలకరించినాడు.

పాపం అతను ఆనందంతో యేడ్చినాడు.

"ఎంగెల్సు యిరవై భాషల్లో తడబడతాడు" అని ఒక పారిస్ కమ్యూన్ ప్రవాసి అన్నాడు, ఆవేశంలో వున్నప్పుడు ఎంగెల్సు తడబడడంమీద చమత్కరిస్తూ.

ఎంగెల్సుకు యే రంగంమీదా నిర్లక్ష్యం లేదు.

తన జీవితపు చివరి సంవత్సరాలలో ఆయన ప్రసూతిమీద గ్రంథాలు చదవనారంభించి నాడు. యెందుకంటే, తన యింటిలో వుండిన ఫ్రైబెర్గర్ సతీమణి* వైద్యశాస్త్రంలో పరీక్షకు కూర్చోబోతున్నది.

"మానవజాతి కోసం కృషిచేయడం గురించి ఆలోచించకుండా" సరదా కోసం అనేక విషయాలమీద ఆయన తన శ్రద్ధను వెదజల్లుతున్నాడని మార్క్సు అయన్ను నిందించినాడు. ఎంగెల్సు యిలా యెదురు వడ్డించినాడు:

"'పెట్టుబడి' పూర్తికాకుండా అడ్డుపడుతున్న వ్యవసాయంమీది రష్యన్ ప్రచురణ లకు అగ్గి పెట్టడం నాకు ఆనందంగా వుంటుంది."

ఆ మధ్య మార్క్సు రష్యన్ భాష అధ్యయనం చేస్తూ వుండినాడు. యెందుకంటే, ఆయన పీటర్స్‌బుర్గ్ మిత్రులలో ఒకడైన డానియెల్‌సాన్ ఆయనకు వ్యవసాయ దర్యాప్తుల మీద అనేక లావుపాటి నివేదికలు పంపినాడు; అవి భయావహమైన పరిస్థితిని వెల్లడించినం దున, రష్యన్ ప్రభుత్వం వాటి ప్రచురణను నిషేధించి వుండింది.

తను చదివే విషయాన్ని అత్యంత స్వల్ప వివరాలతో సహా కరతలామలకం చేసుకున్నదాకా ఎంగెల్సు జ్ఞానదాహం తీరేది కాదు. ఆయన జ్ఞానంయొక్క విస్తృతినీ, వైవిధ్యాన్నీ కొంత గ్రహించినవాడు, ఆయన క్రియాత్మక జీవితాన్ని కూడా పరిగణిస్తే అచ్చెరువు కలుగుతుంది, పడకకుర్చీ శాస్త్రజ్ఞుని తత్వం యే కోశానా లేని ఎంగెల్సు తన తలలో అంత జ్ఞాన భాండారాన్ని యెలా వుంచుకోగలిగినాడా అని. యెంత విశ్వసనీయమో అంత సర్వవ్యాపకమూ అయిన జ్ఞాపకశక్తికీ, అధ్యయనంలో అసాధారణమైన వేగానికీ తోడుగా ఆయనలో అసాధారణమైనంత సులభ గ్రహణశక్తి కూడా వుండింది.

ఆయన వేగంగా, ప్రయత్నరహితంగా పనిచేసుకునేవాడు. విశాలమైన, మంచి వెలుతురు గల, గోడల పొడవునా పుస్తకాల బీరువాలు గల ఆయన రెండు పఠనాగారాలలో నేలమీద ఒక ముక్క కాగితం కూడా వుండేది కాదు; ఆయన పుస్తకాలన్నీ వాటి వాటి స్థానంలో వుండేవి,

---

* ఫ్రైబెర్గర్, లుయీజ, (కౌట్స్కీయా, లుయీజ) – ఆస్ట్రియన్ సోషలిస్టు, 1890నుండి ఎంగెల్సు సెక్రటరీగా ఉండేది. – సం.

డెస్కుమీద వున్న యే డజన్ పుస్తకాలో తప్ప. గదులు పండితుని పఠనాగారాలకంటె డ్రాయింగు రూముల్లాగా వుండేవి.

తన వేషం విషయంలో కూడా ఆయన అంత శ్రద్ధగానూ వుండేవాడు: యెల్లప్పుడూ నీటుగా అత్యంత పరిశుభ్రంగా వుండేవాడు, యెల్లప్పుడూ పెరేడుకు పోబోతున్నవానిలాగా కనిపించేవాడు, ప్రష్యన్ సైన్యంలో ఆయన ఐచ్ఛికంగా ఒక సంవత్సరం పాటు కొలువు చేసినప్పటిలాగ. నలగకుండా, మాయకుండా అవే బట్టలు అన్నాళ్లు వేసుకునేవాణ్ణి నేను మరె వ్వరినీ చూడలేదు. తన వ్యక్తిగత అవసరాలకు సంబంధించినంతవరకు ఆయన పొదుపుగా వుండేవాడు, పరమ అనివార్య మనుకున్న వాటికి మాత్రమే ఆయన డబ్బు ఖర్చుపెట్టేవాడు; కానీ పార్టీపట్లా, అవసరానికి తన్ను అర్థించే పార్టీ కామ్రేడ్లపట్లా ఆయన ఔదార్యం అవధు లెరుగనిది.

* * *

మొదటి ఇంటర్నేషనల్ స్థాపించబడినప్పుడు ఎంగెల్సు మాంచెస్టర్‌లో నివసిస్తూ వుండినాడు.... ఆయన ఇంటర్నేషనల్‌ను ఆర్థికంగా ఆదుకుంటూ, జనరల్ కౌన్సిల్ స్థాపించిన "కామన్‌వెల్త్" పత్రికకు రచనలు పంపేవాడు. ఫ్రాంకో ప్రష్యన్ యుద్ధం ప్రకటింపబడిన తర్వాత, ఆయన లండన్ చేరిన* తర్వాత, ఇంటర్నేషనల్ అభివృద్ధికి పట్టుదలతో అంకితమైనాడు, ఆయన యేపనికి పూనుకున్నా యెలాంటి పట్టుదల చూపిస్తాడో అలాంటి పట్టుదలతోనే.

యుద్ధంలో ఆయనకు మొదటి ఆసక్తి కలిగించింది మిలిటరీ యెత్తుగడలు: యిరు పక్షాల సైన్యాలనూ ఆయన దినదినమూ గమనిస్తూ, జర్మన్ సైనిక అధిష్ఠాన వర్గం తీసుకోబోయే చర్యలను ఒకటికంటె యెక్కువ సార్లే జోస్యం చెప్పినాడు; యిది "పాల్ మల్ గజెట్"**లో ఆయన రాసిన వ్యాసాల్లో రుజువైంది. నెపోలియన్ సైన్యం చుట్టుముట్టబడడం ఆయన సెడాన్ ముట్టడికి రెండు రోజులు ముందే జోస్యం చెప్పినాడు. అన్నట్లు, యీ జోస్యా లను గురించి యింగ్లీషు పత్రికల్లో చాలా ప్రస్తావనలు వచ్చినాయి. యీ జోస్యాలను బట్టి మార్క్సు పెద్ద కూతురు జెన్నీ ఆయనకు "జనరల్" అని బిరుదు యిచ్చింది. ఫ్రెంచి సామ్రాజ్య పతనం తర్వాత ఆయన కుండింది ఒక కోరిక మాత్రమే, ఒక ఆశ మాత్రమే: ఫ్రెంచి రిపబ్లిక్ విజయం. ఎంగెల్సుకూ, మార్క్సుకూ మాతృదేశం అనేది లేదు: వాళ్లిద్దరూ, మార్క్సు మాటల్లో చెప్పాలంటే, ప్రపంచ పౌరులు.

---

* 1870 సెప్టెంబర్‌లో. — సం.

** 1865నుండి లండన్‌లో ప్రచురింపబడిన పత్రిక. ఫ్రాంకో ప్రష్యన్ యుద్ధంమీద ఎంగెల్సు రాసిన వ్యాసాలు అందులో 1870 జూలైనుండి 1871 మార్చి దాకా వచ్చినాయి. — సం.

# విల్ హెల్మ్ లీబ్ క్నెఖ్ట్

## మార్క్స్ గురించిన స్మృతులు*

మార్క్స్‌ను గురించీ, ఆయనతో నాకు స్వయంగా గల సాహచర్యం గురించీ రాయమని వందల సార్లు నన్ను కోరినారు. ప్రతిసారీ నేను నిరాకరించినాను. మార్క్స్ మీద గౌరవంతోనే నేనలా చేసినాను. యెందుకంటే, బహుశా అది నా శక్తికి మించిన పని, లేదా నాకు వ్యవధి వుండేది కాదు. మరి, ఆయన్ను గురించి తొందరపాటుగా, అస్తవ్యస్తంగా రాస్తే, మార్క్స్ స్మృతికి అపచారం చేసినట్లౌతుంది.

కానీ ఒక ఆక్షేపణ వచ్చింది – స్థూలరేఖల్లో చిత్రిస్తే విధిగా అస్తవ్యస్తంగా గానీ, తొందరపాటుగా గానీ వుండనక్కర లేదని.

యెవరూ చెప్పజాలని విషయాలు నేను చెప్పగలననీ, మార్క్స్‌ను గురించి మరింత బాగా తెలుసుకోడానికీ మన కార్మికులకు గానీ, మన పార్టీకి గానీ తోడ్పడగల దేనికైనా నిర్వివాదమైన విలువ వుందనీ అన్నారు.

నాకు తెలిసినది లోపభూయిష్ఠంగా వుండక తప్పని మాట నిజమే అయినా, అది రాయడమూ, యేదీ రాయకపోవడమూ అన్న ప్రశ్న వచ్చినప్పుడు, నిశ్చయంగా మొదటిది తక్కువ హానికరం. చివరకు నేను అంగీకరింపవలసి వచ్చింది....

శాస్త్రజ్ఞుడూ, "రైనిషె సైటుంగ్" సంపాదకుడూ, "దోయిచ్-ఫ్రాన్‌జోజిషె యార్ బ్యూఖర్" సహస్థాపకుడూ, "కమ్యూనిస్టు ప్రణాళిక" సహరచయితా, "నోయె రైనిషె సైటుంగ్" సంపాదకుడూ, "పెట్టుబడి" సృష్టికర్తా అయిన మార్క్స్ ప్రజల మనిషి....

---

* లీబ్ క్నెఖ్ట్, విల్ హెల్మ్ (1826–1900) – జర్మన్, అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమంలో ప్రముఖ వ్యక్తి, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ స్థాపకులలోనూ నాయకులలోనూ ఒకడు; మార్క్స్, ఎంగెల్సుల మిత్రుడూ, సహచరుడూ. ఈ స్మృతులు 1896లో ప్రచురింపబడినాయి. – సం.

ఆ మార్క్సును గురించి రాయబూనుకోవడం తెలివిలేని సాహసవౌతుంది; యెందుకంటే, నా రోజువారీ అర్జంటు పనినుండి నేను సంపాయించుకోగల స్వల్ప వ్యవధిలో ఆ పని చేయడం సాధ్యం కాదు. దానికి గంభీరమైన శాస్త్ర కృషి అవసరం. అంత తీరిక నా కెక్కడిది?...

కనుక, యీ చిన్న రేఖాచిత్రంలో, శాస్త్రవిజ్ఞానానికీ, రాజకీయాలకూ చెందిన మార్క్సును గురించి సందర్భవశాత్తుగానూ, జీవిత కథాత్మకంగానూ మాత్రమే ప్రస్తావిస్తాను. మార్క్సుయొక్క ఆ పార్శ్వం అందరికీ స్పష్టంగా తెలుసు. నాకు స్వయంగా తెలిసిన మేరకు మార్క్సులోని మానవుని చూపించడానికి ప్రయత్నిస్తాను.

## 1

## మార్క్సుతో మొదటి పరిచయం

''స్వేచ్ఛాయుత స్విట్జర్లాండు''లో జైలునుండి విడువబడిన తర్వాత, నిర్బంధపు పాస్‌పోర్టుమీద ఫ్రాన్సు ద్వారా ప్రయాణంచేసి, నేను లండన్ చేరిన తర్వాత కొద్ది రోజులకు మార్క్సు పెద్ద కూతుర్లు యిద్దరితో నా స్నేహితం ప్రారంభమయింది — వాళ్లకు అప్పుడు ఒకరికి ఆరేండ్లూ, ఒకరికి యేడేండ్లూ.

లండన్ సమీపంలో ఒక చోట, గ్రీన్‌విచ్‌లోనో, హాంప్టన్ కోర్టులోనో జ్ఞాపకం లేదు, ''కమ్యూనిస్టు వర్కర్సు ఎడ్యుకేషనల్ సొసైటీ''* వారి వేసవి విందులో నేను మార్క్సు కుటుంబాన్ని కలుసుకున్నాను.

నేను అంతకుమునుపు ఎన్నడూ చూడని ''మార్క్సు తండ్రి'' నన్ను వెంటనే తీవ్రంగా పరిశీలించినాడు, నా కన్నులలోకి అన్వేషణా దృష్టితో చూస్తూ, నా తలను అంచనా వేస్తూ....

పరిశీలన నాకు అనుకూలంగా ముగిసింది, కారునలుపు జూలు గల ఆ సింహంలాంటి తలగల మనిషియొక్క చూపులు నేను భరించినాను.

తరువాత ఉల్లాసంగా సరదా అయిన కబుర్లు ప్రారంభమైనాయి. త్వరలోనే మేము సంకోచం లేని సంబరాల మధ్యలో వుండినాము; అందులో అందరికంటె సంకోచం లేనివాడు మార్క్సు. వెంటనే నేను మార్క్సు భార్యకూ, చిన్నతనంనుండి వాళ్ల యింట్లో విశ్వాసం గల గృహనిర్వాహకురాలుగా వుండిన లెన్‌హెన్‌కూ, పిల్లలకూ పరిచయం చేయబడినాను.

* ''ది జర్మన్ వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ'' 1840లో లండన్‌లో స్థాపించబడింది. 1847–1850లోనూ, అరవైలలోనూ, డెబ్బైలలోనూ మార్క్సుకు దానిమీద నిర్ణయాత్మక ప్రభావం వుండింది. — సం.

ఆ నాటినుండి నేను మార్క్సు యింటిలో సొంత మనిషిలాగ అయినాను; నేను వాళ్ల యింటికి పోకుండా ఒక్క రోజు కూడా గడవలేదు. వాళ్లు ఆక్స్‌ఫర్డ్ స్ట్రీట్ పక్కన డీన్ స్ట్రీట్‌లో వుండినారు. అనతి దూరంలో వుండిన చర్చి స్ట్రీట్‌లో నేను నివాసం యేర్పరచు కొన్నాను.

2

## మొదటి సంభాషణ

పైన చెప్పిన విందులో నేను మార్క్సును కలుసుకున్న మరుదినం ఆయనతో నా మొదటి దీర్ఘ సంభాషణ జరిగింది. సహజంగానే ఆ విందులో మేము గురుతరమైన సంభాషణ జరప లేకపోయినాం. మరుదినం నన్ను "వర్కర్సు ఎడ్యుకేషనల్ సొసైటీ" ఆవరణలోకి రమ్మని మార్క్సు ఆహ్వానించినాడు. అక్కడ ఎంగెల్సు కూడా బహుశా వుంటాడని అన్నాడు.

నిర్ణీత సమయానికి కాస్త ముందుగానే నేను అక్కడికి చేరినాను. మార్క్సు యింకా రాలేదు. కానీ నేను కొంతమంది పాత పరిచయస్థులను కలుసుకొని, ఆసక్తికరమైన సంభాషణలో మునిగివుండగా, మార్క్సు వచ్చి ఆప్యాయంగా పలకరిస్తూ భుజంమీద తట్టి, ఎంగెల్సు కింది అంతస్తులో "ప్రైవేటు పార్లర్"లో వున్నాడనీ, అక్కడ మేము ఏకాంతంగా వుండ వచ్చుననీ చెప్పినాడు.

"ప్రైవేటు పార్లర్" అంటే యేమిటో నాకు తెలియదు. అసలు పరీక్షా సమయం వచ్చిందనుకున్నాను. కానీ మార్క్సును నమ్ముకొని ఆయనవెంట పోయినాను. నామీద ఆయన వేసిన మానసిక ముద్ర నిన్నటిలాగే అనుకూలంగా వుంది. యితరులకు తనమీద విశ్వాసం కలిగేటట్లు చేయడంలో ఆయనకేదో వరంలాంటిది వుండింది. ఆయన నా చేతిలో తన చేయి దూర్చి, ఆ "ప్రైవేటు పార్లర్"లోకి నన్ను తీసుకపోయినాడు; ఎంగెల్సు ఘాటైన బీరుగల సిలవరి మగ్గుతో అప్పటికే అక్కడ కూర్చొని వుండి నాకు ఉత్సాహంగా స్వాగతం యిచ్చినాడు.

హుషారైన పనిమనిషి అమీకి వెంటనే ఉత్తరువు యివ్వబడింది, మా కేదైనా పానీయం తేవడానికి – భోజనం కూడా, యెందుకంటే ప్రవాసులమైన మాకు భోజనం ఒక ముఖ్య సమస్య; మేము కూర్చున్నాం, టేబుల్‌కు ఒక వైపున నేనూ, మరొక వైపున మార్క్సు, ఎంగెల్సూ. భారీ మహాగనీ టేబులూ, మెరిసే పానపాత్రలూ, నురుగు వచ్చే బీరూ, అసలైన యింగ్లీషు బీఫ్‌స్టీక్, దానికి అనుబంధంగా వుండే సమస్తమూ కనుచూపుమేరలో వుండడమూ,

మాకోసమే కనిపెట్టుకొని వున్న పొడవైన మట్టి పైపులూ మనిషికి యెంత హాయి అనిపిస్తా యంటే, డికెన్సు* పుస్తకానికి వేసిన బొమ్మలు నాకు జ్ఞాపకం వచ్చినాయి. కానీ యెంతైనా నాకు పరీక్ష జరగబోతున్నది! సరేలే పరీక్ష నెగ్గుతాను. సంభాషణ మరింత సరదాగా మారింది....

అంతకు ముందు సంవత్సరం జెనీవాలో ఎంగెల్సును కలుసుకోకముందు నాకు మార్క్సుతో గానీ, ఎంగెల్సుతో గానీ యెలాంటి వ్యక్తిగత సాహచర్యమూ లేదు. వాళ్ల రచనలు నాకు తెలిసిన వల్లా పారిస్ పత్రిక "సంవత్సర పత్రిక"లో మార్క్సు వ్యాసాలూ, మార్క్సు గ్రంథం "తత్వశాస్త్ర దారిద్ర్యం," ఎంగెల్సు గ్రంథం "ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి." 1846 నుండి కమ్యూనిస్టుగా వుండిన నేను, రైహ్ రాజ్యాంగం కొరకు జరిగిన ఉద్యమం** తర్వాత ఎంగెల్సును కలుసుకోడానికి స్వల్పకాలం ముందు మాత్రమే "కమ్యూనిస్టు ప్రణాళిక" సంపాయించుకోగలిగినాను — కానీ దాన్ని గురించి అంతకుముందే వినివుండిన మాటా, అందు లోని విషయాలు తెలిసివుండిన మాటా నిజమే. యిక "నోయె రైనిషె సైటుంగ్" అంటే, దాన్ని చూడడం యెప్పుడూ పడలేదు — అది వెలువడిన పదకొండు నెలలలోనూ నేను విదే శాలలోనైనా వుండినాను, లేక జైలులోనైనా వుండినాను, లేక తిరుగుబాటు స్వచ్ఛంద సైని కునిగా అరాజకపు అల్లకల్లోలపు జీవితం గడుపుతూ వుండినాను.

నాలో పెటీబూర్జువా "ప్రజాస్వామ్యమూ," "దక్షిణ జర్మన్ నిబ్బరమూ" వున్నట్లు పరీక్షకు లిద్దరికీ అనుమానం కలిగింది. కొంతమందిమీదా, కొన్ని విషయాలమీదా నేను వెలి బుచ్చిన అభిప్రాయాలు తీవ్ర విమర్శకు గురి అయినాయి.... కానీ మొత్తంమీద పరీక్షలో నెగ్గినాను. సంభాషణ మరింత భారీ సమస్యలకు మళ్లింది.

త్వరలోనే ప్రకృతిశాస్త్రాలను గురించిన మాటల్లో పడినాం. యూరప్‌లో విజయం పొందిన ప్రగతి వ్యతిరేకులను మార్క్సు అపహాస్యం చేసినాడు — విప్లవాన్ని గొంతు పిసికి నామని వాళ్లు ఊహిస్తున్నారు, కానీ ప్రకృతిశాస్త్రం కొత్త విప్లవాన్ని తయారుచేస్తున్న విషయం వాళ్లకు తెలియదు. గత శతాబ్దిలో ప్రపంచాన్ని విప్లవీకరించిన ఆవిరి మహారాజు తన సింహాసనం పోగొట్టుకున్నాడు; ఆ స్థానంలో యింకా గొప్ప విప్లవకారుడు వచ్చినాడు — విద్యుచ్ఛక్తి అనేవాడు.

తరువాత మార్క్సు యెంతో ఉత్సాహంతో నాతో చెప్పినాడు, రీజెంట్ స్ట్రీట్‌లో కొద్ది రోజులపాటు ప్రదర్శింపబడిన ఒక ఎలక్ట్రిక్ ఇంజను నమూనాను గురించి, అది రైలు బండిని నడపగలదు.

---

* డికెన్స్, చార్లెస్ (1812–1860) — ప్రసిద్ధ బ్రిటిషు రచయిత. — సం.

** అఖిల జర్మన్ (రైహ్) రాజ్యాంగం కొరకు నైరుతి జర్మనీలో 1849 వసంతంలోనూ, గ్రీష్మంలోనూ జరిగిన విప్లవ పోరాటం. — సం.

"యిప్పుడు సమస్య పరిష్కరింపబడింది. దీని పర్యవసానాలు యెవరూ చెప్పలేరు. ఆర్థిక విప్లవంవెంట అవశ్యంగా రాజకీయ విప్లవం వచ్చితీరుతుంది — రెండవది మొదటిదాని వ్యక్తీకరణ మాత్రమే గనుక" అన్నాడు మార్క్స్.

శాస్త్రవిజ్ఞానంయొక్క, యంత్రశాస్త్రంయొక్క పురోగతిని గురించి మార్క్స్ మాట్లాడిన విధానం ఆయన ప్రపంచ దృక్పథాన్ని, ముఖ్యంగా తదనంతర కాలంలో చరిత్రను గురించిన భౌతికవాద అవగాహన అనబడనున్నదాన్ని, యెంత స్పష్టంగా వెల్లడించిందంటే, నాలో యింకా వుండిన కొన్ని సందేహాలు వసంతకాలపు యెండలో మంచులాగ కరిగిపోయినాయి.

ఆ సాయంత్రం నేను యింటికి తిరిగిపోలేదు. బాగా తెల్లవారిందాకా మేము మాట్లాడుతూ, నవ్వుతూ, తాగుతూ వుండినాము. నేను పండుకునేటప్పటికి పొద్దు పొడిచింది. కానీ అక్కడ నేను చాలాసేపు వుండలేదు; నాకు నిద్రపట్టలేదు — నేను విన్నదంతా నా తలనిండా వుంది, నా ఆలోచనల కోలాహలం నన్ను పడకమీదినుండి రీజెంట్ స్ట్రీట్‌కు తరిమింది, ఆ నమూనాను చూడడానికి.

అది ఆధునిక ట్రోయ్ గుర్రం*; బూర్జువా సమాజం, ప్రాచీన ట్రోయ్ జనులలాగ, ఆత్మహత్యా సదృశమైన గుడ్డితనంతో, దాన్ని సంబరంగా తన ఇలియన్‌లోకి తెచ్చుకుంది; అది దాని అనివార్య వినాశనానికి దారితీస్తుంది. పవిత్ర ఇలియన్ పతన మయ్యే రోజు వస్తుంది.

అక్కడ వున్న పెద్ద గుంపును బట్టి ఇంజను యెక్కడ ప్రదర్శింపబడుతున్నదీ తెలుసుకున్నాను. గుంపులో దారి చేసుకొని పోయినాను. ఇంజను వుంది అక్కడ, రైలు ఉల్లాసంగా చుట్టూ పరుగెత్తుతున్నది....

అది 1850లో, జూలై ప్రారంభంలో.

## 3

## విప్లవకారుల గురువూ, విద్యాదాతా అయిన మార్క్స్

"కుర్రవాళ్ల" మైన మాకంటే అయిదారేండ్లు పెద్దవాడైన "మూర్"కు తన పరిణతి ద్వారా మాకు లేని సౌకర్యం వుండింది. దాన్ని గమనించి ఆయన సాధ్యమైనప్పుడల్లా

---

* ట్రోయ్ గుర్రం — గ్రీకు పురాణ గాథ ప్రకారం ట్రోయ్ (ఇలియన్) నగర పతనానికి దారితీసిన కొయ్యగుర్రం. గ్రీకులు ఒక గొప్ప కొయ్యగుర్రాన్ని నిర్మించి, అందులో సైనికులను దాచిపెట్టి, ఆ గుర్రాన్ని ట్రోయ్ నగరంవద్ద వుంచినారు. ట్రోయన్లు దానిని తమ నగరంలోకి తీసుకపోయినారు. ఆ గుర్రంలోని సైనికులు బయటికి వచ్చి నగర ద్వారాలు తెరిచినారు. అప్పుడు గ్రీకు సైన్యం నగరంలో ప్రవేశించి, ట్రోయ్ నగరాన్ని వశపరుచుకుంది. — సం.

మమ్మల్ని ముఖ్యంగా నన్ను, పరీక్షకు పెట్టేవాడు. అంత బాగా చదువుకొని, అంత అద్భుత మైన జ్ఞాపకశక్తి గల మార్క్స్ సులభంగా మమ్మల్ని యిబ్బంది పెట్టేవాడు. "విద్యార్థి కుర్రవాళ్ల"లో యెవరికైనా ఒక చిక్కు ప్రశ్న యిచ్చి, అతను పడే బాధ ద్వారా మన విశ్వవిద్యాలయాలూ, పాఠశాల విద్యా యెంత అధ్వాన్నంగా వుండేదీ సజీవోదాహరణ ద్వారా నిరూపించడం ఆయనకు యెంతో సరదా.

ఆయన మాకు విద్య గరిపినాడు. ఆయన అధ్యాపనంలో ఒక పథకం వుండేది, ఆయన నాకు గురువని చెప్పగలను, గురువు అనే మాటకున్న కచ్చితమైన అర్థంలోనూ, విస్తృతమైన అర్థంలోనూ. అన్ని శాఖలూ మేము ఆయనవద్ద నేర్చుకోవలసి వుండింది. అర్థశాస్త్రం మాట చెప్పనక్కర లేదు — పోపును గురించి ఆయన అంతఃపురంలో మాట్లాడం గదా. కమ్యూనిస్టు లీగులో అర్థశాస్త్రంమీద ఆయన ఉపన్యాసాల గురించి తరువాత చెపుతాను. ప్రాచీన భాషల్లోనూ, ఆధునిక భాషల్లోనూ ఆయన అవలీలగా వ్యవహరించగలడు. నేను భాషాశాస్త్రజ్ఞుణ్ణి; అరిస్టోటిల్‌నుండో,* ఈస్కిలస్‌నుండో నేను వెంటనే సరిగా అర్థం చేసుకోలేని కష్టమైన ఘట్టం యేదైనా నాకు చూపించి ఆయన చిన్నపిల్లవాడి లాగ ఆనందించేవాడు. ఒక రోజు ఆయన నన్ను యెన్ని మాటలు అన్నాడని — నాకు స్పానిష్ తెలియనందుకు! ఒక పుస్తకాల దొంతినుండి "డాన్ క్విక్సట్" లాగి, నాకు పాఠం చెప్పడం ప్రారంభించినాడు. రొమాన్స్ భాషల తులనాత్మక వ్యాకరణంమీద దీయెజ్ రాసిన పుస్తకం ద్వారా నాకు అంతకు ముందే వ్యాకరణ సూత్రాలూ, శబ్ద నిర్మాణమూ తెలుసు. కనుక, ఆయన ఉత్తమమైన దర్శకత్వం కింద, నేను సంకోచపడేటప్పుడూ, నాకు చేతగానప్పుడూ ఆయన జాగ్రత్తగా యిచ్చే తోడ్పాటుతో నా చదువు బాగా సాగింది. యెంత ఓర్పుగల ఉపాధ్యాయుడు ఆయన, యితరత్రా అంత రౌద్రమూర్తి అయినప్పటికీ! యెవరైనా బయటివాళ్లు వచ్చినప్పుడు మాత్రమే పాఠం ఆగి పోయేది.

మార్క్స్ ప్రతిరోజూ నాకు ప్రశ్నలు వేసేవాడు, నేను "డాన్ క్విక్సట్"నుండో, మరొక స్పానిష్ గ్రంథంనుండో ఒక ఘట్టం అనువదించవలసి వుండేది, నాకు తగు సామర్థ్యం యేర్పడిందని ఆయన అనుకునేదాకా.

మార్క్స్ అసాధారణమైన భాషాశాస్త్రవేత్త, ప్రాచీన భాషల్లోకంటె ఆధునిక భాషల్లో యెక్కువగా అయినప్పటికీ. గ్రిమ్ రచించిన జర్మన్ వ్యాకరణం ఆయనకు యెంతో కచ్చితంగా తెలుసు; గ్రిమ్ సోదరుల నిఘంటువులో భాషావేత్తనైన నాకంటె ఆయనకు బాగా తెలుసు. ఆయన ఇంగ్లీషువాళ్లు రాసినంత బాగా యింగ్లీషూ, ఫ్రెంచివాళ్లు రాసినంత బాగా ఫ్రెంచీ రాయగలడు, ఆయన ఉచ్చారణలో లోపం వుండినప్పటికీ. "న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్"కు

---

* అరిస్టోటిల్ (క్రీ. పూ. 384–322) — ప్రఖ్యాత ప్రాచీన గ్రీకు తత్వవేత్త, శాస్త్రజ్ఞుడు. — సం.

ఆయన వ్యాసాలు స్వచ్ఛమైన యింగ్లీషులో రాసినాడు, ప్రూడన్ "దారిద్ర్యపు తత్వశాస్త్రం"కు వ్యతిరేకంగా రాసిన "తత్వశాస్త్ర దారిద్ర్యం" స్వచ్ఛమైన ఫ్రెంచి భాషలో రాసినాడు. యీ రెండవది అచ్చుకాకముందు, దాని రాతప్రతిని ఆయన ఒక ఫ్రెంచి మిత్రునికి చూపించినాడు. అందులో మెరుగులు దిద్దవలసిందేమీ ఆ మిత్రునికి దాదాపు కనిపించలేదు.

భాష అనేదాని సారం మార్క్స్ గ్రహించినాడు, దాని పుట్టుకా, అభివృద్ధీ, నిర్మాణమూ ఆయన అధ్యయనం చేసినాడు, కనుక భాషలు నేర్చుకోవడం ఆయనకు కష్టమయ్యేది కాదు. లండన్‌లో ఆయన రష్యన్ భాష నేర్చుకున్నాడు. క్రైమియన్ యుద్ధ కాలంలో* ఆయన టర్కిష్, అరబిక్ భాషలు అధ్యయనం చేయాలనుకున్నాడు, కానీ చేయలేకపోయినాడు. యే భాషనైనా స్వాధీనం చేసుకోవాలని నిజంగా కోరేవాళ్ల లాగే ఆయన ఆ భాషను చదవడం అత్యంత ముఖ్యమని యెంచేవాడు. మంచి జ్ఞాపకశక్తి వున్నవాడు — మార్క్స్ జ్ఞాపకశక్తి అసాధారణమైనది, అది యెప్పుడూ యేదీ మరిచిపోయేది కాదు — త్వరగా పదజాలమూ, నుడికారపు సొబగులూ విరివిగా సమకూర్చుకుంటాడు. తరువాత ప్రయోగం సులభంగా అలవడుతుంది.

1850, 1851లో మార్క్స్ అర్థశాస్త్రంమీద ఉపన్యాస పరంపర యిచ్చినాడు. యివ్వడానికి ఆయన యిష్టపడలేదు, కానీ తన సన్నిహిత మిత్రులు కొందరికి ఆయన కొద్ది ప్రైవేటు ఉపన్యాసాలు యిచ్చినప్పుడు, విస్తృతమైన శ్రోతలకు ఉపన్యసించడానికి ఆయన్ను మేము ఒప్పించినాము. ఆ ఉపన్యాస పరంపరకు హాజరైన అదృష్టవంతు లందరూ బాగా ఆనందించినారు. అందులో ఆయన "పెట్టుబడి"లో మనకు కనపడుతున్న తన శాస్త్ర వ్యవస్థ యొక్క సూత్రాలను పూర్తిగా వివరించినాడు.

ఆ కాలంలో విండ్‌మిల్ స్ట్రీట్‌లో వుండిన కమ్యూనిస్టు ఎడ్యుకేషనల్ సొసైటీయొక్క క్రిక్కిరిసిన హాలులో — ఒకటిన్నర సంవత్సరం ముందు యే హాలులో "కమ్యూనిస్టు ప్రణాళిక" ఆమోదింపబడిందో సరిగా ఆ హాలులోనే — జ్ఞానాన్ని జనరంజకం చేయడంలో మార్క్స్ గొప్ప ప్రజ్ఞను ప్రదర్శించినాడు. శాస్త్రవిజ్ఞానాన్ని అపభ్రంశం చేయడానికి అనగా అబద్ధీకరించడానికీ, నీచపరచడానికీ, ఆయనకంటె వ్యతిరేకి యెవరూ లేరు. తన అభిప్రాయాలను వ్యక్తీకరించడంలో ఆయన కంటె ప్రజ్ఞ గలవాళ్లు యెవరూ లేరు. వాచా స్పష్టత ఆలోచనా స్పష్టతయొక్క ఫలం: స్పష్టమైన ఆలోచన అవశ్యం స్పష్టమైన అభివ్యక్తికి దారితీస్తుంది.

మార్క్స్ ఉపన్యాసంలో ఒక పద్ధతి వుండేది. ఆయన ఒక సూత్రాన్ని రూపొందించే

---

*1853–56 క్రైమియన్ యుద్ధం, లేక ప్రాచ్య యుద్ధం — మధ్య ప్రాచ్యంలో పెత్తనం కోసం రష్యాచే బ్రిటన్, ఫ్రాన్సు, టర్కీ, సార్డీనియా దేశాలకు వ్యతిరేకంగా సాగించబడింది. ఈ యుద్ధంలో రష్యా ఓడిపోయింది. — సం.

వాడు — యెంత సంక్షేపంగా వీలైతే అంత సంక్షేపంగా — తరువాత దాన్ని సుదీర్ఘంగా వివరించే వాడు, కార్మికులకు అర్థం కాని నుడికారాలను అత్యంత జాగ్రత్తగా పరిహరిస్తూ. తరువాత, ప్రశ్నలడగమని శ్రోతలను కోరేవాడు. ప్రశ్న లేమీ రాకపోతే, ఆయన శ్రోతలను పరీక్షించడం మొదలు పెట్టేవాడు; ఆ పని యెంత అధ్యాపక నైపుణ్యంతో చేసేవాడంటే, యెక్కడైనా వెలితి గానీ, అపార్థం గానీ వుంటే ఆయన దృష్టిని తప్పించుకొనేది కాదు.

ఆయనకున్న యీ నైపుణ్యం గురించి నే నొకనాడు ఆశ్చర్యం ప్రకటించగా, మార్క్స్ అంతకు ముందే బ్రస్సెల్స్‌లో జర్మన్ వర్కర్స్ సొసైటీ*లో ఉపన్యాసాలు యిచ్చినాడని నాకు చెప్పినారు. యేమైనప్పటికీ, ఉత్తమ అధ్యాపకునికి వుండవలసిన లక్షణాలన్నీ ఆయనకు వుండినాయి.

బోధించేటప్పుడు ఆయన బ్లాకుబోర్డు ఉపయోగించేవాడు, దానిమీద సూత్రాలు రాసేవాడు, "పెట్టుబడి"లో మొదటి పేజీలనుండి మనమందరికీ తెలుసుకొన్నవి కూడా.

దురదృష్ట మేమంటే, ఆ ఉపన్యాసాలు సుమారు ఆరు నెలలు మాత్రమే, లేదా యింకా తక్కువో సాగినాయి.

మార్క్స్‌కు నచ్చనివాళ్లు కమ్యూనిస్టు ఎడ్యుకేషనల్ సొసైటీలోకి వచ్చినారు. వలస వచ్చేవాళ్ల సంఖ్య తగ్గిపోయినందున, ఆ సొసైటీ కృశించిపోయి, కొంతవరకు ఒంటెత్తువాదంలో పడింది; వైట్లింగ్,** కాబె*** పాత అనుచరులు మళ్లీ పుంజుకోసాగినారు. అంత పరిమితమైన కార్య పరిధితో తృప్తిపడనివాడూ, పాత సాలెగూళ్లను తుడిచి వేయడం కంటె ముఖ్యమైన పనులు చేయగలవాడూ అయిన మార్క్స్ ఆ సంఘానికి దూరంగా వుండినాడు.

భాషలో మార్క్స్ పరిశుద్ధవాది; ఆ ధోరణి ఛాందసత్వ మయ్యేటంతగా వుండింది. నా యెగువ హెస్సియన్ ప్రాంతీయ భాష నాకు చర్మంలాగ అంటుకొని వుండింది, లేక బహుశా నేనే దానికి అంటుకొని వుండినాను; దానిమూలంగా నేను లెక్కలేనన్ని సార్లు

---

* బ్రస్సెల్స్‌లో జర్మన్ వర్కర్స్ సొసైటీ — 1847 ఆగస్టులో మార్క్స్, ఎంగెల్సులచేత స్థాపించబడింది. దీని ఉద్దేశం కార్మికులకు రాజకీయ విజ్ఞానం యివ్వడమూ, శాస్త్రీయ కమ్యూనిస్టు భావాలు ప్రచారం చేయడమూ. యీ సొసైటీ 1848 నాటి విప్లవం తర్వాత త్వరలో పని చేయడం మానివేసింది. — సం.

** వైట్లింగ్, విల్‌హెల్మ (1808–1871) — ఊహాజనిత సమతాతత్వ కమ్యూనిజం సిద్ధాంతకర్తలలో ఒకడు; వృత్తిరీత్యా దర్జీ. — సం.

*** కాబె, ఇటియేన్ (1788–1856) — ఊహాజనిత కమ్యూనిజానికి ప్రముఖ ప్రతినిధి; అమెరికాలో కమ్యూనిస్టు కాలనీ స్థాపకుడు. — సం.

మార్క్స్ ఉపన్యాసాలకు గురి అయినాను. యిలాంటి చిల్లర విషయాలను గురించి నేను చెపుతున్నానంటే, "కుర్రవాళ్ల"మైన మాకు తాను ఉపాధ్యాయుణ్ణని మార్క్స్ యెంతగా అనుకున్నదీ యివి వెల్లడిస్తాయి గనుకనే.

యిది సహజంగా మరొక రూపంలో కూడా వ్యక్తమయ్యేది. మాపట్ల ఆయన చాలా కఠినంగా వుండేవాడు. మా జ్ఞానంలో యేదైనా లోపం వున్నట్లు ఆయన కనిపెట్టిన వెంటనే దాన్ని మేము పూరించుకోవాలని యెంతో బలవంతంగా పట్టుపట్టి, దానికి సరియైన సలహా యిచ్చేవాడు.

ఆయనతో కలిసి ఒంటిగా యెవడైనా వుంటే వానికి నిజమైన పరీక్ష పెట్టేవాడు. ఆ పరీక్షలంటే మాటలు కాదు. ఆయన కండ్లలో యెవడూ దుమ్ము చల్లలేడు. యెవరిమీద నైనా ఆయన కృషి వ్యర్థమైందా, అతనితో మైత్రి అంతటితో సరి. ఆయనతో "చదువు చెప్పించుకోవడం" మాకు గౌరవం. ఆయనతో కలిసి వున్నప్పుడల్లా నేను యేదో ఒకటి ఆయన దగ్గర నేర్చుకోకుండా వుండలేదు....

ఆ రోజుల్లో కార్మికవర్గంలో కూడా స్వల్ప మైనారిటీ మాత్రమే సోషలిజం స్థాయికి యెదిగినారు; సోషలిస్టులలో కూడా మైనారిటీ మార్క్స్ చెప్పిన శాస్త్రీయ అర్థంలో సోషలిస్టులు – "కమ్యూనిస్టు ప్రణాళిక" అర్థంలో. కార్మికులలో అధిక భాగం, రాజకీయ జీవితానికి జాగృతం కావడమంటూ వుంటే కూడా, అస్పష్టమైన మమతాపూర్వక ప్రజా తంత్ర కోరికలకూ, నుడికారాలకూ బంధింపబడి వుండినారు – 1848 ఉద్యమానికీ, దాని ముందు వెనకలకూ విలక్షణమైనట్టివాటికి. జనంనుండి చప్పట్లూ, మెచ్చుకోలూ లభిస్తే, మార్క్స్ దృష్టిలో అది మనం తప్పు దోవలో వున్నామనడానికి నిదర్శనం. ఆయన అభిమాన సూత్రం డాంటె మహాకవి చెప్పిన యీ స్వాభిమానపూరిత పాదం: "యెందరెన్ని అనుకున్నా, నీ దారిన నీవు పో!"

యీ పాదం ఆయన యెన్నిసార్లు ఉటంకించినాడో! "పెట్టుబడి" ఉపోద్ఘాతం కూడా యీ పాదంతో ముగించబడింది. దెబ్బలకూ, కుదుపులకూ, క్షుద్ర కీటక బాధలకూ చలించ కుండా యెవరూ వుండరు. మరి మార్క్స్ సకల దిశలనుండీ దాడులకు గురై – జీవిత పోరాటంలో సతమతమై – యెవరి విమోచన కొరకు తాను అర్థరాత్రి నిశ్శబ్దంలో ఆయుధాలు తయారు చేసినాడో ఆ కార్మిక ప్రజలచేత అపార్థం చేసుకోబడి – నిరర్థకపు మాటకారులనూ, ప్రచ్ఛన్న ద్రోహులనూ, బాహాటపు శత్రువులను కూడానూ అనుసరిస్తున్న ఆ కార్మిక ప్రజల చేత ఒకోసారి అసహ్యించుకోబడి – తన దౌర్భాగ్యపు, నిజమైన కార్మికవర్గపు పతనాగారంలో సాహసమూ, నూతనోత్సాహమూ పొందడానికి ఆ యిటాలియన్ మహాకవి మాటలను యెన్ని సార్లు పునశ్చరణ చేసుకొని వుండాల్నో!

ఆయన దారి తప్పేవాడు కాదు. "వెయ్యి న్నొక్క రాత్రులు" అనే కథలో తన చుట్టూ

వుండే శబ్దానికీ, భీకరమైన దయ్యాలకూ భయపడి, పక్కలకూ వెనక్కీ చూసుకుంటూ, విజయాన్నీ విజయ ఫలితాన్నీ వదులుకున్న రాకుమారుని లాగ కాక, మార్క్సు యెల్లప్పుడూ తన ఉజ్వల లక్ష్యంవైపు ముందుకు చూస్తూ పురోగమించేవాడు....

ఆయనకు జనస్తుతిపట్ల యెంత గొప్ప ద్వేషమో, దాని కొరకు ప్రయత్నించేవాళ్లపట్ల అంత కోపం. "మంచి" వక్తలంటే ఆయనకు అసహ్యం; యెవరైనా పదాడంబరంలో మునిగి నాడా, వాని పని ముగిసిందన్నమాటే. అలాంటివాళ్ల విషయంలో ఆయన మెత్తబడేవాడు కాదు. "పదాడంబరుడు" అనేది ఆయన పదజాలంలో అత్యంత నిందాపూర్వకమైనది; యెవరైనా పదాడంబరుడని ఆయన తెలుసుకున్నాడా, యిక అతనితో ఆయనకు తెగిపోయిం దన్నమాటే. "తర్కబద్ధ ఆలోచనా, వ్యక్తీకరణ స్పష్టతా అనేవాటి అవసరాన్ని" "కుర్రవాళ్ల"మైన మాకు ఆయన నూరిపోసేవాడు, అధ్యయనం చేయండని మమ్మల్ని నిర్బంధించేవాడు.

బ్రిటిష్ మ్యూజియంలోని అద్భుతమైన పఠనాలయం, అందులోని అనంతమైన పుస్తక సంపదతో సహా, నిర్మాణం అప్పుడు పూర్తి అయింది. మార్క్సు రోజూ అక్కడికి వెళ్లేవాడు, మమ్మల్ని కూడా వెళ్ల మనేవాడు.

చదువుకో! చదువుకో! అది ఆయన నోట మేము తరచుగానే వినే పరమమైన ఆదేశం — తన ఆదర్శం ద్వారా, తన మహత్తరమైన మేధయొక్క నిరంతర కృషి ద్వారా మాకు యిచ్చిన ఆదేశం.

యితర ప్రవాసులు రోజూ ప్రపంచ విప్లవానికి పథకం వేస్తూ, "అది రేపు ప్రారంభ మౌతుంది" అనే మత్తుమందు లాంటి సూక్తితో ప్రతిదినమూ, ప్రతిరాత్రీ తమకు తాము కైపెక్కించుకుంటూ వుండగా, మేము, "అగ్గి పిండంగాళ్లం," "దారి దోపిడీ దొంగలం," "మానవజాతిలోని మడ్డిగాళ్లం," బ్రిటిష్ మ్యూజియంలో మాకాలం వెళ్లబుచ్చుతూ, విద్య నేర్చుకోడానికీ, భవిష్యత్ పోరాటానికి ఆయుధాలూ, మందుగుండూ సమకూర్చుకోడానికీ ప్రయత్నించినాము.

ఒకోసారి మాకు తినడానికి మెతుకు వుండేది కాదు; కానీ అంతమాత్రాన మ్యూజియంకు పోకుండా వుండేవాళ్లం కాదు. యెందుకంటే అక్కడ మాకు కూర్చోడానికి సుఖమైన కుర్చీలు వుండేవి, చలికాలంలో వెచ్చగా, సుఖంగా వుండేది — యింటివద్ద అలా వుండేది కాదు, యిల్లంటూ వున్నవాళ్లకు.

మార్క్సు కఠినమైన ఉపాధ్యాయుడు; చదువుకొమ్మని మమ్మల్ని ప్రోద్బలం చెయ్యడమే కాదు, మేము చదువుకునేటట్లు చేసేవాడు.

చాలా కాలంపాటు నేను ఇంగ్లీషు ట్రేడ్ యూనియన్ల చరిత్ర అధ్యయనం చేస్తూ వుండినాను. నేను యెంత దూరం వచ్చిందీ ఆయన ప్రతి రోజూ నన్ను అడిగేవాడు; ఒక పెద్ద సభలో ఉపన్యాసం యిచ్చిందాకా ఆయన నన్ను వదల్లేదు. సభలో ఆయన వుండినాడు.

ఆయన నన్ను పొగడలేదు, దారుణమైన విమర్శ కూడా యేమీ చేయలేదు. ఆయనకు పొగిడే అలవాటు లేదు గనక, జాలి కలిగినప్పుడు మాత్రమే పొగిడేవాడు గనుక, పొగడ్త లేకపోయినందుకు నన్ను నేను ఊరడించుకున్నాను. తరువాత, నేను చెప్పిన ఒక విషయంమీద నాతో ఆయన చర్చ పెట్టుకున్నప్పుడు, అది పరోక్షమైన పొగడ్తగా భావించినాను.

ఉపాధ్యాయుడుగా మార్క్సుకు నిరుత్సాహ పరచకుండా కఠినంగా వుండే అరుదైన గుణం వుండింది.

ఆయన కుండిన మరొక అసాధారణమైన గుణం యేమిటంటే, మా గురించి మేము విమర్శనాత్మకంగా వుండేటట్టు నిర్బంధించేవాడు, మేము సాధించిన వాటితో సంతృప్తి చెందనిచ్చేవాడు కాదు. నిర్లిప్తంగా మనో వీక్షణం చేయడాన్ని ఆయన తన నిశితమైన వ్యంగ్యంతో చీల్చి చెండాడేవాడు.

4

## మార్క్సు శైలి

"శైలి అంటే వ్యక్తి" అనే బుఫొన్* సూక్తి యెవరి విషయంలోనైనా నిజమైతే, మార్క్సు విషయంలోనే. మార్క్సు శైలి — మార్క్సు. మార్క్సులాంటి ఆమూల సత్య నిరతి గల వ్యక్తి, సత్యం తప్ప మరే మతమూ యెరగనివాడు, తాను యెంతో కష్టపడి సాధించిన ఒక సిద్ధాంతాన్ని, అందువలన తనకు యెంతో ప్రియమైనదాన్ని, అది తప్పు అని నమ్మకం కలిగిన వెనువెంటనే దాన్ని పక్కకు యీడ్చిపారవేసేవాడు, తాను వాస్తవంలో వున్నట్లే తన రచనలలో అవశ్యం కనపడతాడు. వంచన గానీ, నటన గానీ, డంబం గానీ చేతగాని వాడు గనుక, ఆయన యెప్పుడూ తానుగానే వుండినాడు, తన జీవితంలో యెంతో తన రచనలలోనూ అంతే. సహజంగానే, ఆయనంత బహుముఖమైన, బహు ప్రజ్ఞాన్వితమైన, సర్వగ్రాసియైన స్వభావం గలవాని శైలికి తక్కువ జటిలత్వమూ, తక్కువ సర్వగ్రాసిత్వమూ గల స్వభావంయొక్క శైలికుండే సమత్వం గానీ, చివరకు రోకటిపాట లక్షణం గానీ వుండ జాలదు. "పెట్టుబడి"లోని మార్క్సు, "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"లోని మార్క్సు, "హెర్ ఫోగ్ట్"లోని మార్క్సు ముగ్గురు భిన్నమైన మార్క్సులు. కానీ వాళ్ల వైవిధ్యంలో వాళ్లు ఒకే మార్క్సు, వాళ్ల త్రికత్వంలో ఏకత్వం వుంది — భిన్న రంగాలలో భిన్న విధా

* బుఫొన్, జార్జ్ లూయీ (1707–1788) — సుప్రసిద్ధ ఫ్రెంచి ప్రకృతి శాస్త్రవేత్త. — సం.



లండన్‌లో గ్రాఫ్టన్ టెరస్ వీధిలో ఒక యిల్లు. అక్కడ మార్క్స్ 1856–1864లో నివసించేవాడు



కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్, మార్క్స్ కూతుర్లు -
జెన్నీ, ఎలినోర, లౌరా (60ల సంవత్సరాలు)

లుగా వ్యక్తవౌతుంది గానీ యెప్పుడూ ఒకటిగానే వుండే ఆయన మహత్తర వ్యక్తిత్వంలోని ఏకత్వం.

"పెట్టుబడి" శైలి అర్థం చేసుకోవడం కష్టమని ఒప్పుకోవాలి – కానీ అందులోని విషయం అర్థం చేసుకోవడం సులభమా? శైలి మనిషి మాత్రమే కాదు, శైలి విషయం కూడా, శైలి విషయానికి అనుగుణంగా మారాలి. శాస్త్రవిజ్ఞానానికి రాచబాట లేదు, ప్రతి వాకడూ శ్రమపడి యెక్కవలసిందే, తనకు అత్యుత్తమమైన నాయకుడు వున్నప్పటికీ. "పెట్టుబడి" శైలి కష్టమని గానీ, దుర్గ్రాహ్యమని గానీ, చివరకు బరువని గానీ ఫిర్యాదు చేయడమంటే, మన మానసిక సోమరితనాన్నీ, ఆలోచించడం చేతగాకపోవడాన్నీ ఒప్పుకోవడమే.

"బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ" దుర్గ్రాహ్యమా? నేరుగా పోయి లక్ష్యంలోకి లోతుగా దిగబడే బాణం దుర్గ్రాహ్యమా? స్థిరమైన చేతితో గురిపెట్టబడి, శత్రువు గుండెను నట్టనడి మధ్య చీల్చే బల్లెం దుర్గ్రాహ్యమా? "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"లోని మాటలు బాణాలు, బల్లేలు; అవి వాతలు పెట్టి చంపే శైలి. ద్వేషమూ, యేవగింపూ, జ్వలించే స్వేచ్ఛా ప్రియత్వమూ యెప్పుడైనా మంటలు గక్కుతూ, ధ్వంసం చేసే ఉదాత్తమైన పదాలలో వ్యక్తమై వుంటే, అది "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"లోనే; అందులో టాసిటస్* ఆగ్రహపూరిత కాఠిన్యమూ, జూవినల్** ప్రాణాంతక వ్యంగ్యమూ, డాంటె పవిత్ర కోపమూ సమ్మేళనం చెందినాయి. యిక్కడున్న శైలి పురాతన కాలంలో రోమనులు వాడిన గంటం, పదునైన కత్తి – రాయడానికీ, పొడవడానికీ వాడేది. శైలి పొరపాటు పడకుండా గుండెలో దిగబడే బాకు.

యిక "హెర్ ఫోగ్ట్"లో – ఒక ఫాల్‌స్టాఫ్‌నూ,*** అతనిలో ఒక వ్యంగ్య ఆయుధాగారాన్ని నింపడానికి తగిన తరగని గనినీ కనుగొన్నందుకు – యెంత తళుకుగల వాక్చమత్కృతి, యెంత షేక్స్పియర్ లాంటి ఉల్లాసం!

మార్క్స్ శైలి నిజంగా మార్క్సే. తక్కువ స్థలంలో వీలైనంత యెక్కువ విషయాన్ని

---

* టాసిటస్ (55 – మరణం సుమారు 120) – సుప్రసిద్ధ రోమన్ చరిత్రవేత్త. – సం.

** జూవినల్ (జననం మొదటి శతాబ్ది మధ్యలో – మరణం 127 తరువాత) – సుప్రసిద్ధ రోమన్ వ్యంగ్య రచయిత. – సం.

*** ఫాల్‌స్టాఫ్ – షేక్స్పియర్ నాటకాలు "విండ్సర్‌లోని విలాసవతులు," "నాల్గవ హెన్రీ"లలో ఒక పాత్ర, భీరువు, విదూషకుడు, త్రాగుబోతు. – సం.

యిరికించడానికి ప్రయత్నిస్తాడని ఆయనమీద నింద వుంది. మరి సరిగ్గా అదే మార్క్సు తత్వం.

వ్యక్తీకరణలో స్పష్టతకూ, నిర్దుష్టతకూ మార్క్సు అత్యంత ప్రాముఖ్యం యిచ్చేవాడు. గ్యోతే, లెస్సింగ్, షేక్స్పియర్, డాంటె, సెర్వాంటెస్‌లను అత్యుత్తమ రచయితలుగా ఆయన తానే యెన్నుకున్నాడు; వాళ్ల రచనలు దాదాపు రోజూ చదివేవాడు. భాష స్వచ్ఛతకూ, నిర్దుష్టతకూ సంబంధించినంతవరకు ఆయన అత్యంత నియమశీలి. నాకు జ్ఞాపక ముంది — నా లండన్ నివాసపు ప్రారంభంలో, ఒకసారి ఒక వ్యాసంలో నేను "stattgehabte Versammlung" అన్న నుడికారం ఉపయోగించినందుకు ఆయన నాకు పెద్ద ఉపన్యాసం యిచ్చినాడు. అది వాడుకలో వున్న మాట అని నేను సమర్థించుకొన్నాను, కానీ మార్క్సు యెగిరిపడినాడు, "జర్మన్ భాష నేర్పని దౌర్భాగ్యపు జర్మన్ పాఠశాలలు! దౌర్భాగ్యపు జర్మన్ విశ్వవిద్యాలయాలు!" అంటూ ప్రారంభించి. నాకు చేతనైనట్లు నేను సమర్థించుకొన్నాను, మహాకావ్యాలనుండి ఉదాహరణలు చూపించినాను; కానీ ఆ తరువాత మళ్లీ యెప్పుడూ "stattgehabte" అని గానీ "stattgefundene Ereignisse" ఘటన అని గానీ అనలేదు, యితర్లను ఆ అలవాటునుండి తప్పించడానికి ప్రయత్నించినాను....

మార్క్సు కచ్చితమైన పరిశుద్ధవాది; తరుచు ఆయన సరియైన నుడికారం కోసం దీర్ఘంగా కష్టపడి వెదికేవాడు. అనవసరమైన విదేశ పదాలంటే ఆయనకు ద్వేషం. మరి విషయానికి అవసరం కానప్పుడు ఆయన తరుచు విదేశ పదాలను వాడినాడంటే, దానికి కారణం ఆయన చాలా కాలం విదేశాలలో, ముఖ్యంగా ఇంగ్లండులో వుండడం.... కానీ తన జీవిత కాలంలో మూడింట రెండు వంతులు ఆయన విదేశాలలో వుండినప్పటికీ, ఆయన రచనలలో పుష్కలంగా వున్న శుద్ధ, స్వచ్ఛ జర్మన్ సమాసాలూ, ప్రయోగాలూ జర్మన్ భాష విషయంలో ఆయన యోగ్యతను నిరూపిస్తాయి. జర్మన్ భాషలో ఆయన ఒక అత్యంత ప్రముఖ రచయిత, ఒక సృష్టికర్త....

## 5

## రాజకీయవాదిగా, శాస్త్రజ్ఞుడుగా, మనిషిగా మార్క్సు

మార్క్సు రాజకీయాలను ఒక విజ్ఞానశాస్త్రంగా చూసినాడు. సారా దుకాణం రాజకీయ వాదులనూ, రాజకీయాలనూ ఆయన అసహ్యించుకున్నాడు.

నిజమే అంతకంటె తెలివితక్కువ వాటిని ఊహించగలమా? చరిత్ర అనేది మానవుల

లోనూ, ప్రకృతిలోనూ పనిచేసే సకల శక్తులయొక్క, మానవ ఆలోచనయొక్క, మానవ ఆవేశాలయొక్క, మానవ అవసరాలయొక్క ఫలితం. కానీ సిద్ధాంతంగా, రాజకీయాలు అనేది "కాలం అనే రాట్నం"మీద తిరిగే కోటానుకోట్ల అంశాలను గురించిన జ్ఞానం; ఆచరణగా అది ఆ జ్ఞానంమీద ఆధారపడిన చర్య. కనుక రాజకీయాలు అనేది ఒక విజ్ఞానశాస్త్రమూ, ఒక ప్రయుక్త శాస్త్రమూ...

దాదాపు గజిబిజిగా వున్న తమ కోర్కెలనూ, ఊహలనూ వాస్తవాలుగా నమ్మి, ఒకే మూసలో పోసిన తమ స్వల్ప నుడికారాలతో విషయాలను వ్యాఖ్యానించగలమనీ, హోటల్ హోలు నుండో, వార్తాపత్రికలనుండో, బహిరంగ సభలనుండో, పార్లమెంటులనుండో ప్రపంచ భవితవ్యాన్ని నడిపించగలమనీ అనుకునే మట్టిబుర్రలను గురించి మాట్లాడేటప్పుడు మార్క్స్‌కు యెంత ఆగ్రహం వచ్చేదో! అదృష్టవశాత్తు ప్రపంచం వాళ్లను పట్టించుకోవడం లేదు. ఆ "మట్టిబుర్రల"లో ఒకోసారి బాగా ప్రసిద్ధులైనవాళ్లు, యెంతో గౌరవింపబడే "గొప్పవాళ్లూ" వుంటారు.

యీ విషయంలో మార్క్స్ యితర్లను విమర్శించడమే కాక, ఒక ప్రశస్తమైన ఆదర్శం నెలకొల్పినాడు. ముఖ్యంగా ఫ్రాన్సులోని సమకాలిక ఘటనలమీదా, నెపోలియన్ రాజకీయ కుట్రమీదా ఆయన రాసిన వ్యాసాలలోనూ, "న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్"కు ఆయన పంపిన రచనలలోనూ ఆయన రాజకీయ చరిత్ర రచనకు సుప్రసిద్ధమైన నమూనాలు యిచ్చినాడు.

యిక్కడ ఒక పోలిక తేకుండా వుండలేను. "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"లో మార్క్స్ బోనపార్ట్ రాజకీయ కుట్రను గురించి రాసినాడు. ఫ్రెంచి రొమాంటిక్ రచయితల్లో అందరికంటె గొప్పవాడూ, అత్యంత శబ్ద ప్రియుడూ అయిన విక్టోర్ హ్యూగోయొక్క ఒక రచనకు ఆ కుట్ర యితివృత్తం అయింది. ఆ రెండు రచనల మధ్యా, ఆ యిద్దరి వ్యక్తుల మధ్యా యెంత భేదం వుంది! ఒకవైపున వికారపు శబ్దాడంబరమూ, శబ్దాడంబరపు వికారమూ — మరొకవైపున పద్ధతిగా అమర్చిన వాస్తవాలూ, వాస్తవాలను విలువకట్టే నిబ్బరపు శాస్త్రజ్ఞుడూ, ఆగ్రహపూరిత రాజకీయవాదీ, అంత ఆగ్రహంలోనూ సదసద్వివేకం కోల్పోకుండా వున్నవాడూ.

ఒకవైపున క్షణిక బుద్బుదచ్ఛటలూ, ఆవేశపూరిత వికారమైన శైలీ ప్రదర్శనలూ, వికృత పాత్ర చిత్రణలూ — మరొకవైపున ప్రతి పదమూ లక్ష్యశుద్ధి గల బాణం, ప్రతి వాక్యమూ వాస్తవాలతో నిండిన నేరారోపణ, దుస్సహమైన నగ్నత్వం గల నగ్న సత్యం; కోపమేమీ లేదు, వట్టి సాదా మాటలు, వాస్తవంగా వున్నదాన్ని వెల్లడించేవి. విక్టోర్ హ్యూగో రాసిన "చిన్న నెపోలియన్"కు వెంటవెంట పది కూర్పులు వచ్చినాయి, కానీ యీనాడు అది యెవరికీ జ్ఞాపకం లేదు. మార్క్స్ రాసిన "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"ని వేల సంవత్సరాల తర్వాత కూడా ప్రశంసలతో చదువుతారు....

నేను మరొక చోట అన్నట్లు, మార్క్స్ యేమి అయినాడో అది యింగ్లండులోనే కాగలడు. యీ శతాబ్ది మధ్యకాలం వరకు కూడా యెంతో అవికసితంగా వుండిన జర్మనీ లాంటి దేశంలో బూర్జువా ఆర్థిక వ్యవస్థమీద తన విమర్శనూ, పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమాన్ని గురించిన జ్ఞానాన్నీ సాధించడం మార్క్స్‌కు కేవలం అసాధ్యం — ఆర్థికంగా వికసితమైన యింగ్లండులోని రాజకీయ సంస్థలు ఆర్థికంగా అవికసితమైన జర్మనీకి వుండడం యెంత అసాధ్యమో అంత అసాధ్యం. తన పరిసరాలమీదా, తాను జీవించిన పరిస్థితులమీదా యెవరైనా యెంత ఆధారపడతారో మార్క్స్ కూడా సరిగా అంతే ఆధారపడినాడు: ఆ పరిస్థితులు లేకుండా మార్క్స్ మార్క్స్ అయ్యేవాడు కాదు. యీ విషయాన్ని ఆయనకంటె బాగా రుజువు చేసినవాళ్లు లేరు.

అలాంటి మేధ తనమీద పరిస్థితులను పనిచేయనిస్తూ, సమాజ స్వభావంలోకి అంత కంతకూ లోతుగా చొరబడడం — దాన్ని గమనించడమే ఒక గొప్ప మానసిక ఆహ్లాదం. అను భవం లేకుండా, విద్య కొరకు తహతహలాడే అల్ప వయస్కుణ్ణైన నాకు మార్క్స్ మార్గ దర్శకుడుగా వుండడమూ, ఆయన ప్రభావంవల్లా, ఆయన అధ్యాపనంవల్లా నేను లాభపడడమూ అనే నా అదృష్టాన్ని పూర్తిగా విలువ కట్టడం నాకు యెప్పుడూ సాధ్యం కాదు.

ఆయన విశ్వవ్యాపక మేధయొక్క, విశ్వాన్ని ఆవరించి, విలువ గల ప్రతి వివరంలోకీ దూరి, దేనినీ అముఖ్యమని గానీ, తృణప్రాయమని గానీ నీచంగా చూడని మేధయొక్క బహు ముఖత్వం — సర్వంకషత్వం అని కూడా అంటాను — అది వున్నచోట, ఆ అధ్యాపనం బహు ముఖంగా వుండక తప్పదు.

డార్విన్ పరిశోధనలయొక్క ప్రాముఖ్యాన్ని గ్రహించిన మొదటివాళ్లలో మార్క్స్ ఒకడు. "జీవజాతుల పుట్టుక" ప్రచురింపబడిన — అసాధారణమైన కాకతాళీయంగా మార్క్స్ యొక్క "అర్థశాస్త్ర విమర్శ" కూడా ప్రచురింపబడిన — 1859కి ముందే కూడా మార్క్స్ డార్విన్‌యొక్క యుగకర్తృ ప్రాముఖ్యాన్ని గుర్తించినాడు. ప్రపంచపు కుతకుతలాడే కేంద్రంలో మార్క్స్ యే విప్లవం కొరకు కృషిచేస్తూ వుండినాడో ఆ విప్లవం లాంటి విప్లవాన్నే డార్విన్, నగరపు రద్దీకి దూరంగా, తన గ్రామీణ ఎస్టేటుయొక్క ప్రశాంతిలో తయారుచేస్తూ వుండినాడు. ఒక్కటే భేదం — డార్విన్ మరొక వైపునుండి కృషిచేస్తూ వుండినాడు.

మార్క్స్ ప్రతి కొత్తదాన్నీ గమనిస్తూ, ప్రతి ముందడుగునూ గుర్తు పెట్టుకుంటూ వుండినాడు, ముఖ్యంగా ప్రకృతిశాస్త్రాలకూ — భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రంతో సహా — చరిత్రకూ సంబంధించిన రంగాలలో. రికార్డో, ఆడమ్ స్మిత్, మెక్‌కుల్లోహ్‌ల పేర్లూ,*

---

* రికార్డో, డేవిడ్ (1772–1823), స్మిత్, ఆడమ్ (1723–1790) — ఇంగ్లీషు అర్థశాస్త్రజ్ఞులు, బూర్జువా సాంప్రదాయిక అర్థశాస్త్రపు ప్రఖ్యాత ప్రతినిధులు;

స్కాటిష్, ఇటాలియన్ అర్థికశాస్త్రవేత్తల పేర్లూ మాలో యెంత తరుచుగా వినబడేవో అంత తరుచుగా హక్స్లీ* – ఈయన "జనరంజక ఉపన్యాసాల"కు మేము నియమంగా హాజరైనాము – మోలెషోట్, లీబిహ్‌ల పేర్లు** వినబడేవి. డార్విన్ తన పరిశోధన కృషినుండి నిర్ణయాలు చేసి, ప్రజల దృష్టికి తెచ్చినప్పుడు, మేము కొన్ని నెలల పాటు డార్విన్‌ను గురించీ, ఆయన శాస్త్రీయ ఆవిష్కరణల అపార ప్రాముఖ్యం గురించీ తప్ప మరొక విషయం మాట్లాడ లేదు....

యితర్ల యోగ్యతను గుర్తించడంలో మార్క్స్ కంటె దయగలవాడూ, న్యాయ దృష్టిగలవాడూ వుండజాలడు. ఈర్ష్యకూ, అసూయకూ, అహంకారానికీ అతీతమైనంత గొప్పవాడు ఆయన. కానీ, ఆయన సకల విధాల వంచననూ, నటననూ యెంత తీవ్రంగా ద్వేషించేవాడో అంత తీవ్రంగానూ అసమర్థ ఆడంబరమూ, వెకిలితనమూ గలవాళ్ల బూటకపు గొప్పతనాన్నీ, కీర్తి నటననూ ద్వేషించేవాడు.

నాకు తెలిసిన గొప్పవాళ్లూ, తక్కువవాళ్లూ, సగటు మనుషులూ అందరిలోనూ అహంకారము లేని కొద్దిమందిలో మార్క్స్ ఒకడు. అహంకారానికి అతీతమైనంత గొప్పవాడూ, శక్తిపరుడూ ఆయన, స్వాభిమాని కూడా. ఆయన యెప్పుడూ భంగిమలు పెట్టేవాడు కాదు, యెల్లప్పుడూ తానుగానే వుండేవాడు. వేషం వేయడమూ, నటన చేయడమూ పసిపిల్లలకు యెలా చేతగాదో ఆయనకూ అలా చేతగాదు. సాంఘిక, రాజకీయ కారణాలవల్ల అది అవాంఛనీయం కానంతవరకు, ఆయన యెప్పుడూ తన మనసులో వున్నదంతా యే మినహాయింపులూ లేకుండా మాట్లాడేవాడు; ఆయన ముఖం ఆయన హృదయానికి అద్దం. పరిస్థితుల వొత్తిడి వల్ల ఆత్మనిగ్రహం అవలంబించవలసి వచ్చినప్పుడు ఆయన పసిపిల్లలలాగ యిబ్బంది పడేవాడు; అది తరుచు ఆయన మిత్రులకు తమాషాగా వుండేది.

మార్క్స్ కంటె సత్యనిరతి గల మనిషి వుండజాలడు – ఆయన మూర్తీభవించిన సత్యనిరతి. ఆయన వైపు చూస్తే చాలు, ఆయన యెలాంటి వాడైందీ తెలిసిపోతుంది. నిత్య యుద్ధంలో వున్న మన "నాగరిక" సమాజంలో మనం సర్వదా నిజం చెప్పలేము. అలా

---

మెక్‌కుల్లొహ్, జాన్ (1789–1864) – ఇంగ్లీషు బూర్జువా అర్థశాస్త్రజ్ఞుడు; అపభ్రంశపు అర్థశాస్త్రానికి ప్రతినిధి. – సం.

* హక్స్లీ, తామస్ హెన్రీ (1825–1895) – ఇంగ్లీషు ప్రకృతిశాస్త్రజ్ఞుడు, చార్లెస్ డార్విన్ సన్నిహిత సహచరుడు, డార్విన్ సిద్ధాంతాన్ని ప్రజానురంజకం చేసినవాడు. – సం.

** మోలెషోట్, యాకొబ్ (1822–1893) – డచ్ శాస్త్రజ్ఞుడు, అపభ్రంశ భౌతికవాదపు ప్రముఖ ప్రతినిధులలో ఒకడు. లీబిహ్, యుస్టుస్ (1803–1873) – సుప్రసిద్ధ జర్మన్ శాస్త్రజ్ఞుడు, వ్యవసాయ రసాయనశాస్త్ర స్థాపకులలో ఒకడు. – సం.

చెప్పితే, శత్రువులకు దొరికిపోతాం. లేదా రాజకీయ జీవితంనుండి నెట్టివేయబడే ప్రమాదానికి లోబడతాం. కానీ సత్యం చెప్పడం తరుచు ఉచితం కాకపోయినా, అసత్యం చెప్పడం అవసరం కాదు. నేను అనుకొన్నదీ, నాకు అనుపించినదీ సర్వదా చెప్పకూడదు; కానీ దాని అర్థం నాకు అనిపించనిదీ, నేను అనుకోనిదీ చెప్పితీరాలని కాదు. మొదటిది వివేకం. రెండవది వంచన. మార్క్స్ యెప్పుడూ వంచకుడు కాదు. ఆయనకది బొత్తిగా చేతగాదు, ప్రౌఢత్వం లేని పసిపిల్లల లాగే. ఆయన భార్య ఆయన్ను తరుచుగా "పెద్దపసివాడు" అనేది. ఆయన్ను యెవరూ, ఎంగెల్సు కూడా, ఆమె కంటె బాగా అర్థం చేసుకోలేదు, తెలుసుకోలేదు. "పదిమందిలో" వున్నప్పుడు — అనగా ప్రతిదాన్నీ బాహ్యాకారాలను బట్టి విలువ కట్టేచోట, మనసులోని భావాలను బలవంతంగా అణచుకోవలసిన చోట, వున్నప్పుడు — మన "మూర్" పెద్ద పిల్లవానిలాగ వుండేవాడు, యిబ్బంది పడి, పసిపిల్లవానిలాగ బిడియపడేవాడు.

నటన చేసే వాళ్లంటే ఆయనకు అసహ్యం. నాకింకా జ్ఞాపకం — లూయీ బ్లాన్* తన మొదటి సమావేశం గురించి ఆయన మాతో చెప్పతూ యెంతగా నవ్వినాడని! ఆయన అప్పటికింకా డీన్ స్ట్రీట్‌లో వుండినాడు. ఆ చిన్న ఫ్లాట్‌లో నిజంగా రెండు గదులు మాత్రమే వుండినాయి — ముందర వున్న భోజనాల గది ఒకటి, అదే పఠనాగారంగానూ, డ్రాయింగు రూమ్‌గానూ ఉపయోగింపబడుతూ వుండింది; రెండవది మిగత అన్ని పనులకూ ఉపయోగించే వెనక గది. లూయీ బ్లాన్ లెన్‌హెన్‌కు తన కార్డు యిచ్చినాడు; ఆమె అతన్ని ముందరి గదిలోకి తెచ్చింది. మార్క్స్ వెనక గదిలో త్వరగా దుస్తులు వేసుకుంటూ వుండినాడు. రెండు గదుల మధ్య తలుపు కొద్దిగా తెరవబడి వుండింది. మార్క్స్‌కు తమాషా అయిన దృశ్యం కనపడింది. ఆ "గొప్ప" చరిత్రకారుడూ, రాజకీయవాదీ అయిన మనిషి చాలా పొట్టిమనిషి, యెనిమిదేండ్ల పిల్లవాని కంటె యేమీ యెత్తు వుండడు. కానీ అతను మహా ఆడంబరుడు. కార్మికవర్గపు డ్రాయింగురూమ్‌లో కలయజూడగా అతనికి ఒక మూల యిక్ష్వాకుల నాటి అద్దం ఒకటి కనపడింది. వెంటనే అతను దాని ముందర నిలబడి, ఒక భంగిమ ధరించి నిలబడినాడు, తన మరుగుజ్జు శరీరాన్ని సాధ్యమైనంత సాగదీస్తూ — అతని కున్నంత యెత్తు మడిమల బూట్లు నేను యెక్కడా చూడలేదు. అతను ఆహ్లాదంతో తన్ను తాను చూసుకుంటూ, మార్చిమాసపు కుందేలులాగ మిడిసిపడుతూ, ఠీవిగా వుండడానికి ప్రయత్నించినాడు. యీ హాస్య దృశ్యాన్ని మార్క్స్ భార్య కూడా చూసింది; ఆమె నవ్వు పట్టలేక పెదవులు కొరుక్కుంది. మార్క్స్ దుస్తులు ధరించడం పూర్తి

---

* బ్లాన్, లూయీ (1811–1882) — ఫ్రెంచి పెటీబూర్జువా సోషలిస్టు, 1848 విప్లవకాలంలో తాత్కాలిక ప్రభుత్వ సభ్యుడు. — సం.

అయినాక దగ్గినాడు, తాను వస్తున్నట్లు తెలియజేయడానికి. ఆ పటాటోపపు నాయకుడు అద్దం ముందునుండి పక్కకు పోయి, సవినయంగా వంగి మార్క్స్‌ను పలకరించినాడు. నటన చేయడమూ, పోజులు పెట్టడమూ మార్క్స్ దగ్గర యెవరికీ ఉపకరించవు. "చిన్న లూయీ" — లూయీ బోనపార్ట్‌తో భేదం తెలియజేయడానికి బ్లాన్‌ను పారిస్ కార్మికులు అలా అనేవాళ్లు — తొందర తొందరగా తనకు చేతనైనంత సహజ భంగిమను ధరించినాడు....

## 6

## పనిచేసేటప్పుడు మార్క్స్

"మహామేధ అంటే పరిశ్రమ" అని యెవరో అన్నారు. అది కొంతవరకు నిజం, పూర్తిగా కాకపోయినా.

అపారమైన శక్తీ, అసాధారణమైన శ్రమా లేకుండా మహామేధ వుండజాలదు. మహామేధ అనబడేదేదైనా, అందులో మొదటిదానికి గానీ, రెండవదానికి గానీ యే పాత్రా లేకపోతే, తళతళలాడే నీటి బుడగ మాత్రమే, లేదా చంద్రమండలంలోని కోశాధికారులు బలపరిచే నోటు మాత్రమే. సగటును మించిన శక్తీ, పరిశ్రమా వున్న చోటనే మహామేధ వుంటుంది. తమ్మి తాము మహామేధావులుగా యెంచుకునేవాళ్లను, ఒకోసారి యితర్లచేత కూడా యెంచ బడేవాళ్లను, నేను చాలాసార్లు చూసినాను, కానీ వాళ్లకు పనిచేసే సామర్థ్యం లేదు. నిజానికి వాళ్లు మాటల నేర్పూ, ప్రచారం చేసుకునే ప్రజ్ఞా గల వట్టి పనికిమాలినవాళ్లు. నాకు తెలిసినవాళ్లలో నిజమైన ప్రాముఖ్యం గలవాళ్లందరూ కష్టపడి పనిచేసేవాళ్లు. యిది మార్క్స్ విషయంలో యెంత నిజమంటే, అంతకు మించిన నిజం మరెవరి విషయంలోనూ లేదు. ఆయన బ్రహ్మాండంగా పనిచేసేవాడు. ఆయన తరుచుగా పగటి పూట పనిచేసుకోవడం పడేది కాదు — ముఖ్యంగా ఆయన ప్రవాస జీవితపు మొదటి దశలో. అందువలన ఆయన రాత్రి పూట పనికి పూనుకున్నాడు. యే సమావేశంనుండో యింటికి ఆలస్యంగా వస్తే, అప్పుడు కూర్చొని కొద్ది గంటలసేపు పనిచేసుకోవడం ఆయనకు మామూలు. ఆ కొద్దిగంటలు అనేది అంతకంతకూ దీర్ఘమై చివరకు ఆయన దాదాపు రాత్రంతా పనిచేసి, ఉదయం పండుకునేవాడు. దాన్ని గురించి ఆయన భార్య ఆయనతో యెంతగానో నిష్ఠూరమాడింది, కానీ తనకు అది సహజమని ఆయన నవ్వేసేవాడు....

మార్క్స్ దేహతత్వం అసాధారణంగా దృఢమైనదైనప్పటికీ, యాభైల అంతంలో ఆయన రకరకాల బాధలు పడసాగినాడు. డాక్టర్ సలహా పొందవలసి వచ్చింది. ఫలితంగా మార్క్స్

రాత్రి పూట పనిచేయడం కచ్చితంగా నిషేధింపబడింది. దండిగా వ్యాయామం — నడకా, గుర్రపు స్వారీ — విధింపబడింది. ఆ రోజుల్లో లండన్ శివార్లలో ప్రధానంగా ఉత్తరాన వున్న గుట్టల్లో, నేనూ, మార్క్సు చాలా సార్లు షికారుపోయినాము. ఆయన త్వరగా కోలు కున్నాడు కూడా; ఆయన దేహం నిజంగా గొప్ప శ్రమకూ, బల ప్రదర్శనకూ తయారు చేయబడింది.

కానీ, ఆయన క్రమక్రమంగా మళ్లీ రాత్రిపూట పనిచేసుకునే అలవాటులో పడిపోయి నప్పుడు, ఆయన ఆరోగ్యం యథాస్థితికి వచ్చింది; చివరకు సంక్షోభ దశ వచ్చి మరికొంత సవ్యమైన జీవిత పద్ధతి అవలంబించేటట్లు ఆయన్ను నిర్బంధించింది, తప్పనిసరి అని ఆయనకు అనిపించినంతవరకు మాత్రమే అయినప్పటికీ. జబ్బు అంతకంతకూ తీవ్రమైంది. లివర్ వ్యాధి ప్రవేశించింది, చెడ్డ పుండ్లు పుట్టినాయి. ఆయన ఉక్కు శరీరతత్వం క్రమంగా దెబ్బతినింది.

నా నమ్మకం యేమంటే — చివరి రోజుల్లో ఆయనకు చికిత్స చేసిన డాక్టర్ల అభిప్రా యం కూడా అదే — ప్రకృతికి అనుగుణంగా, అనగా శరీర ధర్మాలకూ, ఆరోగ్యశాస్త్ర విధు లకూ అనుగుణంగా, జీవించాలని మార్క్సు నిశ్చయించుకొని వుంటే, ఆయన యీనాటికింకా సజీవంగా వుండేవాడు. తన చివరి సంవత్సరాలలో మాత్రమే, సమయం మించిపోయిన తర్వాత మాత్రమే, ఆయన రాత్రి పూట పనిచేయడం మానుకున్నాడు. కానీ పగటిపూట యింకా యెక్కువ పని చేసేవాడు.

యే కొంచెం వీలు కలిగినా ఆయన పనిచేసుకునేవాడు. ఆయన షికారు పోయినప్పుడు కూడా నోటుబుక్కు వెంటపెట్టుకొని, అందులో రాసుకుంటూ వుండేవాడు. మరి ఆయన పని పైపై పని యెప్పుడూ కాదు; పనిచేయడంలో అనేక పద్ధతులు వున్నాయి. ఆయన పని యెప్పుడూ గాఢమైంది, కట్టుదిట్టమైంది. ఆయన కూతురు ఎలినోర నాకొక చిన్న చరిత్ర పట్టీని యిచ్చింది. అది ఆయన తనకోసం తయారుచేసుకొన్నది, యేదో అప్రధాన మైన అభిప్రాయ ప్రకటన కొరకు ఒక సాధారణ చిత్రం యేర్పరచుకోడానికి. నిజంగా మార్క్సుకు యేదీ అప్రధానం కాదు; తన సొంత తాత్కాలిక ఉపయోగానికి తయారుచేసుకొన్న పట్టీ, అచ్చువేసే ఉద్దేశంతో తయారుచేసినట్లు, అధిక పరిశ్రమతోనూ, శ్రద్ధతోనూ తయారు చేయబడింది.

పనిలో మార్క్సు కుండిన ఓర్పు నాకు చాలా సార్లు అచ్చెరువు కలిగించింది. ఆయన అలసట అనేది యెరగడు. అనారోగ్యంతో పని చేయలేని స్థితికి చేరుకున్నప్పుడు కూడా, ఆయనలో శక్తి క్షీణించిన లక్షణాలు కనిపించలేదు.

వస్తువుల విలువను వాటిలో నిక్షిప్తమైన శ్రమయొక్క పరిమాణాన్నిబట్టి లెక్కగట్టి

నట్లుగానే, మనిషి విలువను అతను చేసే పనినిబట్టి లెక్కగట్టితే, ఆ దృష్టిలో కూడా మార్క్స్ యెంత విలువగల మనిషి అంటే, కొద్దిమంది అమేయమైన మహామేధావులను మాత్రమే ఆయనతో పోల్చవచ్చు.

ఆ అపార పరిమాణం గల పనికి గాను మార్క్స్‌కు బూర్జువా సమాజం యేమిచ్చింది? "పెట్టుబడి" నలభై సంవత్సరాల పని. ఆ పని కూడా మార్క్స్‌కు మాత్రమే చేతనైన పని. నేను చెప్పేది అతిశయోక్తి కాజాలదు — జర్మనీలో అత్యంత హీనమైన జీతం వచ్చే కార్మికునికి కూడా నలభై యేండ్లలో యెక్కువ జీతం వచ్చింది — మార్క్స్‌కు గౌరవ వేతనంగా, మొరటుగా చెప్పాలంటే గౌరవ రుణంగా, వచ్చినదాని కంటే, యీ శతాబ్దపు రెండు మహోన్నత శాస్త్రీయ సృజనలలో ఒకదానికి గాను. మరొకటి డార్విన్ చేసిన కృషి. "శాస్త్రవిజ్ఞానం" వర్తకపు సరుకు కాదు. మరి బూర్జువా సమాజం న్యాయమైన మూల్యం చెల్లిస్తుందని అనుకోజాలం గదా, దానికే మరణశిక్ష విధించినందుకుగాను....

## 7

## డీన్ స్ట్రీట్‌లోని యింటిలో

1850 వేసవినుండి, 1862 ప్రారంభంలో నేను జర్మనీకి తిరిగిపోయినంతవరకు నేను దాదాపు ప్రతిరోజూ మార్క్స్ యింటికి పోయేవాణ్ణి, అనేక సంవత్సరాలు పగలంతా అక్కడే వుండేవాణ్ణి. నేను అచ్చంగా ఆ కుటుంబంలో ఒకణ్ణిగా వుండేవాణ్ణి.

మేయ్‌ట్లాండు పార్కు రోడ్డులోని కాటేజిలోకి మారకముందు మార్క్స్ సోహో స్క్వేర్‌లోని నిరాడంబరమైన డీన్ స్ట్రీట్‌లో ఒక చిన్న ఫ్లాట్‌లో వుండినాడు. అది ప్రయాణికులకు — లండన్ గుండా ప్రయాణించేవాళ్లకూ, రకరకాల ప్రవాసులకూ — విడిదిగా వుండింది; అంత ముఖ్యం కానివాళ్లూ కొంత ముఖ్యమైనవాళ్లూ, అత్యంత ముఖ్యమైనవాళ్లూ నిరంతరం అక్కడికి వస్తూ పోతూ వుండినారు.

అంతే కాక, లండన్‌లో స్థిర నివాసం వుండేవాళ్లకు అది సహజమైన సమావేశ స్థలం. స్థిర నివాసానికి సంబంధించినంతవరకు, యెప్పుడూ యేదో ఒక యిబ్బంది వుండేది. లండన్‌లో స్థిరమైన వసతి సంపాదించడం కష్టంగా వుండేది. ఆకలి అత్యధిక ప్రవాసులను యితర పట్టణాలకో, అమెరికాకో పోయేటట్లు చేసేది. వాళ్లలో కొంతమందిని అది త్వరగా ముగించేసేది; దౌర్భాగ్యపు ప్రవాసులను యేదో ఒక లండన్ స్మశానానికి పంపించేసేది. అక్కడ వాళ్లకు బతకడానికి కాకపోయినా, విశ్రమించడానికి స్థలం లభించేది.

కానీ నేను నిలదొక్కుకోగలిగినాను; విశ్వాసం గల లెస్నెర్, లోహ్నెర్‌లు* తప్ప — అయినా వాళ్లు డీన్ స్ట్రీట్‌కు అరుదుగా వచ్చేవాళ్లు — లండన్ "బృందం"లో నేను ఒక్కడినే నా రచనలో చెప్పబోయే కొద్ది కాలం తప్ప ఆ ప్రవాస దశ అంతటిలోనూ, "మూర్" యింటికి ఆ కుటుంబ సభ్యుని లాగా వస్తూ పోతూ వుండేవాణ్ణి. కనుక యితరులకు సాధ్యం కానిది నేను చూసి తెలుసుకోగలిగినాను.

## 8

### ప్రవాసుల పన్నాగాలు

నేను లండన్‌కు పోక ముందు కాలానికి చెందిన మిత్రులూ, క్రామేడ్లూ మార్క్స్‌పట్ల నాకున్న అనుబంధాన్ని బట్టి నన్ను తరుచు హాస్యమాడేవాళ్లు. బాడెన్ స్వచ్ఛంద సైనికులలో అత్యంత సమర్థుడైన బౌవర్** ఆ కాలంలో సిన్‌షీమ్‌నుండి నాకు రాసిన ఒక ఉత్తరం యిటీవల నాకు కనిపించింది. కొద్ది సంవత్సరాల క్రితం అతను మిల్వాకీ (అమెరికా)లో మరణించినాడు; అక్కడ తానే స్థాపించిన ఒక తీవ్రవాద ప్రజాతంత్ర పత్రికకు అతను సంపాదకుడుగా వుండినాడు. తగినంత డబ్బు వున్న ప్రవాసులలో అత్యధికుల లాగే, లండన్‌లో కొద్ది కాలం వున్న తర్వాత అతను అమెరికాకు పోయినాడు; త్వరలోనే అతనికి పత్రికల్లో తగిన పని దొరికింది.

లండన్ ప్రవాసులకు అది అత్యంత కష్టమైన దశ; మరి బౌవర్ నన్ను తనతో వుంచుకోవాలని చాలా కోరికతో వుండినాడు. సంపాదకుడుగా సముచితమైన జీతం వచ్చే నమ్మకమైన అవకాశాలు కలిగిస్తూ అతను అప్పటికే నాకు కొన్ని ఉత్తరాలు రాసినాడు. ఆ కాలంలో నాకు తినడానికి ఒక ముక్క రొట్టె కూడా లేదు; అతను యిస్తానన్న వారానికి యాభై

---

* లెస్నెర్, ఫ్రీడ్రిఖ్ (1825–1910) — అంతర్జాతీయ కార్మికోద్యమ చురుకైన కార్యకర్త, వృత్తిరీత్యా దర్జీ, మార్క్స్, ఎంగెల్సుల మిత్రుడూ, సహచరుడూ. లోహ్నెర్, గెయొర్గ్ (జననం సుమారు 1824 — మరణం తెలీదు) — జర్మన్ కార్మికోద్యమ కార్యకర్త; కమ్యూనిస్టు లీగ్, మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు; వడ్రంగి; మార్క్స్, ఎంగెల్సుల మిత్రుడూ, సహచరుడూ. — సం.

** 1849లో బాడెన్ — ఫాల్జ్ తిరుగుబాటులో పాల్గొన్న కార్ల్ ఫ్రీడ్రిఖ్ బౌవర్. — సం.

డాలర్లు అత్యంత ఆకర్షణీయమైన యెర. కానీ నేను నిగ్రహించుకున్నాను, యుద్ధ రంగానికి తప్పనిసరి అయినంతకంటె యే మాత్రమూ దూరంగా వుండడానికి యిష్టపడక. యెందు కంటే, సముద్రం దాటినవాళ్లు వెయ్యింట 999 వంతులు యూరప్‌కు దక్కకుండా పోయినట్లే అని నాకు తెలుసు.

చివరకు, బౌవర్ నా స్వాభిమానాన్ని రెచ్చగొట్టడం అనే కడపటి ఆయుధం ప్రయో గించినాడు. నా కాగితాలలో యిప్పటికీ నావద్ద వున్న ఒక ఉత్తరంలో అతను యిలా రాసినాడు:

"యిక్కడ నీవు స్వేచ్ఛాజీవివి, స్వతంత్రంగా యెంతో సాధించగలవు. కానీ అక్కడ యేమిటి నీవు? ఆడుకునే బంతివి; బరువులు మోసి, తరువాత నవ్వుల పాలయ్యే గాడిదవు. మీ స్వర్గ రాజ్యంలో యెలా వుంది? పట్టుపైన సింహాసనం అధిష్ఠించి సర్వజ్ఞుడూ, సర్వసమగ్రవిజ్ఞుడూ అయిన దలైలామా లాంటి మార్క్స్. తరువాత పెద్ద ఖాళీ. తరువాత ఎంగెల్సు. తరువాత మళ్లీ పెద్ద ఖాళీ. తరువాత వొల్ఫ్. ఆ తరువాత మరొక పెద్ద ఖాళీ. ఆ తరువాత బహుశా 'మమతామయ గార్దభం' లీబ్‌క్నెఖ్ట్...."

నేను జవాబిచ్చినాను: నాకంటె యెక్కువ చేసినవాళ్ల తర్వాత వుండడానికి నాకేమీ అభ్యంతరం లేదనీ, నేను అతని "గొప్పవాళ్ల" నందరినీ నీచంగా చూసేవాళ్ల సాహచర్యంలో కాక, నేను గౌరవంగా చూడగలవాళ్ల సాహచర్యంలోనూ, నేను యేదైనా నేర్చుకోగల వాళ్ల సాహచర్యంలోనూ వుండడానికి యిష్టపడతాననీ.

ఆ విధంగా నేను వున్నచోటనే వుండిపోయినాను; వుండిపోయి నేర్చుకున్నాను.

కానీ, మా వలయానికి వెలుపల వున్న ప్రవాసులలో మార్క్స్‌ను గురించీ, మా సంఘం గురించీ వున్న అభిప్రాయం అది. మేము వాళ్లనుండి అంత సంపూర్ణంగా దూరం కావడం వాళ్ల ఊహాశక్తిని రెచ్చగొట్టింది; వాళ్లు కట్టుకథలూ, గాలి కబుర్లూ అల్లిబిల్లిగా అల్లినారు. కానీ మేము పట్టించుకోలేదు.

## 9

## మార్క్స్ యింట్లో సమావేశాలు

బహుశా నామీద మార్క్స్ ప్రభావం యెంత వుండిందో, మార్క్స్ భార్య ప్రభావం సరిగా అంతే వుండింది. మా అమ్మ నాకు మూడేండ్లు వున్నప్పుడు చనిపోయింది; నేను కాస్త కఠిన మార్గంలో పెరిగినాను.... మార్క్స్ భార్యలో నాకు అందమైన, ఉదాత్తమైన తెలివి పరురాలైన స్త్రీ కనిపించింది; మిత్రరహితంగా, ఒంటరి తిరుగుబాటు స్వచ్ఛంద సైనికుడుగా వుండిన నాకు, థేమ్స్ నది ఒడ్డుకు కొట్టుక వచ్చిన నాకు, ఆమె సగం తోబుట్టువుగా,

సగం తల్లిగా వుండింది. ప్రవాస జీవితపు బాధలలో నన్ను వినాశనంనుండి రక్షించింది మార్క్స్ కుటుంబంతో నాకు గల సంబంధమే అని నమ్ముతున్నాను....

ఆ కాలంలో మార్క్స్ యింటిలోనూ, మార్క్స్ సాహచర్యంలోనూ నేను కలుసుకున్నవాళ్ల నందరినీ పరిచయం చేయడానికి నాకు యిక్కడ వ్యవధీ లేదు, స్థలమూ లేదు. మాతో స్నేహ సంబంధమైన శత్రుత్వం యేమీ లేని జర్మన్, తదితర ప్రవాసులు కాక, నేను కలుసుకున్నవాళ్లు ఇంగ్లీషు కార్మికోద్యమ నాయకులు స్పార్టన్ గుణాలు గల జూలియన్ హార్నీ, వాగ్ధాటి గల ప్రజానాయకుడూ, దీక్ష గల ప్రాతినిధికేయుడూ అయిన ఎర్నెస్ట్ జోన్స్ – పెరిగి సోషలిజంగా పరివర్తన చెందిన చార్టిజం*యొక్క చివరి యిద్దరు గొప్ప ప్రతినిధులు వీళ్లు; ఫ్రాస్ట్ – యితను చార్టిస్టు తిరుగుబాటుకు నాయకత్వం వహించినందుకు యావజ్జీవిత ద్వీపాంతరవాస శిక్ష విధించబడి, తరువాత క్షమించబడి యాబైలలో ఇంగ్లండుకు తిరిగి వచ్చినాడు, "భౌతిక బల బృందం"**లో అందరికంటె బృహత్కాయుడు; రాబర్ట్ ఓవెన్ – యితను సోషలిజంయొక్క వృద్ధి పితామహుడు, శాస్త్రీయ సోషలిజానికి ముందు వుండిన వాళ్లలో కెల్ల విజ్ఞానవంతుడూ, నిశిత బుద్ధీ, ఆచరణవాదీ. యితని యెనబయ్యవ జన్మ దినం జరిగినప్పుడు మేము అక్కడ వుండినాము. యితన్ని తరుచుగా తన యింటిలో కలుసుకునే అదృష్టం కలిగింది నాకు....

నా తర్వాత కొద్ది రోజులకు ఒక ఫ్రెంచి కార్మికుడు లండన్‌కు వచ్చినాడు. ఫ్రెంచి కాలనీలోనే కాక, మా ప్రవాసులందరిలోనూ, మా "నీడ"లైన అంతర్జాతీయ పోలీసులలో కూడానూ అతనిపట్ల మంచి ఆసక్తి కలిగింది. అతని పేరు బర్తెలెమీ. జైలునుండి అతను చాతుర్యంగా, సాహసంగా తప్పించుకోవడం మేము పత్రికల్లో చదివి వుండినాము. మామూలు మనుషుల కంటె కాస్త యెత్తుగా బలంగా కండరాలు తిరిగి, కారునలుపు ఉంగరాల జుట్టూ, మిలమిలలాడే నల్లని కన్నులూ గల అతను అచ్చం దక్షిణాది ఫ్రెంచివాడు, మూర్తీభవించిన పట్టుదల.

సగర్వుడైన ఆ మనిషి చుట్టూ ఒక ఉజ్వలమైన వీరగాథ వుంది. అతనికి కఠిన శిక్ష విధింపబడి, భుజంమీద మాసిపోని వాత వేయబడింది. పదేడేండ్ల వయస్సులోనే అతను,

---

* చార్టిజం – ఇంగ్లీషు కార్మికవర్గ మొదటి ప్రజా విప్లవోద్యమం (19 శతాబ్ది, 30–40 సంవత్సరాలు). – సం.

** చార్టిస్టు ఉద్యమంలోని వామపక్ష, విప్లవ ధోరణికి చెందినవాళ్లు "భౌతిక బల బృందం." ఉద్యమాన్ని శాంతియుత ఆందోళనా హద్దులలో వుంచాలనుకొన్న "నైతిక బల బృందం"కు వ్యతిరేకంగా, దౌర్జన్యపద్ధతులు అభిమానించినారు వీళ్లు. – సం.

1839 నాటి బ్లాంకి – బార్బే తిరుగుబాటులో,* ఒక పోలీసువాణ్ణి చంపి, శిక్షింపబడి నాడు. 1848 ఫిబ్రవరి విప్లవంలో క్షమాదానంమీద విడుదల చేయబడి, అతను పారిస్‌కు పోయి, కార్మికవర్గంయొక్క ఉద్యమాలన్నిటిలోనూ, ప్రదర్శనలన్నిటిలోనూ పాల్గొన్నాడు. అతను జూన్ యుద్ధంలో పోరాడినాడు.** చివరి మార్గావరోధాల్లో ఒక దాని దగ్గర అతను పట్టుబడినాడు, కానీ అదృష్టవశాత్తు అతన్ని మొదటి రోజుల్లో యెవరూ గుర్తుపట్టలేదు, లేకపోతే యెంతోమంది యితర్లను చేసినట్లే అతన్ని వెంటనే కాల్చిపారేసేవాళ్లు. అతన్ని మిలిటరీ కోర్టుకు తెచ్చేటప్పటికి మొదటి హింసాకాండ తగ్గిపోయి వుండింది; అతనికి కాయేన్***లో యావజ్జీవిత ద్వీపాంతరవాస శిక్ష మాత్రమే విధింపబడింది. యే కారణంవల్లనో అతని కేసు ఆలస్యం జరిగి, 1850 జూన్‌లో అతను యింకా జైలులోనే వుండినాడు. మిరియాలు పండేదీ, మనుషులు చచ్చేదీ అయిన ఆ ద్వీపానికి అతన్ని తరలించడానికి సరిగ్గా ముందుగా అతను జైలునుండి తప్పించుకొన్నాడు.

సహజంగానే అతను లండన్ చేరినాడు. ఇక్కడ అతను మాకు సన్నిహితంగా వుంటూ, తరుచుగా మార్క్స్ యింటికి వచ్చేవాడు....

అతనితో నేను చాలా సార్లు కత్తిదూసినాను. ఫ్రెంచి ప్రవాసులు ఆక్స్‌ఫర్డ్ స్ట్రీట్‌లోని రాత్‌బోన్ ప్లేస్‌లో ఒక "ఖడ్గ మందిరం" నెలకొల్పినారు; అక్కడ ఖడ్గంతోనూ, వంకర ఖడ్గంతోనూ కత్తి యుద్ధమూ, పిస్టల్ కాల్చడమూ సాధన చేసుకోవచ్చు. మార్క్స్ అప్పుడప్పుడు అక్కడికి పోయి, ఫ్రెంచివాళ్లతో శ్రమదాయకమైన కత్తి యుద్ధాలు చేసేవాడు. ఆయన తన సామర్థ్యలోపాన్ని ఉద్ధతిచేత పూరించుకోజూసేవాడు; తగినంత చిత్తస్థైర్యం లేనివాళ్లను ఆయన అప్పుడప్పుడు నటనతో ఓడించేవాడు.

ఫ్రెంచివాళ్లు ఖడ్గాన్ని వ్రేటుకూ, పోటుకూ కూడా ఉపయోగిస్తారు. యిది జర్మన్లను మొదట తబ్బిబ్బు చేస్తుంది, కానీ మనం దానికి త్వరలో అలవాటు పడతాం. బర్తెలెమీ మంచి కత్తిసాముకాడు; అతను తరుచుగా పిస్టల్‌తో సాధనచేసి, అనతి కాలంలో ఉత్తమమైన గురికాడు అయినాడు. త్వరలో అతను విల్లిహ్**** బృందంలో చేరి, మార్క్స్ పట్ల ద్వేషం వహించినాడు.

విల్లిహ్ ముఠాతో భేదాభిప్రాయం తీవ్రమైంది. ఒక రోజు సాయంత్రం మార్క్స్‌ను

---

* పారిస్‌లో, 1839 మేలో, "సంవత్సర రుతువుల సంఘం" అనే బ్లాంకిస్టు రహస్య విప్లవ సంస్థయొక్క తిరుగుబాటు. – సం.

** 1848లో పారిస్ కార్మికవర్గం చేసిన జూన్ తిరుగుబాటు. – సం.

*** ఫ్రెంచి గయానా (దక్షిణ అమెరికా)లోని ఒక పట్టణం, రాజకీయ ఖైదీల ద్వీపాంతరవాస స్థలం. – సం.

**** 1850లో కమ్యూనిస్టు లీగులో చీలిక వచ్చింది. "వామపక్ష" దుస్సాహసిక బృందానికి విల్లిహ్ నాయకుడు. లీగునుండి ఆ బృందం బహిష్కరింపబడింది. – సం.

విల్లిహ్ ద్వంద్వ యుద్ధానికి సవాల్ చేసినాడు. ఆ ప్రష్యన్ మిలిటరీ ఆఫీసరు పన్నాగాన్ని మార్క్స్ దాని యోగ్యతకు తగినట్లుగానే నిర్లక్ష్యం చేసినాడు. కానీ ఉడుకు రక్తంగల యువకుడు కోన్రాడ్ ష్రామ్* విల్లిహ్‌ని అవమానపరుస్తూ జవాబు యిచ్చినాడు. విల్లిహ్ తన విద్యార్థి నీతుల ప్రకారం, అతన్ని సవాల్ చేసినాడు.

ద్వంద్వ యుద్ధం బెల్జియంలో సముద్ర తీరంలో జరిగేటట్లు నిర్ణయింపబడింది; ఆయుధాలుగా పిస్తళ్లు యెన్నుకోబడినాయి. ష్రామ్ యెన్నడూ చేతిలో పిస్టల్ పట్టుకొని యెరగడు, కానీ విల్లిహ్ యిరవై అడుగుల దూరంనుండి పేక ముక్కను కాల్చడంలో యెన్నడూ గురి తప్పలేదు. అతని సహాయకుడు బర్తెలెమీ. దుందుడుకు వీరుడైన మా ష్రామ్‌ను గురించి మేము భయపడినాము.

ద్వంద్వ యుద్ధానికి నిర్ణయింపబడిన దినం గడిచిపోయింది, మాకు నిముష మొక్క యుగంగా. మరుదినం సాయంత్రం, మార్క్స్ బయటికి పోయినప్పుడు, ఆయన భార్యా, లెన్‌హెన్ మాత్రమే యింటిలో వుండగా, తలుపు తెరుచుకొంది, బర్తెలెమీ ప్రవేశించినాడు. అతను బిర్రుగా నమస్కరించి, వార్తల కోసం ఆతురతో వాళ్లు చేసిన విజ్ఞప్తికి సమాధానంగా, మృత్యు ప్రశాంత కంఠంతో చెప్పినాడు: "ష్రామ్ తలలో గుండు దూరింది!" అతను మళ్లీ బిర్రుగా నమస్కరించి, గిర్రున వెనుదిరిగి వెళ్లిపోయినాడు. మార్క్స్ భార్యకు మూర్ఛ వచ్చినంత పని అయింది — ఆమె యెంత భయ కంపితురాలైందీ సులభంగా ఊహించుకోవచ్చు.... ఒక గంట తర్వాత ఆమె మాకు ఆ దుర్వార్త తెలిపింది. సహజంగా మేము ష్రామ్‌ను గురించి ఆశ వదులుకున్నాం.

మరుదినం, సరిగ్గా మేము అతన్ని గురించి శోకతప్తులమై మాట్లాడుకుంటూ వుండగా, తలుపు తెరుచుకొని, మేము చచ్చినాడనుకున్న మనిషి లోపలికి వచ్చినాడు, తలకు కట్టు కట్టుకొని, కానీ ఉల్లాసంగా నవ్వులు ఒలకబోస్తూ. గుండు తనకు రాచుకొనిపోయిందనీ, తాను తెలివి దప్పి పడిపోయినాననీ అతను చెప్పినాడు. తనకు తెలివి వచ్చేటప్పటికి తన పక్కన తన సహాయకుడూ, డాక్టరూ తప్ప యెవరూ లేరు. విల్లిహ్, బర్తెలెమీలు ఓస్టెండ్‌నుండి లండన్‌కు బయలుదేరే పడవను సరిగ్గా అందుకోగలిగినారు. ష్రామ్ తరువాతి పడవలో వచ్చేసినాడు....

---

*ష్రామ్, కోన్రాడ్ (1822–1858) — జర్మన్ విప్లవవాది, కమ్యూనిస్టు లీగు సభ్యుడు, మార్క్స్ ఎంగెల్సుల స్నేహితుడు. — సం.

10

# మార్క్సు, పిల్లలూ

దృఢమైన, ఆరోగ్యవంతమైన ప్రకృతి గలవాళ్లందరిలాగే, మార్క్సుకు పిల్లలమీద అపారమైన ప్రేమ. ఆయన తన పిల్లలతో కలిసి గంటలకొద్దీ తానూ ఒక పిల్లవాడుగా వుండగల మహా ప్రేమార్ద్రమైన తండ్రి మాత్రమే కాదు. యెవరి పిల్లలైనా ఆయన్ను సూదంటు రాళ్లలాగా ఆకర్షించేవాళ్లు, ముఖ్యంగా అనాథలైన పిల్లలు కష్టాల్లో వుండి ఆయనకు యెదురైనప్పుడు. బీదవాళ్ల పేటలగుండా మేము నడిచి వెళ్లేటప్పుడు, వందలసార్లు ఆయన మమ్మల్ని వదలిపెట్టి పోయేవాడు, చింపిరి బట్టలతో వాకిలి ముందర కూర్చున్న యే పసిబిడ్డ తలనో నిమిరి, ఆ బిడ్డ చేతిలో పెన్నీయో, అర పెన్నీయో పెట్టడానికి.

ఆయన బిచ్చగాళ్లను నమ్మేవాడు కాదు — బిచ్చమెత్తుకోవడం లండన్‌లో ఒక వృత్తిగా స్థిరపడింది, లాభసాటి వృత్తిగా కూడా, ఒక్కొక్కరు ఒక చిన్న రాగి డబ్బే యిచ్చినప్పటికీ. కనుక, మొదటి రోజుల్లో ఆయన దగ్గర డబ్బు వుంటే యెవరికీ బిచ్చం లేదనకపోయినా, బిచ్చమెత్తుకునే పురుషులను గానీ, స్త్రీలను గానీ చూసి ఆయన చాలా కాలం మోసపోలేదు. యెవరైనా అనారోగ్యమనో, ఆకలనో అభినయించి, ఆయన హృదయాన్ని కరిగించ జూస్తే, వాళ్లమీద ఆయన తీవ్రంగా ఆగ్రహపడేవాడు — మానవ హృదయంలోని జాలిని అక్రమంగా వినియోగించుకోవడం మరీ నీచమనీ, బీదవాళ్ల సొత్తు అపహరించడంతో సమానమనీ ఆయన యెంచేవాడు. కానీ యే మనిషైనా, స్త్రీ గానీ, పురుషుడు గానీ, యేడ్చే బిడ్డ నెత్తుకొని మార్క్సు వద్దకు వచ్చి చేయి జాపితే, ఆ బిడ్డ కన్నులలోని అభ్యర్థనకు మార్క్సు లొంగిపోయేవాడు — ఆ మనిషి ముఖంలో వంచన యెంత స్పష్టంగా కనపడుతున్నప్పటికీ.


భార్యను కొట్టే మగవాణ్ణి — అలాంటివాళ్లు ఆనాటి లండన్‌లో మామూలు — కొరడా పుచ్చుకొని చంపెయ్యాలనేటంత ఆవేశపడేవాడు మార్క్సు. అలాంటి సందర్భాలలో ఆయన ఉట్టిపాటు ఆవేశం ఆయన్నూ, మమ్మల్నూ తరుచు యిబ్బందుల్లో పెట్టేది.

ఒక సాయంత్రం ఆయనా, నేనూ బస్సు పై అంతస్తులో యెక్కి హాంప్‌స్టెడ్ రోడ్డుకు పోతూ వుండినాము. ఒక హోటల్ దగ్గర వున్న బస్ స్టాపువద్ద చాలా గలాటాగా వుండింది; ''హత్య! హత్య!'' అని ఒక స్త్రీ కేకలు వెయ్యడం వినిపిస్తూ వుండింది. రెప్పపాటులో మార్క్సు బస్సు దిగినాడు, నేను ఆయన్ను అనుసరించినాను. ఆయన్ను ఆపడానికి నేను ప్రయత్నించినాను, కానీ తుపాకి గుండును చేతితో ఆపడానికి ప్రయత్నించడమే అది. వెంటనే మేము ఆ కోలాహలం మధ్యలో వుండినాము, మాచుట్టూ జనం రద్దీగా వుండినారు. ''యేమిటి


సంగతి?" సంగతేమిటో తెలుస్తూనే వుంది. ఒక తాగిన ఆడ మనిషి మగనితో కొట్లాడింది. ఆమెను యింటికి తీసుకపోవాలని అతని ప్రయత్నం. ఆమె ప్రతిఘటిస్తున్నది, దయ్యం పట్టినదానిలాగ కేకలు వేస్తూ. అంతవరకు బాగానే వుంది. మేము జోక్యం కలిగించుకోవలసిన అవసరం లేదని మాకు అర్థమైంది. కొట్లాడే జంటకు కూడా అది అర్థమైంది; వాళ్లు వెంటనే రాజీపడి, మామీదికి వచ్చినారు. మాచుట్టూ వున్న గుంపు యింకా పెరిగి దట్టమైంది; "విదేశీ వెధవల"ను తన్నాలనే ధోరణిని వాళ్లు మాపట్ల వహించినారు. ముఖ్యంగా ఆ స్త్రీ మార్క్స్‌మీద దాడి చేసింది, ఆయన చక్కని, నల్లని గడ్డం ఆమె కోపానికి గురి అయింది. ఆ తుఫానును శాంతపరచడానికి నేను ప్రయత్నించినాను, కానీ సాధ్యం కాలేదు. ఉపకారబుద్ధితో జోక్యం కలిగించుకున్నందుకు మాకు మంచి శిక్ష పడేదే, యిద్దరు భద్రమైన పోలీసులు వచ్చి మమ్మల్ని రక్షించకపోతే. మేము సురక్షితంగా మళ్లీ బస్సు యెక్కి యింటి ముఖం పట్టినప్పుడు సంతోషించినాము. ఆ తరువాత అలాంటి సందర్భాలలో జోక్యం కలిగించుకునే ప్రయత్నాలలో మార్క్స్ మరింత జాగ్రత్తగా వుండినాడు....

ఆయన తన పిల్లలతో కలిసి వుండినప్పుడు చూసినవాళ్లకే అర్థమౌతాయి ఆయనకు గల ప్రగాఢమైన ప్రేమా, నిరాడంబరత్వమూ. ఆయనకు ఒక నిముషం తీరిక వున్నప్పుడు, లేదా షికారు పోయేటప్పుడు, ఆయన వాళ్లతో కలిసి పరుగెత్తుతూ, మహాగోలతో, నవ్వులతో నిండిన వాళ్ల ఆటలలో పాల్గొనేవాడు: పిల్లలమధ్య వున్నప్పుడు ఆయన పిల్లవాడుగా వుండేవాడు. యెప్పుడైనా ఒకసారి హాంప్‌స్టెడ్ హీథ్‌లో మేము "ఆశ్వికదళం" ఆట ఆడేవాళ్లం. ఆయన కూతుర్లలో ఒకరిని నేనూ, మరొకరిని మార్క్స్ భుజాలమీద యెక్కించుకునేవాళ్లం; అప్పుడు యెగిరే పోటీయో, పరుగు పందెమో ప్రారంభమయ్యేది, లేదా రౌతులు ఆశ్విక యుద్ధం చేసేవాళ్లు. ఆడపిల్లలు మగపిల్లలలాగే గట్టివాళ్లు – తల బొప్పికట్టినా యేడ్చేవాళ్లు కాదు.

యిద్దరిలో పెద్ద కూతురు జెన్నిహెన్ అచ్చం తండ్రి పోలిక: ఆమెకు అవే నల్లని కన్నులూ, అదే నుదురూ. ఆమెకు అప్పుడప్పుడు పూనకం వచ్చేది. ఆమె కన్నులు మెరుస్తూ, నిప్పుల్లా అయ్యేవి; ఆమె యేదైనా వర్ణించడం ప్రారంభించేది – తరుచు మహా అచ్చెరువు కలిగించే చిత్ర కల్పనలను. ఒక రోజు హాంప్‌స్టెడ్ హీథ్‌నుండి యింటికి పోయేటప్పుడు ఆమెకు అలాంటి పూనకం వచ్చి, నక్షత్రాలలోని జీవుల గురించి మాట్లాడింది; ఆమె మాటలు కవిత్వ రూపం ధరించినాయి. కొంతమంది పిల్లలను పసితనంలోనే పోగొట్టుకున్న మార్క్స్ భార్య, మాతృ సహజమైన ఆందోళనతో, యిలా అన్నది: "యీ వయసు పిల్లలు అలాంటి విషయాలు మాట్లాడరు. యీ పిల్లకున్న అతితెలివి అనారోగ్య లక్షణం." మూర్ ఆమెను మందలించినాడు. నేను ఆమెకు జెన్నిహెన్‌ను చూపించినాను. ఆ అమ్మాయి పూనకంనుండి



జెన్నీ ఫన్ వెస్ట్‌ఫాలెన్, మార్క్స్ భార్య



కార్ల్ మార్క్స్, 1867

తేరుకొని ఉల్లాసంగా గంతులు వేస్తూ, నవ్వుతూ వుంది, అచ్చమైన ఆరోగ్యమూర్తి లాగ....

మార్క్సు కొడుకు లిద్దరూ చిన్నతనంలోనే మరణించినారు — ఒకడు లండన్‌లో పుట్టిన వాడు, చాలా పసితనంలోనూ; రెండవవాడు, బ్రసెల్స్‌లో పుట్టినవాడు, దీర్ఘ వ్యాధి తర్వాతా.

రెండవవాని చావు మార్క్సుకు దారుణమైన దెబ్బ. నయం కాజాలని ఆ వ్యాధి కాలంనాటి విషాదపూరిత వారాలు నాకింకా జ్ఞాపకం వున్నాయి.

ఆ అబ్బాయికి ఎడ్గార్ అనే ఒక మేనమామ పేరు పెట్టినారు, కానీ "ముష్"* అని పిలిచేవాళ్లు. అతను చాలా ప్రతిభావంతుడు, కానీ ఆజన్మ రోగిష్ఠి, నిజమైన విషాద శిశువు. అతనికి అందమైన కన్నులూ, తెలివిపరు డనిపించే తలా వుండినాయి; ఆ తల అతని దుర్బల దేహానికి మరీ బరువు అనిపించేది.

పాపం ముష్ బతికి వుండేవాడేమో, అతనికి శాంతీ, నిత్య సంరక్షణా లభించి వుంటే, అతను గ్రామసీమల్లో గానీ, సముద్ర తీరంలో గానీ వుండివుంటే. కానీ ప్రవాస జీవితంలో, ఒక చోటునుండి మరొక చోటికి వేటాడబడుతూ, లండన్ జీవితపు కడగండ్ల మధ్య, మహా కోమలమైన పితృ వాత్సల్యంగానీ, మాతృ సంరక్షణ గానీ ఆ సుతిమెత్తని మొక్కకు, ప్రాణం కొరకు పోరాడడానికి తగిన శక్తి నివ్వలేకపోయినాయి. ముష్ మరణించినాడు....

ఆ దృశ్యం నాకు మరుపు రాదు: తల్లి తన మృత శిశువుమీద పడి నిశ్శబ్దంగా శోకిస్తున్నది — లెన్‌హెన్ పక్కన నిలిచి యేడుస్తున్నది — మార్క్సు ప్రచండమైన ఆరాటంలో చిక్కి, యెవరు ఓదార్చబోయినా కస్సుమంటూ, దాదాపు ఆగ్రహావేశు డౌతున్నాడు — ఆడ పిల్లలిద్దరూ మౌనంగా యేడుస్తూ, తల్లిని దగ్గరగా అనుకున్నారు — తల్లి వాళ్లను ఆర్తితో కరుచుకున్నది, తన కొడుకులను అపహరించిన మృత్యువునుండి వాళ్లను రక్షించడానికా అన్నట్లు.

రెండు రోజుల తర్వాత శవం సమాధిచేయబడింది. లెస్నెర్, ఫెండెర్,** లోహ్నెర్, కోన్రాడ్ ష్రమ్, యెర్ర వొల్ఫ్,*** నేనూ హాజరైనాము. నేను మార్క్సుతో కలిసి బండిలో పోయినాను. ఆయన ఒక్క మాట కూడా లేకుండా కూర్చున్నాడు, చేతులలో తల పెట్టుకొని....

తరువాత టుస్సీ పుట్టింది, కేరింతలు వేసే పసికందు, బంతిలాగ గుండుగా — వెన్న ముద్దలాగ, గులాబి గుత్తిలాగ; మొదట పెరాంబులేటర్ (తోపుడు బండి)లో వెళ్లేది,

---

* ఫ్రెంచి భాషలో "ముష్" ("Mouch") అంటే "ఈగ." — సం.

** ఫెండెర్, కార్ల్ (జననం సుమారు 1818–1876) — జర్మన్ కార్మికోద్యమ కార్యకర్త, కమ్యూనిస్టు లీగ్ సెంట్రల్ కమిటీ, మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ సభ్యుడు; చిత్రకారుడు; మార్క్సు ఎంగెల్సుల అనుచరుడు. — సం.

*** యెర్ర వొల్ఫ్ — ఫెర్డినాండ్ వొల్ఫ్‌కు మారుపేరు. ఫెర్డినాండ్ వొల్ఫ్ కమ్యూనిస్టు లీగ్ సభ్యుడు, "నోయె రైనిషె సైటుంగ్" అనే పత్రిక సంపాదకులలో ఒకడు. — సం.

తర్వాత ఒకోసారి యెత్తుకునేవాళ్లు, ఒకోసారి తప్పటడుగులు వేస్తూ వుండేది. నేను జర్మనీకి తిరిగివచ్చినప్పుడు ఆ అమ్మాయికి ఆరేండ్లు — సరిగ్గా నా పెద్ద కూతురు వయస్సులో సగం. నా కూతురు అప్పటికి రెండేండ్లుగా హాంప్‌స్టెడ్ హీథ్‌లో మార్క్స్ కుటుంబంతో ఆదివారం షికార్లలో కలిసి వుండేది.

మార్క్స్‌కు పిల్లల సాహచర్యం లేకుండా జరగదు. అదే ఆయనకు విశ్రాంతీ, వినోదమూ. ఆయన పిల్లలు పెరిగి పెద్దవాళ్లైనప్పుడు, లేదా చనిపోయినవాళ్లు చనిపోగా, మనుమలు ఆ స్థానం ఆక్రమించినారు. పారిస్ కమ్యూన్ ప్రవాసులలో ఒకరైన లోంగెను డెబ్బైల ప్రారంభంలో పెండ్లి చేసుకొన్న జెన్నిహెన్ మార్క్స్‌కు అల్లరి మనుమలను కొంత మందిని ప్రసాదించింది. పెద్దవాడు జాన్, లేక జోనీ మహా అల్లరివాడు, తాతకు ముద్దుల మనుమడు. ఆ కుర్రవాడు ఆయన్ను యిష్టం వచ్చినట్లు ఆడించేవాడు. ఆ శక్తి తనకుందని అతనికి తెలుసు. ఒక రోజు నేను లండన్‌కు పోయినాను. యేటా అనేక సార్లు తన తల్లిదండ్రుల చేత పారిస్‌నుండి లండన్‌కు పంపబడే జోనీ అప్పుడు లండన్‌లో వుండినాడు. జోనీకి ఒక బుద్ధి పుట్టింది, తన తాతను గుర్రపు బండిగా చేసి తాను బండిమీద యెక్కాలని — అనగా తాను మార్క్స్ భుజాలమీద కూర్చోవాలని, ఎంగెల్సూ, నేనూ గుర్రాలం కావాలని. మమ్మల్ని సక్రమంగా బండికి కట్టిన తర్వాత, మేయిట్లండు పార్కు రోడ్డులోని మార్క్స్ బంగళా వెనక వున్న చిన్న తోట చుట్టూ కోలాహలంగా తరమడం ప్రారంభమైంది — బండి తోలడం అన్నమాట అది. లేక అది రీజెంటు పార్కు రోడ్డులోని ఎంగెల్సు యింటి వద్ద నేమో — లండన్ గృహాలు అన్నీ ఒక్కలాగే వుంటాయి, వాటి విషయంలో పొరపాటు పడడం సులభం, తోటల విషయంలో మరీనూ. కొద్ది చదరపు గజాల గచ్చూ, గడ్డీ వుంటుంది; వాటిమీద "నల్ల మంచు," అనగా లండన్ మసి, కప్పి వుంటుంది, గచ్చు యెక్కడుందో, గడ్డి యెక్కడుందో తెలుసుకోడానికి వీలు లేకుండా — లండన్‌లో తోట అంటే అలా వుంటుంది.

స్వారి ప్రారంభమైంది: పద! అంతర్జాతీయ — ఇంగ్లీషు, జర్మన్, ఫ్రెంచి కేకలతో. "Go on! Plus vite! Hurrah!"* మూర్ కదం తొక్కవలసి వచ్చింది, నుదుటి నుండి చెమట కారేదాకా. ఎంగెల్సో, నేనో కొంచెం మెల్లగా పోవడానికి ప్రయత్నిస్తే, బండివాని కొరడా దెబ్బలు క్రూరంగా మామీద పడేవి: "ఏయ్ దొంగ గుర్రం! పద ముందుకు!" అలా అది సాగింది, మార్క్స్ పడిపోయేట్టున్నాడు. అప్పుడు మేము జోనీతో సంప్రదింపులు జరిపి, సంధి చేసుకున్నాం....

---

* "పద! త్వరగా పద!" — సం.

## 11

## లెన్‌హెన్

మార్క్సు సంసారం ప్రారంభమైనప్పటినుండి, ఆయన బిడ్డలలో ఒకరు అన్నట్లుగా, ఆ యింటికి లెన్‌హెన్ జీవమూ, ఆత్మా. ఆమెకు యెంత పని వుండేదని! అదంతా ఆమె సంతోషంగా చేసేది.... యెప్పుడూ సరదాగా, చిరునవ్వులతో, సహాయపడడానికి సంసిద్ధంగా. కాని, ఆమెకు కూడా కోపం వచ్చేది; మూర్ శత్రువులను ఆమె తీవ్రంగా ద్వేషించేది.

మార్క్సు భార్య జబ్బుపడినప్పుడూ, లేక అస్వస్థంగా వున్నప్పుడూ ఆమె స్థానంలో లెన్‌హెన్ తల్లిగా వ్యవహరించేది. యేమైనప్పటికీ, పిల్లలకు ఆమె రెండవ తల్లి. ఆమె సంకల్పానికి గొప్ప బలమూ, స్థిరత్వమూ వుండేది: ఆమె యేదైనా అవసరమనుకుంటే అది జరిగితీరవలసిందే.

ముందే చెప్పినట్లు, ఆ యింట్లో ఆమె ఒక విధమైన నియంత: కచ్చితంగా చెప్పాలంటే, లెన్‌హెన్ నియంత, కానీ మార్క్సు భార్య యజమానురాలు. యిక మార్క్సు ఆ నియంతృత్వానికి మేకపిల్లలాగా అణకువగా లోబడేవాడు.

యే మనిషీ తన పరిచారకుల దృష్టిలో గొప్పవాడు కాదు, అంటారు. మరి మార్క్సు లెన్‌హెన్ దృష్టిలో గొప్పవాడు కానేకాదు. ఆయన కోసం ఆమె ఆత్మత్యాగం చేసుకునేది, ఆయన కోసమైనా, ఆయన భార్య కోసమైనా, పిల్లలలో యెవరి కోసమైనా ఆమె తన జీవితాన్ని, అవసరమైతే, సాధ్యమైతే, వందసార్లు అర్పించేది. నిజంగా వాళ్లకోసం అలా అర్పించింది కూడా. కానీ, ఆమెమీద మార్క్సు పెత్తనం చేయలేదు. ఆయన యిష్టానిష్టాలూ, బలహీనతలూ అన్నీ ఆమెకు కరతలామలకం; ఆయన్ను ఆమె తన యిష్టం వచ్చినట్లు ఆడించగలదు. ఆయన కోపంలో వున్నప్పుడూ, ఉరుముతూ ఉగ్రతాండవం చేసేటప్పుడూ, ఆయన దగ్గరికి యెవరు పోవాలన్నా జంకుతారు; అలాంటప్పుడు కూడా లెన్‌హెన్ పులి గుహలోకి పోతుంది. ఆమెను చూసి ఆయన గాండ్రు మంటే, ఆమె అనవలసిన మాటలు నాలుగూ అనేస్తుంది. పులి, మేకపిల్లలాగ మెత్తబడుతుంది.

## 12

## మార్క్సుతో షికార్లు

ఓ — హాంప్‌స్టెడ్ హీథ్‌లోని ఆ షికార్లు! వేయేండ్లు దాకా బతికినా, వాటిని యెప్పటికీ మరిచిపోను. ప్రిమ్‌రోజ్ హిల్ అవతలి పక్కన వుంది హీథ్. దానిలాగే యిదీ డికెన్స్‌యొక్క

పిక్విక్ యన్లు ద్వారా లండనేతరులకు సుపరిచితం. అందులో అత్యధిక భాగంలో యీనాటికీ భవనాలు కట్టలేదు; యిప్పటికీ అది గరువు నేలగా వుంది, దాని నిండా తుప్పలూ, పొదలూ, సూక్ష్మ రూపంలో కొండలూ, కోనలూ వున్నాయి. వాటిలో యెవరైనా యిష్టం వచ్చినట్లు షికార్లు కొట్టుతూ, తమాషాలు పడవచ్చు — "హద్దుమీరి నడిచి" నందుకు సమన్లు వస్తాయనే భయం లేకుండా. యీ నాటికీ అది లండన్ వాసులకు అభిమాన స్థలం. ఆదివారం వాతావరణం బాగుంటే, హీథ్ మగవాళ్లతో నల్లగానూ, ఆడవాళ్లతో రంగులు రంగులుగానూ వుంటుంది. ఓర్పుకు పేరుగాంచిన గాడిదలనూ, గుర్రాలనూ యెక్కి, అక్కడ వాటి ఓర్పును పరీక్షకు పెట్టడం ఆడవాళ్లకు ప్రత్యేకంగా యిష్టమైన పని. నలభై యేండ్ల క్రితం హాంప్‌స్టెడ్ హీథ్ యిప్పటికంటె విశాలంగా వుండి, యింత కృతకంగా వుండేది కాదు.

అక్కడ ఆదివారం గడపడం మహా పర్వదినంగా వుండేది. పిల్లలు వారం పొడుగునా దానిగురించి మాట్లాడేవాళ్లు; పెద్దవాళ్లు కూడా, యువకులూ వృద్ధులూ, దాని కోసం యెదురు చూసేవాళ్లు. అక్కడికి ప్రయాణమే ఒక పండగ. ఆడపిల్లలు బాగా నడిచేవాళ్లు, పిల్లలలాగా చురుకుగా ఆయాసరహితంగా. మార్క్స్ వుండిన డీన్ స్ట్రీట్‌నుండి — అది నేను నివాసం యేర్పరచుకున్న చర్చి స్ట్రీట్‌కి దగ్గరే — హీథ్‌కు బాగా గంటన్నర ప్రయాణం. మేము సాధారణంగా సుమారు పదకొండు గంటలకు బయలుదేరేవాళ్లం. కానీ ప్రతి సారీ కాదు — లండన్‌లో మనుషులు ప్రొద్దున్నే లేవరు, అన్నీ సర్దుబాటు చేసి, పిల్లలకు బట్టలూ అవీ వేసి, తినుబండారాల బుట్టను సక్రమంగా నింపేటప్పటికి చాలా ఆలస్యమయేది.

ఆ తినుబండారాల బుట్ట! దాన్ని లెన్‌హెన్ చేతిలో నేను చూసింది నిన్ననే అయినట్లు అది వాస్తవంగా, భౌతికంగా, ఆకర్షణీయంగా, నోట నీళ్లూరిస్తూ "నా మనోనేత్రం" ముందు మెదలుతున్నది.

ఆరోగ్యమూ, దేహ దార్ఢ్యమూ వున్న మనిషికి జేబులో దండిగా చిల్లర డబ్బులు లేకపోతే (వెండి నాణ్యాల మాట ఆ కాలంలో అనుకోబట్టదు), తిండి చాలా ముఖ్యమైన విషయంగా వుంటుంది. మా మంచి లెన్‌హెన్‌కు అది తెలుసు, ఆమె కరుణా హృదయం తన బీద అతిథులమీద జాలి పడేది, వాళ్లకు తరుచుగా తగినంత తిండి వుండదు, కనుక యెప్పుడూ ఆకలిగొని వుండేవాళ్లు. పెద్ద వేపుడు మాంసం ముక్క భోజనంలో ముఖ్యమైన పదార్థం; ఆదివారం నాటి హాంప్‌స్టెడ్ హీథ్ షికార్లలో అది అలా సంప్రదాయం ద్వారా పవిత్ర నియమమైంది. లండన్‌కు అసాధారణమైన సైజుగల ఆ బుట్ట, లెన్‌హెన్ ట్రీయర్ నుండి తెచ్చినది, ఆ పవిత్రాతిపవిత్ర వస్తువును వుంచే గర్భగుడి. తరువాత తేయాకూ, చక్కెరా, అప్పుడప్పుడు కొద్దిగా పండ్లూ వుండేవి. బ్రెడ్డూ, చీజూ హీథ్‌లో కొనవచ్చు; అక్కడ పళ్లేలూ, వేడినీళ్లూ, పాలూ కూడా దొరికేవి, బెర్లిన్‌లో కాఫీగార్టెన్‌లలో లాగే. అంతేగాక, వెన్నా, స్థానిక ఆచారం

ప్రకారం రొయ్యలూ, వాటర్‌క్రెస్, పెరివింకిల్స్ దొరికేవి, మనకు కావలసినంత, మనం కొనగలిగినంత.

బీరు కూడా దొరికేది. కొద్దికాలం తప్ప — యావత్ప్రపంచంనుండి మద్యం విరివిగా తెప్పించుకొని క్లబ్బులలోనూ, యిండ్లలోనూ పెట్టుకొని, ప్రతి దినమూ ఆదివారంగానే వున్న వంచక ప్రభువర్గం, ఆదివారంనాడు బీరు అమ్మకం నిషేధించడంద్వారా, సాధారణ ప్రజలకు సద్గుణాలూ, నీతులూ నేర్పాలనుకున్న కొద్ది కాలం అది.

కానీ లండన్ ప్రజలకు తమాషాలు నచ్చవు, తిండి తీర్థాల విషయంలో. బిల్లు ప్రవేశ పెట్టబడిన తరువాతి ఆదివారంనాడు హైడ్ పార్కులో లక్షలమంది ప్రదర్శన చేసి అక్కడ బండ్లమీదా, కాలినడకనా షికారు చేస్తున్న భక్తాగ్రేసరులైన దొరలనూ, దొరసానులనూ ఉద్దేశించి "పోండి చర్చికి" అని యేహ్య భావంతో కేకలు వేసినారు. ఆ ప్రచండమైన కేకలు సద్గుణ సంపన్నులైన ఆ దొరలలోనూ, దొరసానులలోనూ ఆందోళనా, భయమూ పుట్టించి నాయి. రెండవ ఆదివారం నాడు కేకలు వేసేవాళ్లు రెండంతలైనారు, "పోండి చర్చికి!" అనే కేకలు యింకా చాలా ప్రచండమైనాయి. మూడవ ఆదివారంనాటికి బిల్లు ఉపసంహరించు కోబడింది.

ప్రవాసులమైన మేము "పోండి చర్చికి!" విప్లవంలో మాకు చేతనైనంత తోడ్పడి నాము. అలాంటి సందర్భాలలో మరీ ఉద్రేకపడే మార్క్సును ఒక పోలీసువాడు మెడపట్టుకొని జడ్జి ముందర హాజరు పరిచేవాడే — ఉదాత్తుడైన ఆ శాంతి భద్రతల సంరక్షకుని పిపాసకు మేము చేసిన హృదయపూర్వక విజ్ఞప్తి ఫలించకపోతే.

ఆ విధంగా వంచకుల విజయం చాలా కాలం సాగలేదు. ఆ స్వల్ప మధ్యంతర కాలంలో తప్ప, హాంప్‌స్టెడ్ హీథ్‌కు పోయే దారిలో మేము యెండకు మాడేటప్పుడు, బాగా సమర్థనీయమైన, కష్టార్జితమైన చల్లని పానీయం తాగుతామనే సానునయపుటాలోచనతో మేము నిలదొక్కుకునే వాళ్లం.

ప్రయాణపు నడక యీ విధంగా జరిగేది. సాధారణంగా నేను ముందు నడిచేవాణ్ణి, యిద్దరు ఆడపిల్లలతోనూ కలిసి. వాళ్లను నేను కథలతోనో, దొమ్మరి ఆటలతోనో, అడవి పూలు కోయడంతోనో వినోదపరిచేవాణ్ని; అడవి పూలు యిప్పటి కంటె అప్పుడు చాలా విరివిగా వుండినాయి. మా వెనక కొద్దిమంది మిత్రులు వచ్చేవాళ్లు. ఆ తరువాత ప్రధాన దళం: మార్క్సు, ఆయన భార్యా, ఆదివారం ఆగంతకుల్లో ప్రత్యేక శ్రద్ధకు అర్హమైన యెవరో ఒకరూ. అందరి కంటె వెనక లెన్‌హెన్, మా బృందంలోకెల్ల ఆకలిగొన్నవాళ్లూ వచ్చేవాళ్లు; వాళ్లు తినుబండారాల బుట్టను మోయడంలో ఆమెకు తోడ్పడేవాళ్లు. మా బృందంలో యింకా యెక్కువమంది వుంటే, వివిధ గుంపులలో వాళ్లు కలిసిపోయేవాళ్లు.

అవసరాన్ని బట్టీ, అభీష్టాన్ని బట్టీ యుద్ధ వ్యూహం, లేక సైన్య పురోగమన క్రమం, మారేదని చెప్పనక్కరలేదు.

హీథ్ చేరినప్పుడు మేము మొట్టమొదట గుడారం వేసుకోడానికి తగిన స్థలం యేరుకునే వాళ్లం. ఆ పనిలో టీకీ, బీరుకూ గల సౌకర్యాలను వీలైనంతవరకు లెక్కలోకి తీసుకునే వాళ్లం.

ఆహార పానీయాలు ముగించిన తర్వాత, స్త్రీలూ, పురుషులూ పండుకోడానికో, కూర్చో డానికో సుఖమైన స్థలం వెదుక్కుంటూ వెళ్లేవాళ్లు. కునుకు తీయడానికి యిష్టపడనివాళ్లు తాము దారిలో తెచ్చుకున్న ఆదివారం పత్రికలు బయటికి తీసి, రాజకీయాలు మాట్లాడు కునేవాళ్లు. పిల్లలు త్వరలోనే ఆటలకు జతగాళ్లను సంపాయించి పొదలలో దాగుడుమూతలు ఆడేవాళ్లు.

యీ ఆహ్లాదకరమైన పనులలో కూడా వైవిధ్యం వుండాలి: పరుగు పందేలూ, కుస్తీలూ, రాళ్లు యెత్తడం, యితర రకాల క్రీడలూ యేర్పాటు చేయబడేవి. ఒక ఆదివారం పక్వానికి వచ్చిన కాయలు గల చెస్ట్‌నట్ చెట్టు ఒకటి మాకు దగ్గరలోనే కనపడింది. "యెవరు యెక్కువ కాయలు రాలగొడతారో చూద్దాం" అని యెవరో అన్నారు. ఉల్లాసంతో మేమూ పనికి పూను కున్నాం. మార్క్సు కూడా మా అందరిలాగే శ్రమ అనుకోకుండా పని చేసినాడు. చివరి కాయ కింద పడిందాకా రాళ్లు విసరడం ఆగలేదు. ఒక వారం రోజులపాటు మార్క్సు తన కుడిచెయ్యి కదిలించలేకపోయినాడు; నా పరిస్థితి కూడా యేమంత మెరుగుగా లేదు.

అన్నిటికంటె గొప్ప తమాషా మే మందరమూ గాడిద స్వారి చేసేటప్పుడు. యేమి నవ్వులు! యేమి హాస్యసల్లాపాలు! మేము యెంత అపహాస్యకర పాత్రలమైనామని! మార్క్సు స్వయంగా వినోదం పొందినాడు, మాకు దండిగా కలిగించినాడు, తాను పొందినదానికి రెండింతలు; ఆయన స్వారి యెంతో ప్రాథమికమైనది, తన నైపుణ్యం గురించి మమ్మల్ని నమ్మించడానికి తన ఊహాశక్తిని యెంతగానో ఉపయోగించినాడు! మరి ఆయన నైపుణ్య మంతా యెంత అంటే ఆయన విద్యార్థిగా వుండినప్పుడు గుర్రపు స్వారిలో పాఠాలు చెప్పించుకున్నాడట — ఆయన మూడవ పాఠం దాటి యెప్పుడూ పోలేదని ఎంగెల్సు అంటాడు — మాంచెస్టర్‌కు ఆయన అరుదుగా చేసిన ప్రయాణాలలో మహా గౌరవనీయమైన రొసినాంత్* మీద యెక్కబోయినాడట; బహుశా అది కీర్తిశేషుడైన ముసలి ఫ్రిట్జ్** ధీరుడైన గెలెర్ట్‌కు బహుమతిగా యిచ్చిన నిబ్బరమైన గుర్రానికి మునిమనమరాలు కావచ్చు.

హాంప్‌స్టెడ్ హీథ్‌నుండి యింటికి పోయే నడక యెప్పుడూ ఉల్లాసంగా వుండేది —

---

* రొసినాంత్ — సెర్వాంటెస్ నవలలో డాన్ క్విక్సట్ గుర్రం పేరు. — సం.

** ఫ్రిట్జ్ — ప్రష్యా రాజు రెండవ ఫ్రెడరిక్‌కు ప్రస్తావన. రాజు రెండవ ఫ్రెడరిక్ ఆస్థాన కవి గెలెర్ట్‌కు ఒక గుర్రాన్ని బహుమతిగా ఇచ్చినాడు. — సం.

వెనక వదిలిన హాయికంటె యెదురుచూసే హాయి మాకు యెక్కువ సంతోషం యిచ్చినప్ప టికీ. మాకు దిగులు పడడానికి తగినన్ని కారణాలు వుండినాయి; కానీ దానికి అడ్డంగా మా కఠోరమైన హాస్యం అనే మంత్ర కవచం వుండేది. ప్రవాస జీవితపు విషాదం మాకు వుండేది కాదు; యెవరైనా ఫిర్యాదులు చేయడం ప్రారంభిస్తే, అతనికి వెంటనే సమాజం పట్ల అతని కర్తవ్యాలు బలీయంగా జ్ఞాపకం చేయబడేవి.

తిరుగు ప్రయాణపు గమనక్రమం పోయేటప్పటిలాగ వుండేది కాదు. పిల్లలు పగలంతా పరుగెత్తడంతో అలసిపోయి లెన్‌హెన్‌తో కలిసి వెనక వచ్చేవాళ్ళు. తినుబండారాల బుట్ట ఖాళీ అయినందున తేలికపడిన లెన్‌హెన్ వాళ్ళను చూసుకోగలిగేది. సాధారణంగా యెవరో ఒకరు పాట యెత్తుకునేవాళ్ళు. మేము యెప్పుడూ రాజకీయ గీతాలు పాడేవాళ్ళం కాదు, మావి అత్యధిక భాగం జానపద గేయాలు, అనుభూతితోనూ, "దేశభక్తి"తోనూ నిండినవి — నేను చెప్పేది వేటగాళ్ల కట్టుకథ కాదు — "ఫాటర్లండ్"లోని ప్రత్యేకంగా ప్రీతిపాత్ర మైన "ఓ స్ట్రాన్‌బర్గ్, ఓ స్ట్రాన్‌బర్గ్...." లాంటివి. లేదా పిల్లలు, తమ పాదాలు అంతగా అలసిపోనప్పుడు, మాకోసం నీగ్రో పాటలు పాడి, వాటికి అనుగుణంగా నృత్యం చేసేవాళ్ళు. నడిచేటప్పుడు, ప్రవాస జీవితపు విషాదం గురించి యెంత తక్కువ మాట్లాడేవాళ్లమో, రాజకీయాలను గురించి కూడా అంత తక్కువ మాట్లాడేవాళ్లం. కానీ సాహిత్యమూ, కళలూ తరుచుగా మాట్లాడుకునే విషయాలు; ఆశ్చర్యకరమైన తన జ్ఞాపక శక్తిని చూపించ డానికి అవి మార్క్స్‌కు అవకాశం యిచ్చేవి. ఆయన "డివైన్ కామెడీ"*నుండి సుదీర్ఘ ఘట్టాలు వల్లించేవాడు, అవి ఆయనకు దాదాపు కంఠతా వచ్చేవి; షేక్‌స్పియర్‌లోని రంగాలు కూడా వల్లించేవాడు. షేక్‌స్పియర్ విషయంలో ఉత్కృష్టమైన పరిజ్ఞానం వుండిన మార్క్స్ భార్య తరుచుగా ఆయనకు బదులు షేక్‌స్పియర్‌ను వల్లించేది....

యాభైల అంతంలో మేము ఉత్తర లండన్‌లోని కెంటిష్ టౌనుకూ, హావర్‌స్టాక్ హిల్‌కూ మారిన తర్వాత మా అభిమాన షికారు స్థలాలు హాంప్‌స్టెడ్‌కూ, హైగేట్‌కూ మధ్యనా, ఆవలా వుండే గడ్డి మైదానాలూ, గుట్టలూ. అక్కడ మేము పూలు వెదకుతూ, మొక్కలను వివరించేవాళ్లం — హృదయం లేని, కోలాహలపు రాతి సముద్రం అనే నగరం ఫలితంగా వచ్చిన ప్రకృతికోసం తహతహలాడే పట్టణపు పిల్లలకు అది రెండింతలు ఆనందంగా వుండేది. మా సంచారాలలో ఒకసారి కొన్ని చెట్ల నీడన ఒక చిన్న మడుగును కనిపెట్టినప్పుడూ, నేను మొదటి "అడవి" నీలపు పూలను పిల్లలకు చూపించగలిగినప్పుడూ, అది మాకెంత ఆహ్లాదం కలిగించిందని! చుట్టు పక్కల జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత మేము హద్దు మీరి "నడవవద్దు" బోర్డులను నిర్లక్ష్యంచేసి, వెల్వెట్ లాంటి ముదురు పచ్చని గడ్డి మైదా

---

* డాంటె రాసిన కావ్యం. — సం.

నం చేరి, గాలినుండి సురక్షితమైన ఒక స్థలంలో హయసింతులూ, యితర వసంత పుష్పాలూ చూసినప్పుడు మా ఆహ్లాదం యింకా యెక్కువగా వుండింది.... మొదట నా కండ్లను నేను నమ్మలేకపోయాను; యెందుకంటే హయసింతులు అడవుల్లో పెరిగేది దక్షిణాది దేశాలలో — స్విట్జర్లండులో జినీవా సరస్సు దగ్గరా, ఇటలీలోనూ, గ్రీసులోనూ — మాత్రమేననీ, అంతకంటె ఉత్తరాన పెరగనివీ నేను నేర్చుకొనివుండినాను. అందుకు భిన్నంగా యిక్కడ ప్రత్యక్ష నిదర్శనం వుంది, వృక్షజాతులకు సంబంధించినంతవరకు ఇటలీ వాతావరణమే యింగ్లండుకు వుందని చెప్పే యింగ్లీషువాళ్ల మాటకు అనుకోని ధృవీకరణ లభించింది. అందుకు సందేహం లేదు: అవి హయసింతులే, మామూలు లేత నీలం పూలు, తోటలో పెరిగేటంత పెద్దవి కాదు. ఒకొక కాడకు అన్ని పూలు లేవు, కానీ అదే వాసన, కాస్త ఘాటు అయినప్పటికీ....

మేము పరిమళ భరితమైన మా మైదానాలనుండి సగర్వంగా ప్రపంచంవైపు చూసినాము — ప్రపంచపు మహా బలీయమైన, హద్దులులేని నగరంవైపు, పొగమంచు అనే వికృత నిగూఢపు ముసుగు కప్పుకొని, తన అపార విస్తారంతో మాముందు పరుచుకొని వున్న దానివైపు.

## 13

## సంకటపు పావుగంట

మనం బిల్లు చెల్లించాలి, లేకపోతే అంతకంటె అనిష్టమైనది సంభవిస్తుంది — రాబ్లే*కు కలిగిన అలాంటి సంకటపు సమయం యెవరికి తెలియదు! అలాంటి దుష్ట సమయాలు లేనిదెవరికి! నాకున్నాయి. పరీక్షకు ముందూ, నా మొదటి ఉపన్యాసానికి ముందూ, జైలు వాకిలి ముందరి మొదటి సారిగా నిలిచినప్పుడు. అప్పుడు నా బ్రేసులూ, బెల్టూ తీసి యివ్వమని చెప్పి, యేమీ అర్థం కాక నేనడిగిన ప్రశ్నకు దాపరికంలేని నిష్కాపట్యంతో సమాధానంగా, ఆత్మ హత్యద్వారా నేను కోర్టుమార్షల్‌ను తప్పించుకోకుండా, అని చెప్పినాడు. ఆ దుష్ట సమయాలు, మరికొన్నీ నిశ్చయంగా నాకు సంకటపు సమయాలు. కానీ, నేను చెప్పదలచుకున్నదానితో పోలిస్తే అవి ఆహ్లాదకరమైనవి. అది పావుగంట కూడా కాదు. మహా అయితే పావుగంటలో

---

* రాబ్లే (జననం సుమారు 1494–1553) — రినెజాన్స్ యుగపు ఫ్రెంచి రచయిత. — సం.

సగం. బహుశా అయిదు నిముషాల కంటె యెక్కువ కాదు. నేను కాలాన్ని కొలవలేదు. కొల వడానికి నాకు సమయం లేదు. సమయం వుండినా నాకు గడియారం లేదు. ప్రవాస జీవికి గడియారమా! నాకు తెలిసిందల్లా, అది నాకొక యుగంగా వుండింది.

అది 1852 నవంబర్ 18న లండన్‌లో జరిగింది. లార్డ్ వెల్లింగ్టన్, "ఉక్కు ప్రభువు," "శత యుద్ధ విజేత," కానీ తర్వాత యింగ్లీషు ప్రజలచేత మెత్తపరచబడి, సాధు జీవిగా మార్చబడినవాడు, సెప్టెంబర్ 14న వాల్మర్‌లో తన రాజసౌధంలో మరణించి నాడు.... "జాతీయ వీరుని" "జాతీయ అంత్యక్రియలు" "జాతీయ హుందా"తో సెంట్ పాల్స్‌లో జరుగుతాయి; అక్కడ యితర "జాతీయ వీరుల" పక్కన అతన్ని సమాధి చేస్తారు. అతను చనిపోయిన దినంనుండి, అనగా సుమారు రెండు నెలల పాటు, యింగ్లండు అంతా, ముఖ్యంగా లండన్ అంతా ఆ అంత్యక్రియల గురించి మాట్లాడుతూ వుండింది; ఆ ప్రభువు యింగ్లీషువాళ్ల దృష్టిలో గతించిన వీరుల నందరినీ యెలా మించినాడో అలాగే ఆ సాంజ్ఞ్యం హుందాలోనూ, ఘనతలోనూ గతించిన జాతీయ సాంజ్ఞ్యాల నన్నిటినీ మించిపోతుంది.... ఆ రోజు వచ్చింది.

ఇంగ్లండు యావత్తూ కదిలింది, లండన్ యావత్తూ కాళ్లమీద వుంది. లక్షలమంది రాజధానికి వచ్చినారు, విదేశాలనుండి వేలమంది వచ్చినారు, ఆ బ్రహ్మాండమైన నగరంలోనే వుండిన పదుల లక్షల జనసంఖ్యను యింకా పెంచుతూ.

అలాంటి ప్రదర్శనలూ, కల్లోలపు జన సమూహాలూ అంటే నాకు ద్వేషం; నా సహ ప్రవాసులలో చాలామంది లాగే నేను యింటివద్ద వుండడమో, సెంట్‌జేమ్స్ పార్కుకు పోవడమో కోరుకునే వాణ్ని. కానీ యిద్దరు మిత్రురాండ్రు నా దృఢ నిశ్చయాన్ని ఓడించినారు....

నిజంగా వాళ్లు ఆప్త మిత్రురాండ్రు నాకు — నల్లని కన్నులూ, నల్లని ఉంగరాల జుట్టూ గల జెన్నీ, ముమ్మూర్తులా తండ్రి అయిన మూర్ పోలిక గలది; బంగారు తలకట్టు గల సుకుమారపు లౌరా, సరదాగా, చిలిపి కన్నులతో, తల్లి పోలిక గలది....

మొదట మేము కలుసుకున్నప్పుడు వాళ్లిద్దరూ నాకు సన్నిహితు లైనారు; నేను కన పడిన వెంటనే వాళ్లు నన్ను తమ హక్కుగా వశం చేసుకునేవాళ్లు. లండన్‌లోని నా ప్రవాస జీవిత కాలంలో నా జీవితాన్ని నిలబెట్టిన ప్రసన్న మనస్కతకు వాళ్లు యెక్కువగా కారణ భూతులు. నాకు దిక్కు తెలియనప్పుడు, యెన్ని సార్లు నేను నా చిన్ని అప్తుల వద్దకు పారిపోయి, వాళ్లతో కలిసి వీధుల్లోనూ, పార్కుల్లోనూ సంచారం చేసినానో! నా విషాద ఆలోచనలు పటా పంచలై, మరింత ఆహ్లాదకరమైన మనస్థితి నాకు ఆనందమూ, పోరాటానికి బలమూ యిచ్చేది.

సాధారణంగా నేను వాళ్లకు కథలు చెప్పాలి; యెందుకంటే, నేను త్వరలోనే మంచి కథలు చెప్పేవాణ్నిగా గుర్తింపు పొందినాను, కోలాహలపు ఆనందంతో నాకు స్వాగతం యిచ్చే

వాళ్ళు. అదృష్టవశాత్తు నాకు దండిగా కథలు తెలుసు; కానీ నా కథలన్నీ అయిపోయినప్పుడు మరిన్ని కల్పించవలసి వచ్చేది....

తహతహతో తొక్కులాడుతున్న బాలికలను తీసుకొని నేను ప్రదర్శనకు బయలుదేరే టప్పుడు, "పిల్లలు జాగ్రత్త" అని సూర్క్స్ భార్య నాతో చెప్పింది. "గుంపు మరీ దట్టంగా వున్నచోటికి పోకండి."

మేము వాకిలి దగ్గర వున్నప్పుడు, లెన్‌హెన్ ఆందోళనగా మా వెనక పరుగెత్తుకుంటూ వచ్చి కేక వేసింది.

"జాగ్రత్త, లైబ్రరీ, మంచివానివి కదూ!" (లైబ్రరీ అని యెందుకో పిల్లలు నాకు మారుపేరు పెట్టినారు.)

నా పథకం సిద్ధంగా వుండింది. కిటికీ దగ్గర కానీ, స్టాండుమీద గానీ స్థలం కొనుక్కోడానికి నాకు డబ్బు లేదు. ఊరేగింపు స్ట్రాండు గుండా నది వెంబడి పోవలసి వుంది గనుక, మేము చేయవలసింది యేమిటంటే స్ట్రాండునుండి నదికి పోయే వీధుల్లో ఒకదాని గుండా పోవడం.

పిల్లలు చెరొక పక్కా నా చేతులు పట్టుకున్నారు; నా జేబులో చిరుతిండి వుండింది. నేను నిర్ణయించుకొన్న స్థలానికి మేము దారి తీసినాం — అది వెస్ట్‌మిన్‌స్టర్‌కూ, సిటీకీ మధ్యన వున్న పాత నగర ద్వారాలకూ, టెంపుల్ బార్‌కూ ఎంతో దూరం లేదు. వీధులు ఉదయమంతా జనంతో నిండిపోయి, యిప్పుడు రద్దీగా వున్నాయి; కానీ రాజధానిలోని దూరపు పేటల గుండా ఊరేగింపు పోవలసి వుండినందున, గుంపు వేరువేరు వీధుల గుండా చీలిపోయింది; అందువలన యేమీ తోసులాట లేకుండా మేము నేననుకొన్న స్థలం చేరినాం.

నేను ఎంపిక చేసిన స్థలం మంచిదే అయింది. మేము ఒకచోట మెట్లమీద నిలబడినాం; పిల్లలిద్దరూ నా చేయి చెరొక పక్కా పట్టుకొని, ఒకరినొకరు గట్టిగా కరుచుకొని, నాకంటె ఒక మెట్టు పైన నిలబడినారు.

యేమిటది? గుంపు ఊగింది. మంద్రమైన సముద్రపు హోరులాగా దూరాననుండి కోలాహలం పెరుగుతూ అంతకంతకూ మాకు దగ్గరికి వచ్చింది.... పిల్లలకు ఆనందం కలిగింది. తొక్కిడి యేమీ లేదు, నా ఆందోళన తీరింది.

చాలాసేపు మాముందు బంగారు కాంతుల ఊరేగింపు అనంతమైన పరంపరగా సాగింది; చివరకు బంగారు పట్టీల చివరి ఆశ్వికుడు దాటిపోయినాడు, ఊరేగింపు ముగిసింది.

ఊరేగింపును అనుసరించాలనే తహతహతో మావెనక గుమికూడిన గుంపు హఠాత్తుగా ముందుకు తోసుకవచ్చింది. నేను సాధ్యమైనంత గట్టిగా నిలదొక్కుకొని, పిల్లలను తాకకుండా గుంపు ముందుకు పోవడానికి వీలు కలిగించి, పిల్లలను రక్షించడానికి ప్రయత్నించినాను. సాధ్యం కాలేదు. జన సమూహాల ప్రాకృతిక శక్తికి మానవ బలం యేదీ తట్టుకోలేదు — తీవ్రమైన

శీతాకాలం తర్వాత తేలియాడే మంచు గడ్డలకు దుర్బలమైన పడవ యెలా తట్టుకోలేదో అలాగే. నేను లొంగిపోవలసి వచ్చింది; పిల్లలను గట్టిగా ఆనించుకొని ప్రధాన ప్రవాహంనుండి తప్పించుకోడానికి ప్రయత్నించినాను. కృతకృత్యుణ్ని అయినా ననుకొని తేలికపడిన మనస్సుతో ఊపిరిపీలుస్తూ వుండినాను; యింతలో యింకా బలీయమైన మరొక మానవ తరంగం కుడి వైపునుండి వచ్చి మామీద పడింది: మేము స్ట్రాండులోకి కొట్టుక పోయినాము; అక్కడ గుమికూడిన వేలాది జనం, ఆ దృశ్యాన్ని మళ్లీ చూచి, ఆనందించాలనే ఉద్దేశంతో, ఊరేగింపు వెనక తోసుకొని వచ్చినారు. నేను పండ్లు బిగబట్టి, పిల్లలను భుజాలమీదికి యెత్తుకోడానికి ప్రయత్నించినాను; కానీ గుంపు నన్ను మరీ గట్టిగా ఒత్తుతూ వుంది. నేను ఆవేశంతో పిల్లల చేతులు అణగబట్టుకున్నాను, కానీ ఆ సుడిగుండం మమ్మల్ని ముందుకు లాక్కుపోయింది. హఠాత్తుగా నాకూ, పిల్లలకూ మధ్య ఒక శక్తి చీల్చుకొని వచ్చినట్లు నాకు అనిపించింది. పిల్లలు నానుండి లాగివేయబడినారు. ప్రతిఘటన నిరుపయోగమైంది. వాళ్ల చేతులు విరిగిపోతాయో, లేక కీళ్లు తప్పిపోతాయో అనే భయంతో నేను వాళ్లను పట్టు విడువ వలసి వచ్చింది. అది బాధాకరమైన సమయం.

యేమి చేయగలను నేను? టెంపుల్ బార్ గేటు నా ముందర నిటారుగా వుంది, దాని మూడు ద్వారాలతో — మధ్యది బండ్లకూ, యిరు పక్కలా వున్నవి పాదచారులకూ. పోటెత్తిన జనం గేటుమీద సుళ్లు తిరిగి పడుతూ వుంది, వంతెన స్తంభాల మీద ప్రవాహపు నీళ్లు పడినట్లు. నేను అవతలికి పోవాలి! నాచుట్టూ వినపడే భయానకమైన కేకలు ప్రమాద స్వభావాన్ని నా మనసు కెక్కేటట్లు చేసినాయి. పిల్లలు కాళ్లకింద నలిగిపోకుండా వుంటే, వాళ్లను అవతలి పక్కన చూస్తాను, అక్కడ ఒత్తిడి తగ్గివుంటుంది. అలా వుంటుందని యెంతగా ఆశించినానని! మోచేతులూ, రొమ్మూ మహా తీవ్రంగా ఆడించినాను. కానీ అలాంటి పోటెత్తిన జనంలో ఒంటరి మానవుడు సుడిగుండంలో గడ్డిపోచతో సమానం. నేను చాలా సేపు తన్నుకలాడినాను. అవతలికి చేరినానని కొన్ని డజన్ల సార్లు అనుకున్నాను, కానీ పక్కకు తోసివేయబడినాను. చివరకు ఒక కుదుపు, ఒక ప్రచండమైన ఊపు — మరు క్షణంలో నేను అవతలి వైపున చేరినాను అత్యంత దట్టమైన జన సమ్మర్దంనుండి విడివడి, ఆత్రంగా అటూ యిటూ కలయజూసినాను. అక్కడ లేరు! నా గుండెను యెవరో పిండినట్లైంది. తరువాత రెండు స్వచ్ఛమైన పిల్లల కంఠాలు వినపడినాయి: "లైబ్రరీ!" కల అనుకున్నాను. గంధర్వ గానంలా వుంది అది. బాలిక లిద్దరూ నాయెదుట నిలుచుకొని వున్నారు, చిరునవ్వులతో, సురక్షితంగా. వాళ్లను ముద్దుపెట్టుకొని, లాలించినాను. ఒక నిముషం సేపు నాకు నోట మాట రాలేదు. అప్పుడు వాళ్లు నాతో చెప్పినారు — నా పట్టునుండి వాళ్లను గుంజుకొని పోయిన మానవ తరంగం భద్రంగా వాళ్లను గేటుగుండా తోసుకొని పోయి, అవతలి పక్కన యే గోడలు జనం సాగిపోకుండా అడ్డు పడినాయో సరిగ్గా ఆ గోడల రక్షణ కిందికే

తొలగదోసిందట. మా సంచారాలలో యెప్పుడైనా వాళ్లు దారి తప్పితే, వీలైనంతవరకు వున్నచోటనే వుండండని నేను చెప్పిన సూచనలు జ్ఞాపకం తెచ్చుకొని వాళ్లు అక్కడ గోడ కున్న ఒక తీనెకు కరుచుకొని వుండినారు.

విజయోత్సాహంతో మేము యింటికి పోయినాము. మార్క్స్ భార్యా, మూర్, లెన్ హెన్ ఆనందంతో మాకు స్వాగతం యిచ్చినారు; ఆనందం యెందుకంటే వాళ్లు చాలా ఆదుర్దాగా వుండినారు. గుంపు ప్రచండంగా వుందనీ, చాలామంది గుంపులో నలిగిపోయి, గాయపడినారనీ వాళ్లకు తెలిసింది. తాము యెలాంటి ప్రమాదంలో వుండిందీ పిల్లలకు యేమీ తెలియదు, వాళ్లు మనసారా ఆనందించినారు. నేను యెంత భయంకరమైన క్షణాలు గడిపిందీ ఆ సాయంత్రం చెప్పలేదు.

సరిగ్గా పిల్లలు నా దగ్గరనుండి గుంజివేయబడిన స్థలంలో కొంతమంది స్త్రీలు ప్రాణం పోగొట్టుకున్నారు. నిన్న జరిగినంత స్పష్టంగా ఆ దుష్ట సమయాన్ని జ్ఞాపకం చేసుకో గలను....

## 14

## మార్క్స్, చదరంగమూ

డ్రాఫ్ట్స్ ఆటలో మార్క్స్ ఉత్కృష్టమైన ఆటకాడు. ఆ ఆటలో ఆయన యెంత నేర్పరి అంటే, ఆయన్ను ఓడించడమే కష్టం. చదరంగమంటే ఆయనకు కూడా ఇష్టం, కానీ అందులో అంత నేర్పరి కాదు. ఆ లోపాన్ని దీక్షతోనూ ఆకస్మిక దాడులతోనూ పూరించు కోడానికి ఆయన ప్రయత్నించేవాడు.

యాభైల ఆరంభంలో మా ప్రవాసులకు చదరంగం ప్రియంగా వుండింది. అప్పుడు మాకు తీరిక యెక్కువ వుండింది; మేము కోరినంత కంటె యెక్కువ వుండింది. కనుక మేము యెర్ర వొల్ఫ్ దర్శకత్వం కింద "ధీమంతుల ఆట"లో కొంత పాలుపంచుకున్నాం; వొల్ఫ్ పారిస్‌లోని అత్యుత్తమ చదరంగం బృందాలతో తరుచుగా కలిసి, దాన్ని గురించి కొంత నేర్చుకున్నాడు.

అప్పుడప్పుడు మాకు ఉద్రేకపూరితమైన చదరంగం పోటీలు వుండినాయి. ఓడినవాడు బాగా హాస్యోక్తులకు గురి అయ్యేవాడు; ఆటలు సరదాగా, తరుచు చాలా కోలాహలంగా వుండేవి. మార్క్స్ యిబ్బందిలో పడినప్పుడు మనఃక్లేశం పొందేవాడు, ఓడిపోయినప్పుడు కోపగించుకునే

వాడు. ఓల్డ్ కాంప్టన్ (స్ట్రీట్‌లోని "మోడల్ లాడ్జింగ్ హౌస్"*లో మేము కొంతమందిమి కొంతకాలంపాటు వారానికి మూడున్నర షిల్లింగుల చొప్పున అద్దె యిచ్చి బసచేసినాము. అక్కడ మా ఆటను తీవ్రమైన ఆసక్తితో గమనిస్తూ మాచుట్టూ యెప్పుడూ యింగ్లీషు వాళ్లు వుండేవాళ్లు — చదరంగం యింగ్లండులో జనప్రియంగా వుండింది, కార్మికులలో కూడా. మా కోలాహలపు సరదాతో వాళ్లు బాగా వినోదం పొందేవాళ్లు; రెండు డజన్ల యింగ్లీషు వాళ్ల కంటె యిద్దరు జర్మన్లు రద్దీగా వుంటారు.

తానొక కొత్త యెత్తు కనిపెట్టినాననీ, దానితో మమ్మల్నందరినీ ఓడిస్తాననీ ఒక రోజు మార్క్సు విజయోత్సాహంతో మాతో చెప్పినాడు. ఆయన సవాలుకు ఒప్పుకున్నాం. నిజమే, ఒకరి తర్వాత ఒకరిని మమ్మల్నందరినీ ఆయన ఓడించినాడు. కానీ మేము మా ఓటమినుండి త్వరలో నేర్చుకున్నాం, మార్క్సును నేను తోసిరాజన్నాను. అప్పటికి బాగా పొద్దుబోయింది; కనుక మరుదినం తన యింటివద్ద మళ్లీ ఆడాలని ఆయన పట్టుబట్టినాడు.

సరిగ్గా పదకొండు గంటలకు లండన్‌లో అది బాగా ప్రొద్దున్నే — నేను మార్క్సు యింటివద్ద వుండినాను. ఆయన తన గదిలో లేడు, కానీ త్వరగా వస్తాడని చెప్పినారు. మార్క్సు భార్య కనిపించలేదు; లెన్‌హెన్ అంత సరదాగా లేదు. కారణ మేమిటని నేను అడగగలిగే లోపల మార్క్సు యింటిలోకి వచ్చి, నాతో కరచాలనం చేసి, చదరంగం పలక బయటికి తీసినాడు.

అప్పుడు పోరాటం ప్రారంభమైంది. మార్క్సు తన యెత్తుకంటె మేలైనది రాత్రి నేర్చుకున్నాడు; చాలాసేపు గడవకముందే నేను దుస్థితిలో పడినాను. నేను ఓడిపోయినాను, మార్క్సు సంతోషించినాడు. ఆయన కొంత పానీయమూ, కొన్ని శాండ్‌విచ్‌లూ తెప్పించినాడు. తరువాత మేము మరొక ఆట ఆడినాము, నేను గెలిచినాను. మేము ఆడుతూ వుండినాం మారుతున్న అదృష్టంతోనూ, మారుతున్న మనస్థితులతోనూ....

మార్క్సు భార్య మా యెదుటబడకుండా వుంది, పిల్లలెవరూ దగ్గరికి రావడానికి సాహసించలేదు. పోటీ ప్రజ్వలించింది, ఒక సారి ఒకరికీ, మరొక సారి మరొకరికీ అనుకూలంగా మారుతూ. చివరకు అర్ధరాత్రికి వరసగా రెండు సార్లు మార్క్సును ఓడించినాను. యింకా ఆడుదామని ఆయన పట్టుబట్టినాడు; కానీ లెన్‌హెన్ ఖండితంగా చెప్పింది: "యిక చాలు!"...

---

* బారకాసుల్లాంటి భవనం. అందులో బసచేసేవాళ్లకు గదులూ, అందరికీ కలిసి సమష్టిగా వంటకూ, కూర్చోడానికీ ఒక గదీ, చదువుకోడానికీ, పొగతాగడానికీ ఒక గదీ వుండినాయి. అలాంటి లాడ్జింగ్ హౌసులు లండన్‌లో చాలా వుండినాయి. కొన్నిటిలో కుటుంబాలకు కొన్ని గదులూ, పైన చెప్పిన ఉమ్మడి గదులు కాక ఒక ఉమ్మడి స్నానాల గదీ వుండేది. యీ సంస్థలు ప్రత్యేక స్టీవర్డులచేత నడపబడుతూ, మహా పరిశుభ్రంగా వుంచబడేవి. లండన్‌లో యిప్పటికీ కొన్ని నడపబడుతున్నాయి. — లీబ్‌క్నెఖ్ట్ వివరణ.

## 15

## బీదరికమూ, కష్టాలూ

మార్క్సును గురించి నమ్మశక్యంగానన్ని అబద్ధాలు చెప్పబడినాయి. ఆయన చుట్టూ వున్న ప్రవాసులలో అధిక భాగం పస్తులు వుండగా ఆయన కేళీ వినోదాల జీవితం గడిపినాడ నేది ఆ అబద్ధాలలో ఒకటి. వివరాలలోకి పోయే హక్కు నేను కోరను, కానీ యింత మాత్రం చెప్పగలను: మార్క్స్ భార్య రాసిన నోట్సు నాకు పదేపదే స్పష్టంగా రుజువు చేసిందేమంటే — విదేశాలలో యే అండదండలూ లేకుండా నివసించే ప్రవాసుల కెవరికైనా సంభవించే కష్టం మార్క్స్, ఆయన కుటుంబమూ యెప్పుడో ఒకసారి అరుదుగా అనుభవించడం కాదు, ప్రవాస జీవితంలో అనేక సంవత్సరాల పాటు వాళ్ళు అత్యంత తీవ్రమైన బీదరికం అనుభవించినారు. మార్క్స్ కుటుంబం కంటె యెక్కువ బాధపడినవాళ్ళు బహుశా యెక్కువ మంది లేరు. తరువాతి కాలంలో, ఆయన ఆదాయం యింకా యెక్కువగానూ, యింకా క్రమ బద్ధంగానూ వుండినప్పుడు, అప్పటికీ వాళ్ళకు దారిద్ర్యంనుండి నమ్మకమైన రక్షణ లేదు. అనేక సంవత్సరాలు, అత్యంత గడ్డు పరిస్థితి గడిచిన తర్వాత కూడా "న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్"కు తాను రాసే వ్యాసాలకు గాను మార్క్సుకు ప్రతివారమూ వచ్చే పౌను ఒక్కటే ఆయనకు నమ్మకమైన ఆదాయంగా వుండింది....

## 16

## మార్క్స్ వ్యాధీ, మరణమూ

### (టుస్సీ జాబు*)

"ముస్తఫా (ఆల్జీర్స్)లో మూర్ ఉనికిని గురించి నేను చెప్పగలిగిందల్లా యేమిటంటే, వాతావరణం హృదయ విదారకంగా వుండింది, మూర్‌కు అక్కడ మంచివాడూ, సమర్థుడూ అయిన డాక్టరు దొరికినాడు, హోటల్‌లో ప్రతి వొకరూ ఆయన పట్ల సుహృద్భావంగా, శ్రద్ధ చూపుతూ వుండినారు.

---

* మార్క్స్ చిన్న కూతురు ఎలినోర (టుస్సీ)నుండి తనకు వచ్చిన జాబును లీబ్‌క్నెఖ్ట్ యిక్కడ ఉటంకిస్తున్నాడు. — సం.

"1881–82 శరదృతువులోనూ, శీతకాలంలోనూ మూర్ మొదట జెన్నీతో కలిసి పారిస్ దగ్గర అర్జెంటెల్‌లో వుండినాడు. మేము అక్కడ ఆయన్ను కలుసుకొని, కొద్ది వారాలు వుండినాము. తరువాత ఆయన దక్షిణ ఫ్రాన్సుకూ, ఆల్జీర్స్‌కూ పోయినాడు, కానీ తిరిగి వచ్చినప్పుడు ఆయన ఆరోగ్యంగా లేడు. ఆయన 1882–83 శరదృతువూ, శీతకాలమూ ఐల్ ఆఫ్ వైట్‌లోని వెంట్నర్‌లో గడిపి, 1883 జనవరిలో, జెన్నీ మరణం తర్వాత, తిరిగి వచ్చినాడు.

"యిక కార్ల్స్‌బాద్‌ను గురించి. 1874లో, లివర్ వ్యాధి వలనా, నిద్రపట్టకపోవడం వలనా మూర్ అక్కడికి పంపబడినప్పుడు, మేము మొదటిసారి అక్కడికి పోయినాము. అక్కడ ఆయన మొదటి ఉనికి ఆయనకు అసాధారణమైన మేలు చేసినందున, 1875లో ఆయనంతకు ఆయనే మళ్లీ అక్కడికి పోయినాడు. మరు సంవత్సరం, 1876లో, నేను మళ్లీ ఆయన వెంట పోయినాను; యెందుకంటే, కిందటి సంవత్సరం ఆయన నాకోసం చాలా బెంగ పడిపోయినాడట. కార్ల్స్‌బాద్‌లో తన చికిత్సను గురించి ఆయన చాలా చిత్తశుద్ధిగా వుండినాడు, తనకు విధించిన నియమాల నన్నిటినీ నిష్ఠగా అనుసరించినాడు.

"అక్కడ మాకు చాలామంది మిత్రులైనారు. మూర్ ఆహ్లాదకరమైన తోటి ప్రయాణికుడు. ఆయన యెప్పుడూ సరదాగా వుండేవాడు; దేనినైనా ఆనందించడానికి సిద్ధంగా వుండేవాడు – మనోహరమైన ప్రకృతి దృశ్యమైనా సరే, ఒక గ్లాసు బీరు అయినా సరే. యిక ఆయన అపారమైన చారిత్రక జ్ఞానం మేము పోయిన ప్రతి స్థలాన్నీ వర్తమానంలో కంటె గతంలో యెక్కువ సజీవంగా, యెక్కువ ప్రత్యక్షంగా వుండేటట్లు చేసేది.

"కార్ల్స్‌బాద్‌లో మూర్ ఉనికిని గురించి కొంత రాసినారనుకుంటాను. రాసిన వాటిలో బాగా పెద్ద వ్యాసం ఒకదాన్ని గురించి విన్నాను; కానీ అది యే పత్రికలో వచ్చిందో జ్ఞాపకం లేదు.

"1874లో మేము లైప్జిగ్‌లో మిమ్మల్ని చూసినాము. తిరుగు ప్రయాణంలో మేము దారి తప్పించి బింగెన్‌కు పోయినాము; మూర్ అక్కడ మా అమ్మతో కలిసి తమ మధుమాసం గడిపినాడు; అందుకని ఆయన నాకు దాన్ని చూపించాలని కోరినాడు. యీ రెండు ప్రయాణాలలో మేము డ్రెస్డెన్, బెర్లిన్, ప్రాగ్, హాంబుర్గ్, న్యూరెన్‌బెర్గ్ కూడా దర్శించినాము.

"1877లో మూర్ మళ్లీ కార్ల్స్‌బాద్‌కు పోవలసివుండింది; కానీ జర్మన్, ఆస్ట్రియన్ అధికారులు ఆయన్ను బహిష్కరించే ఉద్దేశంలో వున్నారని మాకు తెలిసింది; బహిష్కరణ ప్రమాదానికి గురి కావడానికి అది మరీ పెద్దదీ, ఖర్చుతో కూడినదీ అయిన ప్రయాణమైనందున, ఆయన అక్కడికి పోనేలేదు. యిది ఆయనకు పెద్ద అసౌకర్యమైంది – అక్కడికి పోయిన ప్రతిసారీ ఆ చికిత్సతో ఆయన పునర్యవ్వనం పొందేవాడు.

"మేము బెర్లిన్‌కు పోవడానికి ప్రధాన కారణం మా నాన్నకు విశ్వాసం గల మిత్రుడూ, నాకు ప్రియమైన మామా అయిన ఎడ్గార్ ఫన్ వెస్ట్‌ఫాలెన్‌ను చూడడం. అక్కడ మేము రెండు

రోజులు మాత్రమే వుండినాము. మూడవ రోజున, మేము మా హోటల్ వదలిన తర్వాత సరిగ్గా గంటకు, పోలీసువాళ్లు అక్కడికి పోయినారని తెలిసి, మూర్‌కు చాలా వినోదం కలిగింది.''

* * *

''1881 శరదృతువు కల్లా మా ప్రియమైన అమ్మ యెంత జబ్బుగా వుండిందంటే, ఆమె యెప్పుడో గాని తన మంచం వదలిపోగలిగేది కాదు. మూర్‌కు, తన జబ్బులను నిర్లక్ష్యం చేసిన ఫలితంగా, ప్లూరసీ తీవ్రమైంది. డాక్టరు, మాకు మంచి మిత్రుడైన డాంకిన్, ఆయన జబ్బు చూసి నిరాశపడినాడు. అది దుర్భరమైన సమయం. మా ప్రియమైన అమ్మ ముందరి పెద్ద గదిలో వుంది, దానిపక్కన వున్న చిన్న గదిలో మూర్ వున్నాడు. వాళ్లు, ఒకరికొకరు అంతగా అలవాటు పడినవాళ్లు, ఒకరి జీవితంలో ఒకరు భాగమైన వాళ్లు, యిక యెంత మాత్రమూ ఒకే గదిలో కలిసి వుండడం కూడా సాధ్యం కాలేదు.

''మా మంచి లెన్‌హెనూ — ఆమె మాకు యేమైందీ మీకు తెలుసు — నేనూ వాళ్లిద్దరినీ చూసుకోవలసి వుండింది. మూర్‌ను రక్షించింది మా సేవే అని డాక్టర్ అన్నాడు. ఆ మాట యేమైనప్పటికీ, లెన్‌హెన్ గానీ, నేను గానీ మూడు వారాలు నిద్రపోలేదని మాత్రం నాకు తెలుసు. రేయింబవలూ మేము నిలువు కాళ్లమీద వుండినాం; మేము మరీ సొమ్మసిల్లినప్పుడు, చెరొక గంటా మార్చి మార్చి విశ్రమించేవాళ్లం.

''మూర్ మళ్లీ తన వ్యాధిని జయించినాడు.

''ఆయన అమ్మ గదిలోకి పోదగినంత బలం పొందిన రోజును నే నెన్నటికీ మరిచిపోలేను. వాళ్లు యిద్దరూ కలిసినప్పుడు మళ్లీ చిన్నవాళ్లు అయినారు — ఆమె చిన్న పిల్ల, ఆయన ప్రేమించే యువకుడు — చివరిసారి ఒకరినుండి ఒకరు సెలవు తీసుకుంటున్న రోగపీడిత పురుషుడూ, చావుదలలో వున్న వృద్ధురాలూ కాదు.

''మూర్‌కు స్వస్థత చిక్కింది; ఆయన యింకా బలంగా లేనప్పటికీ, బలం పుంజుకుంటు న్నట్లు కనిపించినాడు.

''తరువాత 1881 డిసెంబర్ 2న అమ్మ చనిపోయింది. ఆమె చివరి మాటలు — అవి యింగ్లీషులో వుండడం విశేషం — తన 'కార్ల్'కు చెప్పినవి.

''మన ప్రియమైన 'జనరల్' (ఎంగెల్సు) వచ్చి, నాకు దాదాపు ఒళ్లు మండే మాట అన్నాడు:


'' 'మూర్ కూడా చనిపోయినాడు.'

''నిజమే మరి.

''మా ప్రియమైన అమ్మ గతించినప్పుడు, మూర్ కూడా గతించినాడు. జీవితానికి పట్టు కొని వేళ్లాడడానికి ఆయన తీవ్ర పోరాటం చేసినాడు — ఆయన చివరిదాకా యోధుడే కానీ



కార్మికవర్గ తొలి విప్లవ సంఘర్షణలు. 1834లో లియోన్
నేతపనివాళ్ల తిరుగుబాటు



చార్టిస్టుల ప్రదర్శన. 1842, మే

ఆయన వికల మనస్కుడైనాడు. ఆయన స్వార్థపరుడైవుంటే, పరిస్థితులను వాటి యిష్టానికి వదిలేసేవాడు. కానీ ఆయనకు అన్నిటినీ మించింది ఒకటి వుండింది — తన ఆశయంపట్ల దీక్ష. తన మహా కృషిని పూర్తిచేయడానికి ఆయన ప్రయత్నించినాడు, అందుకనే ఆరోగ్యం కొరకు మళ్లీ ప్రయాణం కట్టడానికి ఆయన అంగీకరించినాడు.

"1882 వసంతంలో ఆయన పారిస్‌కూ, అర్జెంటెల్‌కూ పోయినాడు. అర్జెంటెల్‌లో నేను ఆయన్ను కలుసుకున్నాను. మేము కొద్ది రోజులు, నిజంగా ఆనందమైనవి, జెన్నీతోనూ, ఆమె పిల్లలతోనూ కలిసి గడిపినాము. తరువాత మూర్ దక్షిణ ఫ్రాన్సుకూ, ఆఖరున అల్జీర్స్‌కూ పోయినాడు.

"అల్జీర్స్‌లోనూ, నీసెలోనూ, కాన్స్‌లోనూ ఆయన వుండిన కాల మంతా వాతావరణం బాగలేదు. అల్జీర్స్‌నుండి ఆయన నాకు పెద్ద ఉత్తరాలు రాసినాడు. వాటిలో నేను చాలా ఉత్తరాలు పోగొట్టుకున్నాను — యెందుకంటే ఆయన కోరిక మేరకు నేను వాటిని జెన్నీకి పంపినాను, చాలావాటిని ఆమె నాకు తిరిగి పంపలేదు.

"ఆఖరున మూర్ యింటికి తిరిగి వచ్చినప్పుడు చాలా జబ్బుగా వుండినాడు. మేము కీడు శంకించసాగినాము. డాక్టర్ల సలహామీద ఆయన శరదృతువూ, శీతకాలమూ ఐల్ ఆఫ్ వైట్‌లోని వెంట్నర్‌లో గడిపినాడు. యిప్పుడొక మాట చెప్పాలి — మూర్ కోరికమీద నేను ఆకాలంలో మూడు మాసాలు జెన్నీ పెద్ద కొడుకు జాన్ (జోనీ)తో కలిసి యిటలీలో గడిపి నాను. 1883 ప్రారంభంలో నేను జోనీని వెంటబెట్టుకొని మూర్ వద్దకు పోయినాను, అతను ఆయనకు అభిమాన మనుమడు గనుక. నాకు పాఠాలు చెప్పే పని వుండింది గనుక నేను తిరిగి పోవలసి వచ్చింది.

"అప్పుడు చివరి దారుణమైన అఘాతం వచ్చింది: జెన్నీ, మూర్ తొలి సంతు, ఆయనకు అత్యంత ప్రేమపాత్రమైన బిడ్డ, హఠాత్తుగా మరణించింది (జనవరి 11న). జెన్నీ ఆరోగ్యం మెరుగౌతున్నదనీ, మేము (లెన్‌హెన్, నేనూ) ఆదుర్దా పడనవసరం లేదనీ మూర్ రాసిన ఉత్తరాలు మాకు అంది వుండినాయి — అవి యిప్పుడు నా యెదుట వున్నాయి. మూర్ రాసిన ఆ జాబు వచ్చిన తర్వాత ఒక గంటకు ఆమె మృతిని గురించిన టెలిగ్రాం అందింది. వెంటనే నేను వెంట్నర్‌కు బయలుదేరినాను. నా జీవితంలో నేను యెన్నో విషాద ఘడియలు అనుభవించినాను. కానీ అంత విషాదభరితమైన ఘడియ యెన్నడూ చూడలేదు. మా నాన్నకు నేను మరణశిక్ష మోసుకపోతున్నట్లు అనిపించింది. ఆయనకు వార్త యెలా చెప్పడమా అని నేను ఆందోళనతో ఆ దీర్ఘమైన దారి పొడవునా తల బద్దలు చేసుకున్నాను. కానీ అది అనవసరమైంది. నా ముఖం నన్ను పట్టి యిచ్చింది. మూర్ వెంటనే అన్నాడు: 'మన జెన్నీహెన్ చనిపోయింది.' తరువాత, పారిస్‌కు వెంటనే పోయి, పిల్లలకు తోడ్పడమని నన్ను ఆయన తొందరించినాడు. నేను ఆయన దగ్గిర వుందామనుకున్నాను; కానీ ఆయన ప్రతిఘటనను సహించలేదు. నేను

వెంట్నర్‌లో అర్ధగంట కూడా వుండకుండా విచారంతో మళ్ళీ లండన్‌కు బయలుదేరినాను. అక్కడినుండి పారిస్‌కు పోయినాను. పిల్లల కొరకు మూర్ నన్ను చేయమని కోరిన పనిచేస్తూ వుండినాను.

"యింటికి నా తిరుగు ప్రయాణం గురించి యేమి చెప్పను. ఆ కాలమూ, ఆ వ్యథా, ఆ బాధా భయప్రకంపంతో మాత్రమే తలచుకోగలను. అది చాలు.

"ప్రియమైన మా అమ్మను గురించి మరి కొద్ది మాటలు. ఆమె కొన్ని నెలలుగా మరణావస్థలో వుండింది, కాన్సర్‌తో వచ్చే మహా భయంకరమైన బాధలు భరిస్తూ. కానీ ఆమె ఉల్లాసమూ, నీకు యెంతో బాగా పరిచయమున్న ఆమె తరగని చమత్కారమూ ఒక్క నిముషం కూడా ఆమెను వదల్లేదు. జర్మనీ యెన్నికల (1881) ఫలితాలను గురించి ఆమె పసిపిల్లల తహతహతో అడిగింది. యిక విజయానికి ఆమె యెంత ఆనందించిందని! మరణించే దాకా కూడా ఆమె ఉత్సాహంగా వుండింది, హాస్యోక్తులతో మా ఆదుర్దాను పారదోలడానికి ప్రయత్నిస్తూ. ఔను అంత భయంకరంగా బాధపడుతుండిన ఆమె డాక్టర్ను, మా అందర్నీ చూసి నిజంగా హాస్యోక్తులాడింది, నవ్వింది, మేము అంత గంభీరంగా వున్నందుకు. చిట్టచివరి నిముషం దాకా ఆమె స్పృహలో వుండింది; మాట్లాడలేనప్పుడు — ఆమె చివరి మాటలు 'కార్ల్'కు — మా చేతులు పట్టుకొని ఒత్తి, చిరునవ్వు నవ్వడానికి ప్రయత్నించింది.

"మూర్ విషయ మేమంటే, నీకు తెలుసు, ఆయన మేయ్‌ట్లండు పార్కులోని తన పడకగదిలోనుండి పఠనాగారంలోకి పోయి, తన కుర్చీలో కూర్చొని, ప్రశాంతంగా ప్రాణం వదలినాడు.

"ఆ కుర్చీ 'జనరల్' దగ్గర వుండింది, ఆయన మరణించిందాకా. యిప్పుడది నా దగ్గర వుంది.

"మూర్‌ను గురించి రాసేటప్పుడు, లెన్‌హెన్‌ను మరచిపోకు. నీవు అమ్మను మరచిపోవని నాకు తెలుసు. లెన్‌హెన్ ఒక విధంగా యిరుసు వంటిది — యింట్లో ప్రతిదీ ఆ యిరుసు చుట్టూ తిరిగింది. అత్యంత విశ్వాసం గల అత్యుత్తమ మిత్రరత్నం ఆమె. కనుక, మూర్‌ను గురించి రాసేటప్పుడు లెన్‌హెన్‌ను మరచిపోకు."

* * *

"యిప్పుడు, నీవు కోరినట్లు, దక్షిణాదిన మూర్ ఉనికిని గురించి కొన్ని వివరాలు చెప్తాను. 1882 ప్రారంభంలో ఆయనా, నేనూ కొద్ది వారాలు అర్జెంటెల్‌లో జెన్నీ దగ్గర వుండినాం. మార్చిలోనూ, ఏప్రిల్‌లోనూ మూర్ ఆల్జీర్స్‌లో వుండినాడు, మే నెలలో మాంటె కార్లోలోనూ, నీసెలోనూ, కాన్స్‌లోనూ వుండినాడు. సుమారు జూన్ అంతంలో, జూలై అంతానూ, ఆయన మళ్ళీ జెన్నీ దగ్గర వుండినాడు. లెన్‌హెన్ కూడా అప్పుడు అర్జెంటెల్‌లో వుండింది. అక్కడినుండి ఆయన లౌరాతో కలిసి స్విట్జర్లెండుకూ, వెవెయ్‌కీ, వగ్గైరాలకు పోయినాడు.

సెప్టెంబర్ అంతంలో, లేదా అక్టోబర్ ప్రారంభంలో ఆయన యింగ్లండుకు తిరిగివచ్చి, నేరుగా వెంట్నర్‌కు పోయినాడు; జోనీ, నేనూ ఆయన్ను చూడడానికి అక్కడికి పోయినాము.

"యిప్పుడు మీ ప్రశ్నలకు జవాబుగా కొన్ని వివరాలు. మా చిన్న ఎడ్గార్ (ముష్) పుట్టింది 1847లో ననుకుంటాను, 1855 ఏప్రిల్‌లో మరణించినాడు. చిన్న ఫాక్స్ (హెన్రిహ్) 1849 నవంబర్ 5న పుట్టి, సుమారు రెండేండ్ల వయస్సులో మరణించినాడు.* నా చెల్లెలు ఫ్రాంతిస్కా 1851లో పుట్టి, పసిపిల్లగా వుండగానే, సుమారు పదకొండు నెలల వయస్సులో మరణించింది."

* * *

"మన మంచి లెన్‌హెన్‌ను గురించి, లేదా, చివరి దశలో మేము పిలుస్తూ వుండినట్లు, 'నిమ్'ను గురించి – జోనీ లోంగె పసివాడుగా వున్నప్పుడు, యే కారణం వల్లనో నాకు తెలియదు, ఆమె కాపేరు పెట్టినాడు – నీవు కొన్ని ప్రశ్న లడిగినావు. ఆమె 8, 9 యేండ్ల పిల్లగా వుండినప్పుడు మా అవ్వ ఫన్ వెస్ట్‌ఫాలెన్ కొలువులో చేరి, మూర్‌తోనూ, అమ్మతోనూ, ఎడ్గార్ ఫన్ వెస్ట్‌ఫాలెన్‌తోనూ కలిసి పెరిగింది. ముసలి ఫన్ వెస్ట్‌ఫాలెన్‌మీద ఆమెకెప్పుడూ చాలా అభిమానం. మూర్‌కు కూడా అంతే. ముసలి బేరన్ ఫన్ వెస్ట్‌ఫాలెన్ గురించీ, ఆయనకు షేక్స్పియర్, హోమర్‌ల విషయంలో వుండిన జ్ఞానం గురించీ మూర్ విసుగు లేకుండా చెప్పేవాడు. బేరన్‌కు కొన్ని హోమర్ పాటలు మొదటినుండి చివరిదాకా నోటికి వస్తాయి; షేక్స్పియర్ నాటకాలలో అత్యధిక భాగం, జర్మన్ భాషలోనూ, యింగ్లీషు భాషలోనూ, ఆయనకు నోటికి వస్తాయి. అందుకు భిన్నంగా మూర్ తండ్రి – ఆయనంటే మూర్‌కు గొప్ప మెప్పు – నిజమైన పద్దెనిమిదవ శతాబ్దపు 'ఫ్రెంచివాడు.' ఆయనకు వోల్టేర్, రూసోలు కంఠతా వచ్చు, ముసలి వెస్ట్‌ఫాలెన్‌కు హోమర్, షేక్స్పియర్‌లు వచ్చినట్లు. మూర్‌యొక్క అబ్బురపు బహుముఖత్వం నిస్సందేహంగా యీ 'అనువంశిక' ప్రభావాలవల్లనే.

"మళ్లీ లెన్‌హెన్‌ను గురించి. ఆమె మా తలిదండ్రులవద్దకు వచ్చింది వాళ్ళు పారిస్‌కు పోకముందో, తర్వాతనో (వాళ్ళ పెండ్లి అయిన తర్వాత త్వరలో పారిస్‌కు పోయినారు) నేను చెప్పలేను. నాకు తెలిసిందల్లా అవ్వ అమ్మ దగ్గరికి ఆ అమ్మాయిని పంపింది, 'తాను పంపగలిగినవాటిలో కెల్ల ఉత్తమమైనదిగా, విశ్వాసమూ, ప్రేమా గల లెన్‌హెన్‌ను.' విశ్వాసమూ, ప్రేమా గల లెన్‌హెన్ మా తలిదండ్రుల దగ్గరనే వుండిపోయింది; తరువాత ఆమె చెల్లెలు మేరియన్ వచ్చి ఆమెతో కలిసింది. యిది నీకు గుర్తు వుండదు, యెందుకంటే యిది నీవు వుండిన కాలం తర్వాత...."

---

* అతనికి "తుపాకిమందు కుట్ర" వీరుడైన గై ఫాక్స్ పేరు పెట్టబడింది. – [లీబ్‌క్నెహ్ట్ వివరణ.] 1605లో నవంబర్ 5న పార్లమెంటు భవనాన్ని, సభ్యులందరితో సహా, పేల్చివేయడానికి గై ఫాక్స్ నాయకత్వాన ఆ కుట్ర పన్నబడింది. – సం.

## 17

# మార్క్స్ సమాధి

దాన్ని నిజంగా మార్క్స్ కుటుంబ సమాధి అనాలి. అది లండన్‌లో ఉత్తరాన, ఆ బ్రహ్మాండమైన నగరం కంటె యెత్తుగా వున్న ఒక గుట్టమీద, హైగేట్ శ్మశానంలో వుంది....

సోషల్ డెమోక్రట్లమైన మాకు సాధువులూ లేరు, సాధువుల సమాధులూ లేవు. కానీ ఆ ఉత్తర లండన్ శ్మశానంలో వున్న వ్యక్తిని లక్షలాది జనులు కృతజ్ఞతతోనూ, గౌరవంతోనూ, జ్ఞాపకం పెట్టుకుంటారు. వేల సంవత్సరాల తర్వాత, కార్మికవర్గపు స్వేచ్ఛా పిపాసను అణచడానికి ప్రయత్నించిన మొరటుతనమూ, సంకుచిత మనస్తత్వమూ నమ్మరాని గతకాలపు కట్టుకథ లైనప్పుడు, స్వేచ్ఛాజీవులైన ఉదాత్త మానవులు ఆ సమాధి వద్ద నిలబడి, తలలమీది టోపీలు తీసి, శ్రద్ధాళువులైన తమ పిల్లలతో చెప్తారు: "యిక్కడున్నాడు కార్ల్ మార్క్స్."

యిక్కడున్నాడు కార్ల్ మార్క్స్, ఆయన కుటుంబమూ, సాదా ఐవీ లతా పరీవృతమైన ఒక చలువరాయి. ఆ చలువరాతి సమాధి తల వైపు దిండులాగా వుంది. రాతిమీద యీ లేఖనం వుంది:



జెన్నీ ఫన్ వెస్ట్‌ఫాలెన్

కార్ల్ మార్క్స్ ప్రియమైన భార్య
జననం 1814 ఫిబ్రవరి 12,
మరణం 1881 డిసెంబర్ 2.

కార్ల్ మార్క్స్

జననం మే 5, 1818, మరణం మార్చి 14, 1883.

హారీ లోంగె

వాళ్ల మనుమడు

జననం 1878 జూలై 4, మరణం 1883 మార్చి 20.

హెలెన్ దెముత్

జననం 1823 జనవరి 1, మరణం 1890 నవంబర్ 4.

మార్క్స్ కుటుంబంలో మరణించినవాళ్లందరినీ కుటుంబ సమాధిలో వుంచలేదు. లండన్‌లో మరణించిన ముగ్గురు పిల్లలను లండన్‌లోని యితర శ్మశానాలలో సమాధి చేసినారు. టాటెన్‌హామ్ కోర్టు రోడ్డులోని వైట్‌ఫీల్డ్ చాపెల్ శ్మశానంలో నిశ్చయంగా ఎడ్గార్ (ముష్)నూ, బహుశా మరి యిద్దరినీ, అభిమాన పుత్రిక అయిన జెన్నీ మార్క్స్ పారిస్ దగ్గర, అర్జెంటెలో సమాధి చేయబడింది. పచ్చగా వున్న ఆమె కుటుంబంనుండి అక్కడ మృత్యువు ఆమెను యెత్తుకపోయింది.

కానీ, పిల్లలకూ, పిల్లల పిల్లలకూ అందరికీ కుటుంబ సమాధిలో స్థానం లేకపోయినా రక్త సంబంధంచేత కాకపోయినా ఆ కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి, "విశ్వాసం గల లెన్‌హెన్," హెలెన్ దెముత్, అక్కడ వుంది.

ఆమెను కుటుంబ సమాధిలో వుంచాలని మార్క్స్ భార్యా, ఆ తరువాత మార్క్సూ అప్పటికే నిర్ణయించి వుండినారు. లెన్‌హెన్ లాగె విశ్వాసం గల మిత్రుడు అయిన ఎంగెల్సూ, యింకా బతికివుండిన పిల్లలూ కలిసి, మార్క్స్ తాను యిష్టపడి యే కర్తవ్యాన్ని నిర్వహించివుండేవాడో ఆ కర్తవ్యాన్ని నెరవేర్చినారు.

మార్క్సు పిల్లలు లెన్‌హెన్‌ను గురించి యేమనుకున్నదీ, ఆమెపట్ల వాళ్లకు యెంత అభిమాన మున్నదీ, ఆమె స్మృతిని వాళ్లు యెంత భక్తితో గౌరవించిందీ మార్క్సు చిన్న కూతురు రాసిన జాబులను బట్టి తెలుస్తుంది – అవి మరొక చోట ప్రచురింపబడినాయి.

నా చివరి లండన్ ప్రయాణంనుండి తిరిగి వచ్చేటప్పుడు నేను పారిస్ గుండా ప్రయాణించి, డ్రవీల్‌కు పోయినాను. అక్కడ లాఫార్గుకూ, ఆయన భార్య లౌరా మార్క్సుకూ అందమైన చిన్న గ్రామీణ గృహం వుంది. అక్కడ లౌరా, నేనూ లండన్ స్మృతులలో నిమగ్నుల మైనాము. నేను యీ చిన్న పుస్తకం రాసే ఉద్దేశం వెల్లడించినాను. యింతకు ముందుగానే ఉల్లేఖించిన జాబులో టుస్సీ యేమి చెప్పిందో, తరువాత నోటి మాటగా మళ్లీ యేమి చెప్పిందో, సరిగ్గా ఆ మాటే లౌరా నాతో చెప్పింది: "లెన్‌హెన్‌ను మరచిపోకు!"

సరే, లెన్‌హెన్‌ను మరిచిపోలేదు, మరిచి పోలేను. నలభై సంవత్సరాలు ఆమె నాకు మిత్రురాలు గదా. అంతే గాక, లండన్ ప్రవాస జీవితంలో నాకు తరుచుగానే ఆమె "అదృష్ట దేవత" కూడా. నా పర్సు ఖాళీగా వున్నప్పుడు, మార్క్సు కుటుంబపు పరిస్థితి మరీ అధ్వాన్నంగా లేనప్పుడు, ఆమె యెన్నిసార్లు నాకు ఆరు పెన్నీలు యిచ్చి నన్ను గట్టెక్కించిందని! – వాళ్ల పరిస్థితి అధ్వాన్నంగా వుంటే, యివ్వడానికి ఆమె దగ్గర యేమీ వుండేది కాదు. నా ఆర్థిక పరిస్థితి అత్యవసరమైన కొత్త దుస్తులు కొనడానికి వీలు కలిగించనప్పుడు నా కుట్టుపని నైపుణ్యం తగినంతగా లేనప్పుడు, యెన్నిసార్లు ఆమె నా పాత దుస్తులను మరమ్మత్తు చేసిందో.

నేను లెన్‌హెన్‌ను మొదట చూసినప్పుడు ఆమెకు 27 యేండ్ల వయస్సు. ఆమె అందాల రాణి కాదు గానీ చూడ ముచ్చటగా వుండేది; మంచి విగ్రహం ఆమెది. ముక్కూ, మొగమూ యింపుగా ఆకర్షణీయంగా వుండేవి. ఆమెను పెండ్లి చేసుకోదలచినవాళ్లు తగినంతమంది వుండినారు; అనేక సార్లు ఆమె మంచి సంబంధం చేసుకొని వుండవచ్చు. కానీ, ఆమె బాధ్యత యేమీ స్వీకరించకపోయినా, మూర్‌కూ, ఆయన భార్యకూ, పిల్లలకూ అండగా వుండడం ఆమె అనురక్త హృదయానికి సహజ ధర్మం.

ఆమె వాళ్ల దగ్గర నిలబడింది; ఆమె వయస్సు గడిచిపోయింది. బీదరికంలో, కష్టాలలో, సుఖ దుఃఖాలలో ఆమె నిలబడింది. తన భవితవ్యాన్ని యెవరి భవితవ్యంలో లీనం చేసిందో వాళ్లను మృత్యు పరశువు నేలకూల్చిందాకా ఆమెకు విశ్రాంతి లభించలేదు. ఆమెకు ఎంగెల్సు యింటిలో విశ్రాంతి లభించింది, అక్కడే ఆమె మరణించింది, ఆమరణ ఆత్మ విస్మృతితో. యిప్పు డామె కుటుంబ సమాధిలో వుంది.

* * *

మా మిత్రుడు మోటెలెర్, యిప్పుడు హైగేట్‌కు అనతి దూరంలో హాంప్‌స్టెడ్‌లో నివసిస్తున్న "యెర్ర పోస్టు మాస్టర్," ఆ సమాధిని యిలా వర్ణిస్తున్నాడు:

"మార్క్స్ సమాధి తెల్ల పాల రాతితో కట్టబడింది. నలుపు రంగులో పేర్లూ, తేదీలూ చెక్కిన పలక కూడా పాల రాయే. కొంత గడ్డి నేలా, ఒకసారి నేను స్విట్జర్లెండునుండి తెచ్చిన అడవి ఐవీ తీగా, కొద్ది చిన్న గులాబి మొక్కలూ, యిక్కడి సమాధులకు మామూలైన కంకర రాళ్ల మధ్య మొలిచిన గడ్డి మొక్కలూ — యింత మాత్రమే సమాధికి గల మితమైన అలంకరణ. సాధారణంగా నేను వారానికి రెండుసార్లు హైగేట్ శ్మశానం మీదుగా పోతుంటాను; గడ్డి మరీ దట్టంగా వుంటే చక్కజేస్తాను. వేసవి గత రెండు వేసవుల మాదిరే వుంటే, ఒకోసారి కాస్త నీళ్లు పోయడం అవసర మౌతుంది. (యీ యేడు యూరపియన్ భూఖండంమీద అంత వర్షం పడుతున్నా, యింగ్లండులో వర్షాభావం వుంది, యిలాంటి తీవ్రమైన వర్షాభావం యెవరి యెరుకలోనూ లేదు, పార్కుల్లో కూడా గడ్డి పూర్తిగా యెండిపోయింది.) లెస్నెర్ తోడ్పాటుతో కూడా, వేడిమి క్రూర చర్యలనుండి సమాధిని రక్షించలేకపోయినాను; కనుక దానిని సరిగా చూసుకునే పని శ్మశానపు తోటమాలికి అప్పగించవలసి వచ్చింది. యిది మేము ఎవెలింగుల సమ్మతితో చేసినాము; వాళ్లు చాలా దూరాన నివసిస్తూన్నందున అరుదుగా మాత్రమే అక్కడికి పోగలరు."

## 18

## పాత స్థలాల అన్వేషణ

నేను యీ సంవత్సరం* మేలో యింగ్లండుకు పోయినప్పుడు నిర్ణయించుకున్నాను — ఆందోళనకారునిగా నా కర్తవ్యాలు నిర్వహించిన తర్వాత, తిరిగిపోయే ముందు, ప్రవాసులముగా మేము నివసించిన నగర భాగానికి పోవాలనీ, ముఖ్యంగా మార్క్స్ కుటుంబం నివసించిన స్థలాలు చూడాలనీ.

జూన్ 8వ తేదీన, సోమవారం నాడు, టుస్సీ మార్క్స్, ఆమె భర్త ఎవెలింగూ, నేనూ సైడెన్‌హామ్‌నుండి బయలుదేరి, రైలులోనూ, గుర్రపు బండిలోనూ, ఆమ్నిబస్‌లోనూ పోయి, సోహో గుండా టాటెన్‌హామ్ కోర్టు రోడ్డు చేరుకున్నాము. అక్కడనుండి మా అన్వేషణ ప్రారంభించినాము. మేము పద్ధతిగా పనిచేసినాము. నలభైల అంతంనుండి యాభైలదాకా, అరవైలదాకా లండన్‌లో ప్రవాసులుండిన ప్రదేశాలను "వెలికి తీయడం" మా కోరిక.

---

* 1896. — సం.

అలా అక్కడ చేరినాం, టాటెన్‌హామ్ కోర్టు రోడ్డు మలుపువద్ద; దారిద్ర్య దశలో సంఘీభావంచేత తరుమబడిన జర్మన్, ఫ్రెంచి ప్రవాసులు ఒకటిగా గుమికూడిన సోహో స్క్వేర్‌కూ, లైసెస్టర్ స్క్వేర్‌కూ చాలా దగ్గర అది.

మేము మొదట సోహో స్క్వేర్‌కు పోయినాము. అది యేమీ మారలేదు. అవే యిండ్లు, అదే మసి పూతతో. బోర్డులమీద కొన్ని వ్యాపార సంస్థల పేర్లు కూడా పాతవే.... కల లాగా వుంది. నా యవ్వనం నా కండ్లముందు నిలిచింది; 40, 45 సంవత్సరాలు గాలికి కొట్టుకపోయే పొగమంచులాగ కరిగిపోయినాయి; చౌరస్తా దాటి, సుప్రసిద్ధమైన ఒక పక్క వీధిగుండా ఓల్డ్ కాంప్టన్ స్ట్రీట్‌వైపు పోతున్న 25 యేండ్ల వయస్సు గల ప్రవాసజీవిగా నేను నాకు కనపడినాను. ఒకటిన్నర తరం కిందట మేము అంత సరదా అయిన, కానీ దారుణమైన, జీవితం గడిపిన ఆ పాత తరహా లాడ్జింగ్ హౌస్ యింకా అక్కడే వుంది. వేగంగా దాటిపోతున్న యెర్ర వొల్ఫ్, లేక అక్కడ నిలుచుకొని వున్న కోన్రాడ్ ష్రామ్ కనపడతాడని దాదాపు యెదురుచూచినాను. ఆ స్థలం నేను నిన్ననే వదలినట్లు వుండింది.

కాల పురుషుని పాద ముద్రలు పడకుండా, యెగిరి పడే అలల తాకిడికి చెక్కు చెదరకుండా నిలిచిన వీధులూ, పేటలూ లండన్‌లోని ఆ యిండ్ల సముద్రంలో వుండడం యెంత అద్భుతం!...

సాగిపోయినాం మేము. నేరుగా — చర్చి స్ట్రీట్‌దాకా. ఔను, అదిగో చర్చి, అప్పటి లాగే వుంది; దాని కెదురుగా విధిగా వుండే పానశాల, అది కూడా మారలేదు.... యిక ఆ మూడంతస్తుల యిండ్లు, రెండు ముందరి కిటికీలు గలవి, మేము అప్పుడు చూసినట్లే వున్నాయి. యెనిమిదేండ్లు నేను నివసించిన 14వ నంబరు యిల్లు కూడా అంతే.

మేము వెనక్కి పోయి, ఒక మలుపు తిరిగినాము. అక్క డుంది మెక్లెన్ ఫీల్డ్ స్ట్రీట్. 6వ నంబరు యిల్లు యేదీ?... అది వుండింది యిక్కడే అయి వుండాలి. కానీ మా అన్వేషణ నిరర్థకం. కొత్త వీధి వేసినారు; ఎంగెల్సు తన లండన్ ప్రవాస జీవిత ప్రారంభంలో, మాంచెస్టర్‌లోని తమ కుటుంబ వ్యాపారం చూసుకోడానికి కఠినుడైన తన తండ్రిచేత పంపబడిందాకా, నివసించిన యింటిని కొత్త వీధి కబళించింది....

ముందుకు పోయినాం. యిదిగో డీన్ స్ట్రీట్. మార్క్సు, ఆయన కుటుంబమూ యేండ్ల తరబడి నివసించిన యిల్లు యేది? మును పొకసారి దానికోసం వెదకి కనుక్కోలేక పోయినాను. తరువాత ఎంగెల్సు చెప్పినాడు, నంబర్లు మార్చినారని. యిక్కడ ఒక యింటికీ మరొక యింటికీ భేదం తెలుసుకోవడం కష్టం, కోడిగుడ్లలో భేదం తెలుసుకోవడం లాగే;

యింతకు ముందు నేను లండన్‌కు వచ్చినప్పుడు, దీర్ఘ అన్వేషణలకు నాకు యెప్పుడూ వ్యవధి లేదు. లెన్‌హెన్ మరణించడానికి కొద్ది కాలం ముందు నేను ఆమెతో మాట్లాడి నాను; ఆమె కూడా ఆ యిల్లు యేదైందీ ఖచ్చితంగా చెప్పలేకపోయింది. యిక టుస్సీకి, ఆ కుటుంబం డీన్ స్ట్రీట్‌నుండి కెంటిష్ టౌనుకు మారినప్పుడు యేడాది వయస్సు మాత్రమే వుండినదానికి, సహజంగానే, గుర్తు లేదు.

మేము ఒక పద్ధతిగా పురోగమించవలసి వచ్చింది. వీధిలో చాలా కొద్ది మార్పే జరిగింది. ఓల్డ్ కాంప్టన్ స్ట్రీట్ కొసనుండి కుడివైపు వున్న కొన్ని యిండ్లమధ్య మేము తటపటా యించినాము. నాకు కచ్చితంగా జ్ఞాపకం వున్న గుర్తు ఓల్డ్ కాంప్టన్ స్ట్రీట్ దగ్గర అవతలి వైపున వుండిన ఒక నాటకశాల. ముందు అది యెవరో మిస్ కెల్లీ అనే ఆమెది; కానీ అది పునర్నిర్మింపబడింది. యిప్పుడు దాని పేరు రాయల్టీ థియేటర్, అప్పటికంటె చాలా పెద్దదిగా, విశాలంగా వుంది. అది యెడమ వైపుకు విస్తరింపబడిందో, కుడివైపుకు విస్తరింపబడిందో నాకు తెలియనందున, నాకు తెలిసిన ఒకే ఒక గుర్తు యే స్థలంలో వుండిందో నిశ్చయంగా చెప్పలేకపోయినాను. అది రెండు యిండ్లలో అదో యిదో కాక తప్పదని చివరకు నిర్ణయించుకున్నాను. బాహ్యాకారం యిక చాలలేదు, యిండ్ల లోపలి భాగాలు చూడవలసి వచ్చింది. ఒక యింటి వాకిలి తెరిచివుండింది. నేను లోపలికి పోయినాను; పైకి పోయే మెట్లు చూసినట్లే వున్నాయి; మొత్తం యింటి వాలక మంతా, వాకిట్లోనుండి నాకు అర్థమైన మేరకు, నేను చూసినట్లే వుంది. కానీ లండన్ యిండ్లలో అత్యధిక భాగం ఒకే ప్లాన్‌కు, వరసగా కట్టబడివుంటాయి, యే ప్రత్యేకతా, కొత్తదనమూ లేకుండా. రెండవ అంతస్తుకు యెక్కిపోయినాను, కానీ అక్కడ యేదీ గుర్తుపట్టలేకపోయినాను, యేదీ చూసినట్లు లేదు.

యీలోగా మార్క్స్ కూతురూ, ఆమె భర్తా వీధిలో మరికొన్ని పరిశీలనలు జరిపినారు. నేను నా పరిశోధనల సందిగ్ధ ఫలితం వాళ్లకు చెప్పినాను.

పక్క యింటికి పోవాల్నా? అది 28వ నంబరు. నాది పొరపాటు కాకపోతే, అది మార్క్స్ యింటి నంబరు. ఔను, నా లండన్ ఉనికి ప్రారంభంలో ఒక ధారణా పద్ధతి ద్వారా జ్ఞాపకం పెట్టుకున్న విషయం జ్ఞాపకం వచ్చింది — అది సరిగా నా యింటి నంబరుకు రెండింతలు. అనగా, నంబర్లు మారినాయని చెప్పడంలో ఎంగెల్సు పొరబడినాడు. అది కేవలం ఆయన ఊహేనా? మేము గంట వాయించినాము. ఒక యువతి తలుపు తెరిచింది. ఆ యింటి పాత సొంతదార్లూ, ముందు అద్దెకుండినవాళ్లూ జ్ఞాపకమున్నారా, అని ఆమెను అడిగినాము.

“ఆఁ — కానీ గత తొమ్మిది సంవత్సరాల వరకు మాత్రమే.”

"నేను లోపలికి పోయి యిల్లు చూడవచ్చునా?"

"నిరభ్యంతరంగా!" అంటూ ఆమె దారి చూపించింది.

మెట్లు చూసినట్లే వున్నాయి. మొత్తం యింటి వాలక మంతా చూసినట్లే వుంది; ముందుకు పోయేకొద్దీ ప్రతిదీ పరిచయ మున్నట్లే కనపడింది. వెనక గదికి మెట్లు. ఔను, అది అంతా నేను చూసినదే.

దురదృష్టవశాత్తు, మార్క్స్ వుంటూ వుండిన మూడవ అంతస్తులోని గదులు తాళం వేయబడివుండినాయి. కానీ, నాకు జ్ఞాపక మున్నంతవరకు, అతి స్వల్ప వివరంతో సహా అన్నీ సరిగా వున్నాయి. నా సందేహాలు ఒక్కొక్కటే అదృశ్యమైనాయి, చివరకు నాకు నిశ్చయం యేర్పడింది: మార్క్స్ నివసించిన యిల్లు యిదే.

కిందికి వచ్చి కేక వేసినాను:

"కనుక్కున్నాను! యిదే అది!"

ఔను, వేలసార్లు నేను పోయిన యిల్లు అదే. ఆ యింటిలోనే మార్క్స్ ప్రవాస జీవితపు దౌర్భాగ్యంచేతా, యే అంతరాత్మా లేని, యే నిందకూ వెనుదీయని శత్రువుల తీవ్ర ద్వేషంచేతా దాడిచేయబడి, హింసింపబడి, కృశించి, "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"నీ, "హెర్ ఫోగ్ట్"నూ, యిప్పుడు "విప్లవం, ప్రతీఘాత విప్లవం" అనే శీర్షిక కింద సమీకరింప బడిన తన "న్యూయార్క్ ట్రిబ్యూన్" వ్యాసాలనూ రాసింది: ఆ యింటిలోనే ఆయన "పెట్టుబడి"కి అపారమైన సన్నాహక కృషి చేసింది....

డీన్ స్ట్రీట్‌లోని యింటిని వదిలే ముందు ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను — 1849 అంతంలో మార్క్స్ యింగ్లండుకు వచ్చినప్పుడు ఆయన మొదట కేంబర్ వెల్‌లో నివసించినాడు.... యింటి సొంతదారుడు దివాలా తీయడం ద్వారా అక్కడ ఆయనకు కొంత యిబ్బంది కలిగింది — యింగ్లీషు చట్టం ప్రకారం అప్పులవాళ్లు యింటిలో అద్దెకున్న మార్క్స్ ఫర్నిచర్ తీసుకపోయినారు. లైసెస్టర్ స్క్వేర్ దగ్గర ఒక కుటుంబ హోటల్‌లో కొద్ది కాలం వున్న తర్వాత, 1850 మేలో — రమారమిగా నేను లండన్‌కు వచ్చిన కాలంలో — మార్క్స్ కుటుంబం డీన్ స్ట్రీట్‌కి మారింది. అక్కడ వాళ్లు సుమారు యేడు సంవత్సరాలు వుండినారు; ఆ తర్వాత కెంటిష్ టౌనుకు మారినారు, అది లండన్‌లో అప్పటికింకా, యితరవాటితో పోలిస్తే, గ్రామీణ ప్రాంతంగా వుండిన భాగం.

డీన్ స్ట్రీట్‌లో మా కింక వెదకవలసిం దేమీ లేదు. కనుక తిరిగి టాటెన్‌హామ్ కోర్టు రోడ్డు మలుపుకు పోయి, కెంటిష్ టౌనుకు బస్సు యెక్కినాము.

టాటెన్‌హామ్ కోర్టు రోడ్డులో పెద్ద మార్పు లేదు. వీధి రూపురేఖలు దాదాపు పూర్వం వుండినట్లే వుండినాయి; పాత అంగళ్లూ, వ్యాపార సంస్థలూ యింకా చాలా వుండి

నాయి. యెడమవైపున వున్న వైట్‌ఫీల్డు చాపెల్ మారలేదు, శ్మశానం మాత్రం మూసి వేయబడింది. అక్కడ "ముష్" సమాధిచేయబడి వున్నాడు — నేను పొరపాటు పడకపోతే, చిన్న వయస్సులో మరణించిన మరి యిద్దరు పిల్లలు కూడా.

మేము కెంటిష్ టౌను సమీపించినాము.... అక్కడున్న పానశాల చూసినట్లే వుంది. నిజమే, అది పాత "రెడ్ రైడింగ్‌హుడ్." మేము అంతవరకు బస్సులో పోయి, అక్కడ దిగి, మాల్డన్ రోడ్డులోకి తిరిగినాము. అది నా సొంత స్థలం అన్న అనుభూతి యెంతగా పొందినానని! కానీ, చాలాసేపు కాదు! నేను లండన్ వదిలినప్పుడు లేని వీధులు త్వరలోనే కనపడినాయి. పూర్వం కొంత భాగం పొలాలుగా వుండిన స్థలంలో యిప్పుడు యిండ్లు లేచినాయి. లండన్ శివార్లకు మామూలుకంటె కాస్త పెద్దదిగా వుండిన యింటిని హఠాత్తుగా టుస్సీ చూపించింది. "అదే అది!"

ఔను, అదే అది, ఆ యిల్లు మరింత కచ్చితంగా చెప్పాలంటే గ్రాఫ్టన్ టెర్రస్‌లోని ఆ బంగళా, మార్క్స్ మరణానికి పదేండ్లముందు దాకా నివసించినది. ఆ చిన్న బాల్కనీ అక్కడుంది; ఆ బాల్కనీనుండే మార్క్స్ భార్య, తాను మశూచి వ్యాధినుండి కోలుకునేటప్పుడు, ఆ వ్యాధి కాలంలో నాతో నివసిస్తూ వుండిన తన ముగ్గురు చిన్న కూతుర్లతో మాట్లాడేది. మొదట ఆమె గుసగుసగా మాత్రమే మాట్లాడగలిగేది — కానీ, పిల్లలను నేను వెంట తీసుకొని పోయినప్పుడు ఆమె ముఖం యెంతగా వికసించేదని! ఆ బంగళా అప్పుడు 9వ నంబరు, యిప్పుడు 46వ* నంబరు. 41, మేయ్‌ట్లండ్ పార్కు రోడ్డు, దూరాన లేదు. మార్క్స్ మరణించింది అక్కడే. పెద్ద బిడ్డ లిద్దరికీ పెండ్లిండ్లు అయిన తర్వాత తమ మొదట యిల్లు మరీ పెద్ద దైనప్పుడు, 1872లోనో 1873లోనో వాళ్ల కుటుంబం అక్కడికి మారింది.**

మేము మౌనంగా హాంప్‌స్టెడ్ హీత్‌కు పోయినాము; అక్కడ యెంతో మారింది, కానీ పాత రూపురేఖలు పూర్తిగా పోలేదు. పాత స్థలాలకోసం మేము వెదకినాం; చివరన, యింటికి

---

* ప్రప్రథమంలో, లేదా కనీసం మార్క్స్ కుటుంబం అందులో నివసించినప్పుడు, ఆ యిల్లు 1వ నంబరు అని టుస్సీ అంటుంది. ఆమె పొరబడిందనుకుంటాను. యేమైనప్పటికీ, సత్యం త్వరలో తెలుస్తుంది. — లీబ్‌క్నెఖ్ట్ వివరణ.

** అక్టోబర్ 1856నుండి ఏప్రిల్ 1864దాకా మార్క్స్ గ్రాఫ్టన్ టెర్రస్ 9వ నంబరులో నివసించినాడు. 1864 ఏప్రిల్‌నుండి 1875 మార్చిదాకా ఆయన మేయ్‌ట్లండ్ పార్కు రోడ్డు, మోడనా విల్లాస్, 1వ నంబరులో నివసించినాడు. 1875 మార్చి నుండి, మరణించిన దాకా ఆయన మేయ్‌ట్లండ్ పార్కు రోడ్డు, 41వ నంబరులో నివసించినాడు. — సం.

తిరిగిపోయే దీర్ఘ ప్రయాణ భారానికి తగిన శక్తి పొందడానికి "జాక్ స్ట్రాన్ కాజిల్"లో కాస్త ఫలహారం చేసినాము.

"జాక్ స్ట్రాన్ కాజిల్." పాత రోజుల్లో యెన్నిసార్లు మే మక్కడికి పోయినాం! మేము కూర్చున్న అదే గదిలోనే మార్క్స్‌తోనూ, మార్క్స్ భార్యతోనూ, పిల్లలతోనూ లెన్‌హెన్‌తోనూ, యితర్లతోనూ కలిసి నేను డజన్ల సార్లు కూర్చున్నాను.

అది చాలా కాలం కిందట....

# విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్

## ఎంగెల్సు గురించిన స్మృతులు*

1

ఫ్రెడరిక్ ఎంగెల్సుకు స్పష్టత గల, ఉజ్వలమైన బుర్ర వుండింది – యెలాంటి రొమాంటిక్ మసక గానీ, మమకారాల మసక గానీ అంటుకోనిది. అది మనుషులనూ, విషయాలనూ రంగుటద్దాలగుండా చూసేది కాదు, యెప్పుడూ కాంతివంతంగా, స్పష్టంగా చూసేది, అతని కన్నులు విషయాల ఉపరితలంమీద నిలిచిపోకుండా, వాటిని ఆమూలాగ్రం చీలుస్తూ, అడుగు దాకా చూసేవి. ఆ స్పష్టమైన, కాంతివంతమైన కన్నులు, నిజమైన, ఆరోగ్యవంతమైన అర్థంలో ఆ "మనోదృష్టి," ప్రకృతి మాత కొద్దిమందికి మాత్రమే ప్రసాదించే ఆ కుశాగ్రబుద్ధి – యిది ఎంగెల్సులోని సారభూతమైన లక్షణం, మేము మొదటిసారి కలుసుకున్నప్పుడు నాకు వెంటనే కొట్టవచ్చినట్లు కనిపించినది....

అది 1849 వేసవి ఉత్తర భాగాన, వినీల జినీవా సరస్సు దగ్గర; రైహ్ రాజ్యాంగం** కొరకు జరిగిన ఉద్యమం విఫలమైన తర్వాత అక్కడ మేము ప్రవాసుల కాలనీలు కొన్ని యేర్పరచుకొని వుండినాము....

ఎంగెల్సును కలుసుకోడానికిముందు, రూగె, హైంత్సెన్, జూలియుస్ ఫ్రోబెల్, స్ట్రూవె లాంటి రకరకాల "గొప్పవాళ్ల"నూ, బాడెన్, సాక్సనీ విప్లవాలలోని ప్రజానాయకులనూ స్వయంగా పరిచయం చేసుకునే అవకాశం నాకు కలిగింది; కానీ వాళ్లతో నా పరిచయం సన్ని

---

* 1897లో ప్రచురింపబడింది. – సం.

** 1848–49 విప్లవ కాలంలో ఫ్రాంక్‌ఫుర్ట్ జాతీయ శాసనసభ ఒక రాజరికపు రాజ్యాంగచట్టం ముసాయిదాను తయారుచేసింది. జర్మనీ ఏకీకరణలో అది ఒక ముందడుగు. అయినప్పటికీ, ముఖ్యమైన జర్మన్ రాజ్యాలు దాదాపు అన్నీ (ప్రష్యా, సాక్సనీ, తదితర రాజ్యాలు) యీ ముసాయిదా చట్టాన్ని గుర్తించ నిరాకరించినాయి. ప్రజానీకం మాత్రమే దానిని బలపర్చింది. పెటీబూర్జువా డెమోక్రట్ల నాయకత్వాన దాన్ని బలపరుస్తూ సాయుధ పోరాటాన్ని ఆరంభించింది. – సం.

హిత మయ్యేకొద్దీ వాళ్ల "గొప్పతనం" కరిగిపోయి, వాళ్లు నాకు చిన్నవాళ్లుగా కనిపించినారు.

గాలి మసకగా వుండేకొద్దీ, మనుషులూ, వస్తువులూ పెద్దవిగా కనపడతాయి. తన స్వచ్ఛ దృష్టి గల కన్నులముందర మసక అదృశ్య మయ్యేటట్లు చేసి, మనుషులూ, వస్తువులూ వున్నవి వున్నట్లుగా కనపడేటట్లు చేసే గుణం ఫ్రెడరిక్ ఎంగెల్సుకు వుండింది. ఆ చీల్చే చూపూ, దాని ఫలితమైన లోపలికి దూరే పరిశీలనా మొదట నన్ను యిబ్బంది పెట్టినాయి, అప్ప డప్పుడు నొప్పించినాయి కూడా. రైన్ రాజ్యాంగ ఉద్యమ వీరులు నామీద కలిగించిన ప్రభావం ఎంగెల్సుమీద కలిగించిన ప్రభావంకంటె మేలైనది కాని మాట నిజమే; కానీ ఆయన మొత్తం ఉద్యమాన్ని తక్కువ అంచనా వేస్తున్నాడని అనుకున్నాను; అందులో అనేక విలువైన శక్తులూ, స్వార్థత్యాగపూరితమైన చాలా ఉత్సాహమూ వుండినాయి. అదే సమయంలో, అప్పటి కింకా నాలో వుండినవీ, తరువాత యింగ్లండులో నాలో నుండి పూర్తిగా రాలగొట్టబడినవీ అయిన "దక్షిణ జర్మన్ నిబ్బరపు" అవశేషాలు — నాది దక్షిణ జర్మనీ కాకపోయినప్పటికీ — వ్యక్తు లను గురించీ, విషయాలను గురించీ మా సాధారణ అభిప్రాయాలలో, సర్వదా వెంటనే కాకపోయినా, ఏకీభవించడానికి అడ్డుపడలేదు. బ్రిటిష్ కార్మికవర్గ ఉద్యమంమీద యెవరి పుస్తకం నేను చాలా కాలం కిందట చదివానో, యెవరి జ్ఞాన సంపదనూ, జ్ఞాన వైవిధ్యాన్నీ ఆయనతో నా వ్యక్తిగత సాహచర్యం ద్వారా నేను మెచ్చుకోవడం నేర్చుకున్నానో, ఆ ఎంగెల్సు అభిప్రాయానికి యెప్పుడూ పటిష్ఠమైన, నిశ్చితమైన ఆధారాలు వుండినాయి. ఆయనను నేను గౌరవంతో చూసేవాణ్ణి; ఆయన అప్పటికే చాలా సాధించినాడు, నాకంటె అయిదేండ్లు పెద్దవాడు — ఆ వయస్సులో అది ఒక శతాబ్దానికి సమానం.

ఆయన మిలిటరీ వ్యవహారాలలో కూడా సమర్థుడని నేను త్వరలో గమనించినాను. హంగరీలోని విప్లవ యుద్ధంమీద* "నోయె రైనిషె సైటుంగ్" ప్రచురించిన వ్యాసాలు, అవి యెప్పుడూ సరైనవిగా రుజువైనందున హంగేరియన్ సైన్యంలో ఒక పెద్ద సైనికోద్యోగికి ఆపాదింపబడినవి, ఎంగెల్సు రాసినవని ఆ సంభాషణలో నేను తెలుసుకున్నాను. కానీ, ఆయనే నవ్వుతూ నాతో అన్నట్లు, యితర పత్రికల కన్నిటికీ వుండిన సమాచారం తప్ప ఆయన వద్ద యితర మేమీ లేదు. యీ సమాచారం దాదాపు అంతా ఆస్ట్రియన్ ప్రభుత్వంనుండి మాత్రమే వచ్చింది. అది అత్యంత నిర్లజ్జగా అబద్ధాలు చెప్పింది. హంగరీ విషయంలో కూడా అది అలాగే చేసింది, స్పానిష్ ప్రభుత్వం యిప్పుడు క్యూబా** విషయంలో చేసినట్లు — అది

---

* ఆస్ట్రియాకు వ్యతిరేకంగా హంగేరియన్ ప్రజలు సాగించిన జాతీయ విమోచన పోరా టానికిది ప్రస్తావన. — సం.

** అప్పుడు స్పానిష్ వలసగా వుండిన క్యూబా ద్వీపంలో, 1895లో ప్రజ్వరించిన ప్రజా తిరుగుబాటును అణచడంలో స్పానిష్ ప్రభుత్వపు వైఫల్యానికి ఇది ప్రస్తావన. — సం.

యెల్లప్పుడూ గెలిచినట్లు చెప్పేది. కానీ యిక్కడ ఎంగెల్సు తన "మనోదృష్టి"ని ఉప యోగించేవాడు. పదాడంబరాన్ని ఆయన లక్ష్యపెట్టలేదు. ఆయనకు ముందుగానే తలలో రోంట్గెన్ కనిపెట్టిన యక్స్‌రేలు వుండినాయి; అవి, మనకు తెలుసు గదా, యే వక్రీకరణా పొందవు, తిమ్మిని బమ్మిని చేయవు. వాటి సహాయంతో ఆయన సత్య స్థాపనకు అప్రధానమైనవాటిని తేల్చుకున్నాడు, యే మసకా, మృగతృష్ణా తన్ను పక్కదారి పట్టనివ్వకుండా, యేది ముఖ్యమైనదో దానికి — వాస్తవాలకు — అంటిపెట్టుకునేవాడు. ఆస్ట్రియన్ ప్రభుత్వం తన అబద్ధ ప్రకటనలు యెంత మృత్యు నిర్లక్ష్యంతో జారీ చేసినా, కొన్ని వాస్తవాలు అది ప్రస్తావించక తప్పలేదు: ఘర్షణలు జరిగిన స్థలాల పేర్లూ, సైన్యాలు యుద్ధ ప్రారంభంలో యెక్కడున్నదీ, యుద్ధాంతంలో యెక్కడున్నదీ, ఘర్షణలు జరిగిన సమయమూ, సైన్య గమనాలూ, వగైరా. యీ చిన్న ముక్కలు చెక్కలతో మన ఫ్రెడరిక్ క్యువ్యే* లాగ, తన స్పష్టమైన, కాంతివంతమైన కన్నులతో, యుద్ధరంగ ప్రాంతంలోని ఘటనల వాస్తవ చిత్రాన్ని అతికించినాడు. యుద్ధరంగం యొక్క మంచి పటంతో, ఆ తేదీలనుండీ, స్థలాలనుండీ యెవరైనా గణితశాస్త్రపు కచ్చితత్వంతో నిర్ణయం చేయవచ్చు —"విజేతలైన" ఆస్ట్రియన్‌లు అంతకంతకూ వెనక్కి తోయబడుతున్నారనీ, "ఓడిపోయిన" హంగేరియన్లు అంతకంతకూ ముందుకు పురోగమిస్తూనే వున్నారనీ. ఆ లెక్కాచారం కూడా యెంత సరిగా వుండిందంటే, ఆస్ట్రియన్ సైన్యం కాగితంమీద హంగేరియన్లను నిర్ణయాత్మకంగా ఓడించిన మరుదినం హంగరీనుండి పూర్తి చిందరవందరగా తరిమివేయబడింది....

అన్నట్లు, ఎంగెల్సు మిలిటరీ వ్యక్తిగా పుట్టినట్లుంది: ఆయనకు స్పష్టమైన దృష్టీ, అతి స్వల్ప విషయాన్ని కూడా శీఘ్రంగా గమనించి, దాని విలువను గ్రహించే శక్తీ, శీఘ్ర నిర్ణయ శక్తీ, చలించని ప్రశాంతతా వుండినాయి. తరువాతి కాలంలో ఆయన మిలిటరీ సమస్యలమీద కొన్ని ఉత్కృష్టమైన వ్యాసాలు రాసినాడు; ప్రచ్ఛన్నంగా రాసినా, ఆయన అగ్రశేణి మిలిటరీ నిపుణుల గుర్తింపును పొందినాడు; ఆ పుస్తకాల రచయిత అత్యంత "అపకీర్తి" గడించిన ఒక తిరుగుబాటుదారుడని ఆ నిపుణులకు బొత్తిగా తెలియదు....

లండన్‌లో మేము ఆయనను హాస్యానికి "జనరల్" అని పిలిచేవాళ్లం. ఆయన జీవిత కాలంలో మరొక విప్లవం జరిగివుంటే, ఎంగెల్సు మా కార్నో**గా వుండేవాడు, సైన్యాలనూ, విజయాలనూ తయారుచేసే మిలిటరీ మేధగా వుండేవాడు.

ఎంగెల్సు స్వయంగా త్వరలోనే రైన్ రాజ్యాంగ ఉద్యమం గురించి "నోయె రైనిషె

---

* క్యువ్యే, జార్జి (1769–1832) — ఫ్రెంచి ప్రకృతిశాస్త్రజ్ఞుడు. — సం.

** కార్నో, లజార్ నికొలా (1753–1823) — ఫ్రెంచి 18వ శతాబ్ది చివర, బూర్జువా విప్లవ కాలం రాజకీయవేత్త, మిలిటరీ వ్యక్తి. — సం.

సైటుంగ్"లో* రాసినాడు; లండన్‌లో ప్రచురింపబడిన ఆ పత్రిక చాలా సంచికలు వచ్చిందాకా బతకలేదు. దానినుండి యీ కిందిది తీసుకున్నాను:

మార్క్సు, ఎంగెల్సులు కార్ల్స్‌రూయెకు పోయి బ్రెంటానో విప్లవ ప్రభుత్వం గురించి ఒక అభిప్రాయం యేర్పరచుకున్నాక, ప్ఫాల్‌ట్స్‌కు పోయినారు — అక్కడున్న తాత్కాలిక ప్రభుత్వంతోనూ, ఉద్యమంతోనూ పరిచయం పొందడానికి. స్పెయర్‌లో వాళ్లు ఒక వలంటీర్ దళ నాయకుడైన విల్లిహ్‌ని కలుసుకొని, అతనితో కలిసి కైజర్‌స్‌లౌటర్న్‌కు పోయినారు; అక్కడ వాళ్లు డెస్టెర్ నాయకత్వాన వున్న తాత్కాలిక ప్రభుత్వాన్ని చూసినారు.

అక్కడ పరిస్థితి వాళ్లకు యెలా కనిపించిందంటే, ఉద్యమంలో కమ్యూనిస్టులు అధికారికంగా పాల్గొనే మాటే వుండజాలదు; ఉద్యమం బాడెన్‌లో యెంత నిశ్చితంగా పెటీబూర్జువాగా వుండిందో యిక్కడ కూడా అంత నిశ్చితంగా పెటీబూర్జువాగా వుండింది. కైజర్‌స్‌లౌటర్న్‌లో కొద్ది రోజులు వుండిన తర్వాత మిత్రు లిద్దరూ బింగెన్‌కు పోయినారు. దారిలో వాళ్లు హెసియన్ సైన్యాలచేత ఆపబడి, తిరుగుబాటులో పాల్గొన్నారనే అనుమానంమీద, కొద్దిమంది యితర మిత్రులతో కూడా అరెస్టు చేయబడినారు. వాళ్లను మొదట డార్మ్‌స్టాడ్‌కూ, తరువాత ఫ్రాంక్‌ఫుర్ట్‌కూ తీసుకపోయి, అక్కడ వదలిపెట్టినారు.


కొద్ది కాలం తర్వాత, డెమోక్రటిక్ కేంద్ర కమిటీ ఉత్తరువు ప్రకారం మార్క్సు ఒక నిర్ణయాత్మక ఘటన జరగవలసి వుండిన పారిస్‌కు పోయినాడు, ఫ్రెంచి సోషల్ డెమోక్రట్లవద్ద జర్మన్ విప్లవ పార్టీకి ప్రాతినిధ్యం వహించడానికి. ఎంగెల్సు ప్ఫాల్‌ట్స్‌కూ, కైజర్‌స్‌లౌటర్న్‌కూ తిరిగిపోయినాడు, పరిణామాల కొరకు నిరీక్షిస్తూ, అవసరమైతే సైనికుడిగా ఉద్యమంలో చేరడానికి.

"నోయె రైనిషె సైటుంగ్. పొలిటిష్-ఒకొనొమిషె రెవ్యూ"లో ఎంగెల్సు ప్ఫాల్‌ట్స్‌లోని ప్రజా ఉద్యమ స్వభావాన్ని హాస్యంతో వర్ణిస్తాడు.


ఆయన యిలా రాసినాడు: "ప్ఫాల్‌ట్స్‌ను ఒకసారి చూసినవాళ్లెవరైనా అర్థం చేసుకోగలరు, ద్రాక్ష తోటలలో యింత సంపన్నంగా, ద్రాక్ష సారాయితో యింత ఉత్సాహ భరితంగా వుండే యీ గడ్డమీద ఉద్యమం అనివార్యంగా మహా సరదాగా వుండింది. పాత బవేరియన్ బీరు తాగే నీరస, ఛాందస అధికారులను చివరకు కూలదోసి, వాళ్ల స్థానంలో ఉల్లాసపు ప్ఫాల్‌ట్స్ ద్రాక్షాసవ ప్రియులు వచ్చినారు. చివరకు కుహనా గంభీరులైన పోలీసుల రొష్టు,

---

* "నోయె రైనిషె సైటుంగ్. పొలిటిష్-ఒకొనొమిషె రెవ్యూ" — 1850 జనవరినుండి అక్టోబర్‌దాకా మార్క్సు, ఎంగెల్సులచేత ప్రచురింపబడిన మాసపత్రిక. అది హాంబుర్గ్‌లో ముద్రింపబడింది. — సం.



కార్ల్ మార్క్స్, ఆయన పెద్ద కూతురు జెన్నీ



పాల్ లాఫార్గ్

యితర్రతా అంత వేసరిక కలిగించే "ఫ్లీగెండె బ్లెటెర్"*చేత అంత వినోదకరంగా వెక్కిరింపబడింది, నిర్విచారులైన ప్ఫాల్త్స్ ప్రజలకు అన్నిటికంటె యిబ్బందికరంగా వుండింది, తొలగింపబడింది. పానశాలలమీద పోలీసు నిబంధనలు రద్దుచేయడం ప్ఫాల్త్స్ ప్రజల మొదటి విప్లవ చర్య. మొత్తం రాష్ట్రమంతా ఒక బ్రహ్మాండమైన పానశాలగా మార్చబడింది; ఆ ఆరువారాలలో 'ప్ఫాల్త్స్ ప్రజల పేరుమీద' తాగిన ఘాటు పానీయాల పరిమాణం లెక్కగట్టడానికి సాధ్యం కాలేదు. బాడెన్‌లో లాగ ఉద్యమంలో క్రియాత్మకంగా పాల్గొనడం అంత యెక్కువగా లేకపోయినా, ప్రగతి నిరోధక జిల్లాలు చాలా వుండినా, మొత్తం ప్రజ లందరూ పానంలో ఏకగ్రీవంగా వుండినారు; అత్యంత ప్రగతి నిరోధకులైన అల్పబుద్ధులూ, రైతులూ ఆ సార్వత్రిక ఉత్సాహానికి వశులైనారు....

"ప్ఫాల్త్స్ ఉద్యమంయొక్క బాహ్య వ్యక్తీకరణ అంతా ఉల్లాసభరితంగా, సుహృద్భావ పూరితంగా, బెట్టుసరి లేకుండా వుండింది. బాడెన్‌లో క్రమబద్ధ సైన్యంలోనూ, ప్రజా సైన్యంలోనూ కొత్తగా నియమింపబడిన ప్రతి ఉంటర్ లెఫ్టెనెంటూ బరువైన యూనిఫారమ్ నీటుగా ధరించి, జరీ ఇపాలెట్లు ప్రదర్శించుకోగా – తరువాత పోరాటపు దినాలు వచ్చినప్పుడు వాటిని జేబుల్లో దాచుకున్నారు – ప్ఫాల్త్స్ ప్రజలు అంతకంటె చాలా వివేకంగా వుండినారు. జూన్ మాసపు మొదటి దినాల వేడిలో భారీ కోట్లూ, వేస్టుకోట్లూ, టైలూ అదృశ్యమై వాటి స్థానంలో తేలిక బ్లౌజు వచ్చింది. పాత బ్యూరోక్రట్లతోపాటు అసౌకర్యపు పాత బెట్టు అంతా అదృశ్యమైనట్లు కనపడింది. ప్రజలు సౌకర్య దృష్టితో స్వేచ్ఛా సౌలభ్యమూ లభించే పద్ధతిలో దుస్తులు ధరించినారు. దుస్తులలో భేదంతో, సాంఘిక సంబంధాలలోని ప్రతి యితర భేదమూ తక్షణమే అదృశ్యమైంది. అన్ని వర్గాల ప్రజలూ ఒకే పానశాలలో కలిసేవాళ్లు; ఆ బెట్టుసరిలేని కలయికలో సోషలిస్టు స్వప్నికుని కెవనికైనా సార్వత్రిక సోదరత్వపు వేకువ కనిపించవచ్చు.

"తాత్కాలిక ప్రభుత్వం రాష్ట్రంయొక్క ఆదర్శాన్ని అనుసరించింది. అందులో దాదాపు పూర్తిగా సహృదయులైన ద్రాక్షాసవపానులు వుండినారు; బాఖుస్ అనే ద్రాక్షాసవ దేవుడు అంతగా అభిమానించిన తమ జన్మభూమికి తాము హఠాత్తుగా తాత్కాలిక ప్రభుత్వం యేర్పరచవలసి రావడం కలిగించినంత ఆశ్చర్యం వాళ్లకు మరేదీ కలిగించలేదు. అయినప్పటికీ, యీ సరదా అయిన పాలకులు తమ పొరుగున వున్న బాడెన్‌వాళ్లకంటె యెంతో బాగా

---

* "ఫ్లీగెండె బ్లెటెర్" ("యెగిరే ఆకులు") – ఒక జర్మన్ బూర్జువా వ్యంగ్య పత్రిక. – సం.

ప్రవర్తించినారు.... సుహృద్భావంలోనూ, అచ్చమైన ఉచితానుచితజ్ఞులోనూ బాడెన్ ప్రభుత్వంకంటె ప్ఫాల్‌త్స్ ప్రభుత్వం యెంతో ఉన్నతంగా వుండింది.''*

ప్ఫాల్‌త్స్ ప్రభుత్వంమీద వేయగల ప్రధాన నిందల్లో ఒకటి యేమిటంటే — అది తన శక్తిహీనతను గుర్తించి కూడా, సార్వత్రిక నిర్విచారత్వం తనను పూర్తిగా వశపరచుకోనిచ్చి, ఆత్మరక్షణ చేసుకోడానికి దేశానికి గల సర్వజనాంగీకృతమైన పరిమిత శక్తిని చురుకుగా ఆచరణలో పెట్టడానికి బదులు బాహ్య యాదృచ్ఛిక ఘటనలమీద ఆధారపడాలని కోరుకుంది.

యీ నిర్విచారత్వంయొక్క విస్తృతిని యీ విషయంనుండి గ్రహించవచ్చు: సరిహద్దువద్ద సమీకృతవౌతున్న ప్రష్యన్ సైన్యం గురించి యే ఆందోళనా వ్యక్తం కాలేదు, అక్కడ యేమి జరుగుతున్నదీ యెవరికేగాని తెలియదు. కైజర్‌స్‌లౌటర్న్‌లోని ప్రభుత్వం రెండు వార్తాపత్రికలు మాత్రమే చదివేది: ''ఫ్రాంక్‌ఫుర్టర్ జర్నల్,'' ''కార్ల్స్‌రూయె సైటుంగ్.'' సరిహద్దు వద్ద ప్రష్యన్ సైన్యంయొక్క సాంద్రీకరణ గురించీ, స్థావరాల గురించీ మరింత కచ్చితమైన సమాచారం ''క్యోల్నిషె సైటుంగ్''యొక్క కొన్ని దినాల కిందటి పాత సంచిక నుండి తీసుకొని, ఎంగెల్సు ఒకనాడు ఆ ప్రభుత్వంలోని పెద్దమనుషులకు చూపించినప్పుడు, వాళ్లు యెంతో ఆశ్చర్యపడినారు....

ఉద్యమంలో ఒక ప్రముఖ స్థానం అంగీకరించడానికి యువకుడైన ఎంగెల్సును ఒప్పించడానికి చాలా కృషి జరిగింది. యీ సందర్భంలో ఆయనే యిలా రాసినాడు: ''సహజంగా, కొన్ని సివిల్, మిలిటరీ పదవులు నాకు యిస్తామన్నారు; కార్మికవర్గ ఉద్యమంలో వాటిని అంగీకరించడానికి ఒక నిముషం కూడా వెనుకాడి వుండను. ఆ పరిస్థితులలో అన్నిటినీ నిరాకరించినాను. నేను చేయడానికి అంగీకరించిన ఒకే ఒక పని ఒక చిన్న పత్రికకు 'కదిలించే' వ్యాసాలు కొద్దిగా రాయడం; ఆ పత్రికను ప్ఫాల్‌త్స్ తాత్కాలిక ప్రభుత్వం బ్రహ్మాండమైన సంఖ్యలో ప్ఫాల్‌త్స్‌లో వ్యాప్తిచేసింది. నేనా పని చేసివుండకూడదని నాకు తెలుసు, కానీ ప్రభుత్వంలోని డెస్టెర్ తదితర సభ్యుల పట్టుదలవలన, కనీసం నా సద్భావమైనా చూపడానికి, చివరకు ఆ కర్తవ్యానికి అంగీకరించినాను. సహజంగా నేను మాటలు మింగేవాణ్ని కాదు గనుక, నా రెండవ వ్యాసం మరీ 'కదిలించేది'గా వుందని త్వరలోనే ఆక్షేపించబడింది. మరుమాట లేకుండా నేను నా వ్యాసం ఉపసంహరించుకొని, డెస్టెర్ సమక్షంలో దాన్ని చింపివేసినాను; అంతటితో ఆ విషయం ముగిసింది.''**

ప్ఫాల్‌త్స్ ఉద్యమంయొక్క మిలిటరీ వ్యవస్థ ప్రత్యేకంగా బలహీనంగా వుండింది ఆయు

---

* యఫ్. ఎంగెల్సు, ''రైహ్ రాజ్యాంగం కొరకు జరిగిన జర్మన్ ఉద్యమం.'' 3. ప్ఫాల్‌త్స్. — సం.

** పై గ్రంథం.

ధాలూ, సమర్థులైన సైనికాధికార్లూ లేకపోవడంవలన. విదేశాలనుండీ, ముందే చెప్పినట్టు, తిరుగుబాటు చేసిన బాడెన్‌నుండి కూడా యేమీ రావడానికి వీలు లేదు. కానీ రాష్ట్రంలో వున్న ఆయుధాలు సరియైన చేతుల్లోకి పోయేటట్లు చూడడానికి కూడా యేమీ జరగలేదు. కొడవండ్లు చేయించినారు, కానీ యీ ఆదిమకాలపు ఆయుధాలు కూడా తిరుగుబాటుదార్ల చేతుల్లోకి పోలేదు; అల్పబుద్ధులు తప్ప యెవరూ లేని సైన్యం మంచి తుపాకులను వుంచుకుంది.

సైనికాధికార్ల వర్గం, చాలా కొద్ది మినహాయింపులతో, అసంతృప్తికరంగా, అసమర్థంగా వుందని ఎంగెల్సు వర్ణించినాడు. మినహాయింపులలో టెహోవ్ వుండినాడు. అతను ప్రష్యన్ ప్రథమ లెఫ్టెనెంటు. బెర్లిన్ ఆయుధాగారం ముట్టడింపబడినప్పుడు, అతనూ, మరొక కామ్రేడూ దాన్ని ప్రజలకు లోబరిచినారు. అతనికి ఒక కోటలో పదైదేండ్ల శిక్ష విధించినారు. అతను మాగ్డెబుర్గ్‌నుండి తప్పించుకొన్నాడు. మరొక మినహాయింపు విల్లిహ్. అతను ఒక చిన్న వలంటీర్ దళంతో కలిసి, లాండౌ, గెర్మెర్‌స్హైమ్ కోటల పరిసరాలను అదుపులో పెట్టుకొని వాటిని ముట్టడించే పనిని నిర్వహించినాడు.

నిశిత విమర్శకుడూ, నిర్దాక్షిణ్యమైన వ్యంగ్యకారుడూ అయిన ఎంగెల్సు సహజంగా విప్లవపు అల్పబుద్ధుల పక్కలో ముల్లుగా వుండినాడు; ఒకసారి వాళ్లు ఆయన్ను అరెస్టు చేయించినారు కూడా. కానీ 24 గంటల తర్వాత తాత్కాలిక ప్రభుత్వం క్షమాపణలతో ఆయన్ను విడిచిపెట్టవలసి వచ్చింది.

## 2

తరువాత వచ్చిన యుద్ధాల సవివర సంబంధాన్ని యివ్వాలంటే మనం దూరం పోవాలి. దాడి చేస్తూవుండిన ప్రష్యన్, రైహ్ సైన్యాలు – అధ్వాన్నపు సైనికాధికార్లూ, అధ్వాన్నపు శిక్షణా గల అయిదారు వేల విప్లవ సైనికులకు వ్యతిరేకంగా 30,000 మంది మనుషులు – త్వరలో ప్ఫాల్‌ట్స్ సైన్యం రైన్ నది అవతలివైపుకు తిరోగమించి, బాడెన్ సైన్యాలతో కలిసేటట్లు చేసినాయి. కానీ యిక్కడ కూడా 60,000 మంది ప్రష్యన్లూ, బవేరియన్లూ 13,000 మంది తిరుగుబాటుదార్లతో పోరాడుతూవుండినారు; పైగా తిరుగుబాటుదార్లకు యెలాంటి ప్రభుత్వం వుండిందంటే అందులోని ప్రముఖ స్థానాలను ద్రోహులూ, బలహీనులూ చేజిక్కించుకున్నారు.

ఎంగెల్సు మూడు యుద్ధాలలోనూ, మూర్గ్ వద్ద జరిగిన నిర్ణయాత్మక ఘర్షణలోనూ పాల్గొన్నాడు. చాలా కాలం తర్వాత, ఆయన్ను యుద్ధరంగంలో చూసినవాళ్లు ఆయన ప్రశాంతత గురించీ, సకల అపాయాలపట్లా ఆయనకు గల తూష్ణీంభావం గురించీ యింకా మాట్లాడేవాళ్లు.

రాజ్యాంగం కొరకు జరిగిన పోరాటంలో అప్పటి సోషలిస్టు భావాల ప్రతినిధులైన కమ్యూనిస్టులు* పాల్గొనడం గురించి ఎంగెల్సు యీకింది మాటలు రాసినాడు:

''బాడెన్ విప్లవ బాధితులలో అంతో యింతో విద్యావంతులైన వాళ్లకు పత్రికల్లో, ప్రజాతంత్ర సంస్థల్లో, గద్యంలో, పద్యంలో సకల పక్షాలచేతా స్మృత్యంజలులు ఘటింపబడినాయి. కానీ చివరిదాకా పోరాడినవాళ్లూ, యుద్ధరంగాలలో పడిపోయినవాళ్లూ, రాష్టాట్ చీకటి గుహలలో సజీవంగా కుళ్లిపోయినవాళ్లూ, లేదా విదేశ ప్రవాసంలో, ప్రవాసజీవులందరిలోనూ ఒంటరిగా, అత్యంత ఘోరమైన బాధలు యిప్పుడు అనుభవించవలసి వచ్చినవాళ్లూ అయిన లక్షలాది కార్మికులను గురించి యెవరూ మాట్లాడరు. కార్మికుల దోపిడీ యెంత దీర్ఘకాలంగా స్థిరపడి, యెంత ఆనవాయితీ అయిన పని అయిందంటే, వాళ్లను కదిలించి, దోచుకొని, ఫిరంగి మేతగా ప్రేల్చివేసే ముడిసరుకుగా తప్ప మరొక విధంగా పరిగణించడం మన అధికారిక ''ప్రజాతంత్రవాదులకు'' సాధ్యం కాదు. మన ప్రజాతంత్రవాదులు యెంత అజ్ఞానులూ, యెంత బూర్జువాలూ అంటే, కార్మికవర్గంయొక్క విప్లవకర స్థానాన్నీ, భవిష్యత్తునూ గ్రహించడం వాళ్లకు సాధ్యం కాదు. అందువల్లనే వాళ్లను స్తోత్రం చేయజాలనంత ఆత్మగౌరవం కలవాళ్లూ, వాళ్ల తమను ఉపయోగించుకోనివ్వకుండా వుండేటంత తెలివితేటలు కలవాళ్లూ, అయినా అప్పుడున్న అధికారాన్ని కూలదోసే సమస్య యేర్పడినప్పుడు సర్వదా సాయుధ తిరుగుబాటు చేసేవాళ్లూ, ప్రతి విప్లవోద్యమంలోనూ కార్మికవర్గ పార్టీయొక్క ప్రత్యక్ష ప్రతినిధులూ అయిన ఆ నిజమైన కార్మికవర్గ వ్యక్తులను వాళ్లు (ప్రజాతంత్రవాదులు) అంతగా ద్వేషించేది. కానీ, అలాంటి కార్మికులను గుర్తించడం ప్రజాతంత్రవాదులనబడేవాళ్లకు ప్రయోజనకరం కాకపోతే, వాళ్లను వాళ్ల యోగ్యతలకు తగినట్లు గౌరవించడం కార్మికవర్గంయొక్క పార్టీ కర్తవ్యం. ఆ కార్మికులలో అత్యుత్తమమైనవాళ్లలో కొలోన్‌కు చెందిన జోసెఫ్ మోల్ ఒకడు.

''మోల్ గడియారాలు చేసేవాడు. అతను చాలా సంవత్సరాల క్రితం జర్మనీ వదలి, ఫ్రాన్సులోనూ, బెల్జియంలోనూ, యింగ్లండులోనూ బహిరంగ, రహస్య విప్లవ సంఘాలన్నిటిలోనూ పాల్గొన్నాడు. 1840లో లండన్‌లోని జర్మన్ వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ స్థాపించడంలో అతను తోడ్పడినాడు. ఫిబ్రవరి విప్లవం తర్వాత అతను జర్మనీకి తిరిగివచ్చి, తన మిత్రుడైన షాపెర్‌తో కలిసి కొలోన్ కార్మికుల సంఘంయొక్క** దర్శకత్వాన్ని త్వరలో తన చేతుల్లోకి తీసుకున్నాడు. 1848 సెప్టెంబరులో కొలోన్‌లో వీధి కొట్లాటల

---

* కమ్యూనిస్టు లీగు సభ్యులకు యిక్కడ ప్రస్తావన. – సం.

** కొలోన్ కార్మికుల సంఘం 1848 ఏప్రిల్‌లో స్థాపించబడి, 1849 జూన్‌దాకా కొనసాగింది. 1848 అక్టోబరులో మార్క్సు దాని అధ్యక్షుడుగా యెన్నుకోబడినాడు. – సం.

తర్వాత అతను లండన్‌కు వలసపోయినాడు, కానీ త్వరలో మారుపేరుతో జర్మనీకి తిరిగివచ్చి వివిధ జిల్లాలలో ప్రచార కృషి సాగించినాడు, యితరులకు ప్రతి వాకరికీ భీతి కలిగించే ప్రమాదకరమైన ప్రయాణాలకు పూనుకున్నాడు. అతన్ని నేను కైజర్‌స్‌లౌటర్న్‌లో మళ్లీ కలుసుకున్నాను. అక్కడ కూడా అతను ప్రష్యాకు పోయే ప్రయాణాలకు పూనుకున్నాడు; తెలుసుకుంటే అతన్ని వెంటనే కాల్చివేసే ప్రయాణాలు అవి. తన రెండవ ప్రయాణంనుండి తిరిగి వచ్చేటప్పుడు అతను రాష్టాట్‌దాకా శత్రుశ్రేణు లన్నిటినీ దాటుకొని వచ్చి, అక్కడ వెంటనే మన దళంయొక్క బెసాన్‌సాన్ కార్మికుల కంపెనీలో ప్రవేశించినాడు. మూడు రోజుల తర్వాత అతను నిహతుడైనాడు. అతని మరణంలో నేను ఒక పాత మిత్రుని కోల్పోయినాను; పార్టీ అలత యెరగని, భయ మెరగని, అత్యంత విశ్వసనీయులైన తన సైనికుల్లో ఒకణ్ని కోల్పోయింది.

"బాడెన్ – ప్ఫాల్‌త్స్ సైన్యంలోనూ, ముఖ్యంగా మా వలంటీర్ దళం లాంటి దళాలలోనూ, వలసజీవుల దళం మొదలైనవాటిలోనూ కార్మికవర్గ పార్టీకి బాగానే ప్రాతినిధ్యం వుండింది; దాని సభ్యులలో యెవరిమీదనైనా అత్యల్పమైన నింద వేయడానికి యితర పార్టీల నన్నిటినీ అది ఆత్మవిశ్వాసంతో సవాల్ చేయగలదు. అత్యంత దృఢచిత్తులైన కమ్యూనిస్టులు అత్యంత సాహసపరులైన సైనికులుగా వుండినారు."*

90,000 ప్రష్యన్, రైహ్ సైన్యాలు సహజంగానే 15,000 మంది విప్లవ సైన్యాన్ని ఓడించినాయి, కానీ కీర్తికరంగా మాత్రం కాదు. ఆ కొద్దిమంది తిరుగుబాటుదార్లను వాళ్లు యెలా అంతంచేయగలిగినా రంటే, వాళ్లమీద పక్కదాడి చేయడానికి వూర్టెంబెర్గ్ తటస్థతను భంగం చేయడం ద్వారా మాత్రమే. ఎంగెల్సు యెవరితో కలిసి పోరాడినాడో ఆ విల్లిహ్ వలంటీర్ దళంలోని సైనికులు జూలై 12వ తేదీ ఉదయం స్విస్ సరిహద్దుమీద వుండినారు. వాళ్లు ఆయుధాలు కాల్చినారు; వాళ్లు బాడెన్ ప్ఫాల్‌త్స్ సైన్యంలో స్విస్ సరిహద్దు దాటిన చివరివాళ్లు.

ఉద్యమ ఫలితం గురించి ఎంగెల్సు రాసింది యిది:

"రాజకీయ దృష్ట్యా రైహ్ రాజ్యాంగ ఉద్యమం మొదటినుండి వైఫల్యం చెందిందే. మిలిటరీ దృష్ట్యా కూడా అది అంతే. దాని విజయానికి గల ఏకైక అవకాశం జర్మనీకి వెలుపల వుండింది – జూన్ 13 నాడు పారిస్‌లో రిపబ్లికన్ల విజయం. మరి జూన్ 13 ఉద్యమం విఫలమయింది.** ఆతర్వాత, ఆ ఉద్యమం రక్తసిక్త హాస్య నాటకం తప్ప మరేదీ కాజాలక పోయింది. అది అయిందంతా అంతే. తెలివిహీనతా, ద్రోహమూ దాన్ని సంపూర్ణంగా నాశనం చేసినాయి. మిలిటరీ నాయకులు, కొద్ది మినహాయింపులతో, ద్రోహులు, లేదా అసమర్థులు,

---

* యఫ్. ఎంగెల్సు, "రైహ్ రాజ్యాంగం కొరకు జరిగిన జర్మన్ ఉద్యమం." 4. రిపబ్లిక్ కొరకు మరణించు. – సం.

** 11 పుటలో ఫుట్‌నోటును చూడండి. – సం.

పదవులకు ప్రాకులాడే జ్ఞానం లేని పిరికిపందలు; మినహాయింపులుగా వుండిన కొద్దిమందిని అనివార్యంగా యితరులు, బ్రెంటానో ప్రభుత్వం లాగే, వదలిపెట్టి పోయినారు.... అధికార్ల లాగే సైనికులు కూడా ప్రవర్తించినారు.... మొత్తం 'విప్లవ' మంతా అసలైన హాస్యనాటకంగా అంత మైంది. ఓదార్పు కలిగించే దల్లా యేమిటంటే, ఆరు రెట్లు బలంగా వుండిన సైన్యానికి ధైర్యం ఆరు రెట్లు తక్కువ వుండింది.

"కానీ, ప్రతిఘాత విప్లవపు రక్తపిపాస మూలంగా యీ హాస్య నాటకానికి విషాదాంతం వుండింది. ముందుకు నడిచేటప్పుడు గానీ యుద్ధరంగంలో గానీ యెవరైతే భయంతో గజగజ వణికినారో సరిగ్గా ఆ సైనికులే రాష్టాట్ ఖైదు కొట్లలో వీర మరణం చెందినారు. వాళ్లలో ఒక్కరు కూడా దయాభిక్ష కోరలేదు...."

## 3

హాస్య నాటకం అంత హాస్యంగా లేదన్నమాట. యిక, తిరుగుబాటు మొదటినుండి పరిస్థితులచేత అభిశప్తమై వుండిందన్న విషయమే దానికి విషాదాంత నాటకపు యశస్సును యిచ్చింది. కానీ రైహ్ రాజ్యాంగ ఉద్యమంయొక్క దుర్గతిని నిర్ణయించింది 1849 జూన్ 13 నాటి ఉద్యమ వైఫల్యం కాదు. అన్నట్టు, ఉద్యమంలో పాల్గొన్నవాళ్లలో పదింట తొమ్మిది వంతుల మందికి రైహ్ రాజ్యాంగం పరిహాసాస్పదమైనంత స్వల్ప ప్రాముఖ్యం గలది, లేదా యే ప్రాముఖ్యమూ లేనిది. వలంటీర్లందరూ, సైనికులు కూడా యీ పాట పాడినారు:

"రిపబ్లిక్ కోసం మన ప్రాణ త్యాగం
ఉదాత్త యశస్కరమైన అదృష్టం
మనం తపస్సు చేయదగిన మహద్భాగ్యం."

మా పాటలోని పాదాలు మొరటుగా వుండినా, అవి మరింత హృదయపూర్వకంగా పాడబడినాయి....

జూన్ 13 పరిహాసాస్పదమైన వైఫల్యం చెందేటట్లు ముందుగానే నిర్ణయింపబడింది. మొత్తం జర్మన్ విప్లవ ఉద్యమ మంతా యెలాగో అలాగే అది ప్రధాన ఇంధనం అప్పటికే అయిపోయిన మంటయొక్క ప్రజ్వలనం. ఒకే ఒక భేదం యేమిటంటే, పారిస్‌లో ఇంధనం ధగద్ధగాయమాన మహానలంలో దగ్ధమైంది. జర్మనీలో ఇంధనంలో అత్యధిక భాగం మెల్లగా కుమిలి కుమిలి ఆరిపోయింది.

ధగద్ధగాయమాన మహానలం యేదంటే 1848లోని జూన్ యుద్ధం. అక్కడ బూర్జువావర్గమూ, కార్మికవర్గమూ శాశ్వతంగా విడిపోయినారు, సామరస్యపు స్వప్నం రక్త పాతంలో కరిగిపోయింది, బూర్జువావర్గం, రాజకుమారులూ తదితర పాలకులలాగ, కార్మికుల

కంటె చాలా పూర్వం అంతర్జాతీయంగా వుండినది, అప్పటినుండి ప్రగతి వ్యతిరేకమై, ఆదర్శాలనే తన "యవ్వనపు పొరపాట్ల"ను విప్లవపు తుపాకులతో సహా విసరి పారవైచి, ఆ రెంటినీ కార్మికవర్గానికి వదలిపెట్టింది....

బూర్జువావర్గమూ, కార్మికులూ విప్లవంలో సంయుక్తంగా పనిచేసే చివరి అవకాశం జూన్ యుద్ధంతో అదృశ్యమైంది. "డిసెంబరు 10న యెన్నికైన వ్యక్తి"నీ* ఆ వ్యక్తి రూపంలో వున్న బెదిరించే చక్రవర్తినీ రంగంనుండి తొలగించాలని 1849 జూన్ 13న అనుకున్న ఫ్రెంచి రాడికల్ పార్టీవాళ్లు కార్మికులను వదలిపెట్టి లెక్కవేసుకున్నారు. అది దెబ్బలాటకు దిగినప్పుడు కార్మికవర్గం అక్కడలేదు. పంద్రెండు నెలలకు ముందు బూర్జువావర్గం కార్మికవర్గపు రక్తంలో అధిక భాగాన్ని తోడేసింది, అంత రక్త నష్టంనుండి ఒక సంవత్సరం లోపల యెవరూ తేరుకోలేదు....

విజయానికి అవసరమైన పరిస్థితులు, ఫ్రాన్సులో జూన్ 13న లాగే, జర్మన్ రైహ్ రాజ్యాంగ ఉద్యమంలో లేవు.

అయినా ఆ కాలం గురించి యిప్పటికే చాలా చెప్పినాను. నా యితివృత్తమే నా సాకు. ఎంగెల్సు జీవితంలోని యీ ఘట్టం, యితర వాటితో పోలిస్తే, స్వల్పంగా తెలిసింది. మరి ఎంగెల్సు, మార్క్సు లాగే, హితబోధ చేసేవాడే కానీ ఆచరించేవాడు కాదని — ప్రజాతంత్ర వాదులచేతా, ప్రజాతంత్ర "విప్లవకారుల"చేతా — నిందింపబడుతున్నాడు గనుక, 1849 లోని ప్రజల తిరుగుబాటులో వాళ్ల ఆచరణను వెలికి తేవడం ద్వారా ఆ అపహాస్యకరమైన నిందలోని అపహాస్యత్వ మంతటినీ చూపించడం ఉచితంగా నాకు కనిపించింది.

హితబోధకూ కార్యాలకూ మధ్య, సిద్ధాంతానికీ ఆచరణకూ మధ్య, యీ భేదమంతా యెందుకు? "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" ఒక కార్యం కాదా? "పెట్టుబడి" ఒక కార్యం కాదా? మార్క్సు, ఎంగెల్సుల శాస్త్రీయ కృషి ప్రశస్తమైన ఆచరణ కాదా?

## 4

ఎంగెల్సుతో కలిసి నేను కొద్ది కాలం స్విట్జర్లెండులో వున్న తర్వాత, మరు సంవత్సరం ఆయన్ను లండన్‌లో కలుసుకున్నాను — ఆయన మొదట అక్కడికి పోయివుండినాడు. ఆ తర్వాత నాకు ఆయనతో నిత్య సంబంధం వుండింది. ఆయన మాంచెస్టర్‌లోని తన తండ్రి

---

* 1848 డిసెంబరు 10న అధ్యక్షుడుగా యెన్నికైన లూయీ బోనపార్ట్ ఆ తర్వాత మూడవ నెపోలియన్ అన్న పేరుతో ఫ్రెంచి చక్రవర్తిగా తన్ను తాను ప్రకటించుకున్నాడు. — సం.

వ్యాపారం కొరకు వాస్తవంగా లండన్‌ను, నేను నివసిస్తూ వుండిన లండన్‌ను, 1850లో వదలిపెట్టినాడు; యెందుకంటే, యితర రైన్ ఉత్పత్తిదార్ల లాగ ఆయన తండ్రికి యింగ్లండులో బ్రాంచి ఆఫీసు వుండింది. కానీ ఎంగెల్సు తరుచు లండన్‌లో మమ్మల్ని చూడడానికి వచ్చేవాడు, వచ్చి ఒకోసారి కాస్త దీర్ఘకాలమే లండన్‌లో వుండేవాడు. అంతే కాక, ఆయన దాదాపు రోజూ మార్క్సుకు ఉత్తరాలు రాసేవాడు; ఆ ఉత్తరాలలో పూర్తిగా వ్యక్తిగతం కానివాటిని మార్క్సు మాకు క్రమంగా అందజేసేవాడు — మాకు అనగా, తరుచుగా మార్పు చెందే "మార్క్సు బృందం"లో యెక్కువ నమ్మకమైనవాళ్లకు. నాకు మార్క్సుతో వుండినంత సన్నిహిత సంబంధాలు ఎంగెల్సుతో యెప్పడూ లేని మాట నిజమే; పండ్రెండు సంవత్సరాల కాలం నేను మార్క్సు యింటిలో దాదాపు నిత్య అతిథిని, దాదాపు ఆయన కుటుంబ సభ్యుణ్ని.

మార్క్సు మరణం నన్ను ఎంగెల్సుకు మరింత దగ్గరికి తెచ్చింది. ఆయన కప్పుడు రెండు కర్తవ్యాలు వుండినాయి — మార్క్సు స్థానంలో మార్క్సుకు బదులుగా వుండడం, మార్క్సు అభీష్టాన్ని నెరవేర్చడం.

అప్పుడు మాత్రమే ఆయన, ఆయన మాటల్లోనే చెప్పాలంటే, అంతవరకు మరొకరికి తాళం వేసేవాడుగా వుండినవాడు, తన సామర్థ్యమంతా చూపించినాడు. పాట కూడా పాడగలనని ఆయన చూపించినాడు. యిరవై సంవత్సరాలు అత్యధికంగా వ్యాపారానికి అర్పించవలసి వచ్చిన శక్తి అప్పుడు సంపూర్ణంగా ఆ రెండు కర్తవ్యాలకు మళ్లింది. ఆయన "పెట్టుబడి"ని, సాధ్యమైనంత మేరకు, పూర్తిచేసినాడు, తన సొంత శాస్త్రీయ కృషిలో ఆశ్చర్యకరమైన కార్యకలాపాలు అభివృద్ధి పరిచినాడు, పనిచేయడంలో తన కున్న అసాధారణమైన శక్తి మూలంగా విస్తారమైన అంతర్జాతీయ ఉత్తర ప్రత్యుత్తరాలకు యింకా సమయం సంపాయించుకున్నాడు. యిక ఎంగెల్సు ఉత్తరాలంటే రాజకీయాల్లోనూ, అర్థశాస్త్రంలోనూ వ్యాసాలు, మార్గదర్శక గ్రంథాలు, సూచనలు.

ఆయన తనతో యెక్కడ అవసరముంటే అక్కడల్లా సహాయం చేసినాడు. ఆయన తన చుట్టూ వున్న వాళ్ల నందరినీ కదిలించినాడు. చనిపోవడానికి కొద్ది కాలం ముందువరకూ ఆయన సలహాదారుడుగా, ప్రబోధకుడుగా, హెచ్చరికదారుడుగా, అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమపు యుద్ధాలలో చురుకైన సైనికుని మాదిరీ పాల్గొన్నాడు; ఆయనా, ఆయన మిత్రుడైన మార్క్సు ఫిబ్రవరి విప్లవపు ప్రత్యూష పవనాన్ని పసిగట్టి 1848 ప్రారంభంలో కార్మికులకు ప్రవచించిన నీతిసూత్రాన్ని అంతర్జాతీయ కార్మిక ఉద్యమం నిర్వహిస్తూ వుండింది; ఆ నీతిసూత్రం యేదంటే:

"సకల దేశాల కార్మికులారా, ఏకం కండి!"

వాళ్లు ఏకమైనారు.

సమైక్య ప్రపంచ కార్మికవర్గ మార్గాన్ని ప్రపంచంలో యే శక్తీ అడ్డగించలేదు.

1890 నవంబర్ 28 నాడు మేము లండన్‌లో ఎంగెల్సు డెబ్బయ్యవ జన్మదినం జరిపినాము. ఆయన తన అత్యంత ఉల్లాసపు, అత్యంత సహృదయపు యవ్వనం అంతటి లోనూ వుండినట్లు హుషారుగా, చమత్కారంగా, పోరాటానికి సర్వసన్నద్ధంగా వుండినాడు. యిక, ఆ తర్వాత మూడేండ్లకు కన్‌కార్డియా హాలులోని బెర్లిన్ కార్మికులను ఆయన "కామ్రేడ్స్, భవిష్యత్తులో కూడా మీరు మీ కర్తవ్యాన్ని నిర్వహిస్తారని నాకు నమ్మకం వుంది!" అని ఉద్బోధించినప్పుడు,* ఆయన మాటలు ఉత్సాహంతో వింటూ, ఆయనను ప్రేమతోనూ, కృతజ్ఞతతోనూ మనసులో భావించుకుంటూ వుండిన వేలాది మందిలో ఒక్కడు కూడా "ఆ యువకునికి అప్పుడే 73 యేండ్లు వుండగలవా?" అని ఆశ్చర్యంతో అడగనివాడు లేడు.

తర్వాత పూరా రెండేండ్లు కాక ముందే, 1895 ఆగస్టు 6న, బ్రెమెన్‌లో జరిగిన పెద్ద ట్రేడ్‌యూనియన్ ఉత్సవంనుండి నేను తిరిగివచ్చినప్పుడు "ఫార్వర్ట్స్" సంపాదక కార్యాలయంలోని నా డెస్కుమీద యీ విషాదకరమైన టెలిగ్రాం వుండింది:

"జనరల్ రాత్రి 10.30కి మరణించినాడు. ప్రయాస లేదు. మధ్యాహ్నంనుండి స్పృహ లేదు. దయచేసి సోల్డట్‌కూ, సింగెర్‌కూ తెలపండి."

"సోల్డట్" (సైనికుడు) అంటే నేను.

"జనరల్" గొంతులో నయంకాజాలని కాన్సర్ సంబంధమైన వ్యాధితో బాధపడుతున్నాడని వసంతకాలంనుండి మాకు, అనగా జర్మనీలో ముగ్గురు వ్యక్తులకు,** తెలుసు. కానీ, ఆఘాతం యెదురు చూడనిది కాకపోయినా, అది తీవ్రమైనది, ప్రచండమైనది.

ఆయన గతించినా డన్నమాట, మార్క్సుతో కలిసి శాస్త్రీయ సోషలిజానికి పునాదులు వేసి, సోషలిజంయొక్క యెత్తుగడలు బోధించిన బ్రహ్మాండమైన మేధ, 24 యేండ్ల అల్ప వయస్సులో "ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి" అన్న మహాగ్రంథం రచించినవాడు, "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" సహ రచయిత, అంతర్జాతీయ కార్మిక సంఘాన్ని అవతరింపజేయడంలో మార్క్సుకు తోడ్పడినట్టి మరొక మార్క్సు అయినవాడు, ఆలోచించగలవాళ్ల కెవరికైనా అందుబాటులో వున్న స్ఫటిక స్వచ్ఛ శాస్త్ర విజ్ఞాన సర్వస్వమైనట్టి "ఆంటీ డ్యూరింగ్" రచయిత, "కుటుంబం పుట్టుక," యింకా అనేక యితర గ్రంథాలూ, వ్యాసాలూ, పత్రికా వ్యాసాలూ రచించినవాడు, మిత్రుడు, హితబోధకుడు, నాయకుడు, యోధుడు — ఆయన మరణించినాడు.

కానీ వర్గచైతన్యం గల కార్మికులు జీవించి పోరాడే చోటల్లా ఆయన తత్వం జీవిస్తుంది.

---

*1893 సెప్టెంబర్ 22న బెర్లిన్‌లో ఎంగెల్సు ఒక సోషల్ డెమొక్రటిక్ సభలో ఉపన్యసించినాడు. — సం.

** విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్, ఎ. బెబెల్, పి. సింగెర్. — సం.

# ఫ్రీడ్రిఖ్ లెస్నెర్

## 1848కి ముందూ, తరువాతా*

### (ఒక పాత కమ్యూనిస్టు స్మృతులు)

### 1

నలభైల ఉత్తరార్ధంలోని తుఫానులలో అప్పటికే నేను కమ్యూనిస్టును, ఉత్పత్తి సాధనాలపై సామాజిక యాజమాన్యం కొరకూ, మానవుల మధ్య సోదర సహకారం కొరకూ ఆవేశంతో పోరాడేవాణ్ని....

ఒక దర్జీవానికింద పనిచేసే యువకునిగా నేను హాంబుర్గ్‌లో, 1846లో, మొదటిసారి ఒక కమ్యూనిస్టు ఉపన్యాసం విని, తరువాత వైట్లింగ్ రచించిన "సామరస్య స్వేచ్ఛలకు హామీలు" చదివినప్పుడు, కమ్యూనిజం రెండేండ్లలో వాస్తవ మౌతుందని అనుకున్నాను.... కానీ నేను 1847లో కార్ల్ మార్క్స్‌ను విని, "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" చదివి అర్థం చేసుకున్నప్పుడు నాకు స్పష్టమైంది – మానవ సమాజాన్ని మార్చడానికి వ్యక్తుల ఉత్సాహమూ, సద్భావమూ చాలవని.... నేను ఉత్సాహంలోనూ, ఊహాకల్పనలోనూ పోగొట్టుకున్నదాన్ని లక్ష్య చైతన్యంలోనూ, జ్ఞానంలోనూ సంపాయించినాను.

నాకు ఉద్యోగం దొరికిన కార్ఖానాలో కొద్దిమంది సహకార్మికులతో మైత్రి చేసుకున్నాను. వాళ్లు అప్పటికే స్విట్జర్లండులోనూ, పారిస్‌లోనూ, లండన్‌లోనూ పనిచేసినవాళ్లు. అక్కడ వాళ్లు కమ్యూనిస్టు భావాలతో పరిచయం పొందివుండినారు....

* * *

ఆ కాలంలో హాంబుర్గ్‌లో ఒక "వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ" వుండింది. అది ప్రగతిశీల కార్మికుల కందరికీ సమావేశ స్థలంగా వుండింది. వార్తాపత్రికలు చదువుకోడానికీ, చర్చలు జరపడానికీ, లేదా పాటలు పాడడానికీ, విదేశ భాషలు నేర్చుకోడానికీ వాళ్లు ప్రతి సాయంత్రం కలిసేవాళ్లు. వార్తాపత్రికల్లో అత్యధిక భాగం ప్రతిపక్ష ధోరణికి చెందినవి. చర్చలు ప్రధానంగా కమ్యూనిజానికి సంబంధించిన సమస్యలమీద కేంద్రీకరింపబడేవి. పాటల విభాగం అభిమానించిన పాటలు తీవ్రవాద స్వాతంత్ర్య గీతాలు....

---

* 1898లో ప్రచురించబడింది. – సం.

హాంబుర్గ్ వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ విప్లవ ఆలోచనల పెంపకానికి కేంద్రంగా వుండింది. కనుక, నలబైల విప్లవ భావాలు — జర్మన్ సమైక్యత కొరకూ, స్వేచ్ఛ కొరకూ కృషిచేయడం, రిపబ్లిక్ కొరకూ, జాతుల మధ్య సోదరత్వం కొరకూ కృషిచేయడం, ఆలోచనా స్వేచ్ఛ కొరకూ, మూల క్రైస్తవమతం కొరకూ, కమ్యూనిజం కొరకూ కృషిచేయడం — యీ భావాలన్నీ కలగలిసి, అత్యంత అస్పష్టమైన, అనిర్దిష్టమైన ఆశయాలుగా ఏకమైనాయి....

వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీలో విల్‌హెల్మ్ వైట్లింగ్ భవిష్యత్తుకు చెందిన వ్యక్తిగా పరిగణింపబడేవాడు. మా బృందాలలో అతని కుండిన గౌరవం హద్దులు లేనిది. అతని అనుచరులకు అతను దేవుడు.

1846 నవంబర్‌లో నేను నా సహకార్మికులచేత వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీకి పరిచయం చేయబడి, త్వరలో సభ్యునిగా చేర్చుకోబడినాను. అప్పటినుండి నేను చర్చలు జరిగే సాయంత్రాలు క్రమం తప్పకుండా హాజరయ్యేవాణ్ణి....

నా సహకార్మికులలో ఒకరు విల్‌హెల్మ్ వైట్లింగ్ రచించిన "సామరస్య స్వేచ్ఛలకు హామీలు" చదవడానికి యిచ్చినాడు. అప్పుడు యీ పుస్తకాన్ని కార్మికులు యెక్కువగా చదువుతూ వుండినారు. అది ఒకరినుండి మరొకరికి పోయేది, యెందుకంటే కొద్దిమందికి మాత్రమే సొంత ప్రతి వుండింది. నే నది ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు చదివినాను. ప్రపంచం గతంలోకంటె భిన్నంగా వుండవచ్చునని నాకు మొదటిసారి తోచింది అప్పుడే....

ఆ దశ, వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీలోని చర్చలూ, వైట్లింగు "హామీలూ" నా అభిప్రాయాలను విప్లవీకరించి, నా దిజ్మండలాన్ని గణనీయంగా విస్తృతపరిచిన దశ, నా రాజకీయ అభిప్రాయాలకు నిర్ణయాత్మకమైనది....

1847 ఏప్రిల్ 1న నేను వైమార్‌లోని బారకాసులకు పోవడానికి బదులు, నన్ను యింగ్లండుకు తీసుకపోయే ఓడలో యెక్కినప్పుడు, ఇంగ్లండులో కొత్త జీవితం ప్రారంభించడానికి యూరపియన్ భూఖండంమీద నా గతాన్ని వదలిపెట్టినట్లు నాకు అనిపించింది — ఆ కొత్త జీవితాన్ని నేను మానవ విమోచన కొరకు జరిగే పోరాటానికి అంకితం చేయాలని నిశ్చయించుకున్నాను.

* * *

నేను లండన్‌కు పోవడానికి నిర్ణయించుకొన్నప్పుడు, లండన్ వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీకి నన్ను సిఫారసు చేస్తూ మార్టెన్స్* నా కొక ఉత్తరం యిచ్చినాడు. ఆ సొసైటీలో నాకు మైత్రీపూర్వకమైన స్వాగతం యిచ్చినారు.

---

* మార్టెన్స్ — హాంబుర్గ్‌లోని కార్మికుల ఎడ్యుకేషనల్ సొసైటీయొక్క, కమ్యూనిస్టు లీగు హాంబుర్గ్ కమ్యూనిటీయొక్క నాయకులలో ఒకడు. — సం.

లండన్ వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ 1840 ఫిబ్రవరి 7న స్థాపించబడింది. దాని స్థాపకులు కార్ల్ షాపెర్, హైన్రిఖ్ బొవర్, జోసెఫ్ మోల్. వాళ్లు బ్లాంకిస్ట్ కుట్రలో పాల్గొన్నందుకుగాను ఫ్రాన్సునుండి బహిష్కరింపబడిన తర్వాత, 1839 అంతంలో లండన్‌కు పోయినారు....

జ్ఞానం ద్వారా కంటె యెక్కువగా ఉత్సాహం ద్వారా షాపెర్ కమ్యూనిస్టు అయినవాడు.... హైన్రిఖ్ బొవర్ వృత్తిరీత్యా పాదరక్షల పనివాడు. అతను చిన్న మనిషి, కానీ గొప్ప నిశిత బుద్ధీ, యుక్తీ, దీక్షా కలవాడు. జోసెఫ్ మోల్ కొలోన్‌లో పుట్టినాడు, వృత్తిరీత్యా గడియారాలు చేసేవాడు. అతడు మధ్య రకంయెత్తు గల దృఢకాయుడు; అతనికి అసాధారణమైన తెలివీ, వీరత్వమూ, నిర్భీకతా వుండినాయి. కార్మికవర్గ ప్రయోజనాలకు సేవ చేసే సందర్భంలో అతను భయ మనేది యెరగడు. 1849లో బాడెన్ విప్లవం ప్రారంభమైనప్పుడు అతను యుద్ధరంగానికి ఉరికినాడు.... శత్రువుల తుపాకి గుండు అతని వీర జీవితాన్ని అంతమొందించింది. "నోయె రైనిషె సైటుంగ్. పొలిటిష్-ఒకొనామిషె రెవ్యూ" (సంచిక 1, లండన్, 1850)లో అతన్ని గురించి ఫ్రెడరిక్ ఎంగెల్సు గౌరవప్రదమైన స్మృత్యంజలి రాసినాడు. "అతనిలో నేను ఒక పాత మిత్రుని కోల్పోయినాను; పార్టీ అలత యెరగని, భయ మెరగని అత్యంత విశ్వసనీయులైన తన సైనికుల్లో ఒకణ్ని కోల్పోయింది," అని ఆయన రాసినాడు.

వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ చర్చల్లో కార్ల్ ఫెండర్, గెయోర్గ్ ఎక్కరియుస్* కూడా హుషారుగా పాల్గొన్నారు. ఫెండెర్ రంగులు వేసేవాడు, ఎక్కరియుస్ దర్జీవాడు....

కొద్ది రోజుల తర్వాత నేను పని సంపాయించుకోగలిగినాను. ఆ తర్వాత, నేను సభ్యుణ్ణైన సంఘానికి క్రమం తప్పకుండా హాజరైనాను. "న్యాయాత్ముల సంఘం"లో కూడా నాకు ప్రవేశం యిచ్చినారు; అది సరిగ్గా ఆ కాలంలోనే "కమ్యూనిస్టు లీగు"గా మార్చబడింది. లండన్‌లో వైట్లింగ్ ప్రభావం క్షీణించుతూనే వుండింది, మరొకపక్క మార్క్సు, ఎంగెల్సుల పేర్లు ముందుకు వచ్చినాయి.

## 2

అంతవరకు నాకు వీళ్లిద్దరూ తెలియదు. వీళ్లు బ్రస్సెల్స్‌లో నివసిస్తూ వుండినారనీ, అక్కడ "దోయిచె బ్ర్యుసెలెర్ సైటుంగ్"కు సంపాదకత్వం వహిస్తున్నారనీ మాత్రమే నాకు

---

* ఎక్కరియుస్, గెయోర్గ్ (1818–1889) – జర్మన్ కార్మికుడు, వృత్తిరీత్యా దర్జీపనివాడు, కమ్యూనిస్టు లీగ్, మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ సభ్యుడు, మార్క్సు, ఎంగెల్సుల సహచరుడు. – సం.

తెలుసు. యీ వ్యక్తుల అవతరణ సోషలిజం చరిత్రలో నూతన యుగ ప్రారంభంగా వుంటుందని అప్పుడు నాకు బొత్తిగా తెలియదు....

నేను లండన్‌కు వచ్చిన కొద్ది నెలల తర్వాత – 1847 వేసవిలో – లీగు ప్రథమ మహాసభ జరిగింది. ఎంగెల్సు, విల్‌హెల్మ్ వొల్ఫ్ వచ్చినారు, కానీ మార్క్సు హాజరు కాలేదు. మహాసభ లీగును పునర్నిర్మాణం చేసింది. "కుట్ర కాలంనాటి పాత నిగూఢ నామధేయంలో మిగిలింది తొలగింపబడింది" అన్నాడు ఎంగెల్సు. "అప్పటినుండి అది కమ్యూనిస్టు లీగు అని పిలువబడింది...."

1847 వేసవిలో ఇటియేన్ కాబె, "ఇకేరియాకు* ప్రయాణం" అన్న గ్రంథంయొక్క ప్రసిద్ధ రచయిత, ఫ్రెంచి కమ్యూనిస్టులకు ఒక విజ్ఞప్తి ప్రచురించినాడు. అందులో అతను యిలా చెప్పినాడు: "యిక్కడ (ఫ్రాన్సులో) మనం ప్రభుత్వంచేతా, మతగురువులచేతా, బూర్జువావర్గంచేతా, విప్లవకర రిపబ్లికన్లచేత కూడా హింసింపబడుతూ, దూషింపబడుతూ, నిందింపబడుతూ వున్నాం గనుక, మన బతుకు దెరువును మనకు లేకుండా చేయడానికీ, మనలను శారీరకంగా, నైతికంగా ధ్వంసం చేయడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి గనుక, మనం ఫ్రాన్సును వదలి, ఇకేరియాకు పోయి, అక్కడ ఒక కమ్యూనిస్టు కాలనీ స్థాపించుదాం పదండి." ఆ పథకం నిర్వహించడానికి సుమారు 20, 30 వేలమంది కమ్యూనిస్టులు లభిస్తారనే ఆశను అప్పుడు కాబె వ్యక్తం చేసినాడు.

యీ విజ్ఞప్తి లండన్ వర్కర్స్ ఎద్యుకేషనల్ సొసైటీకి కూడా చేయబడింది. 1847 సెప్టెంబర్ ప్రాంతంలో, మమ్మల్ని తన అభిప్రాయానికి మార్చడానికి కాబె స్వయంగా లండన్‌కు వచ్చినాడు. అతని ప్రతిపాదనమీద చర్చ ఒక వారమంతా సాగింది. చివరకు ప్రయోగాల కన్నిటికీ వ్యతిరేకంగా సొసైటీ నిర్ణయించింది. మా అభిప్రాయంలో కాబె తప్పు దారి పట్టుతున్నాడు గనుక, అతన్ని అనుసరించడానికి మేము నిర్ణయించజాలమని జవాబు చెప్పినాము. మేము కాబెను వ్యక్తిగతంగా గౌరవించినాము; కానీ అతని వలస పథకాన్ని వ్యతిరేకించినాము.... న్యాయం కొరకూ, సత్యం కొరకూ పోరాడే ప్రతి వొకడూ దేశంలో నిలబడడమూ, ప్రజలను జ్ఞాన ప్రబుద్ధులను చేయడమూ, వంగిపోయేవాళ్లలో నూతన సాహసం కలిగించడమూ, నూతన సమాజ వ్యవస్థకు పునాది వేయడమూ, మోసగాళ్లను తీవ్రంగా ప్రతిఘటించడమూ తన ధర్మంగా పరిగణించాలి. నిజాయితీపరులూ, ఉత్తమ భవిష్యత్తు కొరకు పోరాడేవాళ్లూ వెళ్లిపోయి, రంగం మూర్ఖులకూ, మోసగాళ్లకూ వదలిపెడితే, మొత్తం యూరప్ విధిగా దుర్గతిపాలౌతుంది....

యీ ప్రధాన కారణాలవల్ల మేము కాబె ప్రతిపాదన మరణాంతకమని పరిగణించి, సకల దేశాల కమ్యూనిస్టులకూ యీ విజ్ఞప్తి చేసినాం: "సోదరులారా, యిక్కడ పాత యూరప్‌లో

---

* ఊహాజనిత కమ్యూనిస్టు దేశం. – సం.

దాడిని యెదుర్కొందాం; ఆచరణకు దిగి పోరాడుదాం, యెందుకంటే సమష్టి యాజమాన్యానికి పునాది వేయడానికి యిక్కడ మాత్రమే పరిస్థితులు లభిస్తాయి. అది మొదట యిక్కడ స్థాపించబడుతుంది, లేదా యెక్కడా స్థాపించబడదు.''

కాబె ప్రతిపాదనకు అది మా నిరాకరణ.... యోచించే కమ్యూనిస్టులు, అప్పటికే మార్క్స్, ఎంగెల్సుల ప్రభావం కింద వుండినవాళ్లు, ఆ తొలి దశలో కూడా సకల ఊహాస్వర్గ ప్రయత్నాలనూ ఖండించినారని అది వెల్లడించింది....

కాబె లండన్ వదలిపోయినాడు. తరువాత త్వరలో, 1847 నవంబర్ అంతంలో, కమ్యూనిస్టు లీగు రెండవ మహాసభ జరిగింది, మార్క్స్ హాజరైనాడు. ఆధునిక సోషలిజం సూత్రాలను మహాసభలో వివరించడానికి ఆయనా, ఎంగెల్సూ బ్రస్సెల్స్‌నుండి వచ్చినారు. మహాసభ పది రోజులు జరిగింది.

ప్రతినిధులు మాత్రమే సమావేశాలకు హాజరైనారు. నేను ప్రతినిధిని కాదు. కానీ, అదంతా దేన్ని గురించి జరిగేదీ ప్రతినిధులం కాని మాకు తెలుసు; మేము చర్చ ఫలితాల కొరకు అనల్పమైన తహతహతో కాచుకున్నాం. మార్క్స్, ఎంగెల్సులు వివరించిన సూత్రాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందనీ, ఒక ప్రణాళికను రచించే పని వాళ్లకు అప్పగించబడిందనీ త్వరలో మాకు తెలిసింది. 1848 ప్రారంభంలో ''కమ్యూనిస్టు ప్రణాళిక'' రాతప్రతి బ్రస్సెల్స్‌నుండి వచ్చినప్పుడు, యీ యుగకర్తృ పత్రం ప్రచురణలో నేను ఒక చిన్న పాత్ర నిర్వహించవలసి వుండింది: నేను రాతప్రతిని ముద్రాపకునికి యిచ్చి, ప్రూఫ్ కాగితాలు అతనినుండి తీసుకొనిపోయి, సరిచూడడం కోసం కార్ల్ షాపెర్‌కు యిచ్చేవాణ్ని.

రమారమిగా ఆ కాలంలో నేను మార్క్స్‌నూ, ఎంగెల్సునూ మొదటిసారి చూసినాను. వాళ్లు నామీద వేసిన ప్రభావ ముద్ర యెన్నటికీ మరచిపోను.

మార్క్స్ అప్పటికింకా యువకుడు, సుమారు 28 యేండ్ల వయస్సు; కానీ ఆయన మా అందరిమీదా గొప్ప ప్రభావ ముద్ర వేసినాడు. ఆయన మధ్యరకమైన యెత్తూ, విశాలమైన భుజాలూ, బలమైన శరీర నిర్మాణమూ, పనిచేయడంలో చురుకుదనమూ కల వాడు. ఆయన నుదురు విశాలంగా, చక్కని ఆకారం గలది, ఆయన జుట్టు దట్టంగా కారు నలుపు గలది, ఆయన చూపు నిశితమైనది. అప్పటికే ఆయన నోటిచుట్టూ ఆయన శత్రువులు అంతగా భయపడే ఆ అపహాస్య రేఖ వుండింది. మార్క్స్ పుట్టుకతో ప్రజా నాయకుడు. ఆయన మాటలు సంక్షేపంగా, ఒప్పించేవిగా, తర్కంలో తిరుగులేనివిగా వుండేవి. ఆయన ఒక్క అనవసరమైన మాట యెప్పుడూ చెప్పలేదు; ప్రతి వాక్యమూ ఒక ఆలోచన, ప్రతి ఆలోచనా ఆయన చేసే నిరూపణ అనే గొలుసులో ఒక ఆవశ్యకమైన లంకె. వైట్లింగ్ కాలంనాటి కమ్యూనిజంకూ, ''కమ్యూనిస్టు ప్రణాళిక''లోని కమ్యూనిజంకూ గల భేదం నేను గుర్తించేకొద్దీ, మార్క్స్ సోషలిస్టు ఆలోచనయొక్క యవ్వనానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని నేను మరింత స్పష్టంగా తెలుసుకున్నాను.

మార్క్సుకు ఆత్మిక సోదరుడైన ఫ్రెడరిక్ ఎంగెల్సు యెక్కువగా జర్మానిక్ మనిషి. సన్నగా చలాకిగా, గోధుమరంగు జుట్టూ, మీసాలతో, ఆయన పండితుడికంటె యెక్కువగా చక్కని యువక సైనికాధికారి లాగా వుండినాడు.

ఎంగెల్సు యెప్పుడూ తన అమర మిత్రుని ప్రాముఖ్యాన్ని నొక్కిచెప్పినా, ఆధునిక సోషలిజంను స్థాపించడంలోనూ, వ్యాప్తిచేయడంలోనూ స్వయంగా ఆయనకు విస్తారమైన భాగం వుండింది. ఒకసారి ఆయనకు సన్నిహితంగా పరిచయమైతే, ఆయన్ను నీవు గౌరవించి ప్రేమిస్తావు; అలాంటి మనిషి ఆయన....

*   *   *

ఆ కాలంలో వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీలోని మేము ఒక విధమైన ఉద్రిక్త స్థితిలో వుండినాము. అది వెంటనే "ప్రారంభం" ఐతీరాలని మేము దృఢంగా నమ్మినాము; బూర్జువా ప్రపంచాన్ని ముక్కలు చేసే సామర్థ్యం కలదిగా కార్మికవర్గాన్ని చేయడానికి యెంత విద్యా బోధనా, యెంత నిర్మాణ కృషీ జరగవలసిందీ మా కింకా బొత్తిగా తెలియదు.

"కమ్యూనిస్టు ప్రణాళిక" 1848 ఫిబ్రవరిలో ముద్రణాలయంనుండి వచ్చింది. అది మాకు అందింది పారిస్‌లో ఫిబ్రవరి విప్లవం ప్రారంభమైందన్న వార్త అందిన సమయంలోనే.

యీ వార్త మామీద కలిగించిన బలీయమైన ప్రభావాన్ని నేను మాటల్లో పెట్టలేను. ఉత్సాహంతో మేము ఉన్మత్తుల మైనాము. మానిండా ఒక అనుభూతి మాత్రమే, ఒక ఆలోచన మాత్రమే వుండింది: మానవజాతి విమోచనకొరకు మా ప్రాణమూ, మా సర్వస్వమూ ఒడ్డడం!

కమ్యూనిస్టు లీగ్‌యొక్క లండన్ కేంద్ర కమిటీ వెంటనే తన అధికారాలను బ్రస్సెల్స్‌లోని ప్రముఖ సంస్థకు అప్పగించింది; అది తిరిగి ఆ అధికారాలను మార్క్సు, ఎంగెల్సులకు అప్పగించి, పారిస్‌లో ఒక కొత్త కేంద్ర కమిటీని నిర్మించే అధికారం వాళ్లకు యిచ్చింది.

యీ నిర్ణయం జరిగిన వెనువెంటనే మార్క్సు బ్రస్సెల్స్‌లో అరెస్టు చేయబడి, అక్కడినుండి ఫ్రాన్సుకు పోయేటట్లు నిర్బంధింపబడినాడు, ఆయన యెక్కడికి పోవాలనుకున్నాడో సరిగ్గా అక్కడికి.

## 3

పారిస్ ఘటనలు యింగ్లండులోని కార్మికవర్గంమీద గాఢమైన ప్రభావ ముద్ర వేసినాయి. ముప్పైల మధ్యకాలంనుండి యింగ్లీషు కార్మికవర్గ మనస్సులను ఆక్రమించిన చార్టిస్టు ఉద్యమం ఫిబ్రవరి విప్లవంయొక్క విజయ పథంనుండి కొత్త ప్రేరణను పొందింది. ఆ విప్లవ ప్రారంభానికే లండన్ కార్మికులు పెద్ద ప్రదర్శనతో స్వాగతం చెప్పినారు. కమ్యూనిస్టు

లీగు సభ్యులు, తమకు చేతనైన సకల పద్ధతులచేతా చార్టిస్టు ఉద్యమానికి అండదండలు యిచ్చినట్లే, ఆ ప్రదర్శనలో పాల్గొన్నారు.

చార్టిస్టుల అత్యంత ప్రజాప్రియ, సమర్థ నాయకుడైన ఎర్నెస్ట్ జోన్స్ మా సొసైటీకి అప్పుడప్పుడు వచ్చేవాడు; అక్కడ ఆ సాహస, సార్థత్యాగపూరిత ఆందోళనకారుని తెలుసుకునే అవకాశం నాకు కలిగింది. జోన్స్ చిన్న మనిషి, కానీ గట్టి మనిషి. నున్నితంగా చెక్కబడిన, గంభీరమైన, చురుకైన అతని లక్షణాలు వెంటనే దృఢచిత్తుడూ, నిర్భీకుడూ అయిన ప్రజా నాయకుని తెలియజేసేవి. అతనికి జర్మన్ భాష చదవనూ రాయనూ వచ్చు. ఒకేసారి సోషలిజంను అర్థమూ చేసుకొని, ప్రచారమూ చేసిన కొద్దిమంది చార్టిస్టులలో అతను ఒకడు.

మార్చి 13న లండన్‌లోని కెన్నింగ్టన్ మైదానంలో ఒక సభ జరిగింది. సభలో జోన్స్ మాట్లాడినాడు. చట్టాలు అమలుపరిచే దయనీయమైన మనుషులైన పోలీసులకూ, సైని కులకూ, ప్రత్యేకమైన పోలీసులుగా ప్రమాణం చేసి, యిద్దరు వీధి పిల్లలను చూసి పారిపోయే దుకాణదారులకూ భయపడవద్దని అతను ప్రజలను ఉద్బోధించినాడు. "మంత్రిత్వ శాఖ నశించాలి! పార్లమెంటును రద్దుచేయాలి! చార్టర్ కావాలి, లొంగుబాటు వద్దు!"

ఏప్రిల్ ప్రారంభంలో లండన్‌లో ఒక "చార్టిస్టు కవెనెంట్" (ప్రతినిధుల సంఘం) యేర్పడింది. కార్మికులు డిమాండ్ చేసిన రాజకీయ స్వాతంత్ర్యాలను ప్రవేశపెట్టా లని అంతవరకు ప్రతి సంవత్సరం పార్లమెంటుకు పంపబడిన "మహజరు"ను బలపరచ డంలో మరింత చురుకుదనం ఆ కవెనెంట్ ప్రదర్శించవలసి వుండింది. మహజరు ముందులాగ కొద్దిమంది ప్రతినిధులచేత గాక, స్వయంగా కార్మిక సమూహాలచేత ఏప్రిల్ 10వ తేదీనాడు అందజేయబడవలసి వుండింది. అవసరమైతే బలంచేత తన డిమాండ్లను ఆచరణలో పెట్టాలనే కార్మికవర్గపు కృత నిశ్చయాన్ని పార్లమెంటుకు మనసులో నాటుకునేటట్లు చేయాలని ఉద్దేశింపబడింది.

ఏప్రిల్ 10 ఉదయాన లండన్ చిత్రమైన దృశ్యం ప్రదర్శించింది. ఫాక్టరీలూ, అంగళ్లూ అన్నీ మూసివేయబడినాయి. "శాంతి"ని కాపాడడానికి లండన్ బూర్జువాలు సాయుధులైనారు. వాళ్లలో చిన్న నెపోలియన్, తరువాత ఫ్రాన్సు చక్రవర్తి అయిన వ్యక్తి,* వుండినాడు.


కమ్యూనిస్టు లీగు సభ్యులు ప్రదర్శనలో పాల్గొనడానికి నిశ్చయించినారు. మేము రకరకాల ఆయుధాలు ధరించినాము. గెయోర్గ్ ఎక్కరియుస్ నామీద కలిగించిన హాస్య ముద్ర నా కింకా బాగా జ్ఞాపక ముంది; అతను నా కొక పెద్ద దర్జీ కత్తెర చూపించినాడు, అది తళతళ మెరిసేటట్లు పదును పెట్టబడింది, దానితో అతను పోలీసుల దాడులనుండి ఆత్మరక్షణ చేసుకోవాలనుకున్నాడు.

---

* నెపోలియన్ III. – సం.



1848లో పారిస్‌లో జూన్ దినాలు



ఫ్రీడ్రిఖ్ లెస్నెర్

పార్లమెంటుకు పోయే ఊరేగింపులో కలవడానికి కార్మికులు కెన్నింగ్టన్ మైదానంలో గుమికూడినారు. కానీ, సామూహిక ఊరేగింపును ఆయుధ బలంతో యెదిరించడానికి ప్రభుత్వం సిద్ధంగా వున్నందున ప్రదర్శన నాయకుడైన ఫెర్గ్యూస్ ఓకోనార్ ఊరేగింపును వ్యతిరేకించినాడని హఠాత్తుగా మాకు తెలిసింది.... చాలామంది ఓకోనార్ సలహాలను అనుసరించినారు, తక్కినవాళ్ళు ముందుకు తోసుకపోయినారు. తత్ఫలితంగా పోలీసులకూ, చార్టిస్టులకూ మధ్య రక్తపాతపు ఘర్షణలు జరిగినాయి. ఓకోనార్ ఎత్తుగడలు ప్రదర్శకుల ఐక్యతను ధ్వంసం చేసినందున, విజయం యిక యెంతమాత్రమూ నమ్మకంగా లేదు.... గంటక్రితం అంత నిరీక్షణతో మేము గుమికూడిన ప్రదర్శన స్థలాన్ని మేము తీవ్ర ఆశాభంగంతో వదలిపెట్టినాము.

* * *

పశ్చిమ యూరప్‌లో యీ తుఫానులాంటి ఘటనలు జరుగుతుండిన కాలంలోనే మధ్య యూరప్‌లో విప్లవం ప్రారంభమైంది. యిది మమ్మల్ని మరీ కదిలించింది. వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీలోని సాయంత్రాల చర్చలు అంతకంతకూ ఆవేశపూరితమూ, ఉద్రేకపూరితమూ అయినాయి. జర్మనీలోని యుద్ధరంగాలకు ఉరకడానికి ప్రతి ఒకరూ సిద్ధంగా వుండినారు. కానీ మాలో అత్యధిక భాగానికి మా ఉద్దేశాన్ని వెంటనే ఆచరణలో పెట్టే స్తోమతు లేదు. జర్మనీ ప్రయాణానికి పూనుకోడానికి తగినంత డబ్బు నేను మిగిలించడం 1848 జూలై దాకా సాధ్యం కాలేదు.

యీ సన్నాహాల కాలంలో మాకు జూన్ విప్లవపు ఘోరమైన ఓటమిని గురించిన మనః క్లేశకరమైన వార్త అందింది. మామీద దాని ప్రభావం మాటలలో వ్యక్తం చెయ్యడం సాధ్యం కాదు. నాకింకా స్పష్టంగా జ్ఞాపక ముంది – యీ ఘటనను గురించి "నోయె రైనిషె సైటుంగ్" (1848 జూన్ 29)లో మార్క్స్ రాసిన వ్యాసం బాగా యిరవై సార్లు చదివినాను; యెందుకంటే అది మా మనసులలో వుండినదానికి అత్యుత్తమ వ్యక్తీకరణ.*

## 4

నేను 1848 నడివేసవిలో కొలోన్ చేరుకున్నాను. యీ నగరంలో నా కొక ప్రత్యేక ఆకర్షణ వుండింది, అక్కడ విప్లవానికి సేవచేస్తూ వుండిన వ్యక్తుల మూలంగా – మార్క్స్, ఎంగెల్సు, విల్‌హెల్మ్ వొల్ఫ్, ఫ్రైలిగ్రాత్,** షాపెర్, మోల్ అప్పుడు కొలోన్‌లో వుండినారు. అక్కడ "నోయె రైనిషె సైటుంగ్" ప్రచురింపబడుతూ వుండింది.

---

* కార్ల్ మార్క్స్, "పారిస్‌లో జూన్ హత్యాకాండ, జర్మనీమీద దాని ప్రభావం." పారిస్‌నుండి వార్త. – సం.

** ఫ్రైలిగ్రాత్ ఫెర్డినాండ్ (1810–1876) – జర్మన్ విప్లవ కవి, "నోయె రైనిషె సైటుంగ్" సంపాదకులలో ఒకడు. – సం.

నేను మొట్టమొదట చేసిన పని కొలోన్‌లో నిలవగలగడానికి పని చూసుకోవడం. సహజంగా, యిది నేను నా అసలు పేరుతో చేయలేను, యెందుకంటే, నేను యింతకు ముందే చెప్పినట్లు, నేను సైన్యంనుండి తప్పించుకొని వచ్చినవాణ్ని. కనుక నా హాంబుర్గ్ మిత్రులలో ఒకడు కార్‌స్టెన్స్ పేరుతో వున్న ఒక బాటసారి కార్మికుని పత్రం నాకు సంపాయించి యిచ్చినాడు; కొలోన్‌లోనూ, ఆ పరిసరాలలోనూ నన్ను యింకా ఆ పేరుతోనే యెరుగుదురు. వర్ణన బాగా సరిపోయినందున నాకు పోలీసులతో యే కష్టాలూ లేకపోయినాయి....

నేను పని సంపాయించుకున్నప్పుడు, వర్కర్స్ సొసైటీలో చేరినాను; దాని నాయకులు డాక్టర్ గోత్‌షాల్క్, లెఫ్టినెంట్ ఆనెకె, షాపెర్, మోల్, నోత్యుంగ్, డెస్టెర్. యిది కాక, "డెమోక్రటిక్ సొసైటీ"* అనేది కూడా వుండింది; దానికి విల్‌హెల్మ్ వొల్ఫ్, మార్క్స్, ఫ్రైలిగ్రాత్, మొదలైనవాళ్లు తరుచుగా వెళ్లేవాళ్లు. అక్కడ నేను విల్‌హెల్మ్ వొల్ఫ్‌ను తెలుసుకున్నాను; అతను సమకాలిక రాజకీయ ఘటనలమీద తరుచుగా ఉపన్యాసాలు యిచ్చేవాడు. అతని ఉపన్యాసం వినడం అసలైన ఆహ్లాదంగా వుండేది. "రాజకీయ పరిశీలన" యివ్వడంలో అతని పటిష్ఠమైన, వినోదకరమైన పద్ధతిని అందరూ మెచ్చుకునేవాళ్లు. అందరికీ బాగా తెలిసినవీ, అంత ఉద్రిక్తపరచనివీ అయిన విషయాలను కూడా అతను అంత నేర్పుతో ఒకటిగా కలపగలిగేవాడు; ఒక విషయాన్ని, దాని స్వభావాన్నిబట్టి, గంభీరంగా గానీ, వ్యంగ్యంగా గానీ చెప్పగలిగేవాడు. అప్పుడప్పుడు ఫ్రైలిగ్రాత్ కూడా వచ్చేవాడు; తరువాత నేను అతనితో స్నేహం చేసుకున్నాను....

మిలీషియాను నిరాయుధం చేసినందుకూ, ముట్టడి పరిస్థితిని ప్రకటించినందుకూ, "నోయె రైనిషె సైటుంగ్" పత్రికను మూసివేయించినందుకూ వ్యతిరేకంగా, 1848 సెప్టెంబర్‌లో మోల్ బహిరంగ సభ జరిపినాడు. సభ తర్వాత మార్గావరోధాలు నిర్మించే ప్రయత్నం జరిగింది, కానీ పరిస్థితి ఘర్షణదాకా రాలేదు.

1848 నవంబర్‌లో ఒకసారి డెమోక్రటిక్ సొసైటీ సమావేశం జరుగుతూవుండింది; అప్పుడు మార్క్స్ హఠాత్తుగా ఒక వార్త వెల్లడించినాడు — యుద్ధరంగంలో కోర్టు మార్షల్ తీర్పుమేరకు వియన్నాలో రోబెర్ట్ బ్లుమ్‌ను కాల్చివేసినారుట. సమావేశం జోరుగా జరిగేటప్పుడు మార్క్స్ ప్రత్యక్షమైనాడు. మార్క్స్ వేదికవద్దకు పోయి, వియన్నానుండి

---

* "డెమోక్రటిక్ సొసైటీ" కొలోన్‌లో, 1848 వసంతకాలంలో స్థాపించబడింది. పెటీబూర్జువా ప్రజాతంత్రవాదులూ, చేతిపనివాళ్లూ, కార్మికులూ దానిలో సభ్యులు. దాని సభ్యులను, ముఖ్యంగా కార్మికులను, ప్రభావితం చేయడానికి మార్క్స్, ఎంగెల్స్, వాళ్లను బలపరిచేవాళ్లూ దానిలో చేరినారు. — సం.

వచ్చిన బ్లుమ్ మరణవార్తను చదివినాడు. మేము కంపించిపోయినాము. హాలులో తుఫాను వీచినట్లు వుండింది. యిప్పటికి జర్మన్ ప్రజలు ఏకవ్యక్తిగా లేచి విప్లవ యుద్ధం తుదిదాకా చేస్తారని అనుకున్నాను. నేనూ, యితరులూ పొరబడినాము. జరిగింది పూర్తిగా భిన్నం. ప్రజానురక్తులైన మహావీరులను హత్య చేయించిన నియంతలకు జర్మన్ పౌరశిఖామణులు పాదాభివందనం చేసినారు.

* * *

అన్నిటినీ మించి, ప్రతిపక్ష పత్రికలను హింసించడం ద్వారా ప్రగతి వ్యతిరేకత తీవ్ర తరం కావడం వ్యక్తమైంది, ప్రత్యేకంగా "నోయె రైనిషె సైటుంగ్"ను హింసించడం ద్వారా; ఆ పత్రిక స్వేచ్ఛనూ, న్యాయాన్నీ సమర్థించడంలో పట్టు విడుపులూ, భయమూ లేనిది. 1849 ఫిబ్రవరి 7న, "నోయె రైనిషె సైటుంగ్" సంపాదకులమీద మొదటి కేసు జరిగింది, మరుదినం రెండవ కేసు జరిగింది, చివరన, 1849 మే 18న అది పూర్తిగా అణచివేయబడింది. ఆఖరి సంచిక యెర్ర అక్షరాలలో వెలువడింది....

మార్క్స్ తాను నేరం చేయలేదని వాదించలేదు, మంత్రిత్వశాఖమీద నేరారోపణ చేసినాడు. "'నోయె రైనిషె సైటుంగ్'లో అచ్చైన ఒక వ్యాసంలో, తమ విధులు నిర్వహి స్తున్న ఛీఫ్ ప్రాక్యురేటర్‌నూ, పోలీసులనూ అవమానించి"నట్లు ప్రధాన సంపాదకుడైన కార్ల్ మార్క్స్‌మీదా, ఫ్రెడరిక్ ఎంగెల్సుమీదా కేసు మోపబడింది. కోర్టు జనంతో నిండి పోయింది. ప్రభుత్వ ప్రాక్యురేటరూ, న్యాయవాదులూ మాట్లాడిన తర్వాత, మార్క్స్ ఒక ఉపన్యాసం యిచ్చినాడు. ఆయన సుమారు గంటసేపు మాట్లాడినాడు; ఆయన వాదాలు ప్రశాంతంగా, హుందాగా, చురుకుగా వెలువడినాయి; ప్రభుత్వ ప్రాక్యురేటర్‌మీదా, పాత బ్యూరోక్రసీమీదా, పాత సైన్యంమీదా, పాత కోర్టులమీదా, నియంతృత్వ సేవలో పుట్టి విద్యా భ్యాసం చేసి, ముసలివాళ్లైన పాత జడ్జీలమీదా ఆయన అంతకంతకూ యెక్కువ బలంతో దాడిచేసినాడు. "యిప్పుడు పత్రికల ప్రథమ కర్తవ్యం ప్రస్తుతం అమలులో వున్న రాజ కీయ వ్యవస్థయొక్క పునాదుల నన్నిటినీ దుర్బలపరచడం" అని మార్క్స్ అన్నాడు.

కొద్ది నెలల తర్వాత మార్క్స్ ప్రష్యానుండి బహిష్కరింపబడినాడు, ఎంగెల్సు బాడెన్‌కు పోయినాడు.... కొలోన్‌లో నిలిచినవాళ్లు తమ ఆందోళనను గ్రామీణ ప్రాంతానికి విస్తరింప జేసినారు, యెందుకంటే రైతులలో ఆందోళనయొక్క ప్రాముఖ్యాన్ని మేము అప్పటికే గ్రహించి నాము (1893లో నేను కొలోన్ పార్టీ మహాసభకు హాజరైనప్పుడు, కొలోన్ దగ్గర వున్న వోరింగెన్‌కు నన్ను కొంతమంది రైతులు ఆహ్వానించినారు. 1848, 1849నుండి వాళ్లకు నేను యింకా జ్ఞాపకం వుండినాను).

మా తీరిక సమయం తుపాకి గుండ్లు చేయడంలో గడిపినాము, అవి బాడెన్‌కు పంపబడేవి.

సహజంగానే వాటిని రహస్యంగా చేసేవాళ్లం. యెర్ర బెకెర్* సీసం గుండ్లూ, మందూ సంపాయించేవాడు, విప్లవానికి దోహదం చేయడానికి ప్రతిఒకదూ తనకు చేతనైంది చేసేవాడు....

5

అన్ని చోట్లా ప్రతీఘాత విప్లవం విజయం పొందింది.... కాని పోరాటం పూర్తికాలేదు. కమ్యూనిస్టు లీగు పునరుద్ధరింపబడి, కార్మికవర్గ పార్టీని రహస్యంగా నిర్మించడానికి చర్యలు తీసుకొంది. లండన్‌లో లీగులోకి రకరకాల సందేహాస్పద వ్యక్తులు ప్రవేశించినందున, మార్క్స్ ప్రతిపాదనమీద కేంద్ర కమిటీ కొలోన్‌కు మార్చబడింది. మైన్ట్స్‌లో నా కర్తవ్యం లీగుయొక్క స్థానిక సంస్థను పునరుద్ధరించి, కార్మికులను మా లక్ష్యాలవైపు మళ్లించడం. బయటికి చూడడానికి, మా ప్రచారమంతా కరపత్రాలు వ్యాప్తి చేయడం మాత్రమే. మేము యెంత బాగా నిర్మాణమై వుండినా మంటే, ఒక గంటలో మైన్ట్స్‌ని కరపత్రాలతో ముంచెయ్యగలిగే వాళ్లం. "నేరస్థులను" పట్టుకోవడంలో పోలీసులు ఒక్కసారి కూడా కృతకృత్యులు కాలేదు.

న్యూరెంబెర్గ్‌లో లీగును పునర్నిర్మాణం చేసే పనిని ఫ్రాంక్‌ఫుర్ట్ కామ్రేడ్లు నాకు 1850 అక్టోబర్‌లో అప్పగించినారు; ఆ పనిలో నేను కృతకృత్యుణ్ని అయినాను. దురదృష్ట వశాత్తు మా ఆందోళన చాలాకాలం సాగలేదు. మా జర్మన్ మాతృదేశంలో ఆ కాలంలో వినపడుతుండిన ఒకే ఒక విషయం యేమిటంటే అరెస్టులు. పోలీసు అధికారిది ఆనాడు పైచేయి. స్వాతంత్ర్యోద్యమాన్ని అణచగల యే సాధనాన్ని ఉపయోగించడానికైనా ప్రగతి వ్యతిరేకత వెను దీయలేదు.

1851 జూన్‌లో నేను కూడా మైన్ట్స్‌లో అరెస్టు అయినాను.

* * *

1852 అక్టోబర్ 4న నేను కొలోన్ జ్యూరీ యెదుట హాజరైనాను.... కేసు అయిదు వారాలకు పైగా జరిగింది. కేసు విచారణయొక్క వివరాలలోకి నేను యిక్కడ పోను; యెందు కంటే, మార్క్స్ "కొలోన్ కమ్యూనిస్టు కేసు విచారణ రహస్యాల వెల్లడి" అనే తన గ్రంథంలో వాటిని చెప్పినాడు....

శిక్ష నాకు పెద్ద ఆఘాతంగా వుండింది. నేను ఒక కోటలో మూడేండ్లు ఖైదు చేయాలి.... కానీ త్వరలోనే మనస్తిమితం పొందినాను. రిమాండుమీద జైలులో వుండడం

---

* జర్మన్ పత్రికారచయితా, కమ్యూనిస్టు లీగు సభ్యుడు అయిన హెర్మన్ బెకెర్‌కు మారుపేరు. — సం.

ముగిసిందని సంతోషించినాను. యెంత కాలం జైలులో వుండవలసిందీ, కనీసం అదైనా యిప్పుడు నాకు తెలుసు....

జైలులోని నాలుగున్నర సంవత్సరాలు నాకు భయంకరమైన దుస్స్వప్నంగా కనపడినాయి.... 1856 జనవరి 27న నేను విడుదల అయి స్వేచ్ఛ పొందినాను.

''స్వేచ్ఛ!'' — అప్పటి జర్మనీ ఒక విస్తారమైన జైలు కానట్లు! నాతోటి ఖైదీల బంధువులను చూడడానికి నేను బ్రెస్లౌకూ, ఎర్ఫుర్ట్‌కూ, ఫ్రైబుర్గ్‌కూ పోయి, తర్వాత వైమార్ చేరుకున్నప్పుడు నాకు వెంటనే కలిగిన అభిప్రాయం అది. అక్కడ నేను కొంత ఆందోళన చేయడానికి ప్రయత్నించినాను, కానీ ప్రజలు యెంత భయగ్రస్తులై వుండినారంటే, ''కమ్యూనిజం'' అనే మాటకే బెదురుతున్నారు.

నాకే యిల్లు లేదు. ప్రయాణ అనుమతి పత్రం కొరకు నేను అర్జీ పెట్టుకొన్న అధికార్లకు అపఖ్యాత కమ్యూనిస్టునైన నన్ను, తమ దేశ ప్రజలలో ఒకనిగా గుర్తించడం యిష్టం లేదు. వానివద్దకూ, వీనివద్దకూ చాలాసార్లు తిరిగిన తర్వాతనే, నేను కొన్ని కాగితాలు సంపాయించుకోగలిగినాను. అప్పుడు హాంబుర్గ్ ద్వారా లండన్‌కు పోయినాను....

## 6

1856 మేలో లండన్ చేరుకున్నాను. తరువాత త్వరలో నేను ఫ్రైలిగ్రాత్‌ను చూడడానికి పోయినాను.... ఆ తరువాత కార్ల్ మార్క్స్‌ను చూడడానికి పోయినాను. పోలీసులు స్వాధీనం చేసుకొన్న నా పుస్తక సంపదను భర్తీ చేయడానికి ఆయన అంత వరకు ప్రచురణ అయిన తన రచనలు నాకు బహుమతిగా యిచ్చినాడు. నేను 1848 నాటి నా పాత మిత్రులను కూడా వెదకి పట్టుకున్నాను — కార్ల్ ఫెండెర్, గెయోర్గ్ ఎక్కరియుస్ తదితరులను. అక్కడ నేను జర్మన్ ప్రవాసులను కూడా పరిచయం చేసుకున్నాను; వాళ్లలో చాలామంది లండన్‌లో వుంటూవుండినారు, అందులో విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్ ఒకడు. నేను పని సంపాయించుకున్నప్పుడు మళ్లీ కమ్యూనిస్టు వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీకి హాజరైనాను; అది అప్పుడు చాలా హీనస్థితిలో వుండింది. కారణం యేమంటే: 1848 విప్లవోద్యమం పతనమైన తర్వాత చాలామంది సభ్యులు సొసైటీని వదలిపెట్టినారు, తక్కినవాళ్లు క్రమక్రమంగా పెటీబూర్జువాలుగా మారినారు. సొసైటీలో యిక కమ్యూనిస్టు అభిప్రాయాల మట్టు కూడా లేదు, అది ఆద్యంతం నిర్జీవమైపోయింది, సరిగ్గా మన ఉదారవాదుల అభీష్టానికి తగినట్లుగా....

కమ్యూనిస్టు వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీలోని పరిస్థితి నాకు దుఃఖం కలిగించింది. నేను సభ్యులను పరిశీలన చేయడమూ, వాళ్లలో కొంతమందితో మైత్రి చేసుకోవడమూ ప్రారంభించినాను. యీ పనిలో నేను కృతార్థుణ్ణైన తర్వాత మేము పునాది పని ప్రారంభించినాము....

విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్ సొసైటీకి హాజరు కావడం ప్రారంభించినాడు; మార్క్స్ కూడా అలాగే ప్రారంభించి, అర్థశాస్త్రంమీద ఉపన్యాస పరంపర యిచ్చినాడు, అందుకుగాను యేమీ డబ్బు తీసుకోకుండా; ఆయన యావజ్జీవితంలోనూ కార్మికులనుండి ఒక్క పైసా కూడా డబ్బు తీసుకోలేదు. సొసైటీలో సభ్యత్వం పెరిగింది....

1860నుండి 1864వరకు నేను జ్ఞానాభివృద్ధిలో కాలం గడిపినాను. లండన్ విశ్వవిద్యాలయంలో హక్స్లీ, టిండాల్, హాఫ్మన్‌లు శరీరశాస్త్రం, భూగర్భశాస్త్రం, రసాయన శాస్త్రాలమీద యిచ్చిన ఉపన్యాసాలకు నేను క్రమం తప్పకుండా హాజరైనాను. యీ ప్రసిద్ధ శాస్త్రజ్ఞుల ఉపన్యాసాలకు మొత్తంమీద జర్మన్ కార్మికులు యెక్కువగా హాజరైనారు. యీ విషయంలో కూడా, మమ్మల్ని అలా చేయమని పురికొల్పింది కార్ల్ మార్క్సే; ఆయనే వాటికి అప్పుడప్పుడు హాజరైనాడు కూడా.

* * *

విచ్ఛిన్నమైన పాత కమ్యూనిస్టు లీగు 1864లో పునర్జన్మ ఉత్సవం జరుపుకుంది, పునర్జన్మ మరొక రూపంలోనే అయినప్పటికీ. అంతర్జాతీయ కార్మిక సంఘం (ఇంటర్నేషనల్) స్థాపించబడింది. సోషలిజంలో కార్మికులు మళ్లీ నిమగ్నులు కాసాగినారు, యెప్పుడూ లేనంత గాఢంగా కూడా. మా పాత కార్యకలాపాల ఫలితాలు పక్వమౌతూవుండినాయి....

కమ్యూన్ తర్వాత ఇంటర్నేషనల్‌కు కష్ట కాలం వచ్చింది. ప్రజాభిప్రాయాన్ని అదుపు చేసే బ్రిటిష్ పత్రికలు మమ్మల్ని నిందించి, దూషించేవి. ఒక దశలో మేము లండన్‌లో మా సమావేశాలకు భవనం సంపాయించుకోలేకపోయినాము. 1872 మార్చి 18న మేము కమ్యూన్ ప్రథమ జయంతి జరపాలనుకున్నప్పుడు, మేము అద్దెకు తీసుకున్న హాలు చుట్టూ పోలీసుల వలయం వుండడం చూసినాము. తరువాత నేను ఒక ప్రత్యేక భవనం అద్దెకు తీసుకునే యేర్పాట్లు చేసి, అందులో జనరల్ కౌన్సిల్ సమావేశాలు జరుపుకున్నాము. ఇంగ్లీషు పత్రికలను గురించి యూరపియన్ భూఖండంలోని అత్యధిక జనులు గొప్పగా అనుకుంటారు; నిజాని కవి జర్మన్ పత్రికలకంటె యేమీ మేలుకాదు. గత కొద్ది సంవత్సరాలలో యిది మరీ బాగా కనపడుతున్నది. ఉదాహరణకు, జర్మన్ సోషల్ డెమోక్రసీనుండి వచ్చే యే అనుకూల వార్తనైనా ఇంగ్లీషు పత్రికలు మూసిపెట్టేవి, లేదా వక్రీకరించేవి. కానీ జారునూ, బిస్మార్కునూ, క్రిస్పీనీ అవి ఆకాశం ఎత్తుకు పొగిడేవి. జర్మన్ బూర్జువా వర్గంకంటె ఇంగ్లీషు బూర్జువావర్గం కూడా యేమీ మేలు కాదు, దానికి మరింత ఉపాయమూ, కుయుక్తులూ వుండినప్పటికీ: అది కార్మికవర్గ ఉద్యమంతో పోరాడదు, కానీ ఉద్యమాన్ని కలుషితం చేయడానికి యే సాధనాన్నీ నిర్లక్ష్యం చేయదు.

1870 తర్వాత బయటనుండి ఇంటర్నేషనల్‌మీద జరిగే పోరాటం తీవ్రతరమైంది.

అత్యధిక ప్రభుత్వాలు దాన్ని బలపరిచేవాళ్లమీద చర్యలు తీసుకున్నాయి. ఫ్రాన్సులో ఒక ప్రత్యేక శాసనం కూడా చేయబడింది; ఇంగ్లీషు ట్రేడ్‌యూనియన్లలో దానికి వ్యతిరేకంగా ఆందోళనచేసేవాళ్లు వుండినారు. అంతే కాక, సంస్థ లోపల మిహయీల్ బకూనిన్* సాగించే గలీజు కుట్రలు వుండినాయి. ఆ కాలంలో మార్క్సు పరిస్థితి యేమీ అసూయపడవలసిందిగా లేదు. ఇంటర్నేషనల్ పని ఆయనమీద అమిత భారంగా వుండింది. ఇంటర్నేషనల్ తరపున ప్రచురింపబడిన ప్రణాళికలూ, విజ్ఞప్తులూ, యితర విషయాలూ అన్నీ ఆయన రాసేవాడు. అది కాక, ఆయనకు చాలా విస్తృతంగా ఉత్తరప్రత్యుత్తరాల పని వుండేది, లండన్‌కు వలస వచ్చిన కమ్యూనార్డులు ఆయన కాలాన్ని యెక్కువగా హరించేవాళ్లు. ఆయన యే ఆదాయమూ లేకుండా అందరినీ సంతృప్తి పరిచేవాడు, తన జీవనానికి ఘోరమైన పోరాటం చేయవలసి వుండినప్పటికీ. ఆయన కుటుంబ ఖర్చులు పెరుగుతూనే వుండినాయి, ముఖ్యంగా కమ్యూన్ తర్వాత. ఆయన యింట్లో యెప్పుడూ అనేకమంది ఫ్రెంచి ప్రవాసులు కనపడేవాళ్లు, వాళ్లకు ఆ యింట్లోనే వసతీ, భోజనమూ. మార్క్సు భార్యకు అది మరీ కష్టకాలంగా వుండింది. ఆమె సలహాకోసమో, యేదైనా కుటుంబ సమస్యను చర్చించడానికో తరుచుగా నావద్దకూ, నా భార్యవద్దకూ వచ్చేది. కానీ ఆమె కార్మికవర్గ ఉద్యమంలో మనస్ఫూర్తిగా, చురుకుగా పాల్గొనడానికి అవన్నీ అడ్డుపడలేదు.

బకూనిన్‌తో పోరాటం హేగ్ మహాసభలో అటో యిటో తేలిందాకా జరగవలసి వుండింది. బకూనిన్ అక్కడ వుంటానని వాగ్దానం చేసినాడు. అందువలన మార్క్సు కూడా పోవడానికి నిర్ణయించుకున్నాడు, బకూనిన్‌తో వివాదం తేల్చుకోడానికి. హేగ్ మహాసభ ఒక్కటే మార్క్సు హాజరైన ఇంటర్నేషనల్ మహాసభ. యితర మహాసభల సందర్భాలలో ఆయన లండన్‌లోనే వుండిపోయి, మహాసభలలో రాణించే అవకాశం యితరులకు వదలిపెట్టినాడు. చివరకు ఆయన హేగ్‌కు పోవడానికి నిర్ణయించుకున్నాడంటే, బకూనిన్ కుట్రలను శాశ్వతంగా అంతంచేయడానికే. ఫ్రెడరిక్ ఎంగెల్సు కూడా అక్కడికి పోయినాడు. మార్క్సు భార్యకూ, పిల్లలకూ ఆ సందర్భంగా అక్కడికి పోయే అవకాశం లభించింది.

మహాసభ 1872 ప్రారంభంలో జరిగింది. 65మంది ప్రతినిధులు హాజరైనారు....

మిహయీల్ బకూనిన్ మాట నిలుపుకోలేదు; అతను మహాసభకు రాలేదు. కానీ అతని తొత్తులు అక్కడ వుండి, హీనమైన పాత్ర నిర్వహించినారు. మహాసభ తేల్చవలసిన సమస్యలు

---

* బకూనిన్, మిహయీల్ అలెక్సాంద్రొవిచ్ (1814–1876) – రష్యన్ విప్లవకారుడూ, పత్రికారచయితా, అరాజకవాద సిద్ధాంతవేత్త; మొదటి ఇంటర్నేషనల్‌లో మార్క్సిజంపట్ల బద్ధవైరం వెలిబుచ్చినాడు. చీలదీత కార్యకలాపాలకు ఇంటర్నేషనల్‌నుండి వెళ్లగొట్టబడినాడు. – సం.

రెండు వుండినాయి: 1) జనరల్ కౌన్సిల్ స్థానాన్ని మార్చడం; 2) ఇంటర్నేషనల్‌నుండి బకూనిన్‌ను బహిష్కరించడం. మొదటి అంశంమీద ఫ్రెడరిక్ ఎంగెల్సు మాట్లాడినాడు; ఆయన జనరల్ కౌన్సిల్‌ను న్యూయార్కుకు మార్చడానికి అనుకూలత వ్యక్తం చేసినాడు. ఆయన ప్రతిపాదన ఆమోదింపబడింది. బకూనిన్ బహిష్కరణ రహస్య సమావేశంలో జరి గింది: మార్క్సు వ్యతిరేకులు కూడా బకూనిన్ కుట్రలను ఖండించి అతని బహిష్కరణకు అనుకూలంగా ఓటుచేసినారు....

మార్క్సు హేగ్‌లో వుండగా, అక్షరాలా ప్రతి దేశపు ప్రాతినిధులూ ఆయన్ను చుట్టు ముట్టినారు: ప్రతి ఒకరూ ఆయన్ను చూడాలనీ, ఇంటర్నేషనల్ లక్ష్యాలమీదా, కోరికలమీదా ఆయన అభిప్రాయం తెలుసుకోవాలనీ కోరినారు....

1872 నాటి హేగ్ మహాసభ పాత ఇంటర్నేషనల్‌యొక్క చివరి ఘటన. విడివిడి ఫెడ రేషన్లు రద్దై, వాటి స్థానంలో మరింత పెద్ద జాతీయ సంస్థలు వెలసినాయి.

ఇంటర్నేషనల్ తన కర్తవ్యాలలో చాలా భాగమే నిర్వర్తించింది: సోషలిజం, దాని నాయ కుడైన కార్ల్ మార్క్సుచేత ఆర్థికంగానూ, తాత్వికంగానూ సమర్థింపబడింది; ఇంట ర్నేషనల్ ఆ బోధను నాగరిక ప్రపంచపు నలుమూలలా వ్యాప్తిచేయడంలో ప్రథమ సంస్థగా వుండింది; అది, ఆర్థిక, బౌద్ధిక పరిస్థితులను బట్టి, ఒకచోట యెక్కువ వేగంగానూ, ఒకచోట తక్కువ వేగంగానూ స్థిరపడింది. ఇంటర్నేషనల్‌నుండి మార్క్సు కూడా అంతకంటె యెక్కువ ఆశించలేదు.

## 7

దాదాపు ఆ కాలంలో నేను మార్క్సు యింటికి తరుచుగా పోతూవుండినాను. ఆయన యింటిలో ప్రతి విశ్వసనీయమైన కామ్రేడుకూ ప్రవేశం లభించింది. అనేకమంది యిత రులలాగే, మార్క్సు కుటుంబ సభ్యులతో నేను గడిపిన అహ్లాదకరమైన గడియలు యెన్నటికీ మరిచిపోలేను. మార్క్సు భార్య నామీద మరీ గాఢమైన ప్రభావ ముద్ర వేసింది. ఆమె పొడగరి, మహా అందమైన మనిషి, చాలా అసాధారణ గుణాలు గల వ్యక్తి — కానీ ఆమె యెంత సౌమనస్యం గలదంటే, యెంత ప్రేమాస్పదురాలంటే, యెంత చమత్కారంగా మాట్లాడే దంటే, ఆమెకు గర్వమూ, బెట్టుసరీ యెంత బొత్తిగా లేవంటే, ఆమె సమక్షంలో వున్నప్పుడు మన అమ్మ సమక్షంలోనో, అక్క సమక్షంలోనో వున్నంత స్వేచ్ఛగా, నిస్సంకోచంగా వుంటుంది.... నేను యింతకు ముందే చెప్పినట్లు, కార్మికవర్గ ఉద్యమం పట్ల ఆమెకు మహా ఉత్సాహం వుండింది; బూర్జువావర్గంమీద దాని ప్రతి విజయమూ, అది యెంత చిన్నదైనా సరే, ఆమెకు అత్యంత సంతృప్తీ, సంతోషమూ యిచ్చేవి.

మార్క్సు యెల్లప్పుడూ కార్మికులతో సమావేశాలకూ, సంభాషణలకూ ప్రత్యేక

ప్రాముఖ్యం యిచ్చినాడు. ఉద్యమంమీద వాళ్ల అభిప్రాయం తెలుసుకోవడం చాలా ముఖ్యమని ఆయన పరిగణించినాడు; తన్ను ముఖస్తుతి చేయకుండా, తనతో మోమోటం లేకుండా మాట్లాడేవాళ్ల సాహచర్యం కొరకు ఆయన ప్రయత్నించేవాడు. అత్యంత ముఖ్యమైన రాజకీయ, ఆర్థిక సమస్యలు వాళ్లతో చర్చించడానికి ఆయన యెప్పుడూ సిద్ధంగా వుండినాడు. వాళ్లు ఆ సమస్యలను బాగా అర్థం చేసుకుంటున్నారో లేదో ఆయన త్వరగా తేల్చుకునేవాడు; వాళ్లు యెంత బాగా అర్థం చేసుకుంటే, అంత యెక్కువగా ఆయన సంతోషించేవాడు.

ఇంటర్నేషనల్ వుండిన కాలంలో ఆయన ఒక్క జనరల్ కౌన్సిల్ సమావేశానికి కూడా హాజరు కాకుండా వుండలేదు. సమావేశాల అనంతరం మార్క్సు, కౌన్సిల్ సభ్యులమైన మాలో అత్యధికులుగా ఒక గ్లాసు బీరు తాగి, కబుర్లు చెప్పుకోడానికి మంచి హోటల్‌కు పోయే వాళ్లం. యింటికి పోయేటప్పుడు మార్క్సు మామూలు పనిదినం గురించి సాధారణంగానూ, యెనిమిది గంటల పనిదినం గురించి ప్రత్యేకంగానూ తరుచుగా మాట్లాడేవాడు. చాలాసార్లు ఆయన యీ మాట అన్నాడు: "మనం యెనిమిది గంటల పనిదినం కోసం పోరాడుతున్నాం, కానీ తరుచుగా అంతకు రెండంతలు పనిచేస్తున్నాం...."

నిజానికి, దురదృష్టవశాత్తు, మార్క్సు మరీ మితిమీరి పనిచేసేవాడు. ఇంటర్నే షనల్ ఒక్కటే ఆయన శ్రమశక్తినీ, ఆయన కాలాన్నీ యెంతగా హరించిందో బయటి వాళ్ల ఊహ కందదు. అయినప్పటికీ, ఆయన తన బతుకుదెరువుకు శ్రమపడవలసి వుండింది; చరిత్రమీదా, అర్థశాస్త్రంమీదా తన రచనలకు కావలసిన సమాచారం కోసం బ్రిటిష్ మ్యూజి యంలో గంటలకొలది అధ్యయనం చేయవలసి వుండింది. ఆయన ఉత్తర లండన్‌లో, హవెర్ స్టాక్ హిల్‌లో, మేయిట్లండు పార్కు రోడ్డులోని తన యింటికి పోయేటప్పుడు, నేను మ్యూజి యంకు అనతి దూరంలో నివసిస్తూ వుండినాను గనుక, ఇంటర్నేషనల్‌కు సంబంధించిన యేదో ఒక సమస్యను చర్చించడానికి, తరుచుగా మా యింటికి వచ్చేవాడు. యింటికి పోయిన తర్వాత, భోంచేసి, కాసేపు విశ్రమించి, తరువాత మళ్లీ పని యెత్తుకునేవాడు. తరుచుగా, ఆయన రాత్రి పొద్దు పోయిందాకా, తెల్లవారుజాముదాకా కూడా పనిచేసుకునేవాడు, ముఖ్యంగా ఆయన స్వల్ప సాయంకాల విశ్రాంతి తరుచుగా పార్టీ కామ్రేడ్ల ఆగమనంచేత కత్తిరింపబడి నందున.

నిజంగా గొప్పవాళ్లైన అందరిలాగే మార్క్సుకు గర్వం అనేది బొత్తిగా లేదు. చిత్త శుద్ధితో చేసే ప్రతి ప్రయత్నాన్నీ, స్వీయాశ్రిత యోచనమీద ఆధారపడిన ప్రతి అభిప్రాయాన్నీ ఆయన మెచ్చుకునేవాడు. నేను యింతకుముందే చెప్పినట్లు, కార్మికవర్గ ఉద్యమంమీద అత్యంత మామూలు కార్మికుల అభిప్రాయాన్ని వినడానికి ఆయన యెప్పుడూ ఉత్సుకత వహించినాడు. ఆ విధంగా ఆయన తరుచుగా నాదగ్గరకు వచ్చి, నన్ను తనతో షికారు తీసుక పోయి, రకరకాల విషయాలను గురించి నాతో మాట్లాడేవాడు. సహజంగా నేను ఆయన్నే

వీలైనంత సంభాషణ చేయనిచ్చేవాణ్ని. యెందుకంటే ఆయన మాట్లాడుతుంటే, తన వాదాలను వివరిస్తుంటే, వినడం నిజమైన ఆహ్లాదంగా వుండేది. ఆయన సంభాషణతో నేను యెప్పుడూ మైమరచి పోయేవాణ్ని, ఆయన్ను వదలిపెట్టి పోవాలంటే నాకు కష్టంగా వుండేది.

మొత్తంమీద ఆయన అద్భుతమైన సహచరుడు; తనదగ్గరికి వచ్చినవాళ్లందరినీ బలంగా ఆకర్షించేవాడు, సమ్మోహింపజేసేవాడు కూడా. ఆయన వాక్చమత్కృతి తరగనిది, ఆయన నవ్వు హృదయంనుండి సూటిగా వచ్చేది. మన పార్టీ కామ్రేడ్లు యే దేశంలోనైనా ఒక విజయం సాధిస్తే, ఆయన పరమ నిస్సంకోచంగా ఆనందించేవాడు, కోలాహలంగా సంతోషించేవాడు, ఆయన ఆనందం చుట్టూ వున్నవాళ్ల కందరికీ అంటుకునేది.

మార్క్స్ ముగ్గురు కూతుర్లూ తమ తొలి యవ్వనంనుండి ఆనాటి కార్మికవర్గ ఉద్యమంలో అత్యంత మనస్ఫూర్తిగా ఆసక్తి కలిగించుకున్నారు; ఆ ఉద్యమం మార్క్స్ కుటుంబంలో మాట్లాడుకునే ప్రధాన విషయం. మార్క్స్‌కూ, ఆయన కుమార్తెలకూ మధ్య వుండిన సంబంధాలు మనం ఊహించగలిగినంత అత్యంత సన్నిహితంగా, అరమరికలు లేకుండా వుండినాయి. కుమార్తెలు తమ తండ్రిని ఒక సోదరునిలాగో, మిత్రునిలాగో చూసేవాళ్లు; పితృ అధికారపు బాహ్య లక్షణాలంటే మార్క్స్‌కు అసహ్యం. గురుతరమైన విషయాల్లో ఆయన తన పిల్లలకు సలహాదారుడు; యితరత్రా, ఆయన తీరికను బట్టి, ఆయన వాళ్లతో కలిసి ఆడుకునే చెలికాడు.

మార్క్స్‌కు మొత్తంమీద పిల్లలంటే చాలా యిష్టం. బైబిల్‌లోని ఏసుక్రీస్తులో తనకు అన్నిటికంటె యెక్కువగా నచ్చినది యేదంటే పిల్లలమీద క్రీస్తుకుండిన మహాప్రేమ అని ఆయన తరుచుగా అనేవాడు. తరుచుగా, తనకు నగరంలో యేమీ పనిలేక, హాంప్‌స్టెడ్ హీథ్‌కు షికారు పోయినప్పుడు, ''పెట్టుబడి'' రచయిత గుంపెడు పిల్లలతో కలిసి అటూ యిటూ హుషారుగా తిరగడం కనిపించేది.

ఆయన పెద్ద కూతురు, తల్లి కుండిన గుణాలన్నీ కలిగినట్టిది — ఆ తల్లి కుండినవి సద్గుణాలు మాత్రమే — 1883లో మరణించడం మార్క్స్‌కు అత్యంత క్లిష్టమైన, భవితవ్య నిర్ణయాత్మకమైన కాలంలో తగిలిన కొత్త దెబ్బ. పన్నెండు మాసాల క్రితమే, 1881 డిసెంబర్ 2న, ఆయన విశ్వాసపూరిత జీవిత సహచారిణిని కోల్పోయినాడు. యీ దెబ్బలు యెలాంటి వంటే, వాటినుండి ఆయన మళ్లీ కోలుకోలేదు.

మార్క్స్‌కు అప్పటికే పాడు దగ్గు వుండింది. ఆ దగ్గు వింటే ఆయన విశాల దృఢ కాయం బద్దలౌతుందేమో అనిపించేది. అనేక సంవత్సరాల నిరంతర అమిత శ్రమ ద్వారా ఆయన దేహతత్వం దుర్బలపడినందున యీ దగ్గు ఆయన్ను మరీ బాధించింది.

70ల మధ్యలో డాక్టర్లు ఆయన్ను పొగ తాగకుండా నిషేధించినారు. ఆయన యెక్కువగా

పొగతాగేవాడైనందున, యిది ఆయనకు దారుణమైన త్యాగంగా వుండింది. డాక్టర్ల ఆదేశం తర్వాత మొదటిసారి నేను ఆయనవద్దకు పోయినప్పుడు, ఆయన యెంతో సంతృప్తితో, గర్వంతో నాతో చెప్పినాడు, తాను యెన్ని రోజులుగా పొగ తాగందీ, డాక్టర్లు మళ్లీ అనుమతించిందాకా తాగననీ. తరువాత నేను ఆయనవద్దకు పోయిన ప్రతిసారీ ఆయన నాతో చెప్పేవాడు, ధూమపానం వదలిపెట్టి యెన్నాళ్లైందీ, ఆ కాలమంతటిలోనూ తాను బొత్తిగా ధూమపానం చేయలేదనీ. తనకు అది సాధ్య మౌతుందని ఆయనే నమ్మినట్లు లేదు. కొంత కాలం తర్వాత డాక్టరు రోజుకు ఒక చుట్ట అనుమతించినప్పుడు ఆయన సంతోషం మరింత యెక్కువగా వుండింది....

* * *

మార్క్స్ మరణించినాడని తెలుపుతూ ఎంగెల్సు రాసిన జాబు నాకు 1883 మార్చి 15న అందింది. ఆ వార్తకు కంపించిపోయినాను. కార్మికవర్గ ఉద్యమం యెంత నష్టపడిందీ మార్క్స్ విశ్వాసం పొందిన పరిచయస్తులకు తెలుసు. అది కోల్పోయింది గొప్ప తెలివీ, విస్తారమైన పాండిత్యమూ గల వ్యక్తిని మాత్రమే కాదు; స్థిరమైన, ఉక్కులాంటి వ్యక్తిత్వం గలవాణ్ని అది కోల్పోయింది. ఆయనతోపాటు యెంత అపారమైన జ్ఞానం సమాధిలో పూడ్చిపెట్టబడిందీ ఆయన వదలిపెట్టి పోయిన రచనల ద్వారా రుజువైంది — ఆయన రాయదలచుకున్నదానిలో పదోవంతు కూడా వాటిలో లేకపోయినా. ఆయన వీర వ్యక్తిత్వానికి పోరాటంలోనూ, త్యాగంలోనూ సంపన్నమైన ఆయన జీవిత మంతా సాక్ష్యం.

కార్మిక జనాలు త్వరగానో, ఆలస్యంగానో తనను అర్థం చేసుకుంటారనీ, బూర్జువా సమాజాన్ని కూలదోయడానికి కావలసిన బలం తన బోధలనుండి పొందుతారనీ, నూతన సమాజ నిర్మాణానికి స్వచ్ఛమైన చైతన్యంతో కృషి చేస్తారనీ మార్క్స్‌కు దృఢమైన విశ్వాసం వుండింది.

# ఫ్రీడ్రిఖ్ లెస్నెర్

## ఫ్రెడరిక్ ఎంగెల్సును గురించి ఒక కార్మికుని స్మృతులు*

నేను శాశ్వతంగా కన్ను మూసేముందు, ఆ మహా యోధుడైన ఫ్రెడరిక్ ఎంగెల్సుతో నాకు గల దీర్ఘ పరిచయానికీ, మైత్రికీ సంబంధించిన స్మృతులు చెప్పనివ్వండి. ఆయన మరణం తర్వాత ఆయన్ను గురించి చాలా రాసినారు, చెప్పినారు; అయినప్పటికీ, 1847 నుండి ఆయనతో నాకు గల సాహచర్యపు అనుభవం చెప్పడం సమర్థనీయమని అనుకుంటాను.

నేను చెప్పేది నేను కోరేటంత సంపూర్ణంగా వుండదని ఒప్పుకుంటాను. నేను ఎంగెల్సును పరిచయం చేసుకున్నప్పటినుండి అర శతాబ్ది గడిచింది; నేను ప్రతిదీ జ్ఞాపకం చేసుకొని రాయాలి. నా వృద్ధాప్యం కూడా ఒక ఆటంకం; నా చేయి రాయడానికి నేను కోరినంత స్థిరంగా యిక యెంతమాత్రమూ లేదు; అందువలన నేను చెప్పేది వుండవలసినంత బాగా లేకపోతే, నన్ను క్షమిస్తారని ఆశిస్తాను.

### 1

ఫ్రెడరిక్ ఎంగెల్సుతో, కార్ల్ మార్క్సుతో కూడా, నా మొదటి పరిచయం, లండన్‌లో, 1847 అంతంనాటి ఆ ఆసక్తికరమైన దశలో జరిగింది. అది జరిగింది కమ్యూనిస్టు వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీలో; ఆ కాలంలో అనుబంధం కలదీ, యింకా జీవించివున్నదీ, యీనాటి కార్మికవర్గ ఉద్యమాన్ని వెనకేసుకవస్తున్నదీ, ఆ సొసైటీ ఒక్కటే.** ఆ పరిచయం జరిగింది యీనాటి అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమం స్థాపించబడిన ఆ స్మరణీయమైన మహాసభలో, కొత్త ఉద్యమంయొక్క సూత్రాలమీదా, యెత్తుగడలమీదా ఏకాభిప్రాయానికి రావడా

---

*1901లో ప్రచురించబడింది. – సం.

** 19వ శతాబ్ది అంతానికి ఆ సొసైటీ మామూలు క్లబ్బు స్థితికి దిగజారి పోయింది. – సం.

నికి మార్క్సు, ఎంగెల్సు, విల్‌హెల్మ్ వొల్ఫ్ బెల్జియన్ కామ్రేడ్ తెదెస్కోతో కలిసి లండన్‌కు వచ్చినారు. "కమ్యూనిస్టు ప్రణాళిక"ను రచించే పని ఆ కమ్యూనిస్టు మహాసభలో మార్క్సు, ఎంగెల్సులకు అప్పగించబడిందని యీనాడు యావత్ప్రపంచానికీ తెలుసు.

నేను అప్పటికే, 1847లోనూ, 1848లోనూ వచ్చిన "దోయిచె బ్ర్యుసెలెర్ సైటుంగ్" ద్వారా, మార్క్సు, ఎంగెల్సుల గురించి విన్నాను. ఎంగెల్సు పుస్తకం "ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి," 1845లో మొదటి కూర్పు ప్రచురింపబడినది, లండన్‌లోని కమ్యూనిస్టు వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీలో అమ్మకమౌతూ వుండింది.

అది నేను కొన్న మొదటి పుస్తకం, దానిద్వారా కార్మికవర్గ ఉద్యమం గురించి నా మొదటి అభిప్రాయం ఏర్పడింది. ఆ కాలంలో నేను మరొక పుస్తకంనుండి మాత్రమే నేర్చుకున్నాను; అది వైట్లింగ్ రచించిన "సామరస్య స్వేచ్ఛలకు హామీలు."

లండన్‌లో మార్క్సు, ఎంగెల్సు, వొల్ఫ్ మొదలైనవాళ్ల ఉనికి కమ్యూనిస్టు వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులమీదనే కాక, కమ్యూనిస్టు లీగు సభ్యులమీద కూడా గొప్ప ప్రభావ ముద్ర వేసింది. మహాసభనుండి యెంతో ఆశింపబడింది. ఆ ఆశలు భగ్నం కాలేదు; తద్భిన్నంగా అంతకు మించి జరిగింది. యీ స్మరణీయమైన సమావేశపు ప్రముఖ ఫలితమైన "కమ్యూనిస్టు ప్రణాళిక"యొక్క ప్రచురణ నా మాటకు ప్రత్యక్ష నిదర్శనం.

బాహ్యాకారంలో కార్ల్ మార్క్సు కంటె ఎంగెల్సు భిన్నం. ఆయన పొడవుగా, సన్నగా వుండేవాడు, ఆయన కదలికలు వేగంగా, చురుకుగా వుండేవి, ఆయన మాట్లాడే పద్ధతి సంక్షేపంగా, నిర్ణయాత్మకంగా వుండేది. ఆయన నడక నిటారుగా, సైనిక లక్షణం కలిగి వుండేది. ఆయనది చాలా సరదా అయిన స్వభావం, ఆయన చమత్కారం సందర్భశుద్ధిగా వుండేది. ఆయనతో సంబంధం గల ప్రతివానికీ గొప్ప తెలివిపరునితో వ్యవహరిస్తున్నా ననే అభిప్రాయం అనివార్యంగా కలిగేది....

కొత్తవాళ్లతో ఎంగెల్సు ముభావంగా వుండేవాడు, వయస్సు పెరిగిన తర్వాత మరింతగా. ఆయనను గురించి మనకు సరైన అభిప్రాయం కలగాలంటే ఆయనతో మనకు బాగా పరిచయం వుండాలి; అలాగే ఆయనకు మనం పూర్తిగా పరిచయ మైనప్పుడు మాత్రమే మనదగ్గర ఆయన మనసు విప్పేవాడు....

ఆయన దగ్గర యెవరూ నటన చేయలేరు: కట్టుకథలతో తన్ను ప్రాధేయపడుతున్నారా, మెలికలు లేకుండా సత్యం చెప్పుతున్నారా అనేది ఆయన వెంటనే గ్రహించేవాడు. ఎంగెల్సు మనుషులను బాగా అంచనా వేయగలిగినవాడు, కొన్ని సందర్భాలలో పొరపాటు పడినప్పటికీ....

ఎంగెల్సుకు పాత ఇంగ్లీషు మిత్రుడైన జార్జ్ జూలియన్ హార్నీ మాటలు ఉటంకించకపోతే ఎంగెల్సు చిత్రం అసంపూర్ణంగా వుంటుంది. అతను చార్టిస్టు పత్రిక "నార్దర్న్ స్టార్" సంపాదకుడు, ఎంగెల్సును 1843నుండి యెరిగినవాడు. ఎంగెల్సు మరణం తర్వాత హార్నీ

యిలా రాసినాడు: "ఎంగెల్సు 1843లో బ్రాడ్‌ఫర్డ్‌నుండి లీడ్సుకు వచ్చేసి, 'నార్దర్న్ స్టార్' కార్యాలయంలో నాకోసం విచారించింది. పొడవైన అందమైన యువకుడు; ముఖంలో దాదాపు కుర్రవాళ్లకుండే పసితనం; జర్మన్‌గా పుట్టి, జర్మనీలో చదువుకున్నా, ఆయన ఇంగ్లీషు గమనించదగినంత నిర్దుష్టమైనది. 'నార్దర్న్ స్టార్' నిత్యం చదువుతుంటాననీ, తనకు చార్టిస్టు ఉద్యమంలో గాఢమైన ఆసక్తి వుందనీ ఆయన నాతో చెప్పినాడు. ఆ విధంగా 50 యేండ్ల క్రితం మా మైత్రి ప్రారంభమైంది."

ఎంగెల్సుకు యెంత పని వున్నప్పటికీ, తన మిత్రులకొరకు తీరిక చేసుకొని, అవసరమైనప్పుడు వాళ్లకు సలహాలూ, సహాయమూ యిచ్చేవాడని హార్నీ రాసినాడు. ఆయన విస్తారమైన పాండిత్యమూ, ఆయన పలుకుబడీ యెప్పుడూ ఆయనను "యెత్తున" వుండేటట్లు చేయలేదు. అందుకు భిన్నంగా ఆయన 75 యేండ్ల వయస్సులో, 22 యేండ్ల వయస్సులో వుండినట్లే నమ్రత గలిగి, యితరుల కృషిని గుర్తించడానికి సిద్ధంగా వుండినాడు. ఆయన అసాధారణమైన అతిథి సత్కారశీలి, హాస్యోక్తులంటే యిష్టపడేవాడు, ఆయన నవ్వు అందరికీ అంటుకునేది. సంభాషణకు ఆయన ఆత్మవంటివాడు; ఆయన తన అతిథులను – ఆయన సంబంధాలు ఓవెన్* సహచరులతో, చార్టిస్టులతో, ట్రేడ్‌యూనియన్లవాళ్లతో, సోషలిస్టులతో – స్వేచ్ఛగా, నిస్సంకోచంగా వుండేటట్లు చేసేవాడు.

## 2

ఎంగెల్సుతోనూ, మార్క్సుతోనూ నాకు మరింత సన్నిహిత పరిచయం కొలోన్‌లో యేర్పడింది; 1848 జూన్ అంతంలో నేను లండన్‌నుండి అక్కడికి చేరినాను. అక్కడ నేను "నోయె రైనిషె సైటుంగ్" సంపాదకవర్గానికి పరిచయం చేయబడినాను; నేను దర్జీవాణ్ని అని ఎంగెల్సుకు తెలుసు, ఆయన నాకు తన "ఆస్థాన దర్జీవాడు"గా పేరుపెట్టినాడు. కానీ ఆయనకు నేను చేసిందల్లా ఆయన దుస్తులను పోయినవాటిని భర్తీచేయడమూ, లోటుపాట్లు సరిచేయడమూ. ఎంగెల్సు కానీ, మార్క్సు కానీ దుస్తులకు పెద్ద ప్రాముఖ్యం యివ్వలేదు; ఆ కాలంలో వాళ్ల ఆర్థిక పరిస్థితి కూడా యేమీ ఉజ్వలంగా లేదు.

నేను అప్పుడు బాగా చిన్నవాణ్ని, ముందుకు తోసుకపోయే అలవాటు నాకు యెప్పుడూ లేదు. కనుక మేము అత్యధికంగా బహిరంగ సభల్లోనూ, లేదా యితర సందర్భాలలోనూ కలుసుకొనేవాళ్లం, ఒకరినొకరు యుద్ధరంగంలోని సహయోధులలాగా పలకరించుకునేవాళ్లం. మా సాహచర్యం కొద్దిపాటిదైనా, ఆ యిద్దరు అరుదైన వ్యక్తుల విలువను గ్రహించడం ఆ కాలంలో తెలుసుకున్నాను, భవిష్యత్తులో వాళ్లనుండి నేను చాలా ఆశించినాను.

---

* ఓవెన్, రోబెర్ట్ (1771–1858) – గొప్ప ఇంగ్లీషు ఊహాస్వర్గ సోషలిస్టు. – సం.

సమకాలిక సమాజం గురించి వాళ్ల కుండిన జ్ఞానంయొక్క కచ్చితత్వం గురించి యే సందేహానికీ తావు లేకుండా చేసింది "కమ్యూనిస్టు ప్రణాళిక." అది సులభ గ్రాహ్య పద్ధతిలో రాయబడినందున, వర్గవైరుధ్యాలు మామూలు కార్మికుని అవగాహనకు అందుబాటులోకి వచ్చినాయి. కానీ, తమకు జ్ఞానమే కాక, అచంచలమైన సంకల్పం కూడా వుందని మార్క్సు, ఎంగెల్సులు మొదట నిజంగా వెల్లడించింది "నోయె రైనిషె సైటుంగ్"లో.

తాము యెంత అధికతర వ్యతిరేకులను యెదుర్కోవలసి వుండిందీ నలుపు తెలుపు ప్రగతి వ్యతిరేకులు* త్వరగా తెలుసుకొని, "నోయె రైనిషె సైటుంగ్"ను తమ దారినుండి తొలగించడానికి తమ శక్తినంతా వినియోగించినారు. యీ పనిలో కృతార్థులు కాలేక, పత్రికను అణచివేయడానికి వాళ్లు మరింత తీవ్ర చర్యలకు పూనుకున్నారు. "రైన్ ప్రజాతంత్రవాదుల కమిటీ"మీద రెండు కేసులు నడపబడినాయి, మొదటిది ఫిబ్రవరి 7నా, రెండవది ఫిబ్రవరి 8నా. రెండిటికీ నేను ఆసక్తితో హాజరైనాను. నలుపు తెలుపు ప్రగతి వ్యతిరేకులు యెంత గొప్ప ఆధిక్యతతో యెదుర్కోబడిందీ చూడడమూ, వినడమూ ఆహ్లాదంగా వుండింది. యీ యిద్దరు వ్యక్తులను వీళ్ల వ్యతిరేకులు కూడా మెచ్చుకోకుండా వుండలేక పోయినారు!

"నోయె రైనిషె సైటుంగ్" బలవంతంగా అణచివేయబడిన తర్వాత, కార్ల్ మార్క్సు న్యాయశాస్త్రవిరుద్ధంగా బహిష్కరింపబడిన తర్వాత సంపాదకవర్గ సభ్యులు దిక్కుదిక్కులకూ చెదరిపోయినారు. మార్క్సు పారిస్‌కు పోయినాడు. ఎంగెల్సు ప్ఫాల్‌త్స్‌కు పోయినాడు, అక్కడ రైన్ రాజ్యాంగ ఉద్యమం ప్రజ్వలించివుండింది. ప్ఫాల్‌త్స్‌లో ఆయన యేమి చేసిందీ రైన్ రాజ్యాంగ ఉద్యమంమీద ఆయన రాసిన వ్యాసం ద్వారా తెలుసుకోగలం; ఆయన ఆ వ్యాసం కార్ల్ మార్క్సు సంపాదకత్వంకింద, 1850లో, లండన్, హాంబుర్గ్, న్యూయార్కులలో ప్రచురింపబడిన "నోయె రైనిషె సైటుంగ్. పొలిటిష్-ఓకొనామిషె రెవ్యూ" కొరకు రాసినాడు.

## 3

బాడెన్‌లో విప్లవం ఓడిపోయిన తర్వాత ఎంగెల్సూ, అనేక యితర యోధులూ స్విట్జర్లెండుకు పారిపోవలసి వచ్చింది. అక్కడ ఎంగెల్సు కొద్ది కాలం మాత్రం వుండి, తరువాత లండన్‌కు పోయినాడు. అక్కడ ఆయన మార్క్సునూ, యెంతోమంది జర్మన్ ప్రవాసులనూ చూసినాడు.

ఎంగెల్సుకూ, మార్క్సుకూ, ఆయన కుటుంబానికీ – యిద్దరికీ బతకడానికి యే ఆధారమూ లేనందున – చాలా గడ్డు కాలం ప్రారంభమైంది. ఎలినోర మార్క్సు తన రచనల్లో ఆ గడ్డు కాలం గురించి చెప్పింది.

---

*ప్రష్యన్ ప్రగతి వ్యతిరేకులు: నలుపు, తెలుపు ప్రష్యన్ జండా రంగులు. – సం.

కమ్యూనిస్టు ఎడ్యుకేషనల్ సొసైటీలో మార్క్సు, ఎంగెల్సు, లీబ్‌క్నెఖ్ట్, విల్‌హెల్మ్ వోల్ఫ్, తదితరులు చురుకైన పాత్ర వహించింది ఆ కాలంలోనే. ఆ సొసైటీలో రకరకాల ధోరణుల రాజకీయ ప్రవాసులు చాలామంది వుండినారు. ఆ కాలంలో జరిగిన రాజకీయ ఘటనలమీదా, భవిష్యత్తును గురించీ, యెలాంటి విభేదాలు వుండినాయంటే, ప్రవాసంలోని జీవితంలో యెంత సంకటం వుండిందంటే, త్వరలోనే ఘర్షణ ప్రారంభం కావడంలో ఆశ్చర్యం లేదు.

కొత్త "కమ్యూనిస్టు లీగు" సంస్థను స్థాపించిన ఫలితంగా – ఆ స్థాపనకు మార్క్సు, ఎంగెల్సూ వాళ్ల కామ్రేడ్లూ ప్రధాన పాత్ర వహించినారు – వాళ్లకూ విల్లిహ్, షాపెర్, వాళ్ల సహచరులకూ మధ్య ఉద్రిక్త వాదోపవాదాలు చెలరేగినాయి, ముఖ్యంగా కార్మికవర్గ పార్టీ యెత్తుగడలమీద. చివరకు అవి చీలికకు దారితీసినాయి; దీనికి కారణం "కొలోన్ కమ్యూనిస్టు కేసు విచారణ రహస్యాల వెల్లడి" అనే తన పుస్తకంలో మార్క్సు ప్రస్ఫుటంగా స్పష్టంగా చెప్పినాడు.

పైన చెప్పిన "నోయె రైనిషె సైటుంగ్. పొలిటిష్-ఒకొనామిషె రెవ్యూ" – మార్క్సు సంపాదకత్వంకింద వుండినది – బాడెన్ విప్లవంమీద ఎంగెల్సు వర్ణనా, "జర్మనీలో రైతుయుద్ధం" అనే ఆయన రచనా యే పత్రికలో ప్రచురింపబడిందో ఆ పత్రిక – యీ కాలంలోనే ప్రారంభమైంది.

నాకు జ్ఞాపక మున్నంతవరకు, ఎంగెల్సు తన తండ్రి భాగస్వామిగా వుండిన మాంచెస్టర్ దూది మిల్లులో పనిచేయడానికి 1850లో లండన్ వదలిపెట్టి వుండాలి. 1864లో ఆయన ఆ వ్యాపార సంస్థకు సహ యజమాని అయినాడు. 1870లో ఆయన మాంచెస్టర్ వదలిపెట్టి, తన కాలమంతా అధ్యయనానికీ, మార్క్సుతో సహకరించడానికీ అర్పించినాడు.

మాంచెస్టర్‌లో ఎంగెల్సు ప్రధానంగా విల్‌హెల్మ్ వోల్ఫ్‌తోనూ, శామ్యూల్ మూర్‌తోనూ, కార్ల్ షొర్లెమ్మెర్‌తోనూ కలిసిమెలిసి వుండినాడు. ఆయన అప్పుడప్పుడు మార్క్సును చూడడానికి లండన్‌కు పోయేవాడు, లేదా మార్క్సు మాంచెస్టర్‌కు పోయేవాడు. కానీ యీ ప్రయాణాలు అరుదుగా వుండేవి, పెద్దవి కావు; కానీ ఉత్తర ప్రత్యుత్తరాలు మరింత చురుకుగా వుండేవి.

ఎంగెల్సూ, మార్క్సూ యిద్దరూ జర్మన్ పత్రిక "దస్ ఫోల్క్" ("ప్రజలు")కు రచనలు చేసేవాళ్లు; దీనిని మేము కింకెల్ పత్రికను యెదుర్కోడానికి 1859లో లండన్‌లో స్థాపించినాము.

1859లో నేను ఎంగెల్సుకు ఒక ఉత్తరం రాస్తూ, ఆ సందర్భంలో ఒక ఫోటో అడిగినాను. ఫోటో, ఒక ప్రశస్తమైన ఉత్తరంతో సహా, నాకు అందింది. ఆ ఉత్తరం యిక్కడ ఉల్లేఖించడం నాకు యిష్టమే, కానీ, యెంత వెదకినా అది కనిపించలేదు.



విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్, టుస్సీ (ఎలినోర మార్క్స్)



కార్ల్ మార్క్స్ కూతురు లౌరా

1870లో ఎంగెల్సు తన భార్యతో కూడా లండన్‌కు పోయి, మార్క్సుకు అనతి దూరంలో, ప్రిమ్‌రోజ్ హిల్ దగ్గర వున్న ఆ ప్రసిద్ధమైన యింటిలో స్థిరపడినాడు; తన మరణానికి కొద్ది ముందువరకూ ఆయన అక్కడ నివసించినాడు.

ఫ్రాంకో ప్రష్యన్ యుద్ధ ప్రారంభం (1870) ఎంగెల్సు ఆసక్తిని రేపి, తత్ఫలితంగా ఆయన కాలాన్ని యెక్కువగా హరించింది. "పాల్ మల్ గజెట్"లో ఆయన వ్యాసాలు మిలిటరీ వ్యవహారాలలో ఆయనకు గల జ్ఞానాన్ని రుజువు చేసి, "జనరల్" అనే మారుపేరును ఆయనకు సంపాయించి పెట్టినాయి. ఫ్రెంచి సైన్యంయొక్క అనేక అపజయాలను ఆయన జోస్యం చెప్పినాడు. జర్మన్ సైన్యాలు ఫ్రెంచి ఉత్తర సైన్యం చుట్టూ సాంద్రీకరించేటప్పుడు, "పాల్ మల్ గజెట్"లో ఎంగెల్సు యిలా జోస్యం చెప్పినాడు: సెడాన్ పల్లపు భూమిలో అంత కంతకూ బిగుసుకుంటున్న జర్మన్ సైన్యాల ఉక్కు వలయాన్ని ఛేదించుకొని మెక్‌మహన్ తన సైన్యంతో బెల్జియంకు పోగలిగితే తప్ప, ఆ వలయానికి అతను లొంగిపోక తప్పదు. రెండు వారాల తర్వాత వాస్తవంగా జరిగింది అదే.

1871లో పారిస్ కమ్యూన్ ఓటమి తర్వాత ఇంటర్నేషనల్‌యొక్క జనరల్ కౌన్సిల్‌లోని పరిస్థితి, ముఖ్యంగా మార్క్సుకూ, ఎంగెల్సుకూ, చాలా గడ్డుగా, బెడిసినదిగా తయారైంది; కమ్యూన్‌యొక్క అంతర్జాతీయ సభ్యులు చాలా మంది లండన్‌కు వలసపోయినందున, మార్క్సు, ఎంగెల్సులు చేయవలసిన పని యింకా యెక్కువైంది.

హంగేరియన్ కామ్రేడ్ లెయో ఫ్రాంకెల్‌ను మరిచిపోరాదు: అతను కమ్యూన్ ప్రభుత్వంలో సభ్యుడుగా వుండి, అగ్గిపెట్టెలు అమ్ముకునేవాడుగా ప్రష్యన్ శ్రేణుల గుండా తప్పించుకొని రాగలిగినాడు. తమ లక్ష్యం గురించి సంపూర్ణమైన స్పష్టతా, చైతన్యమూ గలిగిన కొద్దిమందిలో అతను ఒకడు. క్షమాదానం తర్వాత ఫ్రాంకెల్ పారిస్‌కు తిరిగివచ్చి, అక్కడ తన ప్రచారం కొనసాగించినాడు. అతను పారిస్‌లో కొద్ది సంవత్సరాల క్రితం మరణించినాడు. అతని మరణంలో నేను ఒక వ్యక్తిగత మిత్రుని కోల్పోయినాను, పార్టీ తన అత్యుత్తమ సభ్యులలో ఒకణ్ని కోల్పోయింది. అతని స్మృతికి వందనం!

కమ్యూన్ ప్రవాసులు, వివిధ ధోరణులకు చెందినవాళ్లు, ఒకరి నొకరు వ్యతిరేకించుకొని, కమ్యూన్ పతనానికి ఒకరి నొకరు నిందించుకున్నారు. భగ్నమైన ఆశలూ, వాళ్లలో దాదాపు అందరూ వుండిన గడ్డు పరిస్థితులూ ఘర్షణకు అన్నిటికంటె యెక్కువగా తోడ్పడినాయి.

పెట్టుబడిదారీ పత్రికల నీచమైన దాడులూ, కమ్యూన్‌ను గురించీ, దాని ప్రాముఖ్యం గురించీ సార్వత్రికమైన అజ్ఞానమూ, యివికాక విచారకరమైన అనార్కిస్టుల పొడుపులూ — ప్రతిదీ అంతర్జాతీయ ఉద్యమాన్ని తుడిచివెయ్యడానికి కుట్ర పన్నుతున్నట్లు కనిపించింది.

హేగ్ మహాసభ నిర్ణయం ప్రకారం జనరల్ కౌన్సిల్‌ను న్యూయార్కుకు మార్చడంతో మార్క్సు, ఎంగెల్సులకు అర్థశాస్త్ర అధ్యయనానికి సమయం లభించింది. మార్క్సు తన

మహత్తర కృషి ఐన "పెట్టుబడి"కి పూర్తిగా అంకితం కాగలిగినాడు. అప్పటినుండి ఎంగెల్సు ఇంటర్నేషనల్‌కు కార్యదర్శి. వాస్తవ ఘటనలకు సంబంధించిన విషయాలమీద అనేక వ్యాసాలు కాక, ప్రత్యేక సందర్భాలకు రాసే రచనల మాట అటుంచి, "కమ్యూనిస్టు ప్రణాళిక" అనువాదాలూ, లేదా యితర అనువాదాలూ, తనిఖీ చేయడానికో, సరిదిద్దడానికో ఆయనకు పంపబడినవి, ఆయన కాలంలో పెద్ద భాగాన్ని హరించేవి. అయినప్పటికీ మన పాత మిత్రుడు తీరిక చేసుకొని రాసిన శాస్త్రీయ రచనల సంఖ్య ఆయనకు పనిచేయగల సామర్థ్యమూ, పనిమీద ప్రేమా యెంత యెక్కువగా వుండిందీ రుజువు చేస్తుంది....

1878లో ఎంగెల్సుమీద పెద్ద విషాద ఘాతం పడింది: సిన్‌ఫీన్ ఉద్యమానికి ఆయువు పట్టుగా వుండిన ఆయన భార్య, ఐరిష్ మహిళ, మరణించింది. వాళ్లకు పిల్లలు లేరు, ఎంగెల్సుకు భార్యా వియోగం చాలా పెద్ద దెబ్బ....

తరువాత మార్క్సు కుటుంబానికి చెడ్డ కాలం దాపురించింది – మార్క్సు జబ్బూ, ఆయన భార్యకూ, కూతురుకూ జబ్బూ, వాళ్లిద్దరి మరణమూ.

1883 మార్చిలో, యెదురుచూడనిది కాదుగానీ, అయినప్పటికీ సంతాపకరమైనది, మార్క్సు మరణ వార్త వచ్చింది.

ఎంగెల్సు నా కీ కింది ఉత్తరం రాసినాడు:

"లండన్, మార్చి 15, 1883

"ప్రియమైన లెస్నెర్,

"మన పాత మిత్రుడు మార్క్సు నిన్న మూడు గంటలకు మెల్లగా, ప్రశాంతంగా, శాశ్వతంగా కన్ను మూసినాడు. ఆయన మరణానికి తక్షణ కారణం బహుశా ఆంతరిక రక్తస్రావం.

"అంత్యక్రియలు శనివారం 12 గంటలకు జరుగుతాయి. నీవు హాజరు కావాలని టుస్సీ కోరుతున్నది.

"నా తొందరను క్షమించు.

భవదీయుడు, యఫ్. ఎంగెల్సు."

శ్రీమతి మార్క్సు వివాహం జరిగినప్పటినుండి అనేక సంవత్సరాలు మార్క్సు కుటుంబపు సుఖ దుఃఖాల నన్నిటినీ పంచుకున్న లెన్‌హెన్ దెముత్, మార్క్సు మరణం తర్వాత, ఎంగెల్సు యింటిని నిర్వహించింది. ఆమె 1890 నవంబర్ 4న మరణించింది. యిది ఎంగెల్సుకు పెద్ద నష్టం. అదృష్టవశాత్తు త్వరలోనే ఫ్రైబెర్గెర్ సతి – అంతకు మునుపు కౌట్స్కీ సతిగా వుండినామె – వియన్నా వదలి లండన్ చేరి, ఎంగెల్సు గృహ నిర్వహణ భారం వహించడానికి నిర్ణయించుకొంది.

ఏంగెల్సు కొత్త ట్రేడ్‌యూనియన్ ఉద్యమంలో ఉత్సుకతతో పాల్గొన్నాడనీ, తానే రోజుకు పదారు గంటలూ, రాత్రిపూట పొద్దుపోయిందాకానూ తరుచుగా పనిచేసుకున్నప్పటికీ యెనిమిది గంటల ఉద్యమాన్ని బలపరిచినాడనీ యెవరికి తెలియదు! వయస్సు మీరినప్పటికీ ఆయన యెప్పుడూ మే ఉత్సవాలకు హాజరైనాడు, వేదికగా ఉపయోగింపబడిన బండిమీదికి కూడా యెక్కినాడు. యిక, ఆ సమావేశాల అనంతరం జరిగే మే పార్టీలను యెవరు మరిచి పోగలరు!...

నేను కమ్యూనిస్టు ఎడ్యుకేషనల్ సొసైటీలోనూ, సోషల్ డెమోక్రటిక్ ఫెడరేషన్‌లోనూ, సోషలిస్టు లీగులోనూ సభ్యునిగా వుండినాను. నేను ఇండిపెండెంట్ లేబర్ పార్టీని యేర్ప రచడంలో కూడా తోడ్పడినాను. అందుకనే నా ఆగమనాలకు ఎంగెల్సు యెప్పుడూ స్వాగతం చెప్పేవాడు, యెందుకంటే ఆ భిన్న ధోరణులలోని హృదయభావాలను గురించిన వార్తలను నేను ఆయనకు చెప్పగలిగేవాణ్ని. ఆయనతో యేమాత్రమైనా పరిచయ మున్నవాళ్ల కందరికీ చాలా బాగా తెలుసు: వివిధ అంశాలమీద సోషల్ డెమోక్రటిక్ ఫెడరేషన్ యెత్తుగడలతో ఆయన విభేదించినాడు. యీనాడు ఆయన బతికివుంటే యింకా యెక్కువగా విభేదించేవాడు.

ఎంగెల్సుకు పనిచేసే సామర్థ్యమూ, పనిమీద ప్రేమా మరణించేదాకా వుండినాయి. పరాయి భాషలలో ఆయన కుండిన గొప్ప జ్ఞానం అందరికీ తెలిసిందే. ఆయనకు పది భాషలు క్షుణ్ణంగా తెలుసు: ఇబ్సెన్‌నూ, కియెలండునూ మూలంలో చదవగలగడానికి ఆయన 70 యేండ్ల వయస్సులో నార్వీజియన్ భాషను అధ్యయనం చేయడం ప్రారంభించినాడు.

మార్క్సు లాగే ఎంగెల్సు చాలా అరుదుగా బహిరంగ ఉపన్యాసాలు యిచ్చేవాడు. ఆయన 1893లో చివరిసారి బహిరంగ ఉపన్యాసం యిచ్చినాడు. ఆయన జూరిచ్ మహాసభలోనూ, వియన్నాలోనూ, బెర్లిన్‌లోనూ ఉపన్యాసాలు యిచ్చినాడు. జూరిచ్‌లో ఆయనకు లభించిన స్వాగతమూ, ఆయనపట్ల వ్యక్తీకరింపబడిన సద్యఃకృతజ్ఞతా సంతోషాలూ, తరువాతి కాలంలో నాతో ఆయన తరుచుగా అన్నట్లు, ఆయనను గాఢంగా కదిలించినాయి. ఆయన ఆస్ట్రియాకూ, జర్మనీకీ, స్విట్జర్లెండుకూ పోయినప్పుడు మన భావాలకు దిగ్విజయం లభించింది. కొత్త జర్మనీని, కార్మికుల జర్మనీని, చూసిందాకా మార్క్సు జీవించలేదని ఎంగెల్సు చాలాసార్లు విచారం వ్యక్తపరిచినాడు.

మరణ ఘడియదాకా ఎంగెల్సులో యెంత కృతనిశ్చయత వుండిందో అంత ప్రశాంతత వుండింది. ఆయన తన వ్యవహారాలన్నీ సరళంగా, మనస్ఫూర్తిగా చేసేవాడు. ఆయనకు యే ప్రశ్న వేసినా సరే, యెల్లప్పుడూ ఆయన సంక్షేపమైన, కానీ ప్రామాణికమైన జవాబు యిచ్చేవాడు. ఆయన యెప్పుడూ మొహమాటం లేకుండా తన మనస్సు వెల్లడించేవాడు, యితరులు మెచ్చుకున్నా సరే, మెచ్చుకోకున్నా సరే.

పార్టీలో దేనితో నైనా ఎంగెల్సు విభేదిస్తే, తన అసమ్మతిని ఆయన వెంటనే,

సంకోచం లేకుండా వ్యక్తం చేసేవాడు. సర్దుబాట్లలోనూ, రాజీలలోనూ ఆయన పాలు పంచుకునేవాడు కాదు....

ఆయనకు యెంతోమంది ఆగంతుకులు వుండేవాళ్లు; పార్టీ కామ్రేడ్లూ, యితరులూ ఆయన్ను చూడడానికి తరుచుగా వచ్చేవాళ్లు. యెనభైల అంతంలో "సోషియాల్ డెమోక్రట్" జూరిచ్‌నుండి లండన్‌కు మారవలసి వచ్చినప్పుడు, ఆగంతుకుల సంఖ్య పెరిగింది. ఎంగెల్సు యిల్లు యింకా ఎక్కువగా అందరికీ స్వాగతం యిచ్చేది.

మార్క్సు మరణం తర్వాత నేను ఎంగెల్సును చూడడానికి మరింత తరుచుగా పోయేవాణ్ని. నాలో మార్క్సు యెంత విశ్వాసం వుంచినాడో ఎంగెల్సు కూడా అంత విశ్వాసం వుంచినాడు. ఆయనకు మితిమీరిన ఆగంతుకులు వుండినప్పుడు నేను ఆయన్ను చూడడానికి అంత తరుచుగా పోలేదు; నేను మునుపటిలాగ యెందుకు కనిపించడం లేదని ఆయన వెంటనే నన్ను అడిగినాడు.

## 4

ఎంగెల్సు చివరిసారి 1895 వేసవిలో ఆరోగ్యంకొరకు ఈస్ట్‌బోర్న్‌కు పోయినాడు. యేమీ మెరుగుదల లేకుండా జూలై ఆఖరులో ఆయన తిరిగి వచ్చినాడు. ఆయన్ను గురించి చాలా దిగులుపడినట్లున్న టుస్సీ నాకు జాబు ద్వారా తెలియజేసింది. కొంతకాలంపాటు నా ఆగమనాలతో ఎంగెల్సును యిబ్బంది పెట్టకూడదని నేను నిశ్చయించుకున్నాను. నా సన్నిధితో ఆయన్ను ఉద్రేకపరుస్తానేమో అని నా భయం, యెందుకంటే ఆయన వస్తుతః చాలా ఉద్రేకి. తత్ఫలితంగా, ఆయన లండన్‌కు తిరిగివచ్చిన తర్వాత, మన మహా మిత్రుని నేను సజీవంగా చూడలేదు.

ఆగస్టు 5న నాకు బెర్న్‌స్టైన్* ద్వారా వర్తమానం వచ్చింది – నేను ఎంగెల్సును మరణించే లోపల చూడాలనుకుంటే త్వరగా చూడాలనీ, యెందుకంటే ఆయన పరిస్థితి చాలా అధ్వాన్నంగా వుందనీ. అయినా ఆయన మరణం అంత దగ్గరలో వుందని నాకు బొత్తిగా తెలియదు. మరుదినం, ఆగస్టు 6న, వీలైనంత ప్రొద్దున్నే పోయి ఆయన్ను చూడాలని నిశ్చయించుకొన్నాను.

నా గుండె జలదరించేటట్లు, మరుదినం మొదటి తపాలులో ఫ్రైబెర్గర్ సతీమణి నుండి వార్త వచ్చింది – ఆగస్టు 5 రాత్రి 11, 12 గంటల మధ్య మన మిత్రుడు మరణించాడని.

---

*బెర్న్‌స్టైన్, ఎడ్వర్డ్ (1850–1932) – జర్మన్ సోషల్ డెమోక్రట్, ఎంగెల్సు మరణం తర్వాత ద్రోహి అయి, మార్క్సిజాన్ని తిరగదోడడానికి ప్రయత్నించినాడు. – సం.

ఆ ఆకస్మిక విషాద వార్త నామీద వేసిన ప్రభావ ముద్రను మాటలలో వ్యక్తం చేయలేను....

నేను వెంటనే ఆయన యింటికి పోయి, మంచంమీద పండుకొని వున్న ఆయన మృత దేహాన్ని చూసినాను, 1883 మార్చి 15న మన మిత్రుడు మార్క్సును సరిగ్గా యెలా చూసినానో అలాగే.

నన్ను ఎంగెల్సు గదిలోకి తీసుకపోయిన శ్రీమతి ఫ్రైబెర్గర్ యెంతగా సంచలించి పోయిందంటే, ఆయన చివరి ఘడియలను గురించి చెప్పడం ఆమెకు కష్టమైంది.

ఎంగెల్సు చివరి కోరిక తన చితాభస్మం సముద్రంలో దూరంగా ముంచాలని.

యీ చివరి కోరిక ఆగస్టు 27న ఎలినోర మార్క్స్, డాక్టర్ ఇ. ఎవెలింగ్, ఇ. బెర్న్ స్టైన్, నేనూ నెరవేర్చినాము. మేము ఎంగెల్సు అభిమాన వేసవి నిలయమైన ఈస్ట్‌బోర్న్‌కు పోయి ఒక రెండు తెడ్ల పడవను అద్దెకు తీసుకొని, మన మరుపురాని మిత్రుని భస్మం వున్న పాత్రతో సముద్రంమీద సునూరు రెండుమైళ్ల దూరం పోయినాము. యీ ప్రయాణం నాలో కలిగించిన అనుభూతిని నేను మాటలతో చెప్పలేను....

* * *

మార్క్స్, ఎంగెల్సులు గతించి యేండ్లు అయింది; కానీ వాళ్ల కృషి జీవిస్తున్నది. సకల దేశాలలోని లక్షోపలక్షల కార్మికులు నిరూపించే దేమిటంటే మన నాయకుల సూత్రాలూ, పోరాటపు యెత్తుగడలూ అర్థం చేసుకోబడినాయనీ, గ్రహింపబడినాయనీ, అనుసరింపబడి నాయనీ. ఆ కార్మికుల సంఖ్య ప్రతి దినమూ పెరుగుతున్నది.... యిది నాకు అపారమైన సంతృప్తి నిస్తున్నది. లక్షోపలక్షల కార్మికులతోపాటు యీకింది మాటలు ఉద్ఘాటిస్తూ, యీ స్మృతులు ముగిస్తాను.

"తక్షణ భవిష్యత్తు సోషలిస్టు ఉద్యమానిది!"

# ఫ్రీడ్రిఖ్ అడోల్ఫ్ సోర్గె

## మార్క్సును గురించి*

1883 మార్చి 14 నాడు నాకు లండన్‌నుండి యీ కేబుల్ అందింది: "మార్క్స్ యీ దినం మరణించినాడు. ఎంగెల్సు."

కార్మికవర్గ పోరాటపు నాయకుడు, కార్మికవర్గ విమోచనకు ఆయుధాలు తయారు చేసినవాడు మరణించినాడు. చీకటినుండి జనించి, చీకటిని సృష్టించే అజ్ఞానాన్ని చెదరగొట్టడానికీ, సమస్త మానవజాతికీ ఒక నూతన యుగమూ, నూతన పరిస్థితులూ కలిగే అవకాశాలను సృష్టించడానికీ ప్రపంచంలోకి, బూర్జువా ప్రపంచంలోకి, మెరుపులను విరజిమ్మిన బ్రహ్మాండమైన మేధావి మరణించినాడు.

మార్క్స్ మరణించినాడు; తమ అత్యంత విశ్వాసం గల, అత్యంత విశ్వసనీయుడైన హితబోధకుని గుండె ఆగిపోయిందన్న వార్త విని లక్షలాది జనం శోకించినారు!

శాస్త్రజ్ఞుడూ, కార్మికవర్గ పరిరక్షకుడూ అయిన మార్క్స్ యేమి సాధించిందీ కంచు ఫలకాలమీద చెక్కనక్కరలేదు, జ్వాలా వాక్కులతో కీర్తించనక్కర లేదు. యే లోహ స్తూపమూ, శిలా స్తూపమూ దాన్ని ఉద్ఘాటించడం లేదు; కానీ సకల దేశాలలోనూ, ప్రపంచంలోని సకల భాగాలలోనూ వున్న అసంఖ్యాక కార్మికజన సముదాయాలకు అది అనుభూతమౌతున్నది, తెలుస్తున్నది; తమకు మార్క్స్ యిచ్చిన "సకల దేశాల కార్మికులారా, ఏకం కండి!" అనే అమర నినాదం కింద తమ యోధశ్రేణుల వృద్ధి ద్వారా వాళ్లు దాన్ని రుజువు చేస్తున్నారు.

---

* సోర్గె, ఫ్రీడ్రిఖ్ అడోల్ఫ్ (1828–1906) – జర్మన్ కమ్యూనిస్టు, అమెరికాకు ప్రవాసం పోయినాడు. అమెరికన్, అంతర్జాతీయ కార్మికోద్యమంలో పాల్గొన్నాడు; మార్క్స్, ఎంగెల్సుల మిత్రుడూ, సహచరుడూ. మార్క్స్ గురించిన స్మృతులు 1902లో ప్రచురించబడినాయి. – సం.

మార్క్స్, ఆయన నిజమైన జీవిత సహచారిణీ తమ విశ్వాసాలకొరకు యెట్టి త్యాగాలు చేసిందీ కొద్దిమందికి మాత్రమే తెలుసు. ఆయన తన అమర రచనలు చేసేటప్పుడు, అత్యంత ముఖ్యమైన శాస్త్రవిజ్ఞాన శాఖలలో నూతన పథాలు వెలిగించేటప్పుడు, నిజాయితీగా, మన స్ఫూర్తిగా కార్మికవర్గ పురోగతిని కాంక్షించినవాళ్ల కందరికీ తన సలహాలద్వారా, తన చర్యల ద్వారా సహాయం చేసేటప్పుడు, వాళ్లు యెన్ని కడగండ్లూ, కష్టాలూ భరించిందీ కొద్ది మందికి మాత్రమే తెలుసు.

అయినప్పటికీ, మార్క్స్‌మీద తెరపి లేకుండా అపనిందలు ప్రచారం చేసినారు, ఆయన చర్యలకు దురుద్దేశాలు ఆపాదించినారు. అందుకనే, యాభై యేండ్ల క్రితం, 1853 నవంబర్ 7న, ఆయన పాత సహయోధులు ముగ్గురు ఒక పత్రం* ప్రచురించినారు; అందులో నుండి కొద్ది ఘట్టాలు దిగువ యివ్వబడినాయి:

"ప్రతి వొక్కరికీ తెలుసు, మార్క్స్ తాను విప్లవంకొరకు చేసిన త్యాగాల గురించి ఒక్క మాట కూడా చెప్పి ప్రజలకు విసుగు కలిగించలేదు. తద్భిన్నంగా, పెటీబూర్జువాల కనికరంకంటె యెక్కువగా ఆయనకు ఆగ్రహం కలిగించేది యేదీ లేదు.... ఆయనమీద వ్యక్తిగతంగా చేసే దాడుల విలువను పార్టీ కనీసం తెలుసుకోనైనా తెలుసుకోవాలి.

"మార్క్స్, ఎంగెల్సులు 1843నుండి యీ నాటి వరకు ఓవెన్ పత్రిక "నీతి వంతమైన నూతన ప్రపంచం" కొరకూ, ఓకోనార్ పత్రిక "నార్దర్న్ స్టార్" కొరకూ, హార్నీ పత్రికలు "డెమోక్రటిక్ రెవ్యూ," "రిపబ్లికన్," "ప్రజామిత్ర" కొరకూ, జోన్స్ పత్రికలు "ప్రజలకు లేఖలు" కొరకూ, పారిస్ పత్రిక "రెఫార్మ్" కొరకూ (విప్లవానికి ముందు), ఇంగ్లండులోనూ, బెల్జియంలోనూ, పారిస్‌లోనూ వుండిన అనేక పత్రికల కొరకూ ఉచితంగా పనిచేసినారు.... దీనికిగాను, తాత్కాలిక ప్రభుత్వంలో ఒక సభ్యుడైన ఫ్లోకాన్ వాళ్లిద్దరికీ వాళ్లు కోరినంత డబ్బు యిస్తానన్నాడు, కానీ వాళ్లు నిరాకరించినారు. డబ్బు తీసుకోడానికి బదులు, మనకందరికీ తెలుసు, ఫిబ్రవరి విప్లవం ప్రారంభమైనప్పుడు మార్క్స్ కొన్ని వేల థేలెర్లు తన సొంత డబ్బు ఖర్చుపెట్టినాడు; యే విప్లవం ఆసన్నమైనప్పుడు బ్రస్సెల్స్‌లో కార్మికులను సాయుధులను చేయడానికి ఆయన అందులో కొంత డబ్బు ఖర్చుపెట్టినాడో అందుకే ఆయననూ ఆయన భార్యనూ బెల్జియన్ అధికారులు జైలులో పెట్టినారు; మిత్రులు జర్మనీకి పోవడానికీ, అక్కడ విప్లవానికి సన్నాహాలు చేయ డానికీ ఆయన మరికొంత డబ్బు ఖర్చుపెట్టినాడు; తక్కినది "నోయె రైనిషె సైటుంగ్"

---

* "బెల్లెత్రిస్టిషెన్ జర్నల్ ఉండ్ న్యూయార్కెర్ క్రిమినల్ సైటుంగ్" పత్రికకు వేడిమేయర్, క్లూస్, యాకోబిలు రాసిన ఉత్తరం 1853 నవంబర్ 25న ప్రచురింప బడింది. — సం.

పత్రిక ప్రారంభ ఖర్చులకు గాను ఆయన ఖర్చు పెట్టినాడు. 1848లోనూ, 1849లోనూ యీ పత్రిక కొరకూ, విప్లవ ఆందోళన కొరకూ మార్క్స్ సుమారు 7000 థేలెర్లు ఖర్చుపెట్టినాడు; అందులో కొంత తనదీ, తన భార్యదీ నగదు, కొంత తనకు సంక్రమించబోయే ఆస్తిని తనఖా పెట్టి తెచ్చిన డబ్బు.

"యీ త్యాగాలలో పెద్ద భాగం పత్రికకు ఖర్చు కావడం యెలా జరిగింది? మొదట షేర్ హోల్డర్ల సంఖ్య పెద్దదిగా వుండింది. కానీ జూన్ విప్లవం ప్రారంభమైనప్పుడు, జర్మనీలో దాన్ని బలపరిచే పత్రిక మొదట "నోయె రైనిషె సైటుంగ్" ఒక్కటే వుండినప్పుడు, సహజంగా బూర్జువాలు పత్రికనుండి విడిపోయినారు. కొలోన్‌లో ముట్టడి పరిస్థితి ప్రకటింపబడిన తర్వాత పెటీబూర్జువాలు పత్రికనుండి పారిపోవడం జరిగింది. అందుకే మార్క్స్ షేర్ హోల్డర్లనుండి పత్రికను తీసుకొని తన "సొంత ఆస్తి"గా చేసుకున్నాడు. అనగా, దాని అప్పులనూ, బాధ్యతలనూ అన్నీ ఆయన తనమీద వేసుకున్నాడు.... పత్రిక మళ్లీ ఆదాయంలో పడినప్పుడు అది బలవంతంగా అణచివేయబడింది. 1849 మేలో, మార్క్స్ హాంబుర్గ్‌కు పోయి తిరిగివచ్చినప్పుడు, అప్పటికే ఆయనను బహిష్కరించిన ఉత్తరువు ఆయన భార్యకు అందింది....

"పత్రిక మూసివేయబడింది. ఆస్తులు యివి: 1) ఒక ఆవిరి అచ్చు యంత్రం, 2) కొత్తగా యేర్పరిచిన కంపోజిటర్ గది, 3) పోస్టాఫీసులో వెయ్యి థేలెర్ల చందాల డబ్బు. పత్రిక అప్పులు తీర్చడానికి మార్క్స్ అవన్నీ వదిలేసినాడు....

"300 థేలెర్లు అప్పు చేసి మార్క్స్ కంపోజిటర్లకూ, ప్రింటర్లకూ యిచ్చి, సంపాదకులు వెళ్లిపోగలిగేటట్లు చేసినాడు. అందులో ఒక్క ఫెన్నిగ్ కూడా ఆయన సొంతానికి వాడుకోలేదు....

"ఆవిధంగా మార్క్స్ హీనస్థితిలో లండన్‌కు వచ్చినాడు. తన శక్తి మూలంగానే ఆయన ఆ స్థితినుండి బయటపడినాడు. ఆయన లండన్ చేరినప్పటికి దివాలా తీసి వుండినాడంటే, విప్లవమే ఆయన్ను దివాలా తీయించింది. తన పరిస్థితిని అంతకుముందే ఆయన మెరుగు పరచుకో లేదంటే, దానికి కారణం ఆయన కార్మికులకు ఉచితంగా సేవ చెయ్యాలనుకోవడమే.... లండన్‌లో ఆయన పిల్లలలో ఒకరు చనిపోయినప్పుడు శవాన్ని సమాధిచేయడానికి ఆయనవద్ద డబ్బు లేదు....

" 'సదుద్దేశాలు గల' వ్యక్తులకు భిన్నంగా, 'కొరికే కలం' గల వ్యక్తి అయిన మార్క్స్‌కు కొలోన్ అరెస్టుల* మూలంగా యీ కింది ఫలితాలు కలిగినాయి: ఆయన రచనల నన్నిటినీ

---

*1851 మే 10న కమ్యూనిస్టు లీగుయొక్క ప్లెనిపొటెన్షరీ లైప్జిగ్‌లో అరెస్టు అయినాడు. ఆ తర్వాత కొలోన్‌లో హెచ్. బెకెర్, పి. ర్యోజర్ మే 19 నాడూ, తరువాత మరికొందరూ అరెస్టు అయినారు. — సం.

ప్రచురించడానికి హెర్మన్ బెకెర్ పూనుకొనివుండినాడు. మొదటి సంపుటం వెలువడింది; కొలోన్ కేసులో గుర్తింపబడినట్లు, దానికి 15,000 మంది చందాదారులు వుండినారు.* అంతే కాక, లియేజ్‌లో మార్క్స్‌చేత ఒక మాసపత్రికను ప్రచురింపజేయడానికి బెకెర్ ఒప్పుకొని వుండినాడు. అతని అరెస్టు మూలంగా యివి రెండూ వుత్త వైనాయి, ఆ విధంగా మార్క్స్‌కు కనీసం ఒక సంవత్సర కృషి ఫలితం నష్టమైంది. ఫ్రాంక్‌ఫుర్ట్‌లో ఒక పుస్తక విక్రేత మార్క్స్ 'అర్థశాస్త్ర విమర్శ'ను ప్రచురించడానికి పూనుకొనబోయినాడు; కానీ కమ్యూనిస్టుల కేసు అతన్ని భయపెట్టింది, మార్క్స్‌కు డబ్బు నష్టం కలిగింది.

"తన కుటుంబంతో సహా మంచి పరిస్థితులకు అలవాటు పడినవాడూ, ప్రజల దృష్టిలో గౌరవంగా జీవించగలవాడూ, జీవించవలసినవాడూ, అయిన మార్క్స్ తత్ఫలితంగా యెంతో కష్టంతో మాత్రమే నెట్టుకరాగలిగినాడు; పైగా, మోసాలచేత "మర్యాదగా" నష్టపడినాడు.

"మార్క్స్‌లాంటి వ్యక్తులను – మరి ఆయన పుట్టుకతో బూర్జువా, పాత "రైనిషె సైటుంగ్" కాలంలో రచయితగా ఆయనను బూర్జువావర్గం ఉత్సాహంగా అభినందించింది – కృషినీ, స్థానాన్నీ మాత్రమే కాక, తమ సంపదనూ, తమ కుటుంబంయొక్క సుఖాలనూ జర్మన్ కార్మిక పార్టీకొరకు త్యాగం చేసిన వ్యక్తులను ఆ పార్టీ నీచమైన నిందలకు గురి కానిస్తే, అప్పుడు ప్రతి వొకరూ దానిమీద తీర్పు చెప్పుదురు గాక.

"న్యూయార్క్, నవంబర్ 7, 1853

జె. వేడిమేయర్,** అడోల్ఫ్ క్లూస్,*** డాక్టర్ ఎ. యాకోబి****."

మార్క్స్ అత్యాశాపరుడని ఆరోపించినారు, క్రూరంగా, దయారహితంగా ప్రవర్తిస్తాడని నిందించినారు. యెంత అన్యాయం!

---

* యిక్కడ ప్రస్తావించబడిన సంపుటం కార్ల్ మార్క్స్ రచనల మొదటి కూర్పు, కొలోన్, 1851. – సం.

** వేడిమేయర్, యోసెఫ్ (1818–1866) – జర్మన్, అమెరికన్ కార్మికవర్గ ఉద్యమాలలో ప్రముఖ వ్యక్తి; జర్మనీలో 1848–1849 విప్లవంలోనూ అమెరికాలో అంతర్యుద్ధంలోనూ పాల్గొన్నాడు; మార్క్స్, ఎంగెల్సుల మిత్రుడూ, సహచరుడూ. – సం.

*** క్లూస్, అడోల్ఫ్ – జర్మన్ ఇంజనీరు, కమ్యూనిస్టు లీగు సభ్యుడు, 1849 తర్వాత అమెరికాకు వలసపోయినాడు. – సం.

**** యాకోబి, అబ్రహాం (1830–1919) – కమ్యూనిస్టు లీగు సభ్యుడు, కొలోన్ కమ్యూనిస్టు కేసు (1852)లో ఒక నిందితుడు; తరువాత అమెరికాకు వలసపోయినాడు. – సం.

ఆయన యెప్పుడూ అత్యాశ చూపలేదు, యితరులమీద పెత్తనం చేయడానికి ప్రయత్నించ లేదు. తన అధికతర జ్ఞానమూ, విస్తారమైన వైదుష్యమూ, సర్వతోముఖ పాండిత్యమూ, యితరులను ఆకట్టుకునే వ్యక్తిత్వమూ, వీటి మూలంగానే ఆయన తన కుండిన పలుకుబడిని సంపాదించినాడు, ముఖ్యంగా లండన్‌లో ఇంటర్నేషనల్‌యొక్క పాత జనరల్ కౌన్సిల్‌లో, అత్యంత ముఖ్యమైన దశలో, అయిదింట నాలుగు వంతులమంది యింగ్లీషువాళ్లూ, ఫ్రెంచి వాళ్లూ; యిద్దరు, ముగ్గురు సభ్యులు మాత్రమే జర్మన్లు వుండినదానిలో.

పారిస్‌లో, బ్రస్సెల్స్‌లో, కొలోన్‌లో, లండన్‌లో ఆయన కార్మికులతో మాట్లాడే వాడు, వర్కర్స్ సొసైటీలలో ఉపన్యాసాలు యిచ్చేవాడు.... జనరల్ కౌన్సిల్‌లో కూడా ఆయన తన అభిప్రాయాలనూ, ప్రతిపాదనలనూ – మామూలుగా అవి కౌన్సిల్‌కు సాధారణ పంథాను యేర్పరిచేవి – సోపపత్తిక వాదాలతో నిరూపించేవాడు; ఆ వాదాలలోని తర్కం ఆయన వ్యతిరేకులకు కూడా దుర్నిరోధకమైనది. తర్కం మాత్రమే కాదు, ఆయన కంఠంలోని అనుభూతి కూడా. "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"లోని చివరి వాక్యాలు యీ విషయాన్ని నిరూపి స్తాయి.

వ్యక్తిగత సంబంధాలలో మార్క్స్ మిత్రభావం గల ఆహ్లాదకరమైన, యింపైన మనిషి; యీ విషయం యీ అసాధారణ వ్యక్తితో యెలాంటి సన్నిహిత సంబంధాల ఆనంద మైనా అనుభవించినవాళ్లందరూ ఒప్పుకుంటారు.

కానీ ఆయన వంచకుల పట్లా, అజ్ఞానుల పట్లా, బడాయికోరుల పట్లా కనికరం లేని వాడు. వీళ్లే ఆయన శీలానికి మసిపూసి, ఆయన అత్యాశ వగైరా గురించి కట్టుకథను సృష్టించి, ప్రచారం చేసినవాళ్లు.

మార్క్స్ కుండిన జీవిత కష్టాల అనుభవం వున్నవా డెవడైనా సాయం చేయడానికి యెప్పుడూ సిద్ధంగా వుంటాడు, చేయగలిగినప్పుడు చేస్తాడు కూడా. అసంఖ్యాకమైన సంద ర్భాలలో మార్క్స్ అలా చేసినాడు. ఒకటి చాలుగాక. ఇంటర్నేషనల్‌యొక్క ఉత్తర అమెరికన్ ఫెడరేషన్ మహాసభ 1872 జూలైలో ముగిసి, హేగ్ మహాసభకు ప్రతిని ధులను యెన్నుకొన్నప్పుడు, ఒక కార్మికుడు ఆ ప్రతినిధులలో ఒకరివద్దకు పోయి, మార్క్స్‌కుగాను కొంత డబ్బు యిచ్చినాడు. అతను ఒక రైన్ ప్రాంతం కార్మికుడు, ఖచ్చితమైన లాసాల్ అనుచరుడు. అతను 1864లోనో, 1865లోనో తన యింటినీ, కుటుంబాన్నీ వదలిపెట్టవలసి వచ్చింది. అతను బికారిగా లండన్ చేరి, అమెరికాకు ప్రయాణం కొనసాగించడానికి మార్క్స్‌ను సాయం కోరినాడు. మార్క్స్ సాయం చేసినాడు, ఆ కాలంలో తానే యేవిధంగానూ మంచి స్థితిలో లేకపోయినప్పటికీ.

కమ్యూన్ ప్రవాసులు లండన్ చేరినప్పుడు, వాళ్లకు సహాయం చేయడానికీ, వాళ్లను ఆదుకోడానికీ మార్క్స్, ఆయన కుటుంబమూ అసాధారణమైన కృషి చేసినారు. వచ్చే పోయే ప్రవాసులు కాక, రాష్ట్రాలనుండీ, మాంచెస్టర్‌నుండీ, లివర్‌పూల్‌నుండీ అమెరికా మొదలైన దూర ప్రాంతాలనుండీ వచ్చిన కార్మికులు ఆయన యింటిలో తరుచుగా కనపడే వాళ్లు.

# జి.ఎ. లొపాతిన్

## యస్. పి. సినేల్నికొవ్‌కు రాసిన ఉత్తరంలో భాగం*

ఫిబ్రవరి 15, 1873

విదేశాలలోని నా కాలంలో అత్యధిక భాగం పారిస్‌లోనో, లండన్‌లోనో గడిపినాను. అక్కడ నేను, రష్యాలో లాగే, దినవేతన రచయితగా పనిచేస్తూ పొట్టపోసుకున్నాను. తీరిక సమయాలలో నేను విదేశాలలోని కార్మికవర్గ ఉద్యమాన్నీ, సాంఘిక జీవితంలోని యితర ఆసక్తికర పార్శ్వాలనూ అధ్యయనం చేసినాను.

నేను లండన్‌లో వుండినప్పుడు, కార్ల్ మార్క్స్ అనే ఒక వ్యక్తితో పరిచయమైంది. ఆయన అత్యంత అసాధారణమైన అర్థశాస్త్ర రచయితల్లో ఒకడు, మొత్తం యూరప్‌లో అత్యంత విస్తృత విద్యావంతులలో ఒకడు. సుమారు అయిదేండ్ల కిందట ఆయనకు రష్యన్ భాష అధ్యయనం చేయాలని తోచింది. అధ్యయనం చేసిన తర్వాత ఆయనకు మిల్ రచించిన సుప్రసిద్ధ గ్రంథంమీద చెర్నిషేవ్‌స్కీ** వివరణలూ, చెర్నిషేవ్‌స్కీ రచించిన మరికొన్ని వ్యాసాలూ

---

* లొపాతిన్, గేర్మన్ అలెక్సాంద్రొవిచ్ (1845–1918) – రష్యన్ విప్లవకారుడు, నరోద్నిక్, మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్‌లో సభ్యుడు; మార్క్స్‌కూ, ఆయన కుటుంబానికీ మిత్రుడు. లొపాతిన్ సైబీరియాలో జైలులో వున్నప్పుడు తూర్పు సైబీరియా జనరల్ గవర్నర్ అయిన సినేల్నికొవ్‌కు రాసిన ఉత్తరంలో కొంత భాగం యిక్కడ ప్రచురింపబడింది. – సం.

** చెర్నిషేవ్‌స్కీ, నికొలాయ్ గవ్రీలొవిచ్ (1828–1889) – గొప్ప రష్యన్ విప్లవ ప్రజాతంత్రవాది, భౌతికవాద తత్వవేత్త, విమర్శకుడు, రచయిత.

యిక్కడ ప్రస్తావించబడింది చెర్నిషేవ్‌స్కీ గ్రంథం: "జాన్ స్టువర్ట్ మిల్ రచించిన అర్థశాస్త్ర ప్రథమ గ్రంథానికి అనుబంధాలూ, వివరణలూ," భాగం III, జినీవా, 1869. – సం.

తగిలినాయి. మార్క్స్ ఆ వ్యాసాలు చదివినాడు; ఆయనకు చెర్నిషేవ్‌స్కీమీద గొప్ప గౌరవం కలిగింది. ఆయన నాతో చాలా సార్లు అన్నాడు, చెర్నిషేవ్‌స్కీ ఒక్కడే నిజంగా సొంత భావాలుగల సమకాలిక అర్థశాస్త్రవేత్త అనీ, తక్కినవాళ్లందరూ వాస్తవంలో క్రోడీకరణ చేసేవాళ్ల మాత్రమే అనీ, ఆయన రచనల నిండా మౌలికత, శక్తి, లోతు వున్నాయనీ, ఆ శాస్త్రంమీద నిజంగా చదవదగిన, అధ్యయనం చేయదగిన ఆధునిక రచనలు అవి మాత్రమే అనీ. అంత అద్భుతమైన ఆలోచనాపరుని యూరప్‌లో యెరుకపరచడానికి రష్యన్లలో ఒక్కరు కూడా యింతవరకు శ్రద్ధ వహించనందుకు రష్యన్లు సిగ్గుపడాలనీ, చెర్నిషేవ్‌స్కీయొక్క రాజకీయ మరణం రష్యాలోనే కాక, మొత్తం యూరప్‌లో శాస్త్రవిజ్ఞాన రంగానికి నష్టమనీ, వగైరా మార్క్స్ నాతో అన్నాడు. అంతవరకు నేను అర్థశాస్త్రంమీద చెర్నిషేవ్‌స్కీ రచనలను యెంతో గౌరవించినప్పటికీ, యే భావాలు ఆయన సొంతంవో, యే భావాలు ఆయన యితర రచయితలనుండి తెచ్చుకున్నవో వింగడించడానికి తగినంత విస్తృతమైనది కాదు ఆ రంగంలో నా జ్ఞానం. సహజంగా, మార్క్స్‌లాంటి సమర్థుడైన నిర్ణేతనుండి వచ్చిన అలాంటి అభిప్రాయం చెర్నిషేవ్‌స్కీపట్ల నా గౌరవాన్ని యింకా పెంచింది. రచయితగా ఆయనను గురించిన యీ అభిప్రాయాన్నీ, ఆయనతో సన్నిహిత పరిచయం కలిగి, ఆయన్ను గురించి యెప్పుడు మాట్లాడినా ప్రగాఢ ఆవేశంతో మాట్లాడేవాళ్ల ద్వారా నేను ఆయన మహోదాత్త వ్యక్తిత్వం గురించీ, ఆయన వ్యక్తిగత సార్థత్యాగం గురించీ విన్న అభిప్రాయాలనూ పక్క పక్కన పెట్టి చూసినప్పుడు, ఆ మహారచయితను, ఆ మహాపౌరుని, మార్క్స్ అన్నట్లు, రష్యాకు గర్వకారణమైనవాణ్ని, ప్రపంచానికి తిరిగి యివ్వాలని నా మనసులో జాజ్వల్యమానమైన కాంక్ష కలిగింది. రష్యాయొక్క అత్యుత్తమ పౌరులలో ఒకడు, తన కాలంనాటి అత్యంత అసాధారణ ఆలోచనాపరులలో ఒకడు, రష్యన్ ఆరాధ్య దేవతలలో ఒకడుగా వుండదగినవాడు, నిరర్థకపు, దౌర్భాగ్యపు వ్యథాపూర్ణ జీవితానికి బంధింపబడి, సైబీరియాలో యెక్కడో దిక్కులేని చోట మూసిపెట్టబడినా డనే ఆలోచనను నేను భరించలేకపోయినాను. ఆయన స్థానంలో నేను వుండడం అనేది సాధ్యమైతే, ఆ ఆశయ ప్రతినిధులలో అత్యంత పలుకుబడి గలవాళ్లలో ఒకడైన ఆయన్ను తిరిగి అప్పగించడం సాధ్యమైతే, అలా నిస్సంకోచంగా ఆయన స్థానంలో వుండడానికి ఆనాడు, యీనాటిలాగే, నేను సిద్ధంగా వుండినానని ప్రమాణం చేస్తున్నాను. ఒక క్షణం కూడా సంకోచించకుండా నేను అలా చేసివుండేవాణ్ని; తన ప్రియతమ సేనాధిపతిని కాపాడడానికి తన దేహాన్ని అడ్డువేసే సైనికునిలాగే నేను అదే ఆనందమయ సంసిద్ధతతో అలా చేసివుండేవాణ్ని. కానీ ఆ రొమాంటిక్ స్వప్నం యెప్పటికీ నిజమయ్యేది కాదు. అదే సమయంలో, ఆయనకు సహాయం చేయడానికి మరొక మార్గం, మరింత ఆచరణీయమైనదీ, సాధ్యమైనదీ వుందని

అప్పుడు నేను అనుకున్నాను.* అదే విధమైన పరిస్థితులలోని నా అనుభవాన్నిబట్టీ, నేను విన్న యితర ఘటనలనుబట్టీ కూడానూ అలాంటి ప్రయత్నంలో కేవలం అసాధ్య మైనదేమీ లేదని అనుకున్నాను: కావలసిందల్లా కొంత నిర్భయమైన కృషీ, కాస్త డబ్బూ. కనుక, కొద్ది కాలం తర్వాత, నేను పీటర్స్‌బుర్గ్‌లోని నా మిత్రు లిద్దరికి జాబులు రాసి, వాళ్ల సహాయం అర్థించినాను; వాళ్లు అవసరమైన డబ్బు యిస్తామన్నారు. నా పథకం సఫలమైతే నానుంచి తిరిగి డబ్బు తీసుకోడానికీ, విఫలమైతే దాన్ని గురించి సర్వమూ విస్మరించడానికీ వాళ్లు ఒప్పుకున్నారు. నేను పీటర్స్‌బుర్గ్ గుండా పోయినప్పుడు, నా మిత్రులు ముగ్గురు ఆ డబ్బుకు మరి కాస్త కలిపినారు, మొత్తం 1085 రూబుళ్లు అయింది.

నేను లండన్ వదిలేటప్పుడు, నేను యెక్కడకు పోయేదీ యెవరితోనూ చెప్పలేదు, అయిదు మందితోనూ, జినీవాలోని ఎల్పిదిన్‌తోనూ** తప్ప; ఆ అయిదుమందితో నేను అంతకు ముందు ఉత్తరప్రత్యుత్తరాలు జరిపి, వాళ్లనుండి డబ్బు పొందినాను; ఎల్పిదిన్‌కు అప్పటికే నా ఉద్దేశం తెలుసు, ఆ పరిస్థితులు యిక్కడ చెప్పవలసినంతవి కావు. మార్క్సుతో నాకు సన్నిహిత సంబంధమూ, మైత్రీ వుండినప్పటికీ, ఆయనపట్ల నాకు గౌరవం వుండినప్పటికీ, ఆయనతో కూడా నేను నా సాహస ప్రయత్నం గురించి చెప్పలేదు. ఆయన నాకు పిచ్చి పట్టిందని అనుకుంటాడనీ, నన్ను ఆ ప్రయత్నంనుండి మానిపించడానికి ప్రయత్నిస్తాడనీ నాకు నమ్మకంగా తెలుసు: అప్పటికే బాగా ఆలోచించిన ప్రయత్నంనుండి వెనక్కి పోవడం నాకు యిష్టం లేదు.

చెర్నిషేవ్‌స్కీయొక్క బంధువులతో గానీ, ''సొవ్రెమేన్నిక్''*** సిబ్బందిలోని ఆయన మిత్రులతో గానీ, నాకు పరిచయం లేనందున, ఆయన యెక్కడ వుండినదీ కూడా నాకు కచ్చితంగా తెలియదు. సైబీరియాలో నాకు పరిచితు లెవ్వరూ లేనందువలన, నన్ను పరిచయం చేసే ఉత్తరాలు కూడా లేనందువలన, నాకు అవసరమైనది తెలుసుకునేటప్పటికి నేను సుమారు ఒక నెల ఇర్కూత్స్క్‌లో గడపవలసి వచ్చింది. ఆ విధంగా ఇర్కూత్స్క్‌లో చాలా కాలం వుండడమూ, నేను చేసిన కొన్ని యితర తప్పలూ, నా వశంలో లేని కొన్ని పరిస్థితులూ, అన్నీ కలిసి స్థానిక పరిపాలనాధికారుల దృష్టి నాకర్షించినాయి. నేను పొరపాటు పడకపోతే, నా అపజయానికి

---

* ప్రవాస శిక్షనుండి చెర్నిషేవ్‌స్కీ తప్పించుకోవడాన్ని యేర్పాటుచేయాలని లొపాతిన్ అనుకున్నాడు. — సం.

** ఎల్పిదిన్, మిహయీల్ కొన్‌స్తన్‌తీనొవిచ్ (1835–1908) — అరవైల ఆరంభంలో రష్యన్ విప్లవోద్యమంలో పాల్గొన్నాడు, తరువాత స్విట్జర్లెండుకు వలసపోయినాడు; జారిస్టు గూఢచారి పోలీసుల ఏజెంటు. — సం.

*** ''సొవ్రెమేనిక్'' (''సమకాలికుడు'') — రష్యన్ సాహిత్య, సాంఘిక-రాజకీయ పత్రిక, అరవైలలో రష్యన్ విప్లవకర డెమోక్రట్ల అధికారిక పత్రిక. — సం.

యింకా యెక్కువగా కారణమైనది యేమిటంటే, ఎల్పిదిన్‌యొక్క అనుచిత ప్రవర్తన— అతను నా సైబీరియా ప్రయాణ వార్తను జినీవాలో నివసించే ఒక ప్రభుత్వ డిటెక్టివ్‌కు తెలియజేసినాడు. యేమైనప్పటికీ, నన్ను అరెస్టు చేసి, నాల్గవ సారి జైలులో పెట్టినారు. నా ప్రయత్నాలు విఫలమైనాయనీ, భవిష్యత్తు నాకు మరీ ఆహ్లాదకరంగా వుండదనీ తెలుసుకొని, నా దృష్టిలో నాకు ఒప్పుకునే హక్కు లేని కొన్ని విషయాలు నేను ఒప్పుకుంటాననే ఆశతో నా కేసు విచారణ వాయిదా వేస్తున్నారనీ గమనించి, నేను తప్పించుకోడానికి ప్రయత్నం చేసినాను. కానీ నా ప్రయత్నం విఫలమైంది; నన్ను ఇర్కూత్స్కలో జైలులో పెట్టినారు.*

* లొపాతిన్ 1871 జూన్ 3న మొదటిసారి ఇర్కూత్స్క జైలునుండి తప్పించుకున్నాడు, కానీ వెంటనే మళ్లీ పట్టుబడినాడు. 1873 జూలై 10న రెండవ ప్రయత్నంలో మాత్రమే అతను విజయవంతంగా తప్పించుకోగలిగినాడు. 1873 ఆగస్టులో అతను అప్పటికే పారిస్‌లో వుండినాడు. — సం.

# జెన్నీ మార్క్స్

## ఒక ఘటనామయమైన జీవితం గురించి చిన్న రేఖాచిత్రం *

1843 జూన్ 19 నా వివాహదినం.

మేము క్రాయిజ్‌నాఖ్ నుండి ఎబర్న్‌బుర్గ్ ద్వారా ఫ్పాల్‌త్స్‌కు పోయినాము; బాడెన్-బాడెన్ ద్వారా తిరిగి వచ్చినాము. అప్పుడు క్రాయిజ్‌నాఖ్‌లో సెప్టెంబర్ దాకా వుండినాము. మా ప్రియమైన అమ్మ మా సోదరుడు ఎడ్గార్‌తో కలిసి ట్రీయర్‌కు తిరిగి వచ్చింది. కార్ల్, నేనూ అక్టోబర్‌లో పారిస్ చేరుకున్నాం; హెర్‌వెగ్,** అతని భార్యా మాకు స్వాగతం చెప్పినారు.

పారిస్‌లో కార్ల్, రూగె "దోయిచె-ఫ్రాన్‌జోజిషె యార్‌బ్యూఖర్"కు సంపాదకత్వం వహించినారు. దానికి ఫ్రోబెల్ ప్రచురణకర్త. మొదటి సంచిక తర్వాతనే ఆ ప్రయత్నం దుఃఖభాజనమైంది. మేము సెంట్ జెర్మేన్ శివార్లలోని వానో వీధిలో నివసిస్తూ వుండినాము. రూగె, హైనె, హెర్‌వెగ్, మేవురె, తొల్‌స్తోయ్, బకూనిన్, అన్నెన్‌కొవ్, బెర్నేస్ మొదలైన వాళ్లతో మా సాహచర్యం. కబుర్లూ, చిల్లర డబ్బుల కొరకు కొట్లాటలూ దండిగా వుండినాయి. మా చిన్న జెన్నీ 1844, మే 1న పుట్టింది. ఆ తరువాత లఫిట్*** అంత్యక్రియలకు

---

* జెన్నీ మార్క్స్‌యొక్క ఆత్మకథలోని ఘటనలు 1865 వరకు వున్నాయి. అవి అసంపూర్ణం. అవి ప్రచురణార్థం ఉద్దేశింపబడినవి కావు. అందువల్లనే అవి మార్క్స్ జీవితంలో కొన్ని దృశ్యాలను మాత్రమే చూపుతాయి. అయినా, అవి మార్క్స్‌ను మానవునిగా చిత్రించి, ఆయన జీవితంలోని కష్టాలను వర్ణిస్తాయి గనుక, ఆ రచనలు యెంతో ఆసక్తికరమైనవి. — సం.

** హెర్‌వెగ్, గియోర్గ్ (1817–1875) – ప్రఖ్యాత జర్మన్ కవి, పెటీబూర్జువా డెమోక్రట్. — సం.

*** లఫిట్, జాక్ (1767–1844) – ఫ్రెంచి బాంకరు, రాజకీయవేత్త. — సం.

నేను మొదటిసారి బయటికి పోయినాను. తరువాత ఆరు వారాలకు, ప్రాణాంతకంగా జబ్బు పడిన మా శిశువుతో నేను ట్రేయర్‌కు మేల్‌బండి యెక్కినాను.... సెప్టెంబర్‌లో నేను ఒక జర్మన్ నర్సుతో పారిస్‌కు తిరిగి వచ్చినాను. చిన్న జెన్నీకి అప్పటికి నాలుగు పండ్లు వచ్చినాయి.

నేను పారిస్‌లో లేనప్పుడు కార్ల్‌ను చూడడానికి ఫ్రెడరిక్ ఎంగెల్సు వచ్చినాడు. శరదృతువులలోనూ, చలికాలంలోనూ కార్ల్ తన "విమర్శనాత్మక విమర్శమీద విమర్శ"మీద పనిచేసినాడు; అది ఫ్రాంక్‌ఫుర్ట్‌లో ప్రచురింపబడింది.* మా బృందంలో హెస్, అతని భార్యా, ఎవర్‌బెక్, రిబ్బెన్‌ట్రాప్ వుండినారు, ముఖ్యంగా హైనె, హెర్‌వెగ్. 1845 ప్రారంభంలో, హఠాత్తుగా, పోలీస్ కమిషనర్ మా యింటికి వచ్చి, ప్రష్యన్ ప్రభుత్వ కోరిక మీద గిజో** చేసిన బహిష్కరణ ఉత్తరువు మాకు చూపించినాడు. "కార్ల్ మార్క్సు 24 గంటలలోపల పారిస్ వదలిపెట్టాలి" అంటూ ఆ ఉత్తరువులో వుండింది. నాకు మరికొంత వ్యవధి యివ్వబడింది; ఆ వ్యవధి నేను మా ఫర్నిచరూ, కొన్ని వస్తువులూ అమ్మివేయడానికి ఉపయోగపడింది. వాటికి పరిహాసాస్పదమైనంత స్వల్ప మొత్తం వచ్చింది; కానీ మా ప్రయాణానికి నేను డబ్బు సంపాయించుకోవలసి వుండింది. హెర్‌వెగ్ దంపతులు నాకు రెండు రోజులు ఆతిథ్యం యిచ్చినారు. జబ్బులో బాధాకరమైన శీత వాతావరణంలో నేను ఫిబ్రవరి ప్రారంభంలో బ్రస్సెల్స్‌కు, కార్ల్ వున్నచోటికి, బయలుదేరినాను. అక్కడ మేము బువసావాజ్ హోటల్‌లో వుండినాము; నేను హైంజెన్‌నూ, ఫ్రైలిగ్రాత్‌నూ మొదటిసారి కలుసుకున్నాను. మేలో మేము ఒక చిన్న యింటికి మారినాము; పోర్ట్ డూ లువేన్‌లో, అల్యాన్స్ వీధిలోని ఆ యిల్లు మేము డాక్టర్ బ్రాయర్‌తో అద్దెకు తీసుకున్నాము.

మేము స్థిరపడీ స్థిరపడక ముందే ఎంగెల్సు వచ్చినాడు. అంతకు ముందే పారిస్‌లో, తన మిత్రుడైన డాక్టర్ రోలాన్డ్ డానియల్స్‌తో కలిసి మమ్మల్ని చూడడానికి వచ్చిన హైన్రిఖ్ బ్యూర్గెర్స్ కూడా అక్కడ వుండినాడు. కొద్ది కాలం తర్వాత హెస్ తన భార్యతో అక్కడికి వచ్చినాడు; సెబస్టియ్యాన్ సెయ్‌లెర్ అనే ఒకతను ఆ చిన్న జర్మన్ బృందంలో కలిసినాడు. అతను ఒక కరెస్పాండెన్స్ బ్యూరో నెలకొల్పినాడు. ఆ చిన్న జర్మన్ బృందం హాయిగా కలిసి జీవిస్తూ వుండినారు. తరువాత కొంతమంది బెల్జియన్లూ — వాళ్లలో జిగో వుండి


---

* "పవిత్ర కుటుంబం, లేక విమర్శనాత్మక విమర్శమీద విమర్శ. బ్రూనో బౌవర్ అండ్ కంపెనీకి వ్యతిరేకంగా." — సం.

** గిజో, ఫ్రాంసువా ప్యేర్ గియ్యోమ్ (1787–1874) — ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, 1840నుండి 1848 ఫిబ్రవరి విప్లవంవరకూ ఫ్రెంచి దేశీయ, విదేశాంగ విధానాలకు సారథ్యం వహించినాడు. — సం.




మార్క్స్ కుటుంబంయొక్క విశ్వసనీయ
మిత్రురాలైన హెలెన్ దెముత్



కార్ల్ మార్క్స్, 1866



కార్ల్ మార్క్స్ చిన్న కూతురు ఎలినోర



పేర్‌లషేస్ శ్మశానం దగ్గర కమ్యూనార్డ్‌ల సంఘర్షణలు

నాడు — కొందరు పోలులూ వచ్చి మాలో కలిసినారు. సాయంత్రం పూట మేము పోయే ఒక ఆకర్షవంతమైన కెఫేలో పాత లెలెవెల్*ను, అతని నీలి చొక్కాలో, పరిచయం చేసుకున్నాను.

వేసవిలో కార్ల్‌తో కలిసి ఎంగెల్సు జర్మన్ తత్వశాస్త్ర విమర్శమీద పనిచేసినాడు. ఆ విమర్శ పెద్ద రచన; అది వెస్ట్‌ఫాలియాలో ప్రచురింపబడవలసి వుండింది.**

వసంతంలో జోసెఫ్ వేడిమేయర్ మొదటిసారి మమ్మల్ని చూడడానికి వచ్చి, మా అతిథిగా కొంతకాలం వుండినాడు. ఏప్రిల్‌లో మా ప్రియమైన అమ్మ విశ్వాసపాత్రమైన తన సొంత పనిమనిషిని నాకు తోడ్పడడానికి బ్రస్సెల్స్‌కు పంపింది. ఆమెతో కలిసి నేను మరొకసారి మా అమ్మను చూడడానికి పోయినాను, పద్నాలుగు నెలల వయస్సు వుండిన చిన్న జెన్నీని తీసుకొని. నేను మా అమ్మ దగ్గర ఆరు వారాలు వుండి, మా చిన్న కాలనీకి తిరిగి వచ్చినాను. సెప్టెంబర్ 26న, లౌరా పుట్టడానికి రెండు వారాలు ముందు, మా సోదరుడు ఎడ్గార్ చలికాలం బ్రస్సెల్స్‌లో మాతో గడిపినాడు, అక్కడ పని దొరుకుతుందనే ఆశతో. అతను సెయ్‌లెర్‌యొక్క కరెస్పాండెన్స్ బ్యూరోలో ప్రవేశించినాడు. తరువాత, 1846 వసంతంలో, మా ప్రియమైన వొల్ఫ్ కూడా బ్యూరోలో చేరినాడు. అతను "జైలు తోడేలు"గా ప్రసిద్ధుడు; యెందుకంటే, ముద్రణ చట్టం ఉల్లంఘించినందుకు అతను సైలీషియాలో ఒక కోటలో నాలుగేండ్లు నిర్బంధంలో వుండి, అక్కడనుండి తప్పించుకొని వచ్చినాడు. అతను మావద్దకు రావడంతో మా ప్రియమైన "లూపున్"***తో మా గాఢమైత్రి ప్రారంభమైంది; ఆ మైత్రి 1864 మేలో అతను మరణించినప్పుడు మాత్రమే అంతమైంది.

యీ మధ్యకాలంలో విప్లవ తుఫాను మేఘాలు అంతకంతకూ కమ్ముకుంటూ వుండినాయి. బెల్జియన్ దిఙ్మండలం కూడా చీకటిగా వుండింది. అన్నిటికంటె యెక్కువగా భీతి కలిగించింది కార్మికులు, ప్రజా సముదాయాలలోని సాంఘిక అంశం. వాళ్లకు వ్యతిరేకంగా పోలీసులూ, మిలిటరీ, సివిల్ గార్డ్, అందరూ పిలువబడినారు, అందరూ యేదైనా చేయడానికి సిద్ధంగా వుంచబడినారు. అప్పుడు జర్మన్ కార్మికులు తాము కూడా ఆయుధాలు

---

* లెలెవెల్, యియోహిం (1786–1861) — అసాధారణమైన పోలిష్ విప్లవకారుడు, 1830–1831 నాటి పోలిష్ తిరుగుబాటులో పాల్గొన్నాడు; వలసపోయిన పోలిష్ ప్రజాతంత్రవాదులకు ఒక నాయకుడు. — సం.

** యిక్కడ ప్రస్తావించబడింది "జర్మన్ భావజాలం." దీని ప్రచురణ మార్క్స్, ఎంగెల్సులు చేయలేకపోయినారు. యిది పూర్తిగా మొదటిసారి సి.పి.యస్.యు. కేంద్ర కమిటీయొక్క మార్క్సిజం లెనినిజం సంస్థచే 1932లో ప్రచురింపబడింది. — సం.

*** లూపున్ — విల్‌హెల్మ్ వొల్ఫ్. లాటిన్ భాషలో లూపున్ అంటే "తోడేలు." జర్మన్ భాషలో కూడ "వొల్ఫ్" అంటే తోడేలు. — సం.

ధరించే తరుణం వచ్చిందని నిర్ణయించుకున్నారు. బాకులూ, రివాల్వర్లూ, వగైరా సంపాయించబడినాయి. కార్ల్ వాళ్లకు బుద్ధిపూర్వకంగా డబ్బు యిచ్చినాడు, ఆయనకు అప్పుడే కొంత ఆస్తి సంక్రమించింది. యీ పని అంతటిలోనూ ప్రభుత్వానికి కుట్రా, అపరాధ పథకాలూ కనపడినాయి: మార్క్సుకు డబ్బు వస్తున్నది, ఆయుధాలు కొంటున్నాడు, కనుక ఆయన్ను తొలగించాలి. రాత్రి పొద్దుపోయిన తర్వాత యిద్దరు మనుషులు మా యింట్లోకి దూరినారు. వాళ్లు కార్ల్ కావాలని అన్నారు: ఆయన కనపడగానే, తాము పోలీసు సార్జెంట్లమనీ, ఆయన్ను ప్రశ్నించేందుకు అరెస్టు చేసి తీసుకపోవడానికి వారంటు వుందనీ వాళ్లు చెప్పినారు. వాళ్లు ఆయన్ను తీసుకపోయినారు. ఆయన వెంట తీవ్రమైన ఆందోళనతో నేను ఉరికి, విషయ మేమిటో కనుక్కోడానికి పలుకుబడి గల వాళ్ల దగ్గరికి పోయినాను. హఠాత్తుగా ఒక గార్డు నన్ను పట్టుకొని, అరెస్టు చేసి, చీకటి జైలులోకి తోసినాడు. అది కొంపలు లేని బిచ్చగాళ్లూ, తిరుగుబోతులూ, హీన పతిత స్త్రీలూ బంధింపబడిన చోటు. నేను ఒక చీకటి కొట్టులోకి తోయబడినాను. నేను యేడుస్తూ ప్రవేశించగా, ఒక సహ దుఃఖిత తన జాగాలో నాకు భాగం యిచ్చింది: అది గట్టి చెక్క మంచం. నేను దానిమీద పండుకున్నాను. తెల్లవారినప్పుడు, నా కిటికీ కెదురుగా వున్న కిటికీవద్ద, యినప కడ్డీల వెనక శవంలాంటి విచారపూరితమైన ఒక ముఖం కనపడింది. నేను కిటికీవద్దకు పోయి మా పాత మిత్రుడు జిగోను గుర్తుపట్టినాను. అతను నన్ను చూసి సైగ చేసినాడు, కిందికి చూపిస్తూ. నేను ఆ దిశలో చూసినాను, మిలిటరీ రక్షణతో కార్ల్‌ను తీసుకపోవడం కనిపించింది. ఒక గంట తర్వాత దర్యాప్తు చేసే మేజిస్ట్రేటువద్దకు నన్ను తీసుకపోయినారు. రెండు గంటలసేపు ప్రశ్నలు వేసిన తర్వాత — ఆ రెండు గంటలలో నాద్వారా వాళ్లు తెలుసుకున్న దేమీ లేదు — పోలీసులు నన్ను ఒక బండి వద్దకు తీసుకపోయినారు, సాయంత్ర మయ్యేటప్పుడు నా ముగ్గురు చిన్న పిల్లలను మళ్లీ చేరుకున్నాను. యీ వ్యవహారం పెద్ద సంచలనం కలిగించింది. పత్రికలన్నీ యీ విషయం గురించి రాసినాయి. తర్వాత కొద్ది సేపట్లో కార్ల్ కూడా విడుదల చేయబడి, వెంటనే బ్రెస్సెల్స్ వదలిపోవాలని ఆజ్ఞాపించబడినాడు.

ఆయన అప్పటికే పారిస్‌కు తిరిగిపోవాలని అనుకొని, ఫ్రాన్సులోని తాత్కాలిక ప్రభుత్వానికి అర్జీ పెట్టుకొని వుండినాడు, లూయీ ఫిలిప్ కాలంలో తనమీద జారీచేయబడిన బహిష్కరణ ఉత్తరువును రద్దుచేయాలని. ఆయనకు వెంటనే ఫ్లోకొన్ సంతకం చేసిన కాగితం అందింది; దాని ద్వారా తాత్కాలిక ప్రభుత్వం బహిష్కరణ ఉత్తరువును చాలా ప్రశంసా వాక్యాలతో రద్దుచేసింది. పారిస్ తలుపులు మాకు మళ్లీ తెరవబడినా యన్నమాట. నూతన విప్లవ సూర్యోదయంలోకంటె యెక్కువ సుఖంగా మాకు మరెక్కడ వుంటుంది? మేము అక్కడికి పోక తప్పదు, తప్పనే తప్పదు! నేను తొందర తొందరగా సామానులన్నీ మూటె గట్టి, అమ్మగలిగినవి అమ్మినాను; కానీ వెండి పళ్లేలూ, మేలైన యితర

వస్తువులూ వున్న నా పెట్టెలు పుస్తక విక్రేత ఫ్యోగ్లేర్ స్వాధీనం చేసినాను; నా ప్రయాణ సన్నాహాలలో అతను మరీ సహాయకారిగా, ఉపయోగకరంగా వుండినాడు.

అలా మేము బ్రస్సెల్స్‌ను, మూడేండ్లు అక్కడ వుండిన తర్వాత, వదలిపెట్టినాము. ఆరోజు చలిగా, కాంతిహీనంగా వుండిన దినం; పిల్లలను వెచ్చగా వుంచడం మాకు కష్టమైంది; చిన్న పిల్లకు సరిగా సంవత్సరం వయస్సు వుండింది....

* * *

మే* ఆఖరులో కార్ల్ యెర్ర రంగులో అచ్చువేసిన "నోయె రైనిషె త్సైటుంగ్" చివరి సంచికను — ప్రసిద్ధమైన "యెర్ర సంచిక"ను, రూపంలోనూ, వస్తువులలోనూ నిజంగా నిప్పులు గక్కే దాన్ని — విడుదల చేసినాడు. ఎంగెల్సు వెంటనే బాడెన్ తిరుగుబాటులో చేరివుండినాడు; అందులో ఆయన విల్లిహ్‌కి అడ్జుటెంట్‌గా వుండినాడు. తనకు జర్మనీలో వుండడం సాధ్యం కానందున,** కార్ల్ కొంత కాలంపాటు మళ్లీ పారిస్‌కు పోవాలని నిశ్చయించుకున్నాడు. యెర్ర వొల్ఫ్ ఆయన్ను అక్కడికి అనుసరించినాడు. నేను నా ముగ్గురు పిల్లలతో బింగెన్ గుండా పోయినాను.... నా పాత సొంత పట్టణాన్నీ, మా ప్రియమైన అమ్మనూ చూడడానికి. బ్రస్సెల్స్‌లో అప్పుడప్పుడే తాకట్టునుండి విడిపించుకొన్న వెండి పళ్లేలను అమ్మి డబ్బు చేసుకోడానికి గాను, బింగెన్ దాటి కొద్ది దూరం పోయిన తర్వాత నేను దారి మార్చినాను. వేడిమేయర్, అతని భార్యా మాకు మళ్లీ ఆతిథ్య మిచ్చి, తాకట్టు వ్యాపారస్తునితో వ్యవహరించడంలో నాకు చాలా తోడ్పడినారు. ఆ విధంగా నేను ప్రయాణానికి మళ్లీ డబ్బు సంపాయించుకోగలిగినాను.

యెర్ర వొల్ఫ్‌తో కలిసి కార్ల్, బాడెన్ ప్ఫాల్ట్స్‌కు పోయి, తరువాత అట్లే పారిస్‌కు పోయినాడు. సర్వత్రా ప్రగతి వ్యతిరేకత రౌద్ర రూపంతో రంగంమీదికి వచ్చింది. హంగేరియన్ విప్లవమూ, బాడెన్ ముట్టడీ, ఇటాలియన్ విప్లవ ఉద్యమం అన్నీ కూలిపోయినాయి. హంగరీలోనూ, బాడెన్‌లోనూ మిలిటరీ కోర్టులు మామూలు విషయ మైనాయి. 1848 అంతంలో అపారమైన మెజారిటీతో యెన్నికైన లూయీ నెపోలియన్ అధ్యక్షత కాలంలో 50,000 మంది ఫ్రెంచివాళ్లు "యేడు కొండల నగరం"లో ప్రవేశించి, ఇటలీని ఆక్రమించి

---

* 1849. — సం.

** మార్క్సు 1845లో ప్రష్యన్ పౌరత్వాన్ని వదలుకున్నాడు. దాన్ని వినియోగించుకొని ప్రభుత్వం 1849 మేలో ఆయన్ను "ఆతిథ్య చట్టాన్ని" ఉల్లంఘించిన "విదేశస్థుని"గా బహిష్కరించింది. — సం.

నారు.* విజయోత్సాహంతో వున్న ప్రతీఘాత విప్లవానికి "వార్సా సువ్యవస్థితం" అనేదీ, "ఓడినవాళ్లకు దుఃఖం" అనేదీ నీతిసూత్రాలుగా వుండినాయి. బూర్జువావర్గం భయము తీరి ఊపిరి పీల్చుకుంది, పెటీబూర్జువాలు మళ్లీ తమ వర్తకంలో మునిగినారు, లిబరల్ అల్పబుద్ధులు తమ జేబులలో పిడికిళ్లు బిగించినారు, కార్మికులు వేటాడబడి, హింసింపబడినారు, పీడిత దరిద్రుల రాజ్యంకోసం కత్తితోనూ, కలంతోనూ పోరాడినవాళ్లు విదేశాలకు పోయి పొట్టపోసుకోగలిగినందుకు సంతోషించినారు.

పారిస్‌లో వున్నప్పుడు కార్ల్ చాలామంది క్లబ్బుల నాయకులతోనూ, రహస్య కార్మిక సంఘాల నాయకులతోనూ సంబంధాలు నెలకొల్పుకున్నాడు. నేను 1849 జూలైలో పారిస్‌కు ఆయన్ను అనుసరించినాను; మేము అక్కడ ఒక నెల వుండినాము. ఒక దినాన మామూలు పోలీసు సార్జెంటు మళ్లీ వచ్చి, "కార్ల్ మార్క్స్, ఆయన భార్యా 24 గంటలలో పారిస్‌ను వదలిపెట్టాలి" అని మాకు తెలియజేసినాడు. దాక్షిణ్య చర్యగా, ఆయన మోర్బిహన్‌లోని వానిస్‌లో నివసించడానికి అనుమతి యివ్వబడింది.

సహజంగానే, కార్ల్ అలాంటి ప్రవాసానికి అంగీకరించలేదు. లండన్‌లో నమ్మకమైన విశ్రాంతి స్థావరం చూసుకోడానికి నేను మా సామాన్లూ, తట్టా, బుట్టా మళ్లీ మూటె గట్టినాను. కార్ల్ తొందరగా నా కంటె ముందు అక్కడికి పోయినాడు. నేను జబ్బుతో, సొమ్మసిలిపోయి, హింసింపబడిన నా ముగ్గురు చిన్న పిల్లలతో లండన్ చేరుకున్నప్పుడు, అక్కడ నన్ను కలుసుకున్నది ఆయనే. ఆయన లైసెస్టర్ స్క్వేర్‌లోని, ఒక మాస్టర్ దర్జీకి చెందిన ఒక హోటల్‌లో నాకు వసతి యేర్పాటు చేసినాడు. చెల్సీలో మరింత పెద్ద యింటికోసం మేము తొందరపాటుతో వెదకినాము; యెందుకంటే, నాకొక ప్రశాంతమైన యిల్లు కావలసిన సమయం సమీపిస్తూ వుండింది. నవంబర్ 5న,** బయట జనం "గై ఫాక్స్ వర్ధిల్లాలి!" అని కేకలు వేస్తూవుండగా, యుక్తిగా తయారు చేసిన గాడిద బొమ్మలమీద ముఖాలకు ముసుగులు ధరించిన చిన్న పిల్లలు స్వారిచేస్తూ వుండగా, అంతా అల్లకల్లోలంగా వుండగా, మా చిన్న హైన్రిఖ్ పుట్టినాడు. మేము వాణ్ని చిన్న ఫాక్స్ అనేవాళ్లం, ఆ మహా కుట్రదారుని గౌరవార్థం.

తరువాత కొద్ది కాలానికి, బాడెన్‌నుండి తప్పించుకొని, జినోవా ద్వారా ఎంగెల్సు కూడా లండన్ చేరుకున్నాడు. విల్లిహ్ ఆయనకంటె ముందు వచ్చి, వెంటనే మామధ్య కమ్యూనిస్టు సోదరునిలాగా, కామ్రేడ్‌లాగా స్థిరపడి వుండినాడు. అతను ప్రొద్దున్నే మా పడక గదిలో డాన్ క్విక్సట్‌లాగ ప్రత్యక్షమైనాడు, బూడిదరంగు వూలు డబ్లెట్ వేసుకుని, నడుముకు బెల్టుకు

---

* 1849లో రోమన్ రిపబ్లిక్కుకు వ్యతిరేకంగా జరిగిన ఫ్రెంచి సాయుధ జోక్యానికి యిక్కడ ప్రస్తావన. దాని ఉద్దేశం పోపుయొక్క లౌకిక అధికారాన్ని పునస్థాపించడం. — సం.

** నవంబర్ 5ను ఇంగ్లండులో "గై ఫాక్స్ దినం"గా జరుపుతారు. 99 పుటలో వివరణ చూడండి. — సం.

బదులు ఒక యెర్ర గుడ్డ ధరించి, అసలైన ప్రష్యన్ శైలిలో పగలబడి నవ్వుతూ, అంత "సహజమైన" కమ్యూనిజంమీద దీర్ఘ సిద్ధాంత చర్చలో మునిగిపోడానికి సిద్ధంగా. కార్ల్ అతని ప్రయత్నాలను తొందరగా అంతం చేసినాడు.... మేము చెల్సీలో వుండగా డబ్లియూ. పీపెర్, డబ్లియూ. లీబ్‌క్నెఖ్ట్ మొదటిసారి మమ్మల్ని చూడడానికి వచ్చినారు. యెర్ర వొల్ఫ్ కార్ల్‌తో కలిసి లండన్‌కు వచ్చివుండినాడు.

రోజూ వేల కొలది ప్రవాసులు వచ్చేవాళ్లు. వాళ్లలో యెవరికీ స్వయంగా బతకడానికి యే ఆధారమూ లేదు; అందరూ అంతో యింతో యిడుములలో వున్నవాళ్లే, సహాయం అవసరమైన వాళ్లూ, సహాయం కొరకు వెదకేవాళ్లూ. యిది మా ప్రవాస జీవితంలోని అత్యంత సంకటపు దశలలో ఒకటి. వాళ్లకు సహాయం చేయడానికి ప్రవాసుల కమిటీలు స్థాపించబడినాయి, సభలు యేర్పాటు చేయబడినాయి, విజ్ఞప్తులు చేయబడినాయి, కార్యక్రమాలు తయారు చేయబడినాయి, గొప్ప ప్రదర్శనలకు సన్నాహాలు చేయబడినాయి. ప్రవాసుల బృందా లన్నిటిలోనూ విభేదాలు ఉత్పన్నమైనాయి. క్రమక్రమంగా వివిధ పార్టీలు పూర్తిగా చీలిపోయినాయి. జర్మన్ డెమోక్రట్లూ, సోషలిస్టులూ ఆధికారికంగా విడిపోయేదాకా వచ్చింది. కమ్యూనిస్టు కార్మికులలో కూడా స్పష్టమైన చీలిక వుండింది. బృందాల నాయకులు ఒకరిమీద వొకరు అత్యంత విషపూరితంగా దాడిచేసుకున్నారు. "కార్యాల"కూ, "ఆచరణ"కూ ఉబలాటపడే ఒక పనికిమాలిన పెటీబూర్జువా బృందం ముందుకు వచ్చింది; సన్నివేశాన్ని మరింత స్పష్టంగా గ్రహించి, విప్లవ యుగం చాలా కాలందాకా ప్రారంభం కాజాలదని తెలుసుకున్న కార్మికుల విభాగంపట్లా, వాళ్ల నాయకులపట్లా ఆ బృందం అత్యంత శత్రుభావం వహించింది. అందరికంటె యెక్కువగా కార్ల్ మితిమీరిన హింసలకూ, అపనిందలకూ, పరువు నష్టానికీ గురిచేయబడినాడు. యీ కాలంలోనే కోన్రాడ్ ష్రామ్‌కూ, ఆగస్ట్ విల్లిహ్‌కీ మధ్య ద్వంద్వ యుద్ధం జరిగింది.

ఒక కొత్త పత్రికను లండన్‌లో ఎడిట్ చేసి, హాంబుర్గ్‌లో ప్రచురించడానికి, 1849 శరదృతువులో కార్ల్ సంప్రదింపులు ప్రారంభించి వుండినాడు. అసంఖ్యాకమైన కష్టాల తర్వాత, "రెవ్యూ దెర్ నోయెన్ రైనిషెన్ సైటుంగ్" అనే పేరుతో మొదటి 3 లేక 4 సంచికలు వెలువడినాయి. అది గొప్ప విజయంగా వుండింది. కానీ జర్మన్ ప్రభుత్వానికి అమ్ముడుపోయిన ఆ పుస్తక విక్రేత పత్రిక వ్యాపారానికి సంబంధించిన విషయాలలో యెంత అశ్రద్ధగా, అసమర్థంగా వుండినాడంటే, అది చాలా కాలం నడవదని త్వరలోనే స్పష్టమైంది.

1850 వసంతంలో మేము చెల్సీలోని మా యింటిని వదలిపెట్టక తప్పలేదు. మా చిన్న ఫాక్స్ యెప్పుడూ జబ్బుగా వుండేవాడు; మా నిత్య జీవితపు తాపత్రయాలు కూడా నా ఆరోగ్యాన్ని ధ్వంసం చేస్తూ వుండినాయి. అన్ని దిక్కులా పీడింపబడుతూ, రుణదాతలు వెంటబడుతుండగా, మేము ఒక వారం లైసెస్టర్ స్క్వేర్‌లోని ఒక జర్మన్ హోటల్‌లో

వుండినాము. మేము అక్కడ చాలా కాలం వుండలేదు. ఒక ఉదయం మా హోటల్ యజమానుడు మాకు ఉదయ భోజనం పెట్టడానికి నిరాకరించినాడు. మేము వేరే లాడ్జింగు చూసుకోక తప్పలేదు. మా అమ్మనుండి వచ్చిన స్వల్ప సహాయం అత్యంత దారుణమైన కడగండ్లనుండి మమ్మల్ని రక్షించింది. ఒక యూదు లేసు వర్తకుని యింటిలో రెండు గదులు సంపాయించుకొని, నలుగురు పిల్లలతో మేము ఒక దౌర్భాగ్యపు వేసవి అక్కడ గడిపి నాము.

ఆ శరదృతువులో కార్ల్, ఆయన అత్యంత సన్నిహిత మిత్రులలో కొందరూ ప్రవాసులలో అత్యధికుల కార్యకలాపాలతో పూర్తిగా తెగదెంపులు చేసుకొని, ఒక్క చర్యలో కూడా పాల్గొనలేదు. ఆయనా, ఆయన మిత్రులూ వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీని వదలిపెట్టినారు.... ఎంగెల్సు లండన్‌లో రచన ద్వారా బతకడానికి విఫల ప్రయత్నం చేసిన తర్వాత, మాంచెస్టర్‌కు పోయి, చాలా కష్టమైన షరతుల కింద తన తండ్రి జవుళి వ్యాపారంలో గుమాస్తాగా పని చేసినాడు. మా యితర మిత్రులందరూ పాఠాలు చెప్పడం, వగైరాల ద్వారా బతకడానికి ప్రయత్నించినారు. ఆ యేడూ, ఆ తరువాతి రెండేండ్లూ మాకు అత్యంత గొప్ప కష్టాలూ, నిరంతర తీవ్ర ఆందోళనా, రకరకాల గొప్ప కడగండ్లూ, నిజమైన దారిద్ర్యమూ వుండిన కాలం.

1850 ఆగస్టులో, నేను యేమీ ఆరోగ్యంగా లేనప్పటికీ, మా జబ్బు శిశువును వదలి పెట్టి కార్ల్ పినతండ్రినుండి ఊరటా, సహాయమూ పొందడానికి హాలండుకు పోవాలని నిశ్చయించుకున్నాను. నాకు పుట్టబోయే ఐదవ శిశువును గురించీ, భవిష్యత్తును గురించీ నేను తెంపరితనం వహించినాను. కార్ల్ పినతండ్రి తన వ్యాపారంమీదా, తన కొడుకుల వ్యాపారం మీదా, విప్లవం కలిగించిన ప్రతికూల ఫలితంవలన చాలా వ్యతిరేక భావంతో వుండినాడు. అతను విప్లవంమీదా, విప్లవకారులమీదా ద్వేషం కలిగి, చాలా కోపంలో వుండినాడు. నాకు యే మాత్రమూ సహాయం చేయడానికి అతను నిరాకరించినాడు. కాని, నేను వెళ్లిపోయేటప్పుడు, నా ఆఖరి బిడ్డకు ఒక బహుమతి అతను నా చేతిలో పెట్టినాడు; అంతకంటె యెక్కువ యివ్వలేకపోయినందుకు అతను బాధపడడం నాకు కనిపించింది. నేను అతనినుండి సెలవు తీసుకునేటప్పటి నా అనుభూతులను ఆ వృద్ధుడు గ్రహించలేకపోయినాడు. నేను నిస్పృహతో యింటికి తిరిగి వచ్చినాను. మా చిన్న ఎడ్గార్ సుహృద్భావపు ముఖంతో యెగురుతూ నా దగ్గరికి వచ్చినాడు, చిన్న ఫాక్స్ తన చిట్టి చేతులు నావైపు చాచినాడు. వాని ఆలింగనాలు నేను చాలాకాలం అనుభవించడానికి లేకపోయింది. నవంబర్‌లో న్యూమోనియా వలన బిడ్డ తన్నుకలాడి మరణించినాడు. నా దుఃఖం అమితమైనది. నేను పోగొట్టుకున్న మొదటి బిడ్డ వాడు. నా కింకా యెలాంటి బాధలు, యితర బాధ లన్నిటినీ తృణప్రాయంగా కనిపింపజేసేవి, కలగబోయేదీ నాకు బొత్తిగా తెలియదు. బిడ్డను సమాధిలో వుంచిన తర్వాత, మేము ఆ చిన్న ఫ్లాటు విడిచి, అదే వీధిలో మరొక ఫ్లాట్‌లో చేరినాము....

1851 మార్చి 28న మా కూతురు ఫ్రాన్‌త్సిస్కా పుట్టింది. మూడు చిన్న గదులలో యితర పిల్లలతో ఆ పిల్లను మేము పెంచలేనందున, ఆ పసికందును ఒక నర్సుకు యిచ్చినాము. ఆ సంవత్సరం ప్రపంచ ఎగ్జిబిషన్ వుండింది, ఆగంతుకులు లండన్‌కు ప్రవాహ ప్రాయంగా వస్తూ వుండినారు. లండన్‌లో యేదైనా పని సంపాయించుకోడానికి వసంతంలో ఫ్రైలిగ్రాత్ కొలోన్‌నుండి వచ్చినాడు. తరువాత లూపున్ స్విట్జర్లెండునుండి వచ్చినాడు; అలాగే డ్రోంకె,* ఇమాండ్, షీలి వచ్చినారు. అంతకుముందు సెయిలెర్ లండన్‌కు తిరిగివచ్చినాడు; గ్యోత్స్ కార్ల్ చుట్టూ వుండిన ప్రవాసుల బృందంలో చేరినాడు. 1851, 1852 అత్యంత గొప్పవీ, అదే సమయంలో అత్యంత చిన్నవీ రకరకాల యిబ్బందులూ, దిగుళ్లూ, ఆశాభంగాలూ, కడగండ్లూ కలిగిన సంవత్సరాలు.

1851 వేసవి తొలిభాగంలో ఒక ఘటన జరిగింది. అది మా దిగుళ్లను, వ్యక్తిగతమైనవాటినీ, యితర వాటినీ, పెంచడంలో పెద్ద పాత్ర వహించినప్పటికీ, దాన్ని గురించి నేను వివరంగా చెప్పదలచుకోలేదు. వసంతంలో ప్రష్యన్ ప్రభుత్వం రైన్ రాష్ట్రంలోని కార్ల్ మిత్రు లందరిమీదా అత్యంత ప్రమాదకరమైన విప్లవ కుట్రలు పన్నుతున్నారని నేరారోపణ చేసింది. వాళ్లందరినీ జైలులో తోసి అత్యంత దారుణంగా హింసించినారు. బహిరంగ విచారణ 1852 అంతందాకా ప్రారంభం కాలేదు. అది ప్రసిద్ధమైన కొలోన్ కమ్యూనిస్టు కేసు విచారణ. డేనియల్స్, యాకోబి తప్ప నిందితు లందరూ 3నుండి 5 యేండ్లదాకా శిక్షకు గురైనారు.

* * *

మొదట విల్‌హెల్మ్ పీపెర్ మార్క్స్ సెక్రెటరీగా వుండినాడు. కానీ త్వరలో ఆ పదవి నేను తీసుకున్నాను. ఆయన చిన్న పఠనాగారంలో ఆయన గజిబిజి రాతలో వుండిన వ్యాసాలను యెత్తిరాస్తూ నేను గడిపిన దినాల స్మృతి నా జీవితంలో కెల్ల ఆనందమయమైనది.

లూయీ నెపోలియన్ రాజకీయ కుట్ర 1851 అంతంలో జరిగింది. మరు సంవత్సరం కార్ల్ తన "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ" రాసినాడు; అది న్యూయార్కులో ప్రచురింపబడింది. అది ఆయన డీన్ స్ట్రీట్‌లోని మా చిన్న యింటిలో పిల్లల గోలమధ్య, కుటుంబపు రొదమధ్య రాసినాడు. మార్చికల్లా నేను రాతప్రతిని యెత్తిరాసినాను. దాన్ని పంపించి వేసి

---

* డ్రోంకె, ఏర్నెస్ట్ (1822–1891) – జర్మన్ పత్రికారచయిత, "నోయె రైనిషె సైటుంగ్" సంపాదకవర్గంలో ఒకడు; 1848–1849 విప్లవం తరువాత రాజకీయ కార్యకలాపాలు మానేసినాడు. – సం.

నాము, కానీ చాలా కాలం తర్వాతగానీ అది అచ్చులో రాలేదు. దానిద్వారా మాకు వచ్చింది దాదాపు శూన్యం.

1852 ఈస్టర్‌లో మా చిన్న ఫ్రాన్‌త్సిస్కాకు తీవ్రమైన రొమ్ము పడిశం వచ్చింది. మూడు రోజుల పాటు ఆ పిల్ల చావు బ్రతుకులమధ్య వుండింది. ఆమె దారుణంగా బాధపడింది. ఆమె మరణించినప్పుడు, ఆమె చిన్న నిర్జీవపు దేహాన్ని వెనక గదిలో వదలి, మేము ముందు గదిలోకి వెళ్లి, నేలమీద పడకలు వేసుకున్నాం. బతికివున్న మా ముగ్గురు పిల్లలు నేలమీద మా పక్కన పండుకున్నారు. యెవరి కాంతిలేని, ప్రాణం లేని దేహం పక్కగదిలో వుందో, ఆ చిట్టి ముద్దుబిడ్డకోసం మేమందరమూ యేడ్చినాము. మా ముద్దుబిడ్డ మరణం అత్యంత కఠినమైన కడగండ్ల కాలంలో జరిగింది. సరిగా అప్పుడు మా జర్మన్ మిత్రులు సాయం చేయ లేని స్థితిలో వుండినారు. దాదాపు ఆ కాలంలో మమ్మల్ని చూడడానికి తరుచుగా వచ్చి, చాలాసేపు వుంటూ వుండిన ఎర్నెస్ట్ జోన్స్ మాకు సాయం చేస్తానని వాగ్దానం చేసినాడు, కానీ అతను మాకు యేమీ తేలేకపోయినాడు.... హృదయంలో వ్యథతో నేను ఒక ఫ్రెంచి ప్రవాసి వద్దకు పరుగెత్తినాను. అతను మా యింటికి అనతి దూరంలో వుండినాడు, మమ్మల్ని చూడడానికి తరుచు వచ్చేవాడు. మా భయంకరమైన అవసరంలో మాకు సాయం చేయమని అర్థించినాను. అత్యంత సుహృద్భావపు సానుభూతితో అతను వెంటనే నాకు రెండు పౌండ్లు యిచ్చినాడు. ఆ డబ్బు శవపేటికకు ఖర్చు పెట్టినాము: అందులో యిప్పుడు నా బిడ్డ విశ్రమి స్తున్నది. ఆ బిడ్డ యీ ప్రపంచంలోకి వచ్చినప్పుడు ఉయ్యాల లేదు; ఆమెకు చివరి విశ్రాంతి స్థానం చాలా కాలం నిరాకరింపబడింది. మేము యెంత బరువైన గుండెలతో ఆమెను సమాధికి పంపినామో!

1852 ఆగస్టులో కమ్యూనిస్టుల కేసు విచారణ, అప్పటినుండి ప్రసిద్ధి పొందినది, ముగిసింది. ప్రష్యన్ ప్రభుత్వపు దురాగతాన్ని గుట్టు కదుగుతూ కార్ల్ ఒక చిన్న పుస్తకం రాసినాడు. అది స్విట్జర్లెండులో షాబిలిత్స్‌చేత అచ్చువేయించబడింది, కానీ సరిహద్దువద్ద ప్రష్యన్ ప్రభుత్వంచేత స్వాధీనం చేసుకోబడి, నాశనం చేయబడింది. క్లూస్ దానిని మళ్లీ అమెరికాలో అచ్చువేయించినాడు; కొత్త కూర్పు ప్రతులు అనేకం యూరపియన్ భూఖండంమీద వ్యాప్తి చేయబడినాయి.

1853వ సంవత్సరంలో కార్ల్ "న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్"కు క్రమం తప్పకుండా రెండు వ్యాసాలు రాసేవాడు. అవి అమెరికాలో పెద్దగా ప్రజల దృష్టిని ఆకర్షించినాయి. యీ స్తిమితమైన ఆదాయం ద్వారా మేము మా పాత అప్పులు కొంతవరకు తీర్చడానికీ, కొంత దిగులు లేని జీవితం గడపడానికీ సాధ్యమైంది. పిల్లలు బాగా పెరిగినారు, శారీరకంగానూ మానసికంగానూ అభివృద్ధి అయినారు, మేము యింకా డీన్ స్ట్రీట్‌లోని యిరుకు యింటిలోనే వుండినప్పటికీ. కార్ల్ లండన్‌లో వుండినంత కాలం చార్టిస్టులతో సంబంధం కొనసాగించినాడు.

ఆయన ఎర్నెస్ట్ జోన్స్ పత్రిక "పీపుల్స్ పేపర్"కు వ్యాసాలు రాసినాడు; 1853 వేసవిలో ఆ పత్రికకు అప్పటికే "ట్రిబ్యూన్"లో వచ్చిన వ్యాసాలు యిచ్చినాడు.... ఆయనమీద అమెరికాలో విల్లిహ్ ప్రచురించిన ఒక విషపూరితమైన వ్యాసానికి సమాధానంగా, "ఉదాత్త అంతరాత్మ గల వీరుడు" అనే చిన్న రచన కార్ల్ రచించినాడు; అది అమెరికాలో కూడా అచ్చయింది. అది ఆ వీరునీ, అతని మొరిగే మందనూ నోరు మూయించింది.

ఆ సంవత్సరం క్రిస్మస్ లండన్‌లో మేము జరుపుకున్న మొదటి ఉల్లాసకరమైన పండగ. "న్యూయార్క్ ట్రిబ్యూన్"తో కార్ల్‌కు గల సంబంధంవలన, కొరుక్కుతినే రోజువారీ యిబ్బందులనుండి మేము విముక్తుల మైనాము. ఆ వేసవిలో పిల్లలు పార్కుల్లో ఆరుబయట యెక్కువగా తిరుగుతూ వుండినారు. ఆ యేడు చెర్రీ పండ్లూ, స్ట్రాబెర్రీపండ్లూ, ద్రాక్ష కూడా వుండినాయి; మా మిత్రులు మా ముగ్గురు బుడతలకు రకరకాల ఆహ్లాదకరమైన బహుమతులు తెచ్చినారు: బొమ్మలు, తుపాకులు, వంటపాత్రలు, మద్దెలలు, మేళాలు. సాయంత్రం పొద్దు బోయిన తర్వాత, క్రిస్మస్ చెట్టును అలంకరించడానికి డ్రోంకె* వచ్చినాడు. అది ఆనందమయమైన సాయంత్రం.

ఒక వారం తర్వాత మా చిన్న ఎడ్గార్‌కు యే జబ్బు సంవత్సరం తర్వాత వాణ్ణి మృత్యు సన్నిధికి తీసుకపోయిందో, ఆ నయంకాని జబ్బుయొక్క లక్షణాలు కనిపించినాయి. మేము అప్పుడు మా అనారోగ్యకరమైన చిన్న యిల్లు వదలి, పిల్లవాణ్ణి సముద్ర తీరానికి తీసుకపోగలిగివుంటే, వాణ్ణి బతికించుకొని వుండవచ్చు. కానీ, గతాన్ని మార్చ లేము గదా....

1855 సెప్టెంబర్‌లో మేము డీన్ స్ట్రీట్‌లోని మా పాత హెడ్‌క్వార్టర్స్‌కు తిరిగి పోయినాము. మాకు సంక్రమించవలసిన ఒక చిన్న యింగ్లీషు ఆస్తి వచ్చి, బ్రెడ్డు వర్తకుడూ, మాంస వర్తకుడూ, పాలవాడూ, అంగడివాడూ, కూరగాయల వర్తకుడూ యింకా యితర "శత్రు శక్తు"లన్నీ మమ్మల్ని బంధించిన గొలుసులనుండీ, బంధనాలనుండీ మమ్మల్ని విముక్తి చేసే చిన్న మొత్తం మాకు అందింది. మేము మా అప్పులన్నీ తీర్చినాము, తాకట్టునుండి మా వెండి సామానూ, విలువైన వస్తువులూ, దుస్తులూ విడిపించుకున్నాము. నేను కొత్త దుస్తులు ధరించి, మా చిన్న పిల్లలతో కలిసి, చివరిసారి మా ప్రియమైన పాత యింటికి పోయినాను....

ఆ చలికాలం మేము మహా యేకాంతంలో గడిపినాము. దాదాపు మా మిత్రు లందరూ లండన్ వదలిపోయినారు; మిగిలిన కొద్దిమంది మాకు చాలా దూరాన నివసిస్తూ వుండినారు. పైగా, మా ఆకర్షణీయమైన చిన్న యిల్లు మేము అంతకుముందు వుండినవాటితో పోలిస్తే

---

*డ్రోంకె, ఎర్నెస్ట్ (1822–1891) – 167 పుటలో ఫుట్‌నోటును చూడండి.

రాజసౌధంలాంటి దైనప్పటికీ, దాన్ని చేరుకోవడం సులభం కాదు. దాని దగ్గరికి నునుపైన రోడ్డు లేదు, దానికి అన్నిపక్కలా కట్టడం పని జరుగుతూ వుండింది, గుట్టలు గుట్టలుగా పడివున్న చెత్తా చెదారం మధ్య చూసి అడుగులు వెయ్యాలి, వర్షం వస్తే యెర్ర బంకమట్టి బూట్లకు అట్టలు కట్టుకునేది, ఫలితంగా మా యింటికి వచ్చేవాళ్లు ఆయాసకరమైన అవస్థ పడి, కాళ్ల నొప్పులతో వచ్చేవాళ్ళు. యిక అప్పటికి ఆ వెనుకబడిన పేటలలో చీకటిగా వుండేది. కనుక ఆ చీకటితోనూ, చెత్తతోనూ, బంకమట్టితోనూ, రాళ్ల కుప్పలతోనూ వ్యవహరించడం కంటె, వెచ్చని మంటవద్ద సాయంత్రాలు గడపడం మేలని యెవరైనా అనుకుంటారు.

ఆ చలికాలం నేను చాలా అనారోగ్యంగా వుండినాను; నా చుట్టూ యెప్పుడూ మందు సీసాల గుట్టలు వుండేవి. చాలా కాలం తర్వాత గానీ ఆ సంపూర్ణ ఏకాంతానికి నేను అలవాటు పడలేదు. జనసమ్మర్దపు వెస్టెండ్ వీధుల్లో నేను మామూలుగా చేస్తూ వుండిన పెద్ద షికార్లూ, సమావేశాలూ, క్లబ్బులూ, మా అభిమాన పానశాలా, కాసేపు జీవిత బాధలను విస్మరించడానికి చాలాసార్లు తోడ్పడిన అరమరికలు లేని సంభాషణలూ, వీటిని పోగొట్టుకున్న బాధ నేను తరుచుగా అనుభవించినాను. అదృష్టవశాత్తు, యింకా నాకు వారానికి రెండు సార్లు "ట్రిబ్యూన్" వ్యాసం యెత్తిరాసే పని వుండింది; అది ప్రపంచ ఘటనలతో నా సంబంధాన్ని నిలిపింది.

1857 మధ్యలో మరొక గొప్ప వర్తక సంక్షోభం అమెరికన్ కార్మికులను యెదుర్కొంది. మళ్లీ "ట్రిబ్యూన్" వారానికి రెండు వ్యాసాలకు డబ్బు యివ్వడానికి నిరాకరించింది; తత్ఫలితంగా మా బడ్జెట్‌లో గణనీయమైన కోత పడింది. అదృష్టవశాత్తు డాన అప్పుడు ఒక విజ్ఞాన సర్వస్వం ప్రచురిస్తూ వుండి, మిలిటరీ సమస్యలమీదా, ఆర్థిక సమస్యలమీదా వ్యాసాలు రాయమని కార్ల్‌ను కోరినాడు. కానీ ఆ వ్యాసాలు చాలా క్రమరహితంగా వుండినందువలనా, పెరిగే పిల్లలూ, పెరిగిన సంసారమూ ఖర్చులను పెంచినందువలనా, ఆ కాలం యేవిధంగానూ సౌభాగ్యవంతమైనది కాదు. అది పరమ దరిద్రం కాదు గానీ, మాకు నిత్యం యిబ్బందిగా వుండేది, చిల్లర భయాలతోనూ, లెక్కాచారాలతోనూ బాధపడేవాళ్లం. మా ఖర్చులు యెంత తగ్గించుకున్నా, మా ఆదాయం ఖర్చులకు సరిపడేది కాదు, మా అప్పులు దినదినానికీ, యేటికేటికీ పెరుగుతూ వచ్చినాయి....

జూలై 6వ తేదీన మా యేడవ బిడ్డ పుట్టింది. కానీ అది కాసేపు ఊపిరి పీల్చి, తరువాత తన అన్నలనూ, అక్కలనూ కలుసుకోడానికి యెత్తుకపోబడేదాకా మాత్రమే బతికింది.

1857 వేసవిలో మా పాత మిత్రుడు కోన్రాడ్ ష్రామ్ కూడా అమెరికానుండి తిరిగి వచ్చినాడు; కానీ అతను యెంత హీనమైన ఆరోగ్యస్థితిలో వుండినాడంటే అతన్ని బతికించడం సాధ్యం కాదని మొదటి చూపులోనే అర్థమైంది. అతను జర్మన్ ఆస్పత్రిలో ఆరు వారాలు

వుండి, తరువాత జెర్సీకి పోయినాడు. అక్కడ అతను ఫ్రెడెరిక్ ఎంగెల్సును కలుసుకున్నాడు; ఆయన ఒక సంవత్సరంనుండి చాలా జబ్బుగా వుండి, తేరుకోడానికి అక్కడికి పోయివుండినాడు. కార్ల్ ఆ సంవత్సరం సెప్టెంబర్‌లో ఆ మిత్రు లిద్దరినీ చూడడానికి అక్కడికి పోయి, పండ్లతో, పప్పుకాయలతో, ద్రాక్షతో తిరిగివచ్చినాడు. 1858 జనవరిలో, జెర్సీలో ఒక పత్రికకు సంపాదకుడుగా వుండిన మా మిత్రుడు జూలియన్ హార్నీ మాకు మా ప్రియమిత్రుడైన ట్రైమ్ మరణ వార్త తెలియజేసినాడు.

1858లో మాకు మేలూ కలగలేదు, కీడూ కలగలేదు; ఒక రోజులాగే ప్రతిరోజూ వుండింది. ఆ చలికాలం కార్ల్ తన గ్రంథం "అర్థశాస్త్ర విమర్శ"మీద పనిచేసినాడు; దాని కొరకు ఆయన సంవత్సరాల తరబడి సమాచారం సేకరిస్తూ వుండినాడు. ఆయనకు 1848నుండి మిత్రుడుగా వుండిన లాసాల్ ఆ పుస్తకానికి బెర్లిన్‌లో ఫ్రాంత్స్ దుంకెర్ అనే ప్రచురణకర్తను యేర్పాటుచేసినాడు. నేను యెత్తిరాసిన తర్వాత, వసంతంలో కార్ల్ రాతప్రతి పంపించినాడు. ప్రూఫులు అక్కడినుండి యిక్కడికి చూడడానికి వస్తూ వుండినాయి; అందువలన సహజంగా ముద్రణ గణనీయంగా ఆలస్యమైంది. దాన్ని యింకా ఆలస్యం చేసింది యేమిటంటే, లాసాల్ తన "జ్వలనశీల కృతి," "ఫ్రాంత్స్ ఫన్ సికింగెన్" అనే నాటకం, ప్రచురించుకోడానికి తొందరపడినాడు. దుంకెర్ అతని ప్రత్యేక మిత్రుడైనందున, ఆ నాటకాన్ని కార్ల్ పుస్తకం కంటె ముందు ప్రచురించినాడు. 1859 వేసవిలో "via-sacra"* ఫ్రాన్సుకూ ఆస్ట్రియాకూ మధ్య యుద్ధం, ప్రారంభమైంది. ఎంగెల్సు "పోనది, రైన్‌నది" అనే రచన ప్రచురించినాడు; దాని విజయం లాసాల్ తన రచన "ఇటలీలో యుద్ధం" రాయడానికి ప్రేరణ యిచ్చింది.

లండన్‌లో ఎలార్డ్ బిస్కాంప్ "దస్ ఫొల్క్" ["ప్రజలు"] అనే వారపత్రిక ప్రచురించినాడు; దానికి కార్ల్ రచనలు పంపేవాడు, ఎంగెల్సు కూడా కొన్ని వ్యాసాలు రాసినాడు. కె. బ్లైండ్ చేత రచింపబడిన ఒక కరపత్రం "దస్ ఫొల్క్"లో పునర్ముద్రింపబడి, తరువాత లీబ్‌క్నెఖ్ట్ చేత "ఔగ్స్‌బుర్గెర్ ఆల్గెమైనె సైటుంగ్"కు అందివ్వబడింది; ఆ కరపత్రాన్ని సాకుగా తీసుకొని కె. ఫోగ్ట్ అవమానకరంగా కార్ల్‌మీద దాడిచేసినాడు. ఫోగ్ట్ ఒక చిన్న పుస్తకం ప్రచురించినాడు; అందులో అతను కార్ల్‌ను గురించి అత్యంత నీచమైన అబద్ధాలు చెప్పినాడు. "నూతన యుగ" ప్రభావం కింద మొత్తం జర్మన్ పత్రికలన్నీ గ్రామ గ్రామానికీ, పట్టణ పట్టణానికీ వ్యాపింపజేస్తున్న అపనిందను ఒక్క దెబ్బతో పూర్వపక్షం చేయడానికి కార్ల్ 1860లో సమాచారం సేకరించినాడు....

1860 వసంతంలో ఎంగెల్సు తండ్రి మరణించినాడు. ఆ తర్వాత ఎంగెల్సు పరిస్థితి

---

* అక్షరాలా: "పవిత్రమైన దారి." – సం.

గణనీయంగా మెరుగైంది, ఏర్మెన్‌తో చేసుకున్న ప్రతికూల ఒప్పందంచేత ఆయన బంధింపబడివుండినప్పటికీ. ఆ ఒప్పందం 1864 దాకా అమలులో వుండింది; ఆ తర్వాత ఎంగెల్సు ఆ వ్యాపారసంస్థ యాజమాన్యంలో సహ భాగస్థుడు అయినాడు.

1860 ఆగస్టులో నేను మళ్లీ ఒక పక్షం రోజులు పిల్లలతో కలిసి హేస్టింగ్స్‌వద్ద గడిపినాను. నేను తిరిగి వచ్చినతర్వాత, ఫోగ్ట్‌కూ, అతని సహచరులకూ వ్యతిరేకంగా కార్ల్ రాసిన పుస్తకం యెత్తిరాయడం ప్రారంభించినాను. అది లండన్‌లో ప్రచురింపబడింది; అది యెంతో చిరాకు కలిగించి, 1860 డిసెంబర్ అంతందాకా వెలువడలేదు. ఆ సమయంలో నేను మశూచితో చాలా జబ్బుగా వుండినాను; "హెర్ ఫోగ్ట్"ను సగం గుడ్డి కన్నులతో దిగమింగడానికి తగినంతగా అప్పుడప్పుడే ఆ భయంకర వ్యాధినుండి తేరుకుని వుండినాను. అది అత్యంత గడ్డు కాలం. విశ్వాసం గల లీబ్‌క్నెఖ్ట్‌వద్ద ముగ్గురు పిల్లలకూ ఒక యిల్లూ, ఆతిథ్యమూ దొరికినాయి.

సరిగ్గా అప్పుడు కనిపించినాయి, వచ్చే వసంతంలో ప్రారంభం కాబోయే అమెరికన్ అంతర్యుద్ధంయొక్క ప్రథమ సూచనలు. పాత కాలపు, చిల్లర, మరుగుజ్జు పోరాటాల పాత యూరప్ అమెరికాకు ఆసక్తి కలిగించడం మానుకుంది. "ట్రిబ్యూన్" కార్ల్‌కు వర్తమానం పంపింది, ఆర్థిక పరిస్థితుల నిర్బంధంవలన అది (యూరప్‌నుండి) వార్తాలేఖల నన్నిటినీ వదులుకోవలసి వచ్చిందనీ, తత్కాలానికి ఆయన సహకారం తనకు అవసరం లేదనీ. యితర ఆదాయ మార్గాలన్నీ పూర్తిగా మూసుకపోయినందున, యేదో ఒకటి చేయడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనందున, ఆ దెబ్బ మరీ తీవ్రంగా తగిలింది. అత్యంత కఠినమైన విషయం యేమిటంటే, మా పెద్ద కూతుర్లు అందమైన కన్యాత్వపు బంగారు వయసులో ప్రవేశించినప్పుడు యీ సంపూర్ణ అసహాయ పరిస్థితి వచ్చింది. ఆ విధంగా మేము పాత కాలంలో వుండిన అవే దుఃఖాలతో, యిబ్బందులతో, కడగండ్లతో మళ్లీ పోరవలసి వచ్చింది; భేదం యేమిటంటే, అయిదారేండ్ల వయసులో పిల్లలకు తెలిసిరాని కష్టాలను, పదేండ్ల తర్వాత, పదైదు, పదారు యేండ్ల వయసులో, వాళ్లు తెలిసి అనుభవించవలసి వచ్చింది. అలా మేము "చిన్న పిల్లలు, చిన్న కష్టాలు, పెద్ద పిల్లలు, పెద్ద కష్టాలు" అనే జర్మన్ సామెతను అనుభవంలో నేర్చుకున్నాము.

1860 వేసవిలో మేము ఎక్కరియుస్‌ను రెండు నెలలపాటు యింట్లో వుంచుకున్నాము; ఎందుకంటే అతడు చాలా దీన స్థితిలో వుండినాడు. ఆర్థిక సహాయం పొందడం పరమ అవసర మైనందువ, 1861 వసంతంలో కార్ల్ జర్మనీకి పోయినాడు. "సహృదయుడు" అనబడే ప్రష్యా రాజు క్రిస్మస్‌లో మరణించి, "అందమైన విల్‌హెల్మ్"కు సింహాసనం వదలిపోయినాడు.* కార్పొరల్ క్షమాదానం ప్రకటించినాడు; కార్ల్ జర్మనీకి పోడానికీ, దేశంలో

---

*1861లో ప్రష్యా రాజు 4వ ఫ్రెడరిక్ విలియం మరణించినాడు; తరువాత మొదటి విలియం రాజ్యానికి వచ్చినాడు. — సం.

కొత్త వాతావరణం యెలా వుందో చూడడానికీ, ఆ క్షమాదానాన్ని వినియోగించుకున్నాడు. బెర్లిన్‌లో ఆయన లాసాల్ యింట్లో వుండి, కౌంటెస్ హాత్స్‌ఫెల్ట్‌ను* తరుచుగా కలుసుకున్నాడు. తరువాత ఆయన తన పినతండ్రి లియోన్ ఫిలిప్స్‌ను చూడడానికి హాలండుకు పోయినాడు; అతను నిజమైన గొప్ప బుద్ధితో ఆయనకు వడ్డీ లేకుండా కొంత డబ్బు అప్పు యిచ్చినాడు. బొమెల్‌నుండి జాక్ ఫిలిప్స్‌తో కలిసి, కార్ల్ సరిగ్గా జెన్నిహెన్ పదేడవ జన్మదినానికి, యింటికి వచ్చినాడు. అప్పు దొరికినందున కొన్నాళ్లపాటు మా సంసార నౌక సుఖంగా సాగింది, నిత్యం కొండలకూ, యిసుక దిబ్బలకూ మధ్యనే, సుడిగుండాల అంచుననే అయినప్పటికీ.

మా పెద్ద కూతుర్లు 1860 వేసవిలో పాఠశాల వదలి, విద్యార్థులు కానివాళ్లకు కూడా కాలేజిలో చెప్పే పాఠాలకు హాజరౌతూ వుండినారు. వాళ్లు డీ కోల్మా వద్ద ఫ్రెంచి భాష, మాగిన్యాని వద్ద ఇటాలియన్ భాష నేర్చుకోవడం కొనసాగించినారు; జెన్నీ 1862 దాకా ఓల్డ్‌ఫీల్డ్‌వద్ద డ్రాయింగ్ పాఠాలు కూడా చెప్పించుకుంది. శరదృతువులో ఆడపిల్లలు హెన్రీ బానెర్‌వద్ద సంగీత పాఠాలు కూడా మొదలు పెట్టినారు.

1861 సెప్టెంబర్‌లో కార్ల్, ఎ. డాన తోడ్పాటుతో, పాత షరతులమీదనే "ట్రిబ్యూన్" వారాని కొక వ్యాసం అంగీకరించేటట్లు చేసుకోగలిగినాడు. అదే కాలంలో ఆయన లాసాల్ బంధువుచేత "వీనెర్ ప్రెసె" సంపాదకునికి పరిచయం చేయబడి, ఆ "ఉదారవాద" పత్రికకు వ్యాసాలు రాసే ఆహ్వానం పొందినాడు. దురదృష్టవశాత్తు యీ రెండు పనులూ చలికాలం మాత్రమే వుండినాయి. 1862 వసంతంలో కార్ల్ "ట్రిబ్యూన్"కు రాయడం వదలిపెట్టినాడు, "ప్రెసె"కు సంబంధించిన పని అంతా నిదానంగా అంతరించనిచ్చినాడు....

1863 వసంత మంతటా జెన్నీ ఆరోగ్యం బాగలేదు; ఆమె నిత్యం డాక్టర్ల పర్యవేక్షణ కింద వుండింది. కార్ల్ కూడా యెంతో జబ్బుగా వుండినాడు. ఆయన ఎంగెల్సును చూడడానికి పోయి తిరిగివచ్చినప్పుడు యేమీ తేరుకోలేదు – 1850నుండి క్రమం తప్పకుండా యేటా ఎంగెల్సు వద్దకు పోయేవాడు. మేము మళ్లీ మూడు వారాలు హాస్టింగ్స్‌లో సముద్రతీరంలో వుండినాము; అప్పుడు పండ్రెండు రోజులు హెచ్. బానెర్ యింట్లో వుండినాము. కార్ల్ మమ్మల్ని తీసుకపోడానికి వచ్చినాడు, కానీ ఆయన చాలా అధ్వాన్నంగా కనపడినాడు, నిత్యం అనారోగ్యంగా వుండినాడు. చివరకు ఆ సంవత్సరం నవంబర్‌లో ఆయనకు "రాచపుండు వ్యాధి" అనే భయంకరమైన జబ్బు వుండినట్లు తేలింది. నవంబర్ 10న ఒక భయంకరమైన పుండును శాస్త్ర చికిత్స చేసినారు; తరువాత దీర్ఘకాలమే ఆయన అపాయ స్థితిలో వుండినాడు.

---

* హాత్స్‌ఫెల్ట్, సోఫీ (1805–1881) – లాసాల్ మిత్రురాలు, సహచరురాలు. – సం.

ఆ వ్యాధి దండిగా నాలుగు వారాలు వుండి, తీవ్రమైన బాధ కలిగించింది. దీనికి తోడు బాధాకరమైన రకరకాల నైతిక హింసలు వుండినాయి. మేము సరిగా అగాధం అంచున వుండగా, హఠాత్తుగా మా అత్త మరణ వార్త అందింది. గాలి మార్పు కార్ల్‌కు చాలా మేలు చేస్తుందని డాక్టర్ నిర్ణయించినాడు. డాక్టర్ సలహామీద కార్ల్, యింకా పూర్తిగా కోలుకోకపోయినప్పటికీ, నడి శీతకాలపు చలిలో, ట్రీయర్‌లో తన తల్లి వదలిపోయిన ఆస్తిని చూసుకోడానికి, జర్మనీకి బయలుదేరినాడు; ఆందోళనతో నిండిన మా హృదయపూర్వక శుభాకాంక్షలతో ఆయన బయలుదేరినాడు. అక్కడ ఆయన కొద్ది కాలం తన బావ కోన్రాడ్, తన సోదరి ఎమిలీల వద్ద వుండి, తరువాత తన మేనత్తను చూడడానికి ఫ్రాంక్‌ఫుర్ట్‌కు పోయినాడు. అక్కడినుండి ఆయన తన పినతండ్రిని చూడడానికి బొమెల్‌కు పోయినాడు. ఆయన పినతండ్రీ, నెట్‌హెన్ ఆయన్ను చాలా శ్రద్ధగా చూసుకున్నారు. దురదృష్టవశాత్తు ఆయనకు వైద్యసహాయమూ, శ్రద్ధతో కూడిన సంరక్షణా అవసరమైనాయి.

ఆయన బొమెల్ చేరిన వెంటనే, పూర్తిగా నయం కాని ఆ జబ్బు మళ్లీ తీవ్రంగా తిరగబెట్టి, క్రిస్మస్‌నుండి ఫిబ్రవరి 19 దాకా ఆయన హాలండులో వుండేటట్లు చేసింది.

ఒంటరితనపు, బాధాకరమైన చలికాలం భయంకరంగా వుండింది! తల్లి వదలిపోయిన ఆస్తిలో కార్ల్‌కు వచ్చిన స్వల్ప భాగాన్ని ఆయన నగదు రూపంలో తెచ్చినందువలన, మేము మా బాధ్యతలూ, అప్పులూ, కుదువ వర్తకుడూ వగైరాలనుండి విముక్తులం కాగలిగినాము. అదృష్టవశాత్తు, మాకు చాలా ఆకర్షవంతమైన, ఆరోగ్యకరమైన యిల్లు దొరికింది; దాన్ని మేము చాలా సుఖప్రదంగానూ, కాస్త అందంగానూ తయారు చేసుకున్నాము. 1864 ఈస్టర్ సమయంలో మేము బాగా గాలీ, వెలుతురూ వచ్చే ఆ ఆహ్లాదకరమైన యింటిలోకి మారినాము.

విశ్వాసం గల మా పాత ఆప్త మిత్రుడు లూపుస్ చాలా జబ్బుగా వున్నాడని 1864 మే 2న మాకు ఎంగెల్సునుండి ఉత్తరం వచ్చింది. కార్ల్ వెంటనే పోయి అతన్ని చూసినాడు; ఆ విశ్వాసం గల మిత్రుడు ఆయన్ను కాసేపు గుర్తుపట్టినాడు. మే 9న లూపుస్ మరణించినాడు. అతని వీలునామాలో, కొందరు చిల్లర వారసులు కాక, కార్ల్‌నూ, నన్నూ, మా పిల్లలనూ ప్రధాన వారసులుగా రాసినాడు. మితంగా జీవించే ఆ సరళ వ్యక్తి అమితమైన పరిశ్రమ ద్వారా, కృషి ద్వారా 1000 పౌండ్ల మంచి మొత్తం మిగిలించి వుండినట్లు తేలింది. తన జీవిత శ్రమ ఫలితాన్ని ప్రశాంతమైన, సుఖప్రదమైన వృద్ధాప్యంలో అనుభవించే ఊరట అతనికి లేకపోయింది. అతని ద్వారా మాకు సహాయమూ, ఉపశమనమూ, దిగులులేని ఒక యేడాదీ లభించినాయి.

యింకా క్లిష్ట దశలో వుండిన కార్ల్ ఆరోగ్యానికి సముద్రతీరంలో కొన్నాళ్లు వుండడం

పరమ అవసరం అయింది. ఆయన జెన్నీతో కలిసి రామ్స్‌గేట్‌కు పోయినాడు; తరువాత లౌరా, టుస్సీ వాళ్లను అనుసరించినారు....

ఆ సంవత్సరం ఆయన అర్థశాస్త్రంలో తన పెద్ద రచనకు* ఒక ప్రచురణకర్తను సంపాయించగలిగినాడు. హాంబుర్గ్‌లోని మైస్నర్ తగినంత అనుకూలమైన షరతులమీద ప్రచురించడానికి వాగ్దానం చేసినాడు. ఆ గ్రంథం పూర్తిచేయడానికి కార్ల్ అప్పుడు తీవ్రంగా కృషిచేసినాడు....

---

* "పెట్టుబడి." — సం.

# యోసెఫ్ వేడిమేయర్‌కు జెన్నీ మార్క్స్

లండన్, మే 20, 1850

ప్రియమైన వేడిమేయర్,

మీరూ, మీ ప్రియమైన భార్యా నాకు అంత మైత్రీపూర్వకమైన, హార్దికమైన ఆతిథ్యం యిచ్చి, నేను మీ యింటిలో అంత సుఖంగా, స్వేచ్ఛగా వుండి, త్వరలో సంవత్సర మౌతుంది. యీ కాలమంతా నేను బతికివున్న లక్షణాలే మీకు చూపించలేదు: మీ భార్య నాకు అంత ఆప్యాయమైన ఉత్తరం రాసినప్పుడు నేను మౌనంగా వుండినాను, మీకు బిడ్డ పుట్టిన వార్త మాకు అందినప్పుడు కూడా నేను ఆ మౌనాన్ని భంగం చేయలేదు. నా మౌనం తరచు నన్ను బాధించింది, కానీ యీ కాలంలో అత్యధిక భాగం నాకు రాయడం సాధ్యం కాలేదు; యీనాడు కూడా రాయడం కష్టంగా వుంది, చాలా కష్టంగా వుంది.


కానీ, పరిస్థితులు కలం పట్టుకునేటట్లు నిర్బంధిస్తున్నాయి. ''రెవ్యూ''*నుండి మీకు డబ్బేమైనా అందివుంటే, లేక అందితే, మాకు వీలైనంత త్వరలో పంపాలని ప్రార్థిస్తున్నాను. డబ్బు మాకు చాలా చాలా అవసరంగా వుంది. సంవత్సరాల తరబడి మేము చేస్తున్న, భరిస్తున్న త్యాగాలను గురించి మేము యెప్పుడైనా గొప్పగా చెప్పుకున్నామని మమ్మల్ని యెవరూ నిందించ లేరు. మా పరిస్థితులు జనానికి యెప్పుడూ, లేక దాదాపు యెప్పుడూ, తెలియవు. నా భర్త అలాంటి విషయాలలో చాలా సున్నితమైనవాడు; ఆయన తన సర్వమూ త్యాగం చేస్తాడు కానీ, అధికారికంగా గుర్తింపబడిన ''గొప్పవాళ్ల''లాగా ప్రజాతంత్ర భిక్షాటనకు దిగడు. అయితే, ఆయన తన మిత్రులనుండి, ముఖ్యంగా కొలోన్‌లోని మిత్రులనుండి, ''రెవ్యూ''కు క్రియాత్మకమైన, చురుకైన అండదండలు ఆశించి వుండగలడు. ''రైనిషె సైటుంగ్'' కొరకు

---

* ''నోయె రైనిషె సైటుంగ్. పొలిటిష్-ఒకొనామిషె రెవ్యూ.'' — సం.



కమ్యూనార్డ్ల చిట్టచివరి యుద్ధం



1870లో క్రెసో లోహపు ఫాక్టరీ కార్మికుల సమ్మె

ఆయన చేసిన త్యాగాలు యెక్కడ తెలుసునో అక్కడనుండి ప్రప్రథమంగా ఆయన అలాంటి అండదండలు ఆశించివుండగలడు. అండదండలకు బదులు, అశ్రద్ధగా, అస్తవ్యస్తంగా నిర్వహించినందువలన వ్యాపారం సర్వనాశనమైంది. అన్నిటికంటె యెక్కువ వినాశకరమైనది పుస్తక విక్రేత ఆలస్యాలో, వ్యాపార నిర్వాహకుల ఆలస్యాలో, కొలోన్‌లోని పరిచయస్తులో, మొత్తంమీద డెమోక్రట్ల వైఖరో తెలియదు.

యిక్కడ నా భర్త జీవితపు చిల్లర దిగుళ్లచేత దాదాపు తలమునకలైనాడు; అవి యెంత అసహ్యమైన రూపంలో వున్నాయంటే, దినదినమూ, గంటగంటా చేసే ఆ పోరాటంలో అవి ఆయన శక్తి నంతటినీ, ఆయన ప్రశాంతమైన, స్వచ్ఛమైన హుందాతన మంతటినీ హరించినాయి. ప్రియమైన వేడిమేయర్, పత్రికకు నా భర్త చేసిన త్యాగాలు మీకు తెలుసు. ఆయన దానికి వేలు నగదు పెట్టినాడు, దాని యాజమాన్యం తన చేతికి తీసుకున్నాడు. ఆయన అలా చేయకపోతే దాని అప్పులకు సమాధానం చెప్పవలసి వుండిన గౌరవనీయ డెమోక్రట్ల మాటలు విని, అది విజయం పొందే అవకాశం లేని సమయంలో, ఆయన అలా చేసినాడు. పత్రికయొక్క రాజకీయ గౌరవాన్నీ, తన కొలోన్ పరిచయస్తుల పౌర గౌరవాన్నీ కాపాడడానికి ఆయన యావత్తు బాధ్యతనూ తన పైన వేసుకున్నాడు; ఆయన తన ప్రింటింగ్ ప్రెస్సును త్యాగం చేసినాడు, ఆదాయ మంతటినీ త్యాగం చేసినాడు, అక్కడనుండి వెళ్లిపోయేముందు, కొత్తగా అద్దెకు తీసుకున్న భవనానికి అద్దె, సంపాదకులకు బాకీవుండిన జీతాలు, మొదలైనవి చెల్లించడానికి 300 థేలెర్లు అప్పు కూడా చేసినాడు. మరి, ఆయన బలవంతంగా గెంటి వేయబడినాడు. మేము మా కొరకు యేమీ వుంచుకోలేదని మీకు తెలుసు. మా వెండి సామాను — మా కుండిన చివరిది — తాకట్టు పెట్టడానికి నేను ఫ్రాంక్‌ఫుర్ట్‌కు పోయినాను. నా విలువైన వస్తువులూ, సమస్తమూ జప్తు చేయబడే ఉపద్రవం వుండింది గనుక, నేను కొలోన్‌లోని నా ఫర్నిచర్ అమ్మినాను. బాధాకరమైన ప్రతీఘాత విప్లవ కాలపు ప్రారంభంలో నా భర్త పారిస్‌కు పోయినాడు, మా ముగ్గురు పిల్లలతో నేను అనుసరించినాను. ఆయన పారిస్‌లో స్థిరపడీ స్థిరపడక ముందే అక్కడనుండి బహిష్కరింపబడినాడు; అక్కడ యే కొంత కాలమైనా వుండడానికి మా పిల్లలకూ, నాకూ కూడా అనుమతి నిరాకరింపబడింది. నేను మళ్లీ ఆయన వెంట సముద్రం దాటిపోయినాను. ఒక నెల తర్వాత మా నాల్గవ బిడ్డ పుట్టింది. ముగ్గురు పిల్లలు వుండడమూ, నాల్గవ పిల్లను కనడమూ అంటే యేమిటో అర్థం కావడానికి మీరు లండన్‌నూ, యిక్కడి పరిస్థితులనూ తెలుసుకోవలసి వుంటుంది. అద్దెకు మాత్రమే మేము నెలకు 42 థేలెర్లు చెల్లించవలసి వుండింది. మాకు వచ్చిన డబ్బుతో మేము దీనిని యెదుర్కొగలిగినాము; కానీ "రెవ్యూ" ప్రచురింపబడినప్పుడు, మా స్వల్ప ఆదాయం అయిపోయింది. ఒప్పందానికి వ్యతిరేకంగా, మాకు డబ్బు యివ్వలేదు, తరువాత చిన్న చిన్న మొత్తాలుగా మాత్రమే యిచ్చినారు; ఫలితంగా యిక్కడ మా పరిస్థితి మహా భయం గొలిపేదిగా వుండింది.

నేను ఆ జీవితంలో ఒక్క రోజును మాత్రం వర్ణిస్తాను, సరిగ్గా యెలా జరిగిందో అలాగ; బహుశా కొద్దిమంది ప్రవాసులు మాత్రమే అలాంటి పాట్లు పడివుంటారని మీకు అర్థమౌతుంది. యిక్కడ పాలదాదులకు మితిమీరిన డబ్బు యివ్వాలి గనుక, నాకు రొమ్ములోనూ, వీపులోనూ నిత్యం ఘోరమైన బాధ వున్నప్పటికీ, నా బిడ్డకు నేనే పాలు యివ్వడానికి నిశ్చయించినాను. కానీ నా బంగారు బాబు పాలుతోపాటు యెంత దిగులూ, దిగమింగిన ఆందోళనా తాగినాడంటే, యెప్పుడూ అనారోగ్యంగా వుండి, రేయింబగలూ దారుణంగా బాధపడినాడు. వాడు యీ భూమిమీద పడినప్పటినుండి ఒక్క రాత్రి కూడా నిద్రపోలేదు, మహా అయితే రెండు మూడు గంటలు నిద్రపోయి వుంటాడు, అదైనా అరుదుగా. యిటీవల వానికి తీవ్రంగా గింజుకోవడము కూడా వుండి, నిరంతరం చావు బ్రదుకులమధ్య వుండినాడు. వాని బాధలో వాడు నా రొమ్ము యెంత బిర్రుగా పీల్చినాడంటే, నా రొమ్ము పుండు అయి, చర్మం పగిలి, వాని వణికే చిన్న నోటిలోకి రక్తం దుమికేది. నేను అలా ఒక రోజు వాణ్ని ఒడిలో పెట్టుకొని కూర్చుని వుండగా, మా గృహ నిర్వాహకురాలు వచ్చింది. ఆమెకు శీతకాలంలో మేము 250 థేలర్లు యిచ్చి, భవిష్యత్తులో డబ్బు ఆమెకు యివ్వకుండా, ఆమె యింటి సొంతదారునికి యిచ్చేటట్లు ఒప్పందం చేసుకొన్నాం; ఆ సొంతదారుడు ఆమెమీద జప్తు వారంటు తెచ్చివుండినాడు. ఆమె ఒప్పందాన్ని నిరాకరించి, మేము యింకా ఆమెకు బాకీ వుండిన అయిదు పౌండ్లు డిమాండుచేసింది. మా దగ్గర అప్పుడు డబ్బు లేనందున (నొట్ రాసిన ఉత్తరం తరువాత గానీ రాలేదు) యిద్దరు అమీనాలు వచ్చి నా కుండిన కొద్ది వస్తువులన్నీ జప్తు చేసినారు – గుడ్డలూ, పడకలూ, దుస్తులూ, ప్రతిదీ – పసిబిడ్డ ఉయ్యాల కూడా, అక్కడ నిలబడి ఆవురుమని యేడుస్తున్న మా కూతుర్ల మంచి మంచి ఆటవస్తువులు కూడా. వాళ్లు రెండు గంటలలో తీసుకపోతామని బెదిరించినారు. అప్పు డిక నేను చలికి గడ్డకట్టుకపోయే మా పిల్లలతో, అస్వస్థంగా వున్న నా రొమ్ముతో, కటికనేలమీద పండుకొనవలసి వచ్చేది. మా మిత్రుడు ష్రామ్, మాకు సహాయం తీసుకరావడానికి, నగరంలోకి ఉరికినాడు. అతను గుర్రపు బండిలో యెక్కినాడు, కానీ గుర్రాలు బెదురుతున్నాయి, అతను కిందికి దుమికినాడు, రక్తపు గాయాలతో అతన్ని యింట్లోకి తెచ్చినారు. వణికే పిల్లలతో నేను యేడుస్తూ వుండినచోటికి.

మరుదినం మేము యిల్లు వదలిపెట్టవలసి వచ్చింది. ఆ రోజు చలిగా, వర్షం పడుతూ కాంతిహీనంగా వుండింది. నా భర్త మాకు విడిదికోసం ప్రయత్నించినాడు. నలుగురు పిల్లలు వున్నారని ఆయన చెప్పగానే యెవరూ మాకు విడిది యివ్వరు. చివరి కొక మిత్రుడు మాకు సాయం చేసినాడు. మేము అద్దె చెల్లించి, తొందరగా మా పడక లన్నీ అమ్మి, మందుల షాపు వానికీ, బ్రెడ్డు వర్తకునికీ, మాంస వర్తకునికీ, పాలవాళ్లకూ డబ్బు చెల్లించినాము; వాళ్లు జప్తు దృశ్యం చూసి భయపడి, హఠాత్తుగా తమ బిల్లులతో నన్ను చుట్టుముట్టినారు. మేము అమ్మిన పడకలు బయటికి తెచ్చి, బండిమీద పెట్టినారు. యేమి జరుగుతున్నది?

అప్పటికి బాగా పొద్దు గూకింది. ఇంగ్లీషు చట్టం ప్రకారం చీకటి పడిన తరువాత సామాన్లు తరలించకూడదు. అందుకని మేము యీ చట్టాన్ని ఉల్లంఘించినట్లయింది.

మా యింటి సొంతదారుడు యిద్దరు పోలీసులతో పరుగున వచ్చి, ఆ సామాన్లలో తన సామాన్లు కొన్ని వుండవచ్చుననీ, మేము విదేశాలకు పారిపోవా లనుకున్నామనీ వాదించినాడు. అయిదు నిముషాలు కాకముందే మా వాకిలి చుట్టూ రెండు మూడు వందలమంది అటూ యిటూ తిరుగుతున్నారు — చెల్సీ గుంపు అంతా. పడకలు మళ్లీ లోపల పెట్టినారు — మరుదినం పొద్దు పొడిచిన తర్వాత గానీ వాటిని కొనుగోలుదారునికి యివ్వడానికి వీలులేదు. మేము మా సామాన్లు అన్నీ అమ్మినప్పుడు మా అప్పులు చివరి పైసావరకు చెల్లించే స్థితిలో వుండినాము. మేము యిప్పుడు వుంటున్న జర్మన్ హోటల్ (1, లైసెస్టర్ స్ట్రీట్, లైసెస్టర్ స్క్వేర్)లోని రెండు చిన్న గదులకు మా చిన్న పిల్లలతో పోయినాము. అక్కడ వారానికి 5 పౌండ్లు యివ్వగా మమ్మల్ని మనుషుల మాదిరి చూసినారు.

ప్రియ మిత్రమా, యిక్కడి మా జీవితంలోని ఒక్క రోజును యింత దీర్ఘంగా, అధిక ప్రసంగంగా వర్ణించినందుకు క్షమించండి. యిది అనుచితమని నాకు తెలుసు, కానీ యీ సాయంత్రం నా హృదయం దుఃఖంతో నిండి పొర్లిపోతున్నది, నా నిజమైన, ఉత్తమ, పాత మిత్రుని వద్ద ఒకసారైనా నా హృదయ భారం దించుకోవాలి. యీ చిల్లర దిగుళ్లకు నేను లొంగిపోయినానని అనుకోకండి: నాకు యెంతో బాగా తెలుసు, మన పోరాటం యేకాకిది కాదు, నేను అదృష్టమూ, ఆనందమూ గల భాగ్యవంతులలో ఒకతెను, యెందుకంటే, నా జీవిత ఆధారమైన నా భర్త యిప్పటికీ నా పక్కన వున్నాడు. నిజంగా నా ఆత్మనే క్షోభపెట్టేదీ, నా హృదయ రక్తాన్ని పిండేదీ యేమిటంటే, చిల్లర విషయాలతో ఆయన అంతగా బాధపడవలసి రావడం, ఆయనకు అంత స్వల్ప సహాయం లభించగలగడం, అంతమంది యితర్లకు యిష్టంతో, సంతోషంతో సహాయం చేసిన ఆయనే అంత నిస్సహాయుడు కావడం. కానీ, ప్రియమైన వేడిమేయర్, మేము యెవరిమీదనైనా డిమాండ్లు చేస్తున్నామని అనుకోకండి. నా భర్త తన భావాలనూ, తన ప్రోత్సాహాన్నీ, తన అండదండలనూ యిచ్చినవాళ్లను కోరగలిగిందల్లా ఒక్కటే: తన ''రెవ్యూ''కు సంబంధించిన వ్యాపారంలో మరింత చురుకుదనం చూపించమనీ, దానికి మరింత అండదండలు యివ్వమనీ. యీ విషయం నేను సగర్వంగా, ధైర్యంగా ఉద్ఘాటించ గలను. ఆ స్వల్పం ఆయన హక్కు. అది యెవరికీ అన్యాయమని నేను అనుకోను. అదే నన్ను దుఃఖపెట్టేది. కానీ నా భర్త అభిప్రాయం వేరు. యెప్పుడూ, అత్యంత భయంకరమైన క్షణాల్లో కూడా, ఆయన భవిష్యత్తులో విశ్వాసం కోల్పోలేదు; తన ఉత్సాహపూరిత మనస్తత్వం కూడా కోల్పోలేదు; నేను ఉల్లాసంగా వుండడమూ, మా అనురక్త సంతానం తమ ప్రియమైన తల్లిని అంటగరుచుకుని వుండడమూ చూసి ఆయన సంతృప్తి పడతాడు. ప్రియమైన వేడిమేయర్, మా పరిస్థితిని గురించి మీకు నేను యింత వివరంగా రాసినానని

ఆయనకు తెలియదు. అందుకని యీ మాటలను మీరు ప్రస్తావించవద్దని మిమ్మల్ని కోరుతున్నాను. మా డబ్బు వసూలు చేయడమూ, పంపడమూ వీలైనంత త్వరగా చేయండని ఆయన పేరుమీద మిమ్మల్ని అడిగినానని మాత్రమే ఆయనకు తెలుసు.

సెలవు, ప్రియ మిత్రమా, నా అనురాగ పూర్వకమైన శుభాకాంక్షలు మీ భార్యకు అందజేయండి, మీ బుజ్జి పాపాయికి నా తరఫున ముద్దు యివ్వండి, తన బిడ్డకోసం యెన్నో కన్నీళ్లు కార్చిన ఒక తల్లి తరఫున. అయినప్పటికీ మా ముగ్గురు పెద్ద పిల్లలూ అద్భుతంగా వున్నారు. ఆడపిల్లలు అందంగా, ఆరోగ్యంగా, ఉల్లాసంగా, బుద్ధిమంతులుగా వున్నారు; బొద్దుగా వున్న మా చిన్న కుర్రవాడు హుషారుగా వున్నాడు, వాని పొట్టనిండా మహా తమాషా అయిన భావాలు వున్నాయి. కుర్రకుంక రోజంతా ఆశ్చర్యకరమైన ఆవేశంతో, ఉరుములాంటి కంఠంతో పాడుతూవుంటాడు. ఫ్రైలిగ్రాత్ రచించిన "మార్సెల్యేస్" పాటలోని పాదాలు వాడు గొంతు చించుకొని పాడితే యిల్లు దద్దరిల్లిపోతుంది:

"రావే జూన్, లోకోత్తరమగు ఘనకార్యాలను మాకై మోసుకరావే, జూన్!
యశస్కరమ్మగు పనులు చేయ మా హృదయము ఉవ్విళ్లూరుచు న్నన్నది."

బహుశా ఆ నెలయొక్క చరిత్రాత్మక విధి కావచ్చు, గత రెండు జూన్‌లలాగే బ్రహ్మాండమైన పోరాటం ప్రారంభించడం;* అందులో మళ్లీ మనమందరమూ చేతులు కలుపుదాం. సెలవు!

---

* పారిస్ కార్మికవర్గం ఓడిపోయిన 1848 జూన్‌కూ, నైరుతి జర్మనీలో రైహ్ రాజ్యాంగ ఉద్యమం ఓడిపోయిన 1849 జూన్‌కూ ప్రస్తావన. – సం.

# లుయీసా వేడిమేయర్‌కు జెన్నీ మార్క్స్

హాంప్‌స్టెడ్, మార్చి 11, 1861

ప్రియమైన శ్రీమతి వేడిమేయర్,

మీరు దయతో రాసిన ఉత్తరం యీ ఉదయం అందింది; నాకు యెంత సంతోషం కలిగిందీ మీకు తెలియజేయడానికి, కూర్చుని వెంటనే మీకు పెద్ద ఉత్తరం రాయాలనుకున్నాను; యెందుకంటే, మానుండి అప్పుడప్పుడు మీరు విషయాలు తెలుసుకోవడానికి యిష్టపడతారనీ, మిమ్మల్ని గురించి మాకు వున్నట్లే మమ్మల్ని గురించి మీకు ఆప్యాయమైన స్మృతులు వున్నాయనీ మీ ఆప్యాయమైన ఉత్తరం ద్వారా నాకు తెలుసు.

విధి ద్వారా ఒకే సుఖదుఃఖాలూ, ఒకే శుభాశుభదినాలూ పొందిన యింత పాత కామ్రేడ్లూ, మిత్రులూ, వాళ్లను కాలమూ, సముద్రమూ, వేరుచేసినప్పటికీ, యెలా ఒకరికొకరు పరాయివాళ్లుగా భావించగలరు! కనుక ధైర్యమూ, విశ్వాసమూ గల దుఃఖ సహచారిణిగా, యోధురాలిగా, బాధితురాలిగా మీకు నా హస్తం చాస్తున్నాను. ఔను, ప్రియమైన శ్రీమతి వేడిమేయర్, మా హృదయాలు చాలాసార్లు భారంగా, దుఃఖమగ్నంగా వుండినాయి; యిటీవల మీరు యెన్ని పాట్లు పడివుంటారో నేను బాగా ఊహించగలను. మీ కష్టాలూ, దిగుళ్లూ, కడగండ్లూ అన్నీ నేను ఊహించగలను; యెందుకంటే, నేను తరుచు అవే అనుభవించినాను. కానీ బాధ మనల్ని కాకలు దీరుస్తుంది, ప్రేమ మనల్ని నిటారుగా నిలుపుతుంది!

యిక్కడ మేము వున్న తొలి సంవత్సరాలలో దారుణమైన గడ్డు కాలం అనుభవించినాము. కానీ మా విషాద స్మృతులన్నిటిని గురించీ, మేము అనుభవించిన నష్టాలన్నిటిని గురించీ, యెవరి ఆకారాలను మేమింకా మౌన దుఃఖంతో మా హృదయాలలో వుంచుకున్నామో ఆ ప్రేమమూర్తులను గురించీ యీనాడు నేను మాట్లాడదలచుకోలేదు.

మా జీవితాలలోని ఒక కొత్త దశను గురించి యీనాడు మీకు చెప్పనివ్వండి; అందులో అనేక చెడ్డరోజులు వున్నప్పటికీ, మంచి రోజులూ కూడా వున్నాయి.

1856లో నేను మా ముగ్గురు ఆడపిల్లలతో ట్రీయర్‌కు పోయినాను. తన మనుమరాళ్లతో

సహా నన్ను చూసినప్పుడు మా అమ్మ సంతోషం మాటలలో వర్ణించరానంతగా వుండింది. కానీ, దురదృష్టవశాత్తు, అది చాలా కాలం వుండలేదు. ఆ నిజమైన, ఉత్తమమైన తల్లి జబ్బుపడి, పదకొండు రోజులు బాధపడిన తర్వాత, పిల్లలను ఆశీర్వదించి, తన అలసిన కన్నులు మూసింది. మా అమ్మ యెంత అనురాగమూర్తి అయిందీ తెలిసిన మీ ప్రియమైన భర్త నా మాతృ వియోగ దుఃఖాన్ని బాగా అంచనా వేయగలడు. ప్రియమైన మా అమ్మను మేము అంతిమ విశ్రాంతి స్థానంలో వుంచిన తర్వాత, మా అమ్మ నాకూ, నా సోదరుడు ఎడ్గార్‌కూ వదలిపోయిన చిన్న ఆస్తి వ్యవహారం చూసుకున్నాను. తరువాత మేము ట్రీయర్ వదలిపెట్టినాము.

అంతవరకు మేము లండన్‌లో దరిద్రపు అద్దె ఇంట్లో నివసించినాము. మా అమ్మ, మా కొరకు అన్ని త్యాగాల తర్వాత, మాకు వదలిపోయిన కొద్ది వందల థేలెర్లతో అందమైన హాంప్‌స్టెడ్ హీత్‌కు ("తెల్ల దుస్తుల స్త్రీ"ని* అనువాదం చేసిన మీకు ఆ పేరు తప్పక జ్ఞాపకం వుంటుంది) అనతి దూరంలో ఒక చిన్న యిల్లు అద్దెకు తీసుకున్నాము, యిప్పుడు యింకా అక్కడే వున్నాము. మేము యింతకు ముందు నివసిస్తూ వుండిన బొరియలతో పోలిస్తే యిది నిజంగా రాజసౌధం. దీనిని పైనుండి కిందిదాకా ఫర్నిచర్ వగైరాలతో అలంకరించడానికి 40 పౌండ్లకంటె యెక్కువ ఖర్చు కాకపోయినా (సెకండు హాండు తుక్కు చాలా ఉపయోగపడింది), మా సుఖమైన డ్రాయింగ్ రూములో మొదట నాకు మహా రాణిలా అనిపించింది. గుడ్డలూ, గత వైభవపు యితర చిన్న అవశేషాలూ "తాకట్టు"నుండి విడిపించుకున్నాము. పాత స్కాటిష్ డమాస్క్ నాప్కిన్లు లెక్కపెట్టుకునే ఆనందం నాకు మళ్లీ కలిగింది. యీ అద్భుతం చాలా కాలం సాగకపోయినా — త్వరగా ఒక వస్తువు తర్వాత మరొకటి మళ్లీ తాకట్టు వర్తకునివద్దకు పోవలసి వచ్చినాయి — సుఖంగా వుండడం మాకు నిజమైన ఆనందంగా వుండింది. తరువాత మొదటి అమెరికన్ సంక్షోభం వచ్చింది, మా ఆదాయం సగమైంది. మాకు మళ్లీ యిబ్బందులు వచ్చి అప్పుల్లో పడినాము. యిది నివారించలేకపోయినాము, యెందుకంటే మా ముగ్గురు ఆడపిల్లల విద్యను, అది ప్రారంభమైన పద్ధతిలోనే కొనసాగించవలసి వుండింది.

యిప్పుడు మా జీవితపు కాంతి పార్శ్వానికి వస్తాను, మా జీవితపు తేలిక భాగానికి — మా ముద్దు బిడ్డల విషయానికి. దయాళువైన మీ భర్త మా బిడ్డలు చిన్న పిల్లలుగా వున్నప్పుడు చూసి వాళ్లను ప్రేమించివుంటే, యిప్పుడు మొగ్గతొడిగే కన్యలుగా పెరిగిన వాళ్లను చూడడం ఆయనకు నిజమైన ఆనందంగా వుంటుందని నాకు నమ్మకంగా వుంది. మా ముద్దు బిడ్డల కీర్తిగానం చేయడం ద్వారా నేను గోము చేసే తల్లి నైనట్లు మీరు అనుకునే ప్రమాదం వుంది. వాళ్ల కిద్దరికీ చాలా దయగల హృదయమూ, మంచి స్వభావమూ, నిజంగా ప్రేమించదగిన నమ్రతా, కన్యా సహజమైన సద్గుణమూ వున్నాయి. మే 1వ తేదీ

---

* విలియం కోలిన్స్ రాసిన ఒక నవల. — సం.

నాడు జెన్నీకి పదేళ్లు నిండుతాయి. జెన్నీ మరీ ఆకర్షవంతంగా వుంది, అందంగా కూడా వుంది, చిక్కని, నల్లని నిగనిగలాడే జుట్టుతో, అదే నలుపు గల, ప్రకాశవంతమైన, మృదువైన కన్నులతో, గోధుమ రంగు శరీరచ్ఛాయతో — కానీ శరీరచ్ఛాయకు యింగ్లండుకు విలక్షణమైన నవ వికాసం వచ్చింది. ఆపిల్ పండులా గుండ్రని ఆమె శైశవ ముఖంలోని ఆహ్లాదకరమైన సౌజన్య భావం అంత అందంగా లేని, పైచూపు గల ముక్కును గమనించకుండా చేస్తుంది; చిరునవ్వుతో నోరు తెరచి, అందమైన పలువరస కనిపించినప్పుడు మనోహరంగా వుంటుంది.

గత సెప్టెంబర్‌లో పదైదేండ్లు నిండిన లౌరా బహుశా తన అక్కకంటె అందంగా, మట్టసమైన ముఖ లక్షణాలు కలిగివుంది. ఆమెకు ఈమె సరిగా విరుద్ధం. జెన్నీలాగే లౌరా పొడవుగా, సన్నగా, సుకుమారమైన శరీర నిర్మాణం కలిగివుంది, కానీ అన్ని విధాలా జెన్నీకంటె తెల్లగా, తేటగా, స్వచ్ఛంగా వుంది. ముఖంలో పైభాగాన్ని బట్టి లౌరాను సౌందర్యవతి అనవచ్చు; ముదురు గోధుమరంగు నొక్కుల జుట్టు అంత మనోహరంగా వుంది; యెప్పుడూ సంతోషంతో మిలమిల మెరుస్తూ పచ్చ తళుకు వెలిజిమ్మే అందమైన కన్నులు అంత మధురంగా వున్నాయి. నుదురు అంత విశాలంగా, తీర్చి దిద్దినట్లు వుంది. కానీ ఆమె ముఖంలో కింది భాగం అంత మట్టసంగా లేదు, యింకా పూర్ణ వికాసం రాలేదు. అక్కచెల్లెండ్రు యిద్దరికీ నవనవోన్మేషమైన శరీరచ్ఛాయ వుంది. వాళ్లు యెంత నిగర్వులంటే, వాళ్లను తరుచుగా నేను మనసులో మెచ్చుకుంటూ వుంటాను; వాళ్ల తల్లి చిన్నతనంలో అలా లేదు గనుక, ఆ మెచ్చుకోలు యింకా అధికం.

బడిలో ఫస్టు ప్రైజులు యెప్పుడూ వాళ్లకే. వాళ్లకు యింగ్లీషు ధారాళంగా వచ్చు, ఫ్రెంచి తగుమాత్రంగా తెలుసు, ఇటాలియన్‌లో డాంటెను అర్థంచేసుకుంటారు, స్పానిష్ కొద్దిగా చదవగలరు. జర్మన్ భాషలో మాత్రమే వాళ్లకు పెద్ద యిబ్బందులు వున్నాయి, అప్పుడప్పుడు పాఠం చెప్పడానికి నేను శక్తికొలది ప్రయత్నించినప్పటికీ; కానీ వాళ్లకు బొత్తిగా శ్రద్ధ లేదు, వాళ్లమీద నాకు అంత అధికారమూ, నామీద వాళ్లకు అంత గౌరవమూ వున్నప్పటికీ. జెన్నీ డ్రాయింగులో మరీ నేర్పరి, ఆమె పెన్సిల్ డ్రాయింగులు మా యింటిలోని ఉత్తమ అలంకరణలు. డ్రాయింగు విషయంలో లౌరా చాలా అశ్రద్ధగా వుండినందువలన, శిక్షగా ఆమెకు డ్రాయింగు పాఠాలు నిలిపివేసినాము. కానీ ఆమె పియానో సాధనమీద శ్రద్ధ వహిస్తున్నది, వాళ్ల అక్కతో కలిసి యింగ్లీషులోనూ, జర్మన్‌లోనూ చాలా మనోహరంగా యుగళగీతాలు పాడుతుంది. దురదృష్టవశాత్తు, ఆలస్యంగా మాత్రమే — సుమారు ఒకటిన్నర సంవత్సరం క్రితం — సంగీత పాఠాలు మొదలుపెట్టగలిగినారు. పాఠాలకు డబ్బు చెల్లించడం మా శక్తికి మించిన పనిగా వుండింది; పైగా, మాకు పియానో లేదు. యిప్పుడున్నది బాడుగది, పియానో అనే పేరుకు అనర్హమైనది.

వాళ్ల మనోహరమైన వినయశీలత ద్వారా ఆడపిల్ల లిద్దరూ మాకు యెన్నోసార్లు ఆనందం కలిగిస్తుంటారు. కానీ వాళ్ల చెల్లెలిని యింటిల్లిపాది లాలించి అతిగా ముద్దు చేస్తున్నారు.

మా ప్రియమైన ఎడ్గార్ మాకు దూరమైనప్పుడు ఆ పిల్ల పుట్టింది; చిన్ని తమ్ముని మీది ప్రేమా, అనురాగమూ అంతా ఆ చిట్టి చెల్లెలిమీదికి మళ్లింది. పెద్ద పిల్లలు ఆ పిల్లను దాదాపు మాతృ శ్రద్ధతో పోషించి, లాలించినారు. అంతకంటె మనోహరమైన శిశువు వుండజాలని మాట నిజమే, అంత ముచ్చటగా, సరళంగా, ఉల్లాసంగా. ఆ పిల్లలో అన్నిటికంటె కొట్టవచ్చినట్లు కనిపించేది యేమిటంటే, మాటలన్నా, కథలు చెప్పడమన్నా ఆ అమ్మాయికి గల మోజు. యిది అమ్మాయికి గ్రిమ్ సోదరులనుండి వచ్చింది, వాళ్లను రేయింబగలూ వదలిపెట్టదు. ఆ కథలన్నీ మేము అలసిపోయేదాకా ఆమెకు చదివి వినిపించినాము, కానీ గలాటా దయ్యం గురించి కానీ, బ్రాసెల్ బార్ట్ రాజును గురించి కానీ, స్నోవైట్‌ను గురించి కానీ ఒక అక్షరం వదలిపెట్టితే మా ప్రాణం తీసేది. ఆ కథల ద్వారానే అమ్మాయి జర్మన్ భాష నేర్చుకోవడమూ – అంటే, యిక్కడ ఉగ్గుపాలతో నేర్చుకున్న యింగ్లీషు కాక – మాటలు అత్యంత నిర్దుష్టంగా, కచ్చితంగా వుండడమూ. అమ్మాయి కార్ల్‌కు నిజమైన ముద్దుబిడ్డ. ఆయన విచారాలలో చాలావాటిని అమ్మాయి వాగుడు పారదోలుతుంది. యిక కుటుంబ విషయ మంటే, లెన్‌హెన్ యథాప్రకారం స్థిరంగా త్రికరణ శుద్ధిగా వుంది. ఆమె నాకు యెంత అమూల్య సంపద అయిందీ మీ భర్త నడగండి చెప్తాడు. మంచికీ చెడ్డకూ పదహారు సంవత్సరాలుగా ఆమె నన్ను అంటిపెట్టుకొని వుంది.

గత సంవత్సరం ''ముగిసిపోయిన ప్రకృతి''ని గురించి జరిగిన నీచపు దాడులవలన, జర్మన్, అమెరికన్, వగైరా పత్రిక లన్నిటి నీచధోరణివలన, మాకు తీవ్రమైన మనస్సంకటం కలిగింది. ఆ వ్యవహారం ద్వారా మాకు యెన్ని దిగుళ్లూ, యెన్ని నిద్రలేని రాత్రులూ సంభవించినాయో మీరు ఊహించలేరు.* ''నత్సియొనాల్ త్సైటుంగ్'' మీద వ్యాజ్యానికి చాలా డబ్బు ఖర్చు అయింది; కార్ల్ తన పుస్తకం ముగించినప్పుడు దానికి ప్రచురణకర్త దొరకలేదు. ఆయన దానిని తన ఖర్చుతోనే (25 పౌండ్లు) అచ్చు వేయించుకోవలసి వచ్చింది. యిప్పుడది వెలువడిన తర్వాత నీచ, పిరికి, కిరాయి పత్రికలు దానిని మౌనంగా ఉపేక్షించినాయి. మీకు అది నచ్చినందుకు నాకు మహా సంతోషంగా వుంది. దానిమీద మీ అభిప్రాయం, దాదాపు మాటకు మాట, మన యితర మిత్రు లందరి అభిప్రాయం లాగే వుంది. పత్రికల ఉద్దేశపూర్వక మౌనంవలన,

---

* పెటీబూర్జువా ప్రజాతంత్రవాది ఫోగ్ట్, జర్మన్, స్విస్, ఫ్రెంచి, అమెరికన్ పత్రికల్లోని అతని ముఠా 1860లో మార్క్స్‌మీద సాగించిన దుష్ప్రచారానికి యిది ప్రస్తావన. 1860 నవంబర్‌లో వెలువడిన మార్క్స్ రచన ''హెర్ ఫోగ్ట్'' ఆ దాడులకు సమాధానం. – సం.

సహజంగానే, ఆ పుస్తకంయొక్క అమ్మకం మేము ఆశించడానికి యెంత హక్కు వుందో అంత విజయవంతంగా యెంతమాత్రమూ లేదు. కానీ విలువగలవాళ్లందరి మెప్పుతో ప్రస్తుతానికి తృప్తిపడక తప్పదు. వ్యతిరేకులూ, శత్రువులూ కూడా దానిని గొప్ప ప్రాముఖ్యం గల గ్రంథంగా గుర్తిస్తున్నారు. బ్యూహెర్ దానిని సమకాలిక చరిత్ర సారం అంటున్నాడు. తనకూ, తన మిత్రులకూ అది వర్ణించరాని ఆనందం కలిగించిన కళాఖండమని లాసాల్ రాసినాడు; తన మిత్రులు దాని చమత్కారంపట్ల ఆహ్లాదమూ, ఆనందమూ వ్యక్తం చేయకుండా వుండలేరట. ఎంగెల్సు అభిప్రాయంలో అది కార్ల్ రచనలలో కెల్ల ఉత్తమమైనది; లూపున్ అభిప్రాయం కూడా అదే. అన్ని వైపులనుండీ దానికి అభినందనలు కుండపోతగా వస్తున్నాయి; ఆ పాత వెధవ రూగె కూడా దానిని "మంచి చెత్తే" అన్నాడు. దానిపట్ల అమెరికాలో కూడా యిదే మౌనం వహిస్తారేమో తెలుసుకోవాలని నాకు కుతూహలంగా వుంది. అలాంటి మౌనం దారుణంగా వుంటుంది; క్షుద్ర అబద్ధాలకూ, అపనిందలకూ అన్ని పత్రికలూ అవకాశ మిచ్చినాయి గనుక, అది మరీ దారుణంగా వుంటుంది. బహుశా మీ భర్త ఆ గ్రంథ ప్రచారానికి తోడ్పడవచ్చు గదూ?

రాత్రపతి యెత్తిరాయడం పూర్తిచేసిన వెనువెంటనే — అది యింకా ముద్రణాలయంలోనే వుండగా — హఠాత్తుగా నాకు చాలా జబ్బు చేసినట్లు అనిపించసాగింది. దారుణమైన జ్వరం వచ్చింది, డాక్టర్‌ను పిలవవలసి వచ్చింది. నవంబర్ 20న డాక్టర్ వచ్చి నన్ను దీర్ఘంగా, అతి శ్రద్ధగా పరీక్షచేసినాడు. దీర్ఘ మౌనం తర్వాత ఆయన నాతో యిలా అన్నాడు: "ప్రియమైన శ్రీమతి మార్క్సుగారూ, మీకు మశూచి వుందని చెప్పడానికి విచారిస్తున్నాను — పిల్లలు తక్షణం యిల్లు వదలిపెట్టాలి." యీ మాటలవలన యింటిలో భీతాహమూ, యేడుపులూ మీరు ఊహించుకోగలరు. మేము చేయగలిగిం దేముంది? లీబ్‌క్నెఖ్ట్ దంపతులు మా పిల్లలను తమ యింటికి తీసుకపోవడానికి తటపటాయించలేదు. ఆ మధ్యాహ్నమే ఆడపిల్లలు తమ కొద్దిపాటి వస్తువులు తీసుకొని ప్రవాసంలోకి పోయినారు.

నాకు గంటగంటకూ జబ్బు తీవ్రమైంది; మశూచి భయంకరంగా పొంగింది. నాకు బాధ తీవ్రంగా వుండింది, ముఖమంతా మంటలు; నిద్రపోవడం బొత్తిగా సాధ్యం కాలేదు. కార్ల్ నన్ను మహా ఆర్ద్రంగా చూసుకున్నాడు; ఆయన్ను గురించి నాకు చచ్చే ఆందోళన కలిగింది. చివరకు నా బాహ్యేంద్రియాలు బొత్తిగా పనిచేయకుండా పోయినాయి, నేను యెప్పుడూ స్పృహలోనే వుండినప్పటికీ. చల్లని నవంబర్ గాలి నా ఒళ్లుకు తగిలేటట్లు నేను నిత్యం తెరిచిన కిటికీవద్ద పండుకున్నాను, మరొక పక్క స్టౌలో మంట ధగ ధగ మండుతూ వుండింది, నా పెదవుల మీద మంచుగడ్డ వుంది, నాకు అప్పుడప్పుడు ద్రాక్షసారాయి చుక్కలు యిచ్చినారు. నాకు మింగడం కష్టమైంది, శ్రవణ శక్తి తగ్గిపోతూ వుండింది, చివరకు కండ్లు మూసుకపోయినాయి; శాశ్వత అంధకారంలో మునిగివుంటానేమో నాకు తెలియలేదు.

కానీ, అత్యంత ఆర్ద్రమైన, అసలైన సంరక్షణతో కలిసి నా దేహతత్వం పైకొనింది.

కనుక యిప్పుడిక్కడ కూర్చొని వున్నాను అచ్చమైన ఆరోగ్యంతో, కానీ మశూచి మచ్చలతో వికారమైన ముఖంతో, యిప్పుడు ఫాషన్‌లో వున్న "మజెంటా" యెరుపురంగుతో. పిల్లలు మాతృ గృహానికి రావాలని తహతహలాడుతూ వుండినారు, కానీ క్రిస్మస్‌కు ముందు దినం దాకా వాళ్లను రానివ్వలేదు. మా కలయికను వర్ణించడం సాధ్యం కాదు. పిల్లలు ఆవేశభరంతో తబ్బిబ్బైనారు; నన్ను చూసినప్పుడు కన్నీరు ఆపుకోవడం వాళ్లకు కష్టమైంది. అయిదు వారాలు ముందు, ఆరోగ్యవంతులైన నా బిడ్డల పక్కన నేను సరైన మనిషిగా వుండినాను. చిత్రంగా, నాకు నెరసిన వెంట్రుకలు లేవు, పండ్లూ, ఆకారమూ బాగా వుండినాయి; కనుక జనం నన్ను ఆరోగ్యం నిలబెట్టుకున్న స్త్రీలలో జమకట్టేవాళ్లు. అదంతా భూతకాల విషయమై పోయింది; నేను యిటు ఖడ్గమృగానికీ అటు నీటిగుర్రానికీ మధ్యన ఒక వింత జంతువుగా, కకేషియన్ జాతికి చెందడానికి బదులు జంతుప్రదర్శనశాలకు చెందవలసినదానిగా తయారైనాను. కానీ భయపడకండి. యిప్పుడు అంత అధ్వాన్నంగా లేదు. మచ్చలు మాసిపోతున్నాయి.

నేను మంచం వదలగలిగిన వెంటనే నా ప్రియమైన కార్ల్ జబ్బుపడినాడు. మితిమీరిన ఆందోళనా, రకరకాల దిగుళ్లూ, వ్యధలూ ఆయన్ను మంచం పట్టించినాయి. ఆయన దీర్ఘ లివర్ వ్యాధి మొదటిసారిగా తీవ్రమైంది. కానీ అదృష్టవశాత్తు, నాలుగు వారాల బాధ తర్వాత ఆయన జబ్బు నయమైంది. ఆ మధ్యలో "ట్రిబ్యూన్" మళ్లీ ఆదాయాన్ని సగం చేసింది; కార్ల్ పుస్తకానికి డబ్బు రావడానికి బదులు మేము ఒక విదేశీ మారకం బిల్లు చెల్లించవలసి వచ్చింది. దానికి తోడు, ఆ భయానకమైన వ్యాధికి అపారమైన ఖర్చులు తగిలినాయి. ఆ శీతకాలం మా పరిస్థితి మీరు ఊహించుకోగలరు.

యీ అన్నిటి ఫలితంగా, కార్ల్ తన పితరుల దేశమూ, పొగాకు దేశమూ, చీజ్ దేశమూ అయిన హాలండుకు సత్వర ప్రయాణం కట్టడానికి నిశ్చయించినాడు. తన పినతండ్రి డబ్బేమైనా యిస్తాడేమో చూడాలని ఆయన కోరిక. ప్రస్తుతానికి నేను హాలండు ప్రయాణం తేబొయ్యే ఫలితం కోసం కాచుకున్న ప్రోషిత భర్తృక నన్నమాట. శనివారంనాడు మొదటి జాబు వచ్చింది, కొంత ఆశతోనూ, అరవై గుల్డెన్ల డబ్బుతోనూ. సహజంగానే యిలాంటి విషయం తొందరపడేది కాదు; సమయౌచిత్యమూ, చాకచక్యమూ, నేర్పూ ఉపయోగించాలి. అయినప్పటికీ, కార్ల్ అక్కడ యేదో కొంత సాధించగలడని నాకు ఆశ వుంది.

హాలండులో యేమాత్రమైనా విజయం లభిస్తే, ఆయన రహస్యంగా బెర్లిన్‌కు పోయి, అక్కడ పరిస్థితి యెలా వున్నదీ చూడాలనీ, వీలైతే ఒక మాసపత్రికనో, వారపత్రికనో యేర్పాటు చేయాలనీ ఆయన కోరిక. మన సొంత పత్రిక వుంటేతప్ప యే అభివృద్ధీ సాధ్యం కాదని యిటీవలి అనుభవాలవలన మాకు గట్టి నమ్మకం యేర్పడింది. కొత్త పార్టీ పత్రికను స్థాపించడంలో కార్ల్ విజయం పొందితే, అమెరికానుండి వార్తలకోసం ఆయన మీ భర్తను కోరుతూ తప్పక ఉత్తరం రాస్తాడు.

కార్ల్ బయలుదేరిన తర్వాత దాదాపు వెంటనే విశ్వాసం గల మా లెన్‌హెన్ జబ్బు పడింది. ఆమె యింకా మంచంలో వుంది, కానీ కోలుకుంటున్నది. కనుక నాకు చేతుల నిండా పని వుంది; యీ ఉత్తరం మహా తొందరపాటుతో ముగించేసినాను. మౌనంగా వుండడం నాకు సాధ్యమూ కాలేదు, యిష్టమూ లేదు. నిజమైన పాత మిత్రుల ముందర హృదయభారం వెళ్లబోసుకున్నందువలన నా హృదయం తేలికపడింది. అందుకనే, ప్రతి విషయం గురించీ యింత దీర్ఘంగా మీకు రాసినందుకు నేను మిమ్మల్ని క్షమాపణ కోరడం లేదు. నా కలం నా వశం తప్పి నడిచింది; మీ ఉత్తరం చదివినప్పుడు నాకు కలిగిన ఆనందంలో కొంతైనా యీ కొంగర గీతలు మీకు యిస్తాయని ఆశిస్తున్నాను, యివ్వాలని కాంక్షిస్తున్నాను.

నేను వెంటనే విదేశీ మారకం బిల్లు వ్యవహారం చూసుకొని, నా భర్త యిక్కడ వున్నట్లుగానే అంతా సక్రమంగా సరిచేసినాను.

నా కూతుర్లు మీ పిల్లలకు — ఒక లౌరా మరొక లౌరాకు — ప్రేమా, ముద్దులూ పంపుతున్నారు; నేను ప్రతి ఒకరికీ ఒక ముద్దు పంపుతున్నాను. మీ సొంతానికి అత్యంత ఆప్యాయమైన శుభాకాంక్షలు. యీ కష్టకాలంలో ధైర్య సాహసాలు కలిగి వుండండి. నిర్భీకులదే ప్రపంచం. మీ భర్తకు విశ్వాసపూరితమైన, దృఢమైన ప్రాపుగా వుండండి. శరీరమూ, మనస్సూ చురుకుగా వుంచుకోండి, మీ ప్రియమైన పిల్లలకు నిజమైన "అమర్యాదకర" కామ్రేడ్‌గా వుండండి. సందర్భం వచ్చినప్పుడు మళ్లీ మీ విషయాలు తెలియ నివ్వండి.

మీ జెన్నీ మార్క్స్

# ఎలినోర మార్క్స్-ఎవెలింగ్

## కార్ల్ మార్క్స్*

### (కొద్ది యథేచ్ఛా విషయాలు)

మా తండ్రిని గురించి కొన్ని జ్ఞాపకాలు పంపమని నా ఆస్ట్రియన్ మిత్రులు అడుగుతున్నారు. అంతకంటె కష్టమైనది అడగడం వాళ్లకు సాధ్యం కాదు. కానీ కార్ల్ మార్క్స్ యే ఆశయంకొరకు జీవించి, కృషిచేసినాడో దానికొరకు ఆస్ట్రియన్ స్త్రీ పురుషులు యెంత అద్భుతమైన పోరాటం చేస్తున్నారంటే, వాళ్ల కోరికను యెవరూ కాదనజాలరు. కనుక నేను కూడా మా తండ్రిని గురించి పరస్పర సంబంధం లేని కొద్ది యథేచ్ఛా విషయాలు పంపడానికి ప్రయత్నిస్తాను.

కార్ల్ మార్క్స్ కరకుగా, కసిగా, లొంగకుండా, యెవరినీ దగ్గరికి రానీయకుండా వుండే మనిషి అనీ, నిత్యం పిడుగులు విసరుతూ, యెప్పుడూ చిరునవ్వు అనేది లేకుండా, ఒలింపస్ కొండమీద విడిగా, ఒంటరిగా కూర్చొనివున్న జూపిటర్ టొనాన్స్** లాంటివాడనీ చిత్రించే మామూలు కట్టుకథకంటె కార్ల్ మార్క్స్‌ను యెరిగినవాళ్లకు హాస్యకరమైనది మరొకటి వుండదు. ఊపిరి పీల్చినవాళ్లలో కెల్ల అత్యంత సంతోషమూ, ఉల్లాసమూ గల వ్యక్తిని గురించి, అందరికీ అంటుకునేదీ, దుర్నిరోధకమైనదీ అయిన సంతోషపూర్వకమైన నవ్వు కలిగి, హాస్యమూ, సౌమనస్యమూ పొంగి పొరలే మనిషిని గురించి, సహచరులలో కెల్ల అత్యంత దయాపరుడూ, సాత్వికుడూ, సానుభూతిపరుడూ అయినవాణ్ని గురించి, యీ చిత్రం ఆయన్ను యెరిగిన వాళ్లకు నిరంతర ఆశ్చర్యకరమైనది – వినోదకరమైనది కూడా.

ఆయన కుటుంబ జీవితంలోనూ, మిత్రులతో సంబంధాలలోనూ, వట్టి పరిచయస్తులతో కూడానూ కార్ల్ మార్క్స్ ప్రధాన లక్షణాలు ఆయన అవధి లేని సౌమనస్యమూ, అంతు లేని సానుభూతీ అని చెప్పవచ్చు ననుకుంటాను. ఆయన దయా, ఓర్పూ నిజంగా అతిలోక

---

* యీ స్మృతులు 1895లో ప్రచురింపబడినాయి. – సం.

** జూపిటర్ టొనాన్స్ – పురాతన రోమన్ మతంలో ప్రధాన దేవుడు. – సం.

మైనవి. అంతకంటె తక్కువ సౌమనస్యం కలవాడు రకరకాల మనుషులచేత నిత్యం కలిగే అడ్డంకులతోనూ, నిరంతరం కలిగే డిమాండ్లతోనూ చాలాసార్లు మతి పోగొట్టుకునేవాడు. ఒక కమ్యూన్ ప్రవాసి – అన్నట్టు మహా విసుగు కలిగించే వాగుడుకాయ – మూడు దీర్ఘమైన గంటలు మార్క్సును విసిగించి, మార్క్సు చివరకు తనకు తీరిక లేదనీ, చేయవలసిన పని చాలా వుందనీ చెప్పినప్పుడు, "నా ప్రియమైన మార్క్స్, మిమ్మల్ని క్షమిస్తున్నాను" అని జవాబు చెప్పడం మార్క్సు సౌజన్యానికీ, దయకూ విలక్షణమైనది. యీ వాగుడుకాయకు లాగే, నిజాయితీ వుందని ఆయన నమ్మిన స్త్రీ పురుషుల కెవరికైనా (ఆయన తన అమూల్యమైన కాలాన్ని యివ్వగా, ఆయన ఔదార్యాన్ని విచారకరంగా దుర్వినియోగపరిచినవాళ్లు కొద్ది మంది కాదు) మార్క్సు యెల్లప్పుడూ అత్యంత స్నేహపూర్వకంగా, దయగా వుండినాడు.

మనుషులను "వెలికి లాగడం"లో, వాళ్లకు ఆసక్తి వున్న విషయాల్లో తనకు ఆసక్తి వుందని వాళ్లకు అనిపించేటట్లు చేయడంలో ఆయన కున్న శక్తి అద్భుతమైనది. అత్యంత భిన్నమైన వృత్తులూ, స్థానాలూ గల వ్యక్తులు తమనూ, తమ వ్యవహారాలనూ అర్థం చేసుకోవడంలో ఆయనకు గల విశిష్టమైన సామర్థ్యం గురించి మాట్లాడడం నేను విన్నాను.

యెవరైనా నిజంగా మనస్ఫూర్తిగా వున్నాడని ఆయన అనుకుంటే, ఆయన ఓర్పుకు హద్దు వుండదు. యే ప్రశ్నా ఆయనకు జవాబు చెప్పరానంత చిల్లర ప్రశ్న కాదు, యే వాదమూ ఆయనకు నిష్ఠగా చర్చించరానంత పసితనపు వాదం కాదు. నేర్చుకోవాలని ఆతురత వున్నట్లు కనిపించే యే స్త్రీకైనా, పురుషునికైనా సేవచేయడానికి ఆయన కాలమూ, విస్తారమైన పాండిత్యమూ యెప్పుడూ సిద్ధంగా వుండినాయి.

* * *

కానీ, బహుశా మార్క్సు అత్యంత సమ్మోహనకరంగా వుండింది తాను పిల్లలతో కలిసివుండినప్పుడు. నిజంగా పిల్లలకు అంతకంటె ఆహ్లాదకరమైన ఆటల జతగాడు యెప్పుడూ లేడు.

ఆయన్ను గురించి నా తొలి జ్ఞాపకం నాకు మూడేండ్ల వయస్సు వున్నప్పటిది. "మూర్" (యింట్లో వాడే పాత పేరు నోరు జారి వస్తుంది) నన్ను తన భుజంమీద కూర్చోబెట్టుకొని, గ్రాఫ్టన్ టెరస్‌లోని మా తోటచుట్టూ తిప్పుతూ, నా ముదురు గోధుమరంగు కురులలో తీగల పూలు తురుముతూ వుండినాడు.

మూర్ అద్భుతమైన గుర్రమని అందరూ ఒప్పుకున్నదే. అంతకు ముందు రోజుల్లో – నా కవి జ్ఞాపకం లేవు, కానీ వాటిని గురించి విన్నాను – మా అక్కలూ, మా చిన్నన్నా – సరిగ్గా నేను పుట్టిన తర్వాత సంభవించిన అతని మరణం మా తలితండ్రులకు జీవితాంత

విషాదం కలిగించింది — మూర్‌ను కుర్చీలకు ''పూన్చి,'' వాటిమీద వాళ్లు యెక్కేవాళ్లు, ఆయన లాగవలసి వుండేది....

నామట్టుకు నాకు — బహుశా నాకు సమవయస్కులైన అక్కచెల్లెండ్లు లేనందువల్ల నేమో — మూర్‌ను స్వారిగుర్రంగా ఉపయోగించడం యిష్టం. ఆయన భుజంమీద కూర్చొని, అప్పటికి నల్లగా, సూచన మాత్రమైన తెలుపుతో, వుండిన ఆయన పెద్ద జూలును గట్టిగా పట్టుకొని అద్భుతమైన స్వారులు చేసినాను, మా చిన్న తోటచుట్టూనూ, గ్రాఫ్టన్ టెరస్ లోని మా యింటిచుట్టూ వుండిన పొలాలలోనూ — ఆ పొలాలలో యిప్పుడు యిండ్లు లేచినాయి.

''మూర్'' అనే పేరును గురించి ఒక్కమాట. యింటివద్ద మాకు అందరికీ మారు పేర్లు వుండినాయి. (పేర్లు పెట్టడంలో మార్క్సుకు గల నేర్పు ''పెట్టుబడి'' పాఠకులకు తెలుస్తుంది.) మార్క్సును మేమే కాదు, మరీ సన్నిహితమైన మిత్రులందరూ క్రమంగా దాదాపు అధికారికంగా పిలిచే పేరు ''మూర్.'' కానీ, ఆయన మా ''చాలీ'' కూడా (మూలంలో అది ''చార్లీ''కి — అనగా కార్ల్‌కు — భ్రష్టరూప మనుకుంటాను!), Old Nick కూడా.

మా అమ్మ యెప్పుడూ మా ''మేమే.''

మా ప్రియమైన పాత మిత్రం హెలిన్ దెముత్ — మా తలిదండ్రుల యావజ్జీవిత స్నేహితురాలు — అనేక పేర్లు గడిచి, మా ''నిమ్'' అయింది.

ఎంగెల్సు 1870 తర్వాత మా ''జనరల్'' అయినాడు.

ఒక సన్నిహిత మిత్రురాలు — లీనా షోలెర్ మా ''ముసలిపందికొక్కు.''

మా అక్క జెన్నీ ''చైనా చక్రవర్తి క్వీక్వీ,'' మరియూ ''డీ.''

మా అక్క లౌరా (శ్రీమతి లాఫార్గ) ''హాటెన్‌టాట్,'' ''కకాడూ.''

నేను ''టుస్సీ'' — యీ పేరు నిలిచిపోయింది — ''చైనా చక్రవర్తి వారసుడు క్వోక్వో,'' చాలా రోజులు ''మరుగుజ్జు ఆల్బెరిహ్'' (''నిబెలుంగ్‌ల పాట''లోని పాత్ర).

మూర్ శ్రేష్ఠమైన గుర్రమే కానీ, ఆయనకు అంతకు మించిన యోగ్యత మరొకటి వుండింది. ఆయన అద్వితీయమైన, అప్రతిమానమైన కథకుడు.

మా మేనత్తగార్లు చెప్పగా విన్నాను — ఆయన చిన్న పిల్లవాడుగా వుండినప్పుడు తన అక్కచెల్లెండ్లపట్ల దారుణమైన నియంతగా వుండినాడుట; వాళ్లను గుర్రాలుగా చేసి ట్రీయర్‌లో మర్కుస్‌బెర్గ్ గుండా మహావేగంగా ''తోలే''వాడట; మరీ అధ్వాన్నమైనది యేమిటంటే, మురికి పిండితో, అంతకంటె మురికి చేతులతో తాను చేసిన ''బజ్జీలు'' వాళ్లు తినాలని పట్టుబట్టేవాడట. వాళ్లు బదులు మాట లేకుండా ఆ ''తోలడాన్ని'' భరించి, ''బజ్జీలు'' తినేవాళ్లట, యెందుకంటే, వాళ్ల సద్గుణానికి బహుమతిగా ఆయన చెప్పే కథల కోసం.

అలా అనేక సంవత్సరాల తర్వాత మార్క్స్ తన పిల్లలకు కథలు చెప్పినాడు. ఆయన మా అక్కలకు — అప్పుడు నేను మరీ చిన్నదాన్ని — షికార్లు పోయేటప్పుడు కథలు చెప్పే వాడు, యీ కథలు ప్రకరణాలలో గాక, మైళ్లలో లెక్కపెట్టబడేవి. "యింకో మైలు కథ చెప్పు," అనేది యిద్దరు ఆడపిల్లలూ వేసే కేక.

నామట్టుకు నాకు, మూర్ చెప్పిన అనేక అద్భుత కథలలో కెల్ల అత్యంత అద్భుతమైనదీ, అత్యంత ఆహ్లాదకరమైనదీ "హాన్స్ రోక్లె." అది నెలలు నెలలు నడిచింది; అది మొత్తం ఒక కథాపరంపర. అంత కవిత్వ భరితమైన, చమత్కార భరితమైన, హాస్య భరితమైన యీ కథలు రాసుకోడానికి అక్కడ యెవరూ లేకపోవడం విచారకరం!

హాన్స్ రోక్లె స్వయంగా హోఫ్మన్ దేవతా కథలలో లాంటి మంత్రగాడు; అతనికి ఒక బొమ్మల అంగడి వుండింది; అతను యెప్పుడూ "యిబ్బందుల్లో" వుండేవాడు. అతని అంగడినిండా మహా అద్భుతమైన వస్తువులు వుండినాయి — కొయ్య స్త్రీ పురుషులూ, మహా కాయులూ, మరుగుజ్జులూ, రాజులూ, రాణులూ, కూలీలూ, యజమానులూ, నోయె తన ఓడలో పెట్టుకున్నంత అసంఖ్యాకమైన పశు పక్షులూ, టేబుల్లూ, కుర్చీలూ, బండ్లూ, అనేక రకాల, అనేక పరిమాణాల పెట్టెలూ. హాన్స్ మంత్రగాడైనప్పటికీ, సైతానుకు గానీ, మాంస వర్తకునికి గానీ అప్పులు తీర్చగలిగేవాడు కాదు; అందువలన అతను — యెంతో అయిష్టంగా — నిత్యం తన బొమ్మలు సైతానుకు అమ్మవలసి వచ్చేది. తరువాత వాటికి అద్భుతమైన అనుభవాలు కలిగేవి — చివరకు అవి యెప్పుడూ హాన్స్ రోక్లె అంగడికి తిరిగి వచ్చేవి.

యీ అనుభవాలలో కొన్ని హోఫ్మన్ కథలలోని అనుభవాల లాగే కఠోరంగా, భయం కరంగా వుండేవి, కొన్ని హాస్యకరంగా వుండేవి; అన్నీ తరగని ఉత్సాహంతోనూ, చమత్కారం తోనూ, హాస్యంతోనూ చెప్పబడేవి.

యిక మూర్ తన పిల్లలకు చదివి వినిపించేవాడు కూడా. ఆవిధంగా నాకు, అంతకు ముందు మా అక్కలకు లాగే, ఆయన హోమర్ అంతా, "నిబెలుంగ్‌ల పాట," "గుద్రున్," "డాన్ క్విక్సట్," "అరేబియన్ రాత్రులు," వగైరాలు సంపూర్ణంగా చదివి వినిపించినాడు. షేక్స్పియర్ అంటే, ఆయన మా యింటికి బైబిల్, మా చేతులలోనో, నోళ్లలోనో లేకుండా యెప్పుడూ వుండడు. నాకు ఆరేండ్లు వచ్చేటప్పటికి షేక్స్పియర్‌లో రంగాలకు రంగాలు నోటికి వచ్చేవి.

నా ఆరవ జన్మదినంనాడు మూర్ నాకు నా మొదటి నవల బహుమతి యిచ్చినాడు — అమర కృతి "పీటర్ సింపుల్." దాని తరువాత మరియేట్ రచనలూ, కూపర్ రచనలూ మొత్తం వచ్చినాయి. నేను వాటిని చదివేటప్పుడు మా నాన్న ప్రతి కథనూ నిజంగా చదివి, తన చిన్న అమ్మాయితో వాటిని గంభీరంగా చర్చించేవాడు. యిక ఆ చిన్న అమ్మాయి, మరియేట్

సముద్ర గాథలచేత ఉత్తేజం పొంది, తాను "పోస్ట్ కెప్టన్" (దాని అర్థం యేమైనా సరే) ఔతానని ప్రకటించి, తాను "మగపిల్లవాని వేషం వేసుకోవడమూ," "పారిపోయి యుద్ధ నౌకలో చేరడమూ" సాధ్యం కాదా అని తన తండ్రిని సలహా అడగగా, తన అభిప్రాయంలో అది నిరభ్యంతరంగా చేయవచ్చుననీ, కానీ పథకాలన్నీ బాగా పక్వానికి వచ్చిందాకా ఆ విషయం గురించి యెవరితోనూ బొత్తిగా చెప్పకూడదనీ ఆయన ఆ అమ్మాయికి నమ్మజెప్పినాడు.

కానీ, యీ పథకాలు పక్వానికి రాగలిగేలోపల, స్కాట్ వ్యామోహం ప్రవేశించింది; తానే కొంతవరకు అసహ్యమైన కాంబెల్ వంశానికి చెందినదని విని ఆ చిన్న అమ్మాయి కంపించిపోయింది. తరువాత హైలండులను రేపడానికీ, "నలభై అయిదు"ను* పునరుద్ధరించ డానికీ పథకాలు వచ్చినాయి. మార్క్స్ మళ్లీ మళ్లీ చదివే రచయిత స్కాట్, అనే విషయం నేను చెప్పాలి; బాల్జాక్, ఫీల్డింగ్ రచనల లాగే స్కాట్ రచనలు ఆయన బాగా మెచ్చుకునేవాడు, అలాగే అవి ఆయనకు బాగా తెలుసు.


వీటిని గురించీ, యింకా అనేక యితర పుస్తకాల గురించీ ఆయన మాట్లాడేటప్పుడు, పుస్తకాలలో ఉత్కృష్టమైనదీ, ఉత్తమమైనదీ యెక్కడ లభ్యమయ్యేదీ ఆ చిన్న అమ్మాయికి తెలియజేసేవాడు — యీ విషయం ఆమెకు బొత్తిగా స్పృహలో లేకపోయినప్పటికీ; తనకు తానుగా ప్రయత్నించి ఆలోచించడమూ, అర్థం చేసుకోవడమూ ఆమెకు నేర్పేవాడు — తనకు నేర్పుతున్నాడని ఆ అమ్మాయి యెప్పుడూ అనుకోలేదు, దానికి ఆమె అభ్యంతరం చెప్పివుండేది.

అదే విధంగా యీ "కరకు," "కసి" మానవుడు ఆ చిన్న అమ్మాయితో "రాజకీయాలూ," "మతమూ" మాట్లాడేవాడు. నాకు యెంతో బాగా జ్ఞాపకం వుంది — నాకు బహుశా అయి దారేండ్లు వయసు వున్నప్పుడు కొన్ని మత సంబంధమైన మానసిక ఘర్షణలు అనుభవించి (మనోహరమైన సంగీతం వినడానికి రోమన్ కాథలిక్ చర్చికి పోయివుండినాము), సహజంగానే మూర్‌కు అన్నీ వెల్లడించినాను; ఆయన యెంతో ప్రశాంతంగా నాకు సర్వమూ తేటతెల్ల మయ్యేటట్లు చేసినాడు, ఆ ఘడియనుండి మళ్లీ నా మనసులో యెప్పుడూ సందేహం అనేది పుట్టడం అసంభవ మయింది.

ధనవంతులచేత చంపబడిన వడ్రంగి కథను ఆయన చెప్పడం నాకు బాగా జ్ఞాపక ముంది — అంతకుముందు గానీ, ఆ తర్వాత గానీ ఆ కథను యెవరైనా చెప్పగలిగి వుంటా రని నేను అనుకోను. "క్రైస్తవమతం మనకు శిశువును ప్రేమించడం నేర్పింది గనుక,

---

* 1745లో స్కాట్లండులో యింగ్లీషువాళ్ల ప్రభుత్వంమీద జరిగిన తిరుగు బాటుకు యిక్కడ ప్రస్తావన. స్కాట్ రచించిన "వేవర్లీ" నవలలో యీ తిరుగుబాటు వర్ణింప బడింది. — సం.



కార్ల్ మార్క్స్ (70ల సంవత్సరాలు)



జెన్నీ మార్క్సు

దానిని మనం చాలా మేరకు క్షమించగలం" అని ఆయన యెన్నోసార్లు అనడం నాకు జ్ఞాపక ముంది.

"చిన్న పిల్లలను నాదగ్గరికి రానివ్వండి" అని మార్క్స్ స్వయంగా చెప్పి వుండవచ్చు, యెందు కంటే, ఆయన యెక్కడికి పోతే అక్కడల్లా పిల్లలు యేదో ఒక విధంగా చేరేవాళ్లు. ఆయన హాంప్‌స్టెడ్ హీత్‌లో – ఉత్తర లండన్‌లో, మా పాత యింటికి సమీపంలో వుండిన పెద్ద బయలు ప్రదేశంలో – కూర్చున్నా, యేదో ఒక పార్కులో బెంచీమీద విశ్రమించినా ఆయన చుట్టూ గుంపెడు పిల్లలు చేరి, పొడవైన జుట్టూ, గడ్డమూ, మంచి, గోధుమరంగు కన్నులూ గల ఆ పెద్ద వ్యక్తితో అత్యంత సుహృద్భావపూరిత, సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకునే వాళ్లు. కేవలం కొత్త పిల్లలు ఆవిధంగా ఆయనకు యెదురై, ఆయన్ను వీధిలో ఆపేవాళ్లు...

నాకు జ్ఞాపక ముంది, ఒకసారి సుమారు పదేండ్ల చిన్న బడిపిల్లవాడు "మహా భీకరమైన" ఇంటర్నేషనల్ నాయకుని మేయిట్లండు పార్కులో యే మర్యాదలూ లేకుండా ఆపి, "కత్తులు మార్చుకుందామా" అన్నాడు. యిద్దరూ కత్తులు బయటికి తీసి, ఒకదానితో ఒకటి పోల్చి చూసుకున్నారు. పిల్లవాని కత్తికి ఒక బ్లేడు మాత్రమే వుండింది; మార్క్స్ కత్తికి రెండు వుండినాయి, కానీ అవి నిర్వివాదంగా మొద్దువి. చాలా చర్చ జరిగిన తర్వాత బేరం కుదిరింది, కత్తులు మార్చుకున్నారు, "భయంకరమైన" ఇంటర్నేషనల్ నాయకుడు తన మొద్దు బ్లేడ్ల దృష్ట్యా ఒక పెన్నీ అదనంగా యిచ్చినాడు.

అమెరికన్ యుద్ధమూ,* నీలం పుస్తకాలూ** తత్కాలానికి మరియేట్‌నూ, స్కాట్‌నూ స్థానభ్రష్టం చేసినప్పుడు, నా ప్రతి ప్రశ్నకూ ఆయన అనంతమైన ఓర్పుతోనూ, ఆప్యాయత తోనూ జవాబు చెప్పడమూ, తనకు అంతరాయం కలిగినట్లు యెప్పుడూ ఫిర్యాదు చేయక పోవడమూ నాకు యెంతో బాగా జ్ఞాపక మున్నాయి. ఆయన తన గొప్ప పుస్తకంమీద కృషి చేస్తూ వుండగా ఒక చిన్న పిల్ల వాగుడు ఆయనకు యెంతో యిబ్బంది కలిగించి వుండాలి. కానీ, తాను అంతరాయం కలిగిస్తున్నాననే ఆలోచన ఆ పిల్లకు యెప్పుడూ కలగనివ్వలేదు ఆయన. నాకు జ్ఞాపక ముంది, ఆ కాలంలోనే యుద్ధం గురించి అబ్రహాం లింకన్‌కు నా సలహా చాలా అవసరమని నాకు పరమ విశ్వాసం యేర్పడి, ఆయనకు పెద్ద ఉత్తరాలు రచించేదాన్ని; సహజంగానే, అవన్నీ మూర్ చదివి, "పోస్టు చేయవలసి వుండేది." చాలా చాలా యేండ్ల తర్వాత ఆయన ఆ శైశవ ఉత్తరాలు నాకు చూపించినాడు; అవి ఆయనకు వినోదం కలిగించి నందున, వాటిని ఆయన యెత్తిపెట్టినాడు.

---

* అమెరికన్ అంతర్యుద్ధం – 1860లలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య జరిగిన యుద్ధం. – సం.

** బ్రిటిషు పార్లమెంటుయొక్క విదేశాంగకార్యాలయంయొక్క పత్రాల సంకలనాలు. – సం.

ఆవిధంగా బాల్యదశలోనూ, కౌమారదశలోనూ నాకు మూర్ ఆదర్శ మిత్రుడుగా వుండినాడు.

యింటివద్ద మేమందరమూ మంచి క్రామేడ్లము; ఆయన యెప్పుడూ అత్యంత దయా పరుడూ, సౌమనస్యపూరితుడూ. రాచపుండ్లతో నిరంతరం బాధపడుతూ వుండిన బాధా మయ కాలంలో కూడా, చివరిదాకా కూడా.

* * *

నేను పరస్పర సంబంధం లేని యీ కొద్ది స్మృతులు రాసినాను, కానీ మా అమ్మను గురించి కాస్త కలపకపోతే, యివి కూడా అసంపూర్ణ మౌతాయి. జెన్నీ ఫన్ వెస్ట్‌ఫాలెన్ లేకపోతే కార్ల్ మార్క్స్ యెన్నడూ కార్ల్ మార్క్స్ కాగలిగేవాడు కాదు అనడం అతిశయోక్తి కాదు. యిద్దరి జీవితాలు — రెండూ అసాధారణమైనవే — అంత సమరసంగా, అంత పరస్పర పూరకంగా యెన్నడూ లేవు.

అంత అసాధారణమైన సౌందర్యంతో — అది చివరిదాకా ఆయనకు ఆనందమూ, గర్వమూ యిచ్చిన సౌందర్యం; హైనె, హెర్‌వెగ్, లాసాల్ లాంటివాళ్లనుండి ప్రశంసలు రాబట్టుకొన్న సౌందర్యం — ఆ సౌందర్యానికి సమానమైన మేధతోనూ, బుద్ధి చాతుర్యం తోనూ జెన్నీ ఫన్ వెస్ట్‌ఫాలెన్ నూటికి కోటికి ఒకరుగా వుండే అరుదైన వ్యక్తి.

చిన్న పిల్లలుగా జెన్నీ, కార్ల్ కలిసి ఆడుకున్నారు; యువతీ యువకులుగా — ఆయనకు పదునేడు మాత్రం, ఆమెకు యిరవై ఒకటి — వాళ్లు వివాహం నిశ్చయం చేసుకున్నారు; పెండ్లికి ముందు, రహేల్ కొరకు జాకబ్‌లాగా, ఆమె కొరకు ఆయన యేడేండ్లు వేచివున్నాడు. తరువాతి కాలంలోని ఆ బరువు బాధలలో, ప్రవాసంలో, కటిక దరిద్రంలో, అపనిందలలో, కరకు పోరాటంలో, కఠోర యుద్ధంలో యీ యిద్దరూ తమ విశ్వాసపూరిత, విశ్వసనీయ అప్తురాలు హెలిన్ దెముత్‌తో కలిసి, యెన్నడూ తొణకకుండా, బెణకకుండా, నిరంతరం కర్తవ్య స్థానంలో, ప్రమాద స్థలంలో నిలిచి, ప్రపంచాన్ని యెదుర్కొన్నారు. నిజంగా ఆయన ఆమెను గురించి ఇంగ్లీషు కవి బ్రౌనింగ్ మాటల్లో యిలా అనివుండవచ్చు:

> "కనుక నాకు ఆమె అజరామరమైన వధువు,
> అదృష్టంతో మారనిది, కాలంతో మాయనిది నా ప్రేమ."

నాకు ఒకొకసారి అనిపిస్తుంది — కార్మికోద్యమంపట్ల వాళ్ల కర్తవ్య నిష్ఠ ఆ యిద్దరి మధ్య యెంత దృఢమైన బంధమో, వాళ్ల హాస్యదృష్టి కూడా అంత దృఢమైన బంధం. నిశ్చయంగా, ఒక చమత్కారాన్ని వీళ్లిద్దరిలాగా యే యిద్దరూ ఆనందించి వుండరు.

యెన్నోసార్లు – మర్యాదా, మప్పితమూ అవసరమైన సందర్భాలలో – వాళ్ళ చెక్కిళ్ళ వెంట కన్నీళ్లు కారిందాకా నవ్వడం నేను చూసినాను; అంత దారుణమైన లఘు మనస్త త్వానికి నిర్విణ్ణులు కావలసినవాళ్లు కూడా వాళ్లతో కలిసి నవ్వక తప్పలేదు. ఒకరివైపు ఒకరు ఒక్క చూపు చూసుకుంటే పట్టరాని నవ్వు వస్తుందని తెలిసి, వాళ్ళ ఒకరివైపు ఒకరు చూసుకోడానికి జంకడం నేను యెన్నోసార్లు చూసినాను. వాళ్ళ, అచ్చం బడిపిల్లలలాగే, ఒకరినొకరు మాత్రం చూసుకోకుండా మరిదేనివైపో నిలజూస్తూ, అణచుకొన్న నవ్వుతో ఉక్కిరిబిక్కిరి కావడమూ, యెంత అణచుకున్నా చివరకు అది ఫక్కున పొంగిరావడమూ – యీ స్మృతిని నాకు సంక్రమించినాయని అప్పుడప్పుడు కొందరు అనుకునే కోట్ల వరహాల కొరకు కూడా వదలుకోను. ఔను, యెన్ని బాధలూ, అగచాట్లూ, ఆశాభంగాలూ వుండినా, వాళ్ళ సరదా అయిన జంట; కసి గల జూపిటర్ టొనాన్స్ అనేది బూర్జువా స్వకపోల కల్పన.

మరి యిక పోరాట కాలంలో వాళ్లకు అనేక భ్రమా భంగాలు కలిగినా, వింత కృతఘ్నత యెదురైనా, బహుకొద్దిమందికి మాత్రమే లభ్యమయ్యేది వాళ్లకు లభ్యమైంది – వాళ్లకు నిజ మైన మిత్రులు వుండినారు.

యెక్కడైతే మార్క్సు పేరు తెలుసునో అక్కడల్లా ఫ్రెడరిక్ ఎంగెల్సు పేరు తెలుసు. మరి, మార్క్సును ఆయన యింటిలో యెరిగినవాళ్లందరికీ ప్రపంచ ఉదాత్త స్త్రీలలోని ఒక స్త్రీ పేరు కూడా, హెలిన్ దెముత్‌యొక్క గౌరవాస్పదమైన పేరు కూడా, జ్ఞాపక ముంటుంది.

అంతటి యోధుడుగా వుండిన యీ వ్యక్తి అదే సమయంలో మహా దయాపరుడుగా, సాత్వికుడుగా వుండడం మానవ స్వభావం తెలిసినవాళ్లకు చిత్రంగా కనపడదు. వాళ్ళ అర్థం చేసు కుంటారు: ఆయన అంత ప్రచండంగా ద్వేషించగలిగినాడంటే, అంత గాఢంగా ప్రేమించ గలిగినాడు గనుకనే; ఆయన కలం ఒక జీవిని నరకంలో డాంటె యెంత నిశ్చయంగా బంధించ గలిగినాడో అంత నిశ్చయంగా బంధించగలిగిందంటే, ఆయన అంత రుజువర్తనుడూ, ఆర్ద్ర హృదయుడూ గనుకనే; ఆయన వ్యంగ్య హాస్యం అగ్నిద్రావకం లాగా కొరకగలిగిందంటే, అదే హాస్యం కష్టాలలోనూ, కడగండ్లలోనూ వున్నవాళ్లకు చందనంలాగా వుండగలిగింది గనుకనే.

మా అమ్మ 1881 డిసెంబర్‌లో మరణించింది. పదైదు నెలల తర్వాత, జీవితంలో యెన్నడూ ఆమెనుండి వేరుపడని ఆయన మరణంలో ఆమెను కలుసుకున్నాడు. జీవితపు ఒడిదుడుకుల ఆందోళన తర్వాత వాళ్ళ బాగా నిద్రిస్తున్నారు. ఆమె ఆదర్శ స్త్రీ అయితే, ఆయన –

"అన్నింటా అతను అసలైన మనిషి
అలాంటివాణ్ని మళ్లీ చూడబోను."

# ఎలినోర మార్క్స్-ఎవెలింగ్

## ఫ్రెడరిక్ ఎంగెల్సు*

1890 నవంబర్ 28 నాడు ఫ్రెడరిక్ ఎంగెల్సుకు 70 యేండ్లు నిండుతాయి. ప్రపంచంలోని సోషలిస్టు లందరూ ఆ జన్మదినం జరుపుతారు.

యీ సందర్భంలో, ప్రస్తుత పార్టీయొక్క అంగీకృత నాయకునిమీద, "సోత్సియాల్ డెమొక్రటిషె మోనత్స్‌శ్రిఫ్ట్" పాఠకులకొరకు ఒక చిన్న వ్యాసం రాయమని నా మిత్రుడు డాక్టర్ విక్టర్ ఆడ్లర్ నన్ను అడిగినాడు.

యిలాంటి కష్టమైన కర్తవ్యానికి అవసరమైన వివిధ గుణాలన్నిటిలోనూ నాకు వున్నదని చెప్పుకోగలది ఒక్కటే: నేను జీవితమంతా ఎంగెల్సును ఎరుగుదుననేది. అయినప్పటికీ, దీర్ఘ సన్నిహిత పరిచయం ద్వారా యెవరినైనా చిత్రించే సామర్థ్యం యేర్పడుతుందనేది సందేహాస్పదమే. మనుషులను వర్ణించడంలో కెల్ల తనను తాను వర్ణించుకోడం అత్యంత కష్టం.

మార్క్సు, ఎంగెల్సుల జీవిత చరిత్ర రాయాలంటే — యీ యిద్దరు వ్యక్తుల జీవితాలూ, కృషీ విడదీయజాలనంత సన్నిహిత సంబంధం గలవి — "ఊహాస్వర్గంనుండి శాస్త్రం వరకు" సోషలిజం అభివృద్ధియొక్క చరిత్రను మాత్రమే కాదు రాయవలసివుండేది, దాదాపు అర్ధ శతాబ్దికి పైగా మొత్తం కార్మికవర్గ ఉద్యమంయొక్క చరిత్రను రాయవలసి వుంది. యెందుకంటే యీ యిద్దరు వ్యక్తులూ కేవలం భావాలలో నాయకులూ, సిద్ధాంత బోధకులూ, తమను తాము దిన దిన శ్రమ జీవితానికి యెడంగా, ఏకాంతంగా వుంచుకున్న తత్వవేత్తలూ కాదు. వాళ్లు యెల్లప్పుడూ యోధులు, యెల్లప్పుడూ యుద్ధరంగపు అగ్రభాగాన వుండినవాళ్లు, విప్లవ సైనికులూ, "సైనిక అధిష్ఠాన వర్గపు" సభ్యులూ....

ఎంగెల్సు జీవిత వివరాలు యిప్పుడు అందరికీ యెంత బాగా తెలుసునంటే, వాటిని

---

* 1890లో ప్రచురింపబడింది. — సం.

సంక్షేపంగా మాత్రమే జ్ఞాపకం చేయడం అవసర మనిపిస్తుంది. ఆయన సాహిత్య, శాస్త్రీయ రచనలు యెంత సుప్రసిద్ధమంటే, వాటిమీద యెలాంటి పరిశీలనైనా నేను యివ్వడానికి ప్రయత్నించడమూ, యివ్వడమూ బడాయి ఔతుంది: యిక్కడ కేవలం ఒక సంక్షిప్త కాలానుక్రమణిక సరిపోతుంది.

కానీ నేను ప్రయత్నించాలని కోరేది ఎంగెల్సును గురించి మానవుడుగానూ, ఆయన జీవించే పద్ధతి గురించీ, పనిచేసే పద్ధతి గురించీ ఒక చిన్న రేఖాచిత్రం. ఆవిధంగా నేను చాలామందికి ఆహ్లాదం కలిగిస్తాననుకుంటాను....

యెందుకంటే, ఎంగెల్సులాంటివాని జీవిత అధ్యయనం, ఆయనకంటె చిన్నవాళ్లమూ, ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తున్నవాళ్లమూ అయిన మనకు సహాయమూ, ఉత్తేజమూ యివ్వగలదని నా అభిప్రాయం.

* * *

ఫ్రెడరిక్ ఎంగెల్సు 1820 నవంబర్ 28 నాడు రైన్ ప్రాంతంలోని బార్మెన్‌లో పుట్టినాడు. ఆయన తండ్రి ఒక కార్ఖానా స్వంతదారుడు (రైన్ ప్రాంతం అప్పుడు జర్మనీలోని యితర భాగంకంటె ఆర్థికంగా బాగా ముందు వుండిందని మరిచిపోకూడదు).

ఆయన కుటుంబం చాలా రాణింపుకు వచ్చినది. బహుశా అలాంటి కుటుంబంలో పుట్టిన యే కుమారుడూ అంత సంపూర్ణంగా భిన్నమైన మార్గం యెప్పుడూ అవలంబించి వుండడు. ఫ్రెడరిక్‌ను ఆయన కుటుంబంవాళ్లు ''చెడిపోయిన కుర్రవాడు''గా తప్పక భావించివుంటారు. ''చెడిపోయినవాడు'' వాస్తవంలో ''వంశోద్ధారకు''డని బహుశా వాళ్లు యిప్పటికీ గ్రహించివుండరు. ఎంగెల్సు తన కుటుంబం గురించి మాట్లాడడం విన్నవాళ్లకు ఒక విషయం స్పష్టం: ఆయనకు తన ఉల్లాసపు మనస్తత్వం తన తల్లినుండి సంక్రమించింది.

ఆయన చదువు మామూలు చదువే. ఆయన కొంతకాలం ఎల్బర్‌ఫెల్డ్ హైస్కూలుకు పోయినాడు. మొదట ఆయన విశ్వవిద్యాలయానికి పోవాలనుకున్నాడు, గానీ ఆయన సంకల్పం ఆచరణలోకి రాలేదు. హైస్కూలులోని చివరి పరీక్షకు ఒక సంవత్సరం ముందుగా ఆయన బార్మెన్‌లోని ఒక వ్యాపారంలో చేరి, తరువాత బెర్లిన్‌లో ఒక సంవత్సరం సైన్యంలో వలంటీరుగా పనిచేసినాడు.

తన తండ్రి భాగస్వామిగా వుండిన వ్యాపారంలో పనిచేయడానికి ఆయన 1842లో మాంచెస్టర్‌కు పంపబడినాడు. ఆయన అక్కడ రెండేండ్లు గడిపినాడు. అచ్చమైన పెట్టుబడిదారీ దేశంలో, ఆధునిక పరిశ్రమకు గుండెకాయలాంటిదైన దేశంలో, ఆ రెండేండ్ల ప్రాముఖ్యం యెంతని చెప్పినా అతిశయోక్తి కానేరదు.

ఆయన తన "ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి"కి సమాచారం సేకరిస్తూ వుండినప్పుడు, చార్టిస్టు ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ, చార్టిస్టు పత్రిక "నార్దర్న్ స్టార్"కూ, ఓవెన్ పత్రిక "నీతివంతమైన నూతన ప్రపంచం"*కూ క్రమం తప్పకుండా రచనలు చేసేవాడు.

1844లో ఎంగెల్సు పారిస్ ద్వారా జర్మనీకి తిరిగి వచ్చినప్పుడు పారిస్‌లో ఆయన మొట్టమొదటి సారిగా ఒక వ్యక్తిని కలుసుకున్నాడు. ఆ వ్యక్తితో ఆయన చాలా కాలంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ వుండినాడు. ఆ వ్యక్తి ఆయనకు యావజ్జీవిత మిత్రుడు కావలసి వుండినాడు. ఆ వ్యక్తే కార్ల్ మార్క్స్.

యీ సమావేశంయొక్క తక్షణ ఫలితం యేమిటంటే, "పవిత్ర కుటుంబం"ను సంయుక్తంగా ప్రచురించడమూ, తరువాత బ్రస్సెల్స్‌లో ముగింపబడిన ఒక రచనను ప్రారంభించడమూ; యీ రచనయొక్క భవితవ్యాన్ని గురించి మార్క్స్ తన "అర్థశాస్త్ర విమర్శ"లోనూ ఎంగెల్సు తన "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్"లోనూ చెప్పినారు. ఆ రచనకు తాను రాసిన ఉపోద్ఘాతంలో మార్క్స్ యిలా రాసినాడు: "రెండు పెద్ద ఆక్టేవో సంపుటాలుగా వుండిన రాతప్రతి** వెస్ట్‌ఫాలియాలోని తన ప్రచురణ స్థలానికి చేరి చాలా కాలమైంది. అప్పుడు, పరిస్థితులు మారినందువల్ల దానిని అచ్చువేయడం సాధ్యం కాదని మాకు వార్త వచ్చింది. మేము మరింత సమ్మతితో రాతప్రతిని యెలుకల కొరుకుడు విమర్శకు వదిలేసినాము; యెందుకంటే మేము మా ప్రధాన ఉద్దేశాన్ని సాధించినాము — ఆత్మ స్పష్టీకరణను."

అదే సంవత్సరంలో ఎంగెల్సు తన "ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి" రాసినాడు. ఆ పుస్తకం యీ నాటికీ యెంత వాస్తవంగా వుందంటే, అది నలభై యేండ్ల క్రితం రాయబడినప్పటికీ, దాని యింగ్లీషు అనువాదం వచ్చినప్పుడు,*** అది కేవలం కొద్ది సంవత్సరాల క్రితం రాయబడిందని యింగ్లీషు కార్మికులు అనుకున్నారు. అదే కాలంలో ఎంగెల్సు వివిధ వ్యాసాలూ, వగైరా రాసినాడు.

ఆయన పారిస్‌నుండి బార్మెన్‌కు తిరిగి పోయినాడు, కానీ కొద్ది కాలంపాటు మాత్రమే.

1845లో ఆయన మార్క్స్ వెంట బ్రస్సెల్స్‌కు పోయినాడు. అక్కడ వాళ్ల సంయుక్త కృషి నిజంగా ప్రారంభమైంది. అపారమైన వాళ్ల సాహిత్య కృషి కాక, ఆ మిత్రు

---

* "నీతివంతమైన నూతన ప్రపంచం" (New Moral World) ఆర్. ఓవెన్‌చే 1834లో స్థాపించబడిన సోషలిస్టు-ఊహాస్వర్గవాదుల పత్రిక. 1846దాకా ప్రచురింపబడింది. 1843 నవంబర్‌నుండి 1845 మేవరకు ఎఫ్. ఎంగెల్సు ఈ పత్రికకు వ్యాసాలు రాసేవాడు. — సం.

** "జర్మన్ భావజాలం." — సం.

*** 1887 నాటి అమెరికన్ ప్రచురణ. — సం.

లిద్దరూ జర్మన్ వర్కర్స్ సొసైటీ స్థాపించినారు; కానీ అన్నిటికంటె ముఖ్యమైనదేమంటే వాళ్లు "లీగ్ ఆఫ్ ది జస్ట్" ["న్యాయాత్ముల సంఘం"]లో చేరడం; అందులోనుండి, తరువాత, ప్రసిద్ధమైన కమ్యూనిస్టు లీగు ఉద్భవించింది, అది రాబోయే ఇంటర్నేషనల్ బీజాన్ని తనలో యిముడ్చుకొంది.

యింకా బ్రస్సెల్స్‌లో వుండిన మార్క్స్, పారిస్‌లో వుండిన ఎంగెల్సు 1847లో "లీగ్ ఆఫ్ ది జస్ట్"కు సిద్ధాంత బోధకులైనారు; ఆ సంవత్సరం వేసవిలో ఆ లీగు మహాసభ లండన్‌లో జరిగింది. పారిస్ సభ్యుల ప్రతినిధిగా ఎంగెల్సు ఆ మహాసభలో వుండినాడు. లీగు సంపూర్ణంగా పునర్నిర్మాణం చేయబడింది.

శరదృతువులో రెండవ మహాసభ జరిగింది; దానికి మార్క్స్ కూడా హాజరైనాడు. దాని ఫలితం యీ నాడు యావత్ప్రపంచానికీ తెలుసు — అది "కమ్యూనిస్టు ప్రణాళిక."

లండన్‌నుండి మిత్రు లిద్దరూ కొలోన్‌కు పోయి వెంటనే కార్యాచరణలో దుమికినారు. యీ కార్యకలాపాల చరిత్ర "నోయె రైనిషె సైటుంగ్"లోనూ, మార్క్స్ రచించిన "కొలోన్ కమ్యూనిస్టు కేసు విచారణ రహస్యాల వెల్లడి"లోనూ నమోదు చేయబడింది.

పత్రికను మూసివేసి, మార్క్స్‌ను బహిష్కరించిన ఫలితంగా మిత్రు లిద్దరూ కొంత కాలంపాటు విడిపోయినారు. మార్క్స్ పారిస్‌కు పోయినాడు. ఎంగెల్సు ప్ఫాల్ట్స్‌కు పోయినాడు: ఆయన బాడెన్ తిరుగుబాటులో విల్లిహ్‌కు అడ్జుటెంట్‌గా పనిచేసినాడు. ఆయన మూడుసార్లు యుద్ధ రంగంలో వుండినాడు. ఆయనను యుద్ధరంగంలో చూసినవాళ్లు అందరూ, చాలాకాలం తర్వాత కూడా, ఆయన అసాధారణ ప్రశాంతతను గురించీ మృత్యువుపట్ల పరమ తూష్ణీంభావం గురించీ చెప్పేవాళ్లు.

"నోయె రైనిషె సైటుంగ్. పొలిటిష్-ఓకొనామిషె రెవ్యూ"లో ఎంగెల్సు బాడెన్ తిరుగు బాటుమీద ఒక నివేదిక రాసినాడు. అది సంపూర్ణంగా ఓడిపోయిన తర్వాత, అందరికంటె ఆఖరున ఆయన అక్కడినుండి స్విట్జర్లెండుకు పోయినాడు. తరువాత ఆయన లండన్‌కు పోయి నాడు. మార్క్స్ కూడా, పారిస్‌నుండి బహిష్కరింపబడిన తర్వాత, లండన్‌కు బయలు దేరినాడు.

ఎంగెల్సు జీవితంలో నూతన దశ ప్రారంభమైంది. తత్కాలానికి రాజకీయ కార్యకలాపాలు అసాధ్యమైనాయి. మార్క్స్ లండన్‌లో స్థిరపడినాడు. ఎంగెల్సు మాంచెస్టర్‌కు, తన తండ్రి భాగస్వామిగా వుండిన దూదిమిల్లుకు పోయినాడు. అక్కడ ఆయన తన గుమాస్తా పని మళ్లీ తీసుకున్నాడు.

యిరవై సంవత్సరాలు ఎంగెల్సు వ్యాపార జీవితపు నిర్బంధ శ్రమకు బంధింపబడినాడు. ఆ యిరవై సంవత్సరాలూ మిత్రు లిద్దరూ అరుదుగా మాత్రమే, స్వల్పకాలం, అప్పుడప్పుడు కలుసుకునేవాళ్లు. కానీ వాళ్ల సంబంధం ఆగిపోలేదు.

నా ప్రథమ స్మృతులలో ఒకటి మాంచెస్టర్‌నుండి ఉత్తరాలు రావడం. మిత్రు లిద్దరూ దాదాపు ప్రతి దినమూ ఒకరికొకరు ఉత్తరాలు రాసుకునేవాళ్లు. నేను జ్ఞాపకం చేసుకోగలను — మూర్, మా తండ్రిని యింటిదగ్గర మేము అలా అనేవాళ్లం, యెన్నోసార్లు ఉత్తరాలతో మాట్లాడేవాడు, వాటి రచయిత యెదురుగా వున్నట్లు. "కాదు, అది వున్నది అలా కాదు...," "నీవు చెప్పేది నిజం," వగైరా, వగైరా. కానీ నాకు అన్నిటికంటె బాగా జ్ఞాపక మున్నది యేమిటంటే, మూర్ ఒకోసారి ఎంగెల్సు ఉత్తరాలు చదివి చెక్కిళ్లవెంట కన్నీళ్లు కారేదాకా నవ్వేవాడు.

మాంచెస్టర్‌లో ఎంగెల్సు ఏకాకి కానిమాట నిజమే. మొట్టమొదట అక్కడ వొల్ఫ్ వుండినాడు — "ధీరుడూ, విశ్వాసం గలవాడూ, ఉదాత్తుడూ అయిన కార్మికవర్గ ప్రతినిధి." అతనికి "పెట్టుబడి" మొదటి భాగం అంకితం యివ్వబడింది, అతనిని మేము యింటివద్ద "లూపున్" ("తోడేలు") అనేవాళ్లం.

తరువాత మా తండ్రికీ, ఎంగెల్సుకూ ఆప్తమిత్రుడైన శామ్యూల్ మూర్ (నా భర్తతో కలిసి "పెట్టుబడి"ని యింగ్లీషులోకి అనువదించినవాడు), యీనాటి అత్యంత ప్రముఖ రసాయనశాస్త్రవేత్తలలో ఒకడైన ప్రొఫెసర్ షోర్లెమ్మెర్ వచ్చినారు.

కానీ, యీ మిత్రులను అటుంచితే, ఎంగెల్సు వంటివాడు యిరవై సంవత్సరాలు అలా గడపవలసి వచ్చిందనే ఆలోచన దారుణమైనది. అయన యెప్పుడైనా ఫిర్యాదులు చేసినాడనీ, గొణుక్కున్నాడనీ కాదు. అలాంటిది యేమూలా లేదు! ఆయన తన పనిలో ఉత్సాహంగా, ప్రశాంతంగా వుండేవాడు, ఆఫీసుకు పోవడమూ, ఆఫీసులో కూర్చోవడమూ లాంటి ఆనందం మరొకటి లేనట్లు.

ఆయనకు యీ నిర్బంధ శ్రమ ముగిసేటప్పుడు నేను ఆయనవద్ద వుండినాను, ఆ అన్ని సంవత్సరాల పొడవునా ఆయన యెన్ని పాట్లు పడివుంటాడో నేను తెలుసుకున్నాను. చివరిసారి ఆఫీసుకు పోవడానికి ఆ రోజు ఉదయం బూట్లు వేసుకుంటూ, "యిది చివరిసారి!" అని ఆయన అన్నప్పుడు ఆయన కంఠంలోని ఆ దిగ్విజయరేఖ నేను యెన్నటికీ మరిచిపోలేను.

కొద్ది గంటల తర్వాత మేము గేటువద్ద నిలబడి ఆయనకోసం కాచుకొని వుండినాము. ఆయన వుండిన యింటికి యెదురుగా వున్న చిన్న మైదానం గుండా ఆయన రావడం మేము చూసినాము. ఆయన చేతికర్ర విలాసంగా తిప్పుతూ, పాట పాడుతూ వస్తున్నాడు, వికసించిన ముఖంతో. అప్పుడు మేము ఉత్సవం చేయడానికి భోజనాల బల్ల అమర్చి, షాంపేన్ తాగి, ఆనందంగా వుండినాము.

అదంతా అర్థంచేసుకోడానికి నేనింకా మరీ చిన్నదాన్ని; అది యిప్పుడు తలచుకుంటే నా కండ్లలో నీళ్లు తిరుగుతాయి.

తరువాత, 1870లో, ఎంగెల్సు లండన్‌కు వచ్చి, ఇంటర్నేషనల్ చేపట్టిన విస్తారమైన పనిలో కొంత తాను వెంటనే తన నెత్తిన వేసుకున్నాడు. అదే సమయంలో ఆయన జనరల్

కౌన్సిల్ సభ్యుడుగానూ, బెల్జియంకు, తరువాత స్పెయిన్‌కూ, ఇటలీకీ, కరెస్పాండింగ్ సభ్యుడుగానూ వుండినాడు.

అంతేకాక, ఎంగెల్సు సాహిత్య కార్యకలాపాలు అసాధారణమైనంత గొప్పగా, వైవిధ్య పూరితంగా వుండినాయి. 1870 నుండి 1880 వరకు ఆయన వ్యాసాలూ, కరపత్రాలూ అంతం లేకుండా రాసినాడు.

కానీ, సకల విషయాలలోనూ ఆయన అత్యంత ముఖ్య రచన 1878లో వెలువడిన "ఆంటీ డ్యూరింగ్." యీ రచనయొక్క ప్రభావం గురించీ, ప్రాముఖ్యం గురించీ యీనాడు మాట్లాడడం "పెట్టుబడి" గ్రంథంయొక్క ప్రభావం గురించీ, ప్రాముఖ్యం గురించీ మాట్లాడటం ఎంత అనవసరమో అంత అనవసరం.

తరువాతి పది సంవత్సరాలలో ఎంగెల్సు ప్రతిరోజూ మా నాన్నను చూడడానికి వచ్చేవాడు. అప్పుడప్పుడు వాళ్లు కలిసి షికారు పోయేవాళ్లు. కానీ అంత తరుచుగానూ వాళ్లు మా నాన్న గదిలోనే వుండిపోయి, చెరొక పక్కనా అటూ యిటూ తిరుగుతూ వుండేవాళ్లు, గది మూల లలో వెనక్కి తిరిగేచోట బూట్ల మడిమలతో నేలలో గుంతలు పడేటట్లు చేస్తూ. అత్యధిక మంది వ్యక్తుల కలలోకూడా అందనన్ని తాత్విక విషయాలు వాళ్లు ఆ గదిలో చర్చించినారు. తరుచు వాళ్లు ఒకరి పక్కన ఒకరు మౌనంగా అటూ యిటూ నడిచేవాళ్లు. లేదా, ప్రతివొకరూ తన మనసులో ప్రధానంగా వున్న విషయం గురించి మాట్లాడేవాళ్లు; చివరకు యెదురెదురుగా నిలబడి బిగ్గరగా నవ్వుకునేవాళ్లు, గత అర్ధగంటసేపూ తద్వ్యతిరేకమైన పథకాన్ని తమ మనసులో తూకంవేసుకుంటూ వుండినట్లు ఒప్పుకుంటూ.

స్థలమూ, కాలమూ అనుమతిస్తే, ఆ రోజుల గురించి యెంత రాయవచ్చునని! ఇంటర్నేషనల్ గురించి, కమ్యూన్ గురించి, మా యిల్లు ప్రతి ప్రవాసజీవికీ స్వాగతమూ, సహాయమూ లభించే హోటల్ మాదిరీ వుండిన ఆ మాసాల గురించి!

1881లో మా అమ్మ చనిపోయింది. ఆరోగ్యం క్షీణిస్తూ వుండిన మా నాన్న కొద్ది నెలలపాటు ఎంగెల్సును చూడలేదు. 1883లో మా నాన్న మరణించినాడు.

అప్పటినుండి ఎంగెల్సు యెంత సాధించిందీ ప్రతి వొకరికీ తెలుసు. తన కాలంలో అత్యధిక భాగం ఆయన మా నాన్న రచనల ప్రచురణకు అర్పించినాడు, కొత్త కూర్పుల ప్రూఫులు చూస్తూ, లేదా "పెట్టుబడి" అనువాదాలను తనిఖీ చేస్తూ. యీ పనిని గురించి కానీ, ఆయన సొంత రచనల గురించి కానీ నేను చెప్ప నక్కరలేదు: ఎంగెల్సును యెరిగినవాళ్లు మాత్రమే ఆయన ప్రతిరోజూ యెంత పని చేసిందీ గ్రహించి హర్షించగలరు. ఇటాలియన్లూ, స్పానియర్డులూ, డచ్చివాళ్లూ, డేనులూ, రుమేనియన్లూ (వాళ్ల భాషలన్నీ ఆయనకు క్షుణ్ణంగా తెలుసు) — ఇంగ్లీషువాళ్లనూ, జర్మన్లనూ, ఫ్రెంచివాళ్లనూ చెప్పనక్కరలేదు — అందరూ ఆయన దగ్గరికి సహాయంకొరకూ, సలహాకొరకూ వచ్చేవాళ్లు.

మన నాయకుని ద్రాక్షతోటలో, అనగా ప్రజలలో, పనిచేసే మనకు యే కష్టం యెదురైనా, ఎంగెల్సువద్దకు పోతాము. మరి, ఆయనకు చేసిన అభ్యర్థన యెప్పుడూ వ్యర్థం కాలేదు.

యిటీవలి సంవత్సరాలలో యీ ఒక్క వ్యక్తి చేసిన పని మామూలు మనుషులు డజను మందికి తలకు మీరినది. మరి, ఎంగెల్సు యింకా పనిచేస్తున్నాడు; యెందుకంటే, ఆయనకు తెలుసు, మనకూ అందరికీ తెలుసు, మార్క్స్ వదలిపోయినదాన్ని ఆయన, ఆయన మాత్రమే, ప్రపంచానికి అందివ్వగలడు. మనకోసం ఎంగెల్సు చేయవలసింది యింకా యెంతో వుంది; అది ఆయన చేస్తాడు కూడా!

యిది కేవలం ఆయన జీవితపు స్థూలరేఖ. యిది అసలు మనిషి కాదు, మనిషియొక్క అస్థిపంజరం, అనవచ్చు. ఆ అస్థిపంజరానికి ప్రాణం పోయడానికి నాకంటె, బహుశా మన అందరికంటె, యెక్కువ సామర్థ్యం అవసరం. మనం ఆయన్ను బాగా చూడగలగడానికి మరీ దగ్గరగా వున్నాము.

* * *

ఎంగెల్సుకు యిప్పుడు డెబ్బై యేండ్లు. తన డెబ్బై యేండ్ల బరువును ఆయన అవలీలగా మోస్తున్నాడు. ఆయన దేహమూ, ఆత్మా చురుకుగా వున్నాయి.

తన ఆరడుగులా చిల్లర యెత్తును ఆయన యెంత తేలికగా మోస్తాడంటే, ఆయన అంత యెత్తు వున్నాడని మనకు అనిపించదు. ఆయన గడ్డం పెంచుకున్నాడు, అది చిత్రంగా ఒక పక్కకు పెరుగుతుంది; అది తెల్లబడడం ప్రారంభిస్తున్నది. అందుకు భిన్నంగా, ఆయన జుట్టు ముదురు గోధుమ రంగులో వుంది, ఒక్క తెల్ల చార కూడా లేకుండా; కనీసం, జాగ్రత్తగా చేసిన పరిశీలనకు తెల్ల వెంట్రుకలు బొత్తిగా కనిపించలేదు. జుట్టుకు సంబంధించినంతవరకు కూడా ఆయన మనలో అత్యధికులకంటె చిన్నవాడు.

మరి ఎంగెల్సు చిన్నవాడుగా కనిపించినప్పటికీ, కనిపించినంతకంటె కూడా చిన్నవాడు ఆయన. నిజంగా ఆయన నాకు తెలిసినవాళ్లలో కెల్ల చిన్నవాడు. నాకు జ్ఞాపక మున్నంత వరకు, గత యిరవై క్లిష్ట సంవత్సరాలలో ఆయనకు పెద్దతనం ఏమీ రాలేదు.

1869లో నేను ఆయనతో కలిసి ఐర్లండుకు పోయినాను. ఆయనతో కలిసి ఆ దేశాన్ని చూడడం ఆసక్తికరంగా వుండింది. "జాతుల నియోబె"* అయిన ఐర్లండు చరిత్రను ఆయన

---

* ప్రాచీన గ్రీకు గాథ ప్రకారం అమ్ఫియోన్ అనే జారు భార్య నియోబెకు చాలా మంది పిల్లలు వుండినారు. ఆ గర్వంతో ఆమె, అపోలో, ఆర్టెమిస్ అనే యిద్దరు పిల్లలు మాత్రమే వుండిన దేవత లెతోను యెప్పుడూ యెగతాళి చేసేది. నియోబెను శిక్షించడానికి, ఆమె

రాయాలనుకొన్నాడు. తరువాత 1888లో నేను ఆయనతో కలిసి అమెరికాకు పోయినాను. 1869లోనూ, 1888లోనూ ఆయన యే విందులో వున్నా, యే బృందంలో వున్నా, ప్రతి దానికీ జీవమూ, ఆత్మా ఆయనే.

"సిటీ ఆఫ్ బెర్లిన్" ఓడమీదా, "సిటీ ఆఫ్ న్యూయార్క్" ఓడమీదా యే వాతావరణంలో నైనా డెక్కుమీద షికారు పోవడానికీ, ఒక గ్లాసు బీరు తాగడానికీ ఆయన యెప్పుడూ సిద్ధంగా వుండేవాడు. దారిలో యేదైనా అడ్డం వుంటే యెప్పుడేగాని దానిచుట్టు తిరిగి పోకుండా, దానిని యెక్కడమో యెగరడమో చేయాలనేది ఆయన అచంచలమైన సూత్రంగా కనపడేది.

యిక్కడ మా తండ్రి వ్యక్తిత్వంలోనూ ఎంగెల్సు వ్యక్తిత్వంలోనూ ఒక పార్శ్వం గురించి కాస్త వివరించాలి. అది బయటి ప్రపంచానికి తెలియదు గనుక, అత్యధిక మందికి నమ్మరానట్లు కనపడుతుంది గనుక, దాన్ని మరీ నొక్కి చెప్పాలి.

మా తండ్రి మానవద్వేషి అయిన వెటకారపు వ్యక్తి లాంటివాడనీ, మిత్రులమీదా, శత్రువులమీదా ఒకే విధంగా ఉరమడానికి నిత్యం సిద్ధంగా వుండేవాడనీ యెప్పుడూ వర్ణింపబడినాడు.

కానీ, ఒక్కసారైనా సరే, ఆయన అందమైన ముదురు గోధుమవర్ణపు కన్నులలోకి, నిశితమైనవైనా అదే సమయంలో అంత హాస్య కరుణా పూర్ణమైన ఆ కన్నులలోకి, చూసినవాళ్లకు అందరికీ వ్యాపించేదీ హృదయోల్లాసకరమైనది అయిన ఆయన నవ్వును విన్నవాళ్ళకూ యెవరికైనా తెలుసు, వెటకారపు రాక్షసు డనేమాట వట్టి ఊహ అని.

ఎంగెల్సు విషయం కూడా అంతే. ఆయన్ను నియంతగానూ, రంధ్రాన్వేషణా తత్పరుడైన విమర్శకునిగానూ చిత్రించేవాళ్లు వున్నారు. అందులో యేమాత్రమూ సత్యం లేదు.

యువకులపట్ల ఎంగెల్సుకు గల తరగని దయను గురించి నేను చెప్పనక్కర లేదు: దానికి సాక్ష్యం చెప్పగలవాళ్లు ప్రతి దేశంలోనూ తగినంత మంది వున్నారు. నేను చెప్పగలిగిందల్లా యేమిటంటే — యెవరో ఒక యువకునికి మైత్రీపూర్వకంగా సహాయం చేయడానికి ఆయన తన పనిని పక్కన పెట్టడం నేను చాలాసార్లే చూసినాను; ఒక ప్రారంభకునికోసం ఆయన తన పనినే తరుచుగా నిర్లక్ష్యం చేసినాడు.

---

పిల్లలనందరినీ లెతో చంపించింది. నియోబెను కన్నీళ్లు కార్చే శిలగా మార్చింది. యిక్కడ ఐర్లండు నియోబెతో పోల్చబడింది. 1840ల అంతంలోనూ, 50ల ఆరంభంలోనూ ఐర్లండు కరువు కాటకాల మూలంగానూ, ప్రజలు వలసపోవడం మూలంగానూ, తన జనాభాలో 25 లక్షలమందిని పోగొట్టుకొంది. — సం.

ఎంగెల్సు యెప్పుడూ క్షమించనిది ఒకటి వుంది — వంచన. తనను తాను వంచన చేసుకునే మనిషి, అంతకంటె యెక్కువగా తన పార్టీని వంచన చేసే మనిషి ఎంగెల్సునుండి దయను పొందడు. ఆయనకు అవి క్షమించరాని పాపాలు....

యిక్కడ నేను ఎంగెల్సు లక్షణం మరొకటి చెప్పాలి. ఆయన ప్రపంచంలో కెల్లా కచ్చితమైన మనిషి అయినప్పటికీ, కర్తవ్య భావమూ, అన్నిటినీ మించి పార్టీ క్రమశిక్షణ భావమూ అందరికంటె బలీయంగా కలవాడైనప్పటికీ, ఆయన యెంతమాత్రమూ ఛాందస శ్రోత్రియుడు కాదు....

ఎంగెల్సుయొక్క యువక తత్వమూ, దయా కాక, బహుముఖ ప్రజ్ఞ ఆయన గుణాలలో కెల్లా చెప్పదగినది. ప్రతి విజ్ఞాన శాఖా ఆయనకు కరతలామలకమే: ప్రకృతి చరిత్ర, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రం, భౌతికశాస్త్రం, భాషాశాస్త్రం ("ఆయన యిరవై భాషల్లో తడబడతాడు" అని డెబ్బైలలో ఆయన్ను గురించి "ఫిగారో" పత్రిక రాసింది), అర్థశాస్త్రం, ఆఖరున, అయినా అన్నిటికంటె తక్కువగా కాదు, మిలిటరీ యెత్తుగడలు. 1870లో, ఫ్రాంకో-ప్రష్యన్ యుద్ధ కాలంలో, ఎంగెల్సు "పాల్ మల్ గజెట్" పత్రికలో రాసిన వ్యాసాలు గొప్ప ప్రభావం కలిగించినాయి; సెడాన్ యుద్ధాన్నీ, ఫ్రెంచి సైన్యం ఛిన్నాభిన్నం కావడాన్నీ ఆయన కచ్చితంగా జోస్యం చెప్పినాడు.

అన్నట్టు, అప్పటినుండే ఆయనకు "జనరల్" అని మారుపేరు పెట్టబడింది. మా అక్క ఆయనను "సైనిక అధిష్ఠాన వర్గం" అని ప్రకటించింది. ఆ పేరు ఆయనకు అంటుకపోయింది; అప్పటినుండి మేము ఆయన్ను "జనరల్" అనేవాళ్లం. కాని యీనాడు ఆ పేరుకు మరింత విస్తృతమైన అర్థం వుంది: నిజానికి ఎంగెల్సు మన కార్మికవర్గ సైన్యానికి జనరల్....

ఎంగెల్సుయొక్క మరొక గుణం, బహుశా అన్నిటికంటె సారభూతమైనది, చెప్పాలి. అది ఆయన కున్న పరమ స్వార్థరాహిత్యం.

ఆయన యిలా అనేవాడు: "మార్క్సు జీవితకాలంలో నేను తాళం వేసేవానిగా వుండినాను. అందులో నేను పాండిత్యం గడించినాననుకుంటాను. నాకు మార్క్సులాంటి మంచి పాటకాడు వుండినాడని నాకు వల్లమాలిన సంతోషం." యీనాడు ఎంగెల్సు జంత్ర సమ్మేళనానికి దర్శకుడు; అయినా ఆయన, ఆయన మాటల్లోనే, "తాళం వేసేవాడు" అయినట్లు, నమ్రంగా, బడాయి లేకుండా, ఆడంబరం లేకుండా వున్నాడు.

మా నాన్నకూ, ఎంగెల్సుకూ గల మైత్రిని గురించి చెప్పే అవకాశం, చాలామంది యితర్లకు లభించినట్లే, నాకూ లభించింది. గ్రీకు పురాణాలలోని దామన్, పిథియన్‌ల మైత్రి లాగే అది చరిత్ర ప్రసిద్ధం ఔతుంది.

మార్క్సుతో ఆయన సాహచర్యం ఫలితంగా యేర్పడి, ఆయన జీవితాన్నీ, కృషినీ ప్రభావితం చేసిన మరి రెండు మైత్రులను ప్రస్తావించకుండా యీ వ్యాసం పూర్తి కాజాలదు.... మొదటిది మా అమ్మతో మైత్రి; రెండవది హెలిన్ దెముత్‌తో మైత్రి. దెముత్ యీ సంవత్సరం నవంబర్ 4న మరణించింది, మా తలిదండ్రుల సమాధిలోనే విశ్రమిస్తున్నది.

మా అమ్మను గురించి, ఆమె సమాధి పక్కన ఎంగెల్సు చెప్పింది యిది:

"మిత్రులారా!

"మనం సమాధి చేస్తున్న యీ ఉదాత్త హృదయం గల మహిళ 1814లో సాల్జ్ వెడెల్‌లో జన్మించింది. తరువాత కొద్ది కాలానికి ఆమె తండ్రి అయిన వెస్ట్‌ఫాలెన్ ప్రభువు కౌన్సిలర్‌గా ట్రీయర్‌కు పంపబడినాడు. అక్కడ మార్క్సు కుటుంబంతో ఆయన మైత్రి అభివృద్ధి అయింది. పిల్లలు కలిసి పెరిగినారు. రెండు ప్రజ్ఞాసంపన్నమైన ప్రకృతులు ఒకదాని నొకటి కలుసుకున్నాయి. మార్క్సు విశ్వవిద్యాలయానికి పోయినప్పుడు, వాళ్ల భవిష్య జీవితపు సమ్మేళనం అప్పటికే నిశ్చితమై పోయిన విషయం.

"1843లో, కొంత కాలం పాటు మార్క్సు సంపాదకుడుగా వుండిన మొదటి 'రైనిషె సైటుంగ్' అణచివేయబడిన తర్వాత, వాళ్ల పెండ్లి జరిగింది. అప్పటినుండి జెన్నీ మార్క్సు తన మగని భవితవ్యంలోనూ, కృషిలోనూ, పోరాటంలోనూ పాలు పంచుకోవడం మాత్రమే కాదు, వాటిలో అత్యంత గాఢమైన అవగాహనతోనూ, అత్యంత తీవ్రమైన ఆవేశంతోనూ పాల్గొనింది.

"యువ దంపతులు పారిస్‌కు పోయినారు, ఐచ్ఛిక ప్రవాస జీవితానికి. కానీ అది అతి త్వరలో నిజమైన ప్రవాస జీవిత మైంది. అక్కడ కూడా ప్రష్యన్ ప్రభుత్వం మార్క్సును బాధించింది. మార్క్సుమీద బహిష్కరణ ఉత్తరువు తేవడంలో పాలు పంచుకునేటంత నీచ స్థాయికి అలెగ్జాండర్ ఫన్ హుంబోల్ట్ వంటివాడు దిగజారినాడని దురదృష్టవశాత్తు చెప్పక తప్పదు. మార్క్సు కుటుంబం బ్రస్సెల్స్‌కు పోవలసి వచ్చింది.

"తరువాత ఫిబ్రవరి విప్లవం వచ్చింది. దాని ఫలితంగా బ్రస్సెల్స్‌లో చెలరేగిన గలాటాలలో మార్క్సు అరెస్టు కావడం మాత్రమే కాదు, బెల్జియన్ పోలీసులు యే ఆధారాలూ లేకుండా ఆయన భార్యను జైలులో తోసేటంత వరకు పోయినారు.

"1848 నాటి విప్లవ వెల్లువ తరువాతి సంవత్సరంలో అణగారిపోయింది. మళ్లీ ప్రవాసం, మొదట పారిస్‌లోనూ, తరువాత, ఫ్రెంచి ప్రభుత్వం మరింత జోక్యం తీసుకోవడం మూలంగా, లండన్‌లోనూ. యీసారి నిజంగా అది జెన్నీ మార్క్సుకు అసలైన ప్రవాసం, దాని సకల బీభత్సాలతోనూ. అయినప్పటికీ, తన యిద్దరు కొడుకులూ, ఒక చిన్న కూతురూ మరణించే స్థితికి దారితీసిన ఆ భౌతిక కష్టాన్ని ఆమె అధిగమించి వుండేది; కానీ ప్రభుత్వమూ,

వెకిలి ఉదారవాదులనుండి ప్రజాతంత్రవాదుల వరకు బూర్జువా వ్యతిరేకులూ ఆమె భర్తకు వ్యతిరేకంగా ఒక మహా కుట్రలో ఏకమై, ఆయనమీద అత్యంత యేహ్యమైన నీచమైన అపనిందలు కురిపించినారు; పత్రికలు సమస్తమూ ఆయనకు వ్యతిరేకంగా ఏకమై ఆయనకు యే ఆత్మరక్షణ సాధనమూ లేకుండా చేసినాయి; తత్ఫలితంగా, ఆయనా ఆమే అసహ్యించుకోక తప్పని శత్రువులకు వ్యతిరేకంగా ఆయన కొంత కాలంపాటు నిస్సహాయుడైనాడు. యిదంతా ఆమెను గాఢంగా గాయపరిచింది. అది చాలా కాలం వుండింది.

"కానీ శాశ్వతంగా కాదు. యూరపియన్ కార్మికవర్గం తనకు కొంత స్వేచ్ఛ యిచ్చే జీవన పరిస్థితులు మళ్లీ సంపాయించుకొంది. ఇంటర్నేషనల్ స్థాపించబడింది. కార్మికవర్గంయొక్క వర్గపోరాటం ఒక దేశంనుండి మరొక దేశానికి వ్యాపించింది. ఆమె భర్త అగ్రగాములలో నిలిచి పోరాడినాడు; ఆయన అందరిలోకీ అగ్రగామిగా వుండినాడు. ఆమె కష్టాలలో కొన్నిటికి నష్టపరిహారం కలిగించిన కాలం అప్పుడు ఆమెకు ప్రారంభమైంది. ఆమె భర్తను బాధించిన అపనింద గాలికి పొట్టులాగ చెదరిపోవడం చూసిందాకా ఆమె బతికింది; ప్రగతి వ్యతిరేక పార్టీలన్నీ, ఫ్యూడల్ పార్టీలూ, ప్రజాతంత్ర పార్టీలూ, దేన్ని అణచడానికి అంత గొప్ప ప్రయత్నాలు చేసినాయో అట్టి ఆయన బోధన సకల నాగరిక దేశాలలోనూ, సకల భాషలలోనూ బహిరంగంగా బోధింపబడడం చూసిందాకా ఆమె బతికింది. తన సొంత జీవితంతో తాదాత్మ్యం పొందిన కార్మికవర్గ ఉద్యమం రష్యానుండి అమెరికా దాకా పాత ప్రపంచాన్ని సంచలింపజేసి, అంత ప్రతిఘటన వున్నప్పటికీ నిత్య ప్రవర్ధమాన విజయ విశ్వాసంతో ముందుకు తోసుకపోవడం చూసిందాకా ఆమె బతికింది. మన జర్మన్ కార్మికులు తమ తరగని జీవశక్తికి గత రైహ్‌స్టాగ్ యెన్నికల్లో చూపించిన అద్భుతమైన నిదర్శనం ఆమె చివరి సంతోషాలలో ఒకటి.

"అంత నిశితమైన విమర్శనాత్మక మేధా, అంత రాజకీయ సమయోచితత్వమూ, అంత చురుకైన, ఆవేశపూరితమైన వ్యక్తిత్వమూ, పోరాటంలోని తన కామ్రేడ్లపట్ల అంత కర్తవ్యనిష్ఠ గల యీమె సుమారు నలభై సంవత్సరాలు ఉద్యమానికి యేమి చేసిందీ ప్రజలకు తెలియదు, సమకాలిక పత్రికలలో నమోదుచేయబడలేదు. యెవరైనా అది అనుభవించి వుండవలసిందే. కానీ నాకు యింత మాత్రం తెలుసు: కమ్యూన్ ప్రవాసుల భార్యలు తరుచుగా ఆమెను గురించి మనసులో అనుకుంటే, యితరులం, మేము, ఆమెయొక్క నిశితమైన, యుక్తిగల సలహా లేని లోటును తరుచుగానే అనుభవిస్తాము — బడాయి లేకుండా నిశితమైన సలహా, ఆత్మగౌరవానికి సంబంధించిన యే అంశంమీదా లొంగకుండా యుక్తిగల సలహా....

"ఆమె వ్యక్తిగత గుణాలను గురించి నేను చెప్పనక్కర లేదు. ఆమె మిత్రులకు అవి తెలుసు, వాళ్లు అవి మరచిపోరు. యితరులను సంతోషపెట్టడమే తనకు అత్యంత సంతోషంగా పరిగణించిన స్త్రీ యెప్పుడైనా వుంటే, ఆ స్త్రీ యీమే."

హెలిన్ దెముత్ అంత్యక్రియల దగ్గర ఎంగెల్సు యిలా అన్నాడు:

"కష్టమైన, జటిలమైన పార్టీ వ్యవహారాలలో మార్క్సు తరుచుగా ఆమె సలహా అడిగేవాడు. యిక నా పాలికి, మార్క్సు మరణించినప్పటినుండి నేను చేయగలిగిన పని అంతటికీ ఆమె ఉనికి ద్వారా నా యింటికి వచ్చిన వెలుగూ, సహాయమూ, యెక్కువ కారణం. మార్క్సు మరణానంతరం ఆమె నా యింటిలో నివసించడానికి వచ్చి నాకు గౌరవం ఒనగూర్చింది."

మార్క్సుకూ, ఆయన కుటుంబానికీ ఆమె యేమి అయిందీ మేము మాత్రమే గ్రహించగలం. మేము కూడా అది మాటల్లో వ్యక్తం చేయలేము. 1837నుండి 1890 దాకా ఆమె మాలో ప్రతి వొకరికీ నిజమైన మిత్రురాలు, సహాయకురాలూ.

# ఎడ్గార్ లోంగె

## కార్ల్ మార్క్స్ కుటుంబ జీవితం*

కార్ల్ మార్క్స్ కుటుంబ జీవితపు యీ రేఖా చిత్రాన్ని చిత్రించడంలో, దీనిని అనేక వ్యక్తిగత స్మృతులతో అలంకరించడం నాకు యిష్టమే. దురదృష్టవశాత్తు, యేండ్లు గడవడంచేతా, నేను మా తాతను చివరిసారి చూసినప్పుడు నాకు మూడేండ్లు మాత్రమే వుండినందుచేతా, యీ స్మృతులు మాసిపోయినాయి.

కానీ, చిత్రమైన విషయం యేమిటంటే, మన జీవితంనిండా వున్న అనేక ఘటనలలో కొన్ని విషయాలు, యెందుకో తెలియదు, మనఃఫలకంమీద శాశ్వతంగా ముద్రింపబడి వుంటాయి.

ఆవిధంగా, మా తాత మా అన్న జాన్‌నూ నన్నూ షాంప్రూ అడవిలో షికారు తీసుకపోవడం నాకు యెంతో స్పష్టంగా జ్ఞాపకముంది. అది ఆ 1882వ సంవత్సరంలో యింకా అస్పరాగస్ పొలాలతోనూ, ద్రాక్షలతోనూ ఆర్జెంటెల్‌కు మారుమూల గ్రామీణ ప్రాంతపు రూపాన్ని యిస్తూ వుండింది. అది 1882 జూలైలో మార్క్స్ నా తలితండ్రులను చూడడానికి వచ్చినప్పుడు, మా నాన్న, షార్ల్ లోంగె, కమ్యూన్ మాజీ సభ్యుడు, 1880 అంతంలో ప్రవాసంనుండి తిరిగివచ్చిన తర్వాత, నా తలితండ్రులు ఆ గ్రామీణ జిల్లాలో నివసిస్తూ వుండినారు.

నా చిన్నతనంలో మా తాత నాకు విచారకరమైన, కానీ నా ఉద్దేశంలో సముచితమైన, అపప్రథ యిచ్చిపోయినందుకు నాకు ఆయనపట్ల కసి యేమీ లేదు. నాకు పద్దెనిమిది నెలలు వుండినప్పుడు నేను తిండిపోతుగా వుండినానట; ఆ కారణంవలన మా తాత నాకు

---

*యీ వ్యాసం 1949 మార్చిలో, కార్ల్ మార్క్స్ 66వ వర్ధంతి కొరకు ఎడ్గార్ లోంగె రాసినాడు. యీయన ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు, కార్ల్ మార్క్స్ మనుమడు (మార్క్స్ కూతురు జెన్నీ, షార్ల్ లోంగెల కొడుకు). యీ వ్యాసం అదే సంవత్సరంలో ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ పత్రిక అయిన "కమ్యూనిజంయొక్క నోట్‌బుక్కుల"లో ప్రచురింపబడింది. — సం.




1892లో హైడ్ పార్కులో లండన్ కార్మికుల మే ప్రదర్శన, దానికి ఎంగెల్సూ, ఎలినోర మార్క్సూ హాజరయినారు



గెర్మన్ అలెక్సాంద్రొవిచ్ లొపాతిన్

"తోడేలు" అని పేరు పెట్టినాడు. చాకొలెట్ ముక్క అనుకొని నేను పచ్చి గుండెకాయ కొరుకుతూ వుండగా మార్క్స్ చూసినాడు; నేను పొరపాటు పడినా, తినడం మానుకోలేదు; అందుకని ఆయన నాకా పేరు పెట్టినాడు.

కానీ, మా అమ్మకు రాసిన ఒక ఉత్తరంలో మా తాత నామీద తన తీర్పును మెత్త బరిచినాడు:

"జాన్నూ, హారీనీ" (నా తమ్ముడు) "మంచి 'తోడేలు'నూ – వాడు నిజంగా అద్భుతమైన పిల్లవాడు – అడిగినానని చెప్పు."

మార్క్స్‌కు తన మనుమలతో గల సంబంధాలకు తరువాత వస్తాను. యిప్పుడు, ఆయన రాజకీయ జీవితాన్ని తగలకుండా, ఆయన కుటుంబ జీవితాన్ని సంక్షేపంగా వర్ణించాలనుకుంటున్నాను.

* * *

సంక్షేపంగా జ్ఞాపకం చేస్తాను: మార్క్స్ ట్రీయర్‌లో 1818లో, ఆ పట్టణాన్ని ఫ్రాన్సు స్వాధీనం చేసుకోవడం ముగిసిన కొద్ది కాలానికి, జన్మించినాడు.

ఆయన తండ్రి యూదు మతస్థుడు, తరతరాలుగా మతగురువులైనవాళ్ల వంశంలో పుట్టినవాడు. తన న్యాయవాద వృత్తికి ఉపయోగకరంగా వుంటుందనుకొని ఆయన ప్రొటెస్టంట్ మతం అవలంబించినాడు.

పద్దెనిమిదేండ్ల వయసులో మార్క్స్ జెన్నీ ఫన్ వెస్ట్‌ఫాలెన్‌తో వివాహం నిశ్చయం చేసుకున్నాడు; ఆమె ట్రీయర్‌లో కెల్ల అత్యంత సుందరమైన యువతిగా పరిగణింపబడినది. ఆమె కుటుంబం బ్రౌన్‌ష్వేయిక్‌కు చెందినది.

మా తాత జీవితంలో ప్రథమ భాగాన్ని, రాజకీయ దృక్కోణంనుండి అందరికీ తెలిసినదాన్ని, వదలిపెట్టి, ఆయన 1843లో పారిస్ చేరినాడనీ, 1845లో బహిష్కరింపబడినాడనీ మాత్రం జ్ఞాపకం చేస్తాను. (పారిస్‌లో వున్న ఆ కాలంలోనే మా అమ్మ పుట్టింది; పుట్టుకతో మా అమ్మ పారిషియన్ అన్నమాట.)

తరువాత ఆయన బ్రస్సెల్స్‌లో నివసించినాడు; కానీ అక్కడనుండి కూడా బహిష్కరింపబడి, 1848 ఫిబ్రవరి 24న యేర్పడిన తాత్కాలిక ప్రభుత్వం పేరుమీద ఫ్లోకాన్ చేసిన విజ్ఞప్తి ననుసరించి మార్చి 5న పారిస్‌కు తిరిగిపోయినాడు.

కార్మికవర్గం నిర్వహించిన ఫిబ్రవరి విప్లవాన్ని వినియోగించుకొని మరొకసారి బూర్జువా వర్గం కార్మికవర్గానికి వ్యతిరేకంగా అధికారం హస్తగతం చేసుకుందని ఆయన గ్రహించి, ఏప్రిల్‌లో పారిస్ వదలి జర్మనీకి పోయినాడు.

జర్మనీలో ఆయన విప్లవ పతాక యెగురవేసినాడు, ప్రగతి వ్యతిరేకత విజయం పొంది, ఆయన మళ్లీ ప్రవాసంలోకి పోవలసి వచ్చిందాకా భీకరంగా పోరాడినాడు.

ఆయన 1849 జూన్ ప్రారంభంలో పారిస్‌కు తిరిగివచ్చినాడు. మెజారిటీ సభ్యులు రాజరికవాదులుగా వుండిన లెజిస్లేటివ్ అసెంబ్లీ సమావేశమైనప్పుడు ఆయన పారిస్‌లో వుండినాడు. ఒక నెల గడిచీ గడవక ముందే, ఆ నగరం వదలిపోడానికి ఆయనకు వినయంగా యిరవై నాలుగు గంటల వ్యవధి యివ్వబడింది. అప్పుడు, 1849 ఆగస్టు అంతంలో, ఆయన యింగ్లండుకు పోయినాడు. ప్రపంచంలోని బహిష్కృతుల కందరికీ ఆనాడు తలదాచుకునే స్థలంగా వుండిన యింగ్లండులోనే ఆయన శేష జీవిత మంతటినీ, ముప్పై నాలుగేండ్లు, గడిపింది. మొట్టమొదట జ్ఞాపకం చేయవలసిం దేమిటంటే, ఆయనకు నిరంతరం ఆరోగ్యం క్షీణిస్తూ (లివర్ వ్యాధీ, ఉబ్బసమూ, తరుచుగా లేచే పుండ్లూ) వుండినప్పటికీ, భౌతిక కష్టాలతో బాధపడవలసివచ్చినప్పటికీ, ఆయన పూనుకొన్నదాన్ని సాధించగలిగినాడంటే, దానికి కారణం ఫ్రెడరిక్ ఎంగెల్సు.

మార్క్సు ఎంగెల్సుల మైత్రి ఒరెస్టిన్, పిలాడీన్‌ల ప్రాచీన గాథలాగ చరిత్రలో నిలిచి పోదగింది.

ఎంగెల్సు మాంచెస్టర్‌లో తన తండ్రి వ్యాపారంలోని బ్రాంచిని నిర్వహించడానికీ, తనకు తలభారంగా వుండిన వర్తకం నడపడానికి తన జీవితకాలంలో అత్యధిక భాగంలో తనకు తాను అన్యాయం చేసుకున్నాడు. యీ పనికి ఆయనకు గల కారణమల్లా యేమిటంటే, మార్క్సుకు సహాయం చేయగలగడమూ, మార్క్సు తన పనిని నిర్వహించేటట్లు చేయగలగడమూ. ఎంగెల్సు లేకపోతే, మార్క్సూ, ఆయన కుటుంబమూ పస్తులు వుండేవాళ్లు — అందుకు సందేహం లేదు.

మార్క్సు జీవితంలోనూ, మార్క్సు కుటుంబంలోనూ ప్రముఖ పాత్ర వహించిన మరొక వ్యక్తిని గురించి కూడా కొద్దిమాటలు చెప్పాలనుకుంటున్నాను. నే ననేది ఉత్తమమైన హెలిన్ దెముత్‌ను గురించి, లెన్‌హెన్ అనే సుపరిచిత నామం గల ఆమెను గురించి.

ఆమె యెనిమిది, తొమ్మిదేండ్ల వయసులో వున్నప్పుడు మా ముత్తవ్వ బేరనెస్ ఫన్ వెస్ట్‌ఫాలెన్ కొలువులో చేరి మా అవ్వ వివాహం మొదలు మరణందాకా, ఆమె పోయిన చోటికల్లా, పారిస్‌కూ, బ్రస్సెల్స్‌కూ, లండన్‌కూ ఆమెను అనుసరించింది.

ఆమె పిల్లలు పుట్టడమూ, చావడమూ చూసింది; మార్క్సు కుటుంబంతో కలిసి ఘోరమైన దారిద్ర్యమూ, ఆకలీ, అగచాట్లూ అనుభవించింది; పిల్లలూ, మిత్రులూ, ప్రవాసులూ కటిక దరిద్రం అనుభవించడం చూసింది; ప్రతిదీ తాకట్టులో వున్నప్పుడు వాళ్లకు తిండిపెట్టగలిగింది; బట్టలు కుట్టుతూ, ఉతుకుతూ, వాళ్లు జబ్బుపడినప్పుడు మంచం పక్కన వుంటూ రాత్రులు గడిపింది. ఆమె స్మృతి నాకు మహా ఆర్ద్రమైనది.

యీ ప్రశంసనీయమైన స్త్రీ మార్క్సునూ, ఆయన భార్యనూ, వాళ్ల మనుమడు హారీనీ సమాధి చేసిన లండన్ హైగేట్ సమాధిలో వుంచబడడానికి పూర్తిగా అర్హులు.

## లండన్‌లో ప్రవాసుల బీదరికం

యే ఆధారమూ లేకుండా లండన్‌కు వచ్చే ప్రవాసులయొక్క, ప్రవాసుల కుటుంబాల యొక్క జీవితాన్ని యిప్పుడు సంక్షేపంగా వర్ణించాలని అనుకుంటున్నాను. మార్క్సుకూ, ఆయన కుటుంబానికీ అక్కడ దారిద్ర్యమూ, బాధలూ, పిల్లల చావులూ నిండిన జీవితం ప్రారంభమైంది. ఎంగెల్సుకు మార్క్సు రాసిన ఒక జాబును ఉల్లేఖించడం ద్వారా కంటె మరొక విధంగా ఆ జీవితాన్ని గురించి నేను బాగా చెప్పలేను. తన భార్య కన్నీళ్లతో గడిపే భయానక రాత్రులను తానిక యెంత మాత్రమూ భరించలేనని ఆ జాబులో ఆయన రాసినాడు.

1850 జూన్‌లో మార్క్సు, ఆయన కుటుంబమూ, తమ యింటిలోనుండి వెళ్లగొట్టబడి, లైసెస్టర్ స్క్వేర్‌లో ఫర్నిచర్‌తోకూడిన ఒక యింట్లో తలదాచుకున్నారు, తరువాత డీన్ స్ట్రీట్‌లో చేరినారు. అప్పటి కింకా డీన్ స్ట్రీట్‌లోని యిల్లు చాలా అధ్వాన్నంగా వుండింది — ఒక పెద్ద గదీ, ఒక చిన్న గదీ; ఒక గదే వంటగదిగానూ, పఠనాగారంగానూ, డ్రాయింగు రూమ్‌గానూ వుండిందన్నమాట.

కష్టాలు కొనసాగుతూనే వుండినాయి.

1851లో, ఫ్రాన్‌త్సిస్కా పుట్టినప్పుడు, మార్క్సు ఎంగెల్సుకు యిలా రాసినాడు: "అదే సమయంలో, నా భార్యకు శిశువు పుట్టింది. కాన్పు సులభంగా వుండింది, కానీ ఆమె యింకా మంచంలో వుంది, శారీరక కారణాలకంటె యెక్కువగా సాంసారిక కారణాలవల్ల. నాకు యింట్లో కచ్చితంగా ఒక ఫార్తింగు కూడా లేదు, కానీ అంగడివాళ్లూ, మాంసవర్తకుడూ, బ్రెడ్డువర్తకుడూ వగైరాలనుండి వచ్చే బిల్లులకు కొదవ లేదు.

"యిదంతా అంత మనోహరమైన పరిస్థితి కాదనీ, నేను పెటీబూర్జువా బురదలో గొంతుదాకా మునిగినాననీ నీవూ ఒప్పుకుంటావు. యిక, యివన్నీ చాలక, నేను కార్మికులను స్వార్థానికి వినియోగించుకుంటున్నాననీ, నియంతృత్వం కొరకు కృషి చేస్తున్నాననీ నన్ను నిందిస్తున్నారు. యెంత ఘోరం!..."

1852 సెప్టెంబర్ 8 నాటి జాబులో ఆయన యిలా రాసినాడు:

"నా భార్య జబ్బుగా వుంది. జెన్నీ" (అనగా మా అమ్మ) "జబ్బుగా వుంది. లెన్‌హెన్‌కు ఒకరకమైన నరాల జ్వరం వుంది. మందుకు డబ్బు లేదు గనుక, డాక్టర్‌ను పిలవలేకపోయినాను,

పిలవలేను. గత వారం పొడవునా నేను బ్రెడ్డూ, బంగాళాదుంపలతో నా కుటుంబాన్ని సాకినాను; యీ రోజుకు మరికొన్ని సంపాయించగలనో లేదో సందేహంగా వుంది."

1855లో జనవరిలో ఆరవ బిడ్డ పుట్టింది. ఆ బిడ్డ పేరు టుస్సీ (మా చిన్నమ్మ ఎలినోర ఎవెలింగ్). ఆ శిశువు యెంత పీలగా వుండిందంటే, అది యే రోజైనా మరణిస్తుందని అనుకున్నారు. కొద్ది నెలల తర్వాత మార్క్సుకు ఆయన జీవితంలో కెల్ల మహా దుఃఖాలలో ఒకటి సంభవించింది: ఆయన ఏకైక పుత్రుడు, ఎడ్గార్, ఆయన "ముష్," "కర్నల్ ముష్," ఆయన చేతుల్లో మరణించినాడు. ఆ కుర్రవాడు కొన్ని వారాలపాటు మృత్యువుతో పోరాడుతూ వుండినాడు; మార్క్స తన ఉత్తరాలలో కుర్రవాని పరిస్థితిలోని బాగోగులు రాస్తూ వుండినాడు. కానీ మార్చి 30 నాడు ఒక జాబులో మార్క్స ఎంగెల్సుకు యిలా రాసినాడు: "వ్యాధి చివరకు పొత్తి కడుపు క్షయ అని తేలింది, యిది మా కుటుంబంలో ఆనువంశికంగా వుండే వ్యాధి. డాక్టర్లు ఆశ వదలుకున్నారు.... నా గుండె మండిపోతున్నది, నా తల ప్రేలిపోతున్నది; కానీ నేను ప్రశాంతంగా వుండాలి కదా. పిల్లవాడు జబ్బులో తన గుణాలకు తగినట్లు ప్రవర్తించినాడు — మంచితనంగా, అయినా యెంతో వ్యక్తిత్వంతో."

పిల్లవాడు నిజంగా తెలివిపరుడు; అతనికి తన తండ్రి లాగే పుస్తకాలమీద ప్రేమ.

1855 ఏప్రిల్ 12న ఎంగెల్సుకు మా తాత యిలా రాసినాడు:

"యింటికి దీపంగా వుండిన పిల్లవాని మరణం తర్వాత, సహజంగా, యిల్లంతా ఖాళీగా, పాడువడినట్లు వుంది. ప్రతిచోటా పిల్లవాడు లేని లోటు మమ్మల్ని యెంతగా బాధించేదీ నేను మాటల్లో చెప్పలేను. నేను యిప్పటికి అనేక రకాల బాధలు అనుభవించినాను గానీ, నిజమైన దుఃఖం అంటే యేమిటో యిప్పుడు తెలుసుకున్నాను. నేను పూర్తిగా క్రుంగిపోయినాను. అదృష్టవశాత్తు, శవాన్ని సమాధి చేసిన నాటినుండి నాకు తలనొప్పి యెంత తీవ్రంగా వుందంటే, నేను యిక యెంత మాత్రమూ సజీవంగా లేను.

"యీ మధ్య నేను అనుభవించిన భయంకరమైన బాధల్లో, నీ మైత్రిని గురించిన ఆలోచనా, మన మింకా యీ భూమిమీద తెలివిగల పని చేయవలసి వుందన్న విశ్వాసమూ నన్ను ఆదుకున్నాయి."

కొద్ది వారాల తర్వాత మా అవ్వకు మాతృ వియోగం సంభవించి, కొద్ది వందల థేలెర్లు సంక్రమించినాయి; తద్వారా ఆ కుటుంబం గ్రాఫ్టన్ స్క్వేర్‌లో మరింత ఆరోగ్యకరమైన యింటిలో స్థిరపడగలిగింది. మార్క్సుకు మరొక పిల్లవాడు చాలా చిన్నతనంలో మరణించినాడు.

యీ మరణం సంభవించిన పరిస్థితులు మహా దారుణంగా వుండినాయి; అవి మా తాత మీద యెంత విషాద ముద్ర వేసినాయంటే "ఆయనకు కొన్ని రోజులపాటు మతిపోయింది."

అనేక సంవత్సరాలు మార్క్సుకూ, ఆయన కుటుంబానికీ అలాగే గడ్డు కాలంగా కొనసాగింది, పిల్లల మరణాలు విశేషం.

"న్యూయార్క్ ట్రిబ్యూన్"కు ఆయన రాసిన రచనలు కొద్ది సంవత్సరాలు ఆర్థికంగా ఆయన పరిస్థితిని కొంచెంగా మెరుగుపరిచినాయి. తర్వాత మళ్లీ దారిద్ర్యం వచ్చింది; అది యెంత క్రూరంగా వుండిందంటే: తన పిల్లలను యెవరికైనా మిత్రులకు అప్పగించి, హెలిన్ దెముత్‌ను పనినుండి తొలగించి, తన భార్యతో ఫర్నిష్డ్ గదులలో చేరి, మామూలు గుమాస్తా ఉద్యోగం చూసుకోవా లనుకుంటున్నానని మార్క్స్ ఎంగెల్సుకు రాసినాడు.

ఆయన తల్లి మరణంతో ఆయనకు 1863లో స్వల్ప ఆస్తి సంక్రమించింది. కొద్ది కాలం తర్వాత ఆయన పాత మిత్రుడు విల్‌హెల్మ్ వొల్ఫ్ మరణించి, తన చిన్న సంపదను ఆయనకు వదలిపెట్టిపోయినాడు. దీనిద్వారా మార్క్స్ తన అప్పులు, "నోయె రైనిషె సైటుంగ్" కొరకు చేసినవాటితో సహా, తీర్చి, తన ఆరోగ్యం అనుమతించినంతవరకు శాస్త్రీయ కృషికి అంకితం కాగలిగినాడు.

కానీ ఆయన ఆరోగ్యం మెరుగుకాలేదు, చాలాసార్లు ఆయన ప్రాణాపాయ స్థితిలో వుండినాడు.

అప్పటినుండి మార్క్స్ కురుపులతోనో, పుండ్లతోనో బాధపడని సంవత్సరం లేదు; వాటికి తోడు లివర్ వ్యాధి కలిగించే బాధలు కూడా వుండినాయి.

## పనితో, పోరాటంతో నిండిన అద్భుత జీవితం

భౌతిక, నైతిక కష్టాలతోనూ, అనారోగ్యంతోనూ పీడింపబడుతూ మార్క్స్ అంత బ్రహ్మాండమైన కృషి యెలా సాధించగలిగిందీ వివరించడం ఆసక్తికరంగా వుండేది.

యీ వ్యాసం మరీ పెద్దది కావడం నాకు యిష్టం లేదు గనుక, మొదట ఒక విషయం మాత్రం ప్రస్తావిస్తాను: మార్క్స్ దినమంతా, ఉదయం పదినుండి సాయంత్రం యేడు దాకా, బ్రిటిష్ మ్యూజియంలో నీలం పుస్తకాలూ, పార్లమెంటరీ పత్రాలూ, సాంఘిక, ఆర్థిక శాస్త్ర గ్రంథాలూ, వగైరా చూస్తూ గడిపి, యింటిదగ్గర రాత్రి అంతా పనిచేస్తూ గడిపేవాడు.

తన బౌద్ధిక కృషి ద్వారా బతకడానికి ఆయన చాలాసార్లు ప్రయత్నం చేసినాడు; కానీ సాధారణంగా ఆయనకు ప్రచురణకర్తలు దొరకడం అసాధ్యంగా వుండేది. అంతేగాక, ఆయన తన కాలాన్ని అప్రధాన రచనలమీద వృథా చేయడం ఎంగెల్సు అనుమతించలేకపోయినాడు; ఆయన అర్థశాస్త్రంమీద రాయదలచుకున్న మహత్తర రచనకు సన్నాహం చేసుకోవడంలో తనకు లభించిన ప్రతి నిముషాన్నీ వినియోగించాలని ఎంగెల్సు ఉద్బోధించినాడు. ఆ ప్రయోజనానికి ఎంగెల్సు నిత్యం సహాయం చేసినాడు.

కానీ ఆ సహాయం చాలలేదు.

"నోయె రైనిషె సైటుంగ్" మార్క్సుకు అప్పులు మాత్రమే కొనితెచ్చింది. అందు వల్లనే ఆయన 1851నుండి "న్యూయార్క్ ట్రిబ్యూన్" కొరకు పనిచేయడానికి అంగీకరించినాడు. యీ పనికొరకు ఆయన అనేక విషయాలు అధ్యయనం చేయవలసి వచ్చింది; అయినా, యీ విషయాలు కొంతవరకు ఆయన ప్రధాన శాస్త్ర కృషికి సంబంధించినవిగా వుండినాయి. "న్యూయార్క్ ట్రిబ్యూన్"కు ఆయన రాసిన వ్యాసాలు ఆధునిక కాలంయొక్క సాధారణ చరిత్రమీదా, ఆర్థిక చరిత్రమీదా నిశ్చయంగా విలువైన రచనలు.

ఆర్థిక దృష్ట్యా దురదృష్టవశాత్తు, ఆ వ్యాసాలలో మూడింట ఒక భాగానికి మాత్రమే ఆయనకు డబ్బు ముట్టింది. తక్కినవాటిని సంపాదకుడు తొక్కేసినాడు; కనుక వాటికి డబ్బు యివ్వవలసిన బాధ్యత తనకు లేదని అతను అనుకున్నాడు.

తన కుటుంబాన్ని పోషించడానికి కూడా వీలు కలిగించని యీ కృతజ్ఞతా రహిత రచనా కృషికి మార్క్స్ మహా అపనమ్మకాలతో తల ఒగ్గినాడని చెప్పక తప్పదు.

కమ్యూనిస్టు లీగుయొక్క కొలోన్ సభ్యులూ, యితర సభ్యులూ అరెస్టు అయి, వాళ్లమీద కోర్టు విచారణ జరిగిన సందర్భంగా 1852లో ఆయన కాలంలో అత్యధిక భాగం వ్యయమైంది.

ఆ విచారణ పోలీసులూ, ప్రభుత్వమూ పన్నిన పన్నాగం తప్ప మరేమీ కాదని రుజువు చేయడానికి మార్క్స్ తన లండన్ మిత్రులతో కలిసి శ్రమ యెరగకుండా కృషి చేసినాడు....

జ్ఞాపకం చేయవలసిన ఆఖరి విషయం యేమిటంటే: శ్రమతో కూడిన, గంభీరమైన, నిశిత పరిశీలనాత్మకమైన రచన "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"ని మార్క్స్ రచించింది సరిగ్గా ఆయన కష్టాలలో తలమునకలుగా వుండిన కాలంలోనే.

ఆ కాలమంతా ఆయన దుస్తులు తాకట్టులో వుండినందున యిల్లు వదలి బయటికి పోలేని స్థితిలో వుండినాడు.

అవే భౌతిక కష్టాలతో, దీర్ఘ అస్వస్థ దినాలతో, విడుపులేని శ్రమభారంతో యేండ్లు గడిచినాయి; యెన్ని వున్నప్పటికీ ఆయన మహత్తర కృషి కొనసాగింది. ఆ కృషి యోధుని కృషి, యోచనాపరుని కృషి, సృష్టికర్త కృషి; యెందుకంటే, ఆయన తన పఠనాగారపు కృషికి పరిమితం కాకుండా, బ్రహ్మాండమైన సిద్ధాంత కృషితో పాటు ఇంటర్నేషనల్‌ను నడిపించే కృషికి నిర్విరామంగా అంకితమైనాడు.

యెన్ని వున్నప్పటికీ, ఆయన యిల్లు, ముఖ్యంగా ఆయన మేయ్‌ట్లండు పార్కులో వుండినప్పుడు (ఆ యింటిని నాజీ బాంబులు వదలిపెట్టలేదు), ప్రవాసు లందరికీ, యోధు లందరికీ, యింగ్లీషువాళ్లైనా, విదేశస్థులైనా ఆశ్రయంగా వుండింది.

మార్క్స్ తన భార్యతోనూ — మరణాలూ, బాధలూ సంభవించినా ఆమె తన అతి

థులకు, అందులో అత్యధిక భాగం ప్రవాసు లైనవాళ్లకు, యెల్లప్పుడూ చిరునవ్వుతో స్వాగతం యిచ్చేది – తన ముగ్గురు కూతుర్లు జెన్నీ, లౌరా (తరువాత పాల్ లాఫార్గ్ భార్య), ఎలినోరలతోనూ – ముగ్గురూ అసాధారణమైన తెలివితేటలూ, సంస్కారమూ కలవాళ్లు, ప్రతి వొకరిని గురించీ విడిగా ఒక జీవిత కథ రాయదగినట్టివాళ్లు – అలాంటి భార్యతోనూ అలాంటి కూతుర్లతోనూ ఆయన జీవించిన ఆ యింటిలోని వాతావరణం నా చిన్నప్పటి స్మృతిలో వుంది.

తన బిడ్డలచేత పూజింపబడిన మార్క్స్ పిల్లలను ఆరాధించేవాడు. ఆయనను బాధించిన నష్టాలు ఆయనకు యెంత దారుణంగా వుండినాయో ఊహించడం సులభం. ఔను, మార్క్స్ పిల్లలను ఆరాధించేవాడు; ఆయన వాళ్లతో యెప్పుడూ ప్రేమగా సరదాగా వుండేవాడు.

యీ వెరపెరుగని యోధుని హృదయంలో అడుగున అపారమైన భావుకత్వమూ, దయా, మృదువైన విశ్వాసమూ వుండినాయి.

తానే పిల్లవాడైనట్లు, తన హుందాతనానికి లోపం కలుగుతుందనే ఆలోచన లేకుండా, ఆయన పిల్లలతో ఆడుకునేవాడు.

తన పేటలోని వీధుల్లో ఆయన "మార్క్స్ బాబాయి"గా, పిల్లలకోసం యెప్పుడూ జేబులో మిఠాయి వుంచుకునే పెద్దమనిషిగా, ప్రసిద్ధుడు.

తరువాతి కాలంలో ఆయన తన ప్రేమను మనుమలమీదికి మళ్లించినాడు. "నీకూ నీ కుర్రవాళ్లకూ బోలెడు ముద్దులు" అని ఆయన మా అమ్మకు రాసేవాడు.

పిల్లల గురించి మాట్లాడకుండా ఆయన యెప్పుడూ జాబు రాసేవాడు కాదు:

"జాన్, యితరులూ యేమి చేస్తూవుండినారో నాకు వివరంగా రాయి."

1881లో రాసిన ఒక జాబులో ఆయన మా అమ్మతో యిలా అన్నాడు:

"ఎంగెల్సు సహాయంతో టుస్సీ యిప్పుడే పిల్లల క్రిస్మస్ బహుమతుల పెట్టెను పార్సల్ కంపెనీకి తీసుకొనిపోయింది. లెన్‌హెన్ హారీకి" (అతను మార్క్స్ తర్వాత కొద్ది కాలానికి మరణించినాడు) "ఒకటీ, ఎడ్డీకి" (అనగా నాకు) "ఒకటీ ఫ్రాకులూ, పాకు" (నా సోదరుడు మార్సెల్‌కు) "ఒక చిన్న బెరెట్ పంపుతున్నది; యీ విషయం ప్రత్యేకంగా నీకు చెప్పమని ఆమె అన్నది. లౌరా పాకు ఒక నీలి సూటు కూడా పంపుతున్నది. నా ప్రియమైన జాన్‌కు నేనొక నావికుని సూటు పంపుతున్నాను. జాన్‌ను 'గొప్పవాని' లాగ కనిపించేటట్లు చేసిన సూటును యేరుకోడానికి నీవూ, నేనూ జాన్‌తో కలిసి పారిస్‌కు పోయిన విషయం అమ్మ తన జీవితపు చిట్టచివరి రోజుల్లో లౌరాతో చెప్పి యెంతో ఆనందంగా నవ్వేది."

జాన్ మా అందరికంటె పెద్దవాడు గనుక, అందరికంటె యెక్కువగా ఆయనను చూడడానికి పోయేవాడు.

మా అమ్మకు రాసిన మరొక ఉత్తరంలో ఆయన యిలా అన్నాడు: "జాన్‌తో చెప్పు — నిన్న నేను మేయ్‌ట్లండు పార్కులో షికారు పోతూ వుండగా కావలివాడు తన హుందాతన మంతటితోనూ నా దగ్గరికి వచ్చి, జాన్‌ను గురించి అడిగినాడు."

తన మనుమల గురించి మాట్లాడేటప్పుడు ఆయన ఉపయోగించే నుడికారాలు తరుచు కొత్తగానూ, మనోహరంగానూ వుండేవి:

"జాన్‌కూ, హారీకీ, ఉదాత్తుడైన 'తోడేలు'కూ బోలెడు ముద్దులు. 'అజ్ఞాత మహనీయు' డంటే, అతని విషయంలో నేనంత స్వేచ్ఛ తీసుకోలేను." (ఆయన అంటున్నది నా తమ్ముడు మార్సెల్ గురించి; అతను 1881 ఏప్రిల్‌లో పుట్టినాడు, అప్పటి కింకా ఆయన అతణ్ణి చూడ లేదు.)

ఆయనకు తన మనుమలపట్ల గల అనురాగాన్ని తెలపడానికి, మా అవ్వ మరణం తర్వాత కొద్ది కాలానికి ఆయన తన బిడ్డకు రాసిన జాబులోని చివరి వాక్యాన్ని ఉల్లేఖించడంకంటె మేలైన మార్గం నాకు తెలియదు:

"నేను అనేక ఆనందమయమైన రోజులు నీతో గడిపి, తాతగా నా విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఆశిస్తున్నాను."

పాపం, కార్ల్ మార్క్స్ తన కోరికను ఆచరణలో పెట్టలేకపోయినాడు.

ఒకదాని తర్వాత ఒకటి వచ్చిన వ్యాధులతో సొమ్మసిలిపోయి, తన భార్య మరణంతో పెద్దగా నష్టపడిన ఆయనకు కొద్ది నెలల తర్వాత, 1883 జనవరిలో, తన పెద్ద కూతురు జెన్నీ లోంగె, మా అమ్మ మరణాన్ని చూసే ప్రచండమైన దుఃఖం సంభవించింది. అన్ని సంవత్సరాలు బాధలూ, దారిద్ర్యమూ అనుభవించిన మీదట తగిలిన యీ చివరి దెబ్బతో, కార్మికవర్గ విమోచనకు తన జీవితాన్ని ముడుపు గట్టి, కొనప్రాణం వున్నంతదాకా మానవ సంక్షేమం కొరకు పోరాడిన మహామేధావి 1883 మార్చి 14న మరణించినాడు.

ఆయన సమాధివద్ద ఫ్రెడరిక్ ఎంగెల్సు అన్నట్లు: "ఆయన పేరు చిరస్థాయిగా వుంటుంది, ఆయన కృషి కూడా అంతే!"

## "ఒప్పుదలలు"*

| | |
|---|---|
| మీ అభిమాన సద్గుణం . . . . . . . . . . . . . . . . . | సరళత్వం |
| పురుషునిలో మీ అభిమాన సద్గుణం . . . . . . . . . . . . . . | బలం |
| స్త్రీలో మీ అభిమాన సద్గుణం . . . . . . . . . . . . . . . | బలహీనత |
| మీ ప్రధాన గుణం . . . . . . . . . . . . . . . . | లక్ష్యశుద్ధి |
| మీ దృష్టిలో ఆనందం . . . . . . . . . . . . . . . | పోరాటం |
| మీ దృష్టిలో దౌర్భాగ్యం . . . . . . . . . . . . . . | లొంగుబాటు |
| మీరు యెక్కువగా క్షమించే దుర్గుణం . . . . | యితరులను అనాలోచితంగా నమ్మడం |
| మీరు యెక్కువగా ద్వేషించే దుర్గుణం . . . . . . . . . . | దాస్యభావం |
| మీకు అయిష్టం . . . . . . . . . . . . . . | మార్టిన్ టప్పర్** |
| అభిమాన వ్యాపకం . . . . . . . . . . . . | పుస్తకాలలో మునిగిపోవడం |
| అభిమాన కవులు . . . . . . . . . . . | షేక్స్పియర్, ఈస్కిలస్, గ్యోతే |
| అభిమాన వచన రచయిత . . . . . . . . . . . . . . | డిడ్రో*** |

---

* "ఒప్పుదలలు" 1865 నాటివి. ఆకాలంలో యింగ్లండులోనూ, జర్మనీలోనూ బాగా ప్రచారంలో వుండిన ప్రశ్నలకు మార్క్స్ జవాబులు యివి. యీ జవాబులు తేలికగా చెప్పబడినప్పటికీ, యివి మార్క్స్ వ్యక్తిత్వాన్ని వెల్లడిస్తాయి. — సం.

** టప్పర్, మార్టిన్ (1810–1889) — ఒక యింగ్లీషు రచయిత. యితని రచనలను క్షుద్రత్వానికి పరాకాష్టగా మార్క్స్ యెంచేవాడు. — సం.

*** డిడ్రో, డెనీ (1713–1784) — సుప్రసిద్ధ ఫ్రెంచి తత్వవేత్త, భౌతికవాదీ, రచయితా. — సం.

| | |
|---|---|
| అభిమాన నాయకుడు | స్పార్టకస్, కెప్లెర్* |
| అభిమాన నాయిక | గ్రెత్హెన్** |
| అభిమాన పుష్పం | డాఫ్నె |
| అభిమాన రంగు | యెరుపు |
| అభిమాన పేరు | లౌరా, జెన్నీ |
| అభిమాన వంటకం | చేప |
| అభిమాన ప్రవర్తన నియమం | Nihil humani a me alienum puto*** |
| అభిమాన నీతిసూత్రం | De omnibus dubitandum**** |

కార్ల్ మార్క్స్

---

* కెప్లెర్, యోహన్ (1571–1630) – కొపెర్నిక్ సిద్ధాంత ఆధారంతో గ్రహ గమన నియమాలను ఆవిష్కరించిన జర్మన్ ఖగోళశాస్త్రజ్ఞుడు. – సం.

** గ్రెత్హెన్ – గ్యోతే నాటకం "ఫౌస్ట్"లోని మార్గరీటా. – సం.

*** మానవ సంబంధమైన దేదీ నాకు పరాయిది కాదు (లాటిన్ భాష). – సం.

**** ప్రతి దాన్నీ సందేహించు (లాటిన్ భాష). – సం.

# ఫ్రాన్‌త్సిస్కా కూగెల్‌మన్

## మార్క్సు మహనీయ వ్యక్తిత్వంలోని స్వల్ప లక్షణాలు*

మా నాన్న యువక విద్యార్థిగా వుండినప్పుడు కార్ల్ మార్క్సును మహా మెచ్చుకునేవాడు. ఆయన తాను సభ్యుడుగా వుండిన "నార్మానియా" అనే విద్యార్థి క్లబ్బులోనే సభ్యుడుగా వుండిన మికెల్ ద్వారా మార్క్సుయొక్క లండన్ అడ్రసు సంపాయించి, ఆయనకు ఉత్తరం రాసినాడు. మా నాన్నకు అపారమైన ఆనందం కలిగిస్తూ మార్క్సు జవాబు యిచ్చినాడు. క్రమక్రమంగా వాళ్లిద్దరి మధ్య క్రమబద్ధమైన లేఖా సంబంధం నెలకొనింది. ఎ. విలియమ్స్ అనే పేరుతో మార్క్సుకు ఉత్తరాలు పోయేవి; యెందుకంటే ప్రభుత్వం ఆయన ఉత్తరాల మీద కాపలా వుంచి, తెరిచి చూసి, తరుచుగా బట్వాడా చేయకుండా వుండేది. ఆ కారణంవల్లనే మా నాన్న తన ఉత్తరాలలో మార్క్సును పేరుతో సంబోధించకుండా, "గౌరవనీయమైన, ప్రియ మైన మిత్రుడా!" అనే సంబోధన ఉపయోగించేవాడు.

కొన్ని సంవత్సరాల తర్వాత, మార్క్సు యూరపియన్ భూఖండానికి రాదలచుకున్నట్లు రాసినప్పుడు, ఆ మధ్యకాలంలో వివాహమైన మా నాన్న ఆయనను తన అతిథిగా వుండమని ఆహ్వానించినాడు; మార్క్సు కొద్ది రోజులపాటు ఆ ఆహ్వానాన్ని అంగీకరించినాడు.

మా అమ్మ, సరదా అయిన రైన్ ప్రాంతం యువతి, ఆయన రాకను గురించి కాస్త ఆందో ళన చెందింది. రాజకీయ భావాలలో పూర్తిగా మునిగిపోయి, సమకాలిక సమాజవ్యవస్థకు శత్రువైన గొప్ప పండితుని చూస్తానని ఆమె అనుకున్నది. మా నాన్న తన డాక్టర్ వృత్తికి సంబం ధించిన పనితో ఉదయమంతా, మధ్యాహ్నంలో కొంత భాగమూ తీరిక లేకుండా వుంటాడు; మార్క్సులాంటి వ్యక్తికి ఆమె యెలా కాలక్షేపం కలిగించగలదు? ఆ రోజులను ఆమె తన

---

* కూగెల్‌మన్, ఫ్రాన్‌త్సిస్కా — మార్క్సు ఎంగెల్సుల స్నేహితుడూ, జర్మన్ వైద్యుడూ అయిన లూడ్విగ్ కూగెల్‌మన్ కూతురు; ఆమె స్మృతులు 1928లో రాయ బడినాయి. — సం.

జీవితమంతా ఆనందంతో స్మరించుకుంటుందని మా నాన్న ఆమెకు నచ్చజెప్పినాడు. అంత కంటె కచ్చితంగా నిజమైన జోస్యం మరొకటి యెన్నడూ లేదు.

మగవాళ్లు స్టేషన్‌నుండి వచ్చినప్పుడు, మా అమ్మ యెదురుచూసినట్టి ముఖం ముడుచుకున్న విప్లవకారునికి బదులు హుషారైన, సౌజన్యపూరిత సంస్కారవంతుడు ఆమెకు కుశల ప్రశ్నలు వేసినాడు; ఆయన హార్దికమైన రైనిష్ ఉచ్చారణ ఆమెకు వెంటనే తన పుట్టినింటిని జ్ఞాపకం చేసింది. తెల్లని జూలుకిందనుండి నల్లని యువక నేత్రాలు ఆమెవైపు దరహాసం చేసినాయి; ఆయన నడకనిండా, సంభాషణనిండా యవ్వనపు నవవికాసం వుండింది. మా నాన్న రాజకీయాలను రవంత ప్రస్తావించడానికి కూడా ఆయన ఒప్పుకోలేదు. మా నాన్నను ఆయన యీ మాటతో ఊరుకోబెట్టినాడు: "అవి స్త్రీలకు కాదు, అవి తరువాత మాట్లాడుకుందాం." మొట్టమొదటి సాయంత్రమే ఆయన సంభాషణ యెంత వినోదకరంగా, చమత్కారంగా, ఉల్లాసంగా వుండిందంటే, కాలం రెక్కలు గట్టుకొని ఎగిరి పోయినట్లు వుండింది.

అది హోలీ వీక్ ప్రారంభ మైనందున, మా తలిదండ్రులు మార్క్సును గుడ్‌ఫ్రైడే నాడు తమతో కలిసి సెంట్ మాథ్యూను గూర్చి బాఖ్ రచించిన సంగీతం వినడానికి రమ్మని పిలిచినారు. తాను గాఢ సంగీతాభిమాని, ముఖ్యంగా బాఖ్ అభిమాని, అయినప్పటికీ, కనీసం గురువారం నాడు వెళ్లిపోవా లంటూ, మార్క్స్ అందుకు అంగీకరించలేదు.

కానీ, ఆయన హనోవెర్‌లో నాలుగు వారాలు వుండినాడు.* ఆయనతో వాళ్లు చేసిన సంభాషణలతో సహా ఆ రోజులను సవివరంగా జ్ఞాపకం చేసుకోవడం మా తలిదండ్రులకు యెంతో ఆనందం. తమ నిత్య జీవితపు సమతలంనుండి సమున్నతంగా పైకి లేచి, మరపు పొగమంచులో యెన్నడూ మరుగుపడని ఆతప స్నపిత పర్వత శిఖరం లాంటివి ఆ రోజులు....

మార్క్స్ ఆడంబరం లేకుండా, సహృదయుడుగా వుండింది మా కుటుంబ పరిధి లోనే కాదు. మా తలిదండ్రుల పరిచితుల యెడల కూడా, ఆయన ప్రతి విషయంలోనూ ఆసక్తి కలిగించుకునేవాడు. యెవరైనా ఒక వ్యక్తి ఆయన దృష్టిని ఆకర్షిస్తే, లేదా ఒక చమత్కారమైన మాట అంటే, ఆయన తన కంటి అద్దం సరిచేసుకొని, ఆ వ్యక్తిని స్నేహ పూర్వకమైన ఆసక్తితో పరిశీలించేవాడు.

ఆయనకు కాస్త చత్వారం వుండింది, కానీ చాలాసేపు చదవడమో, రాయడమో చేయ వలసినప్పుడు మాత్రమే ఆయన అద్దాలు పెట్టుకునేవాడు. ఉదయపు తొలి ఘడియలలో, యెవరూ అంతరాయం కలిగించని సమయంలో, మా తలిదండ్రులు ఆయనతో జరిపిన సంభాషణలు జ్ఞాపకం చేసుకోవడంలో మరీ ఆనందం పొందేవాళ్లు. మా అమ్మ ఉదయ భోజ

---

* మార్క్స్ 1867 ఏప్రిల్ 17నుండి మే మధ్యవరకు హనోవెర్‌లో వుండినాడు. — సం.

నానికి ముందుగా యింటి పని ముగించుకోడానికని పొద్దున్నే కూడా నిద్రలేచేది. తరుచుగా వాళ్లు కాఫీ టేబుల్ వద్ద గంటలకొలది కూర్చునేవాళ్లు.. తన పనిమీద పోవలసి వచ్చినప్పుడు మా నాన్న యెప్పుడూ విచారపడేవాడు.

సంభాషణ విషయాలలో మార్క్స్ అంతరిక, బాహ్య జీవితం మాత్రమే కాక, కళా, శాస్త్ర, కవిత్వ, తత్వశాస్త్రాల సకల రంగాలూ వుండేవి. ఎంత గొప్పవాడో అంత ఉత్తముడూ, సౌహార్ద హృదయుడూ అయిన మార్క్స్ ఎన్నడూ పాండిత్య ప్రకర్షను యీషన్మాత్రమైనా ప్రదర్శించేవాడు కాడు. మా అమ్మ తత్వశాస్త్రం లోతుగా అధ్యయనం చేయకపోయినా, అందులో ఆమెకు గొప్ప ఆసక్తి వుండింది. ఆమెతో మార్క్స్ కాంట్, ఫిష్టే, షోపెన్‌హౌవర్‌లను గురించి మాట్లాడి, హెగెల్‌ను ప్రస్తావించినాడు కూడా; ఆయన యవ్వనంలో హెగెల్‌కు ఉత్సాహపూరితమైన అనుచరుడు.

తన విద్యార్థులలో తన్ను అర్థంచేసుకున్నది రోజెన్‌క్రాన్త్స్ ఒక్కడే, అది కూడా తప్పుగా, అని హెగెల్ అన్నట్లు మార్క్స్ ఉటంకించినాడు....

హృదయ దౌర్బల్య మంటే మార్క్స్‌కు గాఢమైన ద్వేషం; అది నిజమైన అనుభూతికి దిష్టిబొమ్మ మాత్రమే. సందర్భం వచ్చినప్పుడు ఆయన యీ గ్యోతే మాటలు ఉటంకించేవాడు: "దుర్బల హృదయాల గురించి నాకెప్పుడూ మంచి అభిప్రాయం లేదు; యేదైనా సంభవించినప్పుడు వాళ్లు చెడ్డ క్రామేడ్లు కావడం నిశ్చయం." తన సమక్షంలో యెవరైనా మితిమీరిన అనుభూతి ప్రదర్శిస్తే, ఆయన యీకింది హైనె గేయ చరణాలు గుర్తు చేసేవాడు:

"సముద్ర తీరాన ఒక యువతి నిలబడింది,
మహా బాధతో భయంతో విలవిలలాడింది.
యేమిటి ఆమె శోకానికి కారణం?
పాపం సూర్యుడు అస్తమించడం."

మార్క్స్‌కు హైనె తెలుసు. ఆ దురదృష్టపు కవిని అతని చివరి జబ్బు సమయంలో, పారిస్‌లో మార్క్స్ చూసినాడు. మార్క్స్ గదిలోకి ప్రవేశించినప్పుడు అతని పడకమీద బట్టలు మారుస్తూ వుండినారు. ముట్టుకుంటే భరించలేనంతగా అతను బాధపడుతూ వుండినాడు; నర్సులు అతన్ని ఒక దుప్పటిమీద వుంచి, మంచంవద్దకు మోసుకపోయినారు. కానీ అతని బుద్ధిచాతుర్యం అతన్ని వదలలేదు; అతను క్షీణకంఠంతో మార్క్స్‌తో యిలా అన్నాడు: "చూడు, ప్రియమైన మార్క్స్, ఆడవాళ్లు నన్ను యింకా నెత్తిన పెట్టుకొని మోస్తున్నారు."

మార్క్స్ అభిప్రాయంలో ప్రేమను గురించిన హైనె అద్భుతమైన పాటలన్నీ అతని

ఊహాశక్తి ఫలితాలు, ఆడవాళ్ల విషయంలో అతను యెప్పుడూ కృతార్థుడు కాదు, అతని వివాహ జీవితంలో ఆనందం యేమీ లేదు. అతని గేయ చరణాలు:

"ఆరుకు తన్ని ఉరితీసిరి
యేడుకు సమాధిలో వేసిరి
అహో యెనిమిది గంటలు కొట్టుతుండగా
యెర్రని వైన్ ఆమె సేవించెను ఖుషీగా"

మార్క్స్ అభిప్రాయంలో, అతని మరణానికి చక్కగా వర్తిస్తాయి.

హైనె శీలం గురించి మార్క్స్‌కు యేవిధంగానూ సదభిప్రాయం లేదు. ముఖ్యంగా అతనికి సహాయం చేసిన మిత్రులపట్ల అతని కృతఘ్నతను మార్క్స్ నిందించినాడు. ఉదాహరణకు, క్రిస్టియాన*మీద అతను రచించిన గేయంలోని పూర్తి అసమర్థనీయమైన వ్యంగ్యం: "అంత సహృదయుడైన యువకుని యెంత పొగిడినా అతిశయోక్తి కాదు," వగైరా.

మార్క్స్‌కు స్నేహితం పవిత్రమైనది. ధనికుడైన ఫ్రెడరిక్ ఎంగెల్సు మార్క్స్‌కు తీవ్రమైన డబ్బు యిబ్బందులు లేకుండా మరింత సహాయం చేయవచ్చునని, ఒకసారి మార్క్స్‌ను చూడడానికి వచ్చిన ఒక మిత్రుడు అన్నాడు. మార్క్స్ యీ మాటలతో అతన్ని నోరు మూయించినాడు: "ఎంగెల్సుకూ, నాకూ గల సంబంధాలు యెంత సన్నిహితమైనవీ, అనురాగ భరితమైనవీ అంటే అందులో వేలు పెట్టే హక్కు యెవరికీ లేదు." యెవరైనా తనకు యిష్టం లేని మాట అన్నప్పుడు ఆయన సాధారణంగా హాస్యోక్తితో సమాధానం చెప్పేవాడు. ఆత్మ సమర్థన చేసుకోడానికి ఆయన సాధారణంగా మొరటు పద్ధతులకు యెప్పుడూ దిగకుండా, గురితప్పని పదునైన మాటలతో వడ్డించేవాడు.

ఆయన లోతుగా దూరని శాస్త్రవిజ్ఞాన రంగం గానీ, ఆయన ఉత్సాహంతో ప్రేమించని కళ గానీ, ఆయన మెప్పును చూరగొనని ప్రకృతి సౌందర్యం గానీ బహుశా లేదు. కానీ ఆయన అసత్యాన్నీ, బూటకాన్నీ, ఆత్మస్తుతినీ, నటననూ భరించలేకపోయేవాడు.

పడకగది కాక ఆయన స్వాధీనంలో వుండిన మరొక గదిలో ఆయన జాబులు రాసుకుంటూనో, పనిచేసుకుంటూనో, వార్తాపత్రికలు చదువుకుంటూనో వుండేవాడు. "పెట్టుబడి" మొదటి భాగాన్ని ఆయన చదివింది కూడా అక్కడే. మినెర్వా మెడిసె విగ్రహం, సంకేత ప్రాయమైన తన చిన్న గుడ్లగూబతో సహా, అక్కడ వుండింది. మా అమ్మపట్లా, ఆమె దయార్ద్ర హృదయంపట్లా, ఆమె సమయస్ఫూర్తిపట్లా, ఆమె వయస్సుకు విస్తృతంగా వుండిన, ముఖ్యంగా

---

* హైనె తన ఉత్తమ మిత్రులలో ఒకరైన రుడోల్ఫ్ క్రిస్టియానకు అంకితం యిచ్చిన హాస్య గేయానికి ఇది ప్రస్తావన. – సం.

కవితా సాహిత్య రంగాలలో విస్తృతంగా వుండిన ఆమె జ్ఞానంపట్ల యెంతో మెప్పు గల మార్క్స్ ఒకసారి ఆమెతో హాస్యంగా అన్నాడు, యువ జ్ఞానదేవతే ఆమె అని. మా అమ్మ జవాబు చెప్పింది: ''కాదు, నేను జ్ఞానదేవతను కాదు, ఆమె పాదాలవద్ద వింటూ కూర్చున్న గూబను మాత్రమే నేను.'' అందుకనే ఆయన ఆమెను అప్పుడప్పుడు తన ప్రియమైన చిన్న గూబ అనేవాడు. తరువాత ఆయన తాను అమితంగా ప్రేమించిన ఒక చిన్న అమ్మాయికి ఆ పేరు పెట్టినాడు; ఆ అమ్మాయి ఆయనతో ఆడుకుంటూ, కబుర్లు చెపుతూ, గంటల కొలది ఆయన మోకాలిమీద కూర్చొనేది.

పదిమందిలో వుండినప్పుడు మా అమ్మ కుండిన ఆత్మవిశ్వాసాన్నిబట్టీ, సరస ప్రవర్తనకు ఆమె యిచ్చిన గొప్ప ప్రాముఖ్యాన్నిబట్టీ మార్క్స్ ఆమెను ''కాంటెన్'' అనేవాడు. త్వరలోనే ఆయన ఆమెను ఆ పేరు తప్ప మరొక పేరుతో పిలిచేవాడు కాదు, యెదురుగా యెవరున్నా సరే.

అందరికీ మారుపేర్లు పెట్టడం మార్క్స్ కుటుంబంలో అలవాటు. ఆయననే ఆయన బిడ్డలూ, మిత్రులూ మూర్ అనేవాళ్లు. ఆయన రెండవ బిడ్డ లౌరాను, శ్రీమతి లాఫార్గ్‌ను, సాధారణంగా Das Laura అనేవాళ్లు, లేదా ''మాస్టర్ కకాడూ'' అనేవాళ్లు; అసాధారణమైన అభిరుచితోనూ, అందంగానూ ఆమె దుస్తులు వేసుకోవడంవల్ల, ఒక పాత నవలలోని ఫాషనబుల్ దర్జీవాడైన కకాడూ పేరు ఆమెకు పెట్టబడింది. తన పెద్ద కూతురు జెన్నీని మార్క్స్ ''జెన్నిహెన్'' అనేవాడు. ఆమె మారుపేరు కూడా మా అమ్మ చెప్పింది, కానీ నేను మరిచిపోయినాను. ఆయన చిన్న కూతురు ఎలినోరను యెప్పుడూ ''టుస్సీ'' అనేవాళ్లు.

ఆయన మా నాన్నకు ''వెంత్సెల్'' అని పేరుపెట్టినాడు. కారణ మేమంటే, మంచి వెంత్సెల్, చెడ్డ వెంత్సెల్ అనే యిద్దరు బొహీమియన్ పాలకులకు సంబంధించిన వివరాలతో ప్రాగ్‌లో ఒక గైడు తన్ను విసిగించినాడని మా నాన్న ఒకసారి మార్క్స్‌తో చెప్పినాడు. చెడ్డ వెంత్సెల్ సెంట్ జాన్ నెపొమూకన్ మొల్డానదిలో తోయించినాడు; మంచి వెంత్సెల్ చాలా దైవభక్తుడు.* మా నాన్న తన సానుభూతినీ, ప్రతికూల భావాన్నీ చాలా తీవ్రంగా వెల్లడించేవాడు; ఆయన వైఖరినిబట్టి మార్క్స్ ఆయన్ను మంచి వెంత్సెల్ అనో, చెడ్డ వెంత్సెల్ అనో అనేవాడు. తరువాతి కాలంలో మార్క్స్ ''నా వెంత్సెల్‌కు'' అంకితం చేసిన తన ఫోటోను ఆయనకు పంపినాడు.

---

* యిక్కడ ప్రస్తావించబడింది జెక్ రాకుమారుడు సెంట్ వెంత్సెల్ (సుమారు 908–929), జాన్ నెపొమూకన్ ఉరితీయించిన జెక్ రాజు నాల్గవ వెంత్సెల్ (1361–1419). – సం.

తరుచు మార్క్స్ మా తలిదండ్రుల మిత్రులకూ, పరిచితులకూ వాళ్ల పరోక్షంలో యితర పేర్లు పెట్టి, అవే వాళ్ల అసలైన పేర్లుగా వుండాలనేవాడు; అయినా, ఆయన విశిష్టమైన పేర్లు గాక, తరుచు సాదా అయినవి యెన్నుకునేవాడు. మా పరిచితుల్లో యెవరికైనా మార్క్స్‌ను పరిచయం చేసిన ప్రతిసారీ, తరువాత మా నాన్న ఆయన్ను అడిగేవాడు: "సరే, మార్క్స్, వాళ్ల అసలైన పేర్లుగా వుండవలసినవి యేవి?..."

ఆయన యెప్పుడూ ఉల్లాసంగా, హాస్యమాడడానికీ, యెవరినైనా యేడిపించడానికీ సిద్ధంగా వుండేవాడు. యెవరైనా ఔచిత్యం తెలియకుండా ఆయన సిద్ధాంతం గురించి అడిగితే, ఆయన మహా విసుక్కునేవాడు. అలాంటి ప్రశ్నలకు ఆయన యెప్పుడూ సమాధానం చెప్పేవాడు కాదు. తన్ను గురించిన యీ కుతూహలాన్ని ఆయన తన యింట్లో "సంచార అభిప్రాయం" అనేవాడు. కానీ, అలాంటిది అరుదుగా సంభవించేది.

భవిష్యత్ రాజ్యంలో బూట్లు యెవరు తుడుస్తారని, ఒకసారి ఒక పెద్దమనిషి ఆయన్ను అడిగినాడు. చిరాకుతో ఆయన "మీరే" అని జవాబు చెప్పినాడు. ఔచిత్యం తెలియని ఆ పృచ్ఛకుడు అప్పుడు అర్థం చేసుకొని మౌనం వహించినాడు. బహుశా మార్క్స్ కోపగించుకున్నది ఆ ఒక్కసారే....


మార్క్స్‌ను చూడడానికి అన్ని చోట్లనుండీ, తరుచు అత్యంత దూర ప్రాంతాలనుండీ, పార్టీ కామ్రేడ్లు వచ్చేవాళ్లు. అందరినీ ఆయన తన గదిలోకి ఆహ్వానించేవాడు. తరుచు రాజకీయాలమీద దీర్ఘ సంభాషణలు జరిగేవి; అవి మా నాన్న పఠనాగారంలో కూడా కొనసాగేవి....

కవిత్వంలోనూ, శాస్త్రవిజ్ఞానంలోనూ, అనుకరణ కళలలోనూ మార్క్స్ అభిరుచి మహా నాజూకైనది. ఆయన బహుగ్రంథ పఠనం అసాధారణమైనది, ఆయన జ్ఞాపకశక్తి అసాధారణమైనది. క్లాసికల్ గ్రీసుకు చెందిన మహా కవులమీదా, షేక్‌స్పియర్‌మీదా, గ్యోతేమీద మా నాన్న కున్నట్లే ఆయనకు మహా అభిమానం. షామిస్సో,* ర్యుకెర్ట్** కూడా ఆయనకు అభిమాన కవులు: "బిచ్చగాడు, అతని కుక్క" అనే హృదయ స్పర్శకమైన షామిస్సో కవిత్వాన్ని ఆయన ఉటంకించేవాడు. ర్యుకెర్ట్‌యొక్క రచనా కళను, ముఖ్యంగా నిరుపమానమైన మౌలికత గల హరీరీయొక్క "మకామస్"కు అతను చేసిన ప్రతిభావంతమైన అనువాదాన్ని, ఆయన మెచ్చుకునేవాడు. యేండ్ల తర్వాత ఆయన, ఆ కాలపు జ్ఞాపకార్థం, మా అమ్మకు ఆ పుస్తకం బహుమతిగా యిచ్చినాడు.

---

* షామిస్సో, అడల్బెర్ట్ ఫన్ (1781–1838) – జర్మన్ కాల్పనికవాద కవి; తన కవితలో ప్రగతి వ్యతిరేక ఫ్యూడల్ శక్తులతో పోరాడినాడు. – సం.

** ర్యుకెర్ట్, ఫ్రీడ్రిఖ్ (1788–1866) – జర్మన్ కాల్పనికవాద కవి, ప్రాచ్య కవిత్వ అనువాదకుడు. – సం.



కార్ల్ మార్క్స్, 1882



మార్క్స్ సమాధి

మార్క్సు భాషలలో అసాధారణమైన ప్రజ్ఞ గలవాడు. యింగ్లీషు కాక, ఫ్రెంచి ఆయనకు యెంత బాగా తెలుసునంటే, ''పెట్టుబడి''ని ఆయనే ఫ్రెంచిలోకి అనువదించినాడు.* గ్రీక్, లాటిన్, స్పానిష్, రష్యన్ భాషలు ఆయనకు యెంత బాగా తెలుసునంటే, వాటిని చూస్తూనే అనువాదం చేయగలిగేవాడు. రాచపుండ్లతో బాధపడేటప్పుడు ఆయన ''బాధను మరచిపోడానికి'' రష్యన్ భాష స్వయంగా నేర్చుకున్నాడు.

ముసుగు చాటున వున్న స్లావ్ జాతి సున్నితత్వం గల రష్యన్ ఆత్మయొక్క విలక్షణ గుణాలను తుర్గేనెవ్** అద్భుతంగా చిత్రిస్తాడని మార్క్సు అభిప్రాయపడినాడు. ఆయన దృష్టిలో లేర్మొన్‌తొవ్*** వర్ణనలను మించినవి లేవు, వాటికి సమానమైనవి కూడా చాలా అరుదు. స్పానిష్ సాహిత్యంలో ఆయన అభిమాన రచయిత కల్దెరోన్.**** అతని రచనలు ఆయనవద్ద కొన్ని వుండినాయి; వాటినుండి కొన్ని భాగాలు ఆయన మాకు తరుచు చదివి వినిపించేవాడు....

మా ఫ్లాట్‌లో అయిదు కిటికీలు గల పెద్ద గది ఒకటి వుండింది. దానిని మేము హాలు అనేవాళ్లం. దానిలో మేము సంగీతం సాధన చేసుకునేవాళ్లం. దాని గోడల చుట్టూ గ్రీకు దేవతల విగ్రహాలు వుండినందున, మా కుటుంబ మిత్రులు దానిని ఒలింపస్ అనేవాళ్లు. ఆ విగ్రహాలకంటె యెత్తున సింహాసనంమీద జేయుస్ ఒత్రికొలున్ విగ్రహం వుండింది.

జేయుస్‌తో మార్క్సుకు చాలా యెక్కువ పోలిక వుందని మా నాన్న అనుకున్నాడు, ఆ అభిప్రాయంతో చాలామంది ఏకీభవించినారు. యిద్దరికీ శక్తిసూచకమైన తలా, దట్టమైన జుట్టూ, ఆలోచనాశీలమైన విశాల ఫాలమూ, అధికారసూచకంగా వుంటూనే దయ గల చూపులూ వుండినాయి. మార్క్సుయొక్క ప్రశాంతమైన, కానీ హార్దికమైన, ఉత్సాహభరితమైన స్వభావం — పరధ్యానమూ, ఉద్రేకమూ యెరగనిది — కూడా ఆయనకు తన అభిమాన ఒలింపిక్ దేవతలతో పోలికను యిచ్చినాయని మా నాన్న అనుకున్నాడు. పురాణ

---

* ''పెట్టుబడి'' మొదటి భాగాన్ని మార్క్సు ఫ్రెంచిలోకి అనువాదం చేయలేదు; కానీ, తనకు సంతృప్తికరంగా లేని జె. రూవా అనువాదాన్ని జాగ్రత్తగా ఎడిట్ చేసినాడు. — సం.

** తుర్గేనెవ్, ఇవాన్ సెర్గేయెవిచ్ (1818–1883) — సుప్రసిద్ధ రష్యన్ రచయిత. — సం.

*** లేర్మొన్‌తొవ్, మిహయీల్ యూర్యెవిచ్ (1814–1841) — సుప్రసిద్ధ రష్యన్ కవి. — సం.

**** కల్దెరోన్, పేద్రొ (1600–1681) — ప్రసిద్ధ స్పానిష్ నాటక రచయిత. — సం.

దేవతలది "యే అనుభూతీ లేని శాశ్వత విశ్రాంతి" అనే నిందకు మార్క్స్ చెప్పిన సూటి సమాధానాన్ని ఉటంకించడం మా నాన్నకు యిష్టం. "అలా కాదనీ, తద్వ్యతిరేకంగా, వాళ్లది అశాంతి లేని శాశ్వత అనుభూతి" అనీ మార్క్స్ అన్నాడు. తమ రాజకీయ పార్టీలు చేపట్టే ఆందోళనలలోకి మార్క్స్‌ను లాగడానికి ప్రయత్నించేవాళ్లమీద మా నాన్న తన అభిప్రాయం వెలిబుచ్చేటప్పుడు చాలా చిరాకు పడేవాడు. దేవతలకూ, మానవులకూ తండ్రి అయిన ఆ ఒలింపియా దేవునిలాగ మార్క్స్ ప్రపంచంలోకి తన మెరుపును మాత్రం పంపాలనీ, అప్పుడప్పుడు ప్రపంచంమీదికి తన పిడుగును మాత్రం విసరాలనీ, కానీ తన అమూల్యమైన కాలాన్ని ప్రతి ఆందోళనలోనూ వ్యర్థం చేయకూడదనీ మా నాన్న కోరినాడు. ఆ విధంగా, గంభీర సంభాషణతోనూ, సరస సంభాషణతోనూ నిండి, దినాలు వేగంగా గడిచిపోయినాయి. మార్క్స్ తరుచుగా ఆ కాలాన్ని తన జీవితపు యెడారిలోని ఒక ఒయాసిస్ అనేవాడు.

రెండేండ్ల తర్వాత మళ్లీ మార్క్స్‌కు, యీసారి ఆయన పెద్ద కూతురు జెన్నీతో సహా, ఆతిథ్యం యిచ్చే ఆహ్లాదం మా తలిదండ్రులకు లభించింది. నల్లని ఉంగరాల జుట్టుతో, సన్నని ఆకర్షణీయమైన బాలికగా వుండిన జెన్నీ స్వభావంలోనూ, రూపురేఖల్లోనూ యెక్కువగా తండ్రిని పోలినది. ఆమె ఉత్సాహంగా, ఉల్లాసంగా, సహృదయంగా, ప్రవర్తనలో అత్యంత నాజూకుగా, సమయోచితంగా వుండినది. ఆమెకు గోల అన్నా, ఆడంబర మన్నా ద్వేషం.

ఆమెతో మా అమ్మ త్వరగా స్నేహితం చేసుకొని, ఆమె బతికినంత కాలం ఆమెను ప్రేమించింది. జెన్నీ యెంత బాగా చదువుకున్నదీ, యెంత విశాల హృదయం అయిందీ, ఉదాత్తమూ, సుందరమూ అయిన అన్నిటిపట్లా ఆమెకు యెంత ఉత్సాహం వుండిందీ మా అమ్మ చాలాసార్లు చెప్పింది. షేక్స్పియర్‌ను జెన్నీ పెద్దగా మెచ్చుకునేది; ఆమెకు అభినయంలో ప్రజ్ఞ వుండి వుండాలి; యెందుకంటే ఆమె ఒకసారి ఒక లండన్ నాటకశాలలో లేడీ మాక్బెత్ పాత్ర అభినయించింది. ఒకసారి ఆమె మా యింట్లో, కానీ మా తలిదండ్రుల సమక్షంలోనూ, ఆమె తండ్రి సమక్షంలోనూ మాత్రం, జాబుకు సంబంధించిన ఆ రాక్షస రంగంలోని ఆ పాత్రను అభినయించింది. లండన్‌లో అభినయించినప్పుడు ఆమెకు వచ్చిన డబ్బుతో ఆమె విశ్వాసం గల తమ పనిమనిషికి ఒక వెల్వెటు కోటు కొని యిచ్చింది — యెవరైతే ట్రీయర్ వదలి తమ కుటుంబంవెంట యింగ్లండుకు వచ్చి, సుఖాలలోనూ, దుఃఖాలలోనూ, కడగండ్లలోనూ వాళ్లపట్ల చెక్కుచెదరని ప్రేమతోనూ, అనుబంధంతోనూ నిలిచిందో ఆ పనిమనిషికి.

మార్క్స్ కుటుంబంలో యెవరికీ డబ్బు విషయంలో పొదుపు గానీ, వ్యవహార దృష్టి గానీ లేదు. జెన్నీ యీ విషయం చెప్పింది: ఆమె తల్లికి, వివాహమైన కొద్ది కాలానికి, ఒక చిన్న మొత్తం సంక్రమించింది. యువ దంపతులు ఆ మొత్త మంతా ఒకేసారి కావాలని తీసుకొని, రెండు హాండిళ్లు వున్న ఒక చిన్న పెట్టెలో పెట్టినారు. వాళ్లు దానిని బండిలో

పెట్టుకొని, తమ వివాహ ప్రయాణంలో తాము దిగిన వివిధ హోటళ్లకు తీసుకపోయినారు. డబ్బుతో అవసరమున్న మిత్రులు గానీ, తోటి ఆలోచనా శీలురు గానీ వాళ్ల దగ్గరికి వచ్చినప్పుడు, వాళ్లు పెట్టె తెరిచి టేబుల్‌మీద పెట్టేవాళ్లు, యెవరైనా యిష్టం వచ్చినంత తీసుకో వచ్చు నని. పెట్టె త్వరలోనే ఖాళీ అయిందని చెప్పనక్కర లేదు. తరువాత వాళ్లు తరుచుగా ఘోరమైన దరిద్రం అనుభవించినారు. తమ కున్న ప్రతి విలువైన వస్తువునూ యెలా కుదువపెట్టవలసి వచ్చిందీ, లేక అమ్మవలసి వచ్చిందీ మార్క్స్ చెప్పినాడు. ఫన్ వెస్ట్‌ఫాలెన్ కుటుంబం ఆర్గిల్ ప్రభువుల కుటుంబానికి దూరపు బంధువులు. జెన్నీ ఫన్ వెస్ట్‌ఫాలెన్ మార్క్స్‌ను వివాహమాడినప్పుడు, ఆర్గిల్ వంశచిహ్నం వున్న వెండి సామాను, వాళ్ల కుటుంబంలో చాలా కాలంగా వుండినది, ఆమె కట్నంలో భాగంగా వచ్చింది. మార్క్స్ స్వయంగా బరువైన కొద్ది వెండి గరిటెలు తాకట్టు అంగడికి తీసుకపోయినప్పుడు, ప్రసిద్ధ చిహ్నం గల ఆ వస్తువులు ఆయనకు యెలా వచ్చినదీ వివరించమని వెంటనే అడిగినారు. సులభంగానే ఆయన వివరించినాడు. ఆయన ఏకైక పుత్రుడు మరణించినప్పుడు, వాళ్ల బీదరికం యెంత తీవ్రంగా వుండిందంటే, అంత్యక్రియలకు డబ్బు లేక వాళ్లు తమ యింటి పెరటిలో తామే పిల్లవాణ్ని సమాధి చేసినారు. ఆ రాత్రి మార్క్స్ జుట్టు తెల్లబడింది....

జెన్నీ హనోవెర్‌లో వుండినప్పుడు "ఒప్పుదల పుస్తకం" అనేది ఒకటి ఆమె మా అమ్మకు యిచ్చింది. అప్పుడవి యింగ్లండులో ఫాషన్‌గా వుండినాయి, తరువాత "ఆత్మ జ్ఞానం" అనే పేరుతో జర్మనీలో వచ్చినాయి. అందులో మొదట రాసినవాడు మార్క్స్; జెన్నీ మొదటి పేజీమీద ఆయనకు నియమిత ప్రశ్నలు రాసిపెట్టింది. కానీ, వాటి కింకా సమాధానాలు లభించలేదు.* జెన్నీ రెండవ పుటలో రాసింది; ఆ ఒప్పుదల ఆమెకూ, ఆమె విలక్షణ స్వభావానికీ యెంతో సహజమైనది గనుక నేను దాన్ని యిక్కడ యెత్తిరాస్తాను. ఆమె అది యింగ్లీషులో రాసింది, జర్మన్‌కంటె యింగ్లీషు బాగా రాయగలదు గనుక. జర్మన్‌కంటె యింగ్లీషు సంక్షేపంగా, కచ్చితంగా, సూటిగా వుంటుంది గనుక, జర్మన్‌లో నాలుగు పుటలు పట్టేది యింగ్లీషులో ఒక్క పుటలో రాయగలవని ఆమె అనేది. తన ఆంతరంగిక ఉత్తరాలు ఆమె ఫ్రెంచిలో రాసేది; ఫ్రెంచి భాష మరింత హార్దికంగా, భావాలనూ, అనుభూతులనూ వ్యక్తం చేయడానికి మరింత అనువుగా వుంటుందని ఆమె అభిప్రాయపడింది. జర్మన్ భాషలో ఆమె ఉచ్చారణ, ఆమె తండ్రి లాగే, కల్తీలేని రైన్ ప్రాంతపు ఉచ్చారణ. రైన్ ప్రాంతంలో ఆమె యెప్పుడూ నివసించలేదు కానీ, తన తలిదండ్రుల మాటలలోనూ, ట్రీయర్‌కు చెందిన విశ్వాసం గల పనిమనిషి మాటలలోనూ ఆమె చిన్నప్పటినుండి నిత్యం ఆ ఉచ్చారణ విన్నది.

---

*ఆ మాదిరి ప్రశ్నలకు మార్క్స్ యిచ్చిన సమాధానాలు యీ గ్రంథంలో 216–217వ పుటల్లో వున్నాయి. — సం.

ఆ ఒప్పుదలను అర్థం చేసుకోడానికి కొద్ది వివరణలు అవసరం. స్త్రీలో తన అభిమాన సద్గుణం భక్తి అని జెన్నీ అంటుంది. యిది రాసిన సాయంత్రం జరిగిన సంభాషణ మతంమీద. మార్క్స్, జెన్నీ, మా నాన్నా హేతువాదులు; కానీ మా అమ్మ అభిప్రాయం వేరు — యెలాంటి మొండి నమ్మకమన్నా, పిడివాదపు సంకుచితత్వమన్నా ఆమెకు అయిష్టమయినప్పటికీ....

మా అమ్మ యెంత సరళంగా, గంభీరంగా, మనస్ఫూర్తిగా, హృదయ దౌర్బల్యం లేకుండా మాట్లాడేదంటే, ఆమె మాటలకు ప్రతి వొకరూ చలించిపోయేవాళ్లు. యిది జ్ఞాపకం వున్నందు వల్లనే, స్త్రీలలో తన అభిమాన సద్గుణం "భక్తి" అని జెన్నీ రాసింది.

తండ్రీ, కూతురూ యిద్దరూ మొదటి నెపోలియన్‌ను ద్వేషించేవాళ్లు; అతన్ని వాళ్లు కేవలం బోనపార్ట్ అనేవాళ్లు. కానీ వాళ్లకు మూడవ నెపోలియన్‌మీద యెంత అసహ్యమంటే అతని పేరును కూడా వాళ్లు యెప్పుడూ ఉచ్చరించేవాళ్లు కాదు. అందుకనే, తనకు అత్యంతం సరిపడని చారిత్రక వ్యక్తులు "బోనపార్ట్, అతని భ్రాతీయుడూ" అని జెన్నీ రాసింది.

మార్క్స్ చెపుతూ వుండిన ఒక చతురోక్తి నాకు యీ సందర్భంలో జ్ఞాపకం వస్తున్నది: "మొదటి నెపోలియన్‌కు ప్రతిభ వుంది — మూడవ నెపోలియన్‌కు ఎజెనీ [తన భార్య పేరు. — అను.] వుంది."

జెన్నీకి, తన తండ్రిలాగే శాస్త్రీయ సంగీతమంటే అభిమానం. హేండెల్ సంగీతం నిశ్చయంగా విప్లవకరమైనదని ఆమె అనుకుంది. ఆమెకు అప్పటికింకా వాగ్నర్ తెలియదు. ఆమె మొదటి సారి హనోవెర్‌లో ఉత్తమంగా వాయించబడిన "తన్‌హోయ్‌జర్" విని, యెంతగా ఆనందించిందంటే, వాగ్నర్‌ను తన అభిమాన సంగీతకారులలో చేర్చుకుంది.

ఆమె ప్రవర్తన నియమం కొటేషన్ మార్కులలో వున్నందున, ఉల్లేఖనలా వుంది. ఆనందం గురించీ, దుఃఖం గురించీ ఆమె తన అభిప్రాయం రాయలేదు.

మీ అభిమాన సద్గుణం . . . . . . . . . . . . . . మానవత్వం
పురుషునిలో మీ అభిమాన సద్గుణం . . . . . . . . . నైతిక ధైర్యం
స్త్రీలో మీ అభిమాన సద్గుణం . . . . . . . . . . . . . భక్తి
పరమ ఆనందం . . . . . . . . . . . . . . . . .
పరమ దుఃఖం . . . . . . . . . . . . . . . . .
మీరు క్షమించే దుర్గుణం . . . . . . . . . . అమిత వ్యయం
మీరు అసహ్యించే దుర్గుణం . . . . . . . . . . ఈర్ష్య
మీకు సరిపడనిది . . . . . . . . ప్రభువంశీకులూ, మతగురువులూ, సైనికులూ
అభిమాన వ్యాపకం . . . . . . . . . . . . . . . పఠనం
మీకు అత్యంత సరిపడని చారిత్రక వ్యక్తులు . . . . బోనపార్ట్, అతని భ్రాతీయుడూ

అభిమాన కవి . . . . . . . . . . . . . . . . . షేక్స్పియర్
అభిమాన వచన రచయిత . . . . . . . . . . . . సెర్వాంటెస్
అభిమాన సంగీతకారుడు . . . . . . . . హేండెల్, బీథొవెన్, వాగ్నర్
అభిమాన రంగు . . . . . . . . . . . . . . . . . యెరుపు
అభిమాన ప్రవర్తన నియమం . . . . . . "నీ అంతరాత్మకు విధేయంగా వుండు."*
అభిమాన నీతి సూత్రం . . . . . ఒకని కొరకు అందరూ, అందరి కొరకూ ఒకడు.

మా యింట్లో మిత్రులు కలిసినప్పుడు, జోసెఫ్ రిస్సే అనే ఉత్కృష్టమైన పాట కచేరీగాయకుడు అప్పుడప్పుడు పాటలు పాడేవాడు. అతనికి అసాధారణమైన శక్తీ, వైవిధ్యం గల కంఠమూ, గొప్ప ప్రజ్ఞా వుండినాయి. అతను యితర రచనలతో పాటు, థామస్ మూర్** సమీకరించిన ఐరిష్ జానపద గేయాలకు తన అనువాదాన్ని, సంగీతంతో సహా "ఐర్లండు యొక్క హార్ప్" అనే పేరుతో ప్రచురించినాడు. ఒక సంచిక మా తండ్రికి అంకిత మివ్వ బడింది. మార్క్స్ తన కుటుంబంలో అందరిలాగే, దురదృష్ట పీడిత ఐర్లండుపట్ల గొప్ప సానుభూతి కలిగి, యీ హృదయస్పర్శకమైన పాటలు వినడానికి యిష్టపడేవాడు. టుస్సీ ఐర్లండుమీద తనకు గల సానుభూతిని వ్యక్తం చేయడానికి పచ్చరంగును తన అభి మాన రంగుగా చేసుకొని అత్యధికంగా పచ్చదుస్తులు వేసుకొనేది.

ఓడొనొవాన్ రోస్సా అనే ఐరిష్ స్వాతంత్ర్య యోధుడు ఇంగ్లీషువాళ్లచేత జైల్లో పెట్ట బడి, అసహ్యమైన ప్రవర్తనకు గురి అయినాడు. అతన్ని యెప్పుడూ చూడని జెన్నీ, జె. విలి యమ్స్ అనే తన కలంపేరుతో, అతని దృఢత్వాన్ని గొప్పగా మెచ్చుకుంటూ అతనికి జాబులు రాసింది. జాబు రాసింది ఒక ఆడపిల్ల అని శ్రీమతి రోస్సా తెలుసుకుని చాలా అసూయపడిందట. యిది మార్క్స్‌కు చాలా వినోదం కలిగించింది. నేను పొరపాటు పడకపోతే ఓడొనొవాన్ తరువాత అమెరికాకు పోయినాడు, కానీ అక్కడ పెద్దగా రాణించలేదు.

యీ కాలంలో మార్క్స్‌ను చూడడానికి తరుచు పార్టీ మిత్రులు వచ్చేవాళ్లు. వాళ్లలో ఒకడు డీట్స్‌గెన్,*** ప్రశాంత ప్రజ్ఞాశాలి అయిన వ్యక్తి. ఆయనపట్ల మార్క్స్‌కూ, జెన్నీకీ

---

* షేక్స్పియర్, "హామ్లెట్." — సం.

** మూర్, థామస్ (1779–1852) — ఇంగ్లీషు కాల్పనికవాద కవి. జన్మతః ఐరిష్‌జాతివాడు. ఐరిష్ ప్రజల జాతీయ విమోచన పోరాటం గురించి అనేక గేయాలు రచించినాడు. — సం.

*** డీట్స్‌గెన్, యోసెఫ్ (1828–1888) — జర్మన్ చర్మకార్మికుడు, సోషల్ డెమొక్రట్, స్వయంగా చదువుకున్న తత్త్వవేత్త, స్వతంత్రంగా పరస్పరవాదాత్మక భౌతిక వాదాన్ని చేరుకున్నాడు. — సం.

గొప్ప గౌరవం వుండేది. అతని ప్రశాంత పద్ధతీ, పని చేయడంలోనూ, ఆచరణలోనూ అతని కున్న గొప్ప సామర్థ్యమూ వాళ్ళ అభిమానం చూరగొన్నాయి.

ఒకరోజు ఒక ఆగంతుకుడు కాస్త మొండిగా, నియంతృ ధోరణిలో ప్రవర్తించినాడు. "యితని మాటలు వింటే, ప్రభువంశీకుల విద్యనూ, పరిసరాలనూ బట్టి వాళ్ళు యిప్పుడున్నంతకంటె అధ్వాన్నంగా యెందుకు లేరా అని ఆశ్చర్యం కలుగుతుంది" అని మార్క్స్ అన్నాడు....

సంభాషణలో ఆయన తన అయిష్టాన్ని యెప్పుడూ తీవ్రంగా గానీ, అవమానకరంగా గానీ వ్యక్తం చేసేవాడు కాదు. పందెపు పోటీలోలాగా ఆయన తన ప్రతిస్పర్థిని నిరాయుధుణ్ని చేస్తాడు గానీ చావగొట్టడు....

* * *

మార్క్స్, జెన్నీ మాతో కలిసి చాలా కాలం వుండినందువలన, సహజంగా వాళ్ళు లండన్‌కు తిరిగిపోయిన తర్వాత ఆహ్లాదకరమైన ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగినాయి.

జెన్నీ లేఖా రచనకు ఫ్రెంచి భాషనూ, సంక్షేప రచనలకు యింగ్లీషునూ కోరుకునేదని యింతకు ముందే చెప్పినాను. ఎలినోర యెప్పుడూ యింగ్లీషులోనూ, మార్క్స్, ఆయన భార్యా జర్మన్‌లోనూ రాసేవాళ్ళు. మార్క్స్ భార్య మహా మనోహరమైన ఉత్తరాలు రాసేది; అందులో ఆమె తన జీవితాన్ని కన్నులకు కట్టినట్లు వర్ణించడమే గాక, మా తలిదండ్రుల జీవిత విశేషాల ప్రస్తావన కూడా చేసేది; దీన్నిబట్టి ఆమె తన భర్తా, జెన్నీ తనకు చెప్పిన దాన్నిబట్టి, ఆ విశేషాలను యెంత బాగా తెలుసుకున్నదీ, మాకు సంబంధించిన అన్నిటిలోనూ ఆమె యెంత హార్దికమైన ఆసక్తి కలిగించుకున్నదీ వ్యక్తమౌతున్నది. మా అమ్మకు యింగ్లీషూ, ఫ్రెంచీ రెండూ చదవనూ, రాయనూ వచ్చు; కానీ ఉత్తరాలు రాసేటప్పుడు ఆమెకు మాతృభాష సహజంగా, ధారాళంగా వచ్చేది....

క్రిస్మస్‌కు మార్క్స్ కుటుంబమంతా అందమైన అల్లిక బట్టలూ, ఆప్యాయంగా యెన్నికచేసిన యితర కానుకలూ మాకు పంపేవాళ్ళు. అందులో ఒకటి వాళ్ళే తయారుచేసి, పూలతో అలంకరించిన సిల్కు నాటకశాల హాట్, అది జర్మనీలో ధరించేది కాదు, కానీ మా అమ్మ దాని స్మృతిచిహ్నంగా చాలా కాలం వుంచుకొంది. కొన్ని సార్లు వాళ్ళు మాకు తమ యింట్లో చేసిన పెద్ద ప్లమ్ పుడ్డింగులు పంపినారు....

మార్క్స్‌ను మళ్లీ చూడడానికీ, శ్రీమతి మార్క్స్‌నూ, లాఫార్గ్ దంపతులనూ పరిచయం చేసుకోడానికీ మా నాన్న హేగ్‌కు, సోషల్ డెమోక్రట్ల మహాసభకు* (అలాంటి సందర్భాలన్నా, సమావేశాలన్నా తనకు అయిష్టమున్నప్పటికీ) పోయినాడు.

---

*1872 సెప్టెంబర్‌లో జరిగిన మొదటి ఇంటర్నేషనల్ యొక్క హేగ్ మహాసభ. — సం.

లాఫార్గ్ సతీమణిని అందమూ, హుందాతనమూ, స్నేహశీలతా గల స్త్రీగా మా నాన్న వర్ణించినాడు. మార్క్స్ సతీమణి సన్నగా, వయసు తక్కువగా వున్నట్లు కనిపిస్తూ, పార్టీ జీవితంలో గాఢమైన ఆసక్తి కలిగించుకొని, పూర్తిగా దానికి అంకితమైనట్లు కనిపిస్తుందని ఆయన అన్నాడు....

కొద్ది సంవత్సరాల తర్వాత మా తలిదండ్రులు మార్క్స్‌నూ, ఎలినోరనూ కార్ల్స్‌బాద్‌లో కలుసుకొని, ఎలినోరతో, ఉత్తరాల ద్వారా తరుచు యెవరితో కబుర్లు చెప్పకుంటూ వుండినారో ఆమెతో, వ్యక్తిగత పరిచయం కలిగించుకొన్నారు. జెన్నీ అప్పటికే లోంగె సతీమణి అయి, తన భర్తనూ, బిడ్డనూ వదిలే స్థితిలో లేదు.

ఎలినోర — టుస్సీ అని పిలవబడేది — వ్యక్తిత్వంలోనూ, రూపంలోనూ ఆమె అక్కకంటె చాలా భిన్నమైనది. ఆమె రూపు రేఖలు అంత మేలైనవి కావు, కానీ ఆమెకు కూడా తన తండ్రిలాగే మేధా స్ఫోరకమైన తేనెరంగు కన్నులు వుండినాయి. ఆమె అందమైనది కాకపోయినా, నిశ్చయంగా ఆకర్షణీయమైనది. ఆమెకు బంగారు తళుకు లీనే అందమైన ముదురు గోధుమ రంగు జుట్టు వుండింది....

ఆ చిన్న కూతురును, కుటుంబపు ముద్దుబిడ్డ గనుక, అందరూ చెడగొట్టినారనీ, అతి గోముగా పెరిగిన పిల్లలాగ తనకు యేది తోస్తే అది చేసేదని మా అమ్మకు అభిప్రాయం కలిగింది. జెన్నీలాగే ఎలినోర తండ్రిని ఆరాధించేది. ఆమె తెలివితేటలూ, ఆర్ద్ర హృదయమూ గలది. ఆమె యెంతగా కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడేదంటే, తాను యేమనుకునేదీ ప్రతివాకరితోనూ యే మర్యాదా మట్టూ లేకుండా చెప్పేసేది, వాళ్ల కది ప్రీతి కలిగించినా సరే, కలిగించకున్నా సరే....

అప్పుడామెకు పందొమ్మిదేండ్లు వుండినాయనుకుంటాను. లిస్సగరేతో తన వివాహం నిశ్చయమైనట్లు ఆమె భావించేది, అతనితో ఉత్సాహపూరితమైన ఉత్తరప్రత్యుత్తరాలు కొనసాగిస్తూ వుండింది. ఒకసారి ఆమె అతను రాసిన జాబు ఒకటి మా అమ్మకు చూపించింది; అది "Ma petite femme"* అని ప్రారంభమైంది.

మా నాన్న లిస్సగరేను హేగ్‌లో చూసినాడు, అతనిమీద ఆయనకు అనుకూలాభిప్రాయం యేర్పడలేదు. అతను చూడడానికి తృణప్రాయంగా కనపడుతూ, టుస్సీకంటె వయసులో గణనీయంగా పెద్దవాడుగా వుండినాడు. అతను ఒక కౌంటు, కానీ తన వంశ హక్కును వదిలేసినాడు, తన సోషలిస్టు అభిప్రాయాల మూలంగా మొత్తం కుటుంబంచేత వెలి వేయబడినాడు. మార్క్స్ వాళ్ల వివాహ నిర్ణయాన్ని గుర్తించినట్లు లేదు; దాన్ని గురించి ఆయన యెప్పుడూ మాట్లాడలేదు.

---

* "నా ప్రియమైన భార్య." — సం.

మార్క్స్ ముందులాగే వుండినాడు — రూపంలో కూడా మార్పు లేకుండా. ఆయన ఆరోగ్య కేంద్రంలోని అంతర్జాతీయ జీవితాన్ని ఆసక్తితో గమనిస్తూ, దారిన పోయేవాళ్లలో మరీ దృష్టిని ఆకర్షించేవాళ్లలో కొద్దిమందికి తన మామూలు చమత్కారపు మారుపేర్లు పెట్టుతూ వుండినాడు.

చెట్లు నిండిన కొండలలోని అందమైన వివిధ షికారు దారులు, ముఖ్యంగా హృదయంగమమైన ఎగెర్టల్, ఆయనకు ఆహ్లాదం కలిగించినాయి. చిత్రమైన రూపాలు గల కొన్ని శిలలకు జనశ్రుతి వ్యక్తిత్వాలు ఆపాదించి, వాటికి హాన్స్ హైలింగ్ శిలలు అని పేరు పెట్టింది.

హాన్స్ హైలింగ్ గొర్రెలకాపరి యువకుడని చెప్తారు. అతను ఎగర్ అనే అందమైన జలదేవత హృదయాన్ని చూరగొన్నాడట. తనకు అతను శాశ్వతంగా విధేయుడుగా వుండాలనీ, లేకపోతే భయంకరంగా కసితీర్చుకుంటాననీ ఆమె డిమాండు చేసిందట. ఆమెను యెప్పుడూ వదలిపెట్టనని హాన్స్ హైలింగ్ ప్రతిజ్ఞ చేసినాడట, కానీ కొన్నేండ్ల తర్వాత ప్రతిజ్ఞాభంగం చేసి, ఆ గ్రామంలోని ఒక అమ్మాయిని పెండ్లి చేసుకున్నాడట. ఆగ్రహపూరిత జలదేవత హఠాత్తుగా నదిలోనుండి వచ్చి పెండ్లివద్ద ప్రత్యక్షమై, పెండ్లివాళ్ల నందరినీ రాళ్లుగా మార్చిందట.

తమ కొమ్ములతోనూ, మేళాలతోనూ పెండ్లి ఊరేగింపు ముందర నడిచే వాద్యగాళ్ల రూపాలనూ, పెండ్లికూతురు బండి రూపాన్నీ, పండగ దుస్తులు ధరించి, బండిలోకి యెక్కడానికి తన స్కర్టును యెత్తిపట్టుకునే ముసలావిడ రూపాన్నీ గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తూ మార్క్స్ ఆహ్లాదం పొందేవాడు. అదే సమయంలో ఆయన నురుగులు కక్కుతూ వేగంగా ప్రవహించే నదియొక్క ధ్వనిని వినేవాడు — ఆ మంత్రలోకపు కోనలో దాని గలగల ధ్వని మానవుని చంచల చిత్తం గురించి శాశ్వతంగా శోకించే ఒక అమర కాంతకు ప్రాతినిధ్యం వహిస్తుందని అనుకునేవాళ్లు.

డాల్‌విట్స్‌లో మేము క్యోర్నెర్ ఓకుచెట్లను దర్శించినాము; ప్రసిద్ధ కవి క్యోర్నెర్* బలమైన గాయాలనుండి కోలుకునేటప్పుడు ఆ చెట్లకింద కాలం గడుపుతూ, "ఓక్‌చెట్లు" అనే మనోహరమైన కావ్యం రచించినాడు.

ఐఖ్ పోర్సెలిన్ కర్మాగారాన్ని సందర్శించి మార్క్స్ గొప్ప ఆహ్లాదం పొందినాడు. మొదట మెత్తని బూడిదరంగు ముద్దను దారాలతో కోస్తారు. తరువాత దానిని వివిధ అచ్చులలో ఒత్తుతారు. ఒక కార్మికుడు రాట్నంలాంటి ఒక చిత్రమైన టర్నింగ్ మిషన్‌మీద పని చేస్తూ వుండినాడు; దానిమీద మహా నాజూకైన కప్పులు తయారౌతాయి.

---

* క్యోర్నెర్, తియోడార్ (1791–1813) — జర్మన్ కాల్పనికవాద కవి. నెపోలియన్‌కు వ్యతిరేకంగా జరిగిన విముక్తి యుద్ధంలో పాల్గొన్నాడు. — సం.

"నీ పని యెప్పుడూ యిదేనా, లేక మరేదైనా వుందా?" అని మార్క్స్ అతన్ని అడిగినాడు. అతను యిలా జవాబు చెప్పినాడు: "లేదు, యేండ్ల తరబడి నేను మరే పనీ చేయలేదు. కష్టమైన ఆకారం నునుపుగా, లోపరహితంగా వచ్చేటట్లు యంత్రంమీద పనిచేయడం సాధన ద్వారా మాత్రమే నేర్చుకుంటాము." మేము ముందుకు పోయేటప్పుడు మార్క్స్ మా నాన్నతో అన్నాడు: "యిలా శ్రమ విభజన మానవుణ్ని యంత్రానికి తోకగా చేస్తుంది. అతని ఆలోచనా శక్తి కండరాల జ్ఞాపక శక్తిగా మార్చబడింది."

కాల్చడమూ, కొన్ని వివరాలూ, తయారైన వస్తువులకు బాగా వెలుతురున్న పెద్ద గదిలో రంగులు వేయడమూ, బంగారు పూత పూయడమూ, మరొకసారి కాల్చడమూ, చివరన లోపరహితమైనవాటినీ, లోపాలు గలవాటినీ జాగ్రత్తగా వేరుపరచడమూ, ప్యాకింగు గది కూడా — ప్రతిదీ ఉత్కృష్టంగా యేర్పాటు చేయబడింది. మేము స్మృతి చిహ్నాలుగా వివిధ వస్తువులు కొన్నాము.

మాస్టర్ లబీత్సికీ నిర్వహించిన శ్రేష్ఠమైన ఆర్కెస్ట్రాను మార్క్స్ ఆహ్లాదంతో వినేవాడు. రాజకీయాలమీద గురుతరమైన సంభాషణలకు, లేదా పార్టీ వ్యవహారాల చర్చలకు సంబంధించినంత వరకు, వాటిని ఆయన మా నాన్నతో గానీ, తనకు పరిచయమున్న యితర పురుషులతో గానీ కలిసి చేసే చిన్న ఉదయపు షికార్ల కాలంలో పరమ కనిష్ఠ పరిమాణానికి పరిమితం చేసినాడు. ఆ యితర పురుషులలో కౌంట్ ప్లాటెర్ అనే పోలిష్ విప్లవకారుడు వుండినాడు; అతను తన భావాలలో యెంతగా మునిగిపోయినాడంటే, తేలిక సంభాషణలో పాల్గొనడం అతనికి కష్టంగా వుండినట్లు స్పష్టంగా వెల్లడయ్యేది; పదిమందిలో వుండినప్పుడు, లేదా స్త్రీల ఆహ్లాదకరమైన సాహచర్యంలో వుండినప్పుడు తేలిక సంభాషణ వుండాలనే మార్క్స్ పట్టుబట్టేది. ఆ కౌంటు సగటు యెత్తుకు లోపల వుండి, నల్లని జుట్టుతో, కాస్త అస్తవ్యస్తంగా వుండేవాడు. మార్క్స్, ప్లాటెర్‌లలో యెవరు కౌంటు అని యెవరినైనా అడిగితే, మార్క్స్ అని నిశ్చయంగా జవాబు వస్తుందని మా నాన్న మిత్రుడైన చారిత్రక కళాకారుడు ఒట్టో క్నిలె అభిప్రాయం. మార్క్స్‌కు క్నిలెతో తరుచు కళమీద సంభాషణలు చేయడం యిష్టం. ఆవిధంగా ఆహ్లాదకరమైన వివిధ వ్యాపకాలతో రోజులు గడిచినాయి.

హఠాత్తుగా, మేమక్కడ ఆగి వున్న కాలం అంతంలో మార్క్స్, మా నాన్నా కలిసి చేసిన ఒక పెద్ద షికారులో వాళ్ల మధ్య ఒక భేదాభిప్రాయం కలిగింది, అది యెప్పుడూ మాసిపోలేదు. దాన్ని గురించి మా నాన్న అస్పష్టమైన సూచనలు మాత్రం చేసేవాడు. సకల రాజకీయ ప్రచారానికీ దూరంగా వుండి, అన్నిటికంటె ముందు "పెట్టుబడి" మూడవ భాగాన్ని ముగించమని ఆయన మార్క్స్‌కు నచ్చచెప్పడానికి ప్రయత్నించినట్లుంది.... "మార్క్స్ తన కాలం కంటె నూరేండ్ల ముందు వుండినాడు. కానీ తమ కాలాన్ని అనుసరించుకొని

వుండేవాళ్లు తక్షణ విజయం పొందే అవకాశం యెక్కువ వుంది: చాలా ముందు చూపు చూసేవాళ్లు దగ్గరున్న వస్తువులు చూడలేరు, మరింత దగ్గర చూపు గలవాళ్లు వాటిని మరింత స్పష్టంగా చూస్తారు'' అని మా నాన్న తరువాతి కాలంలో చాలాసార్లు అన్నాడు.

బహుశా మా నాన్నకు ఆ కాలంలో మితిమీరిన ఉబలాటం వుండింది, కాస్త ''చెడ్డ వెంత్సెల్''లాగ. తనకంటె చిన్నవాడైన వ్యక్తిలో మార్క్స్ దీన్ని ఆమోదించలేక, యిది తన స్వేచ్ఛమీద దురాక్రమణగా భావించినాడు. ఫలితంగా వాళ్ల ఉత్తరప్రత్యుత్తరాలు తెగిపోయినాయి. టుస్సీ అప్పుడప్పుడు రాస్తూ వుండిన మాట నిజమే, కానీ జెన్నీ రాసేదో లేదో నాకు తెలియదు. టుస్సీ యెప్పుడూ తన తండ్రి శుభాకాంక్షలు తెలిపేది; ఆయన పాత రోజుల సంభాషణల స్మృత్యర్థం మా అమ్మకు పుస్తకాలు కూడా పంపినాడు: హరీరియొక్క ''మకామస్''కు ర్యుకెర్ట్ అనువాదం, షామిస్సో రచనలు, ఇ. టి. ఎ. హోఫ్మన్ రచన ''చిట్టి త్సాహెస్.'' జానపద కథ రూపంలో వున్న యీ వ్యంగ్య రచన ప్రత్యేకంగా మార్క్స్‌ను వినోదపరిచింది. స్వయంగా ఆయన తరువాత యెప్పుడూ మా నాన్నకు ఉత్తరాలు రాయలేదు. బహుశా మా నాన్నను ఉపేక్షించడం ద్వారా ఆయనను నొప్పించాలని మార్క్స్ అనుకొని వుండడు, కానీ గతాన్ని మరవలేక పోయినాడు.

తాను యింకా అదే మోతాదులో గౌరవిస్తున్న మిత్రునితో సంబంధం తెగిపోవడంవలన కలిగిన బాధనుండి మా నాన్న యెప్పుడూ తేరుకోలేదు. కానీ ఆయన యెన్నడూ రాజీకి ప్రయత్నం చేయలేదు; యెందుకంటే ఆయన తన నమ్మకాన్ని వదలిపెట్టలేకపోయినాడు. మార్క్స్ మరణం తర్వాత టుస్సీనుండి మా అమ్మకు అరుదుగా ఉత్తరాలు వచ్చేవి....

మా తలిదండ్రులు మార్క్స్‌ను యెంత ప్రియంగా చూసేవాళ్లంటే, ఆయనతో తమకు గల సంబంధంలోని ప్రతి వివరాన్నీ వాళ్లు యెల్లప్పుడూ ఆప్యాయంగా జ్ఞాపకం చేసుకునేవాళ్లు; ఆ సంబంధాన్ని షిల్లర్ అనే జర్మన్ మహాకవి మాటల్లో వర్ణించవచ్చు:

> ''కాలం ఆగకుండా పరుగెత్తుతుంది, శాశ్వతమైనదాన్ని వెదక్కుంటూ;
> విధేయంగా వుండు, నీవు దాన్ని శాశ్వతంగా బంధిస్తావు.''

# యస్. మొరోజొవ్

## కార్ల్ మార్క్సును కలుసుకోవడం*

1880 డిసెంబర్‌లో నేను లండన్‌కు పోయి, కార్ల్ మార్క్సు యింటికి చాలా సార్లు పోయిన నా "నరోద్నయా వోల్యా"** కామ్రేడ్లలో ఒకడైన లెవ్ గార్ట్‌మన్‌తో కలిసి మార్క్సును చూడడానికి పోయినాను. అప్పుడు ఆవిరి యింజన్లచేత నడుస్తూవుండిన లండన్ మెట్రోపాలిటన్ రైల్వే ద్వారా మేము పోయినాము. మార్క్సు అప్పుడు తన కూతురు ఎలినోరతో కలిసి ఒంటిగా వుంటూ వుండినాడు.

గార్ట్‌మన్ మూడుసార్లు తలుపు తట్టిన తర్వాత ఒక యువతి తలుపు తెరిచింది. "మార్క్సు వున్నారా?" అని అతను ఆ పనిమనిషిని అడిగినాడు.

---

* మొరోజొవ్, నికొలాయ్ అలెక్సాండ్రొవిచ్ (1854–1946) – రష్యా విప్లవోద్యమంలో చురుకైన సభ్యుడు, నరోద్నిక్; సోవియట్ రష్యాలో రసాయనశాస్త్ర, ఖగోళశాస్త్ర రంగాలలో శాస్త్రజ్ఞుడు; సోవియట్ యూనియన్ విజ్ఞానశాస్త్ర అకడెమీలో గణుతికెక్కిన సభ్యుడు. మార్క్సు గురించిన ఆయన స్మృతులు 1935లో ప్రచురింపబడినాయి. – సం.

** "నరోద్నయా వోల్యా" ("ప్రజా స్వేచ్ఛ") – 1879లో స్థాపించబడిన విప్లవ భావాలు గల మేధావుల – నరోద్నిక్కుల – రహస్య రాజకీయ సంఘం. నరోద్నిక్ ఊహాజనిత సోషలిజం వైఖరిని అవలంబిస్తూ వారు రాజకీయ పోరాట మార్గాన్ని అనుసరించినారు. నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదోయడమూ రాజకీయ అధికారాన్ని గెల్చుకోవడమూ అత్యంత ముఖ్యమైన పని అని వారు భావించినారు. జారిస్టు నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగించిన పోరాటంలో "నరోద్నయా వోల్యా" సభ్యులు వ్యక్తిగత హింసా చర్యలకు పూనుకున్నారు. 1881 మార్చి 1న రెండవ అలెగ్జాండర్ చక్రవర్తిని వారు హత్య చేసిన తరువాత జారిస్టు ప్రభుత్వం యీ సంఘాన్ని నాశనం చేసింది. 1880ల ద్వితీయార్ధం నాటికి యీ సంఘం ఉనికిలో లేకుండా పోయింది. – సం.

ఆమె అతన్ని గుర్తుపట్టింది. మార్క్స్ యింకా బ్రిటిష్ మ్యూజియంలో వున్నాడనీ, ఆయన కూతురు యింట్లో వున్నదనీ ఆమె జవాబు చెప్పింది.

దాదాపు మేము డ్రాయింగురూంలోకి పోయిన వెనువెంటనే ఆయన కూతురు, సన్నని, ఆకర్షణీయమైన జర్మన్ తరహా అమ్మాయి, ఆ గదిలోకి వచ్చింది. ఆమెను చూసి నాకు ''ఫాస్ట్''లోని రొమాంటిక్ గ్రెత్చెన్, లేక మార్గరెట్ జ్ఞాపకం వచ్చింది.

మా సంభాషణ యింగ్లీషులో ప్రారంభమైంది. కానీ నేను ఒక యింగ్లీషు పదం విషయంలో యిబ్బంది పడి, దానికి బదులు ఫ్రెంచి పదం వాడడం ఎలినోర గమనించి, వెంటనే సంభాషణ ఫ్రెంచి భాషలోకి మార్చింది. మేము ఆ భాషలో సంభాషణ కొనసాగించినాం.

తన తండ్రి బ్రిటిష్ మ్యూజియంలో వున్నాడనీ, సాయంత్రం దాకా యింటికి రాడనీ ఆమె కూడా చెప్పింది. మేము అర్ధగంట తర్వాత వెళ్లిపోయి, మరుదినం అంగీకృత సమయానికి తిరిగివచ్చినాం.

మార్క్స్‌ను చూసినప్పుడు నాకు కలిగిన మొదటి భావం నాకు బాగా జ్ఞాపకముంది: ఆయన యెంతగా తన చిత్రపటం లాగ వున్నాడు! మొదటి పరిచయాలు చేయబడిన తర్వాత మేము ఒక చిన్న టేబుల్‌వద్ద, గోడ కానుకొని వున్న ఒక సోఫాలో కూర్చున్నాం. మార్క్స్‌ను గురించి నాకు కలిగిన భావాన్ని నేను ఆయనతో చెప్పుతూ నవ్వినాను. ఆయన కూడా నవ్వి, ఆ మాట తరుచుగా తనతో చెప్పుతుంటారని, తన చిత్రపటం తనలాగ వుండడానికి బదులు, తన చిత్రపటంలాగ తాను వుండడం కాస్త చిత్రమైన అనుభూతి కలిగిస్తుందనీ అన్నాడు.

ఆయనకు దాదాపు మధ్య రకం యెత్తూ, కానీ భారీ అంగనిర్మాణమూ వుండినట్లు నాకు అనిపించింది. ఆయన మా యిద్దరి పట్లా అత్యంత సౌజన్యపూరితంగా వుండినాడు. ఆయన తన అసాధారణ ప్రాముఖ్యాన్ని పూర్తిగా అవగతం చేసుకున్నట్లు ఆయనయొక్క సకల కదలికలలోనూ, మాటలలోనూ మనకు వెంటనే అనుభూత మౌతుంది. ఆయన మొద్దు ముఖంవాడనీ, యితర్లకు సమీపించరానివాడనీ నాతో యెవరో అన్నారు గానీ, అలాంటి దేమీ ఆయనలో నాకు కనిపించలేదు. ఆ సమయంలో లండన్‌లో పొగమంచు వుండింది, కనుక అన్ని యిండ్లలోనూ లాంపులు వెలిగించుకొని వుండినారు. మార్క్స్ యింటిలోని లాంపుకు పచ్చని షేడు వుండినట్లు నాకు స్పష్టంగా జ్ఞాపక ముంది. కానీ ఆ వెలుతురులో కూడా నేను ఆయన్నూ, ఆయన పఠనాగారాన్నీ చాలా బాగా చూడగలిగినాను. మూడు గోడల పొడవునా పుస్తకాలు వుండినాయి, నాల్గవ గోడమీద చిత్రపటాలు వుండినాయి.

ఎలినోర తప్ప ఆ గదిలోకి యెవరూ రాలేదు. యితర కుటుంబ సభ్యు లెవరూ యింటి వద్ద లేరన్న భావం నాకు కలిగింది. ఎలినోర గదిలోకి వడివడిగా వస్తూ పోతూ, సోఫాలో కాస్త వారగా కూర్చొని సంభాషణలో పాల్గొంటూ వుండింది. ఆమె మాకు టీ, బిస్కట్లూ తెచ్చింది కూడా.

సంభాషణ ప్రధానంగా "నరోద్నయా వోల్యా" వ్యవహారాలమీద సాగింది; వాటిలో ఆయన గొప్ప ఆసక్తి కనబరిచినాడు. నియంతృత్వంతో మేము చేసే పోరాటం యేదో అతిలోక మైనదనీ, అభూతమైన నవలలాంటిదనీ, యితర యూరపియను లందరి లాగే తాను ఊహిం చినట్లు ఆయన అన్నాడు.

రెండు రోజుల తర్వాత, లండన్ వదలిపోయేముందు, నేను మార్క్సును చూడడానికి పోయి, ఆయనతోనూ, ఆయన కూతురుతోనూ మళ్లీ కాసేపు గడిపినాను. నేను వీడ్కోలు తీసు కునేటప్పుడు, నాకోసం సిద్ధంగా వుంచిన అయిదారు పుస్తకాలు ఆయన నాకు యిచ్చినాడు. మేము అచ్చువేయించడానికి యెన్నుకున్న పుస్తకానికి, మేము మా అనువాదంయొక్క మొదటి ప్రూఫులు పంపిన వెంటనే, ఒక ఉపోద్ఘాతం రాస్తానని ఆయన వాగ్దానం చేసినాడు కూడా.

నేను రెండు మూడు వారాలలో రష్యాకు తిరిగిపోతున్నానని ఆయనతో అన్నప్పుడు, ఆయన నాతో హార్దికంగా కరచాలనం చేసి, రష్యానుండి నేను క్షేమంగా తిరిగిరావాలని ఆకాంక్షలు తెలిపినాడు. ఉత్తరాలు రాసుకోడానికి యిద్దరమూ వాగ్దానాలు చేసుకున్నాం, కానీ ఆ వాగ్దా నాలు వాస్తవం కాలేదు. నేను జెనీవాకు తిరిగివచ్చేటప్పటికి నాకు పెరోవ్‌స్కయా*నుండి ఒక ఉత్తరం వచ్చి వుండింది; కొన్ని ఘటనలు సన్నద్ధం చేయబడుతూ వుండినాయనీ, అందువలన నేను తక్షణం తిరిగిపోవాలనీ ఆ ఉత్తరం ద్వారా నాకు తెలిసింది, నేను సామాన్లు సర్దుకొని బయలుదేరినాను; కానీ ఫిబ్రవరి 28న, జెనీవా విశ్వవిద్యాలయ విద్యార్థి అయిన లాక్యేర్ అనే దొంగపేరుతో నేను సరిహద్దు దాటుతూ వుండగా, అరెస్టు చేయబడి, వార్సా కోటకు తీసుకపోబడినాను. అక్కడ నేను మార్చి 1వ తేదీ ఘటనలను** తదేయుష్ బలీత్స్కీ ద్వారా తెలుసుకున్నాను; జైలులో నాపక్క గదిలో వుండిన ఆ కామ్రేడు ఆ సమాచారం నాకు గోడమీద టెలిగ్రాఫ్ సంకేతాలు చేసి తెలియజేసినాడు.

నేను మొదట పీటర్ అండ్ పాల్ కోటలో, తరువాత ష్లిస్సెల్‌బుర్గ్‌లోనూ బంధింప బడినాను. మార్క్సుతో జరిగిన నా సంభాషణ ఫలితం నాకు 1905లో నేను విడుదల అయిందాకా తెలియదు. వాస్తవంలో 1930దాకా నాకు తెలియదు; అప్పుడు రాజకీయ ఖైదీల సంఘంయొక్క "'నరోద్నయా వోల్యా' పార్టీ సాహిత్యం" అనే ప్రచురణలో నేను హఠాత్తుగా చూసినాను "కమ్యూనిస్టు ప్రణాళిక"కు మార్క్సు రాసిన ఉపోద్ఘాతం; దేని స్థాపనకు నేను

---

* పెరోవ్‌స్కయా, సోఫ్యా ల్వోవ్నా (1853–1881) – రష్యన్ విప్లవకారిణి, "నరోద్నయా వోల్యా"లో ప్రముఖ సభ్యురాలు. జారు ప్రభుత్వంచేత ఉరితీయబడింది. – సం.

** 1881 మార్చి 1వ తేదీన "నరోద్నయా వోల్యా" సభ్యులచేత రెండవ అలెగ్జాండర్ చక్రవర్తి హత్యచేయబడినాడు. – సం.

తోడ్పడినానో ఆ ''సోషల్ రివల్యూషనరీ లైబ్రరీ'' ప్రచురించినది ఆ ''కమ్యూనిస్టు ప్రణాళిక.'' ఆ ఉపోద్ఘాతం నాలో చాలా జ్ఞాపకాలను మేల్కొల్పింది.

మార్క్స్‌నూ, ఆయన కూతురునూ నేను దర్శించిన ఘటనలు జ్ఞాపకం వచ్చినాయి. నేను రష్యాకు పోవడానికి తొందరపాటుతో జెనీవాను వదలిపెట్టేటప్పుడు, అక్కడ నిలిచిన ''సోషల్ రివల్యూషనరీ లైబ్రరీ'' కార్యకర్తల్లో ఒకరికి (ప్లెహానొవ్‌కు* అనుకుంటాను), రష్యన్‌లోకి అనువదించడానికి మార్క్స్ ''ప్రణాళిక''నూ యితర పుస్తకాలనూ యిచ్చిన విషయం జ్ఞాపకం వచ్చింది.

నేను యిప్పుడే ప్రస్తావించిన మార్క్స్ ఉపోద్ఘాతంలో యీకింది మాటలు చూసి నేను ప్రత్యేకంగా సంతోషించినాను:

''యూరపియన్ ప్రగతి వ్యతిరేకతకు జారు చక్రవర్తి నాయకుడుగా ప్రకటింపబడినాడు. యీనాడు** అతను విప్లవానికి భయపడి, గాత్చినాలో ఖైదీలాగా వున్నాడు. యీనాడు యూరప్‌లో జరిగే విప్లవ చర్యలకు రష్యా అగ్రగామిగా వుంది.''

మేము వీడ్కోలు చెప్పినప్పుడు ఆయన అన్నది అక్షరాలా ఆ మాటలే.

---

* ప్లెహానొవ్, గెయోర్గియ్ వలెంతీనొవిచ్ (1856–1918) – రష్యన్, అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమంలో ప్రముఖ వ్యక్తి, తత్వశాస్త్రజ్ఞుడు, రష్యాలో మార్క్సిజాన్ని ప్రచారం చేసేవాడు. – సం.

** 1881లో. – మొరోజొవ్ వివరణ.

# ఎడ్వర్డ్ ఎవెలింగ్*

## యింటిలో ఎంగెల్సు

### 1

ప్రపంచ మంతటా సోషలిస్టు పత్రికలూ, యితర పత్రికలూ ఇటీవలే మరణించిన మహా సోషలిస్టుయొక్క జీవితం గురించీ, కృతుల గురించీ చెప్పినాయి. యీ వ్యాసంలో ఎంగెల్సు జీవితంయొక్క ఆంతరిక పార్శ్వం గురించి కొంత చెప్తాను.

నేను కలిసిన వ్యక్తులలో కెల్లా అత్యంత గాఢ ప్రభావం కలిగించే వ్యక్తిత్వాలు గలవాళ్లు కార్ల్ మార్క్సు, చార్లెస్ డార్విన్, ఫ్రెడరిక్ ఎంగెల్సు, పూర్తిగా భిన్నమైన మరొక జీవిత దిశలో హెన్రీ ఇర్వింగ్.** యీ నాలుగు సందర్భాలలోనూ గొప్ప మేధాశక్తి గొప్ప భౌతిక గుణాలతో కలిసి వుండింది. మార్క్సు, డార్విన్‌ల విషయంలో, వాళ్ల రచనలూ వాళ్ల కార్యకలాపాలూ కొద్దో గొప్పో నాకు తెలిసినప్పటికీ, ఒకటి రెండు సందర్భాలలో మాత్రమే నాకు వాళ్లను సాక్షాత్తుగా కలుసుకునే భాగ్యం కలిగింది. నేను మార్క్సును సజీవంగా చూసింది ఒక్కసారి మాత్రమే; అది యెప్పుడంటే, నేను యువకునిగా వుండినప్పుడు హవెర్‌స్టాక్ హిల్‌లోని ఆర్ఫన్ వర్కింగ్ స్కూలు పిల్లలకు ''కీటకాలూ, పూలూ'' అనే అంశంమీద నేను ఉపన్యాసం యిచ్చినప్పుడు. అది స్కూలులో ఉత్సవం రోజు; పిల్లలు కాక, స్కూలులో ఈ విషయంమీద ఆసక్తి కలవాళ్లు పెద్దవాళ్లు కూడా వుండినారు. ఉపన్యాసం ముగిసిన తర్వాత, అసలైన సింహం లాంటి శిరస్సు గల ఒక వృద్ధుడూ, ఒక స్త్రీ, ఒక బాలికా నావద్దకు వచ్చి,

---

* ఎవెలింగ్, ఎడ్వర్డ్ (1851–1898) – ఇంగ్లీషు సోషలిస్టూ, రచయితా; మార్క్సు కూతురు ఎలినోర భర్త. ఈ స్మృతులు 1895లో ప్రచురింపబడినాయి. – సం.

** ఇర్వింగ్, హెన్రీ (1838–1905) – సుప్రసిద్ధ ఇంగ్లీషు దర్శకుడూ, నటుడూ; షేక్స్పియర్ నాటకాలలో కొన్ని ప్రధాన పాత్రలను వహించినాడు. – సం.

తమకు తాము నాకు పరిచయం చేసుకున్నారు. ఆ వృద్ధుడు కార్ల్ మార్క్స్, ఆ స్త్రీ ఆయన భార్య జెన్నీ ఫన్ వెస్ట్‌ఫాలెన్, ఆ బాలిక వాళ్ల కూతురు ఎలినోర. మార్క్స్ నన్ను అమితంగా మెచ్చుకుంటూ, ప్రోత్సహిస్తూ, దయగా, ఉదారంగా చెప్పిన మాటలు నాకు యీనాటికీ జ్ఞాపకమున్నాయి. ఆయన్ను నేను రెండవ సారి చూసినప్పుడు ఆయన మరణించి వుండినాడు. కానీ ఆయన నామీద కలిగించిన గొప్ప శారీరక శక్తియొక్క ప్రభావ ముద్ర యింకా నా మనసులో వుంది....


ఎంగెల్సు సరిగా ఆరడుగుల యెత్తు వుండినాడు; తన చివరి జబ్బుదాకా ఆయన నిటారుగా, సైనికునిలాగా, తన డెబ్బై యేండ్ల వయోభారాన్ని తేలికగా వహిస్తూ వుండినాడు. వడివడిగా, తేలికగా అడుగులు వేసే యీ సైనిక తరహా గమనానికీ, తన సన్నిహిత మిత్రులకు యే పేరుతో ఆయన పరిచితుడో ఆ "జనరల్" అనే పేరుకూ కొంత సంబంధం వుంది. ఆ పేరు రావడానికి అసలు కారణం 1870లో ఫ్రాంకో జర్మన్ యుద్ధ కాలంలో "పాల్ మల్ గజెట్"కు ఆయన రాసిన అసాధారణమైన ఉత్తరాలు. అందులో ఒకదానిలో ఆయన, సెడాన్ వద్ద ఫ్రెంచివాళ్లమీద జర్మన్లు నిర్ణయాత్మక విజయం పొందుతారని, సెప్టెంబర్ 2కు యే యెనిమిది రోజులో ముందుగా జోస్యం చెప్పినాడు. ఆ ఉత్తరాలన్నీ యుద్ధ కళకు సంబంధించి యెలాంటి జ్ఞానాన్ని ప్రదర్శించినాయంటే, వాటిని యెవరో గొప్ప ప్రామాణిక యుద్ధతంత్రజ్ఞుడు రాసినాడని జనం అనుకున్నారు. నిజం అంతే. కానీ ఆ గొప్ప ప్రామాణిక యుద్ధతంత్రజ్ఞుడు మాంచెస్టర్ జవుళి వర్తకుడూ, సోషలిస్టూ. నిజమే, పెట్టుబడిదారీ వ్యవస్థమీద సోషలిస్టు సైన్యం చేసే యుద్ధంలో, ప్రధాన సేనాధిపతి అయిన మార్క్స్ మరణం తర్వాత, ఆయన నాయకుడనే ఆంతరిక ప్రాముఖ్యం కూడా ఆ "జనరల్" అనే పేరుకు తరువాతి కాలంలో వుండింది.

## 2

రీజెంట్స్ పార్క్ రోడ్డులోని 122వ నంబరు యింటిలోని ఆ అద్భుతమైన ఆదివారాలను, ఒక్కసారైనా సరే వాటికి హాజరైనవాళ్ళు, యెవరు మరిచిపోతారు! మార్క్స్‌కూ, ఆయన భార్యకూ, ఎంగెల్సుకూ మిత్రురాలైన హెలిన్ దెముత్ జీవించి వుండి, ఎంగెల్సుకు గృహనిర్వాహకురాలుగానూ, నిత్య జీవిత విషయాలలోనే గాక, రాజకీయాలలో కూడా విశ్వసిత సలహాదారుగానూ, హితోపదేశకురాలుగానూ వుండింది. ఆమె నిశితమైన లోకజ్ఞతా, స్ఫటికంలాంటి చిత్తశుద్ధీ, మనుషులనూ, విషయాలనూ విలువగట్టే శక్తీ ఆ యిద్దరు మహా పురుషులైన మార్క్స్, ఎంగెల్సులకు కూడా రాజకీయాలలో ఆమెను సహాయకురాలినిగా చేసినాయి....



ఫ్రెడరిక్ ఎంగెల్సు, 1862



ఈస్ట్‌బోర్న్ దగ్గర ఒక చోట. అక్కడ ఎంగెల్సు చితాభస్మం
సముద్రంలో ముంచబడింది

ఆ ఆదివారాలు బహు భాషా వ్యవహారంలా గుండినాయి. యెందుకంటే, నిజంగా మార్క్సు కుటుంబానికి చెందిన మేము మాత్రమే కాదు అక్కడ వుండింది; యితర దేశాల సోషలిస్టులు కూడా రీజెంట్స్ పార్క్ రోడ్డులోని 122వ నంబరు యింటిని మక్కాగా చేసుకున్నారు.

ఎంగెల్సు వాళ్లందరితోనూ వాళ్ల వాళ్ల సొంత భాషల్లో మాట్లాడగలిగేవాడు. మార్క్సు లాగే ఆయనకు జర్మన్, ఫ్రెంచి, యింగ్లీషు భాషలు స్వచ్ఛంగా మాట్లాడనూ, రాయనూ వచ్చు; దాదాపు అంత స్వచ్ఛంగానూ ఇటాలియన్, శ్పానిష్, డేనిష్ భాషలు వచ్చు; రష్యన్, పోలిష్, రుమేనియన్ భాషలు ఆయనకు చదవనూ, యేదో ఒక విధంగా మాట్లాడనూ వచ్చు — లాటిన్, గ్రీకు లాంటి "చిల్లర విషయాలు" చెప్పనక్కర లేదు.

ప్రతిరోజూ, ప్రతి పోస్టులోనూ ఆయన యింటికి ప్రతి యూరపియన్ భాషలోనూ వార్తాపత్రికలూ, జాబులూ వచ్చేవి. తన యితర పని అంతటితో పాటు, ఆయనకు ఆ అన్నిటినీ చూడడానికి, ఒక క్రమంలో పెట్టుకోడానికీ, వాటిలోని విషయాలను జ్ఞాపకం పెట్టుకోడానికీ యెలా తీరిక వుండేదో అచ్చెరువు కలిగేది. ఆయన రచనల్లో గానీ, మార్క్సు రచనల్లో గానీ యేదైనా యితర భాషల్లోకి అనువాదం చేయవలసి వచ్చినప్పుడు, ఆ అనువాదకులు ప్రతిసారీ తమ అనువాదాలను, తనిఖీ చేయడానికీ, తప్పులు దిద్దడానికీ, ఆయన వద్దకు పంపించేవాళ్లు. యార్మూత్‌లో ఒక కపాల సాముద్రికుడు ఎంగెల్సు తలమీది బొడిపలు పరిశీలించి, ఆయన సహచరులకు ఆనందం కలిగిస్తూ, ఆయన "మంచి వ్యాపారస్తుడు" అనీ (ఆ మాట నిజమే), కానీ ఆయనకు "భాషలలో ప్రజ్ఞ లేదు" అనీ (ఆ మాట బొత్తిగా నిజం కాదు) చెప్పిన విషయం లిఖిత రూపంలో వుంది. మరి కపాల సాముద్రికం వట్టిదని యెవరనగలరు!

ఆయన కున్న భాషా యోగ్యతలు కాక, యితర అన్ని విధాలా ఎంగెల్సు ప్రశంసనీయమైన అతిథి సత్కారశీలి. రూపుదాల్చిన అతిథి సత్కారం ఆయన, చాలా సంస్కారవంతుడు కూడా.... ఆదివారాలు కాని రోజుల్లో, మాలో యెవరైనా ఆయన్ను చూడడానికి పోయి భోజనానికి ఆగితే తప్ప, ఆయన యెంతో మితంగా జీవించేవాడు. కానీ ఆదివారాలనాడు, చుట్టూ తన మిత్రులతో, తాను యివ్వగలిగిన అన్నింటిలోనూ ఉత్తమమైనవాటితో తన మిత్రులు ఆనందించడం చూసి ఆయన పొందే ఆహ్లాదం — అదే మా కొక ఆహ్లాదంగా వుండేది.

రీజెంట్స్ పార్క్ రోడ్డులోని 122వ నంబరు యింటిలో యెల్లప్పుడూ స్వాగతం పొందే వాళ్ల పట్టీ సోషలిస్టు ఉద్యమంయొక్క సంక్షిప్త పాఠంలా గుంటుంది. ఎంగెల్సు కుటుంబంలో ఒకణ్నిగా చూడబడే మహా గౌరవం నాకు కలిగిన పంద్రెండేండ్లలో ఆయన యింటికి వచ్చినట్లు నాకు స్వయంగా తెలిసినవాళ్ల పేర్లు మాత్రమే యీ వ్యాసంలో యిస్తాను.

జర్మన్లలో విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్, జర్మనీలో మార్క్సు ఎంగెల్సుల అత్యంత పాత మిత్రుడు, జర్మన్లు అనేటట్లు "విప్లవపు పాత సైనికుడు," మార్క్సు కుటుంబ సభ్యులు

యెల్లప్పుడూ అన్నట్లు "లైబ్రరీ," సమర్థులైనవాళ్లలో కెల్లా అత్యంత దయాపరుడూ, హార్దికుడూ, ఆప్త సహచరుడూ; ఔగుస్ట్ బేబెల్, అద్భుతమైన యుద్ధతంత్రజ్ఞుడు, వీరుడు, వక్త; బృహత్కాయుడూ, ఉల్లాసవంతుడూ, అరమరికలు లేనివాడూ, విశ్వసనీయుడూ అయిన పాల్ సింగెర్.

గత కొద్ది సంవత్సరాలలో లండన్‌లో నివసించిన జర్మన్లలో రిచర్డ్ ఫిషెర్‌ను చెప్పక తప్పదు; అతను 1890లో జర్మనీకి తిరిగిపోయిన తర్వాత జర్మనీ సోషల్ డెమోక్రటిక్ పార్టీ కార్యనిర్వాహక వర్గంయొక్క కార్యదర్శులలో ఒకడుగా వుండినాడు.... యింగ్లండులో యెవరు లేని లోటుకు మేము యెక్కువగా బాధపడుతున్నామో ఆ అత్యంత ఆహ్లాదకరమైన వ్యక్తి తౌషెర్‌ను కూడా చెప్పక తప్పదు; అతను నస్యం వేసుకునేవాడు, బహుశా ఆ అలవాటువలన అతని ముక్కు యెంత బృహత్ పరిమాణాలకు పెరిగిందంటే, అతనికి "నాసో"* అని మారుపేరు పెట్టబడింది.

యింకా లండన్‌లో నివసిస్తున్నవాళ్లలో చెప్పదగినవాళ్లు పాత ఇంటర్నేషనల్ సభ్యుడూ నమ్మదగినవాడూ, నిజాయితీపరుడూ అయిన ఫ్రీడ్రిఖ్ లెస్నెర్, లీబ్‌క్నెఖ్ట్, సౌమ్యుడూ, నమ్రుడూ, అయినా చురుకైనవాడూ, పాత కమ్యూనిస్టు లీగులో యింకా బతికివున్న ఒకే ఒకడూ అయిన లోహ్నెర్ (మార్క్సు, ఎంగెల్సుల అత్యంత పాత మిత్రుల్లో ఒకడు); జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీయొక్క ఆర్థిక వ్యవహార నిర్వాహకుడూ, ఆ పార్టీవాళ్ల చేత సంపూర్ణంగా విశ్వసించబడినవాడూ అయిన జూలియుస్ మోటెలెర్, చిత్తశుద్ధిగలదీ, కుండ బద్దలుకొట్టినట్లు మాట్లాడేదీ అయిన అతని భార్య; సోషలిస్టు వ్యతిరేక శాసనం వుండిన కాలంలో "సోత్సియాల్ డెమోక్రట్" సంపాదకుడూ, ప్రస్తుతం యింగ్లండులో జర్మన్ పార్టీ ప్రతినిధీ, ఎంగెల్సు వీలునామాకు ఒక ధర్మకర్తగా చేయబడేటంతగా ఆయనచేత విశ్వసించబడినవాడూ అయిన బెర్న్‌స్టైన్, అతని భార్య – వీళ్లిద్దరూ ఎంగెల్సు కుండిన, యెవరికైనా వుండిన, యిద్దరు అసలైన, అత్యుత్తమ మిత్రులు.

(ఫ్రెంచివాళ్లు – మార్క్సు పెద్ద కూతురూ, 1883లో తన తండ్రికంటె రెండు నెలల ముందు మరణించినదీ అయిన జెన్నీయొక్క పిల్లలు యింగ్లండులో వుండినప్పుడు యెప్పుడూ ఎంగెల్సు యింట్లో వుండేవాళ్లు, ఎంగెల్సు అనురాగాన్ని చూరగొన్నవాళ్లలో యేవిధంగానూ చివరివాడు కాని చార్లెస్ బెర్నార్డ్** లండన్‌లో వున్నప్పుడు అక్కడికి వచ్చేవాడు; కలేకు చెందిన డెల్‌క్లూజ్, పారిస్‌కు చెందిన రుస్సెల్, యిద్దరూ "పార్టీ ఉవ్రీర్"

---

* లాటిన్ భాషలో "nasus" అంటే "ముక్కు." – సం.

** చార్లెస్ బెర్నార్డ్ – ఫ్రెంచి సోషలిస్టు చార్లెస్ బొనీర్ మారుపేరు. – సం.

పత్రికలో చురుకైన సభ్యులు, మే ప్రదర్శనలకు లండన్‌కు వచ్చినప్పుడు అక్కడికి వచ్చే వాళ్ళు. బెల్జియంకు చెందిన ఎమిలీ వాండెర్‌వెల్డే, అన్‌సేలె విషయం కూడా అంతే.

ఆస్ట్రియన్లలో, హెలిన్ దెముత్ మరణం తర్వాత ఎంగెల్సు యింటిని నిర్వహించిన శ్రీమతి ఫ్రైబెర్గెరూ, ఆయనకు చివరి జబ్బులో చికిత్స చేసిన డాక్టర్ ఫ్రైబెర్గెరూ కాక "అర్బైటర్ సైటుంగ్" ("కార్మిక పత్రిక") సంపాదకుడూ, ఆస్ట్రియన్ పార్టీలోని చమత్కారపూరిత వక్తా, గంభీర ఆలోచనాపరుడూ అయిన విక్టర్ ఆడ్లర్, కార్ల్ కౌట్‌స్కీ.

స్టనీస్లవ్ మెండెల్‌సాన్, మేరీ మెండెల్‌సాన్ – కనీసం నాలుగు భాషల్లో మనోహరంగా, ఉజ్వలంగా, ఆలోచనాశీలంగానూ, విశ్వాసపూరితంగానూ కూడా వుండగల వీళ్లిద్దరూ పోలులకు ప్రతినిధులు.

స్తెప్‌న్యాక్* అప్పుడప్పుడు వచ్చేవాడు. వేరా జసూలిచ్,** యింగ్లండుకు వచ్చిన ప్పటినుండి, ఆహ్వానం అవసరం లేకుండా యెప్పుడూ వచ్చే ఆగంతుకుల్లో ఒకతె. ఆమెకు విశ్వాసపూరిత మిత్రుడూ, సహ కార్యకర్తా, పార్టీలోని అత్యంత సమర్థులైన ఆలోచనాపరుల లోనూ, చమత్కారులలోనూ ఒకరూ అయిన గెయోర్గియ్ ప్లెహానొవ్, అరాజకవాదులు బహుశా బతికివున్న యితర రచయిత లందరికంటె యెవరికి యెక్కువగా భయపడతారో అతను, తాను యింగ్లండులో వుండిన కొద్ది కాలంలో, సహజంగానే, యెప్పుడూ ఎంగెల్సు యింటి వద్ద వుండేవాడు.

అంతర్జాతీయ మహాసభలు జరిగేటప్పుడు, అమెరికానుండి మరొక రష్యన్ వచ్చేవాడు; అతను అబ్రహాం కగన్, స్పష్టంగా ఆలోచించగలవాడూ, ప్రతి దేశంలోనూ యూదులను చురుకుగా సమీకరించేవాడూ.

మరొక విదేశీ అమెరికన్ వుండినాడు; అతన్ని అట్లాంటిక్ మహాసముద్రం ఎంగెల్సు యింటినుండి దూరం చేసింది గానీ, ఎంగెల్సుకు అత్యంత ప్రీతికరంగా నిత్యం ఉత్తరాలు రాసేవాళ్లలో ఒకడు; అతను మార్క్సు ఎంగెల్సుల జీవిత కాలంలోని ఉత్తర భాగంలో వాళ్లకు బహుశా అందరికంటె సన్నిహితంగా వుండినవాడు. అతని పేరు ఫ్రీడ్రిఖ్ ఆడోల్ఫ్ సోర్గె; అతను న్యూయార్క్ దగ్గర వున్న హోబెకెన్‌కు చెందినవాడు. రసాయన శాస్త్ర జ్ఞులలో రాజులాంటివాడూ, సోషలిస్టూ, మంచి సహచరుడూ అయిన కీర్తిశేషుడు షార్లెమ్మెర్ తోనూ, ఎంగెల్సుతోనూ కలిసి, 1888లో నా భార్యా, నేనూ చేసిన ప్రయాణంయొక్క

---

* క్రవ్‌చీన్‌స్కియ్, సెర్గేయ్ మిహాయ్‌లొవిచ్ (కలంపేరు స్తెప్‌న్యాక్) (1851–1895) – రష్యన్ రచయిత, 70లలో విప్లవకర ఉద్యమం ప్రముఖులలో ఒకడు. – సం.

** జసూలిచ్, వేరా ఇవానొవ్నా (1851–1919) – మొదట నరోద్నిక్‌ల ఉద్య మంలో, తరువాత సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో ప్రముఖులలో ఒకతె. – సం.

అత్యంత మనోజ్ఞమైన స్మృతులలో భాగంగా వున్నాయి సోర్గెతో మా కలయికా, సాహచర్యమూ.

యింగ్లీషువాళ్లలో, అందరికంటె ప్రీతిపాత్రమైన ఆగంతుకుడు విలియం థోర్న్. అంత తరుచుగా రాలేకపోయిన జాన్ బర్న్స్‌ను గురించి కూడా ఆయనకు గొప్ప అభిప్రాయం వుండింది.

నాకూ, బర్న్స్‌కూ యువ మిత్రుడైన విలియం సాండర్స్ ఎంగెల్సు యింటిలో అంగీకృత అతిథిగా వుండే గౌరవం పొందినాడు; ఆ గౌరవాన్ని అతను యావజ్జీవితం జ్ఞాపకం పెట్టుకుంటాడని నాకు నమ్మకం వుంది. బెల్‌ఫోర్ట్ బాక్స్ కూడా, యింగ్లండులో వుండినప్పుడు, ఎంగెల్సు యింటికి అప్పుడప్పుడు వచ్చేవాడు, అతను స్త్రీ సమస్య అనే తన వైరితో చాలాసార్లు ఎంగెల్సుతో మైత్రీపూర్వకంగా ఘర్షణ పడినాడు. హంటర్ వాట్స్ ఒకటి రెండు సార్లు వచ్చినాడు. యిటీవల నాకు "జస్టిస్" ("న్యాయం") అనే పత్రిక సంపాదకుడైన హెచ్. క్వేల్చ్‌ను తీసుకపోయి, "జనరల్"కు పరిచయం చేసే మహాహ్లాదం కలిగింది; అతను ఎంగెల్సుమీద మంచి ప్రభావం కలిగించినాడు. నాకు జ్ఞాపక మున్నంతవరకు, విలియం మొరిస్ ఒకసారి వచ్చినాడు. అతని మధ్యయుగతత్వాన్ని ఎంగెల్సు సౌజన్యపూరిత సహనంతో చూసినాడు. నాకు తెలిసినంతవరకు, హెన్రీ చాంపియన్, కేర్ హార్డీ ఆయన్ను ఒకసారి మాత్రమే చూసినారు.

యింగ్లీషువాళ్లలో, పాత చార్టిస్టు జార్జి జూలియన్ హార్నీని మరిచిపోగూడదు; అతనికి శ్లేషించే అలవాటు బలంగా వుండినప్పటికీ, అతను ఎంగెల్సుకు అత్యంత పాత సన్నిహిత మిత్రుల్లో ఒకడు....

మార్క్స్ కూతుర్లూ, వాళ్ల భర్తలైన పాల్ లాఫార్గ్, యీ వ్యాస రచయితా, "కమ్యూనిస్టు ప్రణాళిక" రచయిత లిద్దరికీ చాలా పాత, పరీక్షల కాగిన, విశ్వాసపూరిత మిత్రుడు శామ్యూల్ మూర్, కార్ల్ షార్లెమ్మెర్ — యిలాంటి వాళ్లను గురించి, సహజంగా, వివరంగా చెప్పవలసిన అవసరం లేదు.

యింగ్లండుకు స్వల్పకాలిక ప్రయాణంమీద వచ్చి, ఎంగెల్సును చూడడానికి పోయిన ఆషామాషీ సోషలిస్టు లందరిని గురించీ — నేను వాళ్ల నలా అనవచ్చు నంటే — చెప్పడానికి కాలమూ, స్థలమూ చాలవు. ఆయన ఆతిథ్య మిచ్చింది స్త్రీ పురుషులలో మరీ ముఖ్యమైన వాళ్లకు మాత్రమే కాదనే విషయం జ్ఞాపకం పెట్టుకోవాలి; సైన్యంలోని ప్రతి సైనికునికీ "జనరల్" యింటివద్ద స్వాగతం లభించేది.

అదే సమయంలో, ఆయన అతిథి సత్కారం గానీ, స్నేహితం గానీ యేవిధంగానూ సార్వత్రికమైనదని మనం అనుకోకూడదు. తనకు అపనమ్మక మున్నవాళ్ల కెవరికీ ఆయన స్వాగతం యివ్వడు, యివ్వలేదు. కనీసం ఒక సారైనా, ఒక విదేశీయ ప్రతినిధి వర్గంతో కలిసి యెవరో వచ్చినప్పుడు, అతన్ని తక్షణం బయటికి పంపించే విషయంలో ఎంగెల్సు యేమీ వెనకాడలేదని నాకు జ్ఞాపక ముంది....

## 3

ఎంగెల్సు మహా పరోపకారశీలి. యీ విషయంలో నాతో ఏకీభవించనివాడు పైన నేను చెప్పినవాళ్లలో యెవరూ లేరనుకుంటాను. ఆయన సన్నిధే ఉత్తేజకరం. అచంచలమైన ఆయన ధైర్యమూ, ఆయన ఆశావాదమూ కూడా అంతే. ఆయనకంటె చిన్నవాళ్లు కొందరు నిస్పృహపడి లొంగిపోవా లనుకున్నప్పుడు, యీ అజేయమైన వీరుడు యెన్నడూ ధైర్యం కోల్పోలేదు, పదేపదే ఆయన దుర్బలులకు ధైర్యం యిచ్చినప్పటికీ. యిటీవలి సంవత్సరాలలో ప్రతి ఆదివారమూ, చాలా తరుచుగా వారానికి కొన్నిసార్లు కూడా, ఆయన్ను చూసిన మాకు ఆయన మృతివల్ల కలిగిన నష్టం బొత్తిగా పూరించరానిదని నేను చెప్పవచ్చు.

అన్ని కష్టాల్లోనూ, అవి యెలాంటివైనా, సలహా అడగవలసిన మనిషి ఆయన, అనుసరించవలసిన సలహా ఆయనది. ఆయన సర్వతోముఖమైన జ్ఞానం యెప్పుడూ మిత్రుల సేవకు సిద్ధంగా వుండేది. తన సొంత ప్రత్యేక విషయం వున్న ప్రతివాడూ ఆ విషయంలో తనకంటె ఎంగెల్సుకు యెక్కువ తెలుసునని కనుగొనేవాడు. ఆవిధంగా, ప్రకృతిశాస్త్రంలో, అందులో యే శాఖ గురించి, ఆ శాఖలో యే భాగం గురించి ఆయన్ను అడిగినా సరే, యేదో ఒక కొత్త భావం, ముందుకు పోవడానికి యేదో కొంత సహాయం ఆయన యెప్పుడూ యివ్వగలిగేవాడు.

ఆయన మిత్రు లందరికీ ఒకే ఒక సమాన విషయంగా వుండిన రాజకీయాలలో, అందరూ ఆయన దగ్గరికి మార్గదర్శకత్వం కొరకు వెళ్లేవాళ్లు. ఆయనకు ప్రతి దేశంలోని ఆర్థిక, చారిత్రక, రాజకీయ గతియొక్క సాధారణ సూత్రాలే కాక, దాని అత్యంత సూక్ష్మ వివరాలు కూడా తెలుసు.

ఉదాహరణకు ఇంగ్లండులోని ఉద్యమం గురించి ఆయనకు వుండిన జ్ఞానం అసాధారణమైనంత గంభీరమూ, నిశితమూ. ఆయన చట్టబద్ధ ఎనిమిది గంటల ప్రదర్శన కమిటీ యొక్క అంతర్జాతీయ వేదికమీద, 1890లో జరిగిన మొదటి ప్రదర్శననుండి, 1895లో అనారోగ్య కారణంగా ఆయన రాలేకపోయినంతవరకు, ప్రతి ప్రదర్శనలోనూ వుండినాడనే విషయం యింగ్లీషువాళ్లు జ్ఞాపకం పెట్టుకోవలసిన విషయం.

చివరివరకు ఆయన సమకాలిక రాజకీయాలలో తన ఆసక్తినీ, అధ్యయనాన్నీ కొనసాగించినాడు. చైనా జపానుల మధ్య జరిగిన యుద్ధంమీద* ఆయన చేసిన నిశిత విమర్శలు, గత కొద్ది సంవత్సరాల ఘటనలమీద ఆయన చేయగా మేము విన్న అనేక విమర్శ లన్నింటిలాగే, దూరదర్శకమైనది. యీ విమర్శలు వాటి గాంభీర్యంచేతా, ప్రతిదానినీ, ప్రతిదాని సంబంధాన్నీ

* 1894–1895లో. – సం.

ఆశ్చర్యకరమైనంతగా గ్రహించడంచేతా యితరులకు కేవలం నివ్వెరపాటు కలిగించేవిగా వుండినాయి; యివి రాజకీయ ఘటనలమీద జాగ్రత్తగా చేసిన జోస్యం రూపం ధరించినప్పుడు అసాధారణమైనంత కచ్చితంగా వుండినాయి.

ఆయన జరిపిన చిట్టచివరి రాజకీయ సంభాషణ నా భార్యతో జరిపినది; ఆమె జూలై 28న నాటింగామ్‌నుండి తిరిగివచ్చి (ఆయన మరణించింది ఆగస్టు 5న), అక్కడి ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ఉద్యమం గురించి ఆయనతో చెప్పినప్పుడు ఆ సంభాషణ జరిగింది. అప్పటికి ఆయన మాట్లాడే స్థితికి చాలా దూరంలో వుండినాడు, కానీ పలకా, బలపం సహాయంతో సూటి అయిన, లోతైన ప్రశ్నలు అడుగుతూ, ఆ విషయంమీద చురుకైన, అత్యంత ఆసక్తిపూర్ణమైన సంభాషణ నడిపినాడు.

ఎంగెల్సు తీవ్ర ద్వేషి, నిజానికి తీవ్ర ప్రేమికు డెవరైనా వుండక తప్పనట్లు. అప్పుడప్పుడు, తప్పు జరిగినట్లు ఆయనకు అనిపించినప్పుడు, ఆయన ఆగ్రహోదగ్రుడయ్యేవాడు, కానీ సాధారణంగా ఆయన "కోపగించుకొని మంచి పని చేసేవాడు."

చిత్రం అనిపించవచ్చు గానీ, కొన్ని విషయాల్లో ఆయన యథాస్థితివాది. ఆయన అలవాట్ల మనిషి. కొన్ని పనులు ప్రతిరోజూ అదే సమయంలో, అదే పద్ధతిలో చేయడం ఆయనకు యిష్టం.

కానీ ఆయన విశ్వసనీయతనూ, నిజాయితీనీ, నిష్కర్ష అయిన వ్యాపారపు అలవాట్లనూ, కచ్చితత్వాన్నీ వర్ణించడానికి మాటలు చాలవు; వాటిని ఆయన, అత్యుత్తమమైన అర్థంలో, తన రాజకీయ, సాంఘిక సంబంధాలలోకి తీసుకపోయినట్లు కనిపిస్తుంది. మొన్నమొన్న వేరా జసూలిచ్ అన్నట్లు, "జనరల్" యేమనుకుంటాడో అనే మా ఆలోచన ద్వారా, చెడ్డ పని చేయకుండా, చెడ్డ మాట అనకుండా మమ్మల్ని ఆయన నివారించేవాడు.

ఆయన మేధకంటె స్పష్టమైన, ఉజ్వలమైన మేధను ఊహించడం కష్టం. ఆయన యే విషయాన్ని స్పృశించినా, దానిమీద ఒక కాంతిపుంజం ప్రసరింపజేసేవాడు. నీకు అంతకుముందు కనిపించనిది కనిపించేది, అంతకుముందు కనిపించినది మరింత కచ్చితంగా కని పించేది. "ఆయన దేన్ని స్పృశించినా, దాన్ని సౌందర్యవంతం చేయకుండా వుండడు" అని ఓలివెర్ గోల్డ్‌స్మిత్‌ను* గురించి రాయబడింది. "ఆయన దేన్ని స్పృశించినా, దానిమీద వెలుతురు ప్రసరింప జేయకుండా వుండడు" అని ఎంగెల్సును గురించి ఆయన మిత్రులు రాయవచ్చు. యిక ఆయన శైలి, జర్మన్, ఇంగ్లీషు, ఉభయ భాషల్లోనూ స్పష్టంగా, ఉజ్వలంగా, నిశితంగా వుండేది; యిది జర్మన్ భాషలో మరీ అరుదైనది.

---

* గోల్డ్‌స్మిత్, ఓలివెర్ (1728–1774) – ఇంగ్లీషు రచయిత, ఇంగ్లండులో బూర్జువా జ్ఞాన వికాసానికి ప్రతినిధి. – సం.

# 4

యీ అసాధారణ గుణాలన్నిటికీ తోడు, ఆయనకు హాస్యదృష్టి అనే అరుదైన, లాభ కరమైన గుణం వుండింది. ఆయన ప్రతి భాషలోనూ హాస్యోక్తిని ఆనందించేవాడు. సహ చరులలో కెల్ల అత్యంత ఉల్లాసమైనవాడు ఆయన.

ఆ అమర ఆదివారాల్లో సంభాషణలో అత్యధిక భాగం విధిగా రాజకీయ విషయాలమీదా, పార్టీ విషయాలమీదా నడిచేది. మే మందరమూ యేదైనా నేర్చుకోడానికి అక్కడికి పోయి వుంటాము. కానీ సంభాషణలో చాలా భాగం అతి తేలికగా వుండేది; హాస్యం గాఢంగా, విచ్చలవిడిగా వుండేది.

మేము అక్కడ కొద్దిమందిమే వుండినప్పుడు, అరపెన్నీకి డజను బిల్లల వంతున "పెద్ద" ఖరీదు గల బిల్లలతో పేకాట ఆడడం ఆయనకు యిష్టం. దేశాల భవితవ్యం దానిమీద ఆధారపడినట్లు యెంతో శ్రద్ధగా ఆయన ఆ ఆట ఆడేవాడు.

మా గొప్ప రాత్రులు జర్మన్ యెన్నికలు జరిగినప్పుడు. అప్పుడు ఎంగెల్సు పెద్ద జాడీలో ప్రత్యేక జర్మన్ బీరూ, ప్రత్యేక భోజనమూ యేర్పాటు చేసి, తనకు చాలా సన్నిహితులైన వాళ్లను ఆహ్వానించినాడు. అప్పుడు జర్మనీలోని అన్ని ప్రాంతాలనుండీ రాత్రి పొద్దు పోయిందాకా టెలిగ్రాములు వస్తూ వుండగా, ప్రతి టెలిగ్రామునూ చింపి, అందులోని విషయాలు "జనరల్" బిగ్గరగా చదివినాడు; అది విజయమైతే మేము తాగినాము, అపజయమైతే కూడా తాగినాము.

నేను యింతకు ముందు చెప్పినట్లు, 1888లో మేము ఆయనతోనూ, షార్లెమ్మెర్‌తోనూ కలిసి అమెరికాకూ, కెనడాకూ ప్రయాణం చేసినాము. ఎంగెల్సు మా బృందంలో అందరి కంటె చిన్నవాడుగా ప్రవర్తించినాడు. ఓడలో, సీటు చుట్టూ తిరిగిపోకుండా, దాన్ని యెగిరి దాటడం ఆయనకు యిష్టం. మామూలు ప్రయాణికుల్లాగా ఆయన ఒక్కసారి కూడా ఓర్పు కోల్పోలేదు — ఉదయ భోజనం ముందు ఆయన అరవై యెనిమిది దోమకాట్లు యెంచు కున్నప్పుడూ, మా సామాను న్యూయార్కులోనూ, మేము బోస్టన్‌లోనూ వుండినప్పుడూ తప్ప.

ఈస్ట్‌బోర్న్‌లో ఆయన చివరి జబ్బులో, అంత బాధా, బలహీనతా వుండినప్పటికీ, పాత సహృదయతా, ఉల్లాసమూ మెరుపుల్లాగ వచ్చేవి; ప్రతి వొకరిపట్లా ఆయనకుండే దయా, శ్రద్ధా చిట్టచివరివరకు ఒక క్షణంసేపు కూడా ఆగిపోలేదు. ఆ దయను గురించీ, ఔదార్యం గురించీ చెప్పవలసిన స్థలం యిది కాదు. ఆయన మిత్రులలో ప్రతి వొకడూ ఆ అసమాన ఔదార్యం గురించీ, దయను గురించీ మౌనంగా ఆలోచించగలడు, తద్వారా అతనికి మెదడుకు మేత దండిగా వుంటుంది.

ఎంగెల్సు నాస్తికుడు. అనగా, ఆయనకు బొత్తిగా దేవుడు లేడు, కనుక ఆయనకు యీ లోకంలో ఆశ వుంది.

ఆయన జీవితం మనోహరమైనది, దాన్ని ఆయన ప్రేమించినాడు.... తన జ్ఞానంతోనూ, సక్రమంగా నిర్వహించిన మంచి పనితోనూ, ఉద్యమ భవిష్యత్తును గురించి తన కున్న మనో నిశ్చయంతోనూ, అసంఖ్యాకమైన మిత్రులతోనూ — అందులో, సహజంగానే, మార్క్సు మొదటివాడూ, చివరివాడూ, అందరికీ అర్థమూ, తాత్పర్యమూ అయినవాడూ — జీవించ డంలో తన కుండిన గాఢమైన ఆనందంతోనూ ఎంగెల్సు మానవులలో అత్యధిక భాగంకంటె యెక్కువగా, న్యాయంగానే, జీవితాన్ని ప్రేమించి, జీవితానికి అంటగరుచుకున్నాడు. అంటే, ఆయన మరణానికి క్షణమాత్రమైనా, కించిత్తైనా భయపడినాడని కాదు.

మార్క్సు, ఎంగెల్సుల ప్రపంచం కొరకు కృషి ప్రధానంగా యీ చిన్న దేశంలో చేయ బడిందనేదీ, వాళ్లిద్దరూ యిక్కడ మరణించినారనేదీ యింగ్లీషువాళ్లు జ్ఞాపకం పెట్టుకో దగినవి. ప్రపంచంలోని సకల రాజుల, విజేతల గోరీలూ, సమాధులూ యిచ్చే గౌరవం కంటె అది యెక్కువ గౌరవం. రాబోయే కాలంలో, జనం అన్నిటికంటె యెక్కువగా చూసే మృతుల స్థలాలు హైగేట్‌లోని సమాధీ, వోకింగ్‌లోని పైన్‌చెట్లమధ్య వున్న నిరాడంబరమైన చిన్న యిల్లూ.*

---

* ఎంగెల్సు శవం దహనం చేయబడిన చోటు. — సం.

# ఎఫ్.యమ్. క్రవ్‌చీన్‌స్కయా

## స్మృతులు

ప్లెహానొవ్‌కు సెర్గేయ్ మిహాయ్‌లొవిచ్* తెలుసు. ప్లెహానొవ్ ఆయనతో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతూ వుండినాడు. సెర్గేయ్ మిహాయ్‌లొవిచ్‌కి ఒకసారి అతనివద్దనుండి ఒక ఉత్తరం వచ్చింది. అందులో, యితర విశేషాలతోపాటు అతను యిలా రాసినాడు: "మీరు లండన్‌లో వుంటున్నారు. అక్కడేమి చేస్తున్నారు? అక్కడ ఎంగెల్సు వున్నాడని మీకు తెలుసునా? అలాంటివాళ్లు పుట్టేది తరుచుగా కాదు. అందుకనే, మీరు ఆయన పరిచయం చేసుకొని, ఆ విషయం గురించి నాకు తెలపాలని పట్టుబట్టుతున్నాను. యింతవరకు మీరు ఆయన్ను చూడడానికి పోకపోవడం దారుణమైన విషయం. మీరు తప్పక పోయితీరాలి."

ఎంగెల్సు పెద్ద యింటిలో వుండేవాడు; ఆయన్ను చూడదలచుకున్నవాళ్లు ఆదివారాలలో ఆ యింటికి పోవచ్చు. సోషలిస్టులతోనూ, విమర్శకులతోనూ, రచయితలతోనూ పరివేష్టింపబడిన ఆయనను ఆయన యింటిలోని పెద్ద హాలులో మనం చూడవచ్చు. ఎంగెల్సును చూడా లనుకున్నవాళ్లు యెవరైనా అలా వెళ్లవచ్చు.

ఒక ఆదివారంనాడు నా భర్తా, నేనూ మార్క్సు కూతురు ఎలినోరతో కలిసి, ఎంగెల్సు యింటికి పోయినాము.

సమ్మోహనకరమైన ఆ ముసలాయన నామీద అత్యంత అనుకూలమైన ప్రభావం కలిగించినాడు. నాకు చాలా బిడియంగా వుండింది; నాకు యిబ్బంది కలిగేటట్లుగా ఆయన తనకు చాలా దగ్గరగా నాకు ఆసనం యిచ్చినాడు. నేను మార్క్సు కూతురుకు దగ్గరగా జరుగుతూ, ఎంగెల్సుతో మాట్లాడడం పరిహరించినాను. కానీ ఆయన, తన సహజ సౌజన్యానికి తగినట్లుగా, సహజంగా నాకు తిండి పెట్టసాగినాడు. నేను యే విదేశ భాషలూ మాట్లాడలేను; అందువలన నా కుండినదల్లా ఒకే కోరిక — నన్ను ఒంటరిగా వదిలేయడం. ఎంగెల్సు ఫ్రెంచి, జర్మన్,

---

* ఎఫ్. యమ్. క్రవ్‌చీన్‌స్కియ్ (స్టెప్‌న్యాక్) — యీ వ్యాసరచయిత భర్త. — సం.

యింగ్లీషు భాషలు మాట్లాడేవాడు. సంభాషణ సాధ్యమైన అన్ని విషయాలమీదా, ప్రధానంగా రాజకీయ విషయాలమీద, వుండింది. వాదాలు వుండినాయి.

ఆయన గృహనిర్వాహకురాలు మామూలు మేరకు టేబుల్ అవతలి కొనన కూర్చుంది. ఆమె చూస్తూ వుండిందల్లా యేమిటంటే, కొత్తగా వచ్చిన ప్రతి వొకరికీ బాగా "ఉదారంగా" మాంసమూ, శాలడ్ వడ్డించడమూ, గ్లాసులనిండా వైన్ వుండేటట్లు చేయడమూ.

అతిథుల మధ్య ఆవేశపూరితమైన వాదోపవాదాలు జరిగినాయి; వాళ్ళు ఉద్రేకపడుతూ, అరుస్తూ, ఆ ప్రశ్నకు జవాబు చెప్పమని ఎంగెల్సును అడుగుతూ వుండినారు.

హఠాత్తుగా ఎంగెల్సు నావైపు తిరిగి, నాకు యే విదేశ భాషలూ రావన్న విషయం గుర్తుంచుకొని, రష్యన్ భాష మాట్లాడినాడు. ఆయన పుష్కిన్‌నుండి కొన్ని పద్యాలు అద్భుతమైన రష్యన్‌లో వల్లించినాడు. నేను చప్పట్లు కొట్టినాను, కానీ ఎంగెల్సు యిలా అన్నాడు: "నా రష్యన్ భాషాజ్ఞానం అంతవరకే!"

ఆయన నామీద కలిగించిన ప్రభావ ముద్ర మాసిపోనిది, ఆయన అంత ఆదరంగా, అరమరికలు లేకుండా వుండినాడు. కొద్ది రోజుల తర్వాత ఆయన మా యింటికి వచ్చినాడు. ఆయన చాలాసేపు వుండలేదు; స్పష్టంగా, ఆయన మా పరిచయం చేసుకోవాలని మాత్రమే అనుకున్నాడు. పెద్ద బృందంలో ఆయన్ను నేను మళ్ళీ యెప్పుడూ చూడలేదు. ఆయనా, నా భర్తా ఒకరి నొకరు చూసేవాళ్ళు, వివిధ రాజకీయ విషయాలను గురించి మాట్లాడుకోడానికి కలిసేవాళ్ళు, అప్పుడప్పుడు వాళ్ళమధ్య వాదోపవాదాలూ, అపార్థాలూ వుండినాయి.

* * *

ఎంగెల్సుపట్ల నా వైఖరి బహుశా మమతాపూర్వకమైనది; నా మిత్రురాలైన వేరా జసూలిచ్ వైఖరి కూడా అంతే. ఆమే, నేనూ అప్పుడప్పుడు కలుసుకొనేవాళ్ళం; ఎంగెల్సును గురించి మాట్లాడుకున్నప్పుడు మేము కన్నీళ్ల పర్యంత మయ్యేవాళ్ళం: ఎంగెల్సు అప్పుడు చాలా జబ్బుగా వుండినాడు.

ఒకసారి కౌట్‌స్కీ భార్య వచ్చి, తాను యెక్కడికో పోవలసివచ్చిందని చెప్పి, కొద్ది గంటల సేపు ఎంగెల్సువద్దకు నన్ను పొమ్మని కోరింది. నేను ఎంగెల్సువద్ద సుమారు మూడు గంటలు గడిపినాను. ఆయన్ను చూడడమే నాకు బాధగా వుండింది. ఆయన నన్ను గుర్తుపట్టినప్పుడు సంతోషించినాను. మార్క్సు యెప్పుడైనా కూర్చొని వుండిన కుర్చీ లన్నీ ఆయన నాకు చూపించినాడు. మార్క్సు రాసిన ఉత్తరాలూ, మార్క్సు ఫోటోలూ, మార్క్సువి కొన్ని వ్యంగ్య చిత్రాలూ కూడా ఎంగెల్సు నాకు చూపించినాడు. యిదంతా ఆయన అత్యంత ఆప్యాయతతో చేసినాడు. మరి నేను ఆయనవైపు చూస్తూ, బాధపడుతూ వుండినాను; యెందుకంటే, నేను ఆయన్ను మొదట కలుసుకున్నప్పుడు ఆయన అంత దృఢంగా, అంత

ఉల్లాసంగా వుండినాడు, యిప్పుడు జబ్బుగా, అసహాయుడుగా వుండినాడు. ఆయన వ్యాధి ప్రమాదకరమైనది — గొంతు కాన్సర్.

అయినప్పటికీ, ఎంగెల్సు చిట్టచివరివరకు అన్ని ఘటనలలోనూ తన ఆసక్తిని నిలుపుకొని, దండిగా రాస్తూ వుండినాడు. వేరా జసూలిచ్ తరుచు ఆయన్ను చూడడానికి వెళ్లి, తనకు కలిగిన మానసిక ముద్రలు నాకు చెప్పేది. ఆయన్ను ప్రేమించినవాళ్లందరూ తరుచు ఆయన్ను చూడడానికి వెళ్లి, గంటలకొద్ది ఆయనతో గడిపేవాళ్లు. కానీ ఆయన కాలం తీరిందని అందరికీ తెలుసు....

## పాఠకులకు మనవి

ఈ పుస్తకం గురించీ, దాని అనువాదం గురించీ మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి దయచేసి తెలుపండి.

మీ అభిప్రాయాలను ఈ కింది చిరునామాకు పంపండి:


Progress Publishers

17, Zubovsky Boulevard

Moscow, USSR

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్
విజయవాడ – 520004

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ – 520002

విశాలాంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజారు
హైదరాబాదు – 500001

విశాలాంధ్ర బుక్ హౌస్
రైల్వే ఫీడర్స్ రోడ్డు
అనంతపురం – 515001

విశాలాంధ్ర బుక్ హౌస్
బజారు వీధి
తిరుపతి – 517501

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
మెయిన్ రోడ్డు
విశాఖపట్నం – 530002

విశాలాంధ్ర బుక్ హౌస్
జె.పి.యన్. రోడ్డు
మండీ బజారు
వరంగల్ – 506002

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు, అరండల్ పేట
గుంటూరు – 522002